కృష్ణవేణి పుష్కర దర్శనమ్



'దర్శనమ్' ఆధ్యాత్మిక వార్తా మాసపత్రిక విశిష్ట ప్రచురణ



శ్రీ పుష్కర కృష్ణానదీ స్తోత్రమ్

శ్రీ కృష్ణానదీ మాతృ స్తోత్రమ్



- దోర్బల ప్రభాకరశర్మా

ప్రజాక్షేమాయోగే సకలహిత సద్ధర్మనిరతే ప్రకృత్యచ్ఛక్షీరే ప్రతిఘటిత పూర్వాఘవితతే।
హృతాన్తర్దుర్ధ్వాన్తే పరశుగపహన్త్ర్యాత్మసుఖదే సుధాధారే కృష్ణే జయజనని భద్రాక్షయరసే ॥ 1

అమ్మా! ప్రజల క్షేమముకై ఒక పథకము కలదానా! అందఱికి మేలు కలిగించే మంచి ధర్మక్రియల యందు ఆసక్తి కలిగి ప్రేరేపించుదానా! స్వభావసిద్ధముగా స్వచ్ఛమైన (పాలవంటి) నీరు ప్రవాహము కలదానా మా పూర్వపాపముల సమూహమును ముందే అడ్డుకొని రాకుండా చేసినదానా మాలోపలి అజ్ఞానము అను చెడు చీకటి తొలగించినదానా ఇతరుల (అందఱి) కష్టాల దుఃఖాలను (విశేషముగా ఆత్మీయులు మరణించినపుడుకూడా) తొలగించి, పూర్తిగా ఓదార్పు కలిగించుదానా! అందఱి శరీర వాగ్బుద్ధీంద్రియ మనస్సులకు శాంతి సుఖముల నిచ్చుదానా అమృతము వంటి ప్రవాహధార కలదానా, మంగళకరమైన క్షీణించని ఆనంద(కర) జలరసము గలదానా! తల్లీ! కృష్ణవేణీ మాతా నదీమతల్లీ! నీవు సర్వోత్కర్షముగా ప్రకాశించుము.

మహారాష్ట్రేజాతే బలహరజటాజూటగలితే ముహుఃకర్ణాటేషు స్మృతిపథగదత్తానుగతికే।
త్రివిఙ్గాణే చాన్ధ్రే శిశుకశివమల్లీశ కలితే సుధాధారే కృష్ణే జయజనని భద్రాక్షయరసే ॥ 2

అమ్మా! మహారాష్ట్రమున మహాబలేశ్వర శివుని జటాజూటమునుండి జాలువారి పుట్టినావు.కర్ణాటరాజ్యమునందు ముమ్మాటికి స్మరణమాత్రమున స్మృతిపథమునకు వచ్చి రక్షించు శ్రీదత్తాత్రేయ స్వామి అడుగుల వెంబడి సాగుతావు. మూడు లింగముల తెలుగు కాలవాలమైన తెలంగాణ, ఆంధ్రరాజ్యములయందు బాలబ్రహ్మేశ్వర మల్లికార్జున స్వామి వారలతో విహరింతువు. అమృతప్రవాహము కలిగి మంగళకర క్షీణించని ఆనందరసము కలిగిన ఓ తల్లీ! కృష్ణానదీ! సర్వోత్కర్షముగా ప్రకాశించుము నీకు జయము.

చకోరీ (చికోరీ(డీ) వీరేశప్రియకరసుసంరమ్భసునదే సవాడీ(రీ) గోపాల ప్రభుమధురవేణుస్వనభరే
సుగూఢానన్దే స్గమవధు ధవత్కూడల శివే సుధాధారే కృష్ణే జయజనని భద్రాక్షయరసే ॥ 3

చకోరీ పట్టణమున (చికోడీ చికోరీ పట్టణమున) గల వీరభద్రస్వామికి ప్రియమైన సంబరము – నాదము కలదానా! సవాడి (సవారి) పురమున గోపాలకృష్ణుని మధురవేణుగాన ధ్వనిని చెవులారా వినుదానా ఏకాంతమున కూడల సంగమేశ్వరుని సంగమవధువై ఏకాంతానందము నొందుదానా అమృతప్రవాహ మంగళమయమైన రసమునకు (నీటికి) క్షీణించని నిధానమా తల్లీ! కృష్ణవేణమ్మా! నీవు సర్వోత్కర్షముగా జయింపుము ప్రకాశించుము.

అవాక్కాశీశేన ప్రణవగణపా ఔదుమ్బరపదా బుధా సఙ్గేశేన ధవల హరిణా శ్రీనృహరిణా।
లసన్మల్లీవేనామరగురువరేశేన చ వృతే సుధాధారే కృష్ణే జయజనని భద్రాక్షయరసే ॥ 4

వాయి క్షేత్రమున దక్షిణ కాశీ విశ్వేశ్వరునిచేతను, ఓంకార గణపతిచేతను, ఔదుంబర క్షేత్రమున (మేడిచెట్టు ఇష్టముగాగల చోట) నరసోబావాడీ యందునిలిచియున్న శ్రీదత్తాత్రేయుని చేతను అమరావతీ క్షేత్రమున గౌతమబుద్ధుని చేతను, కూడల క్షేత్రమున శ్రీసంగమేశ్వరుని చేతను, మద్దిమడుగు క్షేత్రమున ఆంజనేయస్వామి చేతను, వేదాద్రిలో (జగ్గయ్యపేట వద్ద) మట్టపల్లిలో వాడపల్లిలో ఈ మూడు క్షేత్రాలలో ప్రసిద్ధుడైన శ్రీలక్ష్మీనరసింహస్వామి చేతను మంగళగిరి పానక నరసింహస్వామి చేతను, శ్రీశైల క్షేత్రమున శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామి చేతను, విజయవాడ క్షేత్రమున శ్రీ కనకదుర్గామల్లీశ్వర స్వామి (మల్లేశ్వర స్వామి) చేతను, మరల అమరావతీ క్షేత్రముననే దేవతలందఱికి తండ్రి, జ్ఞానప్రదగురువును ఐన అమరేశ్వర స్వామి (పంచారామ ఓఏత్రములలోని ఒక ఆరామమైన అమరారామమునగల అమరారామేశ్వర స్వామి) చేతను చుట్టు చేరబడిన దానా తల్లీ సుధాప్రవాహా! సర్వమంగళ అక్షయానంద బ్రహ్మానందము నందించు ఓ కృష్ణమ్మా! కృష్ణవేణమ్మా నీవు పుష్కరునితో బాగా ప్రకాశించుము.

ప్రభాలిఙ్గస్నేహే మలఘటభరేన్ధ్యాభినుతే సుత్తుఙ్గే భద్రాఙ్గే॒ భృదపవన భీమా-మృతపదే (సరే)।
భ్రమర్యానన్దశ్రీ: శివకనకదుర్గాచ్చితతనో!సుధాధారే కృష్ణే జయజనని భద్రాక్షయరసే ॥ 5

అమ్మా! ప్రభా (కాంతి) జ్యోతిర్లింగస్వామియగు శివునియందెంతో స్నేహము విడదీయరాని అనుబంధము కలదానా మలపాత్రలను (శరీరముల మలముతో నిండిన పాత్రలను (మరణించినవారి ఎములక పాత్రలను) భరించి వారిని శుద్ధుల చేయుదానా! అటువంటి ఇంద్రాణి (ఇంద్రాయణీ) నదితో కలిసిన దానవై ఆ నదిచే స్తుతింపబడినదానా! మలప్రభా ఘటప్రభా నదులతో స్నేహబంధము నొందిన దానా! భాగ్యనగరమున మలప్రవాహనదిగా ప్రసిద్ధి చెందిన ముచుకుందా (మూసీ) నదితోను స్నేహానుబంధ మొందినదానా!, కొండలనుండి వస్తూ చాలా ఎత్తైనదానా మంగళములైన మంగళప్రదములైన తరంగములు నురగలు అలలు నీరు బుడగలు మొదలైనవే చేతులు కాళ్ళు కన్ను, ముక్కు మొదలైన అవయవములుగా కలదానా! తుంగాభద్రా నదులతో తుంగభద్రానదితో కలిసిన దానా! అన్నివైపులా నీళ్ళున్న గాలి ఉన్న భీమానదీదేవి యొక్క అమృతమయమైన పాదములతో కలిసి (తరంగములతో కలిసి) అమృతతరంగ పాదములతో అడుగులిడుదానా! పావనా (పావనీ) నదితో పవన నదితో నీళ్ళు పోసికొనిన దానా! శాంతముగా ఒకసారి భయంకరముగా ఒకసారి ప్రవాహామృతముతో లాస్యతాండవములు చేయుదానా! భ్రమరీమాతకు (శక్తిపీఠములలో ఒక శక్తికి) శ్రీశైలంలో భ్రమరాంబికకు శోభను, సంపదను, వైభవమును అందమును కలిగించు లక్ష్మివైన దానా! మంగళకరమైన కనకదుర్గాదేవితో శక్తి స్వరూపమైన కాలికాదేవితో తన సంకల్పముతో తన నుండి పైకి వచ్చి ప్రకాశించుకాలికా స్వరూపదుర్గతో కూడినదానవై అత్యంతము ప్రకాశింపజేయబడు పూజింపబడు సంస్కృతశబ్దమయ శరీరము కలిగి సరస్వతీ స్వరూపమైన దానా భ్రమరాంబికా లక్ష్మితో కనకదుర్గా కాళితో కూడిన మహాసరస్వతీ (శుంభనిశుంభ రూపాహంకార మమకార హంత్రివైన అజ్ఞానవారిణియైన) జ్ఞానస్వరూప ప్రవాహమైనదానా! సుధాధారా! అక్షయజ్ఞానానంద రసవతీ ఓ కృష్ణవేణమ్మా! తల్లీ! పుష్కరమహానదీ నీకు జయమగుగాక!

నృసింహశ్రీదత్తప్రభుసునరసోబాగురుపదే శుభే శ్రీపాదాంఙ్ఘ్రిప్రియ గురుపుర శ్రీ విలసితే।
సు హంసద్వీప శ్రీగురుజలధి (రసధి) సఙ్గాశ్రిత వపుఃస్(స్) సుధాధారే కృష్ణే జయజనని వేణ్యక్షయరసే!॥6

నరసోబావాడిలో శ్రీనరసింహ సరస్వతీరూప శ్రీదత్తాత్రేయస్వామి సద్గురు పాదుకాక్షేత్రమున పెద్ద అడుగు వేసి నిలిచినదానా! మరల శ్రీదత్తావతారమైన శ్రీపీఠపురమున (కాకినాడవద్ద) ఆవిర్భవించిన శ్రీపాద శ్రీవల్లభులకు వారి శ్రీపాదములకు వారధి పాదుకలకును చాల ఇష్టమైన గురుపురము కురవపురము పంచగంగా క్షేత్రము నందు గురుపాద పాదుకా సేవలనొసరించి ఎంతో భక్తిజ్ఞానవైరాగ్య శోభలతో విలసిల్లినదానా! ఇక చివర హంసలదీవిలో పరమహంసలు యోగులు మునులు ఋషులు సన్యాసులు (హంసల రూపముతో వచ్చి) ఉండు సర్వగురు పరమేశ్వర రూపమహాజలధి (సముద్ర) సంగమము చేసి తన స్వరూపమును తనువును ఆత్మను సర్వస్వమును తరంగ ప్రవాహనదీ రూపమును మహాజలధిలో సద్గురురూప మహారసధి సద్గురు పరమాత్మలో కలుపుకొనిన దానా!అమృతప్రవాహా అక్షయానంద రసస్వరూపా కృష్ణవేణమ్మా! నీవు సర్వోత్కర్షముగా ప్రకాశించుము.

స్వతీరానిర్మేయప్రలసదమరావత్యమరతే స్వవారా స్నానాదిప్రశుచి జననిశ్శ్రేయసరతే।
స్వధారారాజత్పుష్కరవరనరోత్సాహపరతే సుధాధారే కృష్ణే జయజనని వేణ్యక్షయరసే! ॥ 7

తల్లీ! నీ ఒడ్డున ఈ భూమియందు బాగా నిర్మించదగిన ప్రకాశించు దేవతా నగరమైన అమరావతి నగరము కారణముగా అంతటా అమరత్వమును గలిగి దానిని మనుష్యులకు ప్రాణులకు స్థాణువులకు భాషచేత, భావముచేత అనుభవముచేత ప్రసాదించు (ప్రసాదించబోవుచు)న్న దానా! నీ నీటిచేత స్నానము అనుష్ఠానము దేవపితృతర్పణాదుల నొసర్చి శుద్ధాంతఃకరణులైన జనులందఱికి శుభమును కలిగించుటకై ఉవ్విళ్ళూరుదానా! నీ ప్రవాహధారలో (ఈ దుర్ముఖనామ సంవత్సరమున) ప్రకాశించు కలిసిమెలసిపోవు పుష్కరుని (జలసమృద్ధిని – స్వచ్ఛత్వమును జీవత్వమును జీవనమును అవిచ్ఛిన్నధారను పావనత్వమును) పొందిన సుసంస్కార వంతులగు నరులకు భక్తులకు జ్ఞానులకు యోగులకు మహోత్సాహశక్తిని మహాపర్వానందాసక్తిని కలిగించుచు స్వయంగా ఆ ఆసక్తిరూపముగా వెలసి

(మిగతా చివరి కవర్‌పేజీ వెనుకగల పేజీలో చూడగలరు....)

దక్షిణామ్నాయ శ్రీ శృంగేరి శారదాపీఠాధీశ్వరులు

జగద్గురు శంకరాచార్య శ్రీశ్రీశ్రీ భారతీతీర్థ మహాస్వామి,

శ్రీశ్రీశ్రీ విధుశేఖర భారతీ స్వామి వారల

దివ్యాశీస్సులతో...





భారతీ కరుణా పాత్రం భారతీ పదభూషణం ।
భారతీ పదమారూఢం భారతీ తీర్థమాశ్రయే ॥

విద్యావినయ సంపన్నం వీతరాగం వివేకినాం ।
వందే వేదాంత తత్త్వజ్ఞం విధుశేఖర భారతీమ్ ॥

కృష్ణవేణీ పుష్కర దర్శనమ్

'దర్శనమ్' ఆధ్యాత్మిక వార్తా మాసపత్రిక విశిష్ట ప్రచురణ

సందర్భం : **శ్రీదుర్ముఖినామ సంవత్సర 'కృష్ణా పుష్కరాలు"**
(12.08.2016 - 23.08.2016)

ప్రతులు : 5000

వెల : ₹ 100/-

అక్షరాల కూర్పు : **ఆరవేటి వెంకటసుబ్బయ్య**
98492 42028


ముద్రణ : **సాయి తిరుమల ప్రింటింగ్ ప్రెస్**
చిక్కడపల్లి, హైదరాబాద్.

బొమ్మలు : **సునీతావాసు**

ప్రతులు లభించుచోటు

1. **మరుమాముల వెంకటరమణ శర్మ**
ప్రధాన సంపాదకులు:
దర్శనమ్ ఆధ్యాత్మిక వార్తామాసపత్రిక
29-105/1/1, న్యూ విద్యానగర్,
నేరేడ్‌మెట్, సికిందరాబాద్ - 56.
040-27220401, 94410 15469

కృత్యంజలి



అన్నపూర్ణమ్మ మాయమ్మ అన్నపూర్ణ
రాజమౌళియె మా తండ్రి రాజమౌళి
తత్కుమారుడ నగు సుకృతమ్ము వలన
నీ కృతిని వారి కంకిత మిత్తు భక్తి

కృష్ణవేణీ

పుష్కర దర్శనమ్



ప్రధాన సంపాదకులు

మరుమాముల వెంకటరమణ శర్మ

'దర్శనమ్'

ఆధ్యాత్మిక వార్తా మాసపత్రిక విశిష్ట ప్రచురణ

29-105/4/1, శ్రీరామసిద్ధాంతి భవనం, న్యూ విద్యానగర్, నేరేడ్‌మెట్, సికింద్రాబాద్ - 56.

ఫోన్: 040-27220401, 94410 15469

Email: d_darshanam@yahoo.co.in, editordarshanam@gmail.com

విషయ సూచిక

కృష్ణవేణీ స్తుతిః 6

పుష్కర తరంగిణి (సంపాదకీయం) 7

తెలుగింటి విరిబోణి - కృష్ణవేణి...! - శ్రుతి దామోదర్ 8

కృష్ణా పుష్కర వైశిష్ట్యం - శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ చినజీయరు స్వామి 11

పరమపావనం పుష్కరం - తోటపల్లి బాలకృష్ణ శర్మ 16

పవిత్ర కృష్ణవేణీ పుష్కర స్నాన విధి-బ్రహ్మశ్రీ పాలకుర్తి నృసింహరామ సిద్ధాంతి 22

కృష్ణాపుష్కర స్నాన ప్రయోగః - అప్పాల శ్యామ్‌ప్రణీత్ శర్మ 38

కృష్ణవేణీ.... పుష్కర చరితమ్- అప్పాల శ్యామ్‌ప్రణీత్ శర్మ 46

కృష్ణాపుష్కర సమయంలో చేయదగినవి - చేయకూడనివి 57

కృష్ణాష్టకమ్ - డా॥ కడిమెళ్ళ వరప్రసాద్ 58

కృష్ణాతీరంలో గుడిగంటల రవళి - ఐ.ఎల్.ఎన్. చంద్రశేఖర్ 59

పుష్కర నది కృష్ణవేణికి స్వాగత సుమమాల -ముత్యంపేట గౌరీశంకర్ శర్మ 66

కృష్ణ - కృష్ణవేణి - ప్రసాదవర్మ కామబుషి 66

కృష్ణా పుష్కర మహిమ - చిల్లర సీతారామారావు 67

కృష్ణా పుష్కరునికి స్వాగతము - డా॥ జొన్నలగడ్డ ఆంజనేయులు 69

శ్రీశైల మహాక్షేత్రం - డా॥. వి.ఎన్. చక్రవర్తి 72

కృష్ణాతీరపు వరప్రదాయిని నాగార్జునసాగర్ - మరుమాముల రుక్మిణి 77

విజయవాడ శ్రీ కనకదుర్గ క్షేత్రం - డా॥ జయంతి చక్రవర్తి 82

సంస్థానాల ఖిల్లా - పాలమూరు జిల్లా - మరుమాముల వెంకటరమణశర్మ 85

ఉద్యమాల నేపథ్యం... ఘనచరిత సొంతం - డా॥ సాగి కమలాకరశర్మ 97

ఆలంపూరు క్షేత్రోద్ధారకుడు గడియారం రామకృష్ణశాస్త్రి - ఎస్వీ రామారావు 101

కృష్ణాపుష్కర దశకమ్ - డా॥ జి.ఎం. రామశర్మ 104

వట్టికోట ఆళ్వారు స్వామి - మరుమాముల వెంకటరమణశర్మ 105

తెలంగాణ తొలి శాసన, చారిత్రక పరిశోధకులు - బి.ఎన్. శాస్త్రి - డా.బి. మనోహరి 106

పాలమూరు మహామండలంలో శ్రౌతవిద్యావేత్తలు - గంగాపురం హరిహరనాథ్ 110

ఆలంపూరు – సంగమేశ్వరం – సోమశిల క్షేత్రాలు – గడియారం రామకృష్ణశర్మ 114
పవిత్ర కృష్ణవేణి – కలికల్మషనాశని – పీసపాటి నాగేశ్వరరావు 118
కష్ణదేవరాయలు – కృష్ణానదీ సంబంధాలు – డా॥ సంగనభట్ల నరసయ్య 120
కృష్ణమ్మ నీడలో ఎందరో కవులు 122
అమరావతికి మళ్ళీ పూర్వవైభవం – దామోదర ప్రసాద్ పతకమూరు 129
పుష్కర సమయంలో చేయవలసిన దానములు – వాటి ఫలితములు 134
నా పేరు కృష్ణవేణి – డా॥ జంధ్యాల జయకృష్ణ బాపూజీ 135
కృష్ణా తీరం సాంస్కృతిక పునరుజ్జీవనం –దామోదర ప్రసాద్ పతకమూరు 137
కొండపల్లి బొమ్మల కళా ప్రాభవం – ప్రసాదవర్మ కామబుషి 141
కృష్ణాతీరంలో మువ్వల సవ్వడి – కూచిపూడి – ఆరవేటి వెంకటసుబ్బయ్య 144
శాసనాలలో, సాహిత్యంలో కృష్ణానది – డా॥ గల్లా చలపతి 146
కృష్ణవేణి కులుకులు... వెండితెర తళుకులు – డా॥ పైడిపాల 151
కృష్ణమ్మకు సొగబులు – బెజవాడ గుళ్ళు – ధారా సుబ్రహ్మణ్యం 154
పుణ్యప్రదం పుష్కర కాలం – ఎ.వి. వరదదేశికులు 157
పుష్కర ముగింపు సంబరం 160

కృష్ణానదీ పుష్కర నిర్ణయం

ఈ సంవత్సరం అనగా ది.11.08.2016 రాత్రి 9.28 ని.లకు గురువు కన్యారాశిలోకి ప్రవేశిస్తున్న కారణంగా కృష్ణానదికి పుష్కరములు వస్తున్నాయి. శ్రీదుర్ముఖి నామ సం॥ శ్రావణ శుక్ల అష్టమి, తత్కాల నవమి, గురువారం, అనూరాధ నక్షత్రం బ్రహ్మయోగం సమయంలో గురువు ఉత్తరఫల్గుణి 2వ పాదము, కన్యారాశిలో ప్రవేశించును. ఇది రాత్రికాల ప్రవేశం. ఈ పవిత్ర పుణ్య పుష్కరాల సందర్భంగా 'యథావిధి'గా ఆచరణలు చేయలేకున్నను 'యథాశక్తి'గా స్నాన, దాన, జపాదులనొనర్చి, తమతమ పితృదేవతలకు పిండప్రదానాలు, శ్రాద్ధకర్మల నొనర్చి పితృదేవతలకు అక్షయ పుణ్యలోక ఫలాలను, తమకు ఇహ, పర సౌఖ్యాలను, వంశవృద్ధులను, పితృదేవతల ఆశీస్సులను పొందగలరు. పుష్కర నదులలో ఆరవది కృష్ణానది. భారతదేశంలో అతి పెద్ద నదులలో ఒకటి కృష్ణానది. భూమధ్య నదిగా పేరుగాంచింది కృష్ణానది.

(మరుమాముల వెంకటరమణశర్మ)


కృష్ణవేణీ స్తుతిః

వేదనాదసుసంగీత భారతావని పావనీ
పుణ్యప్రదా నదీమాతా కృష్ణవేణీ విరాజతే 1
మహాబలేశ్వరోత్పన్నా మహారాష్ట్ర ప్రవాహినీ
అనేకోపనదీయుక్తా కృష్ణవేణీ విరాజతే 2
కఱ్ఱాటక ధరాభాగ పవిత్రాక్షేత్ర పాలినీ
ఘటమాలాప్రభాయుక్తా కృష్ణవేణీ విరాజతే 3
తెలంగాణాంతరంగ శ్రీకలితాలంపురప్రభా
తుంగభద్రాసమాయుక్తా కృష్ణవేణీ విరాజతే 4
నాగార్జున గిరీంద్రాత్మా సాగరా సంప్రవర్ధినీ
బౌద్ధరామాభిరామశ్రీః కృష్ణవేణీ విరాజతే 5



ఆంధ్రప్రదేశ శ్రీశైలక్షేత్రందన నందినీ
భక్తాంతరంగలసనా కృష్ణవేణీ విరాజతే 6
దుర్గావిజయమార్గస్థా దుర్గామల్లేశసేవికా
సముద్రగమనోద్యుక్తా కృష్ణవేణీ విరాజతే 7
హంసద్వీపసమాహ్లాద వాహినీ విశ్వరూపిణీ
వంగాఖాతలయానందా కృష్ణవేణీ విరాజతే 8

కృష్ణవేణ్యష్టకం భవ్యం పావనం పుష్కరప్రభమ్
నటేశ్వర కవిప్రోక్తం రాజతే పాఠకప్రియమ్



డా॥ అయాచితం నటేశ్వరశర్మ

సంపాదకీయం

కృష్ణవేణి... పుష్కర తరంగిణి

మానవాళి నాగరికత, సంస్కృతి పరిఢవిల్లేది నదీతీరాల్లోనే. భారతీయ ఆర్ష సంస్కృతి, నాగరికతలు సింధు, గంగ, గోదావరి, కృష్ణవేణి, కావేరి మొదలైన నదీ తీరాలలో వికసించాయి. భారతదేశంలో రెండవ పొడవైన నది కృష్ణవేణి. కృష్ణమ్మ తాను ప్రభవించే చోటునుండి సాగర సంగమందాకా సుమారు **30**కి పైగా నదులను తనలో చేర్చుకుంటూ ముందుకు సాగింది. మహారాష్ట్రలోని పడమటి కనుమలలో సముద్రమట్టం నుండి సుమారు **4385** అడుగుల ఎత్తులో ఉద్భవించి, మహారాష్ట్ర, కర్నాటక, తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో ప్రవహించే ఈ కృష్ణవేణి సుమారు **1400** కిలోమీటర్ల దూరం ప్రయాణించి లక్షలాది జీవజంతుజాలానికి, పచ్చని పైర్లకు తృప్తినిచ్చి, బంగాళాఖాతంలో సంగమిస్తోంది. మహారాష్ట్రలోని సతారా జిల్లాలో మహాబలేశ్వరంలో జన్మించే కృష్ణతో పాటు వేణా, కకుద్మతి, సావిత్రి, గాయత్రి అనే మరో నాలుగు నదులు కూడా పుడుతున్నాయి. ఈ ఐదు నదులను పంచగంగ అని పిలుస్తారు. సహ్యాద్రిలో జన్మించే కాసరి, కుంభి, భోగవతీ, తులసి, ధామిని అనే ఐదు నదులను పంచగంగ అని పిలుస్తారు. ఈ నదులన్నీ కృష్ణలో కలుస్తాయి. తెలుగునాట తుంగభద్ర, మూసీ తదితర నదులు మమేకమవుతున్నాయి. నాలుగు రాష్ట్రాల కల్పవల్లిగా, సాగు, తాగునీటిని అందిస్తూ విద్యుత్తు తదితర అవసరాలను తీరుస్తూ, పవిత్రక్షేత్రాలను తాకుతూ పవిత్రతను సంతరించుకున్న ఈ కృష్ణవేణమ్మ పుష్కరోత్సవాలు ఆగస్ట్ **12**వ తేదీ నుండి **23** వరకు వైభవంగా జరుగనున్నాయి. ఈ సందర్భంగా 'దర్శనమ్' సభక్తిపూర్వకంగా అందిస్తున్న వ్యాసాల సమాహారమే ఈ 'కృష్ణవేణీ పుష్కర దర్శనమ్'.

12 సంవత్సరాలు.... సాంస్కృతికంగా ఈ కాలాన్ని 'పుష్కరం'గా పిలుస్తున్నాం. గతేడాది 'గోదావరి' పుష్కరాలను ఆరంభించుకొని, అంత్యపుష్కరాలను సుసంపన్నం చేసుకుంటున్నాం. పవిత్ర నది కృష్ణవేణి పుష్కరోత్సవాలకు స్వాగత నీరాజనాలను పలుకుతున్నాం. యాదృచ్ఛికంగా 'దర్శనమ్' ఆధ్యాత్మిక వార్తా మాసపత్రిక కూడా పుష్కరకాలాన్ని పూర్తి చేసుకుంటోంది. గత సంవత్సరం 'అఖండ గోదావరి పుష్కర దర్శనమ్' ప్రత్యేక సంచికను అందించి పాఠకలోక ఆదరణను చూరగొన్న 'దర్శనమ్' ప్రస్తుతం 'కృష్ణవేణీ పుష్కర దర్శనమ్' అను మరో విశిష్ట సంచికను తన పుష్కరోత్సవాల సందర్భంగా అందివ్వడం సుకృతం. జగద్గురువుల దివ్యాశీస్సులు, ఆస్తిక మహాశయుల ఆదరాభిమానాలతో 'పుష్కరం' దాటుతున్న 'దర్శనమ్' సనాతనధర్మ పరిరక్షణలో అహరహం శ్రమిస్తోంది.

'కృష్ణవేణీ పుష్కర దర్శనమ్' విశిష్ట సంచికకు ఎందరో ఉద్ధండులైన పండితులు, రచయితలు, కవులు తమ రచనలను అందించారు. వారందరికీ 'దర్శనమ్' పేరుపేరునా వినమ్రపూర్వకంగా కృతజ్ఞతలను తెలియజేస్తోంది.



ఇందులో పుష్కర స్నానవిధి, పుష్కరవైశిష్ట్యం, నదీ చరిత్ర, పరిఢవిల్లిన సాంఘిక ప్రయోజనాలు, సాంస్కృతిక, ధార్మిక విశేషాలు, నదీ తీరంలో వెలసిన పుణ్యక్షేత్రాలు, కవులు, పండితులు, మహానుభావుల స్మరణ, ఇత్యాది విశేష వ్యాసాలతో ఈ విశిష్ట సంచిక మీ ముందుకు తెస్తున్నాం. పాఠకదేవుళ్లు ఈ సంచికను మనస్ఫూర్తిగా ఆదరిస్తారని ఆకాంక్షిస్తూ...!

మరుమాముల వెంకటరమణశర్మ

తెలుగింటి విరిబోణి – కృష్ణవేణి...!

- శ్రుతి దామోదర్

సృష్టిలో సమస్త జీవరాశికి జలమే ఆధారం. జలం లేకపోతే ఏ జీవి జీవించలేదు. అందుకే జలం పంచభూతాలలో శ్రేష్టమైనదిగా చెప్పబడుతున్నది. నదీజలాలలో అమృతం ఉన్నదని అథర్వణ వేదం ద్వారా తెలుస్తుంది. నదీ జలాలలో అనేక ఓషధులు, రోగనివారక శక్తి ఉండటంవలన అవి రోగాన్ని నివారించి దీర్ఘాయుష్షును ఇస్తాయని ఋగ్వేదం ద్వారా తెలుస్తోంది. కాబట్టి నదీజలపానం వలన మనలోని మలినాలు పోయి దేహపుష్టి కలుగుతుందని ప్రతీతి.


నదులు సాధారణంగా హిమాలయాలు, పర్వతాలు లేదా సరస్సుల నుండి ప్రవహిస్తున్నాయి. ఇవి ఆయా పర్వతములందలి వృక్షములను, తీగలను, ఖనిజములను తమలో ఇముడ్చుకుంటున్నాం. దీనివలన ఒక్కో ప్రదేశములోని నదులకు ఒక్కొక్క విశేష గుణములు కలిగి ఉంటాయి.

మనకి నదులు జీవనాధారాలే కాక చక్కటి తత్వోపదేశాన్ని కూడా అందజేస్తున్నాయి. నదీనాం సాగరోతిః అన్నారు. నదులకు సాగరమే గతి. అందుకనే నదులు ఎక్కడో పుట్టి, ఎన్నో అవరోధాలను అధిగమిస్తూ, త్రోవలో ఎంతోమందికి భుక్తిముక్తుల నందించి, ఎన్నో మైళ్ళు ప్రవహించి సముద్రంలో సంగమిస్తాయి. సముద్ర సంగమమే తమ లక్ష్యంగా, తత్ సాధనకు సాకార రూపమిచ్చి నిరంతర ప్రవాహమే వ్యక్తిత్వముగా కలిగి లక్ష్యాన్ని సాధించమని మనకు హితాన్ని బోధిస్తూ 'కృషితో నాస్తి దుర్భిక్షం' అన్న సూక్తికి నిదర్శనంగా నిలుస్తున్నాయి. అంతేకాక ఈ జీవితం పరోపకారమునకే అని ప్రవహిస్తూ ఫలాపేక్షలేని కర్మసిద్ధాంతాన్ని పాటించండని తెలుపుతూ గీతాచార్యుని సందేశాన్ని మనకు గుర్తు చేస్తున్నాయి నదులు.

కృష్ణానదీ జన్మస్థానం - పరీవాహక ప్రాంతం

దక్షిణ భారతదేశంలోని రెండవ అతిపెద్ద నది కృష్ణానది. కృష్ణానదికి సంబంధించిన వివరాలు పురాణ, ఇతిహాసాలలోనూ, చారిత్రక శాసన వాఙ్మయాలలోను మనకు లభిస్తున్నాయి. సాక్షాత్తు శ్రీమహావిష్ణువు అవతారమైన శ్రీకృష్ణుని దేహం నుండి పుట్టిన కృష్ణానది పరమపవిత్రమై పాపాలను హరించడమే కాకుండా, జీవనాధారమై ఎన్నో రకాలుగా ఉపయోగపడుతోంది. ఆధ్యాత్మిక, ధార్మిక సందేశాన్ని పురాణకాలంనుండి అందిస్తున్నాయి.

నదీ పరీవాహక ప్రాంతాలు నాగరికత వికాస కేంద్రాలు. నదులు వ్యాపారానికి, సమాచార వ్యాప్తికి వాహికలుగా పనిచేశాయి. వ్యాపార





రవాణాకే కాకుండా సైనిక రవాణాకు ఉపయోగపడుతున్నాయి. నదులు మనకు ఎన్నో రకాలుగా జీవనోపాధికి సహాయపడుతున్నాయి. త్రాగునీరు, సాగునీరు, విద్యుత్తు ఇలా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎన్నో రకాల ప్రయోజనాలను అందిస్తున్నాయి నదులు.

ఎన్నో పుణ్యనదులు పుట్టిన ప్రాంతం సహ్యపర్వతం. ఈ సహ్యపర్వతం చక్రతీర్థం నుండి కృష్ణానది జన్మించింది. మహారాష్ట్రలోని మహాబలేశ్వరం మహాదేవుని ఆలయం వద్దగల గోముఖం నుండి వెలువడుతోంది. ఈ గోముఖం నుండి బయటకు వచ్చిన కృష్ణానది అతివేగంతో మహారాష్ట్రలోని సతారా జిల్లాలో ఆగ్నేయ మూలంగా నూట నలభై ఐదు మైళ్ళు ప్రవహించి, తరువాత దక్షిణ మహారాష్ట్ర గుండా మరో పదిమైళ్ళు సాగి, 'వేణీ దేవో మహేశ్వర' అని అన్నట్టు శివదేహం నుండి ఉద్భవించిన వేణీనదిని తనలో కలుపుకొని 'కృష్ణవేణి'గా మారుతున్నది కృష్ణానది.

మహాబలేశ్వర్ నుండి 135 కి.మీ. దూరంలో కొయినా నదిని తనలో కలుపుకుంటుంది. తరువాత వర్ణ, పంచగంగ, దూధ్‌గంగలు కలుస్తాయి. మహారాష్ట్రలో ప్రవహించి, బెల్గాం జిల్లా ఐనాపూర్ గ్రామం వద్ద కర్ణాటక రాష్ట్రంలో ప్రవేశిస్తుంది. కర్ణాటకలో ఘటప్రభ, మలప్రభ నదులతో కలుస్తుంది. తెలంగాణ రాష్ట్రంలోకి ప్రవేశించే ముందు బీమానది కలుస్తుంది. కర్ణాటకలో రాయచూర్ నుండి మహబూబ్‌నగర్ జిల్లా తంగడి వద్ద తెలంగాణ రాష్ట్రంలో ప్రవేశిస్తుంది. ఆలంపూర్ వద్ద కృష్ణానది ఉపనది అయిన తుంగభద్ర కలుస్తుంది. ఆంధ్రప్రదేశ్‌లో ప్రవేశించి నల్లమల కొండల్లో లోతైన లోయలో ప్రవేశిస్తుంది. ఇక్కడే శ్రీశైలం, నాగార్జున సాగర్ వద్ద పెద్ద ఆనకట్టలు నిర్మించబడ్డాయి. ఇక్కడినుండి చిన్న చిన్న ఉపనదులై దిండి, మూసి, పాలేరు, మున్నేరు వంటివి కలుస్తాయి. విజయవాడ ప్రకాశం బ్యారేజిని దాటి డెల్టా ప్రాంతంలో ప్రవేశిస్తుంది. 1188 మీటర్ల వెడల్పున విజయవాడ వద్ద నది విస్తరించింది. తరువాత దివిసీమలోని హంసల దీవి వద్ద బంగాళాకాతంలో కలుస్తుంది. హంసలదీవి గుంటూరు జిల్లా తెనాలిలో వుంది. రేపల్లెకు 30 కి.మీ.దూరంలో ఉంది.

ఈవిధంగా కృష్ణానది సుమారు 1400 కిలోమీటర్ల పొడవుతో మహాబలేశ్వరంలో పుట్టి మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ వంటి నాలుగు రాష్ట్రాలలో ప్రవహించి, హంసలదీవి గుండా బంగాళాఖాతంలో కలుస్తోంది. ప్రపంచం మొత్తంలో 8% ప్రాంతంలో కృష్ణానది ప్రవహిస్తోంది.

కర్ణాటకలో (113,271 చ.కిలోమీటర్లు), తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో (76,252 చ.కి.మీ), మహారాష్ట్రలో (69,425 చ.కి.మీ) కలిపి మొత్తం 2,58,9948 చ.కి.మీటర్ల పరీవాహక ప్రాంతాన్ని ఏర్పరచుకొని ద్వీపకల్ప నదులలో రెండవదిగా పేరు పొందింది కృష్ణానది.

కృష్ణానదికి ఉపనదులు

భీమా, దిండి, పెద్దవాగు, హాలియా, మూసి, పాలేరు, మున్నేరు, దూద్‌గంగా, ఘటప్రబ, మలప్రభ, తుంగభద్ర వంటివి ప్రధానమైన ఉపనదులు. కృష్ణానది ఉపనదుల్లో బీమా నది చాలా పెద్దది.

శాసనాలలో కృష్ణానది

"ఆంధ్రకాః కృష్ణా గోదావర్యోః మధ్యే విద్యమానో దేశః

కృష్ణా, గోదావరి నదుల మధ్య ఉన్న ప్రాంతమే ఆంధ్రదేశమని, మహాభారతంలో చెప్పబడింది. సంస్కృతి, సంప్రదాయాలకు మూలకేంద్రమైనర కృష్ణా, గోదావరి నదులు ఆంధ్రదేశాన్ని అన్నపూర్ణగా మార్చాయి. మౌర్యసామ్రాజ్య పతనానంతరం ఆంధ్ర శాతవాహనులు కృష్ణా, గోదావరుల మధ్య ఉన్న ప్రాంతాన రాజ్యస్థాపన చేశారు. వీరి రాజ్యానికి రాజధానులు ప్రతిష్ఠానం, అమరావతి. ఈ అమరావతి కృష్ణానదీ తీరంలోనే ఉంది. దీనినే ధాన్యవాటి, ధనకటకము, ధాన్యకటకము అని పిలిచేవారు. కృష్ణానది ముఖద్వారం ప్రాచీన కాలంనుండి తెలుగువారి ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక, సాంఘిక జీవనానికి మూలబిందువుగా నిలుస్తోంది.

3,4 శతాబ్దాలలో కృష్ణానదికి తూర్పునగల తీరప్రాంతాన్ని చాలా గొప్పగా పాలించిన వారు ఇక్ష్వాకులు. వీరి రాజధాని నేటి నాగార్జునసాగర్‌గా పిలువబడే విజయపురి.

కృష్ణానదికి ఉత్తర ప్రాంతాన్ని 4వ శతాబ్దంలో పాలించినవారు బృహత్పలాయనులు. వీరి రాజధాని గూడూరు ఇది కృష్ణానది ముఖద్వారంలో ప్రఖ్యాతి గాంచిన వర్తక ప్రాంతం.

కృష్ణా, గోదావరి పరీవాహక ప్రాంతంలో వేంగిని రాజకీయకేంద్రాలుగా చేసుకొని క్రీ.శ. 3వ శతాబ్దం నుండి 12వ శతాబ్దం వరకు శాలంకాయనులు, విష్ణుకుండినులు, తూర్పుచాళుక్యులు పరిపాలించారు. రాజకీయ ఆధిపత్య పోరు చాళుక్యులు, చోళులు, రాష్ట్రకూటుల మధ్య కన్నడ, తమిల, తెలుగు ప్రాంతాలలో జరిగాయి.

కృష్ణా – దక్షిణాన తుంగభద్రా నదుల పరీవాహక ప్రాంతంలో 13వ శతాబ్దంలో విజయనగర సామ్రాజ్యాన్ని స్థాపించడంతో దక్షిణభారతదేశ చరిత్రలో తుంగభద్రా నదీ పరీవాహక ప్రాంతం రాజకీయ పరిపాలన, ఆర్థిక, మత, సాంస్కృతిక ప్రాధాన్యతను సంతరించుకుంది. వర్తకం, వాణిజ్యం, వాస్తు నిర్మాణం, శిల్పకళల అభివృద్ధికి ఎలాంటి ప్రతిబంధకాలు లేకుండా విజయనగర సామ్రాజ్యవైభవం సింహళం వరకు వ్యాపించింది. దక్షిణభారతదేశంలో హైందవ సంస్కృతి నలుదిశలా వ్యాపించింది.

కృష్ణానదీ - ఆనకట్టలు

కర్ణాటక : 1. ఆలమట్టి డ్యాం (ప్రాజెక్టు), 2. నారాయణపూర్ డ్యాం (ప్రాజెక్టు)

పై రెండింటిని కలిపి అప్పర్ కృష్ణా ప్రాజెక్టు అంటారు.

తెలంగాణ : 1. ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు : మహబూబ్‌నగర్ జిల్లా రావులపల్లి సమీపంలో నిర్మించారు. కృష్ణానది తెలంగాణలో ప్రవేశించిన తరువాత కృష్ణపై ఉన్న మొదటి ప్రాజెక్టు ఇదే. 2. నాగార్జునసాగర్ ప్రాజెక్టు.

ఆంధ్రప్రదేశ్ : 1) శ్రీశైలం డ్యాం 2) పులిచింతల డ్యాం 3) ప్రకాశం బ్యారేజి డ్యాం.

ఇవేకాకుండా కృష్ణానదీ పరీవాహక ప్రాంతాలలో మరికొన్ని డ్యాంలు నిర్మించారు. వాటి వివరాలు :

1) ధూం డ్యాం 2) హిప్పగిరి బ్యారేజ్ 3) అమర్ డ్యాం 4) కానూర్ డ్యాం 5) ఉజ్జని డ్యాం (భీమా నదిపైన ఉజ్జని డ్యాం) మహారాష్ట్ర) 6. కొలిసాగర్ డ్యాం (కృష్ణానది ఉపనదైన పెద్దవాగుపై నిర్మించారు)

కృష్ణానదిపై నిర్మించిన వంతెనలు : (బ్రిడ్జిలు)

కృష్ణానదిపై నిర్మించిన కొన్ని బ్రిడ్జిలను (వంతెనలు) పరిశీలిద్దాం.

కృష్ణా బ్రిడ్జి, ఐర్విన్ బ్రిడ్జి, సొందటి బ్రిడ్జి, తంగాడాగి బ్రిడ్జి

కృష్ణానది – హైడ్రో ఎలక్ట్రిక్ విద్యుత్ కేంద్రాలు :

కృష్ణా నదిలోని నీటికి విద్యుత్‌గా మార్చడానికి నదీ – తీర ప్రాంతాలలో ఎన్నో డ్యాంలు నిర్మించారు.

1) కొయినా హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్టు – 1920 మె.వాట్స్
2) మల్లి లేదా మూసీ డ్యాం – 300 మె.వాట్స్
3) తోకర్‌వాడీ డ్యాం – 72 మె.వాట్స్
4) ఉజ్జాని డ్యాం – 12 మె.వాట్స్
5) ఆలమట్టి డ్యాం – 290 మె.వాట్స్
6) భద్రా డ్యాం – 39 మె.వాట్స్
7) తుంగభద్రా డ్యాం – 127 మె.వాట్స్
8) జూరాల హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్ట్ – 240 మె.వాట్స్
9) శ్రీశైలం డ్యాం – 1670 మె.వాట్స్
10) నాగార్జునసాగర్ డ్యాం – 960 మె.వాట్స్
11) పులిచింతల డ్యాం – 120 మె.వాట్స్

కృష్ణానదిలోని ఖనిజ సంపద :

కృష్ణానదిలో అద్భుతమైన ఖనిజ సంపదకు నిలయం వాటిలో కొన్ని

1) కృష్ణా – గోదావరి నది – నూనె, గ్యాస్.
2) ఇల్లందు – బొగ్గు గనులు
3) బయ్యారం మైన్స్ – ఇనుము
4) కుద్రెముఖ్ – ఇనుము
5) జగ్గయ్యపేట గనులు
6) కొల్లూర్ – రత్నాలు
7) హత్తి – బంగారు గనులు

కృష్ణానదీ – పర్యాటక ప్రాంతాలు :

1) మహాబలేశ్వర్ – పర్వత ప్రాంతాలు 2) శ్రీశైలం – డ్యాంలు, వంతెనలు 3) నాగార్జునసాగర్ ప్రాజెక్టు 4) అమరావతి 5) విజయవాడ

కృష్ణానదీ – వరదలు :

చక్కగా బిరబిరా పరుగులెత్తే కృష్ణమ్మ – కొన్ని సందర్భాలలో ఉగ్రరూపం దాల్చింది. అక్టోబరు 2009వ సంవత్సరంలో మొత్తం 350 గ్రామాలు ఇబ్బందులు పడ్డారు. నిరాశ్రయులైనారు.

కృష్ణానదీ పరీవాహక ప్రాంతంలో 138 తీర్థాలు ఉన్నాయి. మరెన్నో జలపాతాలు కూడా కనువిందు చేస్తాయి.

సహజసిద్ధ దైవ స్వరూపాలుగా భాసిల్లుతున్న నదుల వైశిష్ట్యం, మాటలలో వర్ణించలేనిది, బౌగోళికంగా, సాంకేతికంగా, శాస్త్రీయపరంగా, ఆధ్యాత్మికంగా – ఆధునిక యుగంలోని ఎన్నో రకాల ప్రయోజనాలు అందించే కృష్ణవేణీ – సర్వపాపహరిణీ. ❖



కృష్ణాపుష్కర వైశిష్ట్యం

శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ చిన జీయరు స్వామి

ఓ చిన్న జలాశయాన్ని చూస్తే పెద్దలకు గాని, పిన్నలకు గాని ఓ దివ్యమైన ఆనందం కలుగుతుంది. గలగల శబ్దిస్తూ సాగిపోయే సెలయేళ్ళను చూస్తుంటే మనలోని అవ్యక్త చైతన్యం స్పందిస్తుంది. ఎత్తైన కొండలనుండో, కోనల నుండో జాలువారే జలధారాపాతాలను పరిశీలిస్తోంటే మనలోని భావనాధార లుప్పొంగి పొరలుతాయి. ఉవ్వెత్తున ఎగసిపడుతూ అంబరాన్ని చుంబిస్తూ ఎదురులేని వీరునిలా, హోరున ఘోషిస్తూ ముందుకురికే సాగరతరంగాల ఆరవారాన్ని పరికిస్తే మన ఋహృదయగుహానిహితమైన దివ్యతత్వ మొక్కటి అపుడే మేల్కొన్నట్లు తనువు పులకాంకితమై ఆనందడోలికలలో ఓలలాడుతుంది. ఆ సెలయేళ్ళలోనో, జలధారలలోనో, తరంగాల లోనో తనూ ఒక శీకరమై పుడమితల్లి ఒడిలో పదికాలాలపాటు వెచ్చగ, పచ్చగ పారాడాలనిపించక మానదు.

అందుకే కాబోలు స్థావరాలైన చెట్లు, లతలు, తీగలు నీటిస్పర్శ కలుగగానే లేత చిగుళ్ళతో కళకళలాడుతూ నూతన కాంతులీనుతూ కన్పిస్తాయి. లోపల దాచినంత కాలమూ చెక్కుచెదరని గుండెనిబ్బరం కల మహాయోగిలా చైతన్యముడిగి ఉన్న ఎండు విత్తులు సైతము, నేల నాటకున్నా, అంకురములతో పుల కిస్తూ దర్శనమిస్తాయి. లోన దాగి ఉన్న జీవన చైతన్యాన్ని ప్రభవింప చేయడంలో, జలానికుండే శక్తి అమోఘ మైనది. నిప్పు ప్రాణాంతకమైతే, నీరు చల్లని చేతితో తడిమినట్లు ప్రాణాధారమౌతూ ఉంటుంది.

సృష్టి కార్యాన్నారంభించిన విరాట్ పురుషుడైన పరమాత్మ గూడ 'అప ఏవ ససర్జాదౌ తాసు వీర్యమసాసజ్యత్', 'ముందు నీటినే సృష్టించి, అప్పుడా నీటి ద్వారా జీవం పోసుకుని చైతన్యవంతులు కావాలీ జీవులంతా అని వీర్యాన్నా నీటిలో విడచి పెట్టినాడు' అంటారు తత్వాన్ని దర్శించిన మన ఋషులు. అంటే నీరు మనకు మాతృస్థానమన్నమాట. అందుకే నీరంటే మనకంత ప్రేమ. ఆ నీరే మనలో ప్రాణాన్ని పెంచి పోషిస్తూంటుందని ఉపనిషత్తులు గుర్తించాయి.

ఆరుణి కుమారుడు శ్వేతకేతు. గొప్ప మేధావి. సత్యాన్వేషి. విషయజిజ్ఞాసువు గూడ. తండ్రి బోధనలను వింటూంటూ అతనికి సంశయం కలిగదింది. 'మనస్సు అన్నము వల్ల పనిచేస్తుంది. ప్రాణము నీటివల్ల సంచరిస్తుంది' అని తండ్రి చెప్పాడు. నిరూపించమన్నాడు శ్వేతకేతు. 'ప్రాణంమీద పరీక్ష చేస్తే అది కాస్తాపోతే ఇక ఎవరికి నిరూపిస్తాం కనుక? అంచేత మనస్సుమీద పరీక్ష చేద్దాం. 15 రోజులు అన్నం మానేయ మన్నాడు తండ్రి. ఆ తర్వాత ఏమడిగినా జ్ఞప్తికి రాలేదు శ్వేతకేతుకి. కొద్దికొద్దిగ అన్నం తినమన్నాడు. అలానే చేసాడు. అడిగినవన్నీ తెలిసినవన్నీ భాసించాయి శ్వేతకేతుకి. "కనుక అన్నమే మనస్సుని పనిచేయిస్తుంది. అలానే నీరు గూడ ప్రాణాన్ని" వివరించాడు తండ్రి.

మంచి మనస్సుకోసం మంచి విలువలున్న ఆహారం తినాలి. ప్రాణశక్తి బాగుండాలంటే మంచినీరు వాడాలి. ప్రాణశక్తియే మన బుద్ధికి గూడ ఆధారం. నీటివల్ల మలినములు దూరమై రక్తము శుద్ధమై, బుద్ధి నిశితమౌతుంది. ప్రాణవాయువు యొక్క క్రమబద్ధ సంచారం వల్ల ప్రభావితమై రక్తప్రసరణ ద్వారా మేధాసంపద సాత్వికముగ వృద్ధి నొందుతుంది. దానివల్లనే మానవుడు దాన వత్వాన్ని అణచగలుగుతాడు. దైవీగుణ పౌష్కల్యాన్ని పొందుతాడు 'పుష్కరుడు' లేక 'పుష్కలుడు' అని పిలువబడతాడు.

పై శ్వేతకేతు వృత్తాంతాన్ని ఛాందోగ్యోపనిషత్ 6వ ప్రపాఠకం వివరిస్తోంది. దీన్ని బట్టి నీటి స్థానమేమిటో తెలుస్తోంది. మనిషికి ప్రధానమైనది బుద్ధి. అది లేనినాడు, ఉన్నా సదుపయోగం కానినాడు మానవుడు అసురుడౌతాడు. కనుక శ్రమపడియైనా తన ఉనికిని నిలుపుకోవ డానికి సద్బుద్ధి ప్రద ములు, మేధా వర్ధకము లయిన పనులు చేయాలి తప్ప మనం కోరిన పనులు కాదు. జలమువలె బుద్ధి గూడ ప్రవాహశీలమే. అది మంచి ఆలోచనలు చేయనిచ్చే సమయం అతి తక్కువ. నీరెప్పుడు ప్రభావవంతమౌతుంటుందో గమనించి అప్పుడప్పుడల్లా ఆ నీటి ద్వారా ప్రయోజనాన్ని

పొందుతూండాలి. బుద్ధికి అధిష్ఠాన దేవత గ్రహరాశిలో బృహస్పతి. ఈతడు ఏడాదికోరాశిలో మారుతూంటాడు. చక్రాకృతిలో ఉన్న ఖగోళా న్నంతటినీ మన ఋషులు 12 రాశులుగా, భాగాలుగా విభజిం చారు. ఆ రాశిలో, భాగంలో ఉండే నక్షత్ర రాశులన్ని ఒక్కొక్క పేరుతో పిలిచారు. ఈ 12 రాశులు గూడ వాటి వాటి నియమం ప్రకారం సంచరిస్తూంటాయి. అనంతాకాశంలో, సౌరకుటుం బానికి చెందిన గ్రహాలన్ని గూడ వాటి వాటి పరిభ్రమణ క్రమాన్ని బట్టి అన్ని రాశు లలోనూ ప్రవేశిస్తూంటాయి. సూర్యుడు ఈ రాశి చక్రాన్ని ఏడాదికొకసారి ముగిస్తాడు. ఒక్కో రాశిలో ఒక నెల తన దృష్టినుంచుతాడు. దాక్షిణాత్యులు ఆ సమయాన్ని ఆయా రాశి పేరుతో నెలలుగ వ్యవహరిస్తారు, మేషమాసం, వృషభమాసం... ఇలా. బృహస్పతి గ్రహం గూడా తన పరిభ్రమణ క్రమంలో ఒక్కోరాశిలో ఒక్కో ఏడాది ఉంటూ 12 ఏళ్ళకొకసారి ఈ రాశి చక్రాన్ని చుట్టి వస్తూంటుంది. ఆ 12 ఏళ్ళ కాలాన్ని 'పుష్కరం' అంటారు. పుష్కరమంటే '12' అని దాన్ని బట్టే స్థిరపడింది.

గ్రహకూటమిలో మన భూమియొక్కస్థానమత్యంత కీలక మైనది. దీనిమీద అన్ని రాశుల గ్రహాల ప్రభావాలూకూడ పడుతుంటాయి. మిగిలిన గ్రహాలనలా ఉంచితే, బృహస్పతి గ్రహం ఒక రాశినుండి మరో రాశిలో మారేటపుడు మన భూమిమీద ప్రవహించే 12 నదీ జలాలను శక్తివంతములుగ, ప్రభావితం చేస్తాడు.

భాగవతం 5వ స్కంధంలో మన భారత వర్షంలో ప్రవహించేదిగ చూపబడ్డ 42 నదులలోను 12 నదులనే ముఖ్యమైన జీవనదులుగ మన పూర్వులు గుర్తించడానికి ఈ బృహస్పతీ గమనమే ప్రధాన కారణమైయుంటుంది.

ఈ బృహస్పతి ఒక రాశిలోనికి ప్రవేశించే మొదటి 12 దినాలను 'ఆది పుష్కరం'గ వ్యవహరిస్తారు. తిరిగి ఏడాది కాగానే ఆ రాశి వదలి వేయాలిగద! వదిలేముందరి 12 దినాలు 'అంత్య పుష్కరం' అంటారు. పైన చెప్పుకున్న ప్రకారం '12' అంకెను పుష్కరం అని వ్యవహరించడం చేత ఆద్యంత 12 దినాలు గూడ ఆద్యంత పుష్కరకాలాలుగ నిర్ణయించారు. బృహస్పతి దేవతలకు ప్రధాన మంత్రి. మంచి బుద్ధిమంతుడు. చతురుడు. దీన్ని సాంకేతికంగా స్వీకరిస్తే దైవీగుణ సంపదను, బుద్ధినీ ఇచ్చే గ్రహంగా బృహస్పతిని స్వీకరించవచ్చు. అందుకే 'బుద్ధికి బృహస్పతి' అనే తెలుగు నానుడి తయారైంది.

బృహస్పతి నీటిని ప్రభావితం చేసే సమయంలో ఆయా నదీజలాల సంసేవనము, సద్బుద్ధి వర్ధకమని అభిజ్ఞుల కథనం. ఏడాదిపొడుగునా ఆయా నదుల తీరాల్లో గడపాలంటే అందరికీ వీలుపడదు కనుక బాగా ప్రభావితం చేసే సమయాలను గుర్తించారు మనవారు. పదవిలో ప్రవేశించగానే, వదలి పోయేపుడు మిక్కిలి ఉదారంగ ప్రవర్తించే మంత్రివర్యులు మనకు బోలెడు మంది తెలుసు. ఇది ప్రాణికోటి జీవ లక్షణం. గ్రహాలైనా పట్టినపుడు, విడిచేటపుడే తీవ్రంగా ప్రవర్తిస్తాయి.

బృహస్పతి గూడా ఆదిపుష్కర, అంత్యపుష్కరాల్లో తీవ్ర ప్రభావం కలిగి ఉంటుంది. కనుక కనీసం ఆయా సమయాల్లో ఆయా నదుల్లో స్నానపానాదులు, బుద్ధికి పదును కల్గిస్తాయి. వైదిక క్రియాకలాపాలు శ్రద్ధావంతము లౌతాయి. సత్ఫల దాయకాలౌతాయి. మళ్ళీ అందులోనూ ఆదిపుష్కర కాలంలో ఉన్నంత ప్రభావం అంత్యకాలంలో ఉండదు. (పదవి స్వీకరించినప్పటి ఉత్సాహం వదిలేటపుడు తక్కువగ ఉంటుంది కద!) అందుకే ఆదిపుష్కర కాలంలో బృహస్పతి ప్రభావాన్ని పొంది సజ్జనులు కావడానికి పుష్కరాలనొక చక్కటి అవకాశంగా కల్పించారు.

మనం ముందనుకున్నట్లు మనిషికి ప్రధానమైన బుద్ధి, దానికాధారమైన ప్రాణం, ప్రాణశక్తికి పోషకం నీరు. కనుక నీటికే అధిక ప్రాధాన్యమిచ్చి పుష్కరకాలంలో స్నానాలే ముఖ్యమన్నారు. నీళ్ళని గూడ 'పోషించేవి' కనుక 'పుష్కర' శబ్దంతో వ్యవహరిస్తారు. మంచి గుణాలను పోషిస్తున్నాయి గనుక. మంచి గుణాలంటే ఏమిటో మనకి ప్రహ్లాదుడు వర్ణించాడు పలుసార్లు. హరిచరణార్పిత సర్వస్వుడై, విశ్వాన్నంతటినీ ఆ శ్రీహరి సుందరదేహమని గుర్తించి, ప్రేమించుచు, ఏ వ్యక్తికి కష్టం కలిగినా తాను నొచ్చుకొని, ఎవ్వరి కానందమైనా, తాను పొంగిపోయే విశ్వకల్యాణ కాంక్ష. దానికనుగుణమైనవన్ని సుగుణాలే. కానివన్ని దుర్గుణాలే నంటాడు. ఈ విశ్వ శరీర భావన కవసరమైన గుణాలతో మనిషిని పుష్కలుడిగ చేసే సమయం 'పుష్కరం' అంటే సరిగ్గా సరిపోతుంది.

'పూర్ణః పురుష ఉచ్యతే' అనే నిరుక్త వాక్యం ప్రకారం జలములలోని శక్తితో గుణపూర్ణుడిగ పురుషుని దిద్దేకాలం 'పుష్కరకాలం'.

సరే, ఇలా పుష్కర ప్రభావిత నదులుగ కీర్తించబడ్డ 12 నదులలో కృష్ణానది ప్రధానమైనది. బృహస్పతి కన్యారాశిలో ప్రవేశిస్తూ కృష్ణానదిని ప్రభావితం చేస్తాడు. ఈ నదిలో ఆది పుష్కరకాలంలో స్నానాదులనాచరించటం మిక్కిలి ప్రయోజన కారి కావచ్చు. అంటే మిగిలిన నదులకంటే ఈ నది కేదో ఒక గొప్పతనం ఉండాలికద, అదేమిటి? ఆ! కృష్ణానది కుండే గొప్పతనం యితర నదులకు దేనికీ లేదని చెప్పవచ్చు. అదెలాగో చూద్దామా! గంగానది శ్రీమన్నారాయణుని పాదారవిందము నుండి ప్రభవించి భూమిపై ప్రవహించింది. గోదావరి, గంగానది అంశయే అయినా, శివుని



జటాజూటము నుండి ప్రవహించింది. గంగానది బ్రహ్మను గ్రహించుటకై భూలోకాన్ని చేరింది. యమునానది రాకకు ప్రత్యేక కారణమంటూ లేదు. గోదావరీ నది గౌతమమహర్షి ననుగ్రహించుటకు భూమిని చేరింది. కావేరినది భగవద్విశ్రామ స్థానమే అయినా భగవల్లీలావైభవ ప్రకాశకం కాలేదు. మిగిలిన నదులూ సుమారుగ ఇంతే. భగవత్కార్యమేదైన అవసరపడ్డప్పుడు ఈ నదులేవీ భగవానునికి అండగా నిలిచిన సూచనలేవీ కనపడవు. ఒక్క యమునానది తప్ప. భగవంతుడు పుట్టగానే ఆ శిశువును తీసుకుని మదురనుండి గోకులం చేరే సమయంలో వసుదేవునికి దారినిచ్చి పునీతమైంది. గోదావరి అయితే అస్సలు భగవానునికి సహకరించనేలేదు. రావణుడు అపహరించుకుపోతూంటే సీత, గోదావరిని పిలిచి రామునికీ సమాచారమిమ్మని ప్రార్థించింది. శ్రీరాముడు తర్వాత గోదావరిని ఆ విషయమై ప్రార్థించినా గోదావరి నోరు మెదపలేదు.

నదులంటే కేవలం ప్రవహించే నీరు మాత్రమే కాక ఆయా నదిగ పిలువబడడానికొక అధిష్ఠాన దేవత ఉంటుంది. దానివల్ల ఆ జలానికా పేరు. కృష్ణానది తీరంలో విజయవాడలో దాన్ని సూచిస్తూనే కృష్ణానది కన్యకను మూర్తిగా ప్రతిష్ఠించారు మనవారు. అన్ని నదులవలె కాక కృష్ణానది చరిత్ర చాలా ఉదాత్తమైనది. మిగిలిన నదులకు ఆదర్శమైనది. మానవజాతికే జ్ఞానమార్గ ప్రదాయిని గూడ. నదీ వైభవాన్ని సూచిస్తూనే కృష్ణాతీరాన సన్నివేశాలెన్నో ఈనాటికి నిలిచివున్నాయి. ఏదైనా ఒక జాతియొక్క సుదీర్ఘ చరిత్రకు నదులు, పర్వతాలే జ్ఞాపికలుగ నిలుస్తూ ఆ చరిత్రను స్మరింపచేస్తూంటాయి. సరయూనది, చిత్రకూట పర్వతాలు శ్రీరాముడిని, యమునానది, గోవర్ధన గిరులు శ్రీకృష్ణుని గుర్తింపచేస్తాయి కద అలాగేనన్నమాట.

కృష్ణానదీ తీరానగల సుప్రసిద్ధ భగవదాలయాలలో విజయవాడలోని శ్రీ దుర్గదేవస్థానము సుప్రసిద్ధమైనది. ఆ ప్రక్కనే నదికిరువైపుల కల ఇంద్రకీలాద్రి విజయకీలాద్రి పర్వతాలు ప్రసిద్ధమైనవి. వీటినన్నింటికి చారిత్రాత్మకమైన ఓ సంబంధమున్నది. కృష్ణానది కేవలము భగవానుడైన శ్రీమన్నారాయణుని సేవార్థమై ఆవిర్భవించింది. దానికొరకే జీవించింది. ఆ నదీమతల్లికి ప్రతిరూపమే ప్రక్కనున్న కొండపై ఆరాధించబడే శ్రీ దుర్గమ్మ.

బ్రహ్మ, రుద్ర, ఇంద్రాది దేవతలంతా ఎప్పుడెప్పుడు అసుర పీడ ఏర్పడినా పాలకడలికి పోయి శ్రీమన్నారాయణుని ప్రార్థిస్తూంటారు రక్షించుమని. వారికి ఆయన కన్పడడు. అశరీరవాణి కర్తవ్యాన్ని బోధించి తానెలా అవతరిస్తానో వారు దానికేవిధంగ రంగం సిద్ధం చేయాలో ఆజ్ఞాపించి పంపేస్తూంటుంది. ప్రాయశః ఇది ప్రతి అవతారానికీ నాంది అనుకోవచ్చు. కృష్ణావతారానికి ముందుగూడ ఇలాంటి సంఘటన జరిగింది. గోరూపంలో నున్న భూమితో పాటు అందరూ వెళ్ళి ప్రార్థించారు భగవంతుని. ఒక్క చతుర్భుజునికే భగవదాదేశం ఉపదేశం గూడా విన్పడ్డాయి. ఆయన మిగిలిన వారికి



ఆ ఆజ్ఞను విన్పించి కృష్ణునిగ స్వామి అవతరించ బోతున్నాడని ఓదార్చి వెనుదిరుగుతాడు దేవతలతోపాటు. ఆ సందర్భాన్ని తెలిసిన శ్రీవ్యాస భగవానుడొక శ్లోకంలో ఒక రహస్యాన్ని చెప్పాడు.

విష్ణోర్మాయా భగవతీ యయా సమ్మోహితం జగత్ । అదిష్టా ప్రభుణాంశేన కార్యార్థే సంభవిష్యతి ॥ 10-1-26.

ఎప్పుడెప్పుడు భగవానుడగు విష్ణువు తనకవసరమని తలచునో అప్పుడు తన అంశయైన యోగమాయను ఆయా రూపాలను దాల్చుటకై ఆజ్ఞాపించును. లోకాలను ఆశ్చర్యకరమైన శక్తితో మోహింపజేసి భగవత్కార్యాన్ని సాధించి, అనుగ్రహాన్ని పొందుతూ ఈ లోకంలోనే ఉంటూంటుంది. యోగమాయ భవదాజ్ఞాపాలన కయ్యే, ఆమె శ్రీమహావిష్ణువు అనుమతి పొంది ఈ లోకంలో సంచరిస్తూ ఉంటుందట. చెప్పిన పనిని పూర్తి చేస్తోంటుంది.

"సందిష్టైరనం భగవతా తథేత్యోమితి తద్వచః। ప్రతిగృహ్య పరిక్రమ్య గాం గతా తత్తథాఽకరోత్" (భాగ. 10-2-13)

యోగమాయ యొక్క సామాన్య కర్తవ్యము నీ శ్లోకం తెలియచేస్తోంది. అలాగే కృష్ణావతారానికి ముందుకూడ భగవానుడు తన కార్యార్థమై యోగమాయను ఆదేశించాడు. **'గచ్ఛ దేవి ప్రజం భద్రే...'**భాగ. 10-2-6) అంటూ ప్రారంభించి యోగమాయను దేవకీదేవి యొక్క 7వ గర్భాన్ని జాగ్రత్తగ వెలికితీసి రోహిణీదేవి గర్భంలో ప్రవేశపెట్టమనీ, ఆ గర్భంవల్ల పుట్టినవానిని బలభద్రుడు, బలరాముడు అంటారని, ఆ తర్వాత యశోద వద్ద స్త్రీ శిశువుగ పుట్టమని తాను జైలులో పుట్టి మిగిలిన పనిని చక్కబెడతానని ఆదేశించి ఇలా తన కార్యానికి ఉపకరిస్తూ ఉన్నందువల్ల లోకులందరిచే పూజింపబడుతూ, వారిచ్చే వివిధ బలులను స్వీకరించి, వారి కోర్కెలను గూడ ఈడేర్చేదానవౌతావని, అట్టి యోగమాయను వివిధ స్థానాలలో వివిధ పేర్లతో పిలుస్తూ లోకులారాధిస్తారంటూ ఓ 14 పేర్లను తానే చెప్పాడు. (భాగ. 10-2-10వ శ్లోకం నుండి)

"నామధేయాని కుర్వన్తి స్థానాని చ నరా భువి। దుర్గేతి భద్రకాళీతి విజయా వైష్ణవీతి చ ॥ (10)

కుముదా చండికా కృష్ణా మాధవీ కన్యకేతిచ । మాయా నారాయణీశానా వారదే త్యంబికేతి చ ॥ (11)

భగవదాజ్ఞచే శ్రీకృష్ణావతార సమయంలో తన కార్యాన్ని సక్రమంగ ముగించింది యోగమాయ. 'నిన్ను చంపేవాడు పుట్టినాడురా!' అంటూ నానా చివాట్లూ వేసి అంతర్ధానమైంది. ఈ రకంగా యశోద పుత్రికగ పుట్టి శ్రీకృష్ణుని వద్ద యోగమాయ, సోదరి స్థానాన్ని సంపాదించుకుంది. ఆనాటినుండే శ్రీకృష్ణసోదరి అయింది. అయితే అప్పుడే ఆమె బాధ్యతలు పూర్తికాలేదు. అసలప్పుడే ప్రారంభమైనాయి. ఆ అవతారం చివరిదాకా ఆమె తన సేవలందిస్తూనే ఉంది.

కంసవధానంతరం తన భవిష్యత్కార్య రంగాన్ని సిద్ధం చేసుకోవడానికి భగవానుడిచ్చిన 'దుర్గ' అనే మొదటిపేరును ధరించి ఇంద్రకీలాద్రి పర్వతాన్ని తన స్థావరంగా ఏర్పాటు చేసుకొంది. క్రిందుగ తానే ఒక నదీరూపాన్ని ధరించి నీలికాంతులీనుతూ ప్రవహించనారంభించినది. దానికి భగవానుడనుగ్రహించిన 7వ నామాన్ని వినియోగించుకొని 'కృష్ణ'గ ప్రసిద్ధి చెందింది. 'కృష్ణా అంటే నీలిరంగు కలది అని అర్థం'. నది అనగానే ఒక ఉత్పత్తి స్థానమంటూ ఉండాలి గనుక సహ్యాద్రిని ఉత్పత్తిస్థానంగా చేసుకొని ప్రవహించింది. ఇది రాబోయే భారత సంగ్రామానికి ముందు ఇంద్రకీలాద్రి మీద శ్రీకృష్ణుని ఆజ్ఞతో అస్త్రమును సంపాదింపవచ్చే అర్జునుని పరిచర్యకోసం ఏర్పరచుకొన్న స్థానం. ఇది ఇలా ఉంచి ద్రుపద రాజ్యానికి పోదాం.

ద్రోణునిమీద కోపంతో అతణ్ణి చంపగలిగే కుమారుడు కావాలని ద్రుపదుడు తపస్సుద్వారా వరమంది యజ్ఞము నాచరించాడు. యజ్ఞకుండం నుండి ధృష్టద్యుమ్నుడు ఆవిర్భవించాడు. అతడేకద తర్వాత పాండవసేనానిగ ఉన్నాడు! అప్పుడు యజ్ఞకుండంలో ద్రుపదుడు కోరకపోయినా ఒక స్త్రీ గూడ అవతరించింది. ఆమె నీలికాంతులీనుచు, అతిలోక సౌందర్యమున కాకరమనదగి ఉండటంవల్ల ఆమెను 'కృష్ణా' అని పిలిచారు. యజ్ఞంలోంచి రావడంవల్ల 'యాజ్ఞసేని' అయింది. ద్రుపదుని పుత్రికగ ఆమె పెరగడంవల్ల 'ద్రౌపది' అయింది. శ్రీకృష్ణుడు భారత సంగ్రామంలో కీలకపాత్ర వహించడంలో ఆమెనే ప్రధానసాధనంగా చేసుకొని, ఆమెకోసమనే ఇంతా చేసాడని భారతం చదివిన వారికి తెలుసును. ఆమెయే 'యోగమాయ'. అర్జునుడామెను వివాహమాడేట్లు చేసినవాడు శ్రీకృష్ణుడే గద! ఆమెవల్లనే మాయాజూదం, ఆమెవల్లనే అసూయాపరులైనారు కౌరవులు. సంధి చెడగొట్టి యుద్ధం జరిపిస్తానని, ఆమె చేసిన దుశ్శాసన వక్షస్సును చీల్చుట, దుర్యోధనుని తొడవిరచుట అనే రెండు ప్రతిజ్ఞలు తీరేట్టే రంగాన్ని నడిపిస్తానని అంటాడు. అలానే చేసాడు శ్రీకృష్ణుడు. అంటే యోగమాయ యొక్క ప్రభావానికి లోనైన కౌరవులు తెలివిమాలిన వారిగ ప్రవర్తించి తమ మృత్యువుకు తామే కారణమైనారని మనం గుర్తించాలి.

అర్జున పత్నిగ ఉన్న 'కృష్ణ' నామధేయ అయిన ఆమెయే ఇంద్రకీలాద్రి ప్రక్కనుండి ప్రవహిస్తోంది. కొండపై దుర్గగ వెలిసింది. పాశుపతాస్త్రాన్ని సంపాదించ బయలుదేరిన అర్జునుణ్ణి అందుకే



'విజయుడు' ఒకటిగద! ఆమెకూ 'విజయా' అనే పేరుంది. విజయా విజయు లిరువురూ వసించిన ఊరు 'విజయవాడ'.

ఆ విజయుడు తపస్సు చేస్తూ విహరించిన ప్రాంతమంతా విజయుని పేర 'విజయవాటిక'గా మారి ఉండవచ్చు. అలా అస్త్రార్జనలో పరోక్షంగా సహకరించింది 'కృష్ణా'. అలాగే వనవాస కాలంలో గూడ వేడిని చల్లారనివ్వకుండా పాండవులందరిని సూటిపోటిమాటలతో ఉత్తేజపరచినదీ ఆమెయే. యుద్ధకాలంలో రణభూమిలో విహరిస్తూ భయానక దృశ్యాలను చూపించి 'భద్రకాళీ' నామాన్ని సార్థకపరచుకొన్నది ఈ యోగమాయయే. ఇవన్నీ భగవానుని జగద్రక్షణ కార్యక్రమంలో భాగాలే.

ఇవన్నీ ఇలా ప్రదర్శిస్తూ ఆమె ద్వారానే మరో సత్యాన్ని చూపాడు లోకానికి. ఎన్ని కష్టాలు వచ్చినా కన్నవాళ్ళు, కట్టుకున్న వారెవ్వరూ రక్షకులు కారు. ఒక్క శ్రీకృష్ణ భగవానుడే సర్వులకూ రక్షకుడు. ఈ విషయాన్ని భగవద్గీతలో పదేపదే చెప్పుకున్నాడు స్వామి. దానిని ఆచరణలోపెట్టి స్వామి కార్యాన్ని సుగమం చేసినదీ కృష్ణయే.

సభామధ్యంలో శీల సంరక్షణ భర్తలు చేయలేకపోయారు. ద్రౌపది కృష్ణుణ్ణే నమ్మింది. కృష్ణుడే రక్షించాడు. దుర్వాసుడు ఆకలంటూ వంచనబుద్ధితో వస్తే వారిని శాంతంగా భర్తలు పంపలేకపోయారు. మళ్ళీ కృష్ణుడే ఆ పని చేయవలసి వచ్చింది. ఆమె విశ్వసించి పిలిచింది కనుక. అలాగే సైన్య సమీకరణంలో, అభిమన్యు, ఘటోత్కచవధలో, కర్ణవధలో, ద్రోణవధలో, దుర్యోధన వధలో ఒకచోటేమిటి చివరికి తమ వంశాంకురమైన ఉత్తరాగర్భం పాడైపోతే తిరిగి కృష్ణుణ్ణే ప్రార్థించగా పునర్జన్మనిచ్చి పరీక్షత్తుగ నామధేయాన్ని నిలిపి, ఇన్ని చేసిగూడ ద్రౌపదికి ఎంతో చేయవలసినదే. చేసినదంతా వడ్డీ క్రిందే తీరిపోయిందే, అసలు మొత్తం అలాగే మిగిలిపోయిందే, 'కృష్ణ' అనే తన పేరులో 'క్ ఋు, ష్ ణ' అనిగద ఉన్నది! ద్రౌపది రక్షణభారం తన మీద పెడితే ఆ భారం అధికమై, చేసినదంతా చాలక 'ఋణం'గ మిగిలిపోయింది.

'గోవిందేతి యదాక్రందత్ కృష్ణామాం దూరవాసినం, ఋణం ప్రవృద్ధమివమే హృదయాన్నాపసర్పతి'

అంటూ ఉద్ధవునితో చెప్పుకున్నాడు. శ్రీకృష్ణుడు అని విచారవదనారవిందుడైనాడు. చివరిలో, అంటే పూర్తి శరణాగతి

చేసినా, కనీసం ఆపదలలో వాటిని తొలగించమనైనా ఒక్కసారి భగవానుణ్ణి రక్షకుడిగా విశ్వసిస్తే వారి బాధ్యతనంతనూ తన భుజాలపై వేస్కొని రథమైనా త్రోలసిద్ధపడతానంటూ అన్నీ చేసి తృప్తిపడడు ఇంకా ఏమిటో చేయాలనుకుంటాడు అంత దయామయుడు స్వామి అని తెలుస్తుంది ఈ ద్రౌపదివల్ల. ఈ కృష్ణ వల్ల. అక్కడ ద్రౌపది దయాసాగరుడైన శ్రీకృష్ణుని లక్ష్యంగా ప్రవర్తించింది. ఆ కృష్ణయే ఒకనాడర్జునునికై వచ్చినా, ఆ యుగం తర్వాత వారికి గూడా ఆ సత్యాన్ని చాటుతూ వారిని భగవన్మార్గంలో నడపడానికి కృష్ణానదీ నామధేయంతో సాగరుని కభిముఖియై ప్రవహిస్తోంది. కనుక మిగిలిన నదులకంటే భగవంతునికి పరికరమై సహకరించడంలోగాని, భగవానుని అభిమానాన్ని పూర్తిగ చూరగొనడంలోగాని చరిత్ర సృష్టించుకోవడంలోగాని కృష్ణానదికుండే స్థానం అద్వితీయం. అనుపమం. కనుక ఆధ్యాత్మిక అద్వితీయం. అనుపమం కనుక ఆధ్యాత్మిక గుణపౌష్కల్యాన్నిచ్చే శక్తి ఈ కృష్ణానదికుంది. భగవదనుగ్రహ పౌష్కల్యాన్నిచ్చే శక్తికూడా ఈ నదికుంది. ఈ నదికి చెందిన వారమంటే చాలు భగవంతుడు మనకు ప్రత్యేకానుగ్రహాన్నిస్తాడు. ద్రౌపది పరాభవాన్ని చూస్తూ కూర్చున్న వాళ్ళందరినీ తుదముట్టించాడు స్వామి. పాండవులూ అలా చూస్తూ కూర్చున్న వారిలో చేరినవారే కద! వారికీకౌరవుల గతే పట్టి ఉండాల్సింది కానీ వారిని వదలివేసాడు భగవానుడు. ఎందుకు? ఏ ద్రౌపదికి సుఖం కలగాలనుకుంటున్నాడో ఆమెకి అది దుఃఖావహం కనుక. ఆమె కోసమే అర్జున సారథ్యం తప్ప అర్జునునిపై ప్రేమతో కాదు. అందుకే కృష్ణా నదీ సంపర్కం, సంబందం మనకుంటే చాలు. తత్ప్రతిరూపమైన దుర్గమ్మతోటి సంబంధం ఉంటే చాలు ఆమె సోదరుడైన స్వామి అనుగ్రహం మనమీద పుష్కలంగా కురుస్తుంది. మామూలుగనే ఈ నదికింత ప్రాముఖ్యమున్నపుడు, ఈ పుష్కర సమయంలో బృహస్పతి ప్రభావమెంతో తేజోవంతములై విరాజిల్లే నదీజలాలలో మనం స్నానమాడితే, భౌతిక, వైజ్ఞానిక పాత్రులు కాగలరనడంలో సందేహమేమీలేదు. అందుకే ఆ కృష్ణాజలానీవిధంగ వైదికరీతిలో ప్రార్థిద్దాము. **ఇదమాప ప్రవహతః యత్కిఞ్చ దురితంమయి యద్వా-హం అభిదుద్రోహ యద్వాశేప ఉతావృతం**। ఋగ్వేదము - 12-12-22



తెలిసియో తెలికయో మేము చేసిన దుష్కృతములు దేహమును అంటి ఉండును. తోటివారి విషయంలో బుద్ధిపూర్వకంగాగాని, ప్రామాణికంగా కాని శారీరకముగ చేసిన ద్రోహములు శరీరాన్ని అంటి ఉంటాయి. మానసికముగ వేసిన దుర్భావనలు పరులను నొప్పించు వాచకమైన దోషములు ఈవిధముగనే శరీరమును అంటి ఉండును. సుఖాన్ని అడ్డుకొని దుఃఖాన్ని కలిగిస్తాయి. వాటిని కడిగిఈ త్రికరణములను పరిశుద్ధము చేయగలిగినది 'జలము' మాత్రమే. హే నదీ ప్రవాహమా! నీయందు మునిగి స్నానమాచరించు నా త్రికరణములను పరిశుద్ధమొనరింపుము. నాలోని అన్ని దోషములను కడిగి పారద్రోలుము.

మం. ఆపో అద్యాన్వచారిషం రసేన సమగిస్మహి। పయస్వానగ్న ఆగహి తం మా సంసృజ సర్వసా। ఋగ్వేదము.

హే సుందర సలిలమా! స్నానార్థమై నీ యందు నేను ప్రవేశించుచున్నాను. విద్యుత్ ప్రవాహాన్ని సృజించు తేజశ్శక్తి నీలో కలదు. ఆ నీ దివ్య తేజస్సును నాలో నింపుము. నీ దివ్యకాంతితో నేను పునీతుడనై నీవలెనే నిర్మలుడనై ప్రకాశించెదనుగాక!

వరుణః ప్రవితా భువన్మిత్రో విశ్వాభిరూతిభిస కరతాం నసః సురధీసః ॥ ఋగ్వేదము - 12-9-6.

జలాధిష్ఠాన దేవతయైన వరుణుడు మనలకు రక్షకుడై కాపాడుగాక! మిత్ర శబ్దవాచ్యుడైన సూర్యుడుగూడ తన సర్వశక్తిచేత సర్వసాధనముల చేత మనలను బాగుగ రక్షించుగాక. మనలను ధనవంతులను గావించుగాక, సత్ సంపదలను ప్రసాదించుగాక.

అస్యంతర మృతం అప్సు భేష జమపామిత ప్రశస్తయే, దేవాభవతవాజినః॥ 12-11-19

స్వర్గవాసులు పానం చేస్తారని చెప్పే అమృతం జలమందు ఉద్భవించినదే. జలమునకుఉ అమృతత్వశక్తి యున్నది. శరీరమునకు చావు లేకుండ చేయునది అమృతము. జలమునకు గూడ అట్టి ఓషధీశక్తి యున్నది. ఆకలి తీర్చు అన్నము కూడ జలములవలన పుట్టినదే. "ఓషధీభ్యోఽఽన్నం, అన్నాత్ పురుషః" అని ఉపనిషత్ చెప్పుచున్నది. జలములను పవిత్రమైనవిగా ఆరాధించుట ద్వారా సర్వరోగనివారణఱు, దివ్యమైన దేహకాంతిని పొందవచ్చును.

జలప్రార్థన

ఆసః సృణీత భేషజం వరూధం తన్వేమము, జ్యోక్ప సూర్యం దృశే। ఋగ్వేదం 12-12-21.

రోగరహితమై పటుతర ఇంద్రియములతో కూడిన శరీరము కొఱకు దివ్యమైన ఔషధము జలము. అట్టి జలములను పరిశుద్ధముగా సేవింతును. ఓషధీ శక్తిగల పరివుద్ధ జలములను సేవించి దక్షురాది ఇంద్రియములను సమర్థవంతము గావించుకొందును. సూర్యునిచే వికసించు విశ్వమంతను పదికాలాలపాటు సేవించుచుండును. ('భక్తినివేదన' వేదాంత మాసపత్రిక 1992లో ప్రచురించిన 'కృష్ణాపుష్కర బ్రహ్మయజ్ఞ జ్ఞాపిక' నుంచి) ❖

పరమ పావనం... పుష్కరం

- తోటపల్లి బాలకృష్ణ శర్మ

శ్లో॥ పుష్కరాద్యాని తీర్థాని కృష్ణాద్య సరితస్థథా ।
ఆగచ్ఛంతు మహాభాగే స్నానకాలే సదామమ ॥

పర్వములలో పుష్కర దినములు మిక్కిలి పవిత్రములైనవిగా, శ్రేష్ఠములైనవిగా పురాణములు చెప్పుచున్నవి. ఈ పుష్కర కాలము 12 సంఖ్యతో భారతంలో కౌరవులతో పాచికలాడిన పాండవులు పరాజయం పొందిన కారణమున ఆ పుష్కర సంఖ్యయగు 12 సంవత్సరముల కాలము అరణ్యవాసమనుభవించిరని చెప్పబడెను. అనగా ఆ పుష్కర కాలము దాటితే, ఇక వారు పూర్వ ఆస్తిపాస్తులకు దూరమైనవారుగా లెక్కింపబడునట్లు భావన. అటుల ఆస్తి ఎవరి అనుభుక్తముగా వుండిన వారిదే ఆ ఆస్తియని అర్థము. పుష్కర కాలము దాటితే అనగా (దూరమైన వ్యక్తికి) పూర్వ బంధుత్వంతో సంబంధము వీడిపోయినట్లేయని చెప్పుటతో, ఆ పుష్కర కాలము ముగియకముందే ఎటులో వారితో సంబంధము కలుపుకొనుటకును అవకాశమివ్వ బడెడిది. అమ్మయ్యా! నిను జూడక పుష్కర కాలమయ్యెకదా! అని కౌగిలించుకొని ఆత్మీయతను తెలుపుకొందురు.

"పుష్కర" శబ్దమునకు "సరస్సు" అని, ఆకాశమని అందురు.

శ్రీ సుబ్రహ్మణ్యుని భార్యలగు వల్లీదేవి, దేవసేనలకును "పుష్కర" నామములు కలవు (అష్టోత్తరం). పుష్కరమను నది భూమండలములోని సప్త ద్వీపాలలో నొక ద్వీపమని పేరు. అదియే పుష్కర ద్వీపము. సామాజికంగా ఈ పుష్కర కాలము నదులకును "కుంభమేళ" ప్రాధాన్యత దేశంమొత్తము పరిగణింపబడుచున్నవి.

పుష్కర రాజమని, పుష్కరిణియనునది గుజరాత్‌లో గొప్ప సరస్సు కలదు. అచటే మహేశ్వరుని అంతు తెలుసుకొను యత్నములో విఫలుడైన బ్రహ్మ, తాను అంతు తెలుసుకొన్నానని పలికిన అసత్య దోషవాక్కుతో, ఆ పరమేశ్వరుని శాపమునకు గురియై అదియే 'భూమండలములో నెచటను బ్రహ్మకు పూజలుండవని' శాపం పొందిన బ్రహ్మ ఖిన్నుడు కాగా, విష్ణుమూర్తిగారి అనుమతితో బ్రహ్మదేవుడిచట తపస్సొనర్చుచుండ అచట గొప్ప సరస్సు ఏర్పడెను. అదియే అతి పెద్ద పుణ్య, పవిత్ర పుష్కర రాజముగా వెలిసెను. అందు స్నానమొనర్చిన, దాన, శ్రాద్ధాదులొనర్చిన బహు పుణ్య ఫలప్రదులగురని ఆ స్థలపురాణ ప్రశస్తి చెప్పబడెను. అటులే అచట బ్రహ్మ దేవునకును ఆలయమేర్పడి నిత్య పూజలొనర్చు సంప్రదాయమిప్పటికి కథ సాగుచున్నది. ఈ పుష్కరిణిలో ఏ జాతి స్త్రీ, పురుషులైనా స్నానమాడిన బ్రహ్మ జ్ఞానులౌతారు. ఈ పుష్కరిణి చుట్టూ వున్న ప్రదేశము అనగా అరణ్యములోని ఔషధముల, రాతి కొండలను ప్రసిద్ధి కెక్కినవైయున్నవి. ప్రత్యేకంగా ఈ పుష్కరిణికి ధనస్సు రాశిలో బృహస్పతి ప్రవేశంతో పుష్కర ప్రారంభముతో మొదలు అంత్యమువరకును మహిమ వుంటుందని "బ్రహ్మ పురాణము" చెప్పును.

ఒకప్పుడు 'తుందిలుడ'ను మహర్షి బహుకాలంగా తపస్సొనర్చి భగవత్ప్రుపకు పాత్రుడై 'పుష్కరుడ'ను పేరుతో ప్రసిద్ధుడయ్యెను. ఇతడు మూడున్నరకోట్ల తీర్థాలకు అధిపతయ్యెను. పుష్కరమంటే 'జలం' భగవంతుని అష్టమూర్తులలో పంచ భూతాలు, మనస్సు, బుద్ధి, అహంకారంతో 8 కాగా ఇందులో జలం ఒకటి.

తుందిలుడు భగవంతుని యొక్క జలరూపాన్ని పొందడంతో అతడు పుష్కరుడని ప్రసిద్ధికెక్కెను. బ్రహ్మ తపస్సొనర్చి భగవంతుని మెప్పించి సృష్టికార్యములో ఈ పుష్కరుడు తనకు ఉపయోగపడతాడని, అందుకై ఇతనిని తనకిమ్మని వేడగా భగవంతుడు సమ్మతించెను. జలరూపముతో నున్న పుష్కరుడ్ని తన కమండలములో నుంచెను. జలం వరుణుడే కదా! ఆ వరుణ పుత్రుడను కూడా పిలుస్తారు. బ్రహ్మ తన కమండలమునందున్న పుష్కర జలము సర్వతీర్థ దివ్యశక్తులతో 12 రోజులు ఆయా పుణ్య నదులలో ప్రవేంశించగా, ఆ నదీ జలాలు పవిత్రమై, తేజోవంతమై వెలుగుచుండును. ఈ తేజస్సు జ్ఞానానికి ఉపలక్షణము. భూమికంటే జలము తేజోవంతము. కనుక విద్యుత్తు ఈ జలముతోనే ఉత్పత్తియగును. అట్టి తేజోవంతమైన పుష్కర స్నానంతో మానవులును తేజోవంతులగుదురని, పునీతులై, ఆరోగ్యవంతులై, బాహ్యాభ్యంతరంగా పరిశుద్ధులగుదురనియు శాస్త్ర వాక్కు.

ఈ పుష్కరుడు మనావరుణులకుమారుడని 'శివపురాణము' వెల్లడించును.

'పుష్' అనే ధాతువునుండి 'పుష్కర' శబ్ధము ఏర్పడినది. ఈ శబ్ధానికి పోషణమని అర్థము కూడా కలదు. పుష్కర శబ్ధానికి మరొక పేరుగా తామర పుష్పము, తామర కాడ, తామరాకు అని అర్థాలు కూడా చెప్పబడినవి. సంసార సాగరములో జ్ఞాని అయినవాడు తామరాకుపై నీటిబొట్టులాగా ఉంటాడని ప్రసిద్ధి. పుష్కరుడును నదిలో ప్రవేశించిన తదుపరి జీవులస్నానాలతో వారి పాపాలంటకుండా నిరంతరం పవిత్రంగా యుంటాడని ప్రతీతి.

ఇటులా పుష్కరుడను బ్రాహ్మణుడు బ్రహ్మనుగూర్చి తనపేరిట పుష్కర నామ సరస్సుగా వెలయు కోరికగా తపస్సొనర్చగా, బ్రహ్మ అతనిని ఒక తామర (పుష్కర) పుష్పముగా మార్చెను. కొంత కాలానికి ఆ పుష్కర పుష్పమును గైకొని బ్రహ్మ దేవుడు భూలోకములో పయనించుచు అచట యజ్ఞమొనర్చ సంకల్పించి యుండగా ఒకచోట సుందరవనమును జూచి ముగ్ధుడై కొంతసేపు అచట నిలిచి తనచేతిలోని పుష్కర పుష్పమును ఆ నేలపైకి విసరివేసెను. అచట ఒక బహుధ్వనితో ప్రళయము పుట్టగా, ఆ ధ్వనికి దేవతలు చకితులై ఆ బ్రహ్మనే ఈ అకారణ ధ్వని యేమిటని ప్రశ్నించిరి. బ్రహ్మ వారి ప్రశ్నతోనిట్లు వివరించెను.

పూర్వమొకపరి వజ్రనాభుడను రాక్షసుడు తనను గూర్చి తీవ్ర తపస్సొనర్చి మెప్పించి తనకు మరణములేకుండనట్లు వరమివ్వమని కోరెను. అదెట్లు సాధ్యమని నేను పలుకగా ఆ రాక్షసుడు 'నేను పుష్పముగా మార్చబడిన తపస్వి చేతిలో తప్ప మరొకరి వలన మరణము కలుగకుండుగాక యని కోరగా నేను 'తథా–స్తు' అని పల్కిన కారణాన యిప్పుడా పుష్ప పతనంతో తగిలి ఆ రాక్షసుడు గతించెను. వాని శిరస్సు పగిలిన కారణాన ఈ భీకర శబ్దాన్ని మీరు విన్నారని చెప్పెను.

ఆ తామర (పుష్కర) పుష్పము పడినచోట ఒక గొప్ప జలతీర్థము పుట్టినది. అదే పుష్కరిణి నదీ తీర్థముగా ప్రసిద్ధి చెందినది. ఈ పుష్కరిణి నదీస్నానము కూడా అత్యంత పవిత్రము పుణ్య ప్రదమునిచ్చు నదిగా ప్రసిద్ధికెక్కెను.

అదియే బృహస్పతి ధనస్సు రాశిలో ప్రవేశించినప్పుడు ఆ పుష్కరిణి నదికి 12 రోజులుగా పుష్కరాలు వచ్చును. ఈ నది రాజస్థానంలోని అజ్మీర్‌కు సుమారు 12 కి.మి. దూరంలో కలదు. అదియే పుష్కర రాజమని మనం పూర్వం చెప్పుకొన్నాము.

ఇక ప్రతివత్సరమొచ్చు పుష్కరము కేవలము 12 రోజులకాలము. పుష్కర శబ్దమునకర్థమును 12 రోజులే.

మరొక కథగా:– పూర్వము "పుష్కరుడ"ను బ్రాహ్మణుడు కఠిన తపమాచరించి పరమేశ్వరుని మెప్పించి ప్రసన్నము గావించుకొని, తనకొక పవిత్ర జలరూపమును, పవిత్రసిద్ధిని అనుగ్రహించమని ప్రార్థించెను. శివుడట్లేయని అనుగ్రహించెను. అటులా ఈశ్వరుని అష్ట మూర్తులలో పుష్కరుడొకడయ్యెను. ఆ పిమ్మట పుష్కరుడు బ్రహ్మదేవుని కడకేగి ఈశ్వర దత్త ప్రసాద విషయము (అనగా పవిత్ర జలతత్త్వశక్తిని) తెలిపి, ఆ బ్రహ్మగారి కమండమున నివాసముండునట్లు వేడుకొనెను. బ్రహ్మయు తన కమండలమున పుష్కరుడుండునట్లు అనుమతించెను.

దేవతలగురువైన బృహస్పతి పరమ పూజ్యుడు అఖండ మేధాశక్తి కల్గినవాడు. తపస్సొనర్చుటలో బ్రహ్మతో సమానుడు. నిష్ఠా గరిష్ఠుడైన బ్రాహ్మణోత్తముడు. అనేక ధర్మ శాస్త్రాలు తెలిసినవాడు. ఇతడు బంగారు దేహచ్ఛాయ కల్గినవాడు. వేద వేదాంగములసారాంశమును దేవతలు ఈ బృహస్పతి ద్వారానే తెలుసుకొన్నారు. అందువలన బృహస్పతికి "గురువు" అని నామమేర్పడినది. దేవతలతో కలిసిమెలసి యుండువాడు. నదీజలాలను ప్రభావితమొనర్చె బృహస్పతి నవగ్రహాలలో శుభ గ్రహంగా, అనుగ్రహము కలగ్రహము. ఇతడు విద్యను, ఉన్నత స్థానాదులను నిచ్చువాడని జ్యోతిశ్శాస్త్రము చెప్పుచున్నది. ఈ బృహస్పతికి నీటికి కలసంబంధముగా, తీర్థాధిపతియని ఋ॥ 1 మం॥, 24 అను॥, 190 సూ॥లో ఇట్లు చెప్పబడినవి.

'ఏవా మాహస్తు విజా తస్తు విష్మాన్ బృహస్పతిర్వృషభో ధాయి దేవః' పూజ్యుడుగా, వర్ష ప్రదాయకుడుగా మరియు 'బృహస్పతిస్తర ఆపశ్చ గృధ్రః' ॥

వృష్టి నపేక్షించువాడు, సర్వజ్ఞుడు, ఉపకములను కల్గించువాడుగా బృహస్పతి పేర్కొనబడెను.

బ్రహ్మ తపస్సొనర్చి భగవంతుని మెప్పించి సృష్టికార్యములో ఈ పుష్కరుడు తనకు ఉపయోగపడతాడని, అందుకై ఇతనిని తనకిమ్మని వేడగా భగవంతుడు సమ్మతించెను. జలరూపముతో నున్న పుష్కరుడ్ని తన కమండలములో నుంచెను. జలం వరుణుడే కదా! ఆ వరుణ పుత్రుడను కూడా పిలుస్తారు. బ్రహ్మ తన కమండలమునందున్న పుష్కర జలము సర్వతీర్థ దివ్యశక్తులతో 12 రోజులు ఆయా పుణ్య నదులలో ప్రవేశించగా, ఆ నదీ జలాలు పవిత్రమై, తేజోవంతమై వెలుగుచుండును. ఈ తేజస్సు జ్ఞానానికి ఉపలక్షణము. భూమికంటే జలము తేజోవంతము. కనుక విద్యుత్తు ఈ జలముతోనే ఉత్పత్తియగును. అట్టి తేజోవంతమైన పుష్కర స్నానంతో మానవులును తేజోవంతులగుదురని, పునీతులై, ఆరోగ్యవంతులై, బాహ్యాభ్యంతరంగా పరిశుద్ధులగుదురనియు శాస్త్ర వాక్కు.

పుష్కరునితో నున్న బృహస్పతి గూర్చి 'గోపథ బ్రాహ్మణ'ములో నిట్లు చెప్పబడినది. జలాధిపతియైన వరుణుడుని కుమారుడు ముచ్యుడు. ఇతనికే మృత్యువు అని పేరు. ఈతని దేహమునుండి రసాలు స్రవించినవి. ఈ రసమునుండి పుట్టినవాడే 'అంగీరసుడు'. ఇతని కుమారుడే బృహస్పతి. బృహస్పతి పుట్టిన సంవత్సరము అంగీరస నామము.

ఒకనాడు ఈ బృహస్పతి ఆ దేవలోకమును వదిలి భూలోకముననున్న కైలాసము తుల్యమైన కాశీకి చేరుకొని అచటి విశ్వేశ్వరుని దర్శించి, గంగానదీ తీరములో తపధ్యానములో నిమగ్నుడయ్యాడు. అప్పుడాతడు మరో సూర్యునివలె ప్రకాశించుచుండెను.

ఇది యుట్లుండ, కొంత కాలమునకు బృహస్పతి (గురువను గ్రహము) బ్రహ్మనుగూర్చి తీవ్ర తపమాచరించి జలమయత్వ సిద్ధిని పొందిన పుష్కరుడు తనతో నుండునటులవరమడిగెను. అందులకు బ్రహ్మకమండము నందున్న పుష్కరుడందులకంగీకరించకపోగా, బ్రహ్మ వారిద్దరి పలుకులువిని, ఉభయతారకంగా పుష్కరునితో నిట్లనెను. ఈ బృహస్పతి సంవత్సరముకొక రాశియందు ప్రవేశించియుండును. అటులా సంవత్సరములో ఏరాశియందు బ్రహస్పతి ప్రవేశించి యుండు ఆ నదికి పవిత్రముండునటులఆ పుష్కరుడందు జలమయత్వ సిద్ధిగా, ఆ రాశి ప్రవేశమునుండి ఆద్యన్తములుగా అనగా 12 రోజులు ఈ బృహస్పతితో నుండ తగునని పుష్కరునికనుజ్ఞ యిచ్చెను. అందుకు పుష్కరుడంగీకరించగా, బ్రహస్పతి సంతోషించి మరలబ్రహ్మదేవునినిట్లు ప్రార్థించెను. పుష్కరుడు తనతో ఆ పుష్కర (12) రోజులలో ప్రతి రోజు రెండున్నర ఘడియలు మధ్యాహ్న కాలమున నుండునటులకోరగా ఆ పరమేశ్వరుడు పుష్కరుని అటులే సమ్మతింపజేసెను. పన్నెండు సంవత్సర కాలమొక పుష్కరం ఏర్పడును.

పుష్కరుడు ప్రవేశించిన నదికి పుష్కర నదిగా, సకలతీర్థాలమహిమలు అందు నివసించినదైన కారణాన ఆ నదులలో ముక్కోటి దేవతలు

అనుదినమును ఉషోదయ కాలముననే స్నానమాచరించి వెళ్ళుదురు. పుష్కర ఆవాహనముతో ఆ జలతత్త్వశక్తితో మూడు కోట్ల యాభై లక్షలతీర్థాలకును పావనత్వము పొందడమయ్యెను. కావున ఆ నదులజలం మహా మహిమాన్వితములై ప్రవహించుచుండును.

నదులస్నానమొనర్చుటె గొప్పదనంగా ఆపాదింపబడినది. అయితే జీవులపాపపంకిలభరితమైన నదులు తిరిగి పునీతము పొందుటకే సంవత్సరమునకొకసారి పుష్కర ఆగమనముతో, ఆ నదియందు స్నానమొనర్చు జీవులును పునీతులగుదురు. కావున స్నానములలో ఉత్తమం పుష్కరస్నానము. ఆ పుష్కరస్నానములో బాహ్య శరీరము శక్తివంతమగును. ఈ పుష్కర స్నానము శుక్ల పక్షములో, ప్రత్యేక పూర్ణిమనాడు స్నానముచేసిన మానసిక శక్తి సమృద్ధమగును. ఇక అమావాస్యనాడు సూర్యుని నదీ క్షేత్రములలో తన ప్రభావముండును. గనుక ఆనాటి స్నానము పైతృక శక్తి వృద్ధి చెందును. మానవునిలోని శారీరక, మానసిక, ఆధ్యాత్మిక దోషములు ఆ నదీస్నానముతో అవి జలమందు సంక్రమించి ప్రవాహ భ్రమణములతో ఆత్మ శక్తి వృద్ధితో బాటు దేహశుద్ధియగును. సంవత్సరమునకొకసారైనా వచ్చు పుష్కరస్నానమొనర్చుటతో మానవునకు సంపూర్ణ పుణ్యఫలప్రాప్తి పొందుటగును. పుష్కరయుతమైన నదిలో స్నానమొనర్చడం మౌలికమైన ధార్మిక విధిగా దైవ పితృ కార్యక్రమాలు జరపడం ఆధ్యాత్మికంగా హైందవ సంప్రదాయం శుభప్రదం, మంగళప్రదము కూడా. పుష్కర కాలములో నదీ స్నానం చేయడం మన మాతృభూమిపట్ల, మాతృ సంస్కృతి పట్ల మన నిష్ఠకు నిదర్శనము. ఇదొక మానవులసత్కర్మాచరణమని, పాప ప్రాయశ్చిత్తకరంగా స్మృతులు చెప్పును. ఆయా నదులలో పుష్కరుడు ప్రవేశించిన కారణంగా అట్టి నదులస్నానం పుష్కరస్నానమని చెప్పబడెను. శరీర శుద్ధితో మనోబుద్ధియును ఈ పుష్కరస్నానము వలన కలుగును. మనస్సునకధికారి బుద్ధి. 'మనస్సస్తు పరా బుద్ధిః', బుద్ధికి అధిష్ఠాన దేవత బృహస్పతి. ఆ బృహస్పతి రాశి మార్పునుబట్టి ఆ రాశి నదికి పుష్కరము వచ్చునని ఆ నదిలో పుష్కరుడు నివసించియుండునని నియమమేర్పడెను. అదియే పుష్కరిణి నదియని పుష్కరోత్సవ దినములని చెప్పబడెను.

శ్లో॥ జన్మప్రభృతి యత్పాపం, స్త్రియావ పురుషేణవా ।
పుష్కరే స్నానమాత్రస్య, సర్వమేవా ప్రణశ్యతీ ॥ (మహాభారతం)

భావం: జన్మించినది మొదలు ఇప్పటివరకు చేసిన పాపాలన్ని తొలగుటకు స్త్రీలైనా, పురుషులైనా సరే పుష్కర కాలంలో స్నానమొనర్చవలెను. అని పుష్కర మహిమ కీర్తించబడినది.

పుష్కరము ముందు వచ్చు 12 రోజులకాలమున పవిత్ర పుష్కర కాలమని చెప్పుదురు. ఏ రోజైనా మధ్యాహ్నం నాలుగు ఘడియలు (96 ని॥లుగా) అభిజిల్లగ్నం (మధ్యాహ్నం 11 గం॥ 45 ని॥ నుండి 12 గం॥ 15 ని॥లవరకు గల) సమయములో స్నానమొనర్చినను పుష్కరస్నానమనబడును. కారణం ఆ సమయంలో పుష్కరుడు బృహస్పతి ఆధీనములో ఉంటాడుగనుక.

పుష్కర మహిమ అమోఘము, సాటిలేనిదిగా జెప్పబడెను, అనగా ఆ నదీ జలములందు ఆయా పుణ్య కర్మలాచరించిన వారి పాపములు తొలగి, సత్సంతాన సౌభాగ్యములు పొంది, ఆయురారోగ్యప్రదులై, సుఖ సంతోషాలతో నుందురు.

అందుకే అన్నారు – "పుష్కర కాలము పుణ్యమొసగు కాలమని", పుష్కర దేవుని సేవించిన, ప్రార్థించినను, పుష్కర మహిమను విన్ననూ, ఆ దేవతలదీవెనలతో భక్తులు ధన్యజీవులగుదురని వినతి.

శ్రీ కృష్ణా పుష్కరాల ప్రశస్తి

పూర్వము నైమిశారణ్యమున శౌనకాది మునులెల్లరు సత్యయాగ మొనర్చుచుండ అచటికి సూతముని ఏతెంచెను. అచటివారెల్లరు వారికి నమస్కరించి బహుగా ఆహ్వానించి అపరిమితంగా ఆదరించిరి. తదుపరి లోక శ్రేయస్సు సంకల్పంతో పాప పంకిలమందు మునిగిన మానవకోటి సత్వరం విముక్తిపొందుటెట్లని ప్రశ్నించిరి. శూతుడిట్లు చెప్పనారంభించెను. పూణ్యపురుషులారా! మానవుల సర్వపాప మలినం నివారణకై పుష్కరమను జలాల్లో స్నానమాచరించవలెను. అట్టి పుణ్య జలము మన భారతావనిలో అనేక జీవనదులుగా ప్రవహించుచున్నవి. అవియే గంగ, గోదావరి, కృష్ణ, కావేరి మొదలగునవి. ఆ నదులలో స్నానమాచరించిన వారి పాపములన్నీ తొలగునని పురాణములు తెలుపుచున్నవి. ఆయా నదుల జలము పుష్కర కాలములో మరింత మహామహిమాన్వితములనియు పేర్కొనబడినవి. ఆ పుష్కర సమయమున ఆయా నదులలో స్నానమాచరించుటను బహుపుణ్య ఫలప్రదమని చెప్పుకొన్నాము పూర్వము.

కాలక్రమముగా ఈ దుర్ముఖి నామసంవత్సరములో పుష్కరునితో బృహస్పతి కన్యారాశిలో ప్రవేశించుటతో కృష్ణా నదికి పుష్కర కాలము శ్రావణశుద్ధ అష్టమి గురువారము తేది 11-8-2016 నాటి రాత్రి 9 గంటల 28 ని॥లకు సార్ధ త్రికోటి తీర్థరాజ సహిత కృష్ణానది పుష్కరాల ప్రారంభముతో, మరునాటి శుక్రవారము తేది 12-8-2016న సూర్యోదయమునకు ముందుగా బ్రాహ్మీ ముహూర్తకాలముతో స్నానమొనర్చుట ప్రారంభించవలెను. ఈ పుష్కర కాలము 12 రోజులుగా బహుళ షష్టి తేది 23-8-2016 వరకుండును. కావున సర్వులు పవిత్ర స్నానములొనర్చుచు తమ తమ పితృ కార్యములొనర్చుటలో శ్రాద్ధాదులు, తర్పణాదులు, ధానాదులోనర్చుటలో తామూ తరింపబడి పితృ వర్గములను కూడా తరింపజేయుదురు.

కృష్ణావిర్భావము: పవిత్ర కృష్ణానది పుట్టుక గూర్చి స్కాంధ, పద్మ, బ్రహ్మాండ పురాణములలో వివరించినట్లు సూతుడిట్లు వివరించెను. బ్రహ్మయొక్క సృష్టితో పరోపకార బుద్ధికి సంతసించిన విష్ణువు బ్రహ్మతో నిట్లనెను. కుమారా! మానవులను తరింపజేయు పవిత్ర జలపూర్ణతయగు కృష్ణానదిని సృష్టిస్తున్నానని తెలిపి, అందు స్నానమొనర్చినవారెల్లరి జన్మ పునీతములగునని వివరించెను.

భారతావనిలోని మహారాష్ట్రములో మహాబలేశ్వరము ఒక పవిత్ర క్షేత్రము, మిక్కిలి చారిత్రాత్మకంగాను ప్రసిద్ధ ప్రదేశంగాను చెప్పబడుటలో

ఒక పురాణ గాథ కలదు. పూర్వము రావణాసురుడు తన తపశ్శక్తితో పరమేశ్వరుని మెప్పించి ఆత్మ లింగాన్ని పొంది వెళ్లుచుండగా, దారిలో సంధ్యాకాలమాసన్నం కాగా అచటేనున్న వటువు రూపములోనున్న విఘ్నేశ్వరుని చేతిలో ఆ ఆత్మ లింగాన్నుంచి వెళ్లెను. కాని విఘ్నేశ్వరుడు రావణునకు అది దక్కకుండునట్లు నటించు నెపములో కాలయాపన జరిగినదని ఆ లింగాన్ని తన సంకల్ప బలంతో అక్కడే భూమిపై యుంచి మాయమయ్యెను. రావణుడు సంధ్యా కార్యక్రమం నిర్వహణతో తిరిగి రాగా, వటువు లేక పోవడం, శివుని ఆత్మ లింగం అచటనే ప్రతిష్టింపబడుటను జూచి విచారించి పెకలించుటకును తన బలాన్నంతయు ప్రయోగించి ప్రయత్నించి విఫలుడయ్యెను. తుదకు నిరాశతో లంకకు చేరెను.

అట్లు శివలింగ ప్రతిష్టమవడంతో ఆ స్థలానికి మహాబలేశ్వరమను సార్థకనామ మెర్పడెను. ఆ లింగము గోకర్ణాకృతి యుండగా ఆ స్థలము గోకర్ణేశ్వరంగా పేరొందినది. అందుండి పారిన జలము కృష్ణ వర్ణములో నుండుటతో కృష్ణా నదిగా ఒక జల పాయ రూపముతో నుండుటతోనూ వేణి అని, మహారాష్ట్రములోని అది సితారా జిల్లాలో వేణి నదిగా పిలవడంతో, ఈ రెండును సంగమించుటతో 'కృష్ణవేణి' నదిగా పేరొందెను.

మరొక కథగా – లోకులను తరింపజేయు యత్నములో శ్రీకృష్ణ పరమాత్మ సహ్యాద్రిపైనున్న రావి (అశ్వత్థ) వృక్ష రూపములో నిలువగా ఆ వృక్షపు వేళ్లనుండి జలము చిన్న నదిగా ప్రవహించడంతో ఆ జలము కృష్ణ (నల్లని) రూపములో నుండిన కారణంగా కృష్ణానదిగా పేరొందినదొక కథ.

మరొక కథగా – మానవుల పాప ప్రక్షాళనమొనర్చు సంకల్పముతోనున్న మునులు పరమేశ్వరుని ప్రార్థించగా స్వామి లింగాకారంగా ఆ ప్రాంత సమీపమున వెలసెను. అచటనున్ననొక ఆమలక (ఉసిరిక) వృక్షపు వేళ్లనుండి జలము వేణీ రూపములో వెలయగా, ఆ కృష్ణానదితో నిది ఏకమై 'కృష్ణవేణి' నదిగాను ప్రసిద్ధి చెందెను. దాంతో కృష్ణవేణి నది శివకేశవ సంగమ నదిగా పేరొందినది. ఈ కృష్ణవేణి మన రాష్ట్ర యింటి అలివేణియై విరాజిల్లుచున్నది.

ఈ కృష్ణానది జీవన గంగా ప్రవాహముగా పౌరాణిక ప్రాశస్త్యముతో అచటినుండి సుమారు 306 కి.మీ. కర్ణాటకలో సుమారు 482 కి.మీ. ప్రవహిస్తు మన తెలంగాణ రాష్ట్రముగుండా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రములోనూ 622 కి.మీ.గా ప్రవహిస్తున్న పుణ్య నది యిది. ఈ నది పౌరాణిక ప్రాశస్త్యముతో పయనిస్తూ కుదుద్‌మతి, సావిత్రి, గాయత్రీ, పర్ణ, పంచగంగ, భీమ, తుంగభద్ర, మూసి, మున్నేరు వంటి ఎన్నో ఉపనదులతో కలిసి శ్రీశైలం వద్ద కాస్త విశ్రాంతి పొంది, మరల నాగార్జున కొండలను తాకుతూ, ఆంధ్రప్రదేశ్‌లో అడుగిడుతూ ముక్త్యాల, వేదాద్రి, అమరావతీ ప్రాంతలగుండా, విజయవాడ ఇంద్రకీలాద్రిని చేధించుకొని ప్రవహిస్తు హంసల దీవి వద్ద సాగరసంగమముగా కలసిపోవును.

పుష్కరము పొందు నదులలో మూడవదిగా ప్రసిద్ధి పొంది, దక్షిణ

మానవుల పాప ప్రక్షాళనమొనర్చు సంకల్పముతోనున్న మునులు పరమేశ్వరుని ప్రార్థించగా స్వామి లింగాకారంగా ఆ ప్రాంత సమీపమున వెలసెను. అచటనున్ననొక ఆమలక (ఉసిరిక) వృక్షపు వేళ్లనుండి జలము వేణీ రూపములో వెలయగా, ఆ కృష్ణానదితో నిది ఏకమై 'కృష్ణవేణి' నదిగాను ప్రసిద్ధి చెందెను. దాంతో కృష్ణవేణి నది శివకేశవ సంగమ నదిగా పేరొందినది. ఈ కృష్ణవేణి మన రాష్ట్ర యింటి అలివేణియై విరాజిల్లుచున్నది.

ఈ కృష్ణానది జీవన గంగా ప్రవాహముగా పౌరాణిక ప్రాశస్త్యముతో అచటినుండి సుమారు 306 కి.మీ. కర్ణాటకలో సుమారు 482 కి.మీ. ప్రవహిస్తు మన తెలంగాణ రాష్ట్రముగుండా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రములోనూ 622 కి.మీ.గా ప్రవహిస్తున్న పుణ్య నది యిది.

భారతములో రెండవ నదిగానెంచబడిన ఈ కృష్ణా నది ప్రవహిస్తు పలు ప్రదేశాల పవిత్ర క్షేత్రాలెన్నో ఆ నదికిరువైపుల వుండడంతో ఆ క్షేత్రాలు పుణ్య క్షేత్రాలుగా, ఆ నదీమ తల్లి కూడా పుణ్య తీర్థముగా ఖ్యాతిని పొందుతు వెలసిన కృష్ణమ్మతల్లి పలువురకు పలురీతుల ప్రకృతి సంపదలందిస్తూన్న పుణ్యనదీమ తల్లియని స్మరిస్తుండడమే మన పుణ్యఫల ప్రాప్తి. కావున ఈ నది జలం పవిత్రతను గూర్చి యిట్లు ప్రార్థించవలెను.

శ్లో॥ కృష్ణవేణీతి యో బ్రూయాత్స జన్మార్జితాన్యసి ।
మహాపాపాని నశ్యంతి విష్ణులోక స గచ్ఛతి ॥

అనునిత్యము (12 రోజుల) కాలవ్యవదిలో కృష్ణానది షోడశోపచార పూజలతో అర్చిస్తూ, నమస్కరిస్తూ పలు ప్రార్థనలతో పవిత్ర స్నానములతో పితరుల శ్రాద్ధ, తర్పణాదులతో, ధాన ధర్మాలతో పుష్కర దినములు గడపినవారు శుభప్రద, మంగళప్రదములతో సంపూర్ణ పుణ్యఫల ప్రాప్తులగుదురని పురాణ ప్రశస్తి.

పుష్కర స్నానముతో బహుపుణ్యఫల ప్రాప్తులగుదురని ఆశిస్తూ సెలవు.

శుభం భూయాత్

పుష్కర కృష్ణా నదీస్నాన మహిమలు: –

శ్లో॥ అశ్వమేథ ఫలం చైవ లక్షగోదానజం ఫలమ్ ।
ప్రాప్నోతి స్నాన మాత్రేణ కృష్ణాయాం కన్యాగతే గురౌ ॥

(బ్రహ్మ వైవర్త పురాణం)

ఏ సమయంలో గురువు (బృహస్పతి కన్యారాశిగతుడై యుంటాడో ఆ సమయంలో చేసే కృష్ణా స్నానం అశ్వమేథయాగ ఫలితాన్ని, మరియు లక్ష గోవులను దానమొనర్చు ఫలాన్ని ప్రాప్తిస్తుంది.

శ్లో॥ యస్మిన్‌దినే గురుర్యాతి కన్యారాశౌ మహామతే ।
తస్మిన్‌దినే మహాపుణ్యం నరః స్నానం సమాచరేత్ ॥

(బ్రహ్మాండ పురాణం)

ఏ రోజు కన్యారాశిలోకి దేవగురువు ప్రవేశిస్తాడో ఆ సమయంలో చేసే కృష్ణా స్నానంతో నరుడు మహా పుణ్యాన్ని పొందుతాడు. కోటి జన్మలపాపాలనుండి విముక్తుడౌతాడు.

శ్లో॥ షష్టివర్ష సహస్రాణి భాగీరథవ గాహనమ్ ।
సకృద్కృష్ణ స్నానం కన్యాస్థేచ బృహస్పతౌ ॥

(బ్ర॥పురా॥)

శ్లో॥ తద్దినం హి సమారభ్య కన్యాస్థేచ బృహస్పతౌ ।
ఆ యాంతి సర్వతీర్థాని క్షేత్రాణీ దైవతాని చ ॥
శ్లో॥ నరాంసి పుష్కరాదీని గంగాద్యాః సరితస్తథా ।
వాసుదేవాదయో దేవాః సంతివై కృష్ణా తటే ॥

ఈ రోజు మొదలుకొని కన్యారాశిలో గురుడు ఉన్న సమయంలో కృష్ణానదిలో సర్వ తీర్థాలు, క్షేత్రాలు, సరస్సులు, పుష్కర తీర్థాలు, గంగాది నదులు, వాసుదేవాది దేవతలు వుంటారు.

శ్లో॥ కన్యాస్థే చ గురౌ తత్రయో గచ్ఛతి సమాహితః ।
స్నాత్వా చ విధినా తత్ర పితృం స్తర్పయేత్ తథా ॥
శ్లో॥ స్వర్గం గచ్ఛంతి పితరో నిరయే పతితా అపి ।
స్వర్గస్థాః పితరస్తస్య ముక్తి భాజో న సంశయః ॥

కన్యారాశిలో బృహస్పతి ఉన్నప్పుడు శ్రద్ధతో కృష్ణానదిలో విధిపూర్వకంగా స్నానమాచరించి పితృదేవతలకు తర్పణము చేయు వాని పితరులు నరకమున పడిన వారైనను సరే స్వర్గప్రాప్తిని పొందుదురు. స్వర్గములోనున్న పితృదేవతలు ముక్తిని పొందుదురనుటలో సందేహము లేదు.

శ్లో॥ తీర్థాని నద్యశ్చ తథా సముద్రాః క్షేత్రాణ్యారణ్యాని తథా – శ్రమాని ।
వసంతి సర్వాణి చ వర్షమేకం, కృష్ణా తటే కన్యా గతే సురేజ్యే ॥

దేవ గురుడు బృహస్పతి కన్యారాశి గతుడై యున్న సమయంలో కృష్ణా నదిలో 12 రోజుల కాలము సకలతీర్థాలు, నదులు, సముద్రాలు, క్షేత్రాలు, పవిత్రవనాలు, ఆశ్రమాలు ఆవాహనమై యుంటావి. 'వరాహ పురాణం' కూడా పుష్కర కాలంలో చేసే పితృతర్పణాదులు, దానాలు చేసిన విశేష ఫలితాలను పొందుదురని చెప్పును.

శ్లో॥ కృష్ణార్యాం జలం శంభుః ఫాషాణశ్చ జనార్దనః ।
సికతా మునయస్సర్వే తరవః సర్వ దేవతాః ॥
శ్లో॥ స్మరణాత్ కిల్బిషం హన్తి దర్శనాత్ సర్వ కామదా ।
నమస్కారాత్ భవేత్పుష్టిః స్నానాచ్చ బహుసంపదః ॥

కృష్ణా నది యందలి నీరు శంకర స్వరూపము. పాషాణము జనార్దన స్వరూపము. ఇసుక సర్వ మునులు. వృక్షములు సకలదేవతలు. కృష్ణానది స్మరణతో పాప పరిహారం, దర్శనంతో సర్వకామ్యసిద్ధి, నమస్కారముతో పుష్టి. ఇక కృష్ణానది జలస్నానముతో బహు సంపదలు కల్గును.

అట్టి పుష్కర సమయంలో కృష్ణా నదీమ తల్లిని ప్రార్థించి, అర్చించిన పరమాత్మ తత్త్వాన్ని అనుభవములోకి తెచ్చుకోవటమేయగును. కలాత్మక, జలాత్మక పరతత్త్వాన్ని ఆరాధించి అనుగ్రహం పొందుటయేయగును. ఇది ఋషులవాక్యము. ఋషులుయనగా ఆప్తులు. వారి వాక్యము శబ్ద ప్రమాణాత్మకము శిరోధార్యం.

'నదుల పాప ప్రక్షాళన కథ'

పూర్వము తీర్థాలన్ని తమలో జనులందరు స్నానములొనర్చడంతో వారి పాపములు తమకు సంక్రమించుటతో మేము మలినమైపోయాము. అట్టి మాలిన్యముతో మాశక్తి క్షీణించినది. మా అందరి అంగాలన్ని కాలిపోతున్నవి. కావున ఆ మాలిన్యము నివారణోపాయము చెప్పమని శంకరుని ఇట్లు ప్రార్థించిరి. అందుకు పరమేశ్వరుడిట్లు చెప్పెను.

ఓ తీర్థ రాజములారా! మీరు ఆయారాశులలో గురువు చేరగా ఆయా నదికి పుష్కరము వచ్చును. అప్పుడు మీరు అందులో ప్రవేశించి ఒక సంవత్సర కాలము నివసించండి. తద్వారా మీ పాతకాలన్నింటినుండి విముక్తిని పొందుదురు. వారట్లు చేరి తమ పాతకములన్నిటిని తొలగించుకొన్నావి. ఆ పుష్కర కాలములోని 12 రోజులు మొదలుకొని ఏ ఒక్క రోజైనా సరే కృష్ణా స్నానము చేసిన వాడు కోటి జన్మలపాపాలనుండి విముక్తిని పొందడగలడని 'బ్రహ్మ పురాణము' తెలుపును.

ఈ భూలోకమునకు సప్తర్షులు, మేషాది రాశులలో క్రమముగా బృహస్పతి (గురుడు) సంచారమును బట్టి, బృహస్పతి కన్యారాశిలో సంచరించు కాలముతో "కృష్ణా" నదికి పుష్కర కాలమని, 12 రోజులు పుష్కర రాజువచ్చునదిగా అదియును పవిత్ర పుణ్యకాలమని పురాణములు చెప్పుచున్నవి. అటులే సర్వ నదుల, సర్వ సముద్రములస్నాన పుణ్య ఫలముతో ఒక పుష్కర నదీ స్నానము మనుష్యునకు పుణ్యఫలతుల్యముగా బుద్ధితోబాటు కొన్నివేలరేట్లు పరిశుద్ధిని ప్రసాదించి విశేష ప్రభావమును కల్గించునని పురాణవచనముగా జెప్పబడెను. గంగా జలముతో స్నానమొనర్చుట ఎంత శ్రేష్టమో, అంతకంటే కృష్ణా పుష్కర స్నానము మరింత శ్రేష్టతరమని, మరియు ఇట్టి కృష్ణానది ఉభయ తెలుగు రాష్ట్రాలలో ప్రవహిస్తున్నందున తెలుగువారలకీ నది పుష్కరాలు రావడం ఎంతో అదృష్టము నోచుకున్నారని చెప్పవచ్చుననుటకు సందేహము లేదు. కావున ఇదియును సుప్రసిద్ధ నదిగా పేరొందియున్న కారణాన, ఇందు స్నానమొనర్చి, దాన ధర్మములొనర్చిన, పితరులకును శ్రాద్ధాదులొనర్చిన, వారికనేక జన్మ జన్మలయందు చేసిన ఘోర పాపములు నశించుటయేగాక, సకలఐశ్వర్యములు కలిగి సుఖింతురని శ్రీమన్నారాయణుడు నారదులవారికి వివరించెను.

శ్లో॥ రేవాతీరే తపఃకుర్యాత్ మరణం జాహ్నవీతటే ।
దానం దద్యాత్ కురుక్షేత్రే గౌతమ్యాం త్రితయమ్ వరం ॥

నర్మదానదీ తీరములో తపస్సొనర్చడంతో, కృష్ణానది తీరంలో మరణించడంతో, కురుక్షేత్రములో దానము చేయుటతో ఎంత పుణ్యము ప్రాప్తిస్తుందో అంతటి పుణ్యము పుష్కర నది తీరములో స్నానమాచరించిన వాటి నన్నిటిని ఆచరించిన ఫలితముతో సమానము. అటులా కృష్ణానది

స్నానాన్ని ఆచరించడంతో సకలశుభాలను పొందుటంతో గాక, వారి వంశాభివృద్ధితోబాటు ఆ వంశము ఉద్ధరింపబడునని 'బ్రహ్మ పురాణము' చెప్పును.

పై ప్రదేశాల మూడింటి సమాన ముక్తిప్రదం, కృష్ణానది తీర్థజలస్నానంతో లభించునని క్షేత్రమహిమ తెలుపును. ఇచట విశేషమైన తిథులలో స్నానమొనర్చిన పుణ్యప్రాప్తితో బాటు, సంతాన ప్రాప్తియు కల్గుతుందని ప్రతీతి.

ఇట్లా వివరణలోకి వెళితె అనేక కథలున్నట్లు గోదావరి ప్రతిభ పురాణములు వ్యక్తపరిచినవి.

స్నాన సంకల్పము: నదీ ప్రార్థనగా నమస్కరించి అనుమతి యిట్లు పొందవలెను.

శ్లో॥ తీక్ష్ణ దంష్ట్ర మహాకాయ కల్పాంత దహనోపమ।
భైరవాయ నమస్తుభ్యం అనుజ్ఞాం దాతు మర్హసి ॥

అను ప్రార్థించి తరువాత జలాశయమునందు ప్రవేశించవలెను. నదీ ప్రవాహమునకు పూర్వభిముఖులై నిలుచుండి ఒకపరి స్నానమొనర్చిన తరువాత దిగువ యిచ్చిన స్నాన సంకల్పమును చెప్పవలెను.

'ఏవం ప్రీత్యర్థం మంత్రపూర్వక అస్యాం మహా నద్యాం సమస్త పాప క్షయార్థం, సమస్త నద్యభిమాని గంగాదేవతాంతర్గత, సమస్త తాత్త్విక దేవతాంతర్గత భారతీ రమణ ముఖ్య ప్రాణాంతర్గత నిర్దోష, అనంత కల్యాణగుణ పూర్ణ, సమస్త జగదుత్పత్తి లయకారణీభూత, మత్స్య కూర్మాది, అనంతావతారాత్మక, వేద వ్యాసాత్మక, ఏతం మాస నియమ కామ భిన్న, బింభ మూర్తి ప్రేరణయాబింభ మూర్తి ప్రీత్యర్థం భగదత్పరోక్ష దర్శన, నిధిధ్యాసన, మనన, శ్రవణాధీని సంపాదయితుం, నిర్నిమిత్త నిశ్చంచల భక్తి, విషయ వైరాగ్య సంప్రాప్తయే, అమానిత్వ, అదం భిత్వాది జ్ఞాన సాధనానాం, అభయ సత్త్వ సంశుద్ధ్యాది దైవ సంపదాం చ అవాక్తయే, క్షుద్ర పాతక, ఉపపాతక, మహాపాతకానాం నిరాసారార్థం, కాయక, వాచిక, మానసిక, జ్ఞాతాజ్ఞాత దోష నిబర్హణ ద్వారా, శరీరేంద్రియాది యాంతఃకర్ణాం, సంశోదనార్థం, సద్గురూపదేశ సిద్ధ్యర్థం విష్ణు పాదాబ్జ సంభూతాయాః గంగాధ్యాయాంతర్గత సమస్త నదీనాం స్మరణ పూరకం తాని తీర్థాని తదభిమాన దేవతాశ్చ తన్నియమక భగవద్రూపాణి చ శ్రీ కృష్ణా జలాశయే ఆవాహయిష్యే తథాః అస్మిన్ జలాశయే స్నానమహం కరిష్యే'.

ఈ విధంగా స్నానసంకల్ప మంత్రంతో స్నానమొనర్చి శ్రీ శివకేశవులను భక్తితో స్మరించి ఆ నదీ జలమును శిరస్సుపై ప్రోక్షించుకొనవలెను. అట్లొనర్చిన శ్రీ హరి పావనపాద జలము మనలో ప్రవేశించి ఇడ, పింగళ, సుషుమ్న నాడులలో నిండినదని భావించిన, ఆ పాద తీర్థమే మన మనస్సులోని సమస్త అంతర్బాహ్య మాలిన్యము తొలగుటతో మూడున్నర కోటి పుష్కరోత్సవకాల దేవతల తీర్థముల స్నానమొనర్చిన సమానమగును. మరియు అటుల స్నానసంకల్పముతో సకల ధానాలు, పురాణ పఠనాదులు, శ్రవణాదులు యజ్ఞమొనర్చునట్లు సమానమగును.

స్నానము చేసిన తరువాత ఆయా దేవతలకు అర్ఘ్యములను సమర్పించవలెను.

పుష్కర నదీ స్నానానంతరం, "ఏవం ప్రీత్యర్థం మంత్రపూర్వక అస్యాం మహా నద్యాం సమస్తపాపక్షయార్థం కన్యాగతే దేవగురౌ సార్ధ త్రికోటి తీర్థసహిత, తీర్థ రాజ సమాగమాఖ్య మహాపర్వణి పుణ్యకాలే శ్రీ కృష్ణా నదీ పుష్కర ప్రయుక్త స్నానమహం కరిష్యే" పుష్కరోత్సవ కాలములో ఆయానదులలో సంకల్పముతో స్నానమొనర్చి దానాలు, పురాణ పఠానాదులు, శ్రవణాదులు, యజ్ఞాదులు నొనర్చినను ముక్కోటి తీర్థాలలో స్నానముచేసిన సమాన ఫలితమొచ్చును.

శ్లో॥ కన్యాంగతే దేవ గురౌ సార్ధకోటి తీర్థ సహిత పుష్కర ప్రయుక్త
మహాపర్వణీ పుణ్యకాలే కృష్ణానదీ స్నానమహం కరిష్యే॥

అను ప్రార్థనతో...

"మహా సంకల్పపూర్వక శ్రీ కృష్ణా నదీ స్నానమహం కరిష్యే" అని జలములో మూడవ మునకవేసి, వీలున్న తడి వస్త్రములనో లేక పొడి వస్త్రములధరించి ఆయా ధ్యాన, దాన, జప, శ్రాద్ధాదులనొనర్చ వలెను. అయితే తడి వస్త్రములనీటిని నదిలో పిండడంకూడ జలతర్పణముతో సమానమనియు చెప్పబడును. నదీ జలప్రార్థన పూర్వక మంత్రములపఠించవచ్చును. ఇట్టి తరి శ్రాద్దాదులొనర్చుటలో శిరోముండనమొనర్చుట ఆవశ్యకము.

వీలునుబట్టి పుష్కర నదీ రాజపూజయు జరుపవచ్చును. అదియే "పుష్కర రాజ పూజాం కరిష్యే" – అని సంకల్పముతో షోడశ పూజలుగా ఆ నదీ నామ అష్టోత్తర శతనామములతో పూజలొనర్చి. ఏతత్ఫలం సర్వ పరమేశ్వరార్పణమస్తు॥ అని పలికి, పితృవర్గ క్రమముగా వారికి వీలున్నచో పిండప్రదానములు, లేక, తిలతర్పణాదుల సమర్పించి, వీలుగా బ్రాహ్మణులకు దశదానములును సమర్పించవచ్చును.

1. గోదానము దూడతో, శ్రేష్ఠమైన భూదానం, తిలదానం, హిరణ్యదానము, ఆజ్య (నెయ్యి) దానం, వస్త్రదానం, ధాన్యదానం, గుడదానము, రౌప్య (వెండి) దానం, తుది లవణ దాన మివ్వవలెను. వస్త్ర, దీపదానము కూడా చేయవచ్చును.

ఈ దానములు పుష్కర కాలము (12) రోజులుగాను అచటనే యుండినచో సమర్పించు ఆయాదానములొనర్చు ఆచారము కూడా యున్నది. ఆ విషయం అచటి విప్రుని అడిగి తెలుసుకొని దానాలు చేయవలెను. ఆ దినమందు ఏక భూక్తంగా నుండవలెను.

ఆహా కృష్ణా నది ధన్యము కదా! కృష్ణా స్నానము ధన్యము, ఉత్తమము, ఆ కృష్ణానది స్నానము చేయువారు మిక్కిలి ధన్యాత్ములుగా చెప్పబడుదురు కదా !. వందే కృష్ణా నదీం

శుభం భూయాత్

ఈ వ్యాస రచయిత మొబైల్ నెం. 9441927725

❖ ❖ ❖

పవిత్ర కృష్ణవేణీ పుష్కర స్నాన విధి

వైదికం - పౌరాణికం

సంకలనం : శ్రీవిద్యాలంకరణ, దైవజ్ఞకుల శిరోమణి, వైదికాగమ శిరోమణి, స్మార్త సరస్వతి, యజ్ఞేశానందనాథ

బ్రహ్మశ్రీ పాలకుర్తి నృసింహరామ సిద్ధాంతి



శ్రీ కంకాలమూర్తి ధ్యానమ్

భస్మాలేపత్రిపుండ్రం రుచిరమణిలస
త్పిచ్ఛకంకాలదక్షం।
టంకం వామే కరాబ్జే దధత మఖిలస
త్సాంద్రసిందూరశోభమ్।
(శూలం కృష్ణమృగాస్యలంబితకరం
బద్ధేందుచూడం హరం ।
వందే దేవృషీశ్వరైః పరివృతం
వైయాఘ్రచర్మాంబరమ్)
శూలం కృష్ణస్య వక్త్రే ప్రసృతకరతలం
బద్ధబాలేందుచూడం
వందే దేవై ర్మునీంద్రైః పరివృత మభవం
వ్యాఘ్రచర్మోత్తరీయమ్॥
చతుర్భుజం త్రినేత్రం చ జటామకుటసంయుతమ్।
పాదయోః పాదుకాయుక్తం కించి ద్వై గమనోన్ముఖమ్॥
సర్వాభరణసంయుక్తం యజ్ఞసూత్రోత్తరీయకమ్
శంఖం తు వామకర్ణే తు దక్షిణే నక్రకుండలమ్॥
కించి త్ప్రహసితాస్యం చ నానాలీలాసమావృతమ్
ఘురికాం దక్షకట్యాం తు దధానం భూతసంయుతమ్॥
భిక్షాన్న మోచనాయాతమృగపక్ష్యాదిసంయుతమ్।
దేవస్య వామపార్శ్వే తు మహాభూతం ప్రకల్పయేత్॥
ద్విభుజం చ ద్వినేత్రం చ కరాళ వదనాన్వితమ్।
కపాలం శిరసి న్యస్య దేవవామే తు సంస్థితమ్॥
ఏవం కింకాల మాఖ్యాతమ్
(దేవో రక్తవర్ణః, భూతః కృష్ణవర్ణః)

శ్రీ భిక్షాటనమూర్తి ధ్యానమ్

చతుర్భుజం త్రినేత్రం చ నగ్నం చైవ స్మితాననమ్।
భస్మ దిగ్ధం విద్రుమాభం కట్యాం పన్నగసంవృతమ్॥
(ఆవృత్తాలంకృతం భృంగీ పాదం పాదుకసంయుతమ్)
ఆవృత్తాలంకృతో భృంగీ పాదం పాదుకసంయుతమ్
దక్షిణం తత్కరాగ్రం తు హరిణాస్యానుగం భవేత్॥
దక్షిణే పరహస్తే తు డమరుం చైవ కారయేత్
వామే త్వపరహస్తే తు త్రిశూలం పించధారిణమ్॥
కుంచితం దక్షిణం పాదం వామపాదం తు సుస్థితమ్।
సమభంగస్థానకం చ గమనోన్ముఖరూపకమ్॥
కపాలోపేతహస్తం చ వృషనాభిసమం భవేత్।
ఏవం భిక్షాటనం ప్రోక్తం గుండోదర మథో శృణు॥
దేవస్య వామపార్శ్వే తు గుండోదర మథఃస్థితమ్।
హస్తద్వయసమాయుక్తం కపాలం శిరసి న్యసేత్॥

శ్రీ గంగాధర స్తోత్రమ్

క్షీరాంభోనిధి మంథనోద్భవ విషాత్సందహ్యమానాన్సురాన్ బ్రహ్మాదీనవలోక్య యః కరుణయా హాలాహలాఖ్యం విషమ్, నిశ్శంకం నిజలీలయా కబళయ న్లోకాన్రరక్షాదరాదార్తత్రాణ పరాయణఅ స్సభగవా న్గంగాధరో మేగతిః.

శ్రీ కళ్యాణ సుందరమూర్తి ధ్యానమ్

(కళ్యాణసుందరం రూపం వక్ష్యతేఽద్య జగత్పతేః।
కుంచితం దక్షిణం పాదం వామపాదం తు సుస్థితమ్॥



సవ్యపూర్వకరే ణైవ దేవ్యాః సవ్యకరం గ్రహేత్ ।
వరదం వామహస్తం తు పరహస్తద్వయో రపి ॥
పరశుం సవ్యహస్తే తు మృగం వామే తు సంధరేత్ ।
జటామకుటసంయుక్తం దివ్యాభరణభూషితమ్ ॥
దివ్యవస్త్రై రలంకృత్య ప్రవాళసదృశప్రభమథ్ ।
శ్యామవర్ణనిభాం గౌరీం దుకూలవసనాన్వితామ్ ॥
ఉత్పలం వామహస్తే తు మకుటం కేశబంధితమ్ ।
సుస్థితం వామపాదం చాపీతరం కుంచితాన్వితమ్ ॥
ఈషల్లజ్జితవక్త్రాభ్యాం దక్షిణే తు వ్యవస్థితామ్ ।
తస్యా శ్చైవాపరే పార్శ్వే శ్రీభూమీ చైవ కారయేత్ ॥
తయోర్హస్తోభయాభ్యాం తు గౌర్యా స్తు మపరం స్పృశేత్ ।
దేవ స్యాగ్రే చ కుండే తు జుహుయా త్తు ప్రజాపతిః ॥
హోమ స్యోత్తరదేశే తు హరి ర్వర్ధనిసంయుతః ।
దేవస్య వరదే హస్తే గౌరీం దద్యా త్తదంబునా ॥
శక్రాది సర్వదేవా శ్చ భక్తియుక్తా వృతాః స్థితాః ॥

శ్రీ దక్షిణామూర్తి ధ్యానమ్

భూతివ్యాపాండురాంగః శశిశకలధరో
జ్ఞానముద్రాక్షమాలా
వీణాపుస్తై ర్విరాజత్కరతలకమలో
యోగపట్టాభిరామః ।
వ్యాఖ్యాపీఠే నిషణ్ణః సకలమునివరైః
సేవిత స్సుప్రసన్నః
సవ్యాలః కృత్తివాసాః సతత మవతు నో
దక్షిణామూర్తి రీశః ॥
(నారదో జమదగ్ని శ్చ వసిష్ఠభృగుదక్షిణే)
దక్షిణే జమదగ్ని శ్చ వసిష్ఠభృగునారదాః
భరద్వాజః శౌనక శ్చాప్యగస్త్యో భార్గవ స్తథా ॥
వామపార్శ్వే విధాతవ్యాః కిన్నరాద్యైః సుసేవితే ।
కైలాసపర్వతే తస్మిన్ వటవృక్షస్య మూలకే ॥
ఆసీనం సకలేశం తు శాంతరూపం మహేశ్వరమ్ ।
దక్షిణామూర్తి మూచుస్తే-పస్మారం శాయయే దధః ॥

అర్ధనారీశ్వరమూర్తి ధ్యానమ్

చతుర్భుజం త్రినేత్రం చ శివాంశం దక్ష పార్శ్వకే
వామార్ధం వామభాగే తు సీమంతతిలకాలకమ్ ॥
నేత్రార్ధం తు లలాటే తు సంయుక్తం దక్షిణాంశకే ।
దక్షిణే కుండలం కర్ణే దధం వామే తు పత్రకమ్ ॥
కట్యాం వా కలితం వామే-భయటంకౌ చ దక్షిణే ।
వరదోత్పలకే వామే కేయూరకటకాన్వితమ్ ॥
ఉమాంశే తు స్తనం కుర్యా త్స్వాహోకారయుతం తు వా ।
శ్రోణ్యర్ధం దక్షిణే శంభో ర్వ్యాఘ్రచర్మకృతాంబరమ్ ॥
ఉమార్ధం కటిసూత్రం తు చిత్రవస్త్రపరిచ్ఛదమ్ ।
నూపురాలంకృతం వామే సవ్యపాదం తు కుంచితమ్ ॥
స్వయం ప్రవాలవర్ణః స్యాత్ సుకృష్ణం వామభాగకమ్ ।
అర్ధనారీశ్వరం ప్రోక్తం (రూపం సర్వశుభప్రదమ్) ॥
దేవీభాగః శ్యామవర్ణ ఈశ్వరోరక్తవర్ణకః ॥

శ్రీ వృషభారూఢ ధ్యానమ్

సవ్యే స్యా ద్వక్రతుండాన్వితకటకరం
గోపతేః పృష్ఠసంస్థం
వామస్యార్ధం సదక్షం వరకరయుగలే
టంకకృష్ణం దధానమ్ ।
ఫాలస్థాక్షం ప్రసన్నం త్రినయనలసితం
బద్ధవేణీ కిరీటం
వామే గౌర్యా సమేతం నమత శుభకరం
తం వృషారూఢ మీశమ్ ॥

శ్రీ హరిహర ధ్యానమ్

సవ్యాంగే విద్రుమాభం శశధరమకుటం
భస్మరుద్రాక్షభూషం
వామాంగే శ్యామలాభం మణిమకుటయుతం
పీతవస్త్రాతిశోభమ్ ।

సవ్యే టంకాభయం స్యా దితరకరయుగే
శంఖకౌమోదకీ స్యాత్
కించి ల్లలాటనేత్రం విలసతు పురతః
శ్రీహరే ర్ధదేహమ్ ॥
సవ్యే టంకం పరస్మిన్ కటకసుజలజం
సింధువేణీ సునద్ధం
వామార్ధే సత్కిరీటం రుధిరజలనిభం
వ్యాఘ్రచార్మంబరాఢ్యమ్।
ఫాలార్ధే లోచనార్ధా కలితసమపదం
శుభ్రయజ్ఞోపవీతం
హర్యర్ధం నౌమి శంభుం సకలశుభకరం
సర్వసంపత్కరాఢ్యమ్॥

గురుడు సింహాంశంలో ఉంటే....

గురువు (బృహస్పతి) మఖానక్షత్రంలో వున్నా, సింహాంశమునందు ఉన్నా అన్ని దేశాలు లేక రాష్ట్రాలలో శుభకర్మలు నిషిద్ధం. సింహాంశం దాటాక గోదావరికి దక్షిణమున, భాగీరథికి ఉత్తరమున సింహస్థత్వ దోషం పరిగణించ నక్కరలేదు. కాని గంగా – గోదావరీ మధ్య దేశమునకంతటికీ సింహరాశిని పూర్తిగా దాటేవరకు వివాహం, ఉపనయనం నిషిద్ధములు. మిగతా కర్మలన్నీ సింహాంశం దాటగానే చెయ్యవచ్చు!

ఇట్లే మేషంలో రవి ఉన్నప్పుడు సర్వదేశాలకు శుభకర్మల నిమిత్తం ఎలాటి దోషం ఉండదు. కొన్ని గ్రంథాలలో సూర్యుడు వృషభంలో ఉన్నప్పుడు ఇట్లాంటి దోషం లేదని చెప్పబడింది.

పుష్కరాలు

బృహస్పతి సింహస్థుడైనపుడు గోదావరీ స్నానం, కన్యలో ఉన్నప్పుడు కృష్ణానదీ స్నానం పుణ్యం. ఇవే పుష్కరాలు.

పుష్కరం అనగా ఏమిటి? పుష్ అను ధాతువు నుండి పుష్కరము అను శబ్దము ఏర్పడింది. పుష్కరము అను శబ్దమునకు పోషణము అని అర్థం. ఇంకా జ్యోతిషశాస్త్రం ప్రకారం పన్నెండు సంవత్సరాల కాల పరిమాణం అని కూడా అర్థం. బృహస్పతి, గురుగ్రహ సంచారము ఒక్కొక్క రాశిలో ఒక సంవత్సరం (ఈవిధంగా పన్నెండు రాశులలో సంచారమునకు పన్నెండు సంవత్సరాలు) అవుతుంది. దీనినే పుష్కరము అని వ్యవహరిస్తారు. పుష్కర శబ్దమునకు తామరకాడ, తామరపువ్వు, తామరాకు – 'పుష్కర పర్ణైః పుష్కర దణ్డైఃు, పుష్కరైశ్చ సంగ్గేస్తేర్య' అని ఉపనిషద్వాక్య ప్రమాణముంది.

పుష్కరాలు ఒక్కొక్క జీవనదికి ఒక్కొక్క పర్యాయం వస్తాయి. ఆయా సంవత్సరాల రాశుల కధిష్ఠానాలైన నదులలో పుష్కరుడు ఉంటాడు. 1. మేషం – గంగానది 2. వృషభం – నర్మద 3. మిధునం – సరస్వతి 4. కర్కాటకం – యమున 5. సింహం– గోదావరి 6. కన్య –



కృష్ణవేణి 7. తుల – కావేరి 8. వృశ్చికం – తామ్రపర్ణి 9. ధనుస్సు – రధ్య నది 10. మకరం – తుంగభద్ర 11. కుంభం – సింధు 12. మీనం – ప్రాణహిత. ఈవిధంగా ఈ రాశుల్లో ఈ నదులకు పుష్కరాలు వస్తాయి.

బృహస్పతి (గురు) గ్రహం నవగ్రహాలలో ఒకటి. గురుగ్రహం భూమి కంటే పెద్దది. పురుషగ్రహంగాను, బ్రాహ్మణ గ్రహంగాను చెప్పబడింది. గ్రహములన్నింటిలోనూ ఉత్తమ గ్రహము గురువు. సత్త్వగుణ ప్రధానుడు. విద్యాకారకుడు. బుద్ధికారకుడు. జ్ఞానకారకుడు – ధనకారకుడు, తేజోవంతుడు. గురుగ్రహ ప్రభావం భూమిపైనున్న జీవులకు అధికంగా వుంటుంది అని జ్యోతిష శాస్త్రంలో పేర్కొనబడింది. పూర్వం తుందిలుడు అను బ్రాహ్మణుడు శివుని గూర్చి తపస్సు చేసెను. తుందిలుడి తపస్సునకు మెచ్చి శివుడు ప్రత్యక్షమై వరం కోరుకోమన్నాడు. శివుడు ఎల్లవేళలా అష్టమూర్తులతో విరాజిల్లుతుంటాడు. 1. కంకాళమూర్తి 2. భిక్షాటనమూర్తి 3. పుష్కరమూర్తి లేదా గంగాధరమూర్తి 4. కళ్యాణ సుందరమూర్తి 5. వీణాధరమూర్తి 6. అర్ధనారీశ్వరమూర్తి 7. వృషభరుద్రమూర్తి 8. హరిహరమూర్తి. ఈ ఎనిమిది మూర్తులలో ఒకటైన పుష్కర – గంగాధర మూర్తి (నీటి) రూపం తనకు ప్రసాదించమని కోరుకున్నాడు తుందిలుడు. శివుని వరప్రభావంవల్ల తుందిలుడికి పుష్కరమాసం (నీటిరూపం) వచ్చింది. శివుడు ఆ పుష్కరుడిని తన కమండలంలో నిలుపుకుని కైలాసం చేరుకున్నాడు.

ఈ సంగతి సృష్టికర్త బ్రహ్మకు తెలిసింది. తన సృష్టికార్యం నెరవేరడానికి పుష్కరుని సహాయం అవసరమని గ్రహించాడు బ్రహ్మ. వెంటనే కైలాసానికి వెళ్లి శివుడిని స్తుతించి ప్రసన్నం చేసుకున్నాడు. "పరమేశ్వరా! నా సృష్టికార్యం నెరవేరాలంటే మీ అధీనంలో వున్న పుష్కరుడు నాకు కావాలి!" అని అడిగాడు. అందుకు శివుడు అంగీకరించి పుష్కరుడిని బ్రహ్మకిచ్చాడు. బ్రహ్మ పుష్కరుడిని తన కమండలంలో నిలుపుకొని బ్రహ్మలోకానికి వెళ్లిపోయాడు. సృష్టికార్యం నెరవేర్చసాగాడు. దేవగురువు బృహస్పతి బ్రహ్మను గురించి తపస్సు చేసాడు. బ్రహ్మ అతని తపస్సుకు మెచ్చుకొని వరం కోరుకోమన్నాడు. 'గ్రహాలపైన తనకు ఆధిపత్యం, బ్రహ్మ కమండలంలో నీటి రూపంలో వున్న పుష్కరుణ్ణి తనకు యివ్వమని' బృహస్పతి కోరాడు. బ్రహ్మ అంగీకరించాడు. కాని పుష్కరుడు బ్రహ్మను వదలి వెళ్లడానికి యిష్టపడలేదు. చివరకు ఎలాగో ఒప్పందం కుదిరింది. దాని ప్రకారం బృహస్పతి కొత్తగా ఒక రాశిలో ప్రవేశించినపుడు మొదట పన్నెండు రోజులు, మిగిలిన రోజుల్లో ప్రతిదినం మధ్యాహ్నం నాలుగు ఘడియలు మాత్రం పుష్కరుడు బృహస్పతి అధీనంలో వుండేటట్లు, ఆ సమయంలో దేవగణాలందరితో బ్రహ్మ పుష్కరుణ్ణి అనుసరించి వుండేటట్లు ఒప్పందం కుదిరింది. పుష్కరునితో సహా బ్రహ్మాది దేవతలంతా ఆయానదుల్లో బృహస్పతితో కలిసి నివసిస్తారు. కనుక నదులకు ఎంతో ప్రభావముంటుంది. ఆ సమయంలో చేసే స్నాన దాన జప తర్పణాదులకు విశేష ఫలముంటుంది.

నదులు నాలుగు రకాలు. దైవ, ఆర్ష, మానస, అసుర అను నాలుగు రకాలుగా బ్రహ్మపురాణంలో చెప్పబడింది. త్రిమూర్తులచేత ప్రవర్తింజేయబడేవి దైవరకం నదులు – అవి గంగానది, గోదావరి, కృష్ణవేణి నదులు. ప్రజలు సాధారణంగా నీటికింత ప్రాముఖ్యత, పవిత్రత, విలువేంటని అనుకోవచ్చు. నీళ్లల్లో రెండు రకాలున్నాయని వేదాల్లో చెప్పబింది. లౌకికశక్తి – ప్రాణుల దాహం తీర్చడం, మురికిని పోగొట్టడం, సేద్యానికి తోడ్పడడం. 2. అతీంద్రియ దైవికశక్తి. అది విద్యుత్ శక్తి, మేధ్యం, యజ్ఞ్యం. యజ్ఞ్యం అనే శక్తి ప్రోక్షణాదులద్వారా ద్రవ్య శుద్ధిని కల్గిస్తుంది. అది కంటికి కనిపించదు.

'అపస్స్వభావతో మేధ్యాः' అని నీరు స్వతః పవిత్రమైంది. కొన్ని సమయాల్లో కొన్ని ప్రదేశాలలో ప్రవహించే నీరు పవిత్ర నదీసారాలను తనయందుంచుకొని ప్రవహిస్తుంది. అటువంటి నీటిలో స్నానం ఇహపరాలకు ఫలం చేకూర్చుతుంది. పంచభూతములలో నీరు రెండోది. భూమికంటే విస్తృతిలో విశాలమైంది. పంచభూతములు పరబ్రహ్మము నుండి ఆవిర్భవించాయి. పరబ్రహ్మము నుంచి ఆకాశము, ఆకాశము నుంచి వాయువు, వాయువు నుండి అగ్ని, అగ్ని నుంచి నీరు, నీటి నుంచి భూమి, భూమి నుంచి ఔషధములు, ఔషధముల నుంచి జీవకణములు లేక అన్నము. అన్నము నుండి పురుషుడు అనగా శరీరము, దేహముగల ప్రాణికోటి జనించిందని తైత్తిరీయోపనిషత్తులో బ్రహ్మానందవల్లి ప్రథమానువాకంలో చెప్పబడింది.

"తస్మాద్ వా ఏతస్మా దాత్మన ఆకాశः సంభూతः । ఆకాశాద్ వాయుः । వాయో రగ్నిः । అగ్నే ఆపః । అద్భ్య పృథివీ । పృథివ్యా ఓషధీయः । ఓషధీభ్యోన్నమ్ । అన్నాగ్రేతः । రేతసः పురుషः ॥

బృహస్పతి కన్యరాశిలో ప్రవేశించిన సమయంలో కృష్ణా నదికి పుష్కరాలు వస్తాయి. ఆ పవిత్ర సమయంలో పుణ్యఫలంమీద నివాసాంజలుల మీద అపేక్షకొద్దీ త్రిమూర్తులు, ఇంద్రాది దేవతలు, సమస్త ఋషులు, పితృదేవతలు, పర్వకాల పర్యంతం పుష్కరస్థానంలో నివాసాలు ఏర్పరచుకుంటారు. దీనికీ శ్లోకమే ప్రమాణము –

"బ్రహ్మ విష్ణుశ్చ రుద్రశ్చ ఇందాద్యా స్సర్వదేవతాः ।
పితరో ఋషయశ్చైవ తత్రవ నివసంతిహి ॥

పుష్కర సమయంలో గంగ, గోదావరి, కృష్ణవేణి నదులలో స్నానం చేస్తే పుష్కరకాలం అనగా పన్నెండు సంవత్సరాలు ఆ నదుల్లో నిత్యం స్నానం చేసినంత పుణ్యఫలం వస్తుంది. పూర్వజన్మలలో మనస్సు,

వాక్కు, శరీరముల ద్వారా త్రికరణాలతో చేసిన సమస్త పాపాలు నశించి మోక్షం కలుగుతుంది అని బ్రహ్మాండ పురాణంలో చెప్పబడింది. అశ్వమేధయాగం చేసిన ఫలానికి రెట్టింపు ఫలం పుష్కరస్నానం వల్ల లభిస్తుంది. నర్మదానదీ తీరంలో తపస్సు, కురుక్షేత్రంలో దానం, కాశీక్షేత్రంలో మరణంవల్ల కలిగే మూడింటి పుణ్యం పుష్కరస్నానం వల్ల కలుగుతుంది అని పద్మపురాణంలోని సృష్టిఖండంలో పేర్కొనబడింది.

ముందుగా పుష్కరనదికి ప్రార్థన చేసి తీరంలో వుండే మట్టిని మూడుసార్లు నీటిలో వేసి తరువాత సంకల్పం చెప్పి పుష్కరస్నానం చేయాలి. పితృదేవతలకు తర్పణం, తీర్థోపవాసం చేయాలి. మృత్తికస్నానం, పుష్కర స్నానం చేసి బృహస్పతికీ, పుష్కరనదికీ, లక్ష్మీనారాయణులకు, సూర్యునికి, పార్వతీ పరమేశ్వరులకు, సరస్వతీ బ్రహ్మలకు మూడుకోట్ల యాభై లక్షల తీర్థాలతో కూడిన పుష్కర రాజతీర్థ దేవతకు, ఇంద్రాది సర్వదేవతలకు వాలఖిల్యాది మునులకు, పితృదేవతలకు, శౌనకాది మునులకు తర్పణం విడవాలి. మళ్ళీ ప్రవాహానికి అభిముఖంగా స్నానం చేయాలి. ఈ తీర్థం వద్ద నివసించని యాత్రికులు తీర్థోపవాసం చేయటం మంచిది.

నదీమతల్లి అర్చనలు దీర్ఘాయుష్షుకు మార్గం

ఆయా నదీ పుష్కరాల్లో పూజలు నిర్వహించిన వారికి దీర్ఘాయుష్షు లభిస్తుంది. పూర్వం సవ్వర దేశాన్ని పాలించిన సుమతీ అనే రాజు శివుని వరం వల్ల ఒక కుమారుణ్ణి కన్నాడు. అతనికి ఆయువు తక్కువ. ఒక ముని సలహామేరకు కృష్ణా పుష్కర వ్రతం చేసి దీర్ఘాయుష్యాన్ని పొందాడని పురాణగాథ వుంది.

ఆయా పుష్కరాల కాలంలో ఆ నది, పుష్కర రాజు, బృహస్పతి, నారాయణుడు, భాస్కరుడు, మహాలక్ష్మీ, గణేశుడు, శ్రీకృష్ణుడు, సరస్వతి, పార్వతి, మహేశ్వరుడు, అనంతుడు, నృసింహుడు, వామనుడు, రామచంద్రుడు ఇలా వివిధ దేవతల మహా మంత్రాలను జపం చేసి, మండపారాధన చేసి ఆ నదిని, బృహస్పతిని, పుష్కర రాజును పూజించాలి. తొలిరోజు నారాయణుని ధ్యానిస్తూ పుష్కర పూజలు ప్రారంభిస్తారు. రెండవరోజు భాస్కరుని, మూడవరోజు మహాఋషులను ఇలా... 12 రోజులు 12 అధిదేవతలను పూజిస్తారు. 12వ రోజున 12 దానాలు చేస్తారు. ఒక్కో దానానికి ఒక్కొక్క ఫలితం వుంటుంది. అలాగే ఒక్కొక్కరోజు ఒక్కొక్క శ్రాద్ధం నిర్వహిస్తారు. మొదటిరోజు హిరణ్యశ్రాద్ధం, తొమ్మిదవ రోజు అన్నశ్రాద్ధం, 12వ రోజు ఆమశ్రాద్ధం తప్పనిసరిగా నిర్వహించదగినవి.



స్నాన ప్రయోగ విధానము

(గమనిక : ఇక్కడినుండి ఇప్పుడు ఐదు అంగములతో కూడిన స్నానమును చేయు విధానము సమంత్రకముగా వివరింపబడును).

(1) గంగాధ్యాన పురస్సరం గంగాం ప్రవిశ్య– (అనగా – క్రింద పేర్కొనబడిన గంగా ధ్యానశ్లోకములను నమస్కార ముద్రతో పఠిస్తూ గంగాజలమునందు ప్రవేశింపవలయును.)

గంగా ధ్యానము

తీర్థరాజాయ నమః ॥ (అని నమస్కరింపవలెను.)

శ్లో॥ త్వం రాజా సర్వతీర్థానాం త్వమేవ జగతః పితా ।
యాచతో దేహి మే తీర్థం సర్వపాపైః ప్రముచ్యతే ॥

శ్లో॥ యోఽసౌ సర్వగతో విష్ణుః చిత్స్వరూపీ నిరంజనః ।
స ఏవ ద్రవరూపేణ గంగాం భో నాత్ర సంశయః ॥

శ్లో॥ గంగా గంగేతి యో బ్రూయాత్ యోజనానాం శతైరపి ।
ముచ్యతే సర్వపాపేభ్యో విష్ణులోకం స గచ్ఛతి ॥

శ్లో॥ అంబ! త్వద్దర్శనాన్ముక్తిః నజానే స్నానజం ఫలమ్ ।
స్వర్గారోహణ సోపానే మహాపుణ్య తరంగిణి ॥

శ్లో॥ విశ్వేశం మాధవం ధుండిం దండపాణిం చ భైరవమ్ ।
వందే కాశీం గుహాం గంగాం భవానీం మణికర్ణికామ్॥

శ్లో॥ అతితీక్ష్ణ మహాకాయ కల్పాంత దహనోపమ ।
భైరవాయ నమస్తుభ్యం అనుజ్ఞాం దాతు మర్హసి ॥

శ్లో॥ నందినీ నళినీ సీతా మాలినీ చ మహాపగా ।
విష్ణుపాదాబ్జసంభూతా గంగా త్రిపథగామినీ ॥

శ్లో॥ భాగీరథీ భోగవతీ జాహ్నవీ త్రిదశేశ్వరీ ।
ద్వాదశైతాని నామాని యత్ర యత్ర జలాశయే ॥

శ్లో॥ స్నానకాలే పఠేన్నిత్యం మహాపాతక నాశనమ్ ।
(స్నానోద్యతః స్మరేన్నిత్యం తత్ర తత్ర వసామ్యహమ్) ॥

శ్లో॥ పుష్కరాద్యాని తీర్థాని గంగాద్యాః సరితస్తథా ।
ఆగచ్ఛంతు పవిత్రాణి స్నానకాలే సదా మమ ॥

అని ఈవిధముగా గంగామాతను ప్రార్థించిన పిమ్మట, బొడ్డువరకుగల లోతైన నీటిలో నిలబడవలెను. ముందుగా జుట్టుముడిని విప్పవలెను. ముక్కు, చెవులను చేతులతో మూసికొని మూడుమార్లు నీటిలో మునుగవలయును. ఆచమనము చేసి జుట్టు ముడి వేసికొనవలయును. మౌనముగా స్నానము చేయవలయును.)

1. సంకల్పము

పునరాచామేత్ । ప్రాణానాయమ్య ॥ (మరల స్మృత్యాచమనము చేసి, ప్రాణాయామము చేయవలయును.) గోవింద గోవింద శ్రీమహావిష్ణోరాజ్ఞయా ప్రవర్తమానస్య అద్య బ్రహ్మణః ద్వితీయ పరార్ధే । శ్వేత వరాహకల్పే । వైవస్వత మన్వంతరే । (అష్టావింశన్మహాయుగే) కలియుగే । ప్రథమపాదే । అస్మిన్ వర్తమాన వ్యావహారిక చాంద్రమానేన ప్రభవాది షష్టి సంవత్సరాణాం మధ్యే । స్వస్తి శ్రీ ..... నామ సంవత్సరే ..... అయనే ..... ఋతౌ .... మాసే ..... పక్షే..... తిథౌ.... వాసరే శుభవాసరే । శుభనక్షత్రే । శుభయోగే । శుభకరణే । ఏవం గ్రహగుణ విశేషణ విశిష్టాయాం శుభతిథౌ। శ్రీమాన్ ..... గోత్రః ..... నామధేయోఽహం । ధర్మపత్నీ సమేతోఽహం । శ్రీమతః ..... గోత్రస్య ..... నామధేయస్య । ధర్మపత్నీ సమేతస్య। మమ ఇహ జన్మని జన్మాంతరేషు మనోవాక్కాయ కర్మభిః జ్ఞానతోఽజ్ఞానతః కాయిక వాచిక మానసిక సాంసర్గిక (స్పృష్టాఽస్పృష్ట, భుక్తాఽభుక్త, పీతాఽపీత) సకల పాపక్షయార్థం । శ్రుతి–స్మృతి–పురాణోక్త ఫలప్రాప్తి పూర్వకం శ్రీభగవత్ప్రీత్యర్థం చ । / ప్రాతఃకాల (మధ్యాహ్నా, సాయంకాల) గంగా గోదావరీ స్నానం అహం కరిష్యే ॥ ఇతి సంకల్ప్య । హిరణ్య శృంగమితి సూక్తం జపేత్ ॥

2. సూక్త పఠనము

హిరణ్యశృంగం వరుణం ప్రపద్యే తీర్థం మే దేహ్యాచితః । యన్మయా భుక్త మసాధూనాం పాపేభ్యశ్చ ప్రతిగ్రహః । యన్మే మనసా వాచా కర్మణా వా దుష్కృతం కృతమ్ । తన్న ఇంద్రో వరుణో బృహస్పతి స్సవితా చ పునంతు పునః పునః ॥ తతో మార్జయేత్ ॥ (అనంతరము దిగువ మంత్రములతో మార్జనము చేసికొనవలయును.)

3. మార్జనము

(ఆపోహిష్ఠేతి తృచస్యాం బరీషః సింధుద్వీప ఋషిః । ఆపో దేవతా । గాయత్రీ ఛందః । మార్జనే వినియోగః ॥)

1. ఓం ఆపోహిష్ఠేతి తృచస్యాంబరీషః సింధుద్వీప ఋషిః । ఆపో దేవతా । గాయత్రీ ఛందః । మార్జనే వినియోగః ॥

ఓం ఆప్తో హి ష్ఠా మయోభువః । తా న ఊర్జే దధాతన । మహేరణాయ చక్షసే । యో వ శ్శివ తమో రసః। తస్య భాజయతేహ నః। ఉశతీరివ మాతరః। తస్మాఅరం గమామ వః। యస్యక్షయాయ జిన్వథ । ఆపో జనయథా చ నః ॥

2. హిరణ్యవర్ణా శ్శుచయః పావకా యాసు జాతః కశ్యప్తో యాస్విన్ద్ర ।

అగ్నిం యా గర్భం దధిరే విరూపా స్తా న ఆపశ్శగ్ స్యోనా భవన్తు ॥ ॥ యాస్సాగ్ ం రాజా వరుణో యాతి మధ్యే సత్యా నృతే అవపశ్యన్ జనానామ్ ।

మధు శ్చుత శ్శుచయో యాः పావకాస్తాన ఆప శ్శగ్ స్యోనా భవన్తు ॥ 2 ॥

యాసాం దేవా దివి కృణ్వన్తి భక్షం యా అన్త రిక్షే బహుధా భవన్తి । యాः పృథివీం పయ సోన్దన్తి శుక్రాస్తాన ఆపశ్శగ్ స్యోనా భవన్తు ॥ 3 ॥

శివేన మా చక్షుషా పశ్య తా ప శ్శివయా తను వోపస్పృశత త్వ చం మే । సర్వాగ్ం అగ్నీగ్ం రప్సుషదో హువేవో మయి వర్చో బల మోజో నిధత్త ॥ 4 ॥

3. ఇద మాపః ప్రవహతాఽవద్యం చ మలంచయత్। యచ్చాభి దుద్రోహానృతం యచ్చ శేపే అభీరుణమ్ ॥

4. ఆపో మా తస్మాదేనసో విశ్వాన్ముంచ త్వగ్ం హసః । నిర్ముముంచామి శపథా న్నిర్మా వరుణా దధి । నిర్మాయ మస్య షడ్బీశా త్సర్వస్మా ద్దేవకిల్బిషాదుతో మనుష్య కిల్బిషాత్ ॥

పవమాన సూక్తము

5. పవమానస్సువర్జనః । పవిత్రేణ విచర్షణిः । యాः పోతా స పునాతుమా ॥ పునం తు మా దేవజనాः । పునం తు మనవోధియా । పునం తు విశ్వ ఆయవः॥ జాతవేదः పవిత్రవత్। పవిత్రేణ పునాహిమా । శుక్రేణ దేవ దీద్యత్ । అగ్నే క్రత్వాక్రతూగ్ం రను ॥ యత్తే పవిత్ర మర్చిషి। అగ్నే వితత మంతరా । బ్రహ్మతేన పునీమహే ॥ ఉభాభ్యాం దేవ సవితః । పవిత్రేణ సవేన చ । ఇదం బ్రహ్మ పునీమహే ॥ వైశ్వదేవీ పునతీ దేవ్యాగాత్। యస్యై బహ్వీ స్తనువో వీత పృష్ఠాः । తయా మదంతస్సధ మాద్యేషు । వయగ్ స్యామ పతయో రయీణామ్ ॥ వైశ్వానరో రశ్మిభిర్ మా పునాతు । వాతః ప్రాణేనేషిరో మయోభూः । ద్యావాపృథివీ పయసా పయోభిः । బుతావరీ యజ్ఞియే మా పునీతామ్ ॥ బృహద్భిస్సవితస్తృభిः । వరిష్ఠై ర్దేవ మన్మభిः । అగ్నే దక్షైः పునా హి మా ॥ యేన దేవా అపునత। యేనాపో దివ్యంకశః । తేన దివ్యేన బ్రహ్మణా । ఇదం బ్రహ్మ పునీమహే॥ యః పావమానీ రధ్యేతి । ఋషిభిస్సం భృతగ్ం రసమ్ । సర్వగ్ం స పూత మశ్నాతి । స్వదితం మాతరిశ్వనా॥ పావమా నీ ర్యో అధ్యేతి । ఋషిభి స్సంభృతగ్ం రసమ్ । తస్మై సరస్వతీ దుహే । క్షీరగ్ం సర్పిర్మ ధూదకమ్ ॥ పావమానీ స్స్వస్త్యయనీः। సుదుఘా హి పయస్వతీः । ఋషిభి స్సంభృతో రసః । బ్రాహ్మణేష్వమృతగ్ం హితమ్ ॥ పావమానీ ర్దిశంతునः । ఇమంలోకమథో అముమ్ । కామాన్ థ్సమర్ధయంతునः । దేవీ ర్దేవైస్సమా భృతాः॥ పావమానీ స్స్వస్త్యయనీः। సుదుఘా హి ఘృతశు చ్చతః । ఋషిభి స్సం భృతో రసః । బ్రాహ్మణే ష్వమృతగ్ం హితమ్ ॥ యేనదేవాः పవిత్రేణ । ఆత్మానం పునతే సదా । తేన సహస్ర ధారేణ । పావమాన్యः పునంతుమా॥ ప్రాజాపత్యం పవిత్రమ్। శతోద్యామగ్ం హిరణ్మయమ్। తేన బ్రహ్మవిదో వయమ్ । పూతం బ్రహ్మ పునీమహే ॥ ఇంద్రస్సునీతీ సహమాపునాతు। సోమ స్స్వస్త్యా వరుణ స్సమీచ్యా । యమోరాజా ప్రమృణాభిः పునాతుమా। జాతవేదా మోర్జయం త్యా పునాతు ॥ పునర్నిమజ్య ॥ (తిరిగి మరొకసారి నీటిలో మునిగి స్నానము చేయవలయును. ఆ తర్వాత)

"నమోఽగ్నయ ఇతి నమస్కృత్య॥ ("నమోఽగ్నయే" అను ఈ క్రింది మంత్రమును చెప్పుచు జలరాశికి నమస్కరింప వలెను.)

నమస్కారము

మంత్రః ॥ నమోఽగ్నయేఽప్సుమతే నమ ఇంద్రాయ నమో వరుణాయ నమో వారుణ్యై నమోఽద్భ్యः ॥

అపాం ఆలోడనమ్ (జలమును కదుపుట)

"యదపాంక్రూర" మితి సాంగుష్ఠ యజ్ఞ సూత్రేణాఽలోడి తాభిరద్భిస్త్రిరాప్లుత్య । – ("యదపాంక్రూర" మనెడు ఈ క్రింది మంత్రమును పఠించుచు, తమ బొటనవ్రేలితో యజ్ఞోప వీతమును గ్రహించి జలమును గుండ్రముగా త్రిప్పుచూ దాని మధ్యభాగమున మూడుసార్లు మునుగవలయును.)

ఆలోడన పూర్వక మవగాహనమ్

(రెండు చేతులతో నీటిని కదుపుచూ స్నానము చేయుట)

యదపాం క్రూరం యదమేధ్యం యదశాంతం తదప గచ్ఛతాత్ ॥ అత్యాశనా దతీపానా ద్యచ్చ ఉగ్రాత్ ప్రతిగ్రహాత్। తన్నో వరుణో రాజా పాణినా హ్యవమర్శతు ॥ సోఽ హ మపాపో విరజో నిర్ముక్తో ముక్త కిల్బిషః। నాకస్య పృష్ఠ మారుహ్యా గచ్ఛేత్ బ్రహ్మస లోకతామ్ ॥ యశ్చాప్సు వరుణ స్సపునాత్వఘమర్షణః ॥ **ఇమమ్మే గంగేత్యాపోభిమంత్ర్య ॥** (“ఇమం మే గంగ” అను ఈ దిగువ మంత్రమును పఠింపుచు జలమును అభిమంత్రించవలయును)

ఇమం మే గంగే యమునే సరస్వతి శుతుద్రిస్తోమగ్ం సచతా పరుష్ణియా । అసిక్న్యా మరుద్వృధే వితస్త యాఽఽర్జీకీ యే శృణుహ్యా సుషోమయా ॥

4. అఘమర్షణసూక్త పఠనము, అవగాహనము

ఋతం చే త్య ఘమర్షణ సూక్తేనాప్సుఽవగాహేత ॥ (ఈ క్రింద పేర్కొనబడిన “ఋతం చ” అను అఘమర్షణ సూక్తమును పఠింపుచు జలమునందు స్నానము చేయవలయును.)

ఋతం చ సత్యం చాభీద్ధా త్తపసోఽధ్యజాయత । తతో రాత్ర్యజాయత తత స్సముద్రో అర్ణవః ॥ సముద్రా దర్ణవా దధి సంవత్సరో అజాయత। అహోరాత్రాణి విదధ ద్విశ్వస్య మిషతో వశీ ॥ సూర్యాచంద్రమసౌ ధాతా యథా పూర్వ మకల్పయత్ । దివం చ పృథివీం చాంత రిక్షమథో స్వః॥ యత్ పృథివ్యాగ్ం రజస్వ మాంతరిక్షే విరోదసీ। ఇమాగ్ స్తదాపో వరుణః సపునాత్వఘమర్షణః॥ పునంతు వసవః పునాతు వరుణః పునాత్వఘమర్షణః। ఏషభూతస్య మధ్యే భువనస్య గోప్తా। ఏష పుణ్యకృతాన్ లోకానేష మృత్యోర్విరణ్మయమ్। ద్యావా పృథివ్యోర్ హిరణ్మయగ్ం సగ్గ్ శ్రితగ్ం సువః ॥ సనస్సువ స్సగ్ం శిశాధి॥

ఆచమనము

ఆర్ద్రం జ్వలతీ త్యాచమ్య॥ (“ఆర్ద్రం జ్వలతి” అను మంత్రము చేత ఆచమనము చేయవలయును.)

ఆర్ద్రం జ్వలతి జ్యోతి రహమస్మి। జ్యోతిర్జ్వలతి బ్రహ్మాహమస్మి । యోఽహమస్మి బ్రహ్మాహమస్మి। అహ మస్మి బ్రహ్మాహమస్మి। అహ మేవాహం మాం జుహోమి స్వాహా ॥

(ఉదకరూపములో తడిగా ఉన్నట్టి ఆర్ద్రము జ్యోతిగా ప్రకాశించుచున్నది. (చైతన్యరూపమైన) ఆ జ్యోతియే నేను అగుదును అనగా బ్రహ్మమే నేనగుదునని భావము. ఇంతకుముందు జీవుడనైయున్న నేనే ఇప్పుడు బ్రహ్మమును అగుచున్నాడను. అయితే జీవాత్మకు సృష్టితో సిద్ధమగు స్వరూపము నశించి బ్రహ్మత్వమనెడు రూపాంతరము సిద్ధించుచున్నదని మాత్రము కాదు. బ్రహ్మస్వరూపుడనగు నా యందు అజ్ఞానముచేత జీవత్వము ఆరోపింపబడినది. వివేకమువలన ఆ అజ్ఞానము తొలగిపోయినది. కనుక పూర్వసిద్ధమగు బ్రహ్మరూపమును నేనే అనుభవించుచున్నాను. కాని నూతనమగు బ్రహ్మత్వము ఎక్కడినుండియో నాకు రాలేదు. నేనే అయిన నేను బ్రహ్మమును అగుచున్నాను. అట్టి నేనే జలరూపుడనగు నన్నే ఈ దేహమునందున్న ప్రాణాద్యభిమాన దేవతలకొరకు జలరూపమగు హవిస్సును, ఉదరాగ్నియందు హోమము చేయుచున్నాడను” అని తాత్పర్యము.

స్నానానంతరము “ఆర్ద్రంజ్వలతి” – అను మంత్రముచేత ఆచమింపవలయునని చెప్పబడినది. ఈ మంత్రములోని తాత్పర్యరహస్యము ఇచట పేర్కొనబడినది. సమంత్రకవిధితో స్నానమును ముగించి జలరాశిలో నిలబడి చేతిలో జలమును తీసికొని – అహమస్మి బ్రహ్మాహమస్మి – నేను నేనే బ్రహ్మమును అని స్మరించుటకు, గుర్తించుటకు, అనుభవించుటకు ఏర్పరచిన సనాతన ఋషిమతము ఎంతగొప్పదో ఇచట గుర్తించవలెను. పాఠకులకు ఇతోధికలాభము చేకూరగలదని ఈ మంత్ర రహస్యము ఇచట పేర్కొనబడినదని గమనింపగలరు. (జలరాశియే బ్రహ్మస్వరూపము. చేతిలో తీసికొనిన జలమే, బ్రహ్మమునుండి విడివడిన ఆత్మ లేదా జీవాత్మ స్వరూపము అని తెలియవలెను.)

5. స్నానాంగతర్పణ విధానము

గంగాది తీర్థములయందు స్నానము చేసిన తదుపరి స్నానాంగ తర్పణమును చేయవలయును. సంధ్యకంటే ముందే దీనిని తప్పకుండా చేయవలయునని చెప్పబడినది. అశౌచము నందు కూడా స్నానాంగ తర్పణము నిషేధింపబడ లేదనియు, జీవపితరులకు కూడా ఇది విహితమైనదనియు పేర్కొనబడినది. కేవలము చివరి అంశము మాత్రము జీవపితరులైన వారలు విడువదగినది. దానిని కుండలీకరణములో స్పష్టముగా పేర్కొనబడినది. ఇచట జలముతోనే తిలకము, త్రిపుండ్రము ధరించవలెను. అనగా ఎడమచేతిలో ఉ

దకమును తీసికొని కుడిబొటనవ్రేలితో ఊర్ధ్వపుండ్రమును ధరించి తదనంతరము మూడువ్రేళ్ళతో త్రిపుండ్రమును ధరింపవలెను.

రెండు చేతులను దగ్గరగా ఉంచి అంజలి అనగా దోసిలిగా పెట్టి జలమును నిండుగా తీసికొనవలెను. తదుపరి ఆవు కొమ్ముల ఎత్తు వరకు పైకెత్తి జలములోనే అంజలిని విడువవలయును. ఇందులో దేవ, ఋషి, పితరులకు మరియు తమ, తమ పితృపితామహులకు కూడా తర్పణము విడువవలయును.

స్నానాంగ తర్పణ విధి

ఆచమ్య । ప్రాణానాయమ్య ॥ (స్మృత్యాచమనము చేసి ప్రాణాయామము చేయవలయును.)

పూర్వోక్త ఏవం గుణ విశేషణ విశిష్టాయాం శుభతిథౌ॥ శ్రీపరమేశ్వర ప్రీత్యర్థం ..... అముక స్నానాంగత్వేన దేవాది తర్పణం కరిష్యే॥ ఇతి సంకల్ప్య ॥ (పైన చెప్పిన విధముగ సంకల్పించిన పిదప–)

దేవ తర్పణము

ఉపవీతీ – దేవతీర్థేన తర్పణం కుర్యాత్ ॥ (ఉపవీతిగ – యజ్ఞోపవీతమును ధరించి దేవతీర్థముచేత ఒక్కొక్కమారు తర్పణము విడువవలయును.)

1. బ్రహ్మాదయో యే దేవాः తాన్ దేవాగ్స్తర్పయామి ॥ ౧
2. సర్వాన్ దేవాగ్ స్తర్పయామి ॥ ౧
3. సర్వాన్ దేవగణాగ్ స్తర్పయామి ॥ ౧
4. సర్వాः దేవపత్నీ స్తర్పయామి ॥ ౧
5. సర్వాన్ దేవపుత్రాగ్ స్తర్పయామి ॥ ౧
6. సర్వాన్ దేవ పౌత్రాగ్ స్తర్పయామి ॥ ౧
7. భూర్దేవాగ్ స్తర్పయామి ॥ ౧
8. భువర్దేవాగ్ స్తర్పయామి ॥ ౧
9. సువర్దేవాగ్ స్తర్పయామి ॥ ౧
10. భూర్భువస్సువ ర్దేవాగ్ స్తర్పయామి ॥ ౧

ఋషి తర్పణము

నివీతీ భూత్వా – ఉత్తరాభిముఖः – ఋషితీర్థేన ద్విరావృత్త్యా– (నివీతియై – అనగా యజ్ఞోపవీతమును కంఠమాలవలె ధరించి ప్రదక్షిణముగా ఉత్తరదిక్కునకు తిరిగి ఋషితీర్థము చేత రెండేసి పర్యాయములు తర్పణము చేయవలయును.)

1. కృష్ణద్వైపాయనాదయో యే ఋషయः
   తాన్ ఋషీగ్స్తర్పయామి ॥ ౨
2. సర్వాన్ ఋషీగ్ స్తర్పయామి ॥ ౨
3. సర్వాన్ ఋషి గణాగ్ స్తర్పయామి ॥ ౨
4. సర్వాः ఋషిపత్నీ స్తర్పయామి ॥ ౨
5. సర్వాన్ ఋషిపుత్రాగ్ స్తర్పయామి ॥ ౨
6. సర్వాన్ ఋషిపౌత్రాగ్ స్తర్పయామి ॥ ౨
7. భూ ఋషీగ్ స్తర్పయామి ॥ ౨
8. భువర్ ఋషీగ్ స్తర్పయామి ॥ ౨
9. సువర్ ఋషీగ్ స్తర్పయామి ॥ ౨
10. భూర్భువస్సువర్ ఋషీగ్ స్తర్పయామి ॥ ౨

పితృ తర్పణము

ప్రాచీనావీతినా, దక్షిణాభిముఖः – పితృతీర్థేన త్రిరావృత్త్యా తర్పయేత్– (అనగా ప్రాచీనావీతియై (యజ్ఞోపవీతమును కుడిచేతినుండి తీసి ఎడమచేతికి ధరించుటచే ప్రాచీనావీతి అగును.) దక్షిణ దిశవైపు ముఖము చేసి పితృతీర్థము చేత ఒక్కొక్కరికి మూడేసిమార్లు తర్పణము చేయవలయును.)

1. సోమః పితృమాన్ యమోంగిరస్వానగ్ని ష్వాత్తాగ్నిः
   కవ్యవాహనాదయో యే పితరः తాన్
   పితౄగ్స్తర్పయామి ॥ ౩
2. సర్వాన్ పితౄగ్ స్తర్పయామి ॥ ౩
3. సర్వాన్ పితృగణాగ్ స్తర్పయామి ॥ ౩
4. సర్వాः పితృపత్నీ స్తర్పయామి ॥ ౩
5. సర్వాన్ పితృపుత్రాగ్ స్తర్పయామి ॥ ౩
6. సర్వాన్ పితృపౌత్రాగ్ స్తర్పయామి ॥ ౩
7. భూः పితౄగ్ స్తర్పయామి ॥ ౩
8. భువः పితౄగ్ స్తర్పయామి ॥ ౩
9. సువः పితౄగ్ స్తర్పయామి ॥ ౩
10. భూర్భువస్సువः పితౄగ్ స్తర్పయామి ॥ ౩

(సవ్యం) అనేన ప్రాతः స్నానాంగ దేవర్షి పితృతర్పణేన భగవాన్ సర్వాత్మకः శ్రీపరమేశ్వరः సుప్రీణాతు ॥ తత్సత్ సర్వం శ్రీపరబ్రహ్మార్పణమస్తు॥

స్నానాంగ పితృతర్పణము

(దీనిని తండ్రి జీవించియున్నవారు చేయకూడదు)

స్నాత్వా॥ ప్రాచీనావీతి – దక్షిణాభిముఖः – పితృతీర్థేన త్రిరావృత్త్యా తర్పయేత్ ॥ ప్రాచీనావీతిగా యజ్ఞోపవీతమును ధరించి దక్షిణదిక్కు ముఖముచేసి పితృతీర్థము(1)ద్వారా ఒక్కొక్కరికి మూడేసి పర్యాయములు తర్పణము విడువవలయును.

ప్రాతఃస్నానకాలే॥

1. అస్మత్ – పితృ–పితామహ – ప్రపితామహానాం ... గోత్రాణాం ... శర్మణాం – వసురుద్రాదిత్యరూపాణాం తృప్యంతామ్ ॥౩
2. అస్మత్ – మాతృ – పితామహీ – ప్రపితామహీనాం .... గోత్రాణాం .... దాయినాం.... వసురుద్రాదిత్యరూపాణాం తృప్యంతామ్॥ ౩
3. అస్మత్ – మాతామహ – మాతుఃపితామహ – మాతుఃప్రపితామహానాం... గోత్రాణాం ... శర్మణాం – వసురుద్రాదిత్య రూపాణాం తృప్యంతామ్ ॥ ౩
4. అస్మత్ – మాతామహీ – మాతుఃపితామహీ – మాతుఃప్రపితామహీనాం ....గోత్రాణాం ..... దాయానాం – వసురుద్రాదిత్య రూపాణాం తృప్యంతామ్ ॥ ౩
5. ఓం బ్రహ్మాదిస్తంబ పర్యంతం జగత్తృప్యతామ్ ॥ ౩

సర్వేషాం పిత్రాణామక్షయ పుణ్యలోకావాప్యర్థం అఖండ పుణ్యతీర్థే ప్రాతఃస్నానమహం కరిష్యే ॥ ఇతి స్వాత్వా ॥

తటే ఉదక ప్రక్షేపణమ్

తతః ఆచమ్య ॥ పిదప స్మృత్యాచమనము చేసి – కొంచము ఒడ్డువైపునకు వచ్చి నీటియందే నిలబడి దిగువన చెప్పబడిన రెండు శ్లోకములను చదువుచు ప్రతి శ్లోకమునకు ఒకమారు చొప్పున దోసిలితో ఉదకమును తీసికొని ఒడ్డునందు భూమిపై విడువవలెను.

1. యన్మయా దూషితం తోయం శారీరమలసంయుతమ్ ।
తస్య పాపవిశుద్ధ్యర్థం యక్ష్మాణం తర్పయామ్యహమ్ ॥
2. అసంస్కారాశ్చ యే కేచిత్ జలాశాః పితరో మమ ।
తేషా మాప్యాయనార్థాయ దీయతే సలిలం మయా ॥

॥ ఇతి తటే హస్తాభ్యాం ఉదకం నిక్షిప్య ॥

శిఖా నిష్పీడనము

జలమునుండి బయటకు వచ్చి దిగువ శ్లోకమును పఠింపుచు జుట్టు (శిఖ)ను కుడివైపునకు పితృతీర్థము (అంగుష్ఠ–తర్జనీ మధ్యభాగము)తో నీటిని భూమిమీద పిండవలెను–

లతాగుల్మేషు వృక్షేషు పితరో యే వ్యవస్థితాః ।
తే సర్వే తృప్తిమాయాంతు మయోత్సృష్టైః శిఖోదకైః ॥

వస్త్ర నిష్పీడనాదికము

వస్త్రం చతుర్గుణీ కృత్య – ప్రాచీనావీతీ – వస్త్రమ్ నిష్పీడ్య – స్నానముతో తడిసిన వస్త్రమును నాలుగు మడతలుగాచేసి యజ్ఞోపవీతమును ప్రాచీనావీతిగా ధరించి ఈ క్రింది శ్లోకమును పఠించుచు ఒడ్డున నీటిని పిండవలయును–

యే కే చాస్మత్కులే జాతా అపుత్రాః గోత్రిణో మృతాః ।
తే గృహ్ణంతు మయా దత్తం వస్త్రనిష్పీడనోదకమ్ ॥

ఇతి వస్త్రం నిష్పీడ్య ॥ శ్రీరామ – రామ – రామ ॥

తర్వాత వేరొక (పొడి) వస్త్రముచేత దేహము నంతయును శుభ్రముగ తుడుచుకొనవలయును.

స్నానము చేసిన పిమ్మట శరీరమును పొడివస్త్రముతో తుడుచుకొనకుండా, తడిదేహముతో తడి ఆరిపోవువరకు అట్లే నిలబడియుండినచో చాలామంచిదని గోభిల స్మృతికారుని అభిప్రాయము.

పిబంతి శిరసో దేవాః పిబంతి పితరో ముఖాత్ ।
మధ్యతః సర్వగంధర్వా అధస్తాత్ సర్వజంతవః ॥
తస్మాత్ స్నాతో న నిర్మృజ్యాత్ స్నానశాట్యా న పాణినా ।
తిస్రః కోట్యోఽర్ధకోటీ చ యావంత్యంగరుహాణి వై ।
వసంతి సర్వతీర్థాని తస్మాన్న పరిమార్జయేత్ ॥

(గోభిలః)

'శిరసు నుండి జారెడు నీటిబిందువులను దేవతలు త్రాగెదరు. ముఖభాగమునుండి జారెడు జలమును పితరులు త్రాగెదరు. మధ్యభాగము నుండి జారెడు ఉదకమును గంధర్వులు త్రాగెదరు. క్రిందిభాగమునుండి పారెడు నీటిని సకలజంతువులు త్రాగును. ముప్పది లేదా పదునైదు కోట్ల తీర్థములు సకల అంగముల యందు నివసించును. కావున (నదీ) స్నానానంతరము శరీరాంగములను తుడువకూడదు.'

ఒకవేళ అశక్తులైన యెడల శుభ్రమైన పొడి వస్త్రముతో తుడుచుకొనవలెను. గంగాది తీర్థములయందు స్నానము చేసినమీదట శరీరమును పొడిగుడ్డతో తుడువకుండా ఉండుటకు ప్రత్యేకమైన శ్రద్ధ వహింపవలెను. ఇతరప్రదేశముల యందు తడితో కొన్ని క్షణములు నిలచిన పిదప పొడి వస్త్రముతో శరీరమును తుడుచుకొనవలెను. స్నానానంతరము తడి వస్త్రములతో మల–మూత్రములను విసర్జింపకూడదు.

పుష్కర స్నాన విధి

(గంగా మొదలగు నదులకు పుష్కరకాలము వచ్చినప్పుడు ఆయా నదులలో పవిత్రస్నానము చేయుటకుగాను శాస్త్రవిధానము పేర్కొనబడినది.)

ఏవంగుణ..... శుభతిథౌ సిధ్యర్థం (గంగ) (మేషంగతే దేవగురౌ ఇతి గంగాయాః। సింహం గతే దేవగురౌ ఇతి గోదావర్యాః। కన్యాగతే దేవగురౌ ఇతి కృష్ణా నద్యాః ॥) సార్ధత్రికోటి పుష్కర ప్రయుక్త గంగా ॥ (గోదావరీ) (కృష్ణా) ఇత్యాది మహానదీ స్నాన మహం కరిష్యే ॥ శ్లో॥ పిప్పలాదా త్సముత్పన్నే కృత్తేలోక భయంకరి । పాషాణంతే మయాదత్త । (సైకతంతే) (మృత్తికాంతే) మాహారార్థం ప్రకల్ప్యతామ్ ॥

॥ ఇతి గంగా నద్యాం త్రివారం బదరీఫల మాత్ర మృత్తికాం నిక్షిపేత్ ॥ (రేగుపండు పరిమాణము మట్టిని తీసికొని మూడుసార్లు నదీజలమునందు సమర్పింపవలెను.)

శ్లో॥ కృష్ణవేణీతి యో బ్రూయాత్ సప్త జన్మార్జి తాన్యపి ।
మహాపాపాని నశ్యంతి విష్ణులోకం స గచ్ఛతి ॥
శ్లో ॥ పుష్యార్కే జన్మనక్షత్రే వ్యతీపాతే చ వైధృతౌ ।
సకృత్‌గోదావరీ స్నానం కులకోటిం సముద్ధరేత్ ॥
శ్లో॥ పావనిత్వం జగత్పూజ్యే సర్వతీర్థ మయే శుభే ।
త్వయి స్నాతు మనుజ్ఞాం మే దేహి గంగే (కృష్ణే) (గోదే)
మహానది ।
కన్యాగతే దేవగురౌ పితౄణాంతారణాయ చ ।
సర్వపాప విముక్త్యర్థం తీర్థస్నానం కరోమ్యహమ్ ॥
శ్లో॥ తీర్థరాజ నమస్తుభ్యం సర్వలోకైక పావన ।
త్వయిస్నానం కరోమ్యద్య భవబంధ విముక్తయే ॥
శ్లో॥ కన్యాగురౌ గిరిజే దేవిభద్రే బ్రహ్మాండ భాండేఽపి చ యాని సంతి ।
దివ్యంతరిక్షే భువినాగలోకే సర్వాణితీర్థాని తవోదరేస్యుఃll
శ్లో॥ తీర్థాని నద్యశ్చ తథా సముద్రాః క్షేత్రాణ్యరణ్యాని తథా క్రమాశ్చ ।
వసంతి సర్వాణిచ సర్వరూపాః । గంగానదీమేషగతేఽమరేజ్యే ॥
(కృష్ణానదీ కన్యగతే సురేజ్యే) గోదానదీ సింహగతే సురేజ్యే)
శ్లో॥ గిరిజేతే నమస్తుభ్యం మహాదేవస్య వల్లభే! ।
స్నానేనానేన మే పాపం హర శ్రీహర రూపిణి ॥
మహాపాతకకోటీని బహుజన్మార్జితాన్య పి ।
హర్తుం త్వత్తోధికా దేవి నాన్యాస్తీహ సరిద్వరే ॥
స్నానాత్రిస్సప్త మనుజాన్ పితృమాతృ కులోద్భవాన్ ।
ముక్తిం ప్రాపయితుం గంగే (కృష్ణే) (గోదే) త్వత్సమీప
ముపాగతఃll
తస్మాద్విష్ణుంగ సంభూతే త్వయి స్నానం కరోమ్యహమ్ ॥
అనేన విధినా స్నానం గంగా నద్యాం సమాచరేత్ ॥

ఇతి ప్రథమ స్నానం కృత్వా॥ పునఃసంకల్ప్య॥ (అని మొదటిసారి స్నానము చేసి తిరిగి సంకల్పించవలెను.)

శ్లో॥ కన్యాగతే దేవగురౌ తీర్థరాజాన్వితేఽమలే ।
త్వయి స్నానం కరోమ్యద్య గిరిజేఽహం సరిద్వరే ॥

ఇతి ద్వితీయ స్నానం కృత్వా॥ అని రెండవమారు స్నానము చేసి తిరిగి సంకల్పము చేయవలెను) తత శ్శరీర శుధ్యర్థం అఘమర్షణ స్నాన మహం కరిష్యే॥ ఇతి సంకల్ప్య॥ **ఆపోహిష్ఠా మయో భువ ఇతి పంచాఘమర్షణానువాకాన్ పఠిత్వా॥ మార్జనం కుర్యాత్॥**

(ఆపోహిష్ఠా అనెడు ఐదు మంత్రాలను చెప్పుచూ, జలముతో మార్జనము చేసికొనవలయును.)

శ్లో॥ మమదేహ విశుద్ధ్యర్థ మఘమర్షణ మంత్రతః ।
గంగానది మహాదేవి త్వయి స్నానం కరోమ్యహమ్ ॥

ఇతి తృతీయ స్నానం కృత్వా ॥ (అని మూడవసారి స్నానము చేయవలెను) తతః పితౄన్ సముద్దిశ్య । దక్షిణాభిముఖోభవేత్ ॥ అపసవ్యేన తృప్యేత । సవ్యేన స్నానమాచరేత్ ॥ (పితృదేవతలను ఉద్దేశించి దక్షిణముఖమువైపు తిరిగి తమ పితృదేవతలను స్మరించి, నమస్కరించి, సవ్యముగ స్నానము చేయవలెను) ఇతి చతుర్థ స్నానం కృత్వా ॥ **తత స్సంకల్ప్య ॥ విధినా ప్రవాహాభిముఖో భవేత్ ॥ స్నాన సాద్గుణ్య సిద్ధ్యర్థం ప్రసన్నార్ఘ్యాణి కారయేత్ ॥** (నాల్గవసారి స్నానము చేసిన తర్వాత తిరిగి సంకల్పించి ప్రసన్నార్ఘ్యమును విడువవలయును.)

శ్లో॥ గంగాయై తీర్థరాజాయ ధిషణాయాది విష్ణవే ॥
శివాయ సర్వ దేవేభ్యో మునిభ్యోఽర్ఘ్యాణి కారయేత్ ॥

ఏవంగుణ .... సిద్ధ్యర్థం కన్యాగతే దేవగురౌ సార్ధ త్రికోటితీర్థ పుష్కర ప్రయుక్త శ్రీగంగా మహానద్యా మధునా మయా కృత స్నాన సాద్గుణ్య సిద్ధ్యర్థం గంగానదీ తీర్థరాజ జీవ హరి హర సుర మనుష్యేభ్యః ప్రత్యేకం సకృత్సకృత్ ప్రసన్నార్ఘ్య ప్రదానాని కరిష్యే ॥ (ప్రదానం కరిష్యేతి చ వక్తవ్యం) ఇతి సంకల్ప్య ॥ (అని ఇట్లు సంకల్పించి నదీప్రవాహమునకు ఎదురుగా నిలిచి దోసిట్లో నీరు తీసికొని, దిగువ చెప్పిన విధముగా ఎనిమిది (8) మార్లు అర్ఘ్యమును విడువవలెను.)

గంగానదీ ప్రవాహాభిముఖో భూత్వా అంజలావుదకం గృహీత్వా ॥

శ్లో॥ గంగానది మహాదేవి సర్వపాప హరేఽమలే ।
స్నాన సాద్గుణ్య సిద్ధ్యర్థ మిదమర్ఘ్యం దదామ్యహమ్ ॥
గంగానద్యై నమః – ఇదమర్ఘ్యం సమర్పయామి ॥

2. తీర్థరాజ మహాభాగ సర్వతీర్థ సమావృత ।
ఇదమర్ఘ్యం మయా దత్తం గృహాణ వరదోభవ ॥
తీర్థరాజాయనమః – ఇదమర్ఘ్యం సమర్పయామి॥

3. బృహస్పతే సురాధ్యక్ష సర్వదేవసుసంస్కృత ।
ఇదమర్ఘ్యం ప్రదాస్యామి సంగృహాణ మహామతే ॥
బృహస్పతయే నమః – ఇదమర్ఘ్యం సమర్పయామి ॥

4. శ్రీరమానాథ! శ్రీవిష్ణో! గంగోద్భవ పదాంబుజ ।
సంగృహాణ జగన్నాథ! ఇదమర్ఘ్యం దదామ్యహమ్ ॥
విష్ణవే నమః – ఇదమర్ఘ్యం సమర్పయామి ॥

5. ఉమానాథ! మహాదేవ! గంగాధర! మహేశ్వర!
ఇదమర్ఘ్యం మయాదత్తం సంగృహాణేఽశ త్ర్యంబక ॥
శివాయనమః – ఇదమర్ఘ్యం సమర్పయామి ॥

6. బ్రహ్మేంద్రాగ్ని ముఖాస్సర్వే సురాః పుణ్యఫలప్రదాః ।
ఇదమర్ఘ్యం ప్రదాస్యామి గృహ్ణీష్వ విధినాఽధునా ॥
బ్రహ్మాదిసర్వదేవేభ్యో నమః–ఇదమర్ఘ్యం సమర్పయామి ॥

బ్రహ్మాదిసర్వదేవేభ్యో నమః-ఇదమర్ఘ్యం సమర్పయామి ॥

7. వశిష్ఠో గౌతమోఽత్రిశ్చ భారద్వాజో మృకండుజః ।
విశ్వామిత్రో దేవలశ్చ తుభ్యమర్ఘ్యం దదామ్యహమ్ ॥

వశిష్ఠాది మునిభ్యో నమః - ఇదమర్ఘ్యం సమర్పయామి ॥

8. గంగాద్యాశ్చ మహానద్యో యాశ్చపుణ్యా స్సమాగతాః ।
ఇదమర్ఘ్యం ప్రదాస్యామి గృహ్ణీష్వ విధినాఽధునా ॥

॥గంగాదిసర్వనదీభ్యో నమః-ఇదమర్ఘ్యంసమర్పయామి ॥

॥ఇతి గంగాదిమహానదీనాం పుష్కరస్నాన విధి స్సమాప్తా॥

❖ ❖ ❖

మహానదీ స్నాన సంకల్ప పఠనమ్

శ్రీగురుభ్యోనమః ॥ పరమాత్మనేనమః ॥ తీర్థరాజాయ నమః ॥ శ్లో॥ త్వం రాజా సర్వతీర్థానాం త్వమేవ జగతః పితా । యకాచితం తీర్థ మే దేహ సర్వపాపైః ప్రముచ్యతే । ఆచమ్య ॥ కేశవాయనమః । నారాయణాయ నమః । మాధవాయ నమః । గోవిందాయ నమః । విష్ణవే నమః ॥ మధుసూదనాయ నమః । త్రివిక్రమాయ నమః । వామనాయ నమః ॥ శ్రీధరాయ నమః । హృషీకేశాయ నమః । పద్మనాభాయ నమః ॥ దామోదరాయ నమః । సంకర్షణాయ నమః । వాసుదేవాయ నమః । ప్రద్యుమ్నాయ నమః । అనిరుద్ధాయ నమః । పురుషోత్తమాయ నమః । అధోక్షజాయ నమః । నారసింహాయ నమః । అచ్యుతాయ నమః । జనార్దనాయ నమః । దేవేంద్రాయ నమః । హరయే నమః । శ్రీకృష్ణాయ నమః ॥ నదిం దృష్ట్వా ప్రణమ్య ॥ శ్లో॥ అంగుళ్యాగ్రైర్నాసికాగ్రం .... కల్పితం ॥ శుభే శోభన ముహూర్తే । ఆద్య బ్రహ్మణః ద్వితీయ పరార్ధే । జంబూద్వీపే । భరత వర్షే । భరతఖండే । దండకారణ్యే గోదావర్యాః । దక్షిణేతీర్థే । శాలివాహన శతాబ్దే । బౌద్ధావతారే । రామక్షేత్రే । అస్మిన్ వర్తమానే । చాంద్రమానేన । సంవత్సరే । ... అయనే । ..... ఋతౌ । .... మాసే । .... పక్షే । .... తిథౌ । .... వాసర యుక్తాయాం శుభనక్షత్ర శుభయోగ శుభకరణ । ఏవంగుణ విశేషేణ విశిష్టాయాం । శుభతిథౌ అస్మదాది గురూణాం । పరమగురూణాం । శ్రీమదానంద తీర్థం భగవత్పాదాచార్యాణాం తదంతర్యామ్య విరుద్ధ ప్రద్యుమ్న సంకర్షణ వాసుదేవ చతుర్మూర్త్యాత్మకః మాసాంతర్యామి । మాఘ ప్రయాగ మాధవ మూర్త్యాత్మక గంగా జనక శ్రీవాసుదేవ ప్రేరణ యా గంగాజనక శ్రీవాసుదేవ ప్రీత్యర్థం అస్యాం । గోదావర్యాం । అంతర్వేద్యాం । మహానంద్యాం భాగీరథ్యాది సార్ధక కోటితీర్థ సమాగమే । ప్రాతః సంకల్ప పూర్వక । అఖండ కృష్ణాకావేరి స్నానమహం కరిష్యే ॥



1.బ్రహ్మతీర్థం, 2.విష్ణుతీర్థం, 3.రుద్రతీర్థం (త్రిమూర్తి స్వరూపాలు), 4.ఆమలకతీర్థం (వేణి పుట్టినచోటు), 5.బలితీర్థం (మహాబలేశ్వరం), 6.వేణీసంగమ తీర్థం (కృష్ణా–వేణీ నదుల సంగమస్థానం), 7.కకుద్మతితీర్థం (కకుద్మతి నది సంగమం), 8.విహంగతీర్థం (అమృతంకోసం గరుత్మంతుడు తపస్సుచేసి పొందినచోటు), 9.భైరవతీర్థం (సిద్ధక్షేత్రము, ఇక్కడ నీరు పచ్చగా ఉంటుంది), 10.వాసుకితీర్థం (సర్పాలకు రాజైన వాసుకి శివుణ్ణి పూజించిన స్థలం), 11.మలాపహారిణితీర్థం (నది సంగమస్థానం, పరశురామ పాపహర తీర్థం), 12.కుంభేశ్వరతీర్థం, 13.పౌలస్త్యతీర్థం (పులస్త్యబ్రహ్మ పూజించిన శివలింగం ఉన్నచోటు), 14.మార్కండేయతీర్థం (శివుని కొరకు మార్కండేయుడు తపస్సు చేసిన స్థలం), 15.విశాల, 16.విజయ, 17.వైష్ణవి, 18.కుముద, 19.నారాయణి తీర్థాలు (15నుండి19వరకు ఈ ఐదింటిని పంచతీర్థాలంటారు), 20.కుబ్జేశ్వర తీర్థం, 21.మహాపాపహర తీర్థం, 22.పాపహారి తీర్థం (అనుష్ఠాన సిద్ధిక్షేత్రం), 23.కౌశికతీర్థం, 24.సప్తసాగర తీర్థం (సప్తసాగరములు నదిని దర్శించిన స్థలము), 25.సప్తకులోద్ధార తీర్థం (స్నానమాత్రంచేత ఏడు కులములను ఉద్ధరించే చోటు), 26.కులతారకతీర్థం, 27.భారతీతీర్థం, 28.మునితీర్థం (నది 2పాయలుగా చీలుతుంది), 29.మధుతీర్థం (పై 2 పాయలు కలిసే చోటు), 30.దేవహ్రద తీర్థం (ముక్తిక్షేత్రం) 31.కంకతీర్థం (పరశురామ తపోక్షేత్రం), 32.శూర్పారతీర్థం, 33.జంబుతీర్థం, 34.శతలింగతీర్థం, 35. క్రౌంచతీర్థం, 36.యజ్ఞవాటితీర్థం, 37.కుమారతీర్థం, 38.ఆదిత్యహృదయ తీర్థం, 39.అష్టకా సంగమతీర్థం, 40.వాల్మీకి తీర్థం, 41.సిద్ధిహ్రదతీర్థం, 42.ముద్గలతీర్థం, 43.రుద్రపాద స్కందతీర్థం (రుద్రపాదములున్నచోటు), 44.గోపాదతీర్థం, 45.శుక్లతీర్థం, 46.ఐరావతతీర్థం, 47.కుబేరతీర్థం, 48.దారిద్ర్య మోచనతీర్థం, 49.లింగతీర్థం, 50.ఇంద్రతీర్థం, 51.రామేశ్వరతీర్థం, 52.అంతర్వేదితీర్థం, 53.మయూరతీర్థం, 54.గోకర్ణతీర్థం, 55.అక్షయతీర్థం, 56.అనంతతీర్థం, 57.సూర్యతీర్థం (నైధ్రువ మహర్షి సూర్యుని కోసం తపస్సు ఆచరించిన ప్రదేశం), 58.సప్తకోటితీర్థం, 59.అంబరీషతీర్థం, 60.శంఖతీర్థం, 61.ఋణాపహరణ తీర్థం, 62.మలాపహారిణీతీర్థం (పరశురాముని పాపనివృత్తి క్షేత్రం) 63.లింగతటితీర్థం, 64.జాతిస్మరతీర్థం, 65.విష్ణుచ్ఛాయతీర్థం, 66.అనఘహ్రద తీర్థం (గంగాద్వారము), 67.కన్యాహ్రద తీర్థం (ఇక్కడ రాత్రి దేవదుందుభులు మ్రోగుతాయని ప్రతీతి) 68.సోమహ్రద తీర్థం, 69.సూర్యహ్రదతీర్థం, 70.త్రేతాగ్నితీర్థం, 71.పంచకుండ తీర్థం, 72.సత్యతీర్థం, 73.సుమతితీర్థం, 74.మత్స్యతీర్థం, 75.సూర్యతీర్థం, 76.గంగాకుండ శతతీర్థం, 77.సప్తఋషి తీర్థం, 78.విశ్వామిత్రతీర్థం, 79.కర్కోటకతీర్థం, 80.లవణతీర్థం, 81.తుంగభద్రాతీర్థం (అలంపూర్ జోగులాంబ క్షేత్రం), 82.పాతాళగంగతీర్థం (శ్రీశైలం), 83.ముచికుందతీర్థం (మూసీసంగమం), 84.భీమతీర్థం (భీమనదిసంగమం) 85.అమరహృదయతీర్థం (మట్టుపల్లిక్షేత్రం), 86.ముక్తితీర్థం (ముక్త్యాల), 87.నృసింహతీర్థం (వేదాద్రి నారసింహక్షేత్రం), 88.హరిణావర్తకతీర్థం (లేడి స్త్రీగా మారినచోటు), 89.పాపనాశనతీర్థం, 90.అమరేశ్వరతీర్థం (అమరావతిక్షేత్రం), 91.క్రౌంచతీర్థం, 92. విష్ణుతీర్థం

విజయవాడలోని తీర్థాలు

93.అనంతతీర్థం (అనంతుని తపస్సుచే ఏర్పడ్డది, ఉండవల్లిగుహ), 94.ఫల్గుణతీర్థం (ఇంద్రకీలాద్రికి దక్షిణంగా), 95.దుర్గాతీర్థం, 96.శివత్రిశూలతీర్థం, 97.శంఖతీర్థం, 98.సీతాహనుమ తీర్థం (సీతానగరం), 99.సుదర్శన నారసింహతీర్థం (మంగళగిరి), 100.వరాహతీర్థం, 101.చక్రతీర్థం (విజయవాడకు తూర్పు), 102.వేదతీర్థం (పడమటలంక), 103.ఋషితీర్థం, 104.సోమతీర్థం, 105.స్వయంభుతీర్థం, 106.కూర్మతీర్థం, 107.గరుడతీర్థం, 108.స్కందపురతీర్థం, 109.శంభుతీర్థం, (ఈ17తీర్థములు విజయవాడలోనివి)

110. ఉభయ రామేశ్వర తీర్థం (చిలుమూరు, ఐలూరు), 111.సప్తకోటితీర్థం, 112.అనంతతీర్థం, 113.ముక్తిక్షేత్రతీర్థం (శ్రీకాకుళం), 114.కోటిఫలితీర్థం, 115.నరకోత్తరణతీర్థం, 116.పాపనాశనతీర్థం, 117.శుక్లతీర్థం, 118.అగస్త్యతీర్థం,

119.వ్యాఘ్రతీర్థం, 120.విఘ్నేశ్వరతీర్థం, 121.వేణిసాగర సంగమ తీర్థం (వేణినది సముద్రంలో సంగమించే చోటు- మోరుతోట), 122.సుబ్రహ్మణ్యతీర్థం (మోపిదేవి), 123.కుమారతీర్థం, 124.త్రివేణితీర్థం, 125.క్రోశతీర్థం, 126.అగస్త్యేశ్వరతీర్థం, 127.మహాతీర్థం, 128.కర్కోటకతీర్థం, 129.మత్స్యతీర్థం, 130.వామనతీర్థం, 131.దత్తతీర్థం, 132.నాగగుండతీర్థం, 133.బ్రహ్మగుండతీర్థం, 134. రుద్రగుండ తీర్థం, 135. గోపాలతీర్థం (హంసలదీవి) 136. వరుణ తీర్థం, 137.కృష్ణాసాగర సంగమతీర్థం, 138.అశ్వమేధ పలతీర్థం.

ఈవిధంగా కృష్ణానది పుట్టినచోటునుండి ఎన్నో ఉపనదులను తనలో కలుపుకొని సముద్రంలో సంగమించేవరకు 138 పుణ్యతీర్థాలను ఏర్పరిచింది. ఈ పరమపవిత్ర తీర్థాలను దర్శించినవారు, ఆ తీర్థాలలో స్నాన, దాన, పిండప్రదానాదులు ఆచరించిన వారు అత్యంత పుణ్యఫలములను పొందుతారు.

నదీ పుష్కర నిర్ణయం

శ్లో. మేషే గంగా వృషే రేవా మిథునేచ సరస్వతీ।
యమునాయాం కుళీరేతు సింహే గోదావరీ స్థితే।
కన్యాయాం కృష్ణవేణ్యాంతు కావేర్యాంచ తులాగతే।
వృశ్చికే భీమరథ్యాంతు చాపే పుష్కర వాహినీ।
మృగే తుంగా ఘటే సింధు: మీనేతు ప్రణీతానదీ।
ఏవం ద్వాదశ రాశీనాం గురుచారే యథాక్రమమ్।।

బృహస్పతి మేషాది ద్వాదశ రాశులయందు ప్రవేశించినపుడు పుష్కరములు కలుగు నదుల వివరములు.

1.	మేషరాశి-	గంగా నదీ పుష్కరము
2.	వృషభరాశి-	రేవా నదీ పుష్కరము
3.	మిథునరాశి-	సరస్వతీ నదీ పుష్కరము
4.	కర్కాటకరాశి-	యమునా నదీ పుష్కరము
5.	సింహరాశి-	గోదావరీ నదీ పుష్కరము
6.	కన్యారాశి-	కృష్ణవేణీ నదీ పుష్కరము
7.	తులారాశి-	కావేరీ నదీ పుష్కరము
8.	వృశ్చికరాశి-	భీమరథీ నదీ పుష్కరము
9.	ధనస్సురాశి-	పుష్కర నదీ పుష్కరము
10.	మకరరాశి-	తుంగా నదీ పుష్కరము
11.	కుంభరాశి-	సింధు నదీ పుష్కరము
12.	మీనరాశి-	ప్రణీతా నదీ పుష్కరము

పురాణ, ఇతిహాసాలలో కృష్ణానది వర్ణన

పవిత్రమైన తన జలాలతో తెలుగు రాష్ట్రాలను అన్నపూర్ణగా మార్చిన కృష్ణానది ఈ ప్రాంతానికి తరతరాలుగా చారిత్రకంగా సాక్షీభూతమై నిలచింది. సాంస్కృతిక సంప్రదాయాలకు మూలకేంద్రంగా విరాజిల్లింది. అటువంటి కృష్ణానది గురించి అనేక పురాణాలు, ఇతిహాసాలు, కావ్యాలలో మనకు దహరణలు కనిపిస్తున్నాయి.

బ్రహ్మాండపురాణంలో కృష్ణానది 42,89,84,000 సంవత్సరాలకు పూర్వం ఆవిర్భవించినదని చెప్పబడుతున్నది. పద్మపురాణంలోని ఉత్తరఖండం 113వ అధ్యాయంలో చెప్పబడినదాని ప్రకారం ఈనది 9,81,080 సంవత్సరాలకు ముందు జన్మించినదని ఊహింపబడుతున్నది.

పై రెండు పురాణాలలో ఏ పురాణం ప్రకారం చూసినను ప్రపంచంలోని అత్యంత పురాతన నదులలో కృష్ణానదికూడా అతిప్రముఖమైనదని చెప్పవచ్చు.

అత్యంత ప్రాచీనమైన ఈ నది గురించి ఆయా పురాణలలోని వర్ణనలను, ప్రస్తావనలను ఒకసారి చూద్దాం.

మహాభారతంలో

"సదా నిరామయాం కృష్ణాం మందగాం మందగామినీం"।

"ఆంధ్రకాః కృష్ణా గోదావర్యోః మధ్యే విద్యమానో దేశః" అంటూ కృష్ణా-గోదావరి నదుల మధ్యలో ఉన్న ప్రాంతమే ఆంధ్రదేశంగా పిలవబడుతున్నదని మహాభారతంలో చెప్పబడింది.

బ్రహ్మాండ పురాణంలో

శ్లో।। గోదావరీ భీమరథీ కృష్ణవేణీచ మంజులా।
తుంగభద్రా సుప్రయోగాహ్యో కావేర్యా2థాపిచ।
దక్షిణాణే ప్రవహా నర్యాః సహ్యాపాదాద్వినిస్మృతాః।।

విష్ణుపురాణంలో

శ్లో।। గోదావరీ భీమరథీ కృష్ణవేణ్యాదికస్తదా।
సహ్యాపాదోద్భవా నద్యః స్మృతాః పాపభయాపహాః।।

ఈ విధంగా ఎన్నో పురాణాలలో కృష్ణానది ప్రసక్తిని మనం గమనించవచ్చు.

అదేవిధంగా చరిత్రలో ఎన్నో శాసనాలలో కృష్ణానది పేర్కొనబడింది. సా।శ। 4వశతాబ్దం దాకా ప్రాకృత భాషలోని శాసనాలలో ఈనదిని కణ్ణవెమ్మా, కరబెణా, కన్హవణ్ణ, కృష్ణవేణి అనే పేర్లతో ప్రస్తావించడం మనం గమనించవచ్చు.

"యద్వారవధ్విః పయసాం విహారే కుర్వంతి పీనస్తన కుంకుమేన।
భువస్ససింధూర పరాగ యోగాం సీమం రేఖామివ కృష్ణవేణ్యాం"

అంటూ కోట గణపతి దేవరాజు కృష్ణాజిల్లాలోని నాదెండ్లలో ఉన్న గోవర్ధనస్వామి దేవాలయంలో సా।శ।1258లో ఒక శాసనం వేయించాడు.

వెలనాటి రాజులను మధ్యయుగపు తెలుగుశాసనాలన్నీ "



కృష్ణవేణ్ణానదీ తీర షట్సహస్ర విషయాధీశ్వర" అంటు వర్ణించాయి.

ఈ నదీతీరంలోని అమరావతి నగరాన్ని రాజధానిగా చేసుకొని ఆంధ్రశాతవాహనులు కృష్ణా-గోదావరుల మధ్యలో రాజ్యాన్ని స్థాపించారు ఈ అమరావతికే ధాన్యవాటి అని, ధాన్యకటకమని నామాంతరాలు ఉన్నాయి.

రామరాజ భూషణుడు తన వసుచరిత్రలో "యాదోరాశి గభీర మూర్తి.....ప్రవాహంబులన్" అని ఈ నది ప్రాంతంలో జరిగిన ఎన్నో యుద్ధాల ఆధారంగానే కృష్ణకు ఆ పేరు వచ్చిందని వర్ణించాడు.

కృష్ణా పుష్కర తీర్థవిధి సామాగ్రి

పసుపు, కుంకుమ, భస్మం, గంధం, అగరువత్తులు, నల్లనువ్వులు, బియ్యం కొబ్బరికాయలు, ఆవుపాలు, పెరుగు, నెయ్యి, తేనె, చక్కర, గోమూత్రం, గోమయం, పూలు, తులసి దళాలు, వక్కలు, మృత్తిక (గోశాల లేదా తులసి వృక్షము మట్టి), విస్తరాకులు, గోధుమపిండి, దర్భ.

చెంబు, గ్లాసు, ధోవతి, పంచె, జంధ్యం, (బియ్యం, పప్పు, ఉప్పు, మిరపకాయలు, కూరగాయలు, చింతపండు) దశదానాలు, (1. గోదానం, 2. భూదానం, 3. తిలదానం, 4. బంగారుదానం, 5. నెయ్యిదానం, 6 వస్త్ర దానం, 7. బియ్యం దానం, 8. బెల్లందానం 9. వెండిదానం 10. ఉప్పుదానం)

కృష్ణా పూజా సామాగ్రి

పసుపు, కుంకుమ, భస్మం, గంధం, పోకలు, జాకెట్ ముక్కలు, నల్లపూసలు, గాజులు, ఖర్జూరపండ్లు, అద్దం, దువ్వెన, కుంకుమకాయ, మంగళసూత్రం, కాటుక, కొబ్బరికాయలు, చాటలు, పంచామృతాలు, పూలు, పండ్లు, దీపం.

బ్రాహ్మణునికి ఇచ్చు సామాగ్రి

బియ్యం, పప్పు, ఉప్పు, మిరపకాయలు, కూరగాయలు, చింతపండు, నెయ్యి, చక్కర, పాలు, పెరుగు. దక్షిణ తాంబూలాలు.

॥ సమాప్తం ॥

❖ ❖ ❖

కృష్ణాతీర వాసులు - భాగ్యవంతులు

శ్లో॥ శ్రీకృష్ణవేణీ ప్లవనాయ భూమౌ వాంఛంతి దేవాః ఖలు మర్త్య జన్మ ।
తస్యాః ప్రభావం సకలం ప్రవక్తుం శివో హరిర్వాబ్జ భవో నశక్తః॥
శ్లో॥ సభాగ్యస్తే గరాలోకే తేచ దేశాశ్శుభోదయాః।
తాన్యేవ పుణ్య క్షేత్రాణి యత్రకృష్ణా వహిష్యతి॥

తా॥ కృష్ణవేణీ నదిలో స్నానం చేయడం కోసం దేవతలు మనుషులుగా జన్మించాలని భావిస్తారట. కృష్ణానది మహిమను వర్ణించడానికి త్రిమూర్తులైనా అశక్తులే! కృష్ణానది ప్రవహించే ప్రదేశాలన్నీ శుభప్రదాలు. అంతటి పవిత్రమైన ఈ కృష్ణానదీ తీరవాసులు మహాభాగ్యవంతులు కదా!

శ్రీ కృష్ణవేణీ అష్టోత్తర శతనామావళి

శ్రీ సహ్యాద్రి శికరోత్పన్నాయై నమః
శ్రీ మహాదేవ్యై నమః
శ్రీ కర్త్యై నమః
శ్రీ పరిగ్రహాయై నమః
శ్రీ కృష్ణాయై నమః
శ్రీ భవాన్యై నమః
శ్రీమాత్రే నమః
శ్రీ /జయాన్వితాయై నమః
శ్రీ శాంకర్యై నమః
శ్రీ శివాయై నమః
శ్రీ శివాన్యై నమః
శ్రీ దురంధరాయై నమః
శ్రీ దుర్గాయై నమః
శ్రీ సదాంభో/జాయై నమః
శ్రీమత్త్రిపుర సుందర్యై
శ్రీ కాళ్యై నమః
శ్రీ పదాయై నమః
శ్రీ మదిందిరాయై నమః
శ్రీ చక్రధారిణ్యై నమః
శ్రీ మద్బాలాయై నమః
శ్రీ పరమేశ్వర్యై నమః
శ్రీ చక్రరాజ నిలయాయై నమః
శ్రీ వర్ణాయై నమః
శ్రీ పతివ్రతాయై నమః
శ్రీ మదనంత ఫలదాయిన్యై నమః
శ్రీ బీజాయై నమః
శ్రీ కరావర్తాయై నమః
శ్రీ జయాయై నమః
శ్రీ విరాజితాయై నమః
శ్రీ మూఖలాయై నమః
శ్రీ మద్భ్రూమధ్యమాయై
శ్రీ వసుంధరాయై నమః
శ్రీ తోయాయై నమః
శ్రీ ముఖాయై నమః
శ్రీ నికేతనాయై నమః
శ్రీ విలాసినన్యై నమః
శ్రీ భ్రూయుగాయై నమః
శ్రీ మదంబాయై నమః
శ్రీ సింహాసన సంస్థితాయై నమః
శ్రీ జంఘాయై నమః
శ్రీ భగాయై నమః
శ్రీ మత్కటి చక్ర విరాజితాయై నమః
శ్రీ మధ్యమాయై నమః
శ్రీ విశాలాక్ష్యై నమః
శ్రీ విద్యాయై నమః
శ్రీ వరాయై నమః
శ్రీ శ్రియై నమః
శ్రీ మానిన్యై నమః
శ్రీ కరాబ్జాయై నమః
శ్రీ మత్సింహాసనేశ్వర్యై నమః
శ్రీ వక్షాయై నమః
శ్రీ పరిజ్ఞానాయై నమః
శ్రీ జటాయై నమః
శ్రీ స్మితాననాయై నమః
శ్రీ మదాగమ సంవేద్యాయై నమః
శ్రీ వేదాంత ప్రదీపితాయై నమః
శ్రీ శివజటాజూట నివాసాయై నమః
శ్రీ భద్రాసన మధ్యస్థాయై నమః
శ్రీ వీణాగాన లోలుపాయై నమః
శ్రీ మచిత్రాంబర ణధరాయై నమః
శ్రీ మత్కంచుక ధారిణ్యై నమః
శ్రీ మంత్రరాజ ఫలదాయై నమః
శ్రీ మద్గిరివరాత్మజాయై నమః
శ్రీ మదద్భుత చారిత్రాయై నమః
శ్రీ వత్సాంకిత వక్షస్యై నమః
శ్రీ మత్యై నమః
శ్రీ మదాపగాయై నమః
శ్రీ మదాంబికాయై నమః
శ్రీ గుణాయై నమః
శ్రీ మదనఘాయై నమః
శ్రీ మదలకాయై నమః
శ్రీ కుచద్వయాయై నమః
శ్రీ దంతాయై నమః
శ్రీ కచాయై నమః
శ్రీ మత్కాంచన పుష్పాభినాసికాయై నమః
శ్రీ మనోహరాయై నమః
శ్రీ విగ్రహాయై నమః
శ్రీ విశేషాయై నమః
శ్రీ భావాయై నమః
శ్రీ ధరాత్మజాయై నమః
శ్రీ నారాయణ పాదాబ్జ మరందాయై నమః
శ్రీ కరార్చితాయై నమః
శ్రీ సప్తకులోద్ధారకాయై నమః
శ్రీ భూనీలాదిసంస్తుతాయై నమః
శ్రీ భేచర్యై నమః
శ్రీ మహానాసాయై నమః
శ్రీ నేత్రాయై నమః
శ్రీ మనోరథాయై నమః
శ్రీ నాయ్యై నమః
శ్రీ మహాదిప్తాయై, నమః
శ్రీ బలాయై నమః
శ్రీ మహామతయే నమః
శ్రీ శ్రీభూషణాయై నమః
శ్రీ శతాంగాయై నమః
శ్రీ దివ్యామృత వాహిన్యై నమః
శ్రీ ముని సతీబృంద సేవితా మలపాదుకాయై
శ్రీ సురబృంద తరంగిణ్యై నమః
శ్రీ గోహత్యాపాపౌఘ హారిణ్యై నమః
శ్రీ మహానద్యై నమః
స్త్రీ గమనాపరాధహారిణ్యై నమః
శ్రీ మద్భూషణ భూషితాంగ్యై నమః
శ్రీ పండిత పూజితాయై నమః
శ్రీ హత్యాఘ నివారిణ్యై నమః
శ్రీ అశ్వత్థవృక్ష మూలజాయై నమః
శ్రీ షష్ట్యధిక శతత్రయ తీర్థ సహిత
సాగరగామిన్యై నమః
శ్రీశైలోత్సంగ వాసిన్యై నమః
శ్రీ వశిష్ఠాది మునిస్తవనీయాయై నమః
శ్రీ కృష్ణవేణ్యై నమః
శ్రీ అష్టమూర్తి శిరోవాసాయై నమః

॥ శ్రీ కృష్ణవేణీ అష్టోత్తర శతనామార్చనం సంపూర్ణమ్ ॥

కృష్ణా పుష్కర సందర్భంలో చేయదగినవి

కృష్ణా మహా పుష్కరాల్లో భక్తులు కొన్ని పద్ధతులు పాటిస్తే బాగుంటుంది. పుష్కర ఘాట్లు, స్నాన ఘట్టాల దగ్గర కొన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఇవన్నీ భక్తుల భద్రతకు ఉద్దేశించినవి.

1. పుష్కర ఘాట్ల దగ్గర అనుమానాస్పదంగా ఎవరైనా సంచరిస్తున్నా, అనుమానాస్పద వస్తువులు కనిపించినావెంటనే అధికారులకు తెలియచేయాలి.
2 భక్తులు తప్పనిసరిగా ట్రాఫిక్ నియమాలు పాటించి పోలీసులు, ఇతర అధికారులకు సహకరించాలి.
3 కేంద్ర సమాచార విభాగం ద్వారా వచ్చే సలహాలు, సూచనలను భక్తులు తప్పనిసరిగా పాటించాలి.
4 చెత్త, వాడేసిన వస్తువులను భక్తులు డస్ట్ బిన్ లలోనే పడేయాలి. పరిసరాల పరిశుభ్రతను ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించాలి.
5. పవిత్రమైన హృదయంతో కృష్ణానదిని చేరుకోవాలి.
6. తీరంనుండి కృష్ణవేణికి నమస్కరించాలి.
7. నదిని, తీరాన్ని పవిత్రంగా ఉంచాలి.
8. మొదటగా పవిత్ర గోదావరి జలాలను శిరస్సుపై చల్లుకుని స్నానానికి ఉపక్రమించాలి.
9. వీలైతే సమంత్ర పూర్వకంగా సంకల్పం చెప్పుకొని (చెప్పించుకుని) స్నానమాచరించాలి.
10. లేకుంటే తమ గోత్రనామాలు చెప్పుకుని "గంగా గంగా గంగా" అని మూడు సార్లు కృష్ణవేణిని స్మరించి స్నానం చేయాలి.
11. ఖచ్చితంగా శిరస్నానం చేయాలి.
12. సూర్యుడికి మూడు అర్ఘ్యములనివ్వాలి.
13. స్నానమైన తరువాత శుభ్రమైన పొడి బట్టలను ధరించి కుంకుమ పెట్టుకోవాలి.
14. కృష్ణా మాతను పూజించి వాయనం సమర్పించాలి.
15. ఒడ్డున ఉన్న లేదా దగ్గరలో ఉన్న దేవాలయాలను తప్పక దర్శించాలి.
16. యథాశక్తి దానధర్మాలను ఆచరించాలి.
17. పుష్కర సమయంలో పెద్దలకు పిండ ప్రదానములు ఆచరించాలి.
18. పిండప్రదానినికి ఆకులతో తయారు చేసిన విస్తరాకులనే ఉపయోగించాలి. ఇదే శాస్త్ర సమ్మతం.
19. శ్రాద్ధమైన తదుపరి తప్పక పిండములను నదిలో నిమజ్జనం చేయాలి.
20. పవిత్ర కృష్ణా జలాలను ఇంటికి తీసుకువెళ్ళి పూజా మందిరంలో ఉంచి నిత్యము పూజించాలి.

కృష్ణా నదీస్నాన సమయములో చేయకూడనివి

1. పుష్కర సమయంలో కృష్ణా తీరంలో 3కోట్ల 50లక్షల మంది దేవతలు కొలువై ఉంటారు. కాబట్టి తీరంలో కానీ, నీటిలో కాని మల, మూత్రాదులను విసర్జించరాదు. నీటిలో ఉమ్మి వేయరాదు. ఇది మహాదోషం.
2. చెప్పులతో స్నానం చేయరాదు.
3. నగ్నంగా, అర్ధనగ్నంగా స్నానం చేయకూడదు. మగవారు పంచె, పైపంచె ధరించి, స్త్రీలు సంప్రదాయ దుస్తులతో స్నానాన్ని చేయాలి.
4. గంగ సహజ సిద్ధముగానే మన శరీర మాలిన్యంతోపాటుగా మనో మాలిన్యాన్ని కూడా తొలగించు గుణము కలది. అటువంటి చోట సబ్బులు, షాంపూలు వాడకూడదు. ఘాట్ల వద్ద బట్టలు ఉతకరాదు.
5. తడిబట్టలతో పూజాది కార్యక్రమములు చేయరాదు.
6. నదిలో ప్లాస్టిక్ విస్తరాకులు, కవర్లు వేయకూడదు.
7. నదిలో ఈత కొట్టరాదని శాస్త్రం. నదిలో ఎక్కువ దూరం పోరాదు. ప్రమాదకరం.
8. బట్టలు ఉతకకూడదు.

– సేకరణ : అప్పాల శ్యామప్రణీత్ శర్మ అవధాని

కృష్ణాష్టకమ్

గురుసహస్రావధాని **డా. కడిమిళ్ళ వరప్రసాద్**

1. శ్రీశైల శిఖరం నత్వా
మల్లేశం భ్రమరాంబికామ్
పునాతి భువనం యా తాం
కృష్ణాం వన్దే మహానదీమ్॥

తా. శ్రీశైల శిఖరాన్ని, అక్కడ కొలువైన ఆదిదంపతులు మల్లేశ్వరుని, భ్రమరాంబికను నమస్కరించి, లోకమును పవిత్రము చేయుచున్న మహానది కృష్ణను నమస్కరించు చున్నాను.

2. దుర్గాం నత్వా దయాపూర్ణామ్
ఇంద్రకీలాద్రివాసినీమ్
పునాతి భువనం యా తాం
కృష్ణాం వన్దే మహానదీమ్॥

తా. ఇంద్రకీలాద్రిపై నివసించే దయాపూర్ణయైన దుర్గను నమస్కరించి, లోకాన్ని పవిత్రం చేస్తున్న మహానది కృష్ణను నమస్కరించుచున్నాను.

3. యస్యాస్తీరే మహాకావ్యం
కల్పవృక్షం రసాత్మకమ్
జాతం రామాభిరామం తాం
కృష్ణాం వన్దే మహానదీమ్ ॥

తా. ఏ నదీతీరమునందు రసాత్మకమైనదియు, రామగాథచే మనోహరమైనదియు అయిన రామాయణ కల్పవృక్షం పుట్టిందో ఆ మహానది కృష్ణను నమస్కరించుచున్నాను.

4. సింహరాశిం పరిత్యజ్య
కన్యారాశిగతే గురౌ
పవిత్రే పుష్కరే కాలే
కృష్ణాం వన్దే మహానదీమ్॥

తా. దేవగురువైన బృహస్పతి సింహరాశిని విడిచిపెట్టి, కన్యారాశిలో ప్రవేశించే పవిత్రమైన పుష్కరకాలంలో మహానది కృష్ణను నమస్కరించుచున్నాను.

5. యస్యాం పుష్కర వేళాయాం
స్నాత్వా కృత్వాచ పైతృకమ్
ధన్యతాం యాతి లోకస్తాం
కృష్ణాం వన్దే మహానదీమ్॥

తా. ఏ నదియందు పుష్కరవేళలో స్నానమాచరించి, పితృకార్యములు నిర్వర్తించి, లోకము (ప్రజానీకము) ధన్యతను పొందుచున్నదో అట్టి మహానది కృష్ణను నమస్కరించుచున్నాను.

6. సుధాతుల్యో రసో యస్యాః
క్షుత్ పిపాసాదికం నృణామ్
దూరీకరోతి నిత్యం తాం
కృష్ణాం వన్దే మహానదీమ్॥

తా. ఏ నదీజలం అమృత సమానమై మానవుల ఆకలి దప్పికలను ఎల్లప్పుడూ దూరం చేయుచున్నదో అట్టి మహానది కృష్ణను నమస్కరించుచున్నాను.

7. స్నాతౄణామర్ఘ్య దాతౄణాం
పితౄణాం తృప్తిదాయినామ్
యా దదాతి భవోన్ముక్తిం
కృష్ణాం వన్దే మహానదీమ్॥

తా. తనలో స్నానము చేసి, అర్ఘ్యప్రదానము చేసి, పితృదేవతలకు తృప్తి కలిగించేవారికి పునర్జన్మ రహితరూపమైన ముక్తిని ప్రసాదించే మహానది కృష్ణను నమస్కరించుచున్నాను.

8. కృష్ణాపుష్కరవేళాయాం
కృష్ణాష్టకమిదం పఠన్
స్నానం కరోతి యో ధన్యః
స ప్రాప్నోతి మహాఫలమ్॥


తా. కృష్ణా పుష్కరకాలంలో ఈ కృష్ణాష్టకాన్ని పఠిస్తూ, ఏ ధన్యుడైతే స్నానం చేస్తాడో అతడు మహాఫలమును పొందుతాడు.

కృష్ణా తీరంలో గుడిగంటల రవళి

- ఐ.ఎల్.ఎన్. చంద్రశేఖరరావు

పవిత్రమైన గంగానదికే సోకిన పాపాన్ని పోగొట్టిన తెలుగువారి జీవనసిరిగా విరాజిల్లుతూ వున్న కృష్ణానదీ తీరం వెంబడి మహారాష్ట్రలోని మహాబలేశ్వర్ వద్ద జన్మించింది మొదలు సముద్రగర్భంలో సంగమింఏంత వరకు అనేక క్షేత్రాలు వెలిసి భక్తుల పూజలందుకుంటూ వున్నాయి. కృష్ణానదిలో స్నానమాచరించి తీరంలో వున్న ఆలయాలను దర్శించడం అత్యంత పుణ్యకార్యం! పవిత్రకార్యం!!

మహాబలేశ్వర్



సృష్టికర్తఅయిన బ్రహ్మదేవుడు చేస్తూవున్న యజ్ఞాన్ని చూసేందుకు వచ్చిన లయకారుడైన శ్రీపరమశివుడు సరస్వతీదేవి శాపం వల్ల కృష్ణానదీ రూపాన్ని ధరించిన శ్రీమహావిష్ణువుతో పాటు తనూ వేణీనదీ రూపాన్ని ధరించి కృష్ణలో విలీనం కావడమే కాకుండా కృష్ణానది జన్మస్థానంలో లింగరూపంలో శ్రీమహాబలేశ్వరుడుగా కొలువుదీరిన క్షేత్రం – 'మహాబలేశ్వర్'. మహారాష్ట్రలో పూణే నగరానికి సుమారు 120 కిలో మీటర్ల దూరంలో 'మహాబలేశ్వర్' వుంది.

కృష్ణానది జన్మస్థానంలో శివుడు స్వయంభువుగా కొలువుదీరిన ఆలయం ప్రస్తుతం 'పాతమహాబలేశ్వర్'గా పిలువబడే గ్రామంలో వుంది. ఆలయం కృష్ణానది జన్మస్థానంగా చెప్పబడే ప్రాంతానికి సమీపంలోనే వుంది. ఇది చాలా చిన్న ఆలయం. పెద్దదిగా వుండదు. కానీ చూస్తూనే చాలా పురాతన కాలపు ఆలయమనే విషయం స్పష్టమవుతుంది. ఆలయంలోని గర్భాలయంలో నేలమట్టానికి వుండే పానపట్టంపై పరమశివుడు లింగరూపంలో శ్రీమహాబలేశ్వరుడుగా కొలువుదీరి అభిషేకాలు, పూజలు అందుకుంటూ దర్శనమిస్తాడు. ఆధ్యాత్మికంగా దర్శనం చేసుకోవలసినది కృష్ణానదీ జన్మస్థానం మరియు ఈ ఆలయమే! అయితే ఇటీవల కాలంలో 'మహాబలేశ్వర్' వేసవి విడిదిగా ప్రసిద్ధి చెందింది. పర్వతప్రాంతాలలోని వివిధ దృశ్యాలు, పంచగని ప్రాంతం ఇతర దర్శనీయాలు.

నృసింహవాడి



శ్రీదత్తాత్రేయుల వారు ధరించిన రెండవ అవతారం – శ్రీనృసింహ సరస్వతి. అనుక్షణం భక్తుల వెంట వుండి వారిని ముక్తిమార్గంలో నడిపించిన శ్రీనృసింహ సరస్వతి వారు పన్నెండు సంవత్సరాలపాటు గడిపిన దివ్యస్థలం – 'నృసింహవాడి'. మహారాష్ట్రలోని కొల్హాపూర్ జిల్లాలో కొల్హాపూర్ నుండి 48 కిలోమీటర్ల దూరంలో వున్న నృసింహవాడికే 'నరసోబావాడి' అని పేరు. కృష్ణానదిలో పంచగంగ నది సంగమించే దివ్యక్షేత్రం ఇది. క్రీ.శ. 1330వ సంవత్సరంలో జన్మించి క్రీ.శ.1458వ సంవత్సరంలో అవతార సమాప్తి చేసిన శ్రీనృసింహసరస్వతి వారు ఈ క్షేత్రంలో పన్నెండు సంవత్సరాలపాటు గడిపి మానవులకు జ్ఞానబోధ చేసి ముక్తిమార్గం వైపు నడిపించారు.

కృష్ణానదీ తీరంలోనే ఆలయం వుంది. గర్భాలయం పై భాగంలో ఔదుంబర వృక్షం వుంది. ఆ వృక్షం మొదలు భాగంలో గర్భాలయం నిర్మింపబడింది. గర్భాలయంలో ఎటువంటి

విగ్రహాలు లేవు. మేడిచెట్టు మొదలువద్ద వున్న వేదికపైన పాదుకలు మాత్రమే వున్నాయి. ఈ పాదుకలు వున్నచోటే శ్రీనృసింహ సరస్వతీవారు ఆసీనులై వుండేవారని చెబుతారు. ఈ పాదుకలను దర్శించడంవల్ల జ్ఞానాభివృద్ధి జరుగుతుంది. ఆయురారోగ్యాలు వృద్ధి చెందుతాయి. సంతానం లేనివారికి సంతానం కలుగుతుంది.

కూడలి సంగమేశ్వరం



కృష్ణానదిలో ఘటప్రభనది సంగమించే దివ్యస్థలంలో పరమశివుడు శ్రీసంగమేశ్వర స్వామి పేరుతో కొలువుదీరి పూజలందుకుంటూ వున్న క్షేత్రం – "కూడలి సంగమేశ్వరం". కర్నాటక రాష్ట్రంలో భాగల్‌కోట నుండి 48 కిలోమీటర్ల దూరంలో "కూడలి సంగమేశ్వరం" వుంది. పూర్వం వివిధ ప్రాంతాలలో పర్యటిస్తూ ఇక్కడకు చేరిన మహర్షుల ప్రార్థనల మేరకు పరమశివుడు స్వయంభువుగా కొలువుదీరినట్లు కథనం. నదుల సంగమ స్థలిలో వెలసిన శివుడు కనుక శ్రీసంగమేశ్వర స్వామి అనే పేరు ఏర్పడినట్లు స్థలపురాణం వెల్లడిస్తూ వుంది. వీరశైవమతానికి చెందిన బసవేశ్వరుడు ఈ క్షేత్రానికి చేరి, శివుడిని ఆరాధిస్తూ గడిపి శివుడిలో ఐక్యమైనట్లు చరిత్ర వెల్లడిస్తూ వుంది. ఈ ఆలయాన్ని క్రీ.శ. 6వ శతాబ్దం నుండి 12వ శతాబ్దం వరకు పరిపాలించిన బాదామీ చాలుక్యులు ఆలయాన్ని నిర్మింపజేశారు. ప్రధాన ఆలయంలో శ్రీసంగమేశ్వర స్వామి లింగరూపంలో కొలువుదీరి వున్నాడు. అంతరాలయంలో గర్భాలయంలోని స్వామివారికి ఎదురుగా రెండు నంది విగ్రహాలు వుండడం విశేషం. ప్రధాన ఆలయానికి సమీపంలోని బసవేశ్వరుడి స్మారకమందిరం, మాతామహాదేవి ఆశ్రమం, పూజావనం, అద్భుతమైన శిల్పకళా సంపదతో వున్న మ్యూజియంలను కూడలి సంగమేశ్వరంలో దర్శించవచ్చు.

చింతరేవుల



ఊర్ధ్వదృష్టిని కలిగి ఉగ్రరూపుడై ధాకిని, శాకిని, గ్రహాలపట్ల ఉగ్రత్వాన్ని ప్రదర్శించి అవి భక్తుల దరి చేరకుండా చేసి, తన భక్తులపై ప్రసన్న దృక్కులను ప్రసరింపజేస్తూ వున్న శ్రీ ఆంజనేయస్వామి కొలువుదీరిన క్షేత్రం – "చింతరేవుల" మహబూబ్‌నగర్ జిల్లాలో గద్వాల పట్టణానికి సుమారు 35 కిలోమీటర్ల దూరంలో చింతరేవుల వుంది. విజయనగర సామ్రాజ్య పాలకుడు, సాహితీ సమరాంగణ సార్వభౌముడు అయిన శ్రీకృష్ణదేవరాయల సమకాలీనుడు, శ్రీకృష్ణదేవరాయలను కుహూ గండం నుంచి రక్షించిన వ్యాసరాయలు ఆంజనేయస్వామి భక్తుడు. పూర్వం సృష్టికర్త అయిన బ్రహ్మదేవుడికి పూజకు అవసరమైన ద్రవ్యాలను సమర్పిస్తూ వుండే శంభుకర్ణుడే బ్రహ్మదేవుడి శాపంవల్ల భూలోకంలో వ్యాసరాయలు తాను పర్యటించి, విక్రమించిన అనేక ప్రాంతాలలో ఆంజనేయస్వామి వారిని ప్రతిష్ఠించి ఆలయాలను నిర్మించినట్లు కథనం. అందులో ఇది ఒకటి. ఆలయ గర్భాలయంలో స్వామివారు ఎగురుతూ వున్న భంగిమలో దర్శనమిస్తారు. ద్విభుజుడు అయిన స్వామివారు ఒక చేతిని పైకి పెట్టుకుని అభయమిస్తూ.. మరో చేతిని నడుముపై వుంచుకుని ఊర్ధ్వముఖంతో పైకి చూస్తూ వున్నట్లుగా కొలువుదీరి వున్నాడు. క్రీ.వ. 16వ శతాబ్దంలో ఆలయం నిర్మించినట్లు చరిత్ర కథనం.

బీచుపల్లి



ప్రదక్షిణలు చేసి పూజించినంత మాత్రముననే శారీరక, మానసిక రుగ్మతలు తొలగించి ఆయురారోగ్యాలను ప్రసాదించే స్వామిగా భక్తులచేత ఆరాధనలందుకుంటూ వున్న శ్రీ ఆంజనేయస్వామి వారు కొలువుదీరిన క్షేత్రం – "బీచుపల్లి". మహబూబ్‌నగర్ జిల్లాలో బెంగుళూరు – హైదరాబాద్ జాతీయ రహదారి ప్రక్కనే జడ్చర్లకు 55 కిలోమీటర్ల దూరంలో 'బీచుపల్లి' వుంది. వ్యాసరాయలు స్వామివారికి నిత్యపూజలు చేసేందుకు 'బీచుపల్లె' అనే వ్యక్తిని నియమించాడు. పూజారి పేరు మీదనే క్షేత్రానికి 'బీచుపల్లి' అనే పేరు ఏర్పడినట్లు కథనం. పూర్వం వివిధ ప్రాంతాఆలలో పర్యటిస్తూ వచ్చిన 'కణ్వమహర్షి' ఈ ప్రాంతంలో కొంతకాలం గడిపాడు. ఈ సమయంలో ఆయన ఆంజనేయస్వామిని ప్రతిష్ఠించినట్లు కథనం. తర్వాతి కాలంలో స్వామివారు భూమిలో కూరుకుపోగా వ్యాసరాయలు వెలుపలకు తీసి నిత్యపూజలు జరిగే ఏర్పాట్లు చేసినట్లు కథనం. గర్భాలయంలో శ్రీ ఆంజనేయస్వామి కౌపీనము ధరించి కుడిచేత అభయముద్రను ధరించి ఎడమచేతిని నడుముమీద బిగించి గదను ధరించి దివ్యమంగళ స్వరూపంతో దర్శనమిస్తాడు. క్రీ.శ. 7,8 శతాబ్దాలలో ఆలయం నిర్మింపబడినట్లు చరిత్ర చెబుతోంది. తర్వాతి కాలంలో ప్రస్తుతం దర్శనమిస్తునర్న ఆలయాన్ని గద్వాల సంస్థానాధీశులు నిర్మింపజేశారు.

నివృత్తి సంగమేశ్వరం

కేవలం దర్శనమాత్రముననే సకపాపాలను నివృత్తి చేసే పవిత్ర క్షేత్రం – 'నివృత్తి సంగమేశ్వరం'. కర్నూలు జిల్లాలో నందికొట్కూరుకు 20 కిలోమీటర్ల దూరంలో కృష్ణానదిలో



ఆలయం వుంది. శ్రీశైల మహాక్షేత్రానికి వాయవ్య ద్వారంగా ప్రసిద్ధి చెందిన ఈ క్షేత్రం 'సప్తనదీ సంగమం'గా ప్రసిద్ధి చెందింది. కృష్ణ, వేణి, తుంగ, భద్ర, మలపాపహరిణిలు కలిసి రాగా ఇక్కడ 'భవనాశి' కలవడంవల్ల 'సప్తనదీసంగమం' అయింది. పూర్వం పాండవులు వనవాస సమయంలో ఈ ప్రాంతానికి చేరుకున్నారు. శివలింగాన్ని ప్రతిష్ఠించదలచిన ధర్మరాజు శివలింగాన్ని తీసుకురమ్మని భీముడిని కాశీకి పంపాడు. అయితే ముహూర్త సమయానికి భీముడు రాకపోవడంతో ఋషుల సలహా మేరకు వేపమొద్దును శివలింగంగా వేయించి ప్రతిష్ఠించాడు. అదే శ్రీసంగమేశ్వర స్వామివారి శివలింగం. కాగా తర్వాత భీముడు లింగం తెచ్చి... అప్పటికే ప్రతిష్ఠించి వుండడం చూసి కోపోద్రిక్తుడై విసిరివేయగా అది నదీతీరంలో పడి భీమలింగంగా పేరు పొందింది. గర్భాలయంలో శివలింగం వేపమొద్దులాగా వుంటుంది. గర్భాలయంలో స్వామివారి వెనుక వైపు ఆయన దేవేరి శ్రీలలితాదేవి, ఆమె ముందువైపు శ్రీచక్రమేరువు దర్శనమిస్తాయి. వినాయకుడూ కొలువుదీరి వున్నాడు. క్రీ.శ. 8,9 శతాబ్దాలలో ఆలయం నిర్మింపబడింది. ఈ ఆలయం శ్రీశైల జలాశయంలో మునిగిపోయి సంవత్సరంలో ఎక్కువ కాలం నీటిలోనే వుంటుంది. మార్చి, ఏప్రిల్‌ల నుంచి జూన్ వరకు బయటపడుతుంది. ఈ సమయంలోనే పూజలు జరుగుతాయి.

శ్రీశైలం

'శ్రీశైల శిఖరం దృష్ట్వా పునర్జన్మ న విద్యతే' అని శాస్త్ర వచనం. కేవలం శిఖర దర్శనం చేసుకున్నంత మాత్రముననే పునర్జన్మ లేకుండా చేసే క్షేత్రమైన 'శ్రీశైలం'లో పరమశివుడు



శ్రీమల్లికార్జున స్వామి పేరుతో జ్యోతిర్లింగ స్వరూపుడుగా... స్వామివారిదేవేరి శ్రీభ్రమరాంబా దేవి పేరులో అష్టాదశ శక్తులలో ఒకరుగా, ఆరాధనలందుకుంటూ వున్నారు. కర్నూలు జిల్లాలో కర్నూలుకు 180 కిలో మీటర్ల దూరంలో శ్రీశైలం వుంది. ప్రాచీన కాలం నుంచి శ్రీ పర్వతము, శ్రీగిరి, శ్రీనగం, సిరిగిరి వంటి పేర్లతో పిలువబడి ప్రస్తుతం శ్రీశైలంగా పిలువబడుతూ వున్న ఈ క్షేత్రం భూమండలానికి నాభిస్థానంగా, అనాదిక్షేత్రంగా ప్రసిద్ధి చెందింది. హిందూ సంప్రదాయంలో వైదిక కర్మలను ఆచరించే సమయంలో శ్రీశైలానికి ఏ దిక్కున వుండి చేస్తూ వున్నదీ సంకల్పంలో పేర్కొనడం ఈ క్షేత్ర ప్రాచీనతకు నిదర్శనం. నాలుగు ద్వారాలు, నాలుగు ఉపద్వారాలతో 30 ఆమడల పొడవు, ముప్పై ఆమడల వెడల్పు కలిగిన 'అష్టదళ పద్మం' అని శ్రీశైలాన్ని స్కాందపురాణం వర్ణించింది.

పూర్వం తపస్సు చేసిన శిలాదుడు శివుడి వరం వల్ల ఇద్దరు కుమారులను పొందాడు. నంది, పర్వతుడు. వారిలో పర్వతుడు శివుడిని గురించి తపస్సు చేశాడు. పర్వతుడి తపస్సును మెచ్చిన శివుడు ప్రత్యక్షమై వరం కోరుకోమనగా – 'పర్వత రూపం దాల్చిన నాపై మీరు నివసిస్తూ, పర్వత శిఖరాన్ని దర్శించినవ వారికి పునర్జన్మ లేకుండా వరం ప్రసాదించండి' అని కోరాడు. శివుడు వరం ప్రసాదించాడు. వరం ప్రకారం పర్వతుడు ఎత్తైన పర్వతరూపాన్ని ధరించగా శివుడు లింగంగా మారి కొలువుదీరినట్లు... ఆ పర్వతమే శ్రీశైలం అనీ, దానిపై లింగరూపంలో కొలువుదీరిన శివుడే శ్రీమల్లికార్జున స్వామి అని కథనం. కాగా బ్రహ్మచే వరం పొందిన అరుణాసురుడనే రాక్షసుడు లోకకంటకుడుగా మారగా, శ్రీపార్వతీదేవి రభమరరూపం ధరించి అరుణాసురుడిని అంతమొందించి శ్రీపర్వతంపై వున్న శ్రీమల్లికార్జున స్వామి దేవేరిగా శ్రీభ్రమరాంబాదేవిగా కొలువుదీరి పూజలందుకుంటూ వుంది.


వాడపల్లి



కృష్ణానదిలో ముచికుంద నది సంగమించే దివ్యస్థలంలో శ్రీనృసింహస్వామి, శ్రీపరమశివుడు శ్రీ అగస్తేశ్వరుడుగా కొలువుదీరిన శివకేశవల నిలయం 'వాడపల్లి'. నల్గొండ జిల్లాలో నల్గొండకు 70 కిలోమీటర్ల దూరంలో వాడపల్లి వుంది. పూర్వం అగస్త్యమహర్షి ఒక కావడిలో శివకేశవులను వుంచుకొని దక్షిణదేశం చేరి వారిని ప్రతిష్ఠించేందుకు అనువైన స్థలం కోసం వెదుకుతూ కృష్ణా తీరానికి చేరాడు. సాయంత్రం కావడంతో సంధ్యావందనం చేసుకునేందుకు సిద్ధమై, కావడిని అక్కడ పశువులు మేపుతూ వున్న బాలుడి భుజంపై వుంచి, కావడి క్రింద పెట్ట వద్దని చెప్పి వెళ్ళాడు. కొద్దిసేపటి తర్వాత కావడిని బాలుడు క్రింద పెట్టాడు. సంధ్యావందనం ముగించుకు వచ్చిన అగస్త్యుడు కావడిని పైకి ఎత్తే ప్రయత్నం చేయగా, "మాకు ఇష్టమైన స్థలం ఇదే! మమ్ములను ప్రతిష్ఠించు" అనే మాటలు వినిపించడంతో అగస్త్యమహాముని దేవేరులను ప్రతిష్ఠించినట్లు కథనం. ఈ క్షేత్రంలో రెండు ఆలయాలు వున్నాయి. ఒకదానిలో శ్రీలక్ష్మీనృసింహస్వామి శ్రీ ఆదిలక్ష్మీదేవి సమేతుడై కొలువుదీరి వుండగా మరో ఆలయంలో శ్రీఅగస్తేశ్వర స్వామి శ్రీ మీనాక్షి అమ్మవారి సమేతంగా కొలువుదీరి పూజలందుకుంటూ వున్నాడు.

వేదాద్రి

'నారసింహసాలగ్రామ తీర్థం'గా పేరుపొందిన కృష్ణానదీ తీరంలో శ్రీ నృసింహస్వామి యోగముద్రలో శ్రీయోగానంద నృసింహస్వామిగా కొలువుదీరిన క్షేత్రం వేదాద్రి. కృష్ణా జిల్లాలో



జగ్గయ్యపేటకు 18 కిలోమీటర్ల దూరంలో వేదాద్రి వుంది. పూర్వం వేద పురుషులకు ఇచ్చిన మాటప్రకారం హిరణ్యకశిపుని అంతమొందించిన తర్వాత జ్వాలా నృసింహస్వామి సత్యలోకం చేరాడు. స్వామి ఉగ్రత్వానికి సత్యలోకం దగ్ధమైంది. దీనితో బ్రహ్మదేవుడు స్వామివారిని తీసుకుని వచ్చి కృష్ణవేణీ గర్భంలో వుంచాడు. అనంతరం ఋష్యశృంగాది మహర్షుల ప్రార్థనల మేరకు స్వామివారు ఉగ్రరూపాన్ని వదిలి యోగరూపంలో శ్రీ యోగానంద లక్ష్మీనరసింహ స్వామిగా వేదాద్రిలో కొలువుదీరినట్లు కథనం. గర్భాలయంలో స్వామివారు యోగముద్రలో ఆసీనులై రెండు చేతులతో శంఖు చక్రాలను ధరించి, మరో రెండు చేతులను యోగముద్రలో కాళ్లప=ళిఐ వుంచుకొని దర్శనమిస్తారు. ఆలయ ప్రాంగణంలో స్వామివారి దేవేరులు శ్రీరాజ్యలక్ష్మి అమ్మవారు, శ్రీ చెంచులక్ష్మి అమ్మవారు కొలువుదీరి పూజలందుకుంటూ వున్నారు. ఈ క్షేత్రంలోనరి కృష్ణానదికి 'నారసింహ సాలగ్రామ తీర్థం' అని పేరు. ఇందులో స్నాన మాచరించడం వల్ల గంగానదీ స్నానఫలం, వేయి గోవులను దానం చేసిన ఫలం కలుగుతుంది.

మట్టపల్లి


దక్షిణావృత శంఖంతోపాటు శ్రీలక్ష్మీనరసింహస్వామి స్వయంభువుగా కొలువుదీరి దర్శించినంతనే ఆహారానికి లోటు లేకుండా చేసే దేవుడుగా పేరు పొంది ఆరాధనలందుకుంటూ



వున్న క్షేత్రం – 'మట్టపల్లి'. నల్గొండ జిల్లాలో నల్గొండకు 60 కిలోమీటర్ల దూరంలో 'మట్టపల్లి' వుంది. పూర్వం భరద్వాజ మహర్షి వివిధ ప్రాంతాలలో పర్యటిస్తూ ఇక్కడకు చేరుకుని, కృష్ణా తీరంలో ఆశ్రమాన్ని నిర్మించుకుని తపస్సు చేయసాగాడు. ఈ సమయంలో ఒకరోజు గుహలో నృసింహస్వామి దర్శనమివ్వగా ప్రతిష్టించి పూజలు చేసినట్లు కథనం. ఆ తర్వాత గ్రామస్తులు ఆలయం నిర్మించారు. కొండ గుహలాగా వున్న గర్భాలయంలో శ్రీనరసింహస్వామి రాజ్యలక్ష్మీ సమేతుడై కొలువుదీరి వున్నాడు. సమీపంలో దక్షిణావృత శంఖం వుంది. దీనినుంచి పవిత్రమైన నాదం వినిపిస్తూ వుంటుంది. ఈ శంఖం వున్నచోటు దర్శించినవారికి ఆహారానికి లోటు వుండదు. ఆకలి బాధలు ఉండవు. ఆయలంలో ప్రహ్లాదుడు, వైఖానస మహర్షి, గోదాదేవిలను భక్తులు దర్శించుకోవచ్చు.

అమరావతి

అమరలోకాధిపతి అయిన ఇంద్రుడిచేత ప్రతిష్టింపబడిన శివుడు శ్రీ అమరేశ్వరస్వామిగా పూజలందుకుంటూ వున్న పంచారామ క్షేత్రాల్లో ఒకటిగా ప్రసిద్ధి చెందిన క్షేత్రం అమరావతి. గుంటూరు జిల్లాలో గుంటూరుకు 32 కిలోమీటర్ల దూరంలో



'అమరావతి' వుంది. పూర్వం లోకకంటకుడైన తారకాసురుడిని అంతమొందించేందుకు దేవసేనాధిపత్యం వహించిన కుమారస్వామి తారకాసురుడి మెడలోని అమృతలింగాన్ని ఛేదిస్తే విజయం కలుగుతుందని గ్రహించి, ఛేదించి, దీనితో ఆ

అమృతలింగం ఐదు భాగాలై ఐదుచోట్ల పడింది. కృష్ణానదీ తీరంలో పడిన భాగాన్ని దేవగురువు బృహస్పతి సలహా మేరకు దేవేంద్రుడు ప్రతిష్టించి, శ్రీ అమరేశ్వరస్వామిగా పూజించాడు. ఆలయ గర్భాలయంలో శ్రీ అమరేశ్వరస్వామి తెల్లని వర్ణంలో సుమారు 15 అడుగుల ఎత్తుతో మూడు అడుగుల గాత్రంతో కొలువుదీరి దర్శనమిస్తాడు. ఆలయ ప్రాంగణంలో స్వామివారి దేవేరి శ్రీబాల చాముండేశ్వరీ దేవిగా ఆరాధనలందుకుంటూ వుంది. కాగా ప్రాచీనకాలంలో బౌద్ధక్షేత్రంగా అమరావతి విరాజిల్లింది. క్రీ.శ. 9వ శతాబ్దంలో చాళుక్య భీమదేవుడు ఆలయాన్ని నిర్మించగా, 18వ శతాబ్దంలో రాజా వాసిరెడ్డి వేంకటాద్రి నాయుడు జీర్ణోద్ధారణ గావించాడు.

సీతానగరం

శ్రీరామభక్తుడైన శ్రీ ఆంజనేయస్వామి శ్రీ వీరాంజనేయ స్వామిగాకొలువుదీరిన క్షేత్రం – సీతానగరం. గుంటూరు జిల్లాలోని తాడేపల్లి మండలంలో వున్న ఈ క్షేత్రం ప్రకాశం బ్యారేజీకి ఆవలివైపు వుంది. సీతాదేవి జాడ తెలుసుకునేందుకు లంకకు వెళ్ళి సీతాదేవి జాడను తెలుసుకుని, లంకాదహనం



చేసి కిష్కింధకు బయలుదేరిన ఆంజనేయుడు మార్గమధ్యంలో సీతానగరం ప్రాంతంలో ఆగగా, మహర్షులు గమనించి ఈ ప్రాంతంలో కొలువుదీరమని కోరడంతో స్వామివారు అంగీకరించి కొలువుదీరినట్టు కథనం. ఆయంలో స్వామివారు కౌపీనమును ధరించి అభయహస్తంతో, ఎడమచేతిని నడుము మీద వుంచుకుని, ఒక కంటితో భక్తులను చూస్తూ, నల్లని మీసాలను, కనురెప్పలను కలిగి వీరస్వరూపంతో కొలువుదీరి వున్నాడు. ఆయల ప్రాంగణంలోని ఉపాలయాల్లో శ్రీ కోదండ రామస్వామి, శ్రీవేణుగోపాలస్వామి, శ్రీ స్థానేశ్వరస్వామి మొదలైన దేవతామూర్తులు దర్శనమిస్తారు. సీతానగరం గ్రామంలో శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం కూడా వుంది.

విజయవాడ

జగన్మాత శ్రీకనకదుర్గగా కొలువుదీరిన క్షేత్రం. ఆంధ్రుల చారిత్రక, సాంస్కృతిక, వికాసాలవాడగా, కృష్ణాతీరంలో పుణ్యపురాశిగా ప్రసిద్ధి చెందిన స్థలం – 'విజయవాడ'. పూర్వం పాండవ మధ్యముడు ఐన అర్జునుడు పరమేశ్వరుడి గురించి తపస్సు చేసి మెప్పించి పాశుపతాస్త్రమును పొందిన ప్రాంతం కనుక 'విజయవాడ' అనే పేరు వచ్చినట్లు కథనం. పూర్వం



'బెజవాడ' అని వ్యవహరించేవారు. విజయవాడ అనగానే శ్రీకనకదుర్గమ్మ తల్లే గుర్తుకు వస్తుంది. పూర్వం ఇంద్రకీలుడు అనే యక్షుడు దేవిని గురించి తపస్సు చేసి, దేవి ప్రత్యక్షం కాగా తన ఉదరస్థానంలో కొలువుదీరమని కోరాడు. దేవి వరం ప్రసాదించింది. ఇంద్రకీలుడు పర్వతరూపాన్ని ధరించి ఇంద్రకీలాద్రిగా మారగా... ఆ చల్లని తల్లి శ్రీ కనకదుర్గగా కొలువు దీరినట్లు కథనం. ఆలయంలో అమ్మవారు దివ్యమంగళ స్వరూపంతో కొలువుదీరి భక్తులపై కరుణా కటాక్షాలను ప్రసరింప జేస్తూ దర్శనమిస్తారు. అమ్మవారి వద్ద ఆదిశంకరాచార్యులవారు శ్రీ చక్ర ప్రతిష్ట చేశారు. ఆలయ ప్రాంగణంలో పరమేశ్వరుడు శ్రీమల్లేశ్వరస్వామి పేరుతో లింగరూపంలో కొలువుదీరి ఆరాధనలందు కుంటూ వున్నాడు. క్రీ.శ. 5వ శతాబ్దంలో విష్ణుకుండిన రాజు మాధవశర్మ ఆలయం నిర్మించినట్లు చరిత్ర చెబుతోంది. తర్వాత అనేకమంది అభివృద్ధి చేశారు.

విజయవాడలో ఈ ప్రధాన ఆలయంతోపాటు మాచవరంలో శ్రీ ఆంజనేయస్వామి ఆలయం, యనమలకుదురులోని కొండపైన వున్న శివాలయం, లబ్బీపేటలోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయం, పటమటలోని శ్రీ మరకతరాజేశ్వరీ అమ్మవారి ఆలయం మొదలైన ఆలయాలను భక్తులు దర్శించుకోవచ్చు.

శ్రీకాకుళం

స్వతంత్ర్య శాతవాహన సామ్రాజ్య తొలి రాజధాని. శ్రీమన్నారాయణుడు శ్రీ ఆంధ్ర మహావిష్ణువుగా కొలువుదీరిన దివ్యక్షేత్రం – 'శ్రీకాకుళం'. కృష్ణాజిల్లాలో విజయవాడకు 60 కిలోమీటర్ల దూరంలో వుంది. కలియుగంలో పెరుగుతున్న పాపాలను నివారించేందుకు భూలోకంలో తపస్సు చేయ సంకల్పించిన సృష్టికర్త బ్రహ్మదేవుడు కృష్ణా నదీతీరంలో వున్న



ఈ ప్రాంతానికి చేరుకుని అనువైనదిగా గుర్తించి తపస్సు చేశాడు. విష్ణువు తపస్సుకు మెచ్చి ప్రత్యక్షమై భక్తుల పాపాలను పోగొట్టి వారిని రక్షించేందుకు బ్రహ్మదేవుడి కోరిక మేరకుఉ శ్రీ ఆంధ్ర మహావిష్ణువుగా కొలువుదీరినట్లు స్థలపురాణ కథనం. స్వామివారి దేవేరి శ్రీ రాజ్యలక్ష్మి అమ్మవారిగా కొలువుదీరి వుంది. సాహితీ సమరాంగణ చక్రవర్తిగా పేరుపొందిన శ్రీ కృష్ణదేవరాయలు "ఆముక్తమాల్యద" కావ్యాన్ని ఈ ఆలయం ప్రాంగణంలోనే రచించారు. 'సర్వపాపహరణం – శ్రీకాకుళ ఆంధ్ర మహావిష్ణు దర్శనం' అని ప్రతీతి.

మోపిదేవి

శ్రీసుబ్రహ్మణ్యస్వామి సర్పాల చుట్టలవలె వుండే పానపట్టంపై లింగరూపంలో కొలువుదీరిన క్షేత్రం 'మోపిదేవి'. కృష్ణా జిల్లాలో విజయవాడకు 60 కిలోమీటర్ల దూరంలో మోపిదేవి వుంది. వింధ్య పర్వతుడి గర్వమణిచేందుకు దక్షిణదేశం చేరిన అగస్త్యమహర్షి మోపిదేవిలో శ్రీసుబ్రహ్మణ్యస్వామిని పూజించినట్లు కథనం. ఈ క్షేత్రంలో శ్రీ సుబ్రహ్మణ్యస్వామి లింగరూపంలో వుండడం విశేషం. ఆలయ ప్రాంగణంలో స్వామివారి దేవేరులు శ్రీవల్లీదేవి, శ్రీదేవసేనలు కొలువుదీరి వున్నారు. ఆఃస్వామివారిని దర్శించడంవల్ల కంటి వ్యాధులు, చర్మవ్యాధులు, చెవికి సంబంధించిన వ్యాధులు తొలగిపోయి ఆరోగ్యం చేకూరుతుందని భక్తుల విశ్వాసం.



హంసలదీవి

పవిత్ర కృష్ణానది సాగరంలో సంగమించే దివ్యస్థంలో శ్రీకృష్ణుడు శ్రీవేణుగోపాలస్వామిగా కొలువుదీరి పూజలందుకుంటూ వున్నక్షేత్రం – 'హంసలదీవి'. కృష్ణా జిల్లాలో విజయవాడకు 86 కిలోమీటర్ల దూరంలో 'హంసలదీవి' వుంది. భక్తుల పాపాలను స్వీకరించి వారిపాపాలను తొలగించే గంగానది తనకు సోకిన పాపాలను పోగొట్టుకునేందుకు కాకిరూపంలో ఇక్కడకు చేరుకుని కృష్ణానదిలో స్నానమాచరించి హంస రూపమును పొంది తిరిగి వెళ్ళేది. అందువల్ల దీనికి 'హంసలదీవి' అనే పేరు వచ్చింది. ఈ క్షేత్రంలోని పుట్టలో ఒక ఆవు పాలు విడుస్తూ వుండేది. ఈ విషయాన్ని పశువులకాపరి యజమానికి



తెలుపగా, వచ్చి గ్రామస్తులతో కలిసి పుట్టను తొలగించగా శ్రీవేణుగోపాలస్వామి లభించగా ఆలయం నిర్మించినట్లు కథనం. గర్భాలయంలో స్వామివారు కాలుమీద కాలు మడతపెట్టుకుని వయ్యారంగా నిలుచుని వేణువును మీటుతూ కొలువుదీరి వుండగా, ఇరువైపులా రుక్మిణీ సత్యభామలు కొలువుదీరి వున్నారు.

ఈ ప్రధాన క్షేత్రంతోపాటు కృష్ణానదీ తీరంలో కూచిపూడి, మొవ్వ, ఘంటసాల, పెద్దకళ్ళేపల్లి, మోర్తోట, ముక్త్యాల మొదలైన క్షేత్రాలు విరాజిల్లుతున్నాయి. కృష్ణా తీరంలోని ఈ క్షేత్రాలన్నీ భక్తులపై పుణ్యరాశులను వర్షిస్తూ వున్నాయి. వాటిని స్మరించడం, దర్శించడంవల్ల ఎన్నో పుణ్యఫలాలు కలుగుతాయి.

❖ ❖ ❖

పుష్కర నది కృష్ణవేణికి
స్వాగత సుమమాల

అవధాన తిలక, **ముత్యంపేట గౌరీశంకర్ శర్మ,**
నాచారం, హైదరాబాద్

కం. **అమ్మా! కృష్ణమ్మా! రా**
రమ్మా! నీ భాగ్యఇరులు రమ్యముగాగన్
గొమ్మా! మా వందనములు
కమ్మని నీ నీరుద్రావి ఘనులను జేయన్.

సీ॥ **తల్లిగా ఒకచోట దర్శనమిత్తువు**
తాదాత్మ్యమొనరించి తలను నిమిరి
అక్కగా ఒకచోట ఆదరించెదవీవు
అనురాగమొలికెడి అలలతోడ
చెల్లిగా ఒకచోట చేరదీసెదవీవు
చెంతనె నిలుచుండి చెలిమిమీర!
కాంతలా ఒకచోట కమనీయవౌదువు
రమణీయ శబ్దసరాగమొలుల్

గీ॥ **సకలబాంధవ రూపమౌ సలిలమీవె**
ప్రేమవర్షమ్ము గురిసెడి పేర్మినీది
ఈ తెలంగాణ పులకింప ఈవెరమ్ము!
ఈవె జగతికి ప్రగతికి యిహము పరము!

సీ॥ **బంగారు తెలంగాణ భాగ్యాలు పండింప**
రావమ్మ! రుద్రమ్మ రాణిలాగ!
చెరువులు, బావులు, ఎలిమితోడుత నిండి
సీమంతి నీ శోభ జిల్కరమ్ము!
చంద్రశేఖర జటాస్థాంతమందున నుండి
గంగపరుగుతొ వేగమ్మెరమ్ము!
అవధాన కవితలా ఆశుధారలతోడ
పుష్కరస్నానములుప్పొంగ రమ్ము!

గీ॥ **తెలుగు తేజమ్ము రాష్ట్రాన వెలుగునింప**
బ్రతుకునిచ్చెడి బతుకమ్మ బతుకునిమ్ము!
పాడిపంటలు ప్రతియూరు పరవశింప
రమ్ము! కృష్ణమ్మా! నీకు నీరాజనమ్ము!

❖ ❖ ❖

కృష్ణ – కృష్ణవేణి

-ప్రసాదవర్మ కామబుషి

పత్రికలు, వివిధ ప్రచార మాధ్యమాలు, వాటిననుసరిస్తూ ప్రజలు కృష్ణానది, కృష్ణాపుష్కరాలు, కృష్ణా బేరేజి అంటూ వ్యవహరించటం పరిపాటి అయింది. కాని ఈ మహా నది అసలు పేరు కృష్ణవేణీ. పశ్చిమ కనుమలలోని సహ్యాద్రి పర్వత శ్రేణులలో, మహాబలేశ్వర్ కు ఉత్తరంగా 'జోర్' అనే చోట విష్ణు అంశతో జన్మించినది కృష్ణా నది. ఆ పర్వత శ్రేణులలోనే శివాంశతో జన్మించినది వేణీ నది. సహ్యాద్రిలో ప్రభవించిన కృష్ణ 'వేదగిరి' అనే చోట వేణీ నదితో కలిసి కృష్ణవేణీ యీఅయి మహారాష్ట్ర, కర్ణాటక, తెలుగు రాష్ట్రాలలో 1400 వందల కి.మీ. ప్రయాణం సాగించి, కృష్ణా జిల్లా దివిసీమ లోని హంసలదీవి వద్ద సాగర సంగమం చేస్తుంది.

కృష్ణ కాదు కృష్ణవేణి అనటానికి అనేక శాస్త్రా, పురాణ, ఇతిహాసాలలో, పుష్కర స్నానవిధుల వంటి వైదిక మంత్ర శ్లోకాలలో కృష్ణవేణి అన్న వ్యవహారమే కానవచ్చుట యే నిదర్శనం. "తత్ర విష్ణురభూత్కృష్ణా వేణీ దేవో మహేశ్వరః ..... " సరస్వతి శాపం చేత విష్ణువు కృష్ణా నదిగాను, శివుడు వేణీ నది గాను బ్రహ్మ కకుద్మతీ నదిగాను, మిగిలిన ఋషులు కొందరు విశాల, విజయ, కౌశికి మున్నగు నదీ రూపములను పొంది సహ్యాద్రిపై కృష్ణలో కలసి ఏకరూపమై ప్రవహించారు అని స్కాందపురాణం సహ్యాద్రి ఖండం చెపుతున్నది.

కన్యారాసి గతే జీవే కృష్ణవేణీ నదీ తటే .... కన్యాయాం కృష్ణవేణ్యంతు కావేర్యాంచ తులా గతే ..... అని నదీ పుష్కర నిర్ణయ సందర్భాలలోను

కృష్ణవేణంభసి స్నాతో వాజపేయ ఫలం లభేత్ ..... భూతలే యాని తీర్థాని తాని కన్యాగతే గురౌ ఆయాంతి కృష్ణవేణీంతు మహా పుణ్య ఫలానిచ ..... అని పుష్కర స్నాన మహిమ గురించి చెప్పునపుడు,

కృష్ణవేణీతి విఖ్యాతా మమ పాపం వ్యపోహతు కృష్ణవేణీ నమస్తుభ్యం సర్వపాప ప్రణాశనీ ..... అని కృష్ణా నదీ ప్రార్థనలోను, కృష్ణవేణి అనే పేర్కొన్నారు.

భారతంలో అరణ్యపర్వంలో పుణ్యతీర్థాల ప్రసక్తి సందర్భంలోను, భీష్మపర్వంలో చెప్పిన నదుల జాబితాలోను కృష్ణవేణి అనే కనిపిస్తుంది. రామాయణంలో కిష్కింద కాండలో సీతాన్వేషణ యే యే ప్రదేశాలలో చెయ్యాలో సుగ్రీవుడు సూచనలిస్తాడు. ఆ సన్నివేశంలో ' తతో గోదావరీ రమ్యాం కృష్ణవేణీ మహానదీమ్' అని చెప్పటం గమనించవచ్చు. ఈ విధంగా ఈనది కృష్ణవేణి అన్న పేరు తోనే శాస్త్రపురాణేతిహాసాదులలో పలు తావులలో కానవస్తుంది కనుక ఆ పేరునే ప్రామాణికం గా తీసుకోవాలి. కృష్ణానది అనటం వర్జించ వలసిన ఘోర తప్పిదం కాదు గాని, పురాణేతిహాస ప్రసిద్ధమైన, ప్రాచీనమైన, నిర్దుష్టమైన పేరే వాడుకలో ఉండటం సముచితం. ఈ విషయం కృష్ణవేణీ పరీవాహకం లో ని నాలుగు రాష్ట్ర ప్రభుత్వాలు పరిగణలోకి తీసుకోవాలని మనవి.

ఏది ఏమైనా హరి-హరాంశలతో కూడిన పవిత్ర మహానది కృష్ణవేణి లౌకిక అలౌకిక సంపదలను, శుభాలను అనుగ్రహించి కాపాడు గాక!

కృష్ణా పుష్కర మహిమ

- చిల్లర సీతారామారావు

సమస్త జీవరాశుల మనుగడకు జలమే ఆధారము. సముద్రాలు, నదులు, చెరువులు, తటాకాలు, కొలనులు, బావులు మున్నగునవి జలములకు తావులు. నదులు ప్రవహించే తరుణంలో వనములు మున్నగువాటిని అవి దాటుకుంటూ పోవలసివస్తుంది. ఆ సమయంలో కొన్ని రకాలయిన ఓషధులు వాటితో కలిసి ప్రయాణం చేయాల్సి వస్తుంది. కనుక నదులలో స్నానమాచరించినప్పుడు సమస్తరోగాలు నశించిపోయి నూతనత్వం ఉత్తేజం మున్నగునవి శరీరంలో చోటు చేసుకుంటాయి. అన్ని ఋతువులందు ఎండిపోకుండ, నిండుగా జలాలతో ప్రవహించే నదులను జీవనదులు అని అంటారు. అవి గంగ, నర్మద, సరస్వతి, యమున, గోదావరి, కృష్ణ, కావేరి, భీమరథి, బ్రహ్మపుత్ర, తుంగభద్ర, సిందు, ప్రణీత.

దక్షిణభారతదేశంలో గోదావరి తర్వాత నెన్నదగినది కృష్ణానది. కృష్ణానది మహోన్నతమైన జీవనది. ఈ నదీతీరమునన దేవేంద్రుడు నూరు యజ్ఞములు చేశాడని మహాభారతం ద్వారా తెలుస్తున్నది. కృష్ణా నదితోపాటు గోదావరి, భీమరథి, కృష్ణవేణి మున్నగు పాపములను హరించు నదులు ఉద్భవించినాయని విష్ణుపురాణం ద్వారా తెలియుచున్నది.

శ్లో॥ గోదావరీ భీమరథీ కృష్ణవేణ్యాదికాస్తధా।
సహ్యపాదోద్భవా నద్యః స్మృతా; పాపభయాపహా!!

పడమటి కనుమలయందు బ్రహ్మగిరి, వేదగిరి అను రెండు ప్రసిద్ధి కెక్కిన శిఖరములు గలవు. బ్రహ్మ బ్రహ్మగిరిపైన విష్ణుమూర్తి గురించి తపము చేయగా విష్ణుమూర్తి శ్వేతాశ్వత్థరూపమున సాక్షాత్కరించాడు. వేదగిరిపైన బ్రహ్మ ఈశ్వరుడిని గురించి తపమొనరించగా ఆమలకవృక్ష రూపమున పరమేశ్వరుడు సాక్షాత్కరించాడు. అశ్వత్థవృక్షము కృష్ణగాను, ఆమలక వృక్షము వేణిగాను విస్తృతమైన ఒకదానితో ఒకటి కలిసి కృష్ణవేణిగా అవతరించాయి. ఈ నదికి పదునాలుగ ఉపనదులు, నూట ముప్పది యెనిమిది (138) తీర్థములు ఉన్నాయి. ఇందు పదునెనిమిది తీర్థములు ముఖ్యమైనవి. ఇది ఒక కథ. మరియొక కథననుసరించి పూర్వం సహ్యుడు అను మునిపుంగవుడు ఉండేవాడు. ఆయన విష్ణుమూర్తిని గురించి ఘోరతపమాచరించాడు. ఆయన తపమునకు ప్రసన్నుడైన విష్ణుమూర్తి ప్రత్యక్షమై వరము కోరుకొమ్మని అడుగగా సహ్యముని భగవంతుణ్ణి ఇలా ప్రార్థించాడు. దేవా! కృష్ణా మీ పుత్రిక అని, బ్రహ్మదేవుడఱు ఆమెను తన పుత్రికగా స్వీకరించినాడని తెలియవచ్చినది. ఆ కష్ణానదిని నాపైన ప్రవహించేటట్లు అనుగ్రహించండి. తర్వాత సహ్యముని అద్రిగా మారి సహ్యాద్రి పేరుతో పిలవసాగాడు. కృష్ణానది సహ్యాద్రి పర్వతంమీదనుండి ప్రవహించసాగింది. కృష్ణానదీ తీరాన ఉన్న ఇంద్రకీలాద్రిపై శ్రీకనక దుర్గాదేవి వెలసియున్నది. ఇక్కడ అర్జునుడు తపస్సు చేశాడని ప్రసిద్ధి. ఇది అష్టాదశ శక్తిపీఠాలలో ఒకటి.

పవిత్ర కృష్ణవేణీ పుష్కరాలు బృహస్పతి కన్యారాశి ప్రవేశంవల్ల దుర్ముఖి నామ సంవత్సరం ఆగస్ట్ 12వ తేదీన పుష్కరాలు వస్తున్నాయి. పుష్కరాలు మానవాళి సమస్త పాపములను ప్రక్షాళన గావిస్తాయి. పూర్వం తుందిలుడు అనే బ్రాహ్మణోత్తముడు ఉండేవాడు. అతడు పరమేశ్వరుని గురించి ఘోరతపమొనర్చాడు. ఆయన దయవల్ల మూడున్నర కోట్ల పుణ్యతీర్థాలకు రాజై పుష్కరు అనే పేరుతో ప్రసిద్ధికెక్కాడు. పరమేశ్వరుని అష్టమూర్తులలో నొకటైన జలమయమూర్తిలో ప్రవేశించి పరమేశ్వరుడే అయ్యాడు.

బ్రహ్మ సృష్టికార్యాన్ని నిర్వహించడానికి జలము ఆవశ్యకము అయింది. అతడు పరమేశ్వరుడిని తన తపముజేత మెప్పించి అన్ని కోర్కెలను తీర్చే పుష్కరుడిని సృష్టికార్యనిమిత్తము తనకిమ్మని ప్రార్థించాడు. 'అలాగే' అని ఆశీర్వదించాడు పరమేశ్వరుడు. బ్రహ్మ జలము రూపములో ఉన్న పుష్కరుడిని తన కమండలంలో పెట్టుకొని సృష్టి గావిస్తున్నాడు. ఇలా కొంతకాలం గడిచిపోయింది. దేవతల గురువు బృహస్పతి. ఆయన బ్రహ్మగురించి తపమొనరించాడు. అతని తపమునకు మెచ్చి ప్రత్యక్షమై వరము కోరుకొమ్మని అడిగాడు బ్రహ్మ. అప్పుడు బృహస్పతి ఇలా అన్నాడు – దేవా! ప్రాణులను రక్షించే ధర్మం నాది. దానికొరకు జలము ఆవశ్యకము. కనుక జీవనాధారుడైన పుష్కరుడిని నాకు ప్రసాదించండి. బ్రహ్మ తథాస్తు అన్నాడు. కాని

దక్షిణభారతదేశంలో గోదావరి తర్వాత నెన్నదగినది కృష్ణానది. కృష్ణానది మహోన్నతమైన జీవనది. ఈ నదీతీరమునన దేవేంద్రుడు నూరు యజ్ఞాలు చేశాడని మహాభారతం ద్వారా తెలుస్తోంది. కృష్ణానదితోపాటు గోదావరి, భీమరథి, కృష్ణవేణి మున్నగు పాపాలను హరించు నదులు ఉద్భవించాయని విష్ణుపురాణం ద్వారా విదితమవుతోంది.



పుష్కరుడు బ్రహ్మను విడిచి వెళ్ళడానికి అంగీకరించలేదు. అప్పుడు బ్రహ్మ దీర్ఘంగా ఆలోచించి అందరికీ ఆమోదయోగ్యమైన ఒక నియమాన్ని ఏర్పాటుచేశాడు. దాని ప్రకారం బృహస్పతి ఏ రాశిలోకి ప్రవేశించినా మొదటి పన్నెండు రోజులు, చివరి పన్నెండు రోజులు మిగిలిన రోజులలో మధ్యాహ్న సమయంలో నాలుగు ఘడియలకాలం పుష్కరుడు బృహస్పతిలో ఉండాలి. ఆ సమయంలో బ్రహ్మ సమస్త దేవతాగణంతో పుష్కరుని చెంతనే ఉంటాడు. ఈవిధముగా నిరంతరం బ్రహ్మతోనూ, బృహస్పతితోనూ ఉండే వీలు కలిగింది. అంతేగాదు దేవతలందరి సాన్నిధ్యం నదులలో ఉండటంవలన అప్పుడు ఆచరించిన స్నాన, తర్పణాది కర్మలవలన అంతులేని పుణ్యసంపద కలుగుతుంది.

పుష్కర సమయంలో స్నానం తప్పనిసరిగా చేయాలి. 'స్నానం సర్వాఘనాశనం' అనగా స్నానం సకలపాపాలను హరిస్తుంది. స్త్రీలుగాని, పురుషులుగాని పుట్టిన నాటినుండి చేసిన సమస్తపాపాలు పుష్కర సమయంలో స్నానమాచరించినట్లయితే తొలగిపోతాయని భారతంలో వేదవ్యాసులు తెలియజేశారు.

శ్లో।। జన్మప్రభృతియత్పాపం స్త్రియా వా పురుషేణవా!
పుష్కరే స్నాతమాత్రస్య సర్వమేవ ప్రణశ్యతి" –

పుష్కరసమయంలో కృష్ణలో స్నానమాచరించి పిండప్రదానములు, క్షురకర్మలు, దానాలు మున్నగునవి చేయువారు త్రికోటి కులములను ఉద్ధరించినవారు అవుతారని ఈ క్రింది శ్లోకము ద్వారా తెలియుచున్నది.

శ్లో।। కన్యారాశిగతే దివే కృష్ణవేణి నదీతటే
స్నానం దానం తథాక్షారం త్రికోటి ఫలముద్ధరేత్ ।।

పుష్కరాలకు గ్రహదోషాలు పోగొట్టి శుభములను ప్రసాదించే శక్తి ఉంది. ఈ సమయంలో పితృతర్పణ విధులను అవశ్యము ఆచరించాలి.

కృష్ణానదిలో స్నానము చేయసంకల్పించినపుడు ప్రాతఃకాలమున స్నానము చేయుట ఉత్తమము. మధ్యాహ్న సమయమున స్నానము గావించుట మధ్యమము. అపరాహ్ణ సమయమున స్నానమాచరించుట అధమము. ప్రతిరోజూ గంగానదిలో స్నానమాచరించుట వలన కలుగు ఫలము, త్రివేణీ సంగమములో సంవత్సరంపాటు స్నానము చేసినచో కలుగు ఫలము, నర్మదా నదీ తీరమునందు తపమొనరించిన కలుగు ఫలము – ఇవన్నీ ఒక కృష్ణానదిలో పుష్కర సమయంలో స్నానమాచరించినపుడు కైవసము కాగలవు. ప్రాణికోటికి జీవనాధారమైన నదులను పుష్కర సమయంలో చాలా పవిత్రంగా చూచుకోవాలి. నీటిని ఏవిధముగా నైనను మలినము చేయరాదు. పుష్కర కాలమునందు నదీతీరాన తప్పనిసరిగా పితృసంబంధమైన కార్యాలు చేయాలి. తల్లిదండ్రులు, సవతితల్లి, తండ్రి తాత, ముత్తాతలు, తల్లి నాయనమ్మ, తాతమ్మ, తన భార్య, కొడుకు అన్నదమ్ములు, పినతండ్రి, పెదతండ్రులు, భార్యలతో సహా మేనమామలు, కూతురు, అక్కలు, చెల్లెళ్ళు, దౌహిత్రుడు, మేనత్తలు, పిల్లనిచ్చిన అత్తమామలు, బావమరది మున్నగువారికి పిండప్రదాన తర్పణములు చేయాలి. శక్త్యానుసారము దానములు చేయాలి.

పుష్కరసమయంలో బ్రహ్మ, బృహస్పతి, మూడున్నర కోట్ల తీర్థాలలో కళకళలాడుతున్న కృష్ణానదిని పూజించడం మనందరి కర్తవ్యం. మన అదృష్టంవలన వస్తున్న గొప్ప అవకాశం కృష్ణా పుష్కరం. ఇరు రాష్ట్రాలలోను భక్తుల పుష్కర స్నానాదులకొరకు ఘట్ట నిర్మాణపనులు చురుకుగా సాగుతున్నాయి. శక్త్యానుసారం భక్తిశ్రద్ధలతో స్నాన, దాన, శ్రాద్ధాది కర్మలను అనుష్ఠించి పుణ్యసంపదను కైవసం చేసుకుందాం.

శ్లో।। నమామి కృతశ్రేణీం కృష్ణవేణీం తరంగిణీ!
యద్వీక్షణం కోటిజన్మకృత దుష్కర శిక్షణమ్ ।।

పుణ్యపరంపరలు కలిగిన ఏ నదిని కాంచినంత మాత్రముననే కోటి జన్మ కృత సమస్త పాపరాశిని నశింపజేయగల శక్తి కలదో అటువంటి కృష్ణవేణీ నదికి భక్తిప్రపత్తులతో ప్రణమిల్లుతున్నాను.

❖ ❖ ❖

కృష్ణా పుష్కరునికి స్వాగతము

డా. జొన్నలగడ్డ మార్కండేయులు

పుష్కరుడు ఒక బ్రాహ్మణుడు. తుందిలుడు అనేపేరుతో తపస్సుచేసి శనిదోష నివారణశక్తినిసాధించాడు. బ్రహ్మకమండల జలములో జలరూపముతో ఉండే బ్రహ్మసన్నిధి అనుగ్రహము కలవాడు. జీవకోటికే కాదు గ్రహస్థితిని శాసిస్తున్న గ్రహాలుకూడ గ్రహదోషస్థితిని అనుభవించాలన్నది విధి లిఖితము. బృహస్పతిగ్రహాన్ని ఏల్నాటి శని పట్టి పీడించవలసి వచ్చింది. అధిదేవత బ్రహస్పతి బ్రహ్మనాశ్రయించాడు. పుష్కరకాలము నిర్ణయించి బ్రహ్మ 12 ముఖ్య నదులలో పన్నెండు సంవత్సరాలకొకసారి బృహస్పతి ఆయారాశులలోసంచరించినపుడు 12 రోజులు తోడు పంపుతానని స్నానముచేసి దోషనివారణపొందుతావని అభయమిచ్చాడు.

మనుష్యకాలమానము ప్రకారము పన్నెండు సంవత్సరాల కొకసారి నదీజలాలో పుష్కరుడు బ్రహ్మ ఆదేశమువల్ల పన్నెండురోజులుంటాడు. 12ముఖ్యనదులలో స్నానము చేసి దోషనివారణ పొందు అని బ్రహ్మ పుష్కరుని నదులలో ప్రవేశపెడుతున్నాడు. పన్నెండేళ్ళకొకసారి బృహస్పతి శనిదోష నివారణకుపుష్కరుని జలముతో కూడిన నదీస్నానము చేస్తున్నాడు.. పుష్కర ప్రవేశజల ఆపుణ్యఫలితము సర్వ జీవరాశికి లభించే వరమిచ్చాడు. పుష్కరవేళ అయస్కాంతశక్తి నదిజలాలలో ఉందని శాస్త్ర విజ్ఞానము కూడ అంగీకరిస్తోంది. బృహస్పతి కన్యారాశితోకలిసి పుష్కర తీర్థముగ కృష్ణానదిని ప్రవేశిస్తాడు దేశమంతా ఈశుభవేళ కృష్ణాపుష్కరస్నానానికి తరలివచ్చి తరించాలని భావిస్తోంది.

కృష్ణానదిని కృష్ణవేణి అనికూడా అంటారు. కృష్ణ సహ్యాద్రి పర్వతాల్లోని ప్రాచీన మహాబలేశ్వరమునుంచి బయలుదేరి, బ్రహ్మగిరి? వేదగిరి పర్వతాల మధ్య జన్మించిన వేణి నదినికలుపుకుని మాహులి నుంచి అఖండప్రవాహినిగా కృష్ణవేణి అనిపిలవబడుతోంది. దక్షిణభారతంలో రెండవ అతిపెద్దనది. బృహస్పతి కన్యారాశి కూడిన వేళ కృష్ణకు ఇప్పుడు ఆగష్టులో పుష్కరాలు.

ఆంధ్రప్రదేశ్ రాజధాని ఇప్పుడు అమరావతి. అమరావతి కృష్ణానదీతీరాన ఉంది. 5115 సంవత్సరాలక్రితము శ్రీకృష్ణభగవానుడు జలరూపం ధరించాడు. ఆయనపేరుమీద కృష్ణా నది ప్రవాహము బయలుదేరింది అని చెబుతారు. శివుడు ఇక్కడ అమరుల కోరికపై అమరేశ్వరుడై వెలిశాడు. దేవేంద్రాదిదేవతలు ఇక్కడకు వచ్చి కొలిచిన కారణాన ఇది అమరావతయింది. స్వర్గాధిపత్యము కోల్పోయి దేవతలు తలదాచుకున్నచోటుగనక అమరావతి సార్థకనామధేయము. స్వర్గధామ అమరావతిగ జగద్విదిత దిశగ ఆంధ్రప్రదేశ్ రాజధాని త్వరితగతినిరూపు దిద్దుకుంటున్న వేళ పుష్కర యాత్రికులకు అలౌకికానందము కలిగిస్తుంది.

అమరావతి పంచారామాలలో ఒకటి. తారకాసురుణ్ణి దేవసేనాని కుమారస్వామి వధించాడు. తారకాసురుడు శివభక్తుడు. వధింపబడ్డ సమయాన కంఠములో ధరించిన శివుని ఆత్మలింగము ప్రయ్యలై ఐదు చోట్లపడింది. కృష్ణాతీరమున పడినచోట ఇంద్రుడు ప్రతిష్టించాడు గనుక ఆత్మలింగభాగము అమరేశ్వరుడని పేరుపడి అమరారామముగా పేరుగాంచింది. ధాన్యకటముగా ప్రాచీనకాలమునుంచీకూడ ఆంధ్రులరాజధాని అమరావతి. శైవ, వైష్ణవములతో బాటు బౌద్ధమత ప్రాభవ నిలయమై కూడ పేరుగాంచింది.

బౌద్ధమతము ప్రాభవదశను చాటిన అమరావతి బౌద్ధ స్తూపము ఖ్యాతి వహించింది. అసలు అమరావతి దేవాలయమే బౌద్ధ నిర్మాణమనే ఆధారములు సహేతుకముగా నిరూపిస్తున్నారు. కాని ప్రాచీన ప్రసిద్ధఅమరేశ్వరాలయమున్నచోటునే స్తూపనిర్మాణము జరిగి ఉండవచ్చన్నది వితండవాదమనిపించ కూడదు. ప్రాచీన పునర్నిర్మాణముగ శివాలయము వైభవమునకు శ్రీరాజా వాసిరెడ్డి వేంకటాద్రినాయుడు ఎప్పుడూ స్మరణీయుడు. రాజపేట ఆయనపేరు మీద, తల్లిపేరు మీద అచ్చంపేట, తండ్రిపేరుమీద జగ్గయ్యపేట నిర్మించారు.

సహ్యాద్రి పర్వతశ్రేణులలో పుట్టిన కృష్ణవేణి నది పులిగడ్డదగ్గర రెండు పాయలైంది. విడిపోయిన ఎడమ ప్రవాహము మరో ప్రవాహముగ పాయయై హంసలదీవిదగ్గర సముద్రములో కలుస్తుంది.

"గోదావరి, కృష్ణమ్మలు గొప్పింటితోబుట్టులు,– ఆంధ్రావని శోభిల్లే అన్నపూర్ణ విశాలాక్షులు' అన్నారు కందుకూరి రామభద్రకవి. కృష్ణ, గోదావరి నదీజలాలు పంటసాగు భూముల రైతాంగానికి కాశీ అన్నపూర్ణ, విశాలక్షులై అన్నదాతలను చేశాయి. శివపత్ని, గంగాభవానిగ అబేధమును చాటాయి. నదీమతల్లులై గోదావరమ్మ, కృష్ణవేణమ్మ అనిపించుకున్నాయి. గోదావరమ్మ నదీజలాల పుష్కరములు ముగిశాయి. ఇప్పుడిదిగోదావరి తోబుట్టువు కృష్ణమ్మకు పుష్కరాలవేళ. కృష్ణవేణమ్మ పుష్కరపుణ్యజల దర్శన పునీతస్నాన పులకిత ఆంధ్రావని కుతూహావలోకన భావజాల వ్యాసమిది."

కాకులుగా శాపముపొందిన ఇద్దరు గంధర్వులు ఇక్కడ ఈ సాగరసంగమములో తీర్థమాడి హంసలరూపముపొందారని జనశ్రుతి. అందుచేత సాగరసంగమముచోటు హంసలదీవి అని పేరుపడింది. హంసాకార పక్షులు విహరిస్తాయని హంసలదీవి అన్నారని కూడ చెబుతారు. స్కాందపురాణములో సహ్యాద్రిఖండముంది. హంసలదీవి మహిమగొప్పది.

కృష్ణానది కృష్ణుని అంశ. అందుకే గంగానది కూడ హంసలదీవి దగ్గర స్నానము చేసి పాప రాశిని వదిలించుకుంది. గంగ తనలో మునిగిన పాపాత్ములది పేరుకున్న పాపరాశిని కాకిరూపముగ ధరించి ఈసాగరసంగమ క్షేత్రములో మునగగానే పాపరాశి పుణ్యరాశియై హంసాకారము దాల్చినదట! ఇక్కడ భార్యాభర్తలు కలకాలం సుఖంగా ఉండాలని జంటగా స్నానము చేస్తారు.

అమరేశ్వరాలయమునుండి హంసలదీవివరకు కృష్ణానదీ తీరమున ఎన్నో దేవాలయాలున్నాయి. కాని పుష్కరాలనగానె మనసు పరుగులుపెట్టేది విజయవాడకు.

విజయవాడ బెజవాడగా ప్రసిద్ధి. బెజవాడ ఇంటిపేరుగా బెజవాడ గోపాలరెడ్డి ఉమ్మడి మద్రాసు రాష్ట్రములో ఆర్థిక మంత్రిగా చేశారు. పెచ్చవాడ- వెచ్చవాడ- బెజ్జవాడ బెజవాడయింది. కృష్ణానది రెండుకొండల నడుమనున్న బెజ్జమునుండి వచ్చిన కారణాన బెజవాడయింది. కృష్ణానది అనేక బీజములు, అనగా ఓషధులు కలిగిన నదీవాడగా బొజీవాడగ బెజవాడ అయింది. శాసనాలలో రాజేంద్రచోళపురమని పేర్కొనబడింది. కాని విజయుడు ఇక్కడ శివుని ఎదిరించి మెప్పు పొంది పాశుపతము సంపాదించాడు కాబట్టి విజయవాటి అయిందన్నది అందరికీ ఇష్టము.

విజయవాటి విజయవాడగా అవాలన్నది ప్రజలకోరిక. 1948-1949లో అప్పటి మునిసిపల్ చైర్మన్ టి.వి.ఎస్. చలపతిరావు- పురపాలకసంఘం బెజవాడను విజయవాడగా మార్చారు. దుర్గాదేవి కొలువున్న నేల ఇది. దుర్గాదేవికి విజయాంబ అనే నామాంతరముంది. విజయవాటిక విజయవాడగా సముచిత నిర్ణయము. కీలుడు అనేయక్షుడు తపస్సు చేసిన పర్వతము కీలము. కీలాద్రిపై వెలసిన దుర్గను ఇంద్రాదిదేవతలు పూజించినస్థలము గనుక ఇంద్రకీలాద్రిగల విజయవాడపట్టణమనే ఖ్యాతి విరిసింది.

7వ శతాబ్దిలో వేంగిరాజులకు 13వ శతాబ్దిలో చోళులకు విజయవాడ ప్రధాన నగరము. హ్యూయాన్ త్సాంగ్ క్రీ/శ638లో ఈపట్టణ వైభవాన్ని పేర్కొన్నాడు. రాష్ట్రకూటులు, కాకతీయులు, రెడ్డిరాజులు, గజపతులు, కృష్ణదేవరాయలు, కుతుబ్ సాహీలు, అక్కన్నమాదన్నలు అసఫ్ జాహీలు, బ్రిటిష్ వారు విజయవాడ రాజకీయాలలో తొంగిచూస్తారు.

కృష్ణాక్షేత్ర ప్రాముఖ్యతను చాటిన సాహిత్యము వెలసింది మహాకవులు ఎఱ్ఱాప్రెగడ, శ్రీనాధుడు, నారాయణతీర్థులు పంచనారసింహ క్షేత్రమును దర్శించారు. ఇది కృష్ణాపుష్కరవేళ దర్శించ తగినది.

పంచనారసింహ క్షేత్రములో వేదాద్రి నారసింహుడు కొలువున్నాడు. వేదములు సోమకుని చేత అపహరింపబడ్డాయి. సోమకుని సంహరించి వేదములు బ్రహ్మకు చేరాక అవి నారాయణ సన్నిధిని ఇవ్వమని అడిగాయి. నరసింహుడై అవతరించి తలలపై పంచమూర్తులుగా ధరిస్తానని చెప్పాడు. అంతవరకు కృష్ణానది గర్భములో ఉన్న సాలగ్రామ పర్వతముపై ఉండండని ఆదేశించాడు. మాటప్రకారము వేదాలు ధరించి పంచనారసింహమూర్తులుగా అవతరించాడు. వేదాలు వినిపించే పర్వతము వేదాద్రిగా విజయవాడకు 54కి.మీ, జగ్గయ్యపేటకు 15 కి.మీ దూరంలో వేదాద్రి ఉంది. పురాణ ప్రసిద్ధమిది. ఋష్యశృంగమహర్షి కోరికపై యోగానంద లక్ష్మీనసింహస్వామిగా కొలువున్నాడు.

శ్రీకృష్ణదేవరాయల ఆముక్త మాల్యదకు శ్రీకాకుళాంధ్రదేవుడు ప్రేరకుడు. ఈ శ్రీకాకుళేంద్రక్షేత్రమును అగస్త్యుడు దర్శించినట్లు స్కాందపురాణములో ఉంది. 13వ శతాబ్దిలో తూర్పుచాళుక్యరాజు ఒకటవ నరసింహసేనాని కంచి దండయాత్రకు వెళ్ళి అనంతభూపాలుని జయించాడు. వల్లభాభ్యుదయము గ్రంథము ప్రకారము ఆంధ్రనాయకుడని పేరుగల ఆంధ్రవిష్ణువుకు ముందు గుడికట్టి తరువాత దండయాత్రకు వెళ్ళాడు.

పద్మపురాణం, క్రీడాభిరామము ఈ దేవుని ప్రశంస చేశాయి. కాసుల పురుషోత్తమకవి శ్రీకాకుళాంధ్రదేవ మకుటముతో శతకము రాశాడు. శాతవాహనులకాలమునాటిగుడి ఇది. మూలవిరాట్టును శిధిలముల నుండి ఉద్ధరించి అనంత భూపాపాలుడు పునఃప్రతిష్ఠించాడు. ఘంటశాల మండలంలో శ్రీరంగపురానికి 8కి.మీదూరంలో కృష్ణానదికి పశ్చిమతీరంలో ఈ ఆలయం ఉంది. స్కాందపురాణములో అగస్త్యుడు ఈక్షేత్రమును దర్శించాడని చెప్పబడింది.

బెజవాడకనకదుర్గమ్మ దేవాలయము కృతయుగమునాటి కోవెలగా భావిస్తారు. పద్మపురాణం, బ్రహ్మపురాణం, బ్రహ్మవైవర్తపురాణం, దేవీభాగవతం కనకదుర్గ భక్తి ప్రతిపాదికములు. బంగారు ఆలయ శిఖరాలు, శోభిల్లుతున్న ఆలయము తిరుమళేశుని తరువాత దుర్గమ్మదే!

శ్రీచక్ర అధిష్ఠాన దేవతగా శంకరులు ప్రతిష్ఠించారు. శ్రీచక్రప్రతిష్ఠకు ముందు అమ్మవారు మహిషాసురమర్థినిగా శాక్తేయ వామాచార పద్ధతిలో పూజింపబడింది. శాంతిస్వరూపిణివి కమ్మని ప్రార్థించి శ్రీచక్రప్రతిష్ఠ చేశారు. బాలాత్రిపురసుందరి,అన్నపూర్ణ, గాయత్రి,

జల ప్రశస్తి

క్రీ.శ. 1369 – భాస్కర భవదూర మహీపతి (బుక్కరాయని కుమారుడు) పోరుమామిళ్ళ చెఱువు నిర్మాణం చేయించి నప్పుడు వేయించిన శాసనములోని శ్లోకాలు. కవి లింగయమాచనార్య.

ఆపోవా ఇదగ్ం సర్వమిత్యామ్నాయ ప్రమాణతః । జలాదేవాన్న సంభూతః అన్నం బ్రహ్మేతి చ శ్రుతిః ॥

అంతా నీరే అనడానికి వేదాలే సాక్ష్యం. నీటినుంచి అన్నం సృష్టింపబడుతుంది. అన్నం పరబ్రహ్మము అని వేదాలు చెబుతున్నాయి.

చరాచర జగద్బీజం జలమేవ న సంశయః । కింపునర్బహునోక్తేన జలాధిక్యం వదామ్యహమ్ ॥

చరాచర జగత్తునకు హేతువు నీరే అనడంలో సందేహంలేదు. పలు మాటలు ఎందుకు? నేను నీటి గొప్పతనాన్ని చెబుతాను.

గంగాధరో హరస్సోపి విష్ణురంభోధి మందిరః । బ్రహ్మేజలజ సంభూతః తస్మాత్ సర్వాధికం జలం ॥

ఈశ్వరుడు గంగను స్వతః దర్శించాడు. విష్ణువు సాగరంలోనే ఇంటిని చేసుకున్నాడు. నీటిలో పుట్టిన కమలంలో బ్రహ్మదేవుడు జన్మించాడు. అందువలన నీరు అన్నిటికంటే గొప్పది.

ప్రపా కూపశ్చ వాపీ చ కుల్యా పద్మాకరస్తథా । ఉత్తరోత్తరతః తేషాం కోటి కోట్యధికం ఫలం ॥

చలివేంద్రం, చేదే బావి, దిగుడు బావి, కాలువ, చెరువు– వీటిలో క్రమంగా ఒకదాని నిర్మాణం కంటే మరొకదాని నిర్మాణం కోటిరెట్లు అధిక ఫలాన్నిస్తుంది.

చరాచర జగద్రక్షా యత్తటాకాంబునా భువి । తస్య పుణ్యఫలం వక్తుమశక్తః కమలాసనః ॥

చరాచర లోకాన్ని రక్షించేది చెరువు నీరే కాబట్టి అటువంటి తటాక నిర్మాణం వల్ల లభించే పుణ్యఫలాన్ని కమలాసనుడు కూడ వర్ణించలేడు.

లలితా త్రిపురసుందరి, శ్రీసరస్వతి, శ్రీమహాలక్ష్మి, దుర్గ, మహిషాసురమర్థిని, రాజరాజేశ్వరి రూపములతో శరన్నవరాత్రులు జరిపే ఆచారము వచ్చింది. అయితే మొగల్రాజపురం దుర్గాదేవి మొట్టమొదట వెలసిన కనకదుర్గ అంటారు. అగస్త్యుడు ఇక్కడ శివాలయప్రతిష్ఠ చేశాడు. మొగల్తూరు జమీందారులు ఈ దేవాలయాన్ని అభివృద్ధి చేశారు. ఇంద్రకీలాద్రి కనకదుర్గకే బెజవాడ కనకదుర్గగా ఖ్యాతి వచ్చింది.

కనకదుర్గమ్మతో బాటు దర్శిస్తున్న శివాలయ శివునకు మల్లేశ్వరుడని పేరు. మల్లికాపూలతో బ్రహ్మ ఆరాధించిన జ్యోతిర్లింగమిది. జ్యోతిర్లింగము అంతర్నిహితముగా ఉందని ఆదిశంకరులు కనకదుర్గకు ఉత్తరభాగంలో ప్రతిష్టించారు. పాండవమధ్యముడు విజయుడు ఆరాధించిన శివలింగమిది. అగస్త్యప్రతిష్ఠగా కూడా ప్రచారము. రంభుడనే రాక్షసుడి కొడుకు మహిషాసురుడు కాత్యాయన మహర్షిని స్త్రీ వేషములో అల్లరిపెట్టాడని స్త్రీచేతిలో చస్తావని వాడి దూకుడును శపించాడని స్కందపురాణ సహ్యాద్రిఖండము కథ. బెజవాడదుర్గమ్మయే మహిషాసురమర్థిని.

శ్రీమహాకాళి, శ్రీ మహాలక్ష్మి, శ్రీ మహాసరస్వతి త్రిశక్తిపీఠముగ విజయవాడ కొత్త బస్టాండు పక్కన ఉంది. స్కాందపురాణములోని నరకోత్తరక్షేత్ర వృత్తాంతము ప్రస్తావించ తగ్గది. నరకాసురసంహారము గాథ ద్వాపరయుగము నాటిది చెప్పబడింది. చల్లపల్లి మండలం నడకుదురు ప్రాంతము అదేనని నరకొత్తూరు, నడకదూరుగా పిలవబడిందని జనుల విశ్వాసము. ఈ విశ్వాసాన్ని నెమలిగ్రామము కూడా ధ్వనిస్తుంది. కామస్పర్శ లేని నెమలి పించము కృష్ణుడు ధరించాడు. ద్వాపరయుగానంతరము ఆ నెమలి పించాన్ని ఈ గ్రామములోవదిలాడని భూగర్భములో త్రవ్వగా బయల్పడిన వేణుగోపాలుని విగ్రహానికి ద్వాపరయుగమునాటిదని వేణుగోపాలునికి గుడికట్టి పూజిస్తున్నారు. బ్రహ్మపురాణములో ప్రస్తావింపబడిన అగిరిపల్లి క్షేత్రము నృసింహస్వామి కొలువుగా విజయవాడకు 10కి.మీ దూరంలోఉంది. పెనుగంచిప్రోలు గ్రామంలో వెలసిన దేవత గ్రామదేవత తిరుపతమ్మ కథ పదిహేడవశతాబ్దిలో నిజంగా జరిగినగాథ.

కాశీనుంచి వచ్చి స్థిరపడిన అగస్త్యమహాముని సంచారము, దేవాలయ నిర్మాణములుగల పురాణప్రసిద్ధ గాథల నేలయిది. ద్వాపరయుగము నాటిగాథలను కృష్ణపరముగా వినిపించే కృష్ణాతీరమిది. అమరావతి, నాగార్జునకొండలలో బౌద్ధము ఆనవాలులు, 1300 సంవత్సరము కాలమునాటి గుడివాడలో జైనమత ప్రాభవగుర్తు పార్శ్వనాథ దేవాలయమును కలిగి ఉన్న నేల. దక్షిణకాశిగా పేరుపొందిన ముక్త్యాలలో బలిచక్రవర్తి కాలమునాటి ముక్త్యాలేశ్వరుడున్న శైవక్షేత్రము. కవులు, పండితులు సంచరించి విఖ్యాతి తెచ్చిపెట్టిన నేల ఎక్కడ స్నానఘట్టమున్నా స్వాగతించి భక్తిముక్తి ప్రధానముగా అలౌకికానందము కలిగిస్తుందీ పుష్కరవేళ కృష్ణమ్మగ స్వాగతము. ❖

శ్రీశైల మహాక్షేత్రం




- డా॥ వి.ఎన్.చక్రవర్తి

ఆంధ్రప్రదేశ్ కర్నూలు జిల్లా ఆత్మకూరు తాలూకాలో ఉన్న నల్లమల అడవులలో, పర్వతపంక్తుల మధ్య 'పాతాళగంగ' అనే పేరుతో ఉత్తరంగా ప్రవహిస్తున్న కృష్ణానదికి కుడివైపున శ్రీశైలం ఉంది. దీని ఎత్తు సముద్రమట్టానికి 1500 అడుగులు కాగా యీ క్షేత్రంలోని అతి ఎత్తైన కొండ శిఖరమైన శిఖరేశ్వరం 2830 అడుగులు. 12 జ్యోతిర్లింగాలలో ఒకటైన శ్రీమల్లికార్జున లింగానికి, 18 మహాశక్తులలో ఒకరైన శ్రీ భ్రమరాంబా దేవికి స్థానంగా ఉన్న యీ మహాక్షేత్రం అనంతమైన పుణ్యక్షేత్రాలతోనూ, మహిమాన్వితా తీర్థరాజాలతోనూ, పుష్కరిణులతోనూ, వివిధ ఓషధులతోనూ కూడి సందర్శకులను తరింపజేస్తోంది.

ద్వారాలు - ఉపద్వారాలు

శిఖరదర్శనంచేతనే అనంతమైన పుణ్యాన్ని సంతరించి పెట్టి పునర్జన్మనుండి ముక్తిని కలిగించే యీ మహాక్షేత్రానికి ప్రకాశం జిల్లా, త్రిపురాంతకాన్ని తూర్పు ద్వారంగాను, కడప జిల్లా సిద్ధవటాన్ని దక్షిణద్వారంగాను, మహబూబ్‌నగర్ జిల్లా,



ఆలంపురాన్ని పశ్చిమద్వారంగానూ, ఇదే జిల్లాలోని ఉమామహేశ్వరాన్ని ఉత్తర ద్వారంగానూ స్కాందపురాణం చెప్పింది. ఇవి కాక నరెల్లూరు – కడపల అంచున పెన్నాతీరంలోని 'స్కందసోమేశ్వరం' మహబూబ్‌నగర్ జిల్లాలో కృష్ణానదీ తీరంలో గల 'ఏలేశ్వరం', కడప జిల్లాలో ఉత్తర పినాకినీ తీరంలో గల 'పుష్పగిరి', కర్నూలు జిల్లాలో సప్తనదీ సంగమస్థలం (భవనాశని కృష్ణా నదులు కలిసేచోటు) అయిన సంగమేశ్వరం శ్రీశైల మహాక్షేత్రానికి వరుసగా ఆగ్నేయ, నైరుతి, వాయువ్య, ఈశాన్య ద్వారాలుగా చెప్పబడ్డాయి. ఈ ద్వారాలను 8వ శతాబ్ది నుండి వివిధ శాసనాలు కూడా ప్రస్తావించాయి. ఈవిధంగా 30 ఆమడల (384 కి.మీ.) పొడవు, 30 ఆమడల వెడల్పు గల యీ మహాక్షేత్రం, 1,47,456 చ.కిలోమీటర్ల విస్తీర్ణం కలిగి అష్టదళ పద్మంలా విరాజిల్లుతోందని, అంగక్షేత్రాలైన చిన్న చిన్న క్షేత్రాలన్నీ దీని కేసరాలనీ, భ్రామరీ సహితుడైన మల్లికార్జునుడు

అష్టదళాలపై విహరిస్తూ కర్ణికవంటి శ్రీశైల గర్భంలో సేద తీర్చుకుంటాడని స్కాందపురాణం చెబుతోంది.

కేదారస్థోదకం పీత్వా వారాణస్యాం మృతస్తథా,
శ్రీశైలశిఖరం దృష్ట్వా పునర్జన్మ న విద్యతే ॥

'కేదారనాథ్‌లో నీళ్ళు త్రాగినా, వారణాసిలో సహజ మరణం పొందినా, శ్రీశైల శిఖరాన్ని చూసినా పునర్జన్మ ఉండదు' అనే పురాణ వచనాన్ని బట్టి భూమండలంలోని సకల పుణ్యక్షేత్రాలకన్నా శ్రీశైల మహాక్షేత్రం మహిమ గలదని తెలుస్తోంది.

పై విషయాన్ని దృష్టిలో ఉంచుకొని 'జన్మరాహిత్యం కోసం మంచుకొండల్లో పడుతూ లేస్తూ కేదారం దాకా నీటికోసం వెళ్ళేందుకు? కాశీ దాకా పోయి సహజ మరణం కలిగేవరకు సంవత్సరాల తరబడి వేచి ఉండేదెందుకు? శ్రీశైల మహాక్షేత్రాన్ని ఒక్కసారి సందర్శిస్తే చాలు గదా!' అనే భావనను కవులు, భావుకులు వెల్లడించారు.

భూమండలంలోని దృశ్యాదృశ్య క్షేత్రాలన్నింటిలోనూ శ్రీశైలం మహిమ గలదని, దీనిని స్మరిస్తే ఏడుజన్మల పాపాలు నశిస్తాయని, ఈ క్షేత్రంలో రెండు మూడడుగులు వేస్తేనే తన వంశంలోని వారి నందరిని ఉద్ధరించిన వారు అవుతారని, దివ్యజ్యోతి స్వరూపుడైన మల్లికార్జునుని దర్శించి, నిర్మలమైన మనస్సుతో యథావిధిగా అర్చించి, నమస్కరించి, ప్రార్థించి, స్పృశించిన మానవులు కృతార్థులవుతారని, స్వామి దర్శనమాత్రాన బ్రహ్మహత్యాది సకలదోషాలు భస్మమైపోతాయని, నిర్మలుడైన వాడు యీ స్వామికి మూడుసార్లు ప్రదక్షిణ చేస్తే శుద్ధచిత్తుడై జ్ఞానాన్ని పొందుతాడని, కురుక్షేత్రంలో లక్షలు దానమిచ్చి, రెండువేల సార్లు గంగాస్నానం చేసి, నర్మదా తీరంలో బహుకాలం తపస్సు చేసి, లక్ష సంవత్సరాలు కాశీలో నివాసం చేసేవారు పొందే పుణ్యం శ్రీశైల మల్లికార్జునుని ఒక్కసారి త్రికరణశుద్ధిగా అర్చించినంత మాత్రాన కలుగుతుందని, భక్త సులభుడైన యీ స్వామి దర్శనం చేతనే సర్వ యజ్ఞాలు చేసిన పలాన్ని, సర్వతీర్థాలు సేవించిన ఫలాన్ని అనాయాసంగా పొందవచ్చునని, ఈ స్వామిని తెల్లతామర పూవులతో పూజించినవాడు సకల సంపదలనూ పొందుతాడని, మల్లికార్జునుని దర్శనంవల్లనే సకల దానాలు, సకల వ్రతాలు చేసిన ఫలం లభిస్తుందని, ఈ స్వామి పై స్తోత్రాలు రచించి స్వామి సన్నిధిలో పఠించినవాడు తన కులస్తులందరితో స్వర్గసుఖం అనుభవిస్తాడని, పర్వతలింగమైన యీ స్వామి దర్శనం అత్యంత భక్తితో చేసుకొన్నవాడు జీవన్ముక్తుడవుతాడని, శ్రీశైలక్షేత్రంలో ఒక్కరోజు నిష్ఠతో నివసించినవాడు ఇరవైవేల యుగాలు కేదారంలో నివసించిన పుణ్యాన్ని పొందుతాడని శివుడు స్వయంగా పార్వతికి వివరించినట్లు స్కాందపురాణం చెబుతోంది.




అత్యంత ప్రాచీనమైన యీ మహాక్షేత్రం ఇంచుమించు పురాణాలన్నింటిలోనూ ప్రస్తావించబడింది. పద్మపురాణంలోని ఉత్తరఖండం 20వ అధ్యాయంలోనూ, మార్కండే పురాణంలోని 11వ అధ్యాయంలోనూ, శివపురాణ రుద్రసంహితలోని 6వ అధ్యాయంలోనూ, ఆదిత్య పురాణంలోనూ, సూతసంహితలోనూ మహాభారత వనపర్వంలోనూ, భాగవత దశమ స్కంధంలోని 80వ అధ్యాయంలోనూ, శ్రీశైలమహాక్షేత్రం అభివర్ణించబడింది. కాగా 18 పురనాలలో ఒకటైన స్కాందపురాణంలోని శ్రీశైలఖండం 64 అధ్యాయాలతో శ్రీశైలక్షేత్రానికి సంబంధించిన సకల విషయాలనూ తెలియజేస్తోంది.

ఆదిశంకరుల 'శివానందలహరి', సోమేశ్వరుని 'కథాసరిత్సాగరం', సిద్ధనాథుని 'రసరత్నాకరం', భవభూతి 'మాలతీమాధవం', 'భాణభట్టుని 'కాదంబరి', శ్రీహర్షుని 'రత్నావళి' శ్రీశైలాన్ని ప్రస్తావించాయి.

నన్నయ 'భారతం', నన్నెచోడుని 'కుమారసంభవం', పాల్కురికి సోమనాథుని 'బసవపురాణం', 'పండితారాధ్య చరిత్ర', 'అక్షరాంకగద్య', 'ప్రభులింగలీల', జక్కన 'విక్రమార్క చరిత్ర', పింగళి సూరన 'కళాపూర్ణోదయం', ధూర్జటి 'కాళహస్తీశ్వర శతకం', చేమకూర వెంకటకవి 'విజయవిలాసం', మలలహ్మ 'రుక్మాంగదచరిత్ర', తెనాలి రామకృష్ణుని 'పాండురంగ మాహాత్మ్యం', మొల్ల 'రామాయణం', రఘునాథ నాయకుని 'వాల్మీకి చరిత్ర', శ్రీశైలాన్ని ప్రశంసించాయి.

ఇవికాక మరెన్నో తెలుగు గ్రంథాలు, తమిళ, కన్నడ మరాఠీ గ్రంథాలూ శ్రీశైల మహాక్షేత్రాన్ని ప్రస్తావించాయి. విదేశీ యాత్రికులైన హ్యుయన్ త్సాంగ్, ఇత్సింగ్, అనాసినీకీచెన్ మొదలైనవారు తమ రచనలలో శ్రీశైలాన్ని ప్రస్తావించారు.

అందుబాటులో ఉన్న చరిత్రను పరిశీలిస్తే, క్రీ.శ. 1వ శతాబ్దిలోనే శ్రీశైలం ప్రసిద్ధి చెందినట్లు, ఆనాడు ఈ క్షేత్రం





'సిరిధాన్' అని శాతవాహనులచే పిలువబడేదని, అనంతరం 3వ శతాబ్దిలో శ్రీపర్వతంగా పిలువబడిందని తెలుస్తోంది..

క్రీ.శ. మూడవ శతాబ్ది వరకు శాతవాహనులు, 3వ శతాబ్దిలో 'శ్రీపర్వతీయులు'గా పిలువబడిన ఇక్ష్వాకులు, తరువాత పల్లవులు, 4వ శతాబ్ది చివరిభాగం నుండి 'శ్రీపర్వతస్వామి పాదధ్యాతలు'గా చెప్పుకొన్న విష్ణుకుండినులు, 6వ శతాబ్ది మొదటి భాగంలో తిరిగి పల్లవులు, అటు తరువాత కదంబులు, ఆరవ శతాబ్ది మధ్యభాగం నుండి 8వ శతాబ్ది వరకు తెలుగు చోళులు, అనంతరం క్రీ.శ. 1162 వరకు చాళుక్య చోళులు, క్రీ.శ. 1323 వరకు కాకయతీయులు అటు తరువాత క్రీ.శ. 1420 వరకు రెడ్డిరాజులు శ్రీశైలాన్ని పాలించారు.

రెడ్డిరాజుల కాలంలో క్రీ.శ. 1326-35 మధ్య నాగలూటి నుండి పెద్ద చెరువు, భీముని కొలను మీదుగా శ్రీశైలానికి మెట్లు వేయించబడినాయి. ఇప్పటికీ రాయలసీమ, కర్ణాటక ప్రాంతాల నుండి నడచివచ్చే యాత్రికులు యీ మెట్లదారినే వస్తారు. క్రీ.శ. 1335-46 మధ్యకాలంలో పాతాళగంగకు మెట్లు వేయించబడ్డాయి. ఇప్పటికీ యించుమించు చెక్కుచెదరని యీ మెట్లు నిరుపయోగంగా ఉన్నాయి. క్రీ.శ.1377లో పినతండ్రి రెడ్డి పుణ్యంకోసం అనవేమారెడ్డి ఆలయ ముందు భాగాన వీరశిరోమండపాన్ని కట్టించాడు. తరువాత 1398లో అన పోతారెడ్డి కుమారుడు కుమారగిరిరెడ్డికి, ఆయన భార్యకు పుణ్యంకోసం మంత్రికాటయవేముడు శిఖరేశ్వరానికి మెట్లు వేయించాడు.

రెడ్డిరాజుల పరిపాలనా కాలంలోనే విజయనగర రాజులు దండెత్తి శ్రీశైలక్షేత్రాన్ని ఆక్రమించుకొని పాలించారు. రెండవ హరిహర రాయల భార్య విఠలాంబ క్రీ.శ. 1393-94 కాలంలో పాతాళగంగకు మెట్లు వేయించింది. క్రీ.శ. 1992లోని కృష్ణా పుష్కరాలలో యివి పునరుద్ధరించబడినాయి. ప్రస్తుతం భక్తులు ఈ మెట్లనే ఉపయోగిస్తున్నారు.) క్రీ.శ. 1405లో రెండవ హరిహరరాయలు ఆలయ ముఖమండపాన్ని, దక్షిణపు వైపు గోపురాన్ని నిర్మించాడు. కొండవీటి రెడ్డివంశం అంతరించాక శ్రీశైలం పూర్తిగా విజయనగర రాజుల వశమయింది. 16వ

శతాబ్ది మధ్యభాగం వరకు శ్రీశైలాన్ని పాలించిన విజయనగర రాజుల కాలంలో శ్రీశైలం ఎంతగానో అభివృద్ధి చెందింది. శ్రీశైల మల్లన్న గుడికి ఎన్నో దానాలివ్వబడినాయి. క్రీ.శ.1513లో కృష్ణదేవరాయలు ఆలయ తూర్పు గోపురాన్ని, దానికెదురుగా గల రథవీధికి యిరువైపులా సాలు మండపాలను కట్టించాడు. క్రీ.శ. 1529 నవంబరు 15న మంత్రి చంద్రశేఖరామాత్యుడు శ్రీ స్వామివార్లకు కళ్యాణ మండపాన్ని కట్టించి, గర్భాలయ ద్వారాలకు బంగారు రేకులు పొదిగించాడు. పవళింపు సేవా మందిరానికి ముందు మండపాన్ని కట్టించి కృష్ణదేవరాయలు, తిమ్మరుసుల విగ్రహాలను పెట్టించాడు. ఆలయ విమానానికి చుట్టూ కొంతభాగం బంగారుపూత పూయించాడు. క్రీ.శ. 1531 జనవరి 14న బంగారు నందిని చేయించాడు.

విజయనగర సామ్రాజ్యం అంతరించాక కొంతకాలం మొగలు చక్రవర్తుల అధీనంలో ఉన్న శ్రీశైలం వారి అధికారం నశించంతక, హైదరాబాద్ నవాబుల వశమయింది. 'నైజాం అలీఖాన్ అసఫ్‌జా' 1782 ఏప్రిల్ 8వ తేదీ గల ఫర్మానాలో దస్తావేజును పునరుద్ధరించి ఆలయ పరిపాలనా భారాన్ని శృంగేరి జగద్గురువులకు అప్పగించాడు. తరువాత నైజాం నవాబు దత్తమండలాలతో పాటు శ్రీశైల దేశస్థానాన్ని కూడా ఈస్టిండియా కంపెనీ వారికి స్వాధీనపరిచాడు. బ్రిటిష్‌వారు యీ పరిపాలనా భారాన్ని క్రీ.శ. 1840లో పుష్పగిరి మఠానికి అప్పగించారు. పుష్పగిరి మఠం ఆలయ నిర్వహణను సరిగా చేయలేకపోయినందున ప్రభుత్వం ఆలయాన్ని కొంతకాలం 'జిల్లాకోర్టు' నిర్వహణలో ఉంచి 1929లో అడ్వకేట్ శ్రీ పాణ్యం రామయ్యగారి అధ్యక్షతన మేనేజ్‌మెంట్ బోర్డును నియమించింది. 1949 వరకు తన విధులను నిర్వర్తించిన బోర్డు 1949లో ఆలయ నిర్వహణను రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖకు అప్పగించింది.

ఆ తరువాత దేవాదాయశాఖ ఆధ్వర్యంలో యీ క్షేత్రానికి రోడ్డుమార్గాలు ఏర్పడి భక్తుల రాకపోకలకు చక్కని అవకాశాలేర్పడినాయి. హైదరాబాద్‌కు 220 కి.మీ.లు, విజయవాకు 272 కి.మీలు, కర్నూలుకు 180 కి.మీ.లు దూరంలో ఉన్న యీ క్షేత్రానికి ప్రస్తుతం చక్కని బస్సు సదుపాయాలున్నాయి.



దేవస్థానంలోపాటు వివిధ ప్రైవేటు సత్రాల యాజమాన్యాలు కూడా యాత్రికులకు వసతిని, ఉచిత భోజన సదుపాయాన్ని కల్పిస్తున్నాయి.

మల్లికార్జున స్వామి ఆలయం 200 మీ. పొడవు, దాదాపు అంతే వెడల్పుగల ఐదారు మీటర్ల ఎత్తుగల బలమైన కోగలాగ నిర్మింపబడిన పెద్ద ప్రాకారంలో ఉన్నది. ఆలయం పూర్వాభిముఖంగా మహద్వార గోపురమున్నది. ఇటుకలు, సున్నపుగారతో నిర్మింపబడింది. ఈ ఆలయానికి నాలుగు ద్వారాలు ఉన్నాయి. ప్రాకారం మహద్వారం నుంచి వెళ్ళగానే ఒక విశాలమైన మహాప్రదక్షిణాపథం, ఇచట నంది మండపం, ఆరంభంలో ఉన్నాయి. లోపల శెనగల బసవన్న అనే పేరుతో నంది ఉన్నది. సభామండపం కొంచెం ఎత్తులోఉన్నది. ముఖమండపం, అంతరాళం, తరువాత గర్భగృహంలో అత్యంత చూడముచ్చటైన మల్లికార్జున స్వామి లింగాకారంలో ఉన్నాడు. ఇచట స్వామిని తాకి నమస్కరించవచ్చును. ఆలయం బయట వెనుకగా కొంచెం ఎత్తైన అధిష్ఠానంపై భ్రమరాంబ ఆలయం ఉన్నది. ప్రదక్షిణా పథంలో అక్కమహాదేవి గుడి కూడ ఉన్నది. శ్రీశైలం శిఖరాన్ని దర్శిస్తే 'పునర్జన్మ న విద్యతే' అన్నారు. అలాగే యాత్రికులు క్షేత్రానికి వచ్చిందే తడవుగా త్వరలో స్వామి దర్శనాన్ని చేయడాన్ని 'ధూళి దర్శనం' అంటారు. దీనికి మహత్యం ఎక్కువ. ఆలయ ప్రాకార గోడలపై శివపురాణంలోని పలు ఘట్టాలు చెక్కబడి ఉన్నాయి.

(తితిదే 'కృష్ణవేణీ తరంగాల' సౌజన్యంతో)

❖ ❖ ❖

కృష్ణా తీరపు వరప్రదాయిని నాగార్జున సాగర్

మరుమాముల రుక్మిణి


తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్లోని నల్గొండ జిల్లా,గుంటూర్ జిల్లాల మధ్య కృష్ణా నదిపై నిర్మింపబడిన ఆనకట్ట వల్ల ఏర్పడిన జలాశయాన్ని నాగార్జున సాగర్ అంటారు. అయితే ఈ పదాన్ని ఆ జలాశయానికి, ఆ మొత్తం ప్రాజెక్టుకు, అక్కడి వూరికి కూడా వర్తింపజేయడం జరుగుతుంది. ఇది దేశంలోనే రిజర్వాయర్లలో రెండవ స్థానంలో ఉంది మరియు పొడవులో మొదటిది.దీని నర్మాణ కాలము 1955 – 1967. ఈ జలాశయమునకి 11,472 మిలియన్ ఘనపు అడుగుల నీటిని నిలువ చేయు సామర్థము గలదు. దీని ప్రధాన కట్టడము 490 అడుగుల ఎత్తుకలిగి 1.6 కిలోమీటర్ల పొడవుతో 26 గేట్లతో వున్నది. ప్రతి గేటు 42 అడుగుల వెడల్పు కలిగి 45 అడుగులు ఎత్తు కలిగి యున్నది. ఈ సాగర్ ద్వారా నల్గొండ, ఖమ్మం, కృష్ణా, మరియు గుంటూరు జిల్లాలకు సాగునీరు అందించు చున్నది. అంతేగా ఇక్కడ పెద్ద జల విద్యుత్ కేంద్రము కూడ కలదు.

ప్రాజెక్టు-పట్టణం

కృష్ణా నదిపై నిర్మించబడ్డ ఆనకట్టల్లో నాగార్జునసాగర్ ప్రాజెక్టు అతి పెద్దది. ఇది ఒకబహుళార్థసాధక ప్రాజెక్టు. తెలంగాణలో నల్గొండ జిల్లా నందికొండ వద్ద నిర్మించిన ఈ ఆనకట్టను మొదట్లో నందికొండ ప్రాజెక్టు అని పిలిచేవారు. ఈ ప్రాంతానికున్న చారిత్రక ప్రాధాన్యం వలన ఈ ప్రాజెక్టుకు నాగార్జునసాగర్ ప్రాజెక్టు అని పేరుపెట్టారు.

నందికొండ గ్రామం నల్గొండ జిల్లా పెద్దవూర మండలంలో ఉంది. ప్రాజెక్టు నిర్మాణానంతరం నాగార్జునసాగర్గా ప్రసిద్ధి చెందింది. నాగార్జునసాగర్ పట్టణము మూడు భాగములుగా విభజించబడినది. ఆనకట్టకు దక్షిణాన విజయపురి సౌత్ (వీ.పీ.సౌత్) (గుంటూరు జిల్లా), ఆనకట్ట దాటిన వెంటనే ఉత్తరాన పైలాన్ (నల్గొండ జిల్లా), ఉత్తరాన కొండ మీద హిల్ కాలనీ (నల్గొండ జిల్లా) ఉన్నవి.

నాగార్జునసాగర్ ప్రముఖ బౌద్ధ చారిత్రక స్థలం కూడా. శాతవాహనుల కాలమునాటి శ్రీ పర్వతమే నాగార్జున కొండ. ఆచార్య నాగార్జునుడు ఈ ప్రాంతంలో బోధనలు చేసినట్లుగా చారిత్రక



ఆధారాలు ఉన్నాయి. జలాశయం నిర్మాణ సమయంలో ఇక్కడ లభించిన అమూల్యమయిన చారిత్రిక కట్టడాల శిధిలాలను జలాశయం మధ్యలో "నాగార్జున కొండ" అని ఇప్పుడు పిలువబడే మ్యూజియంలో భద్ర పరచారు. ఆ మ్యూజియంను నాగార్జునకొండ మ్యూజియంఅంటారు.

నందికొండ ప్రాజెక్టు చరిత్ర

ఇక్కడ ఒక జలాశయము కట్టాలనే ఆలోచన బ్రిటిష్ పరిపాలకుల కాలంలోను అనగా నైజాము పరిపాలన కాలములోనే 1903 లోనే వచ్చింది. చివరికి భారత దేశ ప్రధమ ప్రధాని శ్రీ జవహర్ లాల్ నెహ్రూ చేతుల మీదుగా 10 డిసెంబరు 1955 నాడు పునాది రాయి పడింది. భారత దేశ రెండవ ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధి చేతుల మీదుగా 1967లో కుడి, ఎడమ కాలవలోనికి నీటి విడుదల జరిగింది.

గతంలో ఈ ప్రాంతాన్ని ఇక్ష్వాకులు, శాతవాహనులు పరిపాలించేవారు. ఆకాలంలో కట్టబడి అనేక బౌద్ధ స్థూపాలు ఇతర కట్టడాలు ఈ జలాశయములో మునిగిపోయే పరిస్థితి ఏర్పడింది. వాటి పరిరక్షణకు వాటిలో చాల వాటిని యదాతదంగా పెకలించి జలాశయం మధ్యలో నెలకొని వున్న నాగార్జున కొండపైకి తరలించి అక్కడ వాటిని యదాతదంగా ఏర్పాటు చేయడము జరిగింది. అక్కడ ఒక మ్యూజియం కూడ నిర్మించి అందులో ఆనాటి అనేక వస్తువులను ప్రదార్శనకొరకు పెట్టారు.

ఉమ్మడి మద్రాసు రాష్ట్ర ప్రభుత్వము కృష్ణానది నీటిని తమిళ దేశానికి తీసుకుపోవుటకు కృష్ణా పెన్నా నదులను సంధించుటకు "కృష్ణా–పెన్నార్ ప్రాజెక్ట్" ను బృహత్తర ప్రణాళికగా తలపెట్టింది. ఇది తెలిసి ముక్త్యాల రాజా అనబడు వాసిరెడ్డి రామగోపాలకృష్ణ మహేశ్వర ప్రసాద్ ఆంధ్ర ప్రాంతములోని తొమ్మిది జిల్లాలలో ప్రతివూరు తిరిగి (38వేల మైళ్ళు) నాగార్జునసాగర్ నిర్మాణానికి సంతకాలు సేకరించి ప్రభుత్వానికి పంపారు. ఆ సమయములోనే డా. కె. ఎల్. రావు ద్వారా పూర్వం హైదరాబాదు నవాబు ఆలీయవార్ జంగ్ కృష్ణా నదిపై పరిశోధన చేయించి ప్రణాళికలు తయారు చేయించాడని విన్నాడు. అన్వేషించి ఆ రిపోర్టులు సాధించాడు. 'నందికొండ ప్రాజెక్ట్ స్వరూప స్వభావాలు తెలుసుకోవడానికి స్వయముగా క్షేత్రాన్వేషణకు పూనుకున్నాడు. ఎన్నో వ్యయప్రయాసలకు లోనై మాచెర్ల దగ్గర నదీలోయను దర్శించాడు. స్వంత ఖర్చుతో నెలనెలా జీతాలు ఏర్పరిచి మైసూరు ప్రభుత్వ రిటైర్డు ఛీఫ్ ఇంజినీరు నరసింహయ్య, పి. డబ్ల్యు.డి రిటైర్డు ఇంజినీరు గోపాలాచార్యులు ద్వారా అంచనాలు, ప్లానులు తయారు చేయించాడు. నాటిప్రధాని జవహర్ లాల్ నెహ్రూ శంకుస్థాపన చేసారు



శంకుస్థాపన ఫలకం

మద్రాసు ప్రభుత్వము వారి ప్రయత్నాలకు అన్నివిధములా అడ్డు పడింది. రాజా గారు కృష్ణా రైతుల వికాస సంఘము స్థాపించి కేంద్ర ప్రభుత్వముపై ఒత్తిడి తెచ్చారు. ప్రభుత్వము ఖోస్లా కమిటీ ఏర్పాటు చేసింది. కమిటీ పర్యటనలో నందికొండ ప్రస్తావన లేదు. రాజా ఎంతో నచ్చజెప్పి నందికొండ సందర్శన చేర్పించాడు. కానీ కమిటీ సభ్యులు నందికొండకు కార్లు, జీపులలో వెళ్ళుటకు అనువైన దారి లేదనే సాకుతో విషయమును దాటవేయుటకు ప్రయత్నించారు. రాజా వేలరూపాయలు ఖర్చు పెట్టి ఇరవైఇదు గ్రామాలనుండి ప్రజలను, స్వయంసేవకులను కూడగట్టి, వారము రోజులు రాత్రింబగళ్ళు కష్టపడి పనిచేసి, కార్లు వెళ్ళుటకు వీలగు దారి వేశారు. 1952లో ఖోస్లా కమిటీ నందికొండ డాం ప్రదేశము చూసి ప్రాజెక్టు కట్టుటకు ఇంతకన్న మంచి చోటు వుండదని తేల్చింది. విజయవాడ నుండి 260 మైళ్ళ పొడవునా ఖోస్లా కమిటీకి ప్రజలు ఘనస్వాగతం పలికారు. ప్రాజెక్ట్ ప్రాంతం పరిశీలించిన ఖోస్లా "ఇది భగవంతుడు మీకు ఇచ్చిన అమూల్యమైన వరం" అని తెల్పాడు.

ఖోస్లా కమిటీ రిపోర్టును తొక్కిపెట్టుటకు ఢిల్లీలో ప్రయత్నములు



మొదలైనవి. రాజా ఢిల్లీ వెళ్ళి ప్రొఫెసర్ ఎన్.జి.రంగా,మోటూరు హనుమంతరావు, కొత్త రఘురామయ్య మొదలగు పార్లమెంటు సభ్యులను కలిసి, రిపోర్టును వెలికితీయించి దాని ప్రతులను అందరికి పంచిపెట్టి, ప్రణాళికా సంఘం సభ్యులందరిని ఒప్పించి సుముఖులు చేశాడు. ప్రణాళికా సంఘం ఖోస్లా కమిటీ సూచనలను 1952లో ఆమోదించింది. జలాశయ సామర్థ్యం 281 టి.ఎం.సి. గా సూచించింది. అదే సమయములో రాష్ట్ర ప్రభుత్వము కూలిపోయింది. రాష్ట్రములో గవర్నర్ (చందూలాల్ త్రివేది) పాలన ఆరంభమయింది. త్రివేది ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ గారిని ఖోస్లా కమిటీ రిపోర్టు ఆమోదించమని విజ్ఞప్తి చేశారు. చివరకు 1954 లో నాగార్జునసాగర్ నిర్మాణానికి ఆమోదముద్ర లభించింది. 1955 డిసెంబర్ 10న (మన్మధ నామ సంవత్సరంకార్తీక బహుళ ద్వాదశి నాడు) అప్పటి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ ప్రాజెక్టు నిర్మాణానికి శంకుస్థాపన చేసారు. అప్పటి హైదరాబాదు రాష్ట్ర ముఖ్యమంత్రి, బూర్గుల రామకృష్ణారావు, ఆంధ్ర రాష్ట్ర గవర్నర్ సి.ఎం.త్రివేది ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. నిర్మాణ సమయములో రాజా గారు యాభైరెండు లక్షల రూపాయిలు మాచింగ్ గ్రాంటుగా ఇచ్చారు. డ్యాము నిర్మాణం 1969లోపూర్తయింది. క్రెస్టు గేట్లను అమర్చే పని 1974లో పూర్తయింది.

నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ ముక్త్యాల రాజా కార్యదక్షతకు, దేశసేవాతత్పరతకు, నిస్వార్థసేవానిరతికి గొప్ప ఉదాహరణ. ముఖ్యముగా సాగర్ ఆయకట్టు రైతులకు రాజాగారు బహుధా స్మరణీయులు. నార్ల వెంకటేశ్వర రావు మాటలలో "ఆయన అంతగా తపన చెందకపోతే నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ మనకు సిద్ధించేది కాదేమో". రాజా గారిని ప్రజలు "ప్రాజెక్టుల ప్రసాద్" అని పిలుచుకునేవారు.

బౌద్ధ అవశేషాలతో చారిత్రక ప్రాధాన్యత కలిగిన నందికొండ, ప్రాజెక్టు నిర్మాణం తరువాత నాగార్జునసాగర్ గా ఒక ప్రముఖ పర్యాటక కేంద్రంగా మరింత స్థిరపడింది.

విశేషాలు

సాగునీటి సరఫరా కోసమే కాక, విద్యుదుత్పత్తి కొరకు కూడా ఉద్దేశించబడిన నాగార్జునసాగర్ ఒక బృహత్తర బహుళార్థసాధక ప్రాజెక్టు. ప్రధాన ఆనకట్ట రాతి కట్టడము. దీనికి రెండువైపులా మట్టితో కట్టిన కట్టలు ఉన్నాయి. డ్యాముకు ఇరువైపుల నుండి రెండు సాగునీటి కాలువలు బయలుదేరుతాయి. కుడి కాలువని జవహర్ కాలువ గాను, ఎడమ కాలువను లాల్ బహదూర్ కాలువ గాను పేరు పెట్టారు. అయితే వ్యవహారంలో వీటిని కుడి కాలువ, ఎడమకాలువ గానే పిలుస్తారు. కుడికాలువ ద్వారా గుంటూరు, ప్రకాశం జిల్లాలకు, ఎడమ కాలువ ద్వారా నల్గొండ, కృష్ణా, ఖమ్మం జిల్లాలకు సాగునీరు సరఫరా అవుతుంది. అంతేకాక, కృష్ణా, గుంటూరు జిల్లాలలోని కృష్ణా డెల్టా ఆయకట్టును స్థిరీకరించేందుకు కూడా నాగార్జునసాగర్ ఉపయోగపడుతుంది.

ప్రాజెక్టు గణాంకాలు

- డ్యాము పొడవు: 15,956 అ. (4863.388 మీ.)
- ప్రధాన రాతి ఆనకట్ట పొడవు: 4756 అ. (1449.628 మీ.)
- మొత్తం మట్టికట్టల పొడవు: 11,200 అ. (3413.76 మీ.)
- ఎడమ మట్టికట్ట పొడవు: 8400 అ. (2560.32 మీ.)
- కుడి మట్టికట్ట పొడవు: 2800 అ. (853.44 మీ.)
- మొత్తం క్రస్టుగేట్ల సంఖ్య: 26
- కుడి కాలువ పొడవు: 203 కి.మీ.
- ఎడమ కాలువ పొడవు: 179 కి.మీ.
- జలాశయ సామర్థ్యం
- పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం: 408 టి.ఎం.సి. (శతకోటి ఘనపుటడుగులు–థౌజండ్ మిలియన్ క్యూబిక్ ఫీట్)
- కనీస స్థాయి నిల్వ: 213 టి.ఎం.సి.

విద్యుదుత్పత్తి సామర్థ్యం

విద్యుదుత్పత్తికై నాగార్జున సాగర్ ప్రాజెక్టులో మూడు కేంద్రాలున్నాయి. వీటి మొత్తం ఉత్పాదక సామర్థ్యం 960 మె.వా. (మెగా వాట్లు)

నది దిగువకు నీరు విడుదలయ్యే చోట నిర్మించిన కేంద్రంలో: 810 మె.వా.,

కుడి కాలువకు నీరు విడుదలయ్యే చోట: 90మె.వా.,

ఎడమకాలువకు నీరు విడుదలయ్యే చోట: 60 మె.వా. ఉత్పత్తి సామర్థ్యం గల కేంద్రాలు ఉన్నాయి.

ఆయకట్టు వివరాలు

ప్రాజెక్టు కింద 5 జిల్లాల్లో తయారైన ఆయకట్టు వివరాలు ఇలా ఉన్నాయి.

కుడి కాలువ

జిల్లా	ఆయకట్టు, ఎకరాల్లో
గుంటూరు జిల్లా	6,68,230
ప్రకాశం జిల్లా	4,43,180
ఎడమ కాలువ	
నల్గొండ జిల్లా	3,72,970
ఖమ్మం జిల్లా	3,46,769
కృష్ణా జిల్లా	4,04,760
మొత్తం	**22,35,910**

ఇటీవలి విశేషాలు ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసి 50 ఏళ్ల పూర్తయిన సందర్భంగా, 2005 డిసెంబర్ 10 న స్వర్ణోత్సవాలను జరుపుకుంది. రూ. 3 వేల కోట్ల ప్రపంచ బ్యాంకు రుణంతో సాగర్‌ను పూర్తిస్థాయిలో ఆధునికీకరించి ఆయకట్టు అంతటికీ నీరు అందిస్తాం అని ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి చెప్పాడు. సాగర్ నిర్మాణ సమయంలో అసువులు బాసిన వారి స్మారకార్థం ఏర్పాటు చేసిన స్థూపాన్ని వై.ఎస్. ఆవిష్కరించాడు. గౌతమ బుద్ధుడు, ఆచార్య నాగార్జునుడి విగ్రహాలతో బాటు సాగర్ నిర్మాణ సమయంలో ముఖ్యమంత్రులుగా ఉన్న నీలం సంజీవ రెడ్డి, కాసు బ్రహ్మానంద రెడ్డి, ఇంజినీరింగ్ నిపుణులు కె.ఎల్.రావు, సాగర్ మొదటి చీఫ్ ఇంజినీర్ జాఫర్ అలీల విగ్రహాలను వై.ఎస్. ఆవిష్కరించాడు.

నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ ఆధునీకరణ

పై ప్రకటనకు లోబడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రపంచ బ్యాంక్ ఋణంతో ఆంధ్రప్రదేశ్ జలవనరుల అభివృద్ధి పేరుతో నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ ఆధునీకరణ పనులను చేపట్టింది. 2010, ఆగష్ట్ 14వ తేదిన ప్రపంచ బ్యాంక్ తో దీనిపై ఒప్పందం కుదిరింది. 10.9.2010 నుండి ఈ పథకం అమలు లోకి వచ్చింది. ఈ పథక కాల పరిమితి ఆరు సంవత్సరాలు. ఈ పథకం 31.7.2016 తో ముగుస్తుంది. ఒప్పందం జరిగేలోగా, చర్చలు కొనసాగుతుండగానే ప్రభుత్వం ఆధునీకరణపనులను ప్రారంభించింది. ఈ పథకం అంచనా వ్యయం రూ. 4444.41 కోట్లు. ఇందులో 48 శాతం ప్రపంచ బ్యాంక్ ఋణం. రాష్ట్రప్రభుత్వం వాటా 52 శాతం. ఒప్పందానికి సంవత్సరం ముందునుండి నిబంధనలకు లోబడి జరిగిన వ్యయంలో ప్రపంచ బ్యాంకు ఋ?ణం వాటా రిట్రోస్పెక్టివ్ ఫడింగ్ ద్వారా చెల్లిస్తుంది.

ఆధునీకరణ లక్ష్యాలు

1. నాగార్జున సాగర్ కాలువలను ఆధునీకరించి నీటి సరఫరా సామర్థ్యాన్ని వృద్ధి చేస్తూ వ్యవసాయాభివృద్ధి చేయుట,వ్యవసాయ ఉత్పాదకత పెంచుట

2. నీటిపారుదల ఆయకట్ట అభివృద్ధి శాఖ సామర్థ్యాన్ని పెంపుచేసి జలవనరులను బహుముఖంగా, ప్రణాళికా బద్ధంగా జలవనరులను అభివృద్ధి చేసి నిర్వహించుట

ఈ పకంలో పలు అంశాలు ఉపాంశాలు ఇమిడి ఉన్నాయి. ఈ పథకం గరిష్ట లక్ష్యాలతో కూడుకొన్నది. ఈ పథకాన్ని ప్రధానంగా సాగునీరు ఆయకట్టు అభివృద్ధి శాఖ అమలు చేస్తుంది. కాగా అంశం బిలో ఉపాంశాలను వ్యవసాయ శాఖ. ఉద్యాన శాఖ, మత్స్య శాఖ, పశుసంవర్ధక శాఖలు ఈ పథకం అమలులో పాలు పంచుకుంటున్నాయి. ప్రభుత్వ శాఖలకు తోడు వాలంతారి, ఆచార్యఎన్.జి.రంగ వ్యవసాయ విశ్వవిద్యాలయం, సామేతి వంటి సంస్దలు ఈ పథకం అమలులో భాగస్వాములు. సి అంశంలో రెండు ఉ?పాంశాలను భుగర్భ జలశాఖ అమలు చేస్తుంది.

నాగార్జున కొండ

నాగార్జునసాగర్ నిర్మాణ సమయంలో బయల్పడిన క్రీ.పూ. 2వ శతాబ్ధపు బౌద్ధావశేషాలను జలాశయం మధ్య కొండపై నిర్మింపబడిననాగార్జునకొండ మ్యూజియం లో భద్రపరిచారు. ఈ ద్వీపపు మ్యూజియం ప్రపంచంలోనే అరుదైనది. బుద్ధునివిగా చెప్పబడుతున్న దంతావశేషం, కర్ణాభరణం ఇందులో చూడదగ్గవి.

ఇతర దర్శనీయ స్థలాలు

పర్యాటకులకు ప్రధానమైన ఆకర్షణ నాగార్జునసాగర్ ప్రాజెక్టు. ముఖ్యంగా వర్షాలు బాగా పడి గేట్లు తెరిచినప్పుడు పెద్దయెత్తున సందర్శకులు వస్తారు. వాగార్జున కొండ మ్యూజియం కూడా తప్పక చూడదగినది.

సాగరమాత దేవాలయం

నాగార్జున సాగర్ దక్షిణభాగమైన విజయపురి సౌత్ లో ఉన్న సాగరమాత ఆలయం హిందూ ఆలయ శైలిలో నిర్మించిన కాథలిక్ చర్చి. ఈ ఆలయం నాగార్జునసాగర్ జలాశయానికి దక్షిణపు ఒడ్డున ఆంధ్రప్రదేశ్ రెసిడెన్సియల్ జూనియర్ కాలేజీ ప్రధానద్వారానికి ఎదురుగా ఉన్నది. ఈ ఆలయము నిర్మాణ శైలిలోనే కాక కొన్ని పూజా పద్ధతులలో కూడా హిందూమత పద్ధతులను అవలంబించడం విశేషము. ఉదాహరణకు ఈ గుడిలో మేరీమాతకు భక్తులు టెంకాయలు కొట్టి అగరువత్తులు సమర్పిస్తుంటారు. ప్రతియేటా మూడు రోజుల పాటు జరిగే సాగరమాత ఆలయ తిరునాళ్ళకు చుట్టుపక్కల ప్రాంతాలనుండి అనేక మంది భక్తులు విచ్చేస్తారు.

దగ్గరి మరికొన్ని స్థలాలు: ఎత్తిపోతల జలపాతము, అనుపు, మాచర్ల

అనుపు

బౌద్ధ మతాచార్యుడు ఆచార్య నాగార్జునుడు క్రీస్తు శకము నాలుగవ శతాబ్దంలో ఇచ్చటకు వచ్చి ఒక విశ్వ విద్యాలయాన్ని నిర్మించాడు. ప్రపంచం నలుమూలల నుండి విద్యార్తులు ఇక్కడికి వచ్చి విద్య నభ్యసించారని చారిత్రికాదారాలున్నాయి. సాగర గర్భంలో వుండిన ఆనాటి విశ్వ విద్యాలయ శిధిలాలను యదాతదంగా తరలించి నాగార్జున కొండపైన మ్యూజియంలోను, ఆరుబయటకూడ భద్ర పరచి సందర్శకులు చూడడానికి ఏర్పాటు చేశారు. అనుపు అనే ప్రాంతం సాగర్ ముంపునకు గురికాలేదు. కనుక అక్కడ వున్న ఆనాటి కట్టడాలు ఎక్కడ వున్నవి అక్కడనే భద్రపరచి జాగ్రత్త తీసుకుంటున్నారు భారత పురావస్తు శాఖ వారు. ఈ విషమై పరిశోధన చేసే వారికిది అమూల్యమైన ప్రదేశము: అనుపు నాగార్జున సాగర్

ఆచార్య నాగార్జునుడు



ఇతడు దాక్షిణాత్య బ్రాహ్మణుడు. టిబెట్ సంప్రదాయం ప్రకారం ఇతడు 137 క్రీ.శ. తరువాత 57 సంవత్సరాలు బౌద్ధమతానికి ఆచార్యుడై ప్రసిద్ధికెక్కినట్లు తెలుస్తోంద.ఇతడు తపశ్శక్తి సంపన్నుడు. కాంచీనగరమున తారాదేవి నుపాసించి సిద్ధుడయ్యెనని ఒక గాథ గలదు. అఖండ పాండితీ ప్రతిభల సమార్జించుకొన్న మహా వ్యక్తి. రసాయన శాస్త్రవేత్త. ప్రముఖ తాంత్రికుడు. వక్త. బహుగ్రంథకర్త.

ఇతని అపార శేముషీ ప్రాభవాన్ని గుర్తించి శాతవాహన చక్రవర్తి అయిన యజ్ఞశ్రీ నాగార్జున కొండమీద సంఘారామాన్ని నిర్మించి, ఆయా శాస్త్రాలలో పరిశోధనలు సలుపు నిమిత్తం దానిలో తగిన వసతులు కల్పించాడు. యథార్థంగా ఆచార్య నాగార్జునుని పరిశోధన బహుముఖమైనది.

రసాయన శాస్త్రమందు గావించిన కృషికి నిదర్శనంగా ఇతని 'రసరత్నాకరము' వెలయుచున్నది. వైద్యశాస్త్ర పరిశోధనల ఫలితంగా 'కక్షపుటతంత్ర', 'ఆరోగ్యమంజరి' అను గ్రంథములు విలసిల్లినవి. నేత్ర వైద్యమున ఇతడు కనిపెట్టిన చిట్కాలు నేటికీ టిబెట్‌నందు వ్యాప్తిలో గలవు. ఇక తాత్విక పరిశోధన విషయమున ఇతను జరిపిన కృషి అపారమూ, అనన్యసామాన్యమూ అయినది. బుద్ధుని అనంతరం ఇతని తత్వమే సర్వాంగ సుందరమూ, యుక్తియుక్తమూనై యున్నవి. ఇతడు మాధ్యమిక వాదాన్ని ప్రచారం గావించాడు.ఇతడు వ్రాసిన గ్రంథాలలో 24 మాత్రం లభ్యమైనవి. ఈ క్రింది వానిలో ముఖ్యమైనవి. (1) ప్రజ్ఞాపారమిత శాస్త్రము (2) ప్రజ్ఞామూల శాస్త్ర టీకా (3) ప్రజ్ఞా ప్రదీప శాస్త్ర కారికలు (4) మూలమాధ్యమిక శాస్త్రము (5) శూన్యసప్తాధి (6) మాధ్యాంతాసుగమశాస్త్రము (7) దశభూమి విభాసా శాస్త్రము (8) ద్వాదశనికాయ శాస్త్రము (9) వివాదసమాన శాస్త్రము (10) ప్రమాణ వివేచన (11) ఉపాయన కౌశల్యహృదయ శాస్త్రము (12) విగ్రహ వ్యావర్తినీ కారికలు.

ఇతడు దిగ్గంతులైన శిష్యులను తయారుచేశాడు. వీరిలో ఆర్యదేవుడు ప్రముఖుడు.స్థవిరబుద్ధ పాలితుడు. భావవివేకుడు, చంద్రకీర్తి, శాంతదేవుడు అను వారలు కూడా వారి శిష్యులలో ప్రముఖులు. ఆచార్య నాగార్జునుని పరిశోధనల నిమిత్తము శాతవాహన రాజయిన యజ్ఞశ్రీ పర్వతంమీద నిర్మించిన సంఘారామం జగత్ప్రసిద్ధమైంది. ఇది ఐదు అంతస్థులు గలది.

అందులో మొదటి అంతస్థు ఏనుగ ఆకారము గలిగి 500 గదులతోను, రెండవది సింహాకృతి గలిగి 400 గదులతోను, మూడవది హయాకృతి గలిగి 300 గదులతోను, నాల్గవది వృషభాకృతి గలిగి 200 గదులతోను, ఐదవది పావురము ఆకృతి గలిగి 100 గదులతోను విలసిల్లినవి. ఈ అంతస్తు లన్నింటికన్నా పై భాగమున జలాశయము గలదు. పైగా, ఒక్కొక్క అంతస్తులో బంగారపు బుద్ధ విగ్రహం వున్నది.

యథార్థంగా ఈ మహత్తర నిర్మానం ఆనాటి శిల్పకళలకు, ప్రత్యక్ష ప్రామాణమైన నిదర్శనం.

ఆచార్య నాగార్జునుని మరణం గూర్చి భేదాభిప్రాయాలున్నవి. ఇంతటి సర్వతోముఖ ప్రజ్ఞాశాలి ఈ పర్వత ప్రాంతముననే విశ్వవిద్యాలయమును నెలకొల్పి వేలకొలది విద్యార్థులకు విద్యాదానమొసంగెను. ఇతని శిల్పశాస్త్ర పాండితికి ప్రత్యక్ష నిదర్శనములుగ కార్లీ చైత్య గృహము, సాంచీస్తూప ద్వారములు, అమరావతీ మహాచైత్యము వెలయుచున్నవి.



ఆనకట్టకు దక్షిణం వైపున సుమారు ఎనిమిది కిలోమీటర్ల దూరంలో వున్నది. ఇక్కడికి వెళ్ళడానికి రవాణా సౌకర్యం అంతగా లేదు. వాహనాలలో వచ్చే వారికి రోడ్డు మార్గమున్నది. అనుపు నుండి కూడా నాగార్జున కొండ వరకు లాంచీలను అప్పుడప్పుడు నడుపుతారు. అనుపులోని ఆనాటి కట్టడాలను ఈ క్రింద చూడ వచ్చును.

జల విద్యుత్తు

ఇక్కడ నిర్మించిన జలవిద్యుత్తు కేంద్రం 8 యూనిట్లతో... 815.6 మెగా వాట్ల విద్యుత్తు తయారుకాగల శక్తి గలది. అందులో మొదటి యూనిట్ 7 మార్చి 1978 లో ప్రారంభమైనది. 8 వ యూనిట్ 24 డిశెంబరు 1985న ప్రారంభమైనది. నాగార్జున సాగర్ కుడికాలువ పై నిర్మించిన జలవిద్యుతు కేంద్రం 90 మెగా వాట్ల సామర్థమున్నది. ఎడమ కాలువ జల విద్యుత్తు కేంద్రం 60 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యము కలిగి యున్నది.

❖ ❖ ❖

విజయవాడ శ్రీ కనకదుర్గ క్షేత్రం



- డా॥ జయంతి చక్రవర్తి

సకీలాద్రి స్వర్ణమయం సర్వదేవతాయస్తదా ।
నృసింహవాసపర్యంతం స్థితోదీర్ఘేణ వర్తతే ॥

పూర్వం ఈ ఇంద్రకీల పర్వతం కృష్ణానది ఉత్తర తీరం నుండి, కృష్ణానది దక్షిణ తీరంలో ఉన్న నృసింహ వాసపర్యంతం (మంగళగిరి కొండ) వ్యాపించి ఉండేదని చెప్పటం జరిగింది. అసలు ఈ పర్వతానికి ఈ పేరు రావటానికి ఒక ఐతిహ్యం ఉన్నది.

పూర్వం కీలుడు అనే యక్షుడు ఆదిపరాశక్తి అయిన దుర్గాదేవి గురించి తీవ్రమైన తపస్సు చేయగా, ఆ తల్లి ప్రత్యక్షమై వరం కోరుకోమంది. అందుకా యక్షుడు ఆనందించి "అమ్మా! నీవు ఎల్లప్పుడూ నా హృదయంలో నివసించి ఉండాలి" అని కోరుకున్నాడు. అప్పుడా దేవి "నాయనా! నీవు పవిత్ర కృష్ణానదీ తీరంలో పర్వతరూపాన్ని ధరించి ఉండు. కృతయుగంలో అసుర సంహారానంతరం నేను నీ హృదయంలో కొలువుంటాను" అని చెప్పి అంతర్ధానమైంది. ఆవిధంగానే అమ్మవారు మహిషాసుర సంహారానంతరం మహిషమర్దినీ స్వరూపంతో ఆ కీల పర్వతంమీద స్వయంభువుగా అవతరించింది.

స్వర్ణమణిమయ కాంతులతో కోటి సూర్య ప్రభలతో వెలుగొందుతూ ఆ పర్వతంమీద వెలసిన అమ్మవారిని నిత్యం ఇంద్రాది దేవతలంతా వచ్చి పూజించసాగారు. ఆనాటి నుంచి కీలపర్వతం 'ఇంద్రకీల' పర్వతంగా ప్రసిద్ధి పొందింది. అలాగే కీలుడు ఉపాసించిన దుర్గాదేవి కనకవర్ణంతో (బంగారు)

స్వర్ణమణిమయ కాంతులతో కోటి సూర్య ప్రభలతో వెలుగొందుతూ ఆ పర్వతంమీద వెలసిన అమ్మవారిని నిత్యం ఇంద్రాది దేవతలంతా వచ్చి పూజించసాగారు. ఆనాటి నుంచి కీలపర్వతం 'ఇంద్రకీల' పర్వతంగా ప్రసిద్ధి పొందింది. అలాగే కీలుడు ఉపాసించిన దుర్గాదేవి కనకవర్ణంతో (బంగారు) అవతరించటంవల్ల దీనికి 'కనకాచల'మనే పేరు కూడా వచ్చింది.

మన పవిత్ర భారతదేశం ప్రపంచంలోనే అత్యున్నతమైన ఆధ్యాత్మిక కేంద్రం. ఈ భారతభూమిని పవిత్రమైన ఎన్నో పుణ్యనదులు సస్యశ్యామలం చేస్తున్నాయి. ఆయా నదీ తీరాల్లో నెలకొన్న పర్వతాలు, ప్రాంతాలు పుణ్యక్షేత్రాలుగా దివ్య తీర్థాలుగా భక్తజనులందరిచేతా ఆరాధించబడుతున్నాయి. అలాంటి పవిత్ర నదుల్లో సుప్రసిద్ధమైనది కృష్ణానది. ఆంధ్రదేశంలో ప్రవహించే ఈ కృష్ణానదీ తీరంలో, విలసిల్లిన దివ్యక్షేత్రమే శ్రీ కనకదుర్గ క్షేత్రం.

పరమపవిత్రమైన ఈ నదీతీరంలో ఇంద్రకీల పర్వతంమీద ముగ్గురమ్మల మూలపుటమ్మ,ఆ దిపరాశక్తి అయిన దుర్గమ్మ కనకదుర్గమ్మగా కొలువుదీరి యుగయుగాలుగా ఎందరో భక్తులను తరింపచేస్తోంది.

పరమపవిత్రమైన కృష్ణాతీరంలో బెజవాడ (విజయవాడ) ప్రాంతంలో నెలకొన్న పర్వతం శ్రీ ఇంద్రకీలాద్రి. ఈ పర్వతం గురించి స్కాందపురాణంలోని సహ్యాద్రి ఖండంలో....

అవతరించటంవల్ల దీనికి 'కనకాచల'మనే పేరు కూడా వచ్చింది.

పూర్వం దుర్గముడు అనే రాక్షసుడు ముల్లోకాలనీ అల్లకల్లోలం చేస్తూ, అందర్నీ బాధపెడుతూ ఉన్న సమయంలో దేవతలంతా జగన్మాత ఆది ప్రకృతి స్వరూపిణి అయిన దుర్గాదేవిని శరణు వేడగా ఆ తల్లి తన దివ్య పరాక్రమంతో ఆ దుర్గమాసురుణ్ణి వధించినదని, ఆ సమయంలో దేవి శరీరం బంగారు వర్ణంతో ప్రకాశించటం వలన దేవతలంతా ఆమెను కనకదుర్గా అని కీర్తించారని, స్కాందపురాణంలోని సహ్యాద్రిఖండంలో...

దుర్గమోనామ దనుజో ఆసీత్త్రైలోక్య, కంటక
దేవప్రార్థనయాదేవీ దుర్గమం నిజఘానహా
తదాతత్తేజసా వ్యాప్తం దదృశుః కనకప్రభావం
దేవాస్సర్వేస్తుతిం చక్రు స్సర్వోపనిషదాంగణైః
దేవీం కనకదుర్గేతి ముదాతుష్టివురాదరాత్ ॥

అని చెప్పటం జరిగింది. ఇలా కనక ప్రభలతో వెలుగొందే దుర్గాదేవి కనకదుర్గమ్మగా, దుర్గాభవానిగా ఆనాటినుంచి ఈనాటివరకూ ఎందరికో ఇలవేల్పుగా కోరిన వరాలిచ్చే కల్పవల్లిగా ప్రసిద్ధి గాంచింది. ఈ దుర్గాదేవి పూర్వం క్రోధస్వరూపిణిగా భీకరంగా ఉండేదట. ఆ కాలంలో చాలా మంది శాక్తేయులు అమ్మవారిని వామాచార పద్ధతుల్లో మద్యమాంసాల్ని నైవేద్యంగా సమర్పించి నరబలుల్ని కూడా ఇచ్చి ప్రసన్నం చేసుకునేవారట... అది విన్న శ్రీ శృంగేరి శారదాపీఠ జగద్గురు శంకరాచార్యులవారు, ఈ ఆలయానికి విచ్చేసి అక్కడ అమ్మవారి ముందు శ్రీచక్రయంత్ర ప్రతిష్ఠచేసి, అమ్మవారిలోని క్రోధకళను తొలగించి శాంతికళను ప్రవేశపెట్టారు. అలాగే ఆనాటి నుంచి దుర్గాదేవిని లలితమైన లలితా సహస్రనామాలతోనే అర్చించేవిధంగా కట్టుబాటు కూడా ఏర్పాటు చేశారు. ఇక ఆనాటినుంచి క్రోధమూర్తి దుర్గమ్మ శాంతస్వరూపంతో చిరునవ్వులు చిందిస్తూ కనకదుర్గగా మనకు దర్శనమిస్తూ ఉంది.

పవిత్రమైన ఈ ఇంద్రకీల పర్వతంమీద అమ్మవారు అవతరించగా కాలక్రమంలో ఆ పర్వతంమీద పరమేశ్వరుడిని కూడా అవతరింప చేయాలనే సత్సంకల్పంతో బ్రహ్మదేవుడు అక్కడ ఒక శతాశ్వమేధ యాగాన్ని చేసాడు. అతని భక్తిశ్రద్ధలకు మెచ్చిన పరమేశ్వరుడు జ్యోతిర్లింగ స్వరూపంతో బ్రహ్మదేవుడికి



దర్శనమిచ్చాడు. ఈ విషయం గురించి వ్యాసమహర్షి స్కాందపురాణంలో ఇలా చెప్తాడు –

జ్యోతిర్లింగ స్వరూపేణ బభౌసర్వేశ్వరశ్శివః ।
శతాశ్వమేధానాబ్రహ్మో బ్రహ్మలోక పితామహః ॥
తదాతం పూజయామాస దేవంమల్లీకదంబకైః ।
దర్శనం బ్రహ్మణౌదత్వా బ్రహ్మలోకం దదేశివః ॥
తదాప్రభృతి దేవేశం మల్లికేశంవదంతిహి ।
మల్లికార్జున దేవశ్చ తత్రైనాస్సీత్సుఖ ప్రదః ॥
తత్రైవ దక్షిణేభాగే తపస్తప్త్వాతుఫల్గుణః ।
తస్మాదేతన్మహాక్షేత్రం ఫల్గుణ క్షేత్రముచ్యతే ॥

ఇలా ఇంద్రకీలాద్రి మీద దివ్య జ్యోతిర్లింగ స్వరూపంతో నిలిచిన పరమేశ్వరుడిని బ్రహ్మమొదటగా మల్లీ కదంబ పుష్పాలతో అర్చించాడు. అలా భక్తిగా తనని అర్చించిన బ్రహ్మకి శివుడు బ్రహ్మలోకాన్ని ప్రసాదించాడు. అలా బ్రహ్మచేత మొదటగా మల్లీ పుష్పాలతో పూజలందుకొన్న కారణంగా స్వామికి 'మల్లికేశుడు' అనే పేరు వచ్చింది.

కాలక్రమంలో ద్వాపరయుగంలో పాండవ మధ్యముడైన అర్జునుడు. పవిత్రమైన ఈ పర్వతం మీద దక్షిణభాగంలో పరమేశ్వరుడి గురించి ఘోరమైన తపస్సు చేసాడు. అతని కఠోర దీక్షని పరీక్షించాలని శివుడు మారువేషంలో కిరాతుడిగా వచ్చి అతనితో మల్లయుద్ధాన్ని చేశాడు. తదనంతరం అర్జునుడి భక్తికి మెచ్చి అతనికి దివ్యపాశుపతాస్త్రాన్ని ప్రసాదించాడు. అలా అర్జునుడితో మల్లయుద్ధం చేసిన కారణంగా మల్లికేశుడు ఆనాటినుంచి 'మల్లేశ్వరుడు'గా ప్రసిద్ధి పొందాడు. ఆనాటినుండి ఈ కనకదుర్గ క్షేత్రం ఫల్గుణ క్షేత్రం అనే పేరుతో కూడా

ప్రసిద్ధమయింది. ఇది శ్రీమల్లేశ్వరస్వామి ఆవిర్భావగాథ కాలక్రమంలో కలి ప్రభావంవల్ల ఈ జ్యోతిర్లింగం అంతర్నిహితంగా ఉండటాన్ని గమనించిన శ్రీ శంకరాచార్యులవారు శ్రీకనకదుర్గ అమ్మవారికి ఉత్తరభాగంలో మల్లేశ్వర లింగాన్ని పునఃప్రతిష్ఠించారు. అయితే శ్రీమల్లేశ్వర స్వామివారికి దక్షిణంగా శ్రీ అమ్మవారు యికొలువైన కారణంగా ఇది శక్తిప్రధానమైన శ్రీ కనకదుర్గ క్షేత్రంగా లోకంలో సుప్రసిద్ధమైంది. ఇది శ్రీకనకదుర్గ క్షేత్ర పౌరాణిక గాథ.

ఇక చారిత్రకంగా : లభ్యమైన శాసనాల ఆధారంగా, వివిధ పాలకుల హయాంలో దేవాలయ అభివృద్ధి మరియు వైభవాన్ని గూర్చిన సమాచారం తెలియుచున్నది. ఈ శాసనాలలో శ్రీమల్లేశ్వరస్వామికి సంబంధించిన శాసనాలు అత్యధికంగా లభించగా శ్రీకనకదుర్గ ఆలయానికి సంబంధించిన శాసనాలు కొద్దిగా కనిపిస్తాయి. 1. యుద్ధమల్లుడి బెజవాడ శాసనం. 2. కిరాతార్జున స్తంభశాసనం. 3. పల్లవకేత భూపాలుడి మల్లీశ్వరాలయ శాసనం. 4. మహామండలేశ్వర సింగయ దేవరాజుల కనకదుర్గాలయ శాసనం. 5. గోవిందమఠం శిలాశాసనం ప్రముఖమైనవి.

ఈ శాసనాలు మల్లేశ్వరాలయం ముందర ఉన్నస్తంభాలమీద, ఆ ఆలయ ప్రాంగణంలో ఉన్న వినాయక దేవర గుడిముందు, స్తంభాలమీద, కనకదుర్గాలయంలో ఉన్న శిలాస్తంబాల మీద, చీకటికోనేరు ప్రాంతంలో కొండలమీద, దుర్గా కొండం సమీపంలో ఉన్న గోవిందమఠం ప్రాంతంలో, ఇంద్రకీలాద్రి శిఖరం మీద ప్రతిష్ఠించబడిన కిరాతార్జున శిలాస్తంబం మీద, జమ్మిదొడ్డి ప్రాంగణంలలో ఉండే మల్లేశ్వరాలయ మండప స్తంభాల మీద దాదాపు 90 శాసనాలు లభించాయి. వీటిలో కొన్ని లుప్తమైపోగా, కొన్ని మాత్రం కొండక్రింద ఉన్న భ్రమరాంబామల్లేశ్వరాలయం (పాతశివాలయం) ప్రాంగణంలో భద్రపరచబడ్డాయి. వీటిలో అత్యధిక శాసనాలు మల్లేశ్వరస్వామికి సంబంధించినవే. వివిధ రాజవంశాలవాళ్లు, సామాన్యులు, మల్లేశ్వరుడి నిత్యనైవేద్యాలకు, హవిర్భల్యర్చనాదులకు,, అఖండ దీపానికి, అరదీపానికి, సంధ్యాదీపానికి, దేవాలయ

పవిత్రమైన ఈ ఇంద్రకీల పర్వతంమీద అమ్మవారు అవతరించగా కాలక్రమంలో ఆ పర్వతంమీద పరమేశ్వరుడిని కూడా అవతరింప చేయాలనే సత్సంకల్పంతో బ్రహ్మదేవుడు అక్కడ ఒక శతాశ్వమేధ యాగాన్ని చేసాడు. అతని భక్తిశ్రద్ధలకు మెచ్చిన పరమేశ్వరుడు జ్యోతిర్లింగ స్వరూపంతో బ్రహ్మదేవుడికి దర్శనమిచ్చాడు.

మరమ్మత్తులకు గాను ఎన్నో దానాలు చేశారు. ఈ దానాలన్నీ పశువుల రూపంలోనో, ధన, ఆభరణరూపంలోనే ఇచ్చేవారు.

ఎందరో మాండలీక ప్రభువులు, సామంతులు దుర్గ, మల్లేశ్వర స్వామికి భక్తులై బెజవాడ మల్లేశ్వర పాదపద్మారాధన అనే బిరుదుల్ని కూడ స్వీకరించారు. అటువంటి మాండలీక వంశాలవారిలో వెలనాటి దుర్జయ, త్యాగి (బాగి) కొనకండ్రాడి, నతవాడి,, గొంటూరిపల్లవ అనే పాలకులు సఱుప్రసిద్ధులు. దుర్గాదేవికి, మల్లేశ్వరస్వామికి వీరు చేసిన ఎన్నో దానాలు ప్రకటించిన శాసనాలు మనకి స్పష్టంగా తెలియచేస్తునా&్నయి.

ఈ దివ్యకనకదుర్గ క్షేత్రం ఎంత గొప్పదంటే...

ఏతత్ క్షేత్రేణ సదృశం న భూతం న భవిష్యతి
ఏతచ్ఛ్రవణ మాత్రేణ పలాయంతేహి పాతకాః ।
భక్త్యాస్నాత్వాత్రమల్లేశం దుర్గాదుర్గార్తినాశనీం
దృష్ట్వాపాపాత్ప్రముచ్యేత దేవీలోకే వసేత్సదా ॥

ఇటువంటి దివ్యక్షేత్రం గతంలో ఎక్కడా లేదు. భవిష్యత్తులో మరేదీ కాదు. అంతేకాదు, ఈ క్షేత్రం గురించి వింటేనే చాలు పాపాలన్నీ దూరంగా పారిపోతాయి. ఈ దివ్యక్షేత్రంలో ఉన్న కృష్ణానదిలో స్నానం చేసి భక్తితో దుర్గతుల్ని నాశనం చేసే దుర్గామల్లేశ్వరుణ్ణి సేవిస్తే అన్ని పాపాలనుండి విముక్తి పొంది చివరకు దేవీ లోకాన్ని చేరుకుంటాం, అని స్కాందపురాణంలో కృష్ణా మాహాత్మ్య ఖండంలో చెప్పటం జరిగింది.

కనుక ఆస్తికజనులైన భక్తవరేణ్యులలందరూ పవిత్ర కృష్ణా నదీ పుష్కరాల సందర్భంగా పుష్కర స్నానాల్ని ఆచరించి కృష్ణా నదీతీరంలో బెజవాడలో ఇంద్రకీలాద్రి మీద కొలువున్న కామితార్థ ప్రదాయిని కనకదుర్గమ్మని శ్రీమల్లేశ్వరస్వామిని కనులారా దర్శించి నోరారా స్తుతించి తరించగలరు.

❖ ❖ ❖

(తితిదే 'కృష్ణవేణీ తరంగాల' సౌజన్యంతో)

చరిత్రకు నిలువుటద్దం.. ఉట్టిపడే దర్పం... 'గద్వాల'

- మరుమాముల వెంకటరమణశర్మ



గద్వాల సంస్థానము తుంగభద్ర మరియు కృష్ణా నదుల మధ్య ప్రాంతములో నడిగడ్డగా పిలువబడే అంతర్వేదిలో 800 చ.కి.మీల మేర విస్తరించి ఉండేది. 14వ శతాబ్దములో కాకతీయ సామ్రాజ్య పతనము తర్వాత ఈ గద్వాల సంస్థానాధీశులు బహమనీ సామ్రాజ్యముయొక్కసామంతులు అయినారు. వంశ చరిత్ర ప్రకారము గద్వాలను 1553 నుండి 1704 వరకు పెద్ద వీరారెడ్డి, పెద్దన్న భూపాలుడు, సర్గారెడ్డి, వీరారెడ్డి మరియు కుమార వీరారెడ్డి పరిపాలించారు.

1650 ప్రాంతములో ముష్టిపల్లి వీరారెడ్డి అయిజా, ధరూర్ మొదలైన మహల్లకు నాడగౌడుగా ఉండేవాడు. వీరారెడ్డికి మగ సంతానము లేకపోవడము వలన తన ఏకైక కుమార్తెకు వివాహము చేసి అల్లుడు పెద్దారెడ్డిని ఇల్లరికము తెచ్చుకున్నాడు. వీరారెడ్డి తరువాత అల్లుడు పెద్దారెడ్డి నాడగౌడు అయినాడు. పెద్దారెడ్డికి ఇద్దరు కుమారులు. పెద్దవాడు ఆనందగిరి, చిన్నవాడు సోమగిరి (ఈయననే సోమానాద్రి, సోమన్నభూపాలుడని ప్రసిద్ధుడయ్యాడు). పెద్దారెడ్డి తరువాత ఆయన రెండవ కొడుకు సోమన్న 1704 నుండి నాడగౌడికము చేశాడు. ఈయనే కృష్ణా నది తీరాన గద్వాల కోట నిర్మించి తుంగభద్రకు దక్షిణమున రాజ్యాన్ని బనగానపల్లె, ఆదోని, సిరివెళ్ల, నంద్యాల, సిద్ధాపురం,ఆత్మకూరు, అహోబిళం, కర్నూలు మొదలైన ప్రాంతాలకు విస్తరింపజేశాడు. ఈ సంస్థానము కింద 103 పెద్ద గ్రామాలు, 26 జాగీరులు ఉండేవి.

నిజాం అలీ ఖాన్ అసఫ్ ఝా యొక్క పరిపాలనా కాలములో, దక్కనులోని కొన్ని ప్రాంతములలో మరాఠుల ప్రాబల్యము పెరిగి 25 శాతము ఆదాయ పన్ను (చౌత్) వసూలు చేయడము ప్రారంభించారు. దీనిని దో–అమలీ (రెండు ప్రభుత్వాలు) అని కూడా అనేవారు. రాజా సీతారాం భూపాల్ 1840 లో మరణించాడు. ఆ తరువాత ఆయన దత్తపుత్రుడు రాజా సీతారాం భూపాల్ సంస్థానమును పరిపాలించాడు. నిజాము VII ఈయనకు "మహారాజ" అనే పట్టమును ప్రధానము చేశాడు. 1924 లో మరణించే సమయానికి ఈయనకు భార్య మరియు ఇద్దరు కుమార్తెలు కలరు.

గద్వాల సంస్థానాధీశులు తమ స్వంత నాణేలను ముద్రించు కున్నారు కూడా. 1909 నాటికి కూడా ఈ నాణేలు రాయిచూరు ప్రాంతంలో చలామణీలో ఉండేవి.

ఢిల్లీ పీఠంపై బహద్దూర్షా బలహీన పాలనసాగుతున్న కాలంలో దక్షిణ సుబేదార్ నిజాం ఉల్ ముల్క్ హైదరాబాద్ సంస్థానాన్ని స్వతంత్ర రాజ్యంగా ప్రకటించుకున్నారు. అయితే హైదరాబాద్ సంస్థానంలో అంతర్భాగంగా ఉన్న గద్వాల సంస్థానాధీశుడు సోమనాద్రి మాత్రం బహద్దూర్ షా కు అనుయాయిగానే పాలన కొనసాగించారు. ఇది సహించని నిజాం తన సేనాని అయిన దిలీప్ భానుడిని ఉసిగొల్పి గద్వాల సంస్థానంపై దండయాత్రకు పంపించాడట. దిలీప్ భానుడి సేన, సోమనాద్రి సేనలు కర్నూలు సమీపంలో నిడ్జూర్ దగ్గర భీకరంగా తలపడ్డాయి. చివరికి ఈ యుద్ధంలో సోమనాద్రి వీరమరణం పొందగా, సోమన పెద్ద భార్య రాణి లింగమ్మ నిజాంతో సంధి కుదుర్చుకుని పాలన కొనసాగించింది.

నిజాం రాష్ట్రంలోని సంస్థానాలలో కెల్లా గద్వాల సంస్థానంలో సాహితీపోషణ అధికంగా ఉండేది, సంస్థానాధీశులు విద్యావేత్తలను, కళాకారులను ఆదరించారు. సంస్థానంలో ప్రతి సంవత్సరం మాఘ, కార్తీక మాసాలలో సంగీత, సాహిత్య సభలు జరిగేవి. రాజాపెద సోమభూపాలుడు స్వయముగా కవి. ఆయన జయదేవుని గీతాగోవిందాన్ని తెలుగులోకి అనువదించాడు. 1761 నుండి 1794 వరకు పాలించిన చినసోమ భూపాలుడు కవిపండితులను ఆదరించడమే కాకుండమే కాకుండా స్వయంగా రచనలుచేశాడు. ఇతని ఆస్థానంలో అష్టదిగ్గజములనే 8 మంది కవులు ఉండేవారు. ఇతని కాలాన్ని గద్వాల సంస్థానంలో 'సాహిత్య స్వర్ణయుగం' గా చెబుతారు. ప్రముఖకవి సోమయాజులు, అలంకార శిరోభూషణం రచించిన కందాళాచార్యులు ఇక్కడివారే. ఆంధ్రదేశంలోని ఎక్కడెక్కడి కవులో ఇక్కడి రాజుల దర్శనానికి వచ్చేవారు.

ఆంధ్రదేశంలో తిరుపతి వేంకటకవులు తిరుగని ప్రదేశం లేదు. వారికున్న ప్రశస్తే వేరు. అలాంటి ప్రముఖ కవులకు కూడా గద్వాల సంస్థానపు రాజుల దర్శనం అంత సులభంగా దొరకలేదనటానికి ఓ ఉదాహరణ ఈ సంఘటన. ఒక రోజు తిరుపతి వెంకటకవులు గద్వాల సంస్థానానికి వచ్చారు. రాజ దర్శనం కాలేదు. ఒకటి, రెండు రోజులు గడిచిపోయింది. అయినా దర్శన భాగ్యం కాలేదు. పట్టువదలని కవులు పట్టణాన్ని వదలకుండా వండుక తిని ఎదురు చూశారు. అయినా రాజదర్శనం కాలేదు. ఇక విసుగొచ్చిన కవులు ఒక రోజు "చర్ల బ్రహ్మయ్య శాస్త్రి శబ్దశాస్త్రం చెప్ప / వంట నేర్పించే గద్వాల రాజు" అని ఓ కాగితం మీద రాసి రాజా వారికి పంపించారట. దానితో జరిగిన తప్పిదాన్ని తెలుసుకున్న రాజా వారు వెంటనే కవులను రప్పించి, వారి పాండిత్య ప్రదర్శనకు కావలసిన ఏర్పాట్లు చేయించి, తదనంతరం ఘనంగా సత్కరించి, సంభావనలు అందజేశారట.

ఈ తిరుపతి వెంకటకవులే ఒకనాడు విజయనగర రాజుల దర్శనార్థం వెళ్ళినప్పుడు, అక్కడి దివాను కోదండరామారావు సాహిత్య సభకు కాకుండా. సన్మానానికి ఏర్పాటు చేయగా కోపమొచ్చిన తిరుపతి కవులు అతనిని ఉద్దేశించి...

అటు గద్వాలిటు చెన్నపట్టణము మధ్యంగల్గు దేశమ్మునన్
జటుల స్ఫూర్తి శతావధానములు మెచ్చం జేసియున్నట్టి మా
కిటు రాజీయక యున్న దర్శనము నింకెవ్వానికీ రాజొసం
గుట? చెప్పంగదవయ్య పాలితబుధా! కోదండరామాభిధా

అంటూ చెప్పిన పద్యంలో.... సాహిత్యానికి గద్వాల ఒక గొప్ప స్థానమన్న విషయం ఋజువవుతుంది.

బుడ్డారెడ్డి గద్వాల సంస్థానమునకు మూలపురుషుడు. మొత్తం 11 రాజులు, 9 రాణులు ఈ సంస్థానాన్ని పాలించారు. వీరిలో




ముఖ్యులు. రాజ శోభనాద్రి, రాణి లింగమ్మ (1712–1723), రాణి అమ్మక్కమ్మ (1723 – 1724), రాణి లింగమ్మ (1724 –1738),రాజా తిరుమలరావు, రాణి మంగమ్మ (1742 – 1743), రాణి చొక్కమ్మ (1743 – 1747), రాజా రామారావు, రాజా చిన్నసోమభూపాలుడు, రాజా చిన్నరామభూపాలుడు, రాజా సీతారాం భూపాలుడు, రాణి లింగమ్మ (1840 – 1841), రాజా సోమభూపాలుడు, రాణి వెంకటలక్ష్మమ్మ, రాజారాంభూపాలుడు, రాణి లక్ష్మీదేవమ్మ. మహారాణి ఆదిలక్ష్మిదేవమ్మ (1924 – 1949)

గద్వాల కోట మహబూబ్ నగర్ జిల్లాలోని కోటలన్నిటిలోకి ప్రసిద్ధిచెందినది. ఇది గద్వాల పట్టణం నడి బొడ్డున ఉంది. ఈ కోటను రాజా పెద్ద సోమభూపాలుడు క్రీ.శ. 1662లో నిర్మించాడు. ఇతనికే నల్ల సోమనాద్రి అనే పేరు కూడా ఉంది. ఇదే కోటలో చెన్నకేశవస్వామి దేవాలయాన్ని సోమనాద్రియే అత్యంత సుందరంగా నిర్మించాడు. దేవాలయ గోడలపై ఉన్న శిల్పకళ, దేవాలయం ఎదుట ఉన్న 90 అడుగుల గాలిగోపురం ఇప్పటికీ చూపురులను ఆకట్టుకుంటాయి. కోట లోపల ప్రస్తుతం ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల నడుస్తున్నవి.

ఇది వలయాకారంలో ఉన్న మట్టికోట. కోట బయటి వైపు ఎత్తైన పెద్ద పెద్ద బురుజులతో మట్టితో నిర్మించబడింది. లోపలి వైపు కోట మొత్తానికి రాతి గోడ ఒక పొరగా నిర్మించబడింది. బయటి మట్టి గోడలు వర్షాకాలంలో తరుచుగా కూలిపోతున్నప్పటికీ, లోపలి వైపు రాతి గోడ ఏ మాత్రం చెక్కు చెదరలేదు. కోటలోకి శత్రువులు ప్రవేశించకుండా కోట బయట చుట్టూరా నీటితో నింపడానికి కందకం నిర్మించారు. నేటికీ కందకం పట్టణంలోని మురికి నీటితో నిండి నాటి దృశ్యాన్ని తలపిస్తుంది. పశ్చిమాన కోట ప్రవేశద్వారం ఉంది. కోటలోనికి ప్రవేశించగానే, కుడివైపు శిథిలమైన అధికారుల, భటుల నివాస స్థావరాలు కనిపిస్తాయి. వాటిని దాటుకుని ముందుకు వెళ్తే, కుడివైపే ఎత్తైన ఆలయాల ప్రహరీ గోడ కనిపిస్తుంది. ప్రహరీలోపల

ఆలయాల సముదాయం కనిపిస్తుంది. వీటిలో మూడు ఆలయాలు చెప్పుకోదగినవి. వాటిలో ప్రధానమైనది. గద్వాల సంస్థాన ప్రభువుల ఇలవేల్పైన శ్రీ చెన్నకేశవస్వామి ఆలయం. ఇది మిగిలిన ఆలయాలకు మధ్యలో ఉండి, ఎత్తైన వేదిక మీద నిర్మించబడి ఉంది. ఆలయం ముందు గాలి గోపురం పట్టణం మొత్తానికి కనిపించేంత ఎత్తుగా ఉండి, బహు ఆకర్షణీయంగా ఉంటుంది. గాలి గోపురం ద్వారా ఆలయంలోని వచ్చే దారిలో మెట్ల దగ్గర గంటా వేదిక ఉంది. రాతి స్తంభాలకు చాలా పెద్దదైన గంట వేలాడి ఉంటుంది. ఈ ఆలయానికి ఇరువైపుల మరో రెండు ఆలయాలు ఉన్నాయి. వీటిలో ఒకటి శివాలయం. ఈ ఆలయాలలోని శిల్పాలు ఆకట్టుకుంటాయి. ఈ మూడు అలయాలు ఒకే ఆవరణలో ఉన్నాయి. ఆలయాల ఆవరణలోకి ప్రవేశించడానికి రెండు ప్రధాన మార్గాలు ఉన్నాయి. తూర్పు వైపు ఉన్న గాలి గోపురం ద్వారా, ఉత్తర ద్వారం ద్వారా ప్రవేశించవచ్చు. దక్షిణం వైపు కూడా మరో ద్వారం ఉండినప్పటికీ అది ప్రవేశ ద్వారం కాదు. ఆ ద్వారం గుండా వెళితే కోటలోపలి పురాతన బావి కనిపిస్తుంది. ఆలయాల ప్రహరీకి ఆనుకొని ఆగ్నేయాన రెండు వరుసలలో ఎదురెదురుగా రాజ భవనాలు ఉండేవి. ఈ భవనాలలో ఒకటైన దక్షిణం వైపు భవనంలో, కోటలో తర్వాత ఏర్పాటుచేసిన డిగ్రీ కళాశాలకు చెందిన భౌతిక, రసాయన శాస్త్ర ప్రయోగశాలలు ఏర్పాటు చేశారు. పాత భవనం శిథిలమయ్యే కొద్ది ప్రయోగశాలల నిమిత్తం తరుచుగా ఆధునీకీకరించబడి, పూర్తిగా రూపు రేఖలు మారిపోయింది. ఈ భవనానికి దక్షిణం వైపు కొన్ని శిథిలాలు మాత్రం మిగిలి గత చరిత్రకు ఆనవాళ్ళుగా కనిపిస్తాయి. ఈ భవనం దక్షిణం వైపు నుండి కోటలోని బావిలోకి దారి ఉంది. ఈ బావి నాడు తాగు నీటికి, ఈతకు ఉపయోగించినట్లు తెలుస్తుంది. నేటికీ ఈ బావిలోని నీరు స్వచ్ఛంగా కనిపిస్తుంది. దక్షిణం వైపు భవనానికి అభిముఖంగా మరో రాజభవనం ఉండేది. ఇది రెండంతస్తుల భవనం. ఈ భవనంలోని లోపలి గోడలు అందమైన చిత్రకళతో అలరారేవి. ఉత్తరం వైపు అంతఃపురాన్ని ప్రతిబింభించేలా కలపతో ఏర్పాటుచేసిన అందమైన నిర్మాణాలు కళానైపుణ్యంతో ఉట్టిపడేవి. భవనం శిథిలదశలో ఉండినప్పుడు, ప్రవేశ ద్వారం దగ్గర ఉన్న రెండు గదులను మాత్రం ఆటలు, ఎన్. సి. సి. నిమిత్తం కళాశాల వారు ఉపయోగించుకునేవారు. అందమైన చారిత్రక భవనాలను పరిరక్షించాల్సిందిపోయి. స్థలం కొరకు కక్కుర్తితో ప్రభుత్వాలు ఇక్కడ నూతన నిర్మాణాల కొరకు ఈ భవనపు శిథిలాలను కూడా పూర్తిగా తొలగించారు. ఈ రెండు భవనాల మధ్య అందమైన ఉద్యానవనం ఉండేది. వనం మధ్యలో సింహాసనం మీద అసీనుడై ఉన్న పెద సోమభూపాలుడి(సోమనాద్రి) పెద్ద విగ్రహం ఉండేది. అది కూడా నేడు ధ్వంసమై పోయింది.

ప్రపంచ ఖ్యాతి నెర్జించిన గద్వాల చీర



గద్వాల్ చీర భారతదేశం లోని మహబూబ్ నగర్ జిల్లా లో తయారవుతున్న సాంప్రదాయక చీర . ఇవి జరీతో కూడుకొని ప్రసిద్ధి పొందాయి. బ్రోకేడ్ శారీస్, కాంట్రాస్ట్ పల్లూ, బార్డర్, ప్యాటర్న్స్‌కు ఈ చీర పెట్టింది పేరు. హంసల బార్డర్ మరో ప్రత్యేకత.ఫి2ది

గద్వాల్ చీర తెలంగాణ చేనేత పరిశ్రమకు పట్టుకొమ్మ. మహబూబ్‌నగర్‌లోని గద్వాల్లో తయారయ్యే చీరలు దేశంలోనే మన్నికైనవి, పేరెన్నిక గన్నవి. ఇక్కడి నుంచి దేశంలోని ప్రముఖ పట్టణాలకు ఈ కళాత్మక చీరలు ఎగుమతి అవుతాయి. ఎంతో నాణ్యత గల జరీ చీరలను నేసే ఇక్కడి కళాకారులు ఇప్పటికీ తమ వృత్తిని కొనసాగిస్తున్నారు. ఈ చీరల తయారీకి నూలు, పట్టు పోగుల నుంచి దారం తీయడం, వివిధ రకాల రంగులు అద్దడం మొదలుకుని ఎంతో ఓర్పు, నేర్పుతో నేయడం వాటిని రోల్ చేయడం, చీర తయారు చేసేవరకు ప్రతి ఒక్కటీ ప్రత్యేకమే.

5.5 మీటర్ల పొడవు గల చీరను చిన్న అగ్గిపెట్టెలో పట్టినట్లు నేయగల సామర్థ్యం ఉన్న చేనేత కార్మికులు ఇపట ఉన్నారు. ఈ చీరలు 1930 నుండి ప్రాముఖ్యతను సంతరించుకున్నాయి. నూలు, పట్టుపోగుల నుంచి దారం తీయడం, వివిధ రకాల రంగులు అద్ది కళాత్మకమైన చీరలను నేస్తారు. చీర పై, కింది అంచులు జరీతో ఉండి, అంచులు మరోసారి నేసి తర్వాత ప్రత్యేకంగా జోడిస్తారు. చీరకు కావలసిన పట్టు దారాలు, అంచులు, కొంగులకు జరీని వాడుతారు.



రాజగోపురానికి తూర్పు వైపు, గోపురానికి అభిముఖంగా రాజా కృష్ణరాంభూపాల్ శిలా విగ్రహం ఉంది. ఈ విగ్రహానికి వెనుక వైపు ఇప్పుడు నూతనంగా నిర్మించబడిన డిగ్రీ కళాశాల భవన సముదాయం ఉంది. రాజ గోపురానికి దగ్గరలో ఇటీవల డిగ్రీ కళాశాల స్వర్ణోత్సవాల సందర్భంగా నాటి సంస్థానపు వీర వనిత మహారాణి ఆదిలక్ష్మిదేవమ్మ విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేశారు. కోటలోకి ప్రవేశించేటప్పుడు ఎడమవైపు జూనియర్ కళాశాల భవనం కనిపిస్తుంది. కోటలో ఉత్తరం వైపు ఆటస్థలం, తూర్పు వైపు ఎల్లమ్మ దేవాలయం ఉన్నాయి.

రాజా పెదసోమభూపాలుడు (నలసోమనాద్రి) పూడూరు రాజధానిగా పరిపాలించేవాడు. పూడూరు కోటను మరమ్మత్తు చేస్తుండగా గుప్తనిధి లభించగా, శత్రుధుర్భేధ్యంగా ఉండాలనే ఉద్దేశ్యంతో గద్వాలలో మట్టి కోటను కట్టించాడు. కోట నిర్మాణంలో ఎన్నో అవాంతరాలు రావడముతో కేశవాచారి అనే బ్రాహ్మణుడిని బలి ఇచ్చారని, ఆ పాప పరిహారానికి గాను గద్వాల కోటలో చెన్నకేశవ దేవాలయాన్ని నిర్మించారని కథ ప్రచారంలో ఉంది. చెన్నకేశవ స్వామి ఆలయాన్ని నిర్మించిన తరువాత రాజధానిని పూడూరు నుంచి గద్వాలకు మార్చినాడు. పూడూరును చాళుక్యులు పరిపాలించగా, చాళుక్యులకు, పల్లవులకు మధ్య జరిగిన యుద్ధంలో పెదసోమభూపాలుడు కూడా పాల్గొని గదను, వాలమును ప్రయోగించడము వలన ఈ ప్రాంతానికి “గదవాల(గద్వాల)” అన పేరు వచ్చినదని చెబుతారు. ఆవిధంగా ఈ కోట గద్వాల కోటగా చరిత్రలో మిగిలిపోయింది. 1663 నుండి 1950 వరకు గద్వాల సంస్థానాధీశుల ఆధీనంలో ఉండిన ఈ కోట, సంస్థానాల రద్దు తరువాత ప్రభుత్వ పరమైంది. రాష్ట్ర ప్రభుత్వం తరువాత 1962లో జిల్లాలోనే మొట్టమొదటి డిగ్రీ కళాశాలను ఈ కోటలోపల ఏర్పాటు చేసింది. డిగ్రీ కళాశాల పేరు కూడా రాణి పేరు మీదుగా మహారాణి ఆదిలక్ష్మి దేవమ్మ (మాల్డ్)డిగ్రీ కళాశాలగా పెట్టబడింది. గద్వాల సంస్థానాధీశులు సాహితీప్రియులు కావడంతో కోటలో తరుచుగా సాహిత్య సభలు జరిగేవి. కవులకు సంస్థానాధీశులు బహుమతులను కూడా అందజేసేవారు. చినసోమభూపాలుని హయంలో అష్టదిగ్గజాలనే 8మంది కవులుండేవారు. వీరి కాలంలో సాహిత్యం బాగా అభివృద్ధి చెందినది. అందుకే గద్వాలకు విద్వద్గద్వాల అని పేరు. తిరుపతి వేంకట కవులు కూడా గద్వాల సంస్థానాన్ని సందర్శించారు.

గద్వాల కోటలో కె. రాఘవేంద్రరావు దర్శకత్వంలో మెగాస్టార్ చిరంజీవి నటించిన కొండవీటి రాజా అను తెలుగు చిత్రం షూటింగ్ జరిగింది. గద్వాల ప్రాంతానికి చెందిన సినీ ఫైనాన్సియర్, నిర్మాత బుర్రి వెంకట్రామిరెడ్డి నిర్మాణంలో ఈ చిత్రం వచ్చింది. దాదాపు నెలరోజులకు పైగా గద్వాల కోటలో సినిమా చిత్రీకరణ జరిగింది. కోట చుట్టూ ఉండిన కందకంలో, కోటలోపలి బావి దగ్గర ఫైటింగ్‌లు, కోటలోపల ఆలయ సముదాయంలో అంగాంగ వీరాంగమే పాట చిత్రీకరణ జరిగింది. దాదాపు సినిమా చివరి ఘట్టాలన్నీ కోటలో చిత్రీకరించబడినవే.

చేనేత పరిశ్రమలో ముఖ్యంగా చీరల తయారీలో గద్వాల పట్టణం జిల్లా లోనే కాకుండా రాష్ట్రంలోనే ప్రముఖ పేరు సంపాదించింది. ఇక్కడి నుంచి ప్రముఖ పట్టణాలకు వస్త్రాలు ఎగుమతి అవుతుంటాయి. చేనేత వస్త్రాలకు డిమాండు తగ్గిననూ అతినాణ్యత కల జరీ చీరలు నేసే కళాకారులు గద్వాలలో ఇప్పటికీ ఉన్నారు. బ్రిటీష్ కాలంలో చేనేత కళాకారులకు ఎలాంటి ప్రోత్సాహం లభించకున్ననూ సంస్థానాధీశులు మాత్రం వీరిని ప్రోత్సహించారు. గద్వాల సంస్థానాధీశుల కాలంలో అప్పటి మహారాణి ఆదిలక్ష్మి దేవమ్మ గద్వాల నుంచి ఇద్దరు చేనేత కళాకారులను ఉత్తర ప్రదేశ్ లోని వారణాసికి పంపించి బనారస్ జరీ చీరలను నేసేందుకు శిక్షణ ఇప్పించింది.



సుమారు నాలుగు శతాబ్దాలుగా గద్వాల సంస్థానాధీశుల కాలం నుంచి తిరుమల శ్రీ వెంకటేశ్వరస్వామి వారికి పంచెలను సమర్పించే సంప్రదాయం ఉంది. నాటి రాజు సీతారాం భూపాల్ గద్వాల సంస్థానాధీశుల ఇష్టదైవమైన వెంకటేశ్వరస్వామివారికి పంచెలను సమర్పించే పద్ధతిని ప్రవేశపెట్టాడు. అతని వారసులు నేటికికూడా ఈ పద్ధతిని కొనసాగిస్తున్నారు.

ఇది 1946లో స్థాపించబదినది. దీనిని లేటు రతన్ బాబూరావు స్థాపించారు. ఈ చీరల గూర్చి విస్తృతంగా ప్రచారం చేయుట కొరకు ఈ సంస్థ ప్రారంభించబడినది. ఆయన దుకాణం సాంప్రదాయక చీరల అమ్మకానికి ప్రపంచవ్యాప్తంగా పేరు పొందింది.

భారత ప్రభుత్వము వారు ఒక బౌగోళిక ప్రాంతానికి చెందిన కళాకారులు, మానుఫాక్సరర్స్ మరియు ఉత్పత్తి దారులు తయారు చేసిన వస్తువుల రక్షణ కొరకు వస్తువులభౌగోళిక గుర్తింపు చట్టం ను రూపొందించినారు. ఈ చట్టం క్రింద గద్వాల్ చీరలను రిజిష్టర్ చేయడం జరిగినది. ❖

వనపర్తి సంస్థానం

వనపర్తి, తెలంగాణ రాష్ట్రములోని మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన ఒక మండలము మరియు పట్టణము. మహబూబ్ నగర్ జిల్లాలోని ప్రముఖ పట్టణాలలో ఒకటి. 2001 జనాభా లెక్కల ప్రకారము ఈ పట్టణ జనాభా 50,262. జనాభా ప్రకారము ఈ పట్టణము జిల్లాలో మహబూబ్ నగర్, గద్వాల తరువాత మూడవ స్థానం ఆక్రమిస్తుంది.

మహబూబ్ నగర్ జిల్లాలోనే తొలిసారిగా ఏర్పాటైన బస్సు డీపో వనపర్తిలో ఉంది. వనపర్తి సంస్థానాధీశుల కోరిక మేరకు నిజాం ప్రభుత్వం ఇక్కడ బస్సు డిపోను ఏర్పాటు చేసింది. ఇది రెవెన్యూ డివిజన్ కేంద్ర స్థానమైనా రైలుస్టేషను లేదు. దగ్గరలో మదనాపురం రైల్వే స్టేషను వరకు పోవడానికి బస్సు సౌకర్యం ఉంది. ఈ పట్టణం జాతీయ రహదారి నెం.44(పాత నెం.7)కు కేవలం 14 కి.మీ దూరం లో వుంది.

నిజాం పరిపాలనలో వనపర్తి సంస్థానం ప్రముఖ స్థానం ఆక్రమించింది. వనపర్తి సంస్థానం వైశాల్యం 450 చ.మై.తో 124 గ్రామాలతో కొనసాగింది. ఈ సంస్థానానికి పెబ్బేరు మండలంలోని సూగూరును తొలి రాజధానిగా పరిపాలన కొనసాగించినారు. ప్రారంభంలో సూగూరు సంస్తానంగా వ్యవహరించబడింది. సంస్థానాన్ని పరిపాలించిన మొదటి రామక్రిష్ణా రావు సూగూరు నుంచి తన రాజధానిని వనపర్తికి మార్చడం వలన వనపర్తిని సంస్థానంగా పరిగణించారు. ఈ సంస్థానాధీశుల ఇంటిపేరు జనుంపల్లి. ఈ వంశానికి మూలపురుషుడు వీరక్రిష్ణ భూపతి, వీరిని వీర క్రిష్ణా రెడ్డి అని కూడా సంభోదించేవారు. వనపర్తి సంస్థానాదీశుల తొలి నివాసం కర్నూలు జిల్లా నంధ్యాల తాలూకా జనుంపల్లి గ్రామం. జనుంపల్లి నుంచి పానుగల్ పరిధి ఉన్న పాతపల్లి గ్రామానికి వలస వచ్చి సూగూరు సంస్థానాధీశులుగా వ్యవహరించారని చరిత్ర చెబుతుంది.

వీర క్రిష్ణ భూపతికి నాలుగవ తరం వారసుడు వేముడి వెంకటరెడ్డి. ఇతడు యుద్ధవిద్యలలో ఆరితేరినవారిగా చెబుతారు. గోలుకొండ సైన్యం దండెత్తిన సమయంలో వేముడి వెంకట్ రెడ్డి 10,000 సైన్యంతో వెళ్ళి యుద్ధం చేసాడు. సూగూరు సంస్థానానికి అనుబంధంగా మరికొన్ని గ్రామాలను ఖుతుబ్ షా నుండి పొందినట్లు తెలుస్తుంది. వెంకట్ రెడ్డి కుమారుడు గోపాల రాయలు. వనపర్తి సంస్థానాధీశులలో 'బహిరి' అనే బిరుదును పొందినట్లు తెలుస్తుంది. క్రీ.శ. 1637లో గోపాలరాయుడు దివంగతుడైనట్లు తెలుస్తుంది. గోపాల రాయలుకు మగ సంతతి లేనందున సవాయి వెంకట రెడ్డిని దత్తత తీసుకున్నారు. సంస్థాన ఆదాయం సరిపోక రుణాలు చేసి ఆర్థిక పరిస్థితిని దిగజార్చారు. నిజాంకు చెల్లించాల్సిన కప్పంను చెల్లించనందున ఇతడు నిజాం సైన్యంతో పోరాడి అపజయం పొంది క్రీ.శ. 1711లో ఆత్మహత్య చేసుకున్నట్లు చరిత్ర చెబుతుంది.

వనపర్తి సంస్థానం ఏలిన వారిలో మొదటి రామక్రిష్ణారావు దాయాదుల కుట్రతో నిజాం ప్రభువు చెరసాలలో మూడు సం.లు గడిపాడు. చివరకు నిజాం రామక్రిష్ణా రావుకు విముక్తి కలిగించారు. నిజాం క్రీ.శ. 1817లో రాజా బహద్దూర్ బిరుదును బహూకరించారు. రామక్రిష్ణా రావు దత్త పుత్రుడు మొదటి రామేశ్వర్ రావు గద్వాల సంస్థాన పాలన బాధ్యతలు స్వీకరించిన పిదప ప్రజలకు అనేక సదుపాయాలు కల్పించారు. క్రీ.శ.1839లో కాశీయాత్రలో భాగంగా ఇక్కడికి వచ్చి విడిసిన యాత్రాచరిత్రకారుడు ఏనుగుల వీరాస్వామయ్య ఈ గ్రామం అన్ని సామాన్లు దొరికే స్థలంగా, వసతిగా ఉండేదని వ్రాశారు. క్రీ.శ. 1861లో రాజా రామేశ్వర్ రావు సేవలకు గాను కరవాలం, పిస్తోలు, రైఫిలు వంటి ఆయుధాలను బ్రిటిషు వారు, నిజాం ప్రభువులు బహూకరించినట్లు తెలుస్తుంది.

రాజా రామేశ్వర్ రావు దత్త పుత్రుడు రాజా రామ క్రిష్ణ రాయలు. ఇతడు అకస్మాత్తుగా మృత్యువాత పడ్డాడు. రెండవ రామేశ్వర రావు దత్త పుత్రుడుగా వచ్చి పాలన బాధ్యతలను స్వీకరించారు. ఇతడు సమర్థుడుగా, పరిపాలనా దక్షుడుగా గుర్తింపు తెచ్చుకున్నారు. అనేక ప్రజాహిత కార్య క్రమాలతో పాటు వ్యవసాయ అభివృద్ధికిచెరువులు, కుంటలు, బావులు అనేకం త్రవ్వించారు. రాజా రామేశ్వర్ రావుకు ఇద్దరు కుమారులు శ్రీ క్రిష్ణ దేవరాయలు, శ్రీ రామ దేవరాయలు. మునగాల సంస్థానాధీశుడగు రాజానాయని వెంకట రంగారావు




బహద్దూర్ కూతురు సరళాదేవిని శ్రీ క్రిష్ణ దేవరాయలు వివాహం చేసుకున్నారు. పింగళి వెంకట్రామారెడ్డి కూతురు కుముదినీ దేవిని శ్రీ రామ దేవరాయులు వివాహం చేసుకున్నారు. రాణి సరళాదేవి పేరుతో వనపర్తి సంస్థానంలో 'సరళా సాగర్' అనే ప్రాజెక్ట్ ను నిర్మించారు.

రాజా శ్రీ క్రిష్ణ దేవరాయలు, రాణి సరళా దేవి కుమారుడు రాజా రామేశ్వర్ రావు. ఇతడు ఉన్నత విద్యావంతుడు. సంస్థానాన్ని హైదరాబాద్ రాష్ట్రంలోనూ, అనంతరం ఆంధ్రప్రదేశ్‌లోనూ విలీనం అయిన పిదప రాజా రామేశ్వర రావు పార్లమెంటు సభ్యునిగా కొనసాగారు. భారత ప్రభుత్వ విదేశాంగ శాఖలో ఉన్నత పదవీ బాధ్యతలు నిర్వర్తించారు. ఇతనికి ముగ్గురు ఆడ సంతానం. క్రిష్ణ దేవరావును దత్త పుత్రునిగా స్వీకరించారు.

వనపర్తి సంస్థానము హైదరాబాదు రాష్ట్రములోని మహబూబ్ నగర్ జిల్లాలో నైఋతి దిక్కున ఉన్నది. ఈ సంస్థానములోని 124 గ్రామాలు మహబూబ్ నగర్ జిల్లా యొక్క నాగర్‌కర్నూల్, జడ్చర్ల, మహబూబ్ నగర్, కల్వకుర్తి మరియు అమ్రాబాద్ తాలూకాలలో విస్తరించి ఉన్నాయి. ఈ సంస్థానము 450 చ.కి.మీ.లలో విస్తరించినది. 1901లో సంస్థాన జనాభా 62,197. సంస్థానము యొక్క రెవిన్యూ 1.5 లక్షలు, అందులో 76,883 రూపాయలు నిజాముకు కప్పముగా కట్టేవారు

విజయ నగర రాజుల కాలంలో రాయలసీమ ప్రాంతం నుండి వచ్చిన వీర కృష్ణారెడ్డి అను క్షత్రియుడు పాతపల్లె, సూగూర్ గ్రామాలను కొని అభివృద్ధి చేసి ఈ సంస్థాన స్థాపనకు బీజాలు వేశాడు. వీరి మునిమనుమడు గోపాలరావు. గొప్ప పండితుడు. పాలకుడు. ఎనిమిది భాషలలో విద్వాంసుడు. అందుకే ఇతనిని అష్టభాషి బహిరీ గోపాలరావు గా పిలుస్తారు. ఇతనికి మొదట్లో సంతానం లేకపోవడంచే బంధువుల బిడ్డ వెంకటరెడ్డిని దత్తత తీసుకున్నాడు. తరువాత సంతానం కలిగినా ఈ దత్తపుత్రుడే పాలకుడయ్యాడు. వెంకటరెడ్డి తన దత్తుతల్లి పేర జానంపేటను, దత్తుతండ్రి పేరిట గోపాలపేటను ఏర్పాటుచేశాడు. మొగలుల రాజ్యాధికారాన్ని ధిక్కరించాడు. తళ్ళితంగా దక్కను సుబేదారు జానంపేటపై దండెత్తగా వీరోచితంగా తన సేనలతో పోరాడి, చివరకు సైన్యాన్ని కోల్పోయి, దిక్కుతోచని దుస్థితిలో అభిమానవంతుడై తప్పించుకునిపోయి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇతని వీరత్వాన్ని కీర్తిస్తూ ఈ ప్రాంతపు శారదగాండ్రు పాటలు కట్టి ఇప్పటికీ తెలంగాణ ప్రాంతంలో పాడుతూనే ఉంటారు. వెంకటరెడ్డి అనంతరం అతని కుమారుడు బహిరీ చిన గోపాలరావు(తాత గారి పేరు) పాలకుడయ్యాడు. ఇతను కుతుబ్ షాహీ రాజులకు సన్నిహితముగా ఉండేవాడు. అసఫ్ జా అర్కాట్ మీదికి యుద్ధానికి వెళ్తూ, తన రాజధాని బాధ్యతలను గోపాలరావుకు అప్పగించాడంటే, వారికి ఇతనెంత విశ్వాసియో అర్థమవుతుంది. ఈ గోపాలరావు 1746 లో మరణించాడు. ఇతని అనంతరం ఇతని కుమారుడు సవై వెంకటరెడ్డి సూగూరు పాలకుడయ్యాడు. ఇతనే రాజధానిని సూగూరు నుండి శ్రీరంగపురం (నేటి శ్రీరంగాపురం) నకు మార్చాడు. ఇతని కాలం నుండి దాదాపు 50 సంవత్సరాల పాటు శ్రీరంగపురం

రాజధానిగా భాసిల్లినది. తరువాతి కాలంలో రాజధాని వనపర్తికి మార్చబడినది. తొలిదశలోని వనపర్తి రాజులు 2000 మంది పదాతి దళము మరియు 2000 మంది అశ్విక దళాలు కల సైన్యమును నిర్వహించేవారు. 1727 వరకు సంస్థానానికి సుగూరు రాజధానిగా ఉండేది. దాని పేరు మీదుగా సంస్థానాన్ని సుగూరు సంస్థానము అని పిలిచేవారు. కానీ తర్వాత కాలంలో వనపర్తిని రాజధానిగా ఎంపిక చేసుకున్నారు. పరిపాలనా సౌలభ్యము కొరకు సంస్థానమును "సుగూరు" మరియు "కేశంపేట్" అను రెండు తాలూకాలుగా విభజించి, ఇద్దరు తహసీల్దారులను నియమించారు.



1823లో రాజా రామకృష్ణరావు తరువాత ఆయన దత్తపుత్రుడు మొదటి రామేశ్వరరావు సంస్థానాధీశుడయ్యాడు. ఆధునిక భావాలున్న రామేశ్వరరావు మంచి పరిపాలనదక్షుడు. తన రాజ్యపు చుట్టుపక్కల అమలులో ఉన్న బ్రిటీషు పాలనా విధానాలను అనుసరించే ప్రయత్నాలు చేశాడు. 1830 కాలంలో కొల్లాపూరు సంస్థానానికి వనపర్తి సంస్థానానికీ తీవ్రమైన ఘర్షణ జరిగిందని యాత్రాచరిత్రకారుడు ఏనుగుల వీరాస్వామయ్య పేర్కొన్నారు. ఈ వివాదంలో ఒకరినొకరు సైన్యసహితంగా యుద్ధం చేయడమే కాక ఒకరి గ్రామాలను మరొకరు కొల్లగొట్టి, గ్రామస్తులను హింసించి పాడుచేస్తున్నారని. 1843 మార్చి 17న నిజాము సికందర్ ఝా, రాజా రామేశ్వర రావుకు గౌరవ చిహ్నముగా "బల్వంత్" అను బిరుదును ప్రధానము చేశారు.

నిజాము తన సైన్యానికి రాజా రామేశ్వర రావును ఇన్స్పెక్టర్‌గా నియమించాడు. రాజా రామేశ్వర రావు ఎ, హైదరాబాదీ బెటాలియన్ 1853 నవంబర్ 5 న సృష్టించాడు. 1866లో ఆయన మరణము తర్వాత, ఈ బెటాలియన్ నిజాం సైన్యములో కలపబడి ఆ సైన్యానికి కేంద్రబిందువు అయ్యింది. మొదటి రామేశ్వర రావు తర్వాత ఆయన కుమారుడు రాజా కృష్ణ ప్రసాదరావు సంస్థానాధీశుడయ్యాడు.

1910లో రెండవ రాజా రామేశ్వరరావు, అబిస్సీనియులు, సొమాలీలు మరియు ఐరోపా అధికారులతో కూడుకొన్న అశ్విక దళాన్ని నిజామ్‌కి బహుకరించాడు. అదే ఆఫ్రికన్ క్యావలరీ గార్డ్స్ లేదా ఏ.సీ.గార్డ్స్ గా ప్రసిద్ధి చెందినది. ఈ ప్రత్యేక దళాన్ని అధికారిక లాంఛనాలలో నిజాం యొక్క భద్రత కొరకు ఉపయోగించేవారు.

"మహారాజ" రెండవ రాజా రామేశ్వరరావు, 1922 నవంబర్ 22 వ తేదీన మరణించాడు. ఈయనకు ఇద్దరు కుమారులు, కృష్ణదేవరావు మరియు రామదేవరావు. భారత దేశానికి స్వాతంత్ర్యము వచ్చిన తర్వాత ఈ కుటుంబము దేశ రాజకీయాలలో కూడా చురుకుగా పాల్గొన్నది.

వీర కృష్ణారెడ్డి; అష్టభాషి బహిరీ గోపాలరావు(1676–1690); వెంకటరెడ్డి (1691–1730); బహిరీ చిన గోపాలరావు (1731 – 1746); సవై వెంకటరెడ్డి (1746 –1763); రామకృష్ణరావు (1764– 1823); మొదటి రామేశ్వరరావు (1823 – 1866); కృష్ణ ప్రసాదరావు (1866 –1885); రెండవ రామేశ్వరరావు (1886– 1922); కృష్ణదేవరావు (1922 – 1944); మూడవ రామేశ్వరరావు (1944 – 1947);

ఈ సంస్థానము యొక్క నైరుతి భాగము గుండా కృష్ణానది 16 మైళ్ల దూరము ప్రవహించేది. కానీ, నదీతలము చాలా అడుగున ఉండటము మూలాన దాని జలాలు వ్యవసాయపారుదల కొరకు ఉపయోగపడటము లేదు. వనపర్తి పట్టణములో ఆ రోజుల్లో ఆముదము తయారుచేయుటకు ఒక నూనె మిల్లు ఉండేది. ఇక్కడి తయారు చేసిన ఆముదము రాయచూరు మరియు మద్రాసు ప్రెసిడెన్సీలోని కర్నూలుకు ఎగుమతి చేసేవారు. నూలు మరియు పట్టు వస్త్రాలు, చీరలు ఇక్కడ నేసేవారు.

వనపర్తి సంస్థానంలో చాలామంది కవులు తమ పాండిత్యాన్ని ప్రదర్శించి, సన్మాన సత్కారాలు పొందారు. వారిలో ఒక కవి అక్షింతల సింగర శాస్త్రి. ఇతడు అక్షింతల సుబ్బాశాస్త్రి రెండవ కుమారుడు. ఇతని స్వస్థలం రేపర్ల అనీ, జటప్రోలు వద్ద అయ్యవారిపల్లె అనీ వేరువేరు చోట్ల వ్రాయబడినది. ఇతను వనపర్తి స్థానాధీశుల ఆశ్రయంలో ఉండేవాడు. ఇతని రచనలు – అన్నపూర్ణాష్టకము, భాస్కర ఖండము, ద్వాదశ మంజరి, శ్రీశైల మల్లికార్జున పంచరత్నము మొదలగునవి. ఇతడు తర్కవేదాంత పండితుడు. వెంకటగిరి, గద్వాల, అనంతగిరి, ఆత్మకూరు ఆస్థానాలలో కూడా సన్మానాలు పొందాడు. స్వయంగా పాలకులైన బహిరీ పెద్ద గోపాలరావే గొప్ప విద్వాంసుడు. ' రామచంద్రోదయం ' అను శ్లేషకావ్యాన్ని, 'శృంగార మంజరి' అను భాణాన్ని సంస్కృతంలో రచించాడు. ' చంద్రాంగదోపాఖ్యానం ' రచించిన చింతలపల్లి సంజీవి, ' యాదవ భారతీయం ' రచించిన చెన్న కృష్ణయ్య, 'జగన్నాటకం' అను యక్షగానాన్ని రచించిన ఏదుట్ల శేషాచలం అను కవులు ఈ ఆస్థానానికి చెందినవారే. ❖

అమరచింత సంస్థానం

అమరచింత సంస్థానము, ఇప్పటి మహబూబ్ నగర్ జిల్లాలో 69 గ్రామాలు కలిగి దాదాపు 190 చ.కి.మీ.ల విస్తీర్ణములో వ్యాపించి ఉండేది. ఈ సంస్థానము యొక్క రాజధానిఆత్మకూరు. 1901 జనాభా లెక్కల ప్రకారము 34,147 జనాభాతో మొత్తము 1.4 లక్షల రెవిన్యూ ఆదాయము కలిగి ఉండేది. అందులో 6,363 రూపాయలు నిజాముకు కప్పముగా కట్టేవారు. సంస్థానము యొక్క రాజుల నివాస గృహమైన ఆత్మకూరు కోట ఇప్పటికీ పరిష్టముగా ఉన్నది. అమరచింత సంస్థానము చాలా పురాతనమైన సంస్థానము. సంస్థానము యొక్క దక్షిణ భాగమున గద్వాల సంస్థానము సరిహద్దున కృష్ణా నది ప్రవహిస్తున్నది. నదీ తీరము యొక్క ఎత్తు వలన నదీ జలాలు వ్యవసాయమునకు ఉపయోగించుటకు సాధ్యము కాదు. అమరచింత మరియు ఆత్మకూరు అత్యంత నాణ్యమైన మేలు మస్లిన్ బట్టతో నేసిన దస్తీలు, ధోవతులు, బంగారు మరియు పట్టు అంచులతో నేసిన తలపాగలకు ప్రసిద్ధి చెందినవి.

అమరచింత సంస్థానం ప్రస్తుతపు మహబూబ్ నగర్ జిల్లా లో ఆత్మకూరు రాజధానిగా ఉండేది. మొత్తం 69 గ్రామాలతో 190 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో వ్యాపించి ఉండేది. సంస్థానానికి దక్షిణాన గద్వాల సంస్థానము ఉండేది, దక్షిణ సరిహద్దున కృష్ణానది ప్రవహిస్తూండేది.

1901 నాటికి 1.4 లక్షల ఆదాయం కలిగి, అందులో 6,363 రూపాయలు నిజాంకు కప్పం కట్టేవారు.

కాకతీయుల కాలంలో గోన బుద్ధారెడ్డి అధీనంలో వర్ధమానపురం ఉండేది. దానికి గోపాలరెడ్డి అను వ్యక్తి దేశాయి గా ఉండేవాడు. అతని అమూల్య సేవలకు గుర్తింపుగా బుద్ధారెడ్డి క్రీ.శ. 1292లో మక్తల్ పరగణాను గోపాలరెడ్డికి నాడగౌడికంగా ఇచ్చాడు. గోపాలరెడ్డి అనంతరం ఆయన రెండో కుమారుడు చిన్న గోపిరెడ్డి నాడగౌడికానికి వచ్చాడు. మక్తల్ తో పాటు మరో నాలుగు మహళ్ళు గోపిరెడ్డి నాడగౌడికం కిందికి వచ్చాయి. ఆ నాలుగింటిలో అమరచింత ఒకటి. ఈ చిన్న గోపిరెడ్డి మనువడి పేరు కూడా గోపిరెడ్డే. ఇతనిని ఇమ్మడి గోపిరెడ్డి అని అంటారు. ఇతను క్రీ.శ. 1654 ప్రాంతానికి చెందినవాడు. ఇతని అన్నగారు సాహెబ్ రెడ్డి. వారసత్వంగా వచ్చిన అయిదు మహళ్ళలో సాహెబ్ రెడ్డికి మూడు మహళ్ళు పోగా, మిగిలిన రెండు మహళ్ళు వర్ధమానపురం, అమరచింత ఇమ్మడి గోపిరెడ్డి వంతులోకి వచ్చాయి. క్రీ.శ.1676 ప్రాంతంలో ఇమ్మడి గోపిరెడ్డి కుమారుడు సర్వారెడ్డి నాడగౌడికానికి వచ్చాడు. ఆ తర్వాత ఈ అమరచింత క్రమంగా వృద్ధిచెంది సంస్థానంగా రూపొందిందిళి2ది. సర్వారెడ్డి అభ్యుదయ విధానాలు కలవాడు. నీటి వనరులు పెంచడానికి పెద్దవాగుకు ఆనకట్ట కట్టించాడు. ఇతను ఔరంగజేబు సైన్యాలకు సాయం చేశాడు. తత్ఫలితంగా జండా, నగరా, 500 సవార్లు మొదలైన రాజలాంఛనాలు పొందాడు. ఇతని తరువాత మరో ఆరుగురు రాజులు ఈ సంస్థానాన్ని పాలించారు. అమరచింత సంస్థాన వంశము యొక్క వారసులలో ఒకడైన రాజా శ్రీరాం భూపాల్ మరణించిన తర్వాత అతని భార్యకు న్యాయబద్ధముగా సంస్థానము యొక్క వారసత్వము సంక్రమించినది.

ఈ సంస్థానాన్ని తిరుపతి కవులు సందర్శించారు. ఇక్కడి ప్రభువులను కలుసుకోవాలనే వారి కోరికకు ధర్మాధికారిగా పనిచేసే ఒక పండితకవి అడ్డుతగిలాడు. వారికి వీరికి వాదన జరిగినది. పండితకవి ప్రభువులకు చాడీలు చెప్పి, వీరికి ప్రభువుల సత్కారాన్ని దూరం చేశాడు. దీనితో ఆగ్రహించిన జంటకవులు ఆ అధికారిని అధిక + అరి అని చమత్కరిస్తూ, అన్యాపదేశంగా నిందిస్తూ 27 పద్యాలతో కూడిన లఘుకృతిని రచించారు. దీనికి శనిగ్రహం అని పేరు పెట్టారు. అందులో ఒక పద్యం....

ధరణీ నాయకుడుత్తముండవని నిన్ ధర్మాధికారమ్మునం
దు రహిన్నిల్పుట తుచ్ఛ బుద్ధివయి క్రిందున్ మీదునుం గాన కె
ల్లరి కార్యమ్ములు పాడుసేయుటకె? నీ లక్ష్యమ్ము మా బోటు తెం
చరు చండాల! శనిగ్రహంబ! యిక మా సామర్థ్య ముంజూడుమా!

బోరవెల్లి సంస్థానం

బోరవెల్లి, మహబూబ్ నగర్ జిల్లా, మానోపాడ్ మండలానికి చెందిన గ్రామము. ఈ గ్రామం హైదరాబాద్ నుండి కర్నూలుకు వెళ్ళు 7వ నెంబరు (కొత్త పేరు 44వ నెంబరు) జాతీయ రహదారి మార్గంలో ఉన్నది. రహదారిపై ఎడమవైపు కర్నూలుకు 25 కిలో మీటర్లకు ముందుగానే ఈ గ్రామం స్టేజి వస్తుంది. అక్కడి నుండి ఉత్తరానికి మూడు కిలో మీటర్ల దూరంలో ఈ గ్రామం ఉన్నది.

ఈ గ్రామానికి ఉత్తరాన పల్లెపాడు, రాజశ్రీగార్లపాడు గ్రామాలు, దక్షిణాన మానోపాడ్, నారాయణ్‌పూర్(ఎంజర్లపాడు) గ్రామాలు, తూర్పున జల్లాపూర్ గ్రామం, పశ్చిమాన ధర్మవరం గ్రామాలు సరిహద్దులుగా ఉన్నాయి. ప్రధానంగా ఈ గ్రామానికి ఒక కిలో మీటరు దూరంలోనే జల్లాపురం గ్రామం ఉంది. రెండు గ్రామాలు జంట గ్రామాలుగా ఉంటాయి. రెండిటిని వేరు చేస్తూ వర్షాకాలంలో ఓ పెద్ద వాగు ప్రవహిస్తుంటుంది. ఇక్కడి ప్రజల ప్రధాన జీవనాధారం వ్యవసాయమే. పత్తి, మిరప, కందులు, వేరుశనగ, ప్రొద్దుతిరుగుడు, మొక్కజొన్న, జొన్న మొదలగు పంటలు పండిస్తారు.

గ్రామంలో ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ఉన్నది. 8 వ తరగతి దాకా చదువుకొనె అవకాశం ఉంది. తదుపరి ఉన్నత పాఠశాల విద్యకొరకు విద్యార్థులు సమీపంలోని జల్లాపురం గ్రామంలో ఉన్న ఉన్నత పాఠశాలకు వెళ్ళవలసి వస్తుంది.

గ్రామంలో అన్ని మతాల ప్రార్థనాలయాలు ఉన్నాయి. హిందువులకు సంబంధించి శ్రీ ఆంజనేయస్వామి ఆలయం, శివాలయం, శ్రీచెన్నకేశవస్వామి ఆలయం ఉన్నాయి. అన్ని ఆలయాలు ఒకే ఆవరణలో ఉన్నాయి. శివాలయం, కేశవాలయం పాతకాలపు కట్టడాలు. బోరవెల్లి సీమ ప్రభువుల ఏలుబడిలో నిర్మించబడినవి. వీటిలో కేశవాలయం ప్రసిద్ధి చెందినది. ఇక్కడి కేశవస్వామికి బోరవెల్లి సంస్థాన కవులైన చింతలపల్లి ఛాయాపతి 'రాఘవాభ్యుదయం', లయగ్రాహి గరుడాచల కవి ' కౌసలేయ చరిత్రం 'అంకిత మీయబడినవి. ఈ దేవాలయంపై ఆకర్షణీయమైన శిల్పాలు ఉ న్నాయి. గుడి వెనుకపైపు భాగంలో కనిపించే ఓ శిల్పం ప్రత్యేకమైనది. ఇది జైన, వైష్ణవ సంప్రదాయ సమ్మిళితంగా కనిపిస్తుంది. కేశవాలయం ముందు భాగంలోని మండపం, ఆంజనేయస్వామి ఆలయం ఇటీవల కాలంలో నిర్మించబడినవి. గ్రామంలో బస్సు నిలయం దగ్గర ముస్లింల మజీదు ఉంది.

గద్వాల, కర్నూలు ప్రాంతాల నుండి బస్సు సౌకర్యం కలదు. 7వ నంబర్ జాతీయ రహదారికి మూడు కిలో మీటర్ల దూరంలో ఉ ంటుంది.

ఈ గ్రామానికి గొప్ప చారిత్రిక నేపథ్యం ఉంది. గద్వాల సంస్థానానికి ముందే బోరవెల్లి సంస్థానంగా ఓ వెలుగు వెలిగిన గొప్ప ప్రాంతమిది. ఎందరో కవి పండితులను పోషించిన నేల ఇది. ఈ సంస్థానానికి మూల పురుషుడు నల్లారెడ్డి. మిడిమిళ్ళ గోత్రజులు. వీరి ఇలవేల్పు పోల్గంటి సోమేశ్వరుడు. ఇతనికి మల్లాంబ, తిమ్మాంబ అను ఇద్దరు భార్యలు ఉండేవారు. మల్లాంబకు పెద సోమభూపాలుడు, తిమ్మాంబకు చిన సోమభూపాలుడు అను కుమారులు కలిగారు. పెద సోమభూపాలుని భార్య లక్ష్మమ్మ, వీరి కుమారుడు వెంకటపతి. చిన సోమభూపాలుడి భార్య గిరియమ్మ. ఈమె గద్వాల సంస్థానానికి చెందిన ఆడపడుచు. గద్వాల సంస్థానాధిపతి అయిన పెద శోభనాద్రి, ఆయన భార్య లింగమాంబలు గిరియమ్మ తల్లిదండ్రులు. బోరవెల్లి చిన సోమభూపాలుడు, గిరియమ్మ దంపతులకు సంతానం లేకపోవడంచే పెద సోమభూపాలుని కుమారుడైన వేంకటపతిని దత్త పుత్రునిగా తీసుకున్నారు. గిరియమ్మ తన పుట్టినింటివారిలాగే ఎందరో కవిపండితులను పోషించి మంచి కవిపోషకులుగా పేరు సంపాదించారు. వేంకటపతి కూడా తల్లికి తగ్గ కుమారుడిగానే కవులను పోషించారు. ఈ వెంకటపతే బోరవెల్లి సంస్థానాన్ని 1668 లో గద్వాల సంస్థానంలో విలీనం చేసాడు. తరువాత గద్వాల, బోరవెల్లి ఉమ్మడి సంస్థానాలకు ఏలికయ్యాడుళి3రి. దీనితో ఇక్కడి కవులు గద్వాల సంస్థానానికి బదిలీ అయ్యారు. అందుకే 'గద' (గదాయుధం), 'వాలం' (కత్తి) కలిగిన సంస్థానానికి 'గంటం' (కలం) జోడించిన ఖ్యాతి బోరవెల్లికి దక్కిందంటారు.

బోరవెల్లి సీమలో ఎంతో మంది కవులు తమ ప్రతిభా నైపుణ్యాలను ప్రదర్శించి ప్రభువుల ఆదరణకు నోచుకున్నారు. గద్వాల సంస్థానానికి ముందే కవి పండితులకు నిలయమిది. దత్తన్న, మల్లన మంత్రి, కృష్ణప్ప, బోరవెల్లి నృసింహకవి, పూడూరు కృష్ణయామాత్యుడు, రేటూరి రంగరాజు, చింతలపల్లి ఛాయాపతి, లయగ్రాహి గరుడాచల కవివంటి ఎందరో కవులు ఇక్కడివారే.

జటప్రోలు సంస్థానం

జటప్రోలు సంస్థానము మహబూబ్ నగర్ జిల్లాలో కృష్ణానది తీరాన వెలిసిన ఒక అత్యంత ప్రాచీనమైన చారిత్రక సంస్థానము. ఈ సంస్థానాధీశులు కొల్లాపూరును రాజధానిగా చేసుకొని పరిపాలించడం వల్ల ఈ సంస్థానాన్ని కొల్లాపూరు సంస్థానమనికూడా వ్యవహరిస్తారు. వీరు మొదట జటప్రోలు రాజధానిగా పాలించి తర్వాత కొల్లాపూర్, పెంట్లవెల్లి రాజధానులుగా పాలించారు. ఈ సంస్థానం కృష్ణా నది ఒడ్డున ఉన్న సువిశాలమైన నల్లమల్ల అటవీ ప్రాంతమునందు విస్తరించి ఉండేది. వీరి పాలన ఎప్పుడు ప్రారంభమైందనే విషయం ఖచ్చింతంగా వెలుగులోకి రాలేదు. అయితే చారిత్రక పరిశోధకుల ప్రకారం క్రీ.శ.6-7 వ శతాబ్దిలో వీరి పాలన ప్రారంభమైనట్లు తెలుస్తుంది. పాలకులందరూ సురభి వంశస్థులే. అందుకే వీరికి సురభి సంస్థానాధీశులందురు. ఈ సంస్థానములో క్రీ.పూ. 2వ శతాబ్దముకు చెందిన పురావస్తు సంపదల ఆనవాళ్లు కలవు. 1500 సంవత్సరాలకు పూర్వము కట్టించిన అనేక వందల పురాతన దేవాలయములను నేటికీ ఇక్కడ చూడ వచ్చును. కృష్ణానది ఒడ్డునే కల సోమశిల దేవాలయం ఈ సంస్థానానికే చెందినది. నిజాము యొక్క పరిపాలనలో జటప్రోలు సంస్థానము చెప్పుకోదగిన పాత్ర పోషించినది. స్వాతంత్ర్య సమరయోధుడు మందుముల నర్సింగరావు ఈ సంస్థానాధీశుల బంధువే. ఇతను కొల్లాపూర్ నుంచి ఎన్నికై మంత్రి పదవి కూడా చేపట్టాడు.

పిల్లలమర్రి బేతల రెడ్డి / నాయుడు జటప్రోలు సంస్థానాధీశుల



యొక్క మూలపురుషుడే కాక, గంజాం జిల్లాలోని బొబ్బిలి రాజ వంశము, గోదావరి జిల్లాలోని పిఠాపురం, కృష్ణా జిల్లా లోని మల్లేశ్వరం మరియు నెల్లూరు జిల్లాలోని వెంకటగిరి మొదలైన రాజ వంశములకు మూలపురుషుడని భావిస్తారు. 15వ శతాబ్దం చివరిలో ఈ వంశానికి చెందిన మాదానాయుడు కృష్ణ, తుంగభద్ర సంగమ సమీపంలోని జటప్రోలు ప్రాంతానికి వచ్చి అక్కడ కోటను కట్టడం ప్రారంభించాడు. మూడు తరాల తర్వాత ఈయన వారసులలో ఒకడైన మల్ల భూపతినాయుడు 1507లో విజయనగర రాజులనుండి ఈ ప్రాంతాన్ని పాలించడానికి సనదు (ప్రభుత్వ ఉత్తర్వు)ను పొందాడు. కృష్ణదేవరాయల పట్టాభిషేకానికి వెలుగోటి నాయకునిగా విచ్చేసిన సామంతుడు ఈయనేనని చరిత్రకారుల అభిప్రాయం. కాకతీయ, విజయనగర సామ్రాజ్యాలు ఈ సంస్థానాధీశులకు సైనిక పోషణకై పట్టాలిచ్చారు. కానీ ఆయా సామ్రాజ్యాల పతనం చెందినప్పుడు సంస్థానాధీశులు చాకచక్యంతో తమ రాజ్యాన్ని నిలబెట్టుకొని దక్షిణాపథంలో కొత్తగా ఆవిర్భవించిన శక్తులతో మనగలిగారు. 1513లో అప్పుడే కొత్తగా ఏర్పడిన గోల్కొండ సామ్రాజ్యంపై దండయాత్రకు సన్నాహాలు చేస్తూ, కృష్ణదేవరాయలు యుద్ధబలగాలను బేరీజు వేయటానికి, ఇతర సామంతులతో పాటు జటప్రోలు రాజు వెలుగోటి యాచమ నాయున్ని కూడా పిలిపించాడు. ఆ సంవత్సరం రాయచూరు అంతర్వేదిలో జరిగిన యుద్ధంలో జటప్రోలు సంస్థానము కూడా పాల్గొన్నది. ఔరంగజేబు దక్షిణాపథంపై దండెత్తి కుతుబ్‌షాహీలను ఓడించినప్పుడు స్థానిక రాజవంశాలను నిర్మూలించక, వాటిని తన నియమించిన దండనాయకుని ఆధీనంలో వీటిని తన రాజ్యంలో సామంతులుగా విలీనం చేసుకున్నాడు. అప్పటి నుండి జటప్రోలు సంస్థానం యొక్క స్వాధికారత మరియు ప్రాబల్యం పెరగటం ప్రారంభమైంది. అప్పటి సంస్థానాధీశుడు గోపాలరావు జటప్రోలు యొక్క ప్రాబల్యాన్ని దక్షిణాన జటప్రోలు నుండి ఉత్తరాన పానగల్, యల్లల్ల వరకు విస్తరించి పటిష్ఠపరచాడు. 1694లో సంస్థానాధీశుడైన నరసింగరావు మొఘలులపై తిరుగుబాటు చేసి మొఘలుల మల్లయోధున్ని బంధించి, గంజికోట (గండికోట) మరియు శ్రీకాకుళంపై ఆధిపత్యం కావాలని పట్టుబట్టాడు. మొఘలులు ఈయన్ను తృప్తిపరచడానికి వీటిపై అధికారమిచ్చారు. జటప్రోలుకు తొంభై మైళ్ళు దక్షిణాన ఉన్న గండికోటను అడగటంలోని ఆర్ధం ఉంది కానీ, ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళం అడగటానికి హేతువు తెలియుటలేదు. ళి2రి

19వ శతాబ్దం చివరలో జటప్రోలు సంస్థాధీశునికి సంతానము కలుగక వారసుడు లేని పరిస్థితి వచ్చింది. అప్పటికే పొరుగు సంస్థానాలైన వనపర్తి, గద్వాలలో జరుగుతున్న వారసత్వపు పోరులను గమనించిన జటప్రోలు రాజు, ముందు జాగ్రత్త చర్యగా వెంకటగిరి రాజకుమారున్ని దత్తత పుచ్చుకున్నాడు. ఈయన జటప్రోలు రాజా సింహాసనము అధిరోహించిన తర్వాత తన అసలు పేరు నవనీతకృష్ణ



యాచేంద్రను విడిచి రాజా వెంకట లక్ష్మణరావు బహుదూర్ అనే పట్టము స్వీకరించాడు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు. వెంకట లక్ష్మణరావు 1929లో మరణించాడు.

జటప్రోలు సంస్థానాన్ని సుమారు పదహారు తరాలుగా కొన్ని శతాబ్దాల పాటు పరిపాలన కొనసాగించిన 'సురభి' రాజులంటే కొల్లాపూర్ ప్రాంత జనులకు వల్లమాలిన అభిమానం. వీరి పరిపాలన 7, 8 వందల సంవత్సరాల క్రితం నుంచే ప్రారంభమైనట్లు చరిత్రకారులు చెబుతారు. కొల్లాపూర్ ప్రాంతంలో చారిత్రక భవనాలు, దేవాలయాలతో పాటు అనేకం సురభి రాజ వంశీయులు నిర్మించినవే. జటప్రోలు సంస్థానాధీశుల కోటను మల్ల నాయుడు నిర్మించగా, సింగపట్నంలోని నృసింహసాగరాన్ని మాధవరాయుడు, పెంట్లవెల్లి గ్రామంలోని కోటను, చెరువును, శివ కేశవాలయాన్ని చిన్నమాధవ రావు, కొల్లాపూర్ కోటను ప్రథమ వేంకటలక్ష్మా రావు, జటప్రోలుమదన గోపాల స్వామి ఆలయాన్ని మాధవరాయులు, బెక్కం, చిన్నమారూరు కోటల్ని నరసింగ రావులు నిర్మించారు. వీటితో పాటు శింగవట్నంలోని శ్రీవారి సముద్రం, జటప్రోలు హజ్రత్ ఇనాయత్ షా ఖాద్రి దర్గా, అద్దాల మేడ, కొల్లాపూర్‌లోని న్యాయ దర్బార్‌గా పిలిచే గుండు బంగ్లా, జైలు ఖానాలను సురభి రాజులు వారి పాలనలో నిర్మించారు.

సురభి వంశస్తుల పాలనలో కొల్లాపూర్ ప్రాంతం చాలా అభివృద్ధి చెందింది. 1871లో నిర్మించిన కొల్లాపూర్ రాజా బంగ్లాను చంద్ర మహల్, మంత్ర మహల్, రాణి మహల్ గా విభజించి సుందరంగా నిర్మించారు. 140 సంవత్సరాల క్రితం నాటి మునసబ్ కోర్టు జిల్లాలోనే ప్రథమ న్యాయస్థానం ఇక్కడ కలదు. కొల్లాపూర్ పట్టణంలో విశాలమైన రహదారులు, రహదారులకిరు వైపులా చెట్లు, డ్రైనేజీ వ్యవస్థ ఆనాడే ఏర్పాటు చేసారు. జనరేటర్ ఉపయోగించి విద్యుత్తును వినియోగించిన ఘనత కూడా వారికే దక్కుతుంది. త్రాగునీటి సరఫరా పైపులైను ఏర్పాటు చేసి కుళాయిలు ఆనాడే ఏర్పాటు చేసారు. 18 వ శతాబ్దం కాలంలోనే జటప్రోలు సంస్థానాధీశుల అధ్వర్యంలో కొల్లాపూర్ పట్టణంలో పేదలకు ఉచితంగా వైద్య సేవలు అందించేందుకు ధర్మాసుపత్రిని కూడా ఏర్పాటు చేసారు. హైటెక్ పరిజ్ఞాన వినియోగంలో సురభి వంశస్థులదే అందె వేసిన చేయి. సురభి వంశస్థులు ప్రపంచ విపణిలో ఏ కొత్త వస్తువు వచ్చినా వాటిని వినియోగించుకునేవారు. వీరికి ఒక సొంత విమానం కూడా ఉండేదని. దానికి ఎయిర్ పోర్టుగా కొల్లాపూర్ పట్టణంలోని జఫర్ మైదానాన్ని ఉపయోగించినట్లుగా చెబుతారు.


సురభి రాజ వంశ వారసుడైన బాలాదిత్య లక్ష్మారావు (ఇతను సంస్థానం చివరి రాజు జగన్నాథరావు కుమారుడు) హైదరాబాదులో నివాసం ఏర్పరుచుకున్నారు. కొల్లాపూర్ సంస్థానానికి మంత్రిగా పని చేసిన మియాపురం రామక్రిష్ణారావు ప్రముఖ బ్రాహ్మణుడు. వీరు గొప్ప కవి. ఎన్నో గేయాలు రచించారు. ❖





చదవండి....! **సంస్కార సమాజం కోసం... ఏది సంవత్సరాల ధార్మికోద్యమం** చదివించండి...!!

'దర్శనమ్' ఆధ్యాత్మిక వార్తా మాసపత్రిక

జగద్గురువుల ఆశీస్సులతో... ఉద్దండులైన పండితుల రచనలతో తాజా ఆధ్యాత్మిక వార్తలు, పాఠక దేవుళ్ళ ఆదరణే కొండంత అండగా విశ్లేషణలతో గత 12 సంవత్సరాలుగా అందరి అభిమానాన్ని సంపాదిస్తూ దినదిన ప్రవర్ధమానంగా వెలుగొందుతోంది 'దర్శనమ్' పత్రిక. అనేక వ్యయప్రయాసలకోర్చి ఉన్నత విలువలు, ప్రమాణాలతో.. ఉత్తమ ఆధ్యాత్మిక పత్రికగా మన్ననలందుకుంటున్న ఈ పత్రికను వదాన్యులైన దాతలు చేయూతనందించి పత్రిక నాలుగు కాలాలపాటు నిలిచిపోయేలా సహకరించవలసిందిగా కోరుతున్నాము. త్వరలోనే ఏర్పాటు చేయబోతున్న 'దర్శనమ్' శాశ్వతమూలనిధికి ఇతోధికంగా తోడ్పడాల్సిందిగా వినమ్రంగా ప్రార్థిస్తున్నాము.











'దర్శనమ్' చందా వివరములు

సంవత్సర చందా	రూ.	300
మూడు సంవత్సరాలకు	రూ.	900
ఆరు సంవత్సరాలకు	రూ.	1800
జీవిత చందా (12 సం॥లు)	రూ.	3600
విశిష్ట చందాదారులు	రూ.	5000
రాజపోషకులు	రూ.	10000
మహారాజ పోషకులు	రూ.	25000

విదేశీ చందా వివరములు

సంవత్సర చందా (50 డాలర్లు)	రూ.	4500
మూడు సంవత్సరాలకు	రూ.	12000
ఆరు సంవత్సరాలకు	రూ.	24000
జీవిత చందా (12 సం॥లు)	రూ.	48000
విశిష్ట చందాదారులు	రూ.	60000
రాజపోషకులు	రూ.	80000
మహారాజ పోషకులు	రూ.	100000

దర్శనమ్ ఆధ్యాత్మిక వార్తా మాసపత్రిక

ఇ.నెం. 29-105/4/1, శ్రీరామ సిద్ధాంతి భవనం, న్యూ విద్యానగర్,
నేరేడ్‌మెట్, సికింద్రాబాద్ - 500 056. ఫోన్ : 040-27220401, 94410 15469
editordarshanam@gmail.com, d_darshanam@yahoo.co.in

'Darshanam' Syndicate Bank A/c. No. 30632010015813 IFSC Code : SYNB0003063

ఉద్యమాల నేపథ్యం... ఘనచరిత సొంతం

కృష్ణాతీర నల్లగొండ జిల్లా విశిష్టత...

డా॥ సాగి కమలాకర శర్మ

బసవపురాణము పసమీద పలికిన
సోమన్న మసలిన సీమ యెచట?
సంగీత సాహిత్య సరస సర్వజ్ఞుడు
సింగభూపాలుని రంగమెచట?
తన రాణిగా వాణి దలచి మెప్పించిన
పినవీరభద్రుని జననమెచట?
భక్తి సుధలు చిల్క భాగవతమ్మును
వ్రాసిన పోతన్న గ్రామమెచట?
సూరివరులు మరింగంటి సుకవులెల్ల
ఎచట సాగించిరాంధ్ర సాహిత్య సేవ?
అది తెలంగాణ చరితలో మొదట నిలుచు
"నల్లగొండ" యశస్సులో "తెల్లకొండ"


అంటూ వేదాటి రఘుపతిగారు కీర్తించబడిన ఈ పద్యం నల్లగొండ జిల్లాలో ఎన్ని విశేషాంశాలు ఉన్నాయో మనకు వివరిస్తుంది. తెలంగాణలో విప్లవ కేతనం ఎగురవేసిన జిల్లాల్లో నల్లగొండ ప్రథమస్థానంలో ఉంటుంది. అంతేకాదు ఏ జిల్లాకు లేనివిధంగా విశేషంగా 7 జిల్లాలను సరిహద్దులుగా కలిగి ఉంది. అవి ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణ, గుంటూరు, తెలంగాణలోని మహబూబ్‌నగర్, రంగారెడ్డి, మెదక్, వరంగల్, ఖమ్మం జిల్లాలు. ఈ జిల్లా తెలంగాణకు ఆంధ్రప్రదేశ్‌కు వారధిగా ఉంది.

నల్లగొండకు పూర్వం నీలగిరి అనే పేరు ఉండేది. ఇది పానగల్లు రాజ్యంగా ఉండేది. కాకతీయులు పానుగుల్లను పాలించే సమయంలో దీనిని "ఏఱువ సింహాసనం"గా పిలిచేవారు. క్రీ.శ. 1357-58 ప్రాంతంలో అల్లావుద్దీన్ హసన్ "నీలగిరి"ని ఆక్రమించి దీన్ని "నల్లగొండ"గా పేరు మార్చినాడు.

ప్రాచీన కాలంనుండి ఈ నల్లగొండ జిల్లా తనదైన అస్తిత్వాన్ని నిలుపుకుంటూ ఒక ప్రత్యేక నాగరికతను అభివృద్ధి పరుచుకుంది. మొదట ఈ ప్రాంతం మౌర్యుల రాజ్యంలో భాగంగా ఉండింది. ఆ తరువాత ఇక్ష్వాకులు, పల్లవులు పరిపాలించారు. విష్ణుకుండిన సామ్రాజ్యం ఈ ప్రాంతం నుండి ప్రారంభమైంది. స్థానికంగా కందూరుచోడులు ఈ ప్రాంతంలోని కొలనుపాక, పానుగల్లు పట్టణాలను రాజధానిగా చేసుకున్నారు. అనేకమంది సామంతరాజులు ఈ ప్రాంతంలో స్వతంత్రించి చిన్న చిన్న రాజ్యాలు ఏర్పాటు చేసుకున్నారు. అందులో ముఖ్యులు కాయస్థులు, రేచర్ల పద్మనాయకులు, రేచర్ల రెడ్డి వంశీయులు, చెరకు వంశీయులు, ముసునూరి వంశీయులు. బహ్మనీ సుల్తానులు, గోలకొండ కుతుబ్షాహీలు, మొగలులు, ఆసఫ్జాహీ వంశీయులు ఈ ప్రాంతాన్ని తమ పరిపాలనలోకి తీసుకుని అభివృద్ధి చేసినారు.

నాగరికత అనేది నదీ పరీవాహక ప్రాంతాల్లోనే ఎక్కువగా వృద్ధి చెందుతుంది. నల్లగొండ జిల్లాలో ప్రవహించే అతి పెద్ద నది కృష్ణ. ఈ కృష్ణవేణమ్మకు అనేక ఉపనదులు, వాగులు తోడై, జిల్లాను సస్యశ్యామలం చేస్తూ వాడపల్లి వద్ద ఈ జిల్లాను దాటుతుంది. కృష్ణానదికి ఉపనది మూసీ. ఇది రంగారెడ్డి జిల్లాలోని అనంతగిరి కొండల్లో పుట్టి వాడపల్లి వద్ద కృష్ణమ్మ సంగమిస్తుంది. అదే విధంగా మూసీ నదికి చిన్నయేరు ఆలేరు, బిక్కేరు నదులు ఉపనదులుగా ఉన్నాయి. డిండి, పెదవాగు నదులు దేవరకొండ వద్ద ప్రవహించి, కృష్ణానదిలో కలుస్తున్నాయి. అహల్యానది కనగల్లు వాగుతో కలిసి కృష్ణానదిలో లీనమవుతుంది. చిన్నేరు రామన్నపేట దగ్గరలో సంగెం ప్రాంతంలో మూసీలో సంగమిస్తుంది. పాలేరు నది నల్లగొండ, ఖమ్మం జిల్లాలను వేరు చేస్తూ ప్రవహిస్తుంది.





జిల్లాలో ఎన్నో స్థల, గిరి దుర్గాలున్నాయి. వాడపల్లి జలదుర్గం కూడా ఉంది. కొలనుపాక, నారాయణపురం, ఇంద్రపాల నగరం (తుమ్మలగూడెం), విజయపురి (నాగార్జున కొండ), పానగల్లు, బేతవోలు, వర్ధమానుకోట, గోరువంకపల్లి, తిరుమలగిరి, అరవపల్లి, పిల్లలమఱ్ఱి, భువనగిరి, రాచకొండ, దేవరకొండ వంటి మహా నగరాలున్నాయి. ఈ నగరాలు చారిత్రక, సాంస్కృతిక, మత, రాజకీయంగా ఎంతో వృద్ధిచెంది ఇతర జిల్లాల కంటే ప్రత్యేకమైన సంస్కృతిని, నాగరికతను కలిగి తెలంగాణాకే గర్వకారణంగా నిలిచింది. అడవి దేవులపల్లి, మిర్యాలగూడ, దేవరకొండ ఈ మూడు ప్రాంతాల్లోని కొంత భాగాన్ని 'తంగెడు సీమ' అనేవారు. విజయనగర రాజుల కాలంలో జరిగిన రాక్షస తంగెడు యుద్ధం ఇక్కడే జరిగి ఉండవచ్చని చారిత్రకుల ఊహ. ఇక్కడ పానగల్లు – కందూరి చోడులు, ఇంద్రపాల నగరం – విష్ణుకుండినులు ఈ రెండు పట్టణాలు వీరికి రాజధానులుగా ఉండి రాజకీయంగా వారి సామ్రాజ్య విస్తరణకు దోహదపడినాయి.

ప్రాచీన బౌద్ధమత కేంద్రాలలో విజయపురి ప్రఖ్యాతమైంది. ఇది నాగార్జున సాగరం ముంపులో మునిగిపోయింది. పురావస్తు శాఖవారు జరిపిన తవ్వకాలలో అనేక ఆరామాలు, విరాహాలు, చైత్యాలు వెలుగులోకి వచ్చాయి. ప్రపంచ ప్రసిద్ధిపొందిన బౌద్ధ విశ్వవిద్యాలయం ఆచార్య నాగార్జునుడి పర్యవేక్షణలో వెలుగొందింది. ఇక్ష్వాకులకు రాజధానిగా ఉన్న ఈ విజయపురి ప్రాచీన భారతీయ తర్కము, వైద్యము వంటి శాస్త్రాలకు పట్టుకొమ్మగా నిలిచింది.

ఈ జిల్లాలో భువనగిరి, దేవరకొండ, రాచకొండ, సిరికొండ,ఇంద్రపాల గుట్ట, అరవపల్లి, ఉర్లుగొండ, ఉంద్రుగొండ, పొడిచేడు, వేములకొండ, అనంతగిరి వంటి దుర్గాలున్నాయి. ఆమనగల్లు, కొలనుపాక, అనుముల, కన్నెకల్లు, పిల్లలమఱ్ఱి, జమ్ములూరు, రాజపేట, సిరిపురం, మునగాల, నడిగూడెం, రేపాల, లింగగిరి, బేతవోలు వంటి సంస్థానాలు, స్థల దుర్గాలు జిల్లాను చారిత్రకంగా అగ్రభాగాన నిలిపినవి. దేవరకొండ దుర్గం ఏడు కొండలను కలుపుకొని కట్టిన అతిపెద్ద కోట. రాచకొండ, దేవరకొండలు పద్మనాయకులకు రాజధానిగా విలసిల్లినాయి.

మతపరంగా ఈ జిల్లాలో జైనం, బౌద్ధం, వైదికం, మహ్మదీయాలు విలసిల్లినాయి. ప్రపంచ ప్రసిద్ధిపొందిన జైన పుణ్యక్షేత్రం కొలనుపాక ఈ జిల్లాలో ఉంది. శాసనాల్లో ఈ కొలనుపాకకు కొలిపాక, కుల్పాక, కొట్టీయపాక, కొల్లియపాక, కొట్టిపాక, కొల్లిహాకి అనే పేర్లు కనిపిస్తున్నాయి. ఇక్కడ కొన్ని కోట్ల విలువైన పచ్చ మహావీరుడి విగ్రహం ఉంది.

నల్లగొండ జిల్లాలో ఇక్ష్వాకులకు విజయపురి రాజధానిగా ఉండింది. వైదిక మతావలంబులైన ఇక్ష్వాకులు, విష్ణుకుండినులు పరమత సహనంతో బౌద్ధమతాన్ని విశేషంగా ఆదరించి అనేక ఆరామాలు, విహారాలు బౌద్ధసన్యాసులకు వసతి గృహాలు కట్టించినారు. జిల్లాలో 30 మైళ్ళ పరిధిలో ఫణిగిరి, గాజులబండ, వర్ధమానుకోట, తిరుమలగిరి, అరవపల్లి, ఇంద్రపురి ప్రాంతాలలో ఆరు బౌద్ధ ఆరామాలు విలసిల్లినాయి. ఇది ఈ జిల్లా ప్రత్యేకత.

ప్రసిద్ధ వైష్ణవ, శైవ క్షేత్రాలు ఈ జిల్లాను ధార్మికంగా, ఆధ్యాత్మికంగా పురిపుష్టం చేస్తూ ప్రజలను సన్మార్గం వైపు నడిపిస్తున్నాయి. తెలంగాణాలో రెండవ తిరుపతిగా ప్రసిద్ధిపొందిన యాదగిరిగుట్ట లక్ష్మీనృసింహ స్వామి భక్తులకు యోగ, ఉగ్ర, జ్వాల, లక్ష్మీ నృసింహుడిగా దర్శనమిస్తున్నాడు. ఈ జిల్లాలో సుమారు 30 వరకు నరసింహాలయాలు ఉన్నాయి. కృష్ణా తీరంలోని పంచనారసింహ క్షేత్రాల్లో వాడపల్లి, మట్టపల్లులు ఈ జిల్లాలోనివే.

ఇంకా వేములకొండ నారసింహస్వామి, వాడపల్లి, సిరికొండ, చందుపట్ల, రేపాల, సిరిసినగండ్ల, షాపల్లి, స్తంభగిరి (రాచకొండ), బుజిలాపురం, ముదిగొండ మొదలైన ప్రాంతాలలో నారసింహ క్షేత్రాలు మహిమాన్వితంగా వెలుగొందుతున్నాయి.

అహల్యానది తీరంలో పేరూరు స్వయంభూ సోమేశ్వరాలయం ప్రసిద్ధ శైవ క్షేత్రం. ఇక్కడ వర్తక సంఘాలుండేవి. శైవాచార్యుల గురించి మఠాలు నిర్మించబడ్డాయి. అష్టపదుల రచయిత జయదేవుని భార్య పద్మావతి పేరూరు గ్రామవాసి అని చారిత్రక ఆధారాల వల్ల తెలుస్తుంది.

నల్లగొండకు దగ్గరలో చెర్వుగట్టు, జడల రామలింగేశ్వర స్వామి చాలా మహిమ గల దేవుడిగా ప్రసిద్ధిపొందినాడు. గోపులాయపల్లి వేణుగోపాల స్వామి ఆలయం కూడా నార్కట్‌పల్లికి దగ్గర్లో ఉంది. పానగల్లు, పచ్చల సోమేశ్వరాలయం, ఛాయా సోమేశ్వరాలయాలు ఆనాటి వాస్తు, శిల్ప కళలకు పరాకాష్టగా నిలుస్తాయి. చారిత్రకంగా ప్రసిద్ధిపొందిన పిల్లలమఱ్ఱిలో ఎరుకసాని నిర్మించిన త్రికూటేశ్వర ఆలయం ఉంది. జిల్లాలో మూడు సూర్యదేవాలయాలున్నాయి. అవి అర్కవరం (నకిరేకల్ మం.), దేవరకొండ వద్ద బోడిగుట్ట పైన చిన్న సూర్యదేవాలయం, అడవిదేవులపల్లిలో సూర్య దేవాలయం.

మత సమైక్యకు ప్రతీకగా ఈ జిల్లాలో జాన్‌పాడ్ దర్గా కనిపిస్తుంది. హిందువులు చాలా మంది దర్గాకు వెళ్ళి మొక్కులు చెల్లిస్తారు. అదేవిధంగా నల్లగొండ, భువనగిరి ఉర్సు ఉత్సవాల్లో వేలాదిగా

హిందువులు పాల్గొంటారు. ఈ విధంగా జిల్లాలో జైన, బౌద్ధ, శైవ, వైష్ణవ, మహ్మదీయ మతాలకు సంబంధించిన చారిత్రక ప్రాధాన్యం కలిగిన ప్రదేశాలు ఉన్నాయి.

సాహిత్యపరంగా ఈ జిల్లాకు ఎంతో కీర్తి ఉంది. పాల్కురికి సోమన, బమ్మెర పోతన ఈ జిల్లాలోని వారే. జిల్లా పునర్విభజన సమయంలో జనగామ తాలూకా వరంగల్ జిల్లాలో చేరింది. వీరు ఈ తాలూకా వారే. నల్లగొండ జిల్లా సాహిత్యప్రియులకు ఇది తీరని వెలతి.

రాచకొండ రాజ్యంలో కొరవి సత్యనారనకు 'ఆంధ్ర కవితా పితామహుడు' అనే బిరుదుంది. ఇతడు 14 వ శతాబ్ది వాడు. అల్లసాని పెద్దకు పూర్వమే ఈ బిరుదు నల్లగొండ జిల్లా కవికి సొంతమైంది.

ద్విపదలో హరిశ్చంద్రోపాఖ్యానం రాసిన గౌరన, భాస్కర రామాయణం యుద్ధకాండ పూర్తి చేసిన శాకల్య అయ్యలార్యులు 'సింహాసన ద్వాత్రింశక' రచయిత కొరవి గోపరాజు, 'వాణి నా రాణి' అని పలికిన పిల్లలమఱ్ఱి పినవీరభద్రుడు, విభూతి పత్రికా సంపాదకులు చిదిరెమఠం వీరభద్రశర్మ, చందాల కేశవదాసు, ఆంధ్ర నామ సంగ్రహం అనే పేర వ్యంగ్య కృతి రచించిన శేషభట్టరు వేంకట రామానుజాచార్యులు, భక్తకవి శిఖామణి నరహరి గోపాలాచార్యులు, ముస్లింలై ఉండి దేవరకొండలోని శివాలయంలో కూర్చొని రచనలు చేసిన సయ్యదలీ, అజ్మదుల్లా సోదరులు, సాహితీమేఖల వ్యవస్థాపకులు అంబటిపూడి వేంకటరత్నం, జిల్లాలో మొదటి పత్రిక (నీలగిరి) ను ప్రారంభించిన షబ్నవీసు వేంకట రామ నరసింహారావు, వట్టికోట ఆళ్వార్ స్వామి, సిరిప్రగడ భార్గవి రావు, ధవళ శ్రీనివాసరావు, గంజి గోవర్ధన్, గూడ సుమిత్రా దేవి, ప్రముఖ చారిత్రక, శాసన పరిశోధకులు, మూసీ పత్రిక వ్యవస్థాపకులు బి. ఎన్. శాస్త్రి, కవిరత్న నీలాజంగయ్య, సంస్కృతాంధ్ర ఆంగ్ల భాషాకోవిదుడు ఆచార్య లక్ష్మణ మూర్తి, శ్రీరంగాచార్య, వ్యాకరణ పండితుడు ఆచార్య రవ్వా శ్రీహరి, ప్రముఖ కవి రచయిత ఆచార్య గోపి, రావి భారతి, రావి ప్రేమలత, డా॥ ముదిగంటి సుజాతారెడ్డి, అండమ్మ, డా॥ పెన్నా శివరామకృష్ణ, తిరునగరి, బోయ జంగయ్య, గురిజాల రామశేషయ్య, కొలనుపాక మురళీధర రావు, రాములు, బి. జగన్నాథ్, డా॥ పెన్నా మధుసూదన్, డా॥ వారణాసి వీరనారాయణ శర్మ, డా॥ వారణాసి భిక్షమయ్య శర్మ, వారణాసి వేంకటేశ్వర్లు, డా॥ కూరెళ్ళ విఠలాచార్య, పేరాల సత్యనారాయణ శర్మ, డా॥ నోముల సత్యనారాయణ, సుదర్శన్, డా॥ చింతల యాదయ్య, డా॥ రామడుగు శ్రీమన్నారాయణ శర్మ, వేదాటి రఘుపతి, డా॥సూర్యా ధనుంజయ్, సుంకిరెడ్డి నారాయణరెడ్డి, డా॥ ఎస్. రఘు, రాధేయ, కుర్రా జితేంద్రబాబు లాంటి ప్రముఖులు జిల్లా



సాహిత్యాన్ని పరిపుష్టం చేసినారు. అంతేకాకుండా క్రీ.శ. 1400 నుంచి నేటి వరకు సాహిత్య సేవ చేస్తోన్న మరింగంటి కవులందరూ ఈ జిల్లావారే.

నల్లగొండ జిల్లా ఉద్యమాలకు నిలయం. చాలా మంది స్వాతంత్ర్య సమరయోధులు, విప్లవవీరులు ఈ జిల్లా నుంచి తమ ప్రయాణాన్ని సాగించారు. భూదానోద్యమం ఈ జిల్లాలోని పోచంపల్లి నుంచి ప్రారంభమైంది. స్వాతంత్రోద్యమం, జాతీయోద్యమం, నిజాం వ్యతిరేకోద్యమం, రజాకార్ల వ్యతిరేకోద్యమం, తెలంగాణా రాష్ట్ర ఉద్యమం వంటి ఉద్యమాలు జిల్లా ప్రజలు తమ వంతు బాధ్యతను నిర్వహించారు.

ఇంకా జిల్లాలో రావి నారాయణరెడ్డి, కోదాటి నారాయణరావు, పులిజాల వెంకట రమణారావు, మునగాల కొండలరావు, సుద్దాల హనుమంతు, తడకమళ్ల సీతారామచంద్ర రావు, అక్కినేపల్లి జానకిరామారావు, షబ్నవీసు వేంకట నరసింహారావు, అతని భార్య జానకీబాయి, కాంచనపల్లి చినవేంకట రామారావు వంటి ప్రముఖుల జన్మస్థలం ఈ జిల్లా.

హైదరాబాదులోని హుసేన్ సాగర్ నడి బొడ్డున నిలిపిన నిలువెత్తు బుద్ధుడి శిల్పానికి శిలను అందించిన ఘనత ఈ జిల్లాదే. వస్త్ర పరిశ్రమలో విశేష ఖ్యాతి పొందిన పోచంపల్లి, ఇక్కత్ పట్టుచీరల కుటీర పరిశ్రమ ఈ జిల్లాదే.

ప్రజల్లో చైతన్యం కలిగించే నిత్య వార్తా స్రవంతులు (పత్రికలు) ఈ జిల్లాలో అనేకమున్నాయి. జిల్లాలో వచ్చిన మొట్టమొదటి పత్రిక నీలగిరి. ఇంకా సత్యార్థ ప్రకాశిక, గ్రామ వెలుగు, ప్రగతి, తొలివెలుగు వారపత్రిక, విశ్వాభ్యుదయ, విపంచి, ప్రపంచ శాంతి, దర్పణం, నాగార్జున వాణి, ప్రతిధ్వని, ఆక్బారీ సమాచార్, స్పందన, షాడో, తేజోప్రభ, సాహితీమిత్ర, ప్రజాపోరు, సాహితీ మేఖల వంటి పత్రికలు జిల్లా నుంచి వెలువడినాయి. ఉద్యమాలకు నిలయమైన ఈ జిల్లాలో వచ్చిన ఉద్యమ సాహిత్య సంబంధ సంస్థల గూర్చి పై పత్రికల ద్వారా మనకు సమాచారం తెలుస్తుంది.

వాడపల్లి విశిష్టత


కృష్ణానదీ పరివాహక ప్రాంతంలో ఉన్న ప్రసిద్ధ శైవ క్షేత్రం వాడపల్లి. ఇది కృష్ణా, మూసీ నదుల సంగమ ప్రదేశం. దీనికి

మూడు వైపులా నీరు, ఒక వైపు భూభాగం ఉంది. ఇది జిల్లాలో ఉన్న ప్రసిద్ధ ఏకైక జలదుర్గం. దీనిచుట్టూ లోతైన కందకం ఉండి బలిష్టంగా నిర్మించబడింది.

మూసీ తీరప్రాంతమంతా బదరికారణ్యంగా చెప్పబడింది. వాడపల్లి నుంచే బదరికారణ్యం ప్రారంభమౌతుంది. నేటికీ మూసీతీర ప్రాంత బ్రాహ్మణులు సంధ్యావందనం చేసేటప్పుడు "…. జంబూద్వీపే, భరతవర్షే, భరతఖండే, మేరోర్దక్షిణ దిగ్భాగే, కృష్ణా గోదావర్యోర్మధ్య దేశే, బదరికారణ్యే……" అని సంకల్పం చెప్పుకుంటారు.

ఈ పవిత్ర మూసీ, కృష్ణా సంగమ ప్రదేశంలో పడవలు ఆగి వాడపల్లి ప్రముఖ వాణిజ్య కేంద్రంగా విలసిల్లింది. ఓడపల్లి రేవు పట్టణంగా, జలదుర్గంగా ప్రసిద్ధిపొందింది. నిజాం రాజుల పరిపాలనా కాలంలో వాడపల్లిని వజీరాబాదు అని పిలిచేవారు.

వాడపల్లిలో రెండు ప్రాచీన, ప్రసిద్ధ శైవ, వైష్ణవ క్షేత్రాలు నిర్మించబడినాయి. పురాణాల ప్రకారం అగస్త్యుడు వింధ్య పర్వత గర్వమణచి, దక్షిణ దేశంలో సంచరిస్తూ శివ కేశవులను కావడిలో పెట్టుకొని ప్రయాణిస్తుండగా, ఒకనాడు ఈ ప్రాంతానికి చేరుకునే సమయానికి సంధ్యాకాలమైంది. స్నానసంధ్యాదులు చేద్దామనుకుంటే భుజంపై కావడి ఉంది. దూరంగా ఆడుకుంటున్న పిల్లవాడిని పిలిచి కావడి పట్టుకోమని సంధ్యావార్చుకొని వస్తానని చెప్పి నదివైపుకు వెళ్ళినాడు. పిల్లవాడు అగస్త్యుడు వెళ్ళిన కొద్దిసేపటికి బాల్య చాపల్యంతో ఆడుకోవాలనే ఉత్సుకతతో కావడి కింద పెట్టి వెళ్ళిపోయాడు. తరువాత క్షమించమని వేడుకుంటూ అగస్త్యుడు కావడి లేపబోయాడు. కానీ కావడి లేవలేదు. ఆకాశవాణి ద్వారా అగస్త్యునికి శివకేశవుల అంతరంగం వినపడింది. ఆ ప్రదేశం వారికెంతో ఆహ్లాదంగా ఉందని నదీ సంగమ ప్రాంతంలో తాము ఉండదల్చామని చెప్పగా అగస్త్యుడు శివకేశవులకు గుళ్ళను నిర్మించినాడు. అవే అగస్త్యేశ్వరాలయం, లక్ష్మీనరసింహ స్వామి ఆలయాలు. ఈ రెండు దేవాలయాలకు ప్రకృతి సిద్ధమైన ప్రత్యేక లక్షణాలున్నాయి. నదీ తీరంలోనే ఉన్న అగస్త్యేశ్వర స్వామి ఆలయంలోని లింగము బృహత్ లింగం. ఈ లింగం పై భాగంలో పెద్ద రంధ్రం ఉంది. రంధ్రం చుట్టూ చేతి వేలిముద్రలు కూడా కనిపిస్తాయి. ఆ రంధ్రంలో నిండుగా ఎప్పుడూ చల్లని మధురమైన నీరు ఉంటుంది. చిన్న పాత్రతో దానిలోని నీటిని ఎంత తోడినా అవి అయిపోవడమంటూ ఉండదు. దీనికి ఒక పురాణ కథ కూడా ఉంది. శివుడు ఈ ప్రాంతంలో విహారం చేసి ఆనందపడుతూ ఉన్న సమయంలో ఒక బోయవాడు పిట్టను వెంబడిస్తూ వచ్చాడు. ఆ పక్షి శివుడిని శరణువేడింది. శివుడు పక్షిని బోయవాడికి ఇవ్వక, పక్షికి తగిన మాంసాన్ని ఇస్తానన్నాడు. బోయవాడు పక్షి పరిమాణం ఉన్నంత మెదడు ఇస్తే సరేనన్నాడు. శివుడు అందుకు



అంగీకరించడంతో బోయవాడు తనచేతి వేళ్ళతో తీసుకున్నాడు. అందుకే అక్కడ చేతివేళ్ళ గుర్తులున్నాయని స్థానికుల కథనం.

ఒకసారి పరమపూజ్య శంకరాచార్య పీఠాధిపతులు ఈ రంధ్రానికి సంబంధించిన రహస్యాన్ని ఛేదించాలని దాని పరీక్షకై ఒక ఉద్ధరిణికి దారం కట్టి లోపలికి వదలగా, ఎంత దూరం పోయినా దాని అంతం దొరకలేదట. చివరకు ఉద్ధరిణిని బయటికి తీస్తే అడుగున రక్తపు మరకలు కనిపించాయట. క్షమా స్తోత్రాలతో పూజలు నిర్వహించి స్వామి వెనుదిరిగారు.


వైష్ణవ క్షేత్రంగా విలసిల్లుతోన్న లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో వాస్తు సంబంధమైన అద్భుత అంశం ఉంది. స్వామి వారికి ఎదురుగా ఉన్న రెండు దీపాలలో ఒకటి ఎప్పుడూ నిశ్చలంగా కదలకుండా ఉంటుంది. రెండవది కొద్దికొద్దిగా కదులుతూ ఉంటుంది. భగవంతుని ఉచ్ఛ్వాస నిశ్వాసలకు ప్రతీకగా, జీవాత్మ పరమాత్మలకు సంకేతంగా ఈ దీపాలను చెబుతారు. ఆలయ తలుపులు ఎప్పుడు మూసివేసినా, తెరచినా ఈ దీపాల కదలిక ఆగదు. ఈ విధమైన వాస్తు నిర్మాణ శైలి లక్ష్మీ నృసింహాలయ ప్రత్యేకత.

ఇంతటి విశిష్టత కలిగిన వాడపల్లి మూసీ, కృష్ణా సంగమ ప్రాంతంలో విలసిల్లిన ప్రాచీన మహానగరమే కాకుండా, ప్రముఖ శివకేశవ క్షేత్రంగా, జలదుర్గంగా, రేవు పట్టణంగా విలసిల్లి నేడు కేవలం క్షేత్రంగా మాత్రమే మనకు కనబడుతోంది. ❖

ఎస్వీ రామారావు

ఆలంపూరు క్షేత్రోద్ధారకుడు గడియారం రామకృష్ణశాస్త్రి

గడియారం రామకృష్ణశర్మ (1919-2006) కవి-పండితుడు, చరిత్ర - శాసన పరిశోధకుడు, వాస్తుశాస్త్ర విజ్ఞాని, ఆలంపూరు క్షేత్రోద్ధారకుడు, ఆంధ్ర సారస్వత పరిషత్తు నిర్వాహకుడు, స్వాతంత్ర్య సమరయోధుడు, సమాజ సేవకుడు, సంస్కార హృదయుడు. పాలమూరు జిల్లా చరిత్రలో గడియారం రామకృష్ణశర్మ గారు మరపురాని మనీషి, నిరాడంబరులు, నిష్కల్మషులు అయిన శర్మగారి వ్యక్తిత్వం ఎంతో ఉన్నతమైనది. ఆయన జీవితం ఎందరికో ఆదర్శవంతమైనది. ఆయన ఎంతటి సంప్రదాయాభిజ్ఞులో అంతటి సంస్కారప్రియులు. నిజజీవితంలో ఎంత నిష్ఠాగరిష్ఠులో సమాజ సేవా రంగంలో అంతటి కర్మిష్ఠులు. సామాజిక అవసరాలను, ఆదర్శాలను లెస్సగా ఆకళించుకొన్న ఆధునిక స్మృతికారుడు.



రాయలసీమలోని బాబాసాహెబ్ పల్లె ప్రాంతంలో 1919 మార్చి 6వ తేదీన జన్మించిన రామకృష్ణ శర్మగారు ఆలంపూరును స్వస్థలంగా చేసుకొని ఆ క్షేత్రంలోనే తమ జీవితయాత్రను కొనసాగించారు. తల్లిదండ్రులు వెంకటసుబ్బమ్మ, జ్వాలాపతిశాస్త్రి. కదిరిలో ఐదవ తరగతి వరకూ చదువుకొని ఆలంపూరు మాధ్యమిక పాఠశాలలో (1930) ఆరవ తరగతిలో చేరినా అందులో ఉత్తీర్ణులు కాలేదు. వరసకు అన్న అయిన కృష్ణశర్మ ఇంట్లోకాశీమజిలీ కథలు, నవలా సాహిత్యం పఠించారు. శర్మగారు 1937-39 మధ్య కాలంలో గోదావరి జిల్లా సూరవరంలో సుప్రసిద్ధ సాహితీవేత్త వేలూరి శివరామశాస్త్రిగారి శిష్యరికం చేసి సంస్కృతాంధ్ర సాహిత్యాలలో నిష్ణాతులైనారు. కొన్ని సంవత్సరాలు మాత్రమకే శాస్త్రిగారి వద్ద ఉన్నా ఆయన వల్ల గాఢంగా ప్రభావితులై గురువుగారి అడుగుజాడలనే అనుసరించారు.

రామకృష్ణశర్మగారు సమకాలీనోద్యమాలన్నింటిలోనూ కీలకమైన పాత్రను నిర్వహించారు. ఆంధ్రోద్యమం, గ్రంథాలయోద్యమం, స్వాతంత్ర్యోద్యమం, తెలంగాణా స్వాతంత్ర్య పోరాటం, విశాలాంధ్ర ఉద్యమం అన్నింటికీ ప్రత్యక్షసాక్షిగా నిలిచారు. ఏ రంగంలోనైనా వాతావరణం కలుషితమైనపుడు ఆయన వాటినుంచి స్వచ్ఛందంగా వైదొలగిరాఉ. ఇరవై సంవత్సరాల ప్రాయంలోనే దుంపల రామిరెడ్డి (ఉండవల్లి), కొండపల్లి వాసుదేవరావు (ఆలంపూరు తహసీల్దారు)లతో పరిచయం ఏర్పడి వివిధ ఉద్యమాలలో పాల్గొన్నారు. 1940లో ఆంధ్ర మహాసభ తాలూకా కమిటీకి కార్యదర్శిగా ఉండి 1941లో దేవరకద్ర దగ్గరి గ్రామం బండ్రపల్లెలో జిల్లా ఆంధ్ర మహాసభ నిర్వహణకు పాటుపడ్డారు.

1942లో ఆలంపూరులో శ్రీరామకృష్ణ స్మారక గ్రంథాలయాన్ని, 1946లో చెన్నిపాడులో యువజన గ్రంథాలయాన్ని స్థాపించారు. యువమిత్రుల సహకారంతో 'ఆంధ్రయువజన నాట్యమండలి'ని నెలకొల్పి నటులుగా, సూత్రధారిగా చింతామణి, హరిశ్చంద్ర, కృష్ణరాయబారము మున్నగు నాటకాలను ప్రదర్శించారు. ఋష్యేంద్రమణి, పూర్ణిమ, యశోద మున్నగు వెండితెర నటీమణులతో కలిసి నాటకాలు వేశారు. పద్యాలను గంభీరకంఠంతో ధారాళంగా పఠించగలిగిన శర్మగారు హరికథలు, పురాణ ప్రవచనాల ద్వారా ప్రజాభిమానాన్ని చూరగొన్నారు. స్టేట్ కాంగ్రెస్ కార్యకర్తగా 1947లో కర్నూలు నుంచి భాగ్యనగర్ రేడియో కేంద్రం పేరుతో నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా వార్తలు, వ్యాఖ్యలు ప్రసారం చేశారు. సాహిత్యాభిమాని అయిన శర్మగారు 'సుజాత' పేరుతో విశిష్టమైన సాహిత్యమాసపత్రికను మూడు సంవత్సరాల పాటు (15 ఆగస్ట్

1950–53) నిర్వహించారు. ఇందులో ప్రసిద్ధ పరిశోధకుల వ్యాసాలు ప్రచురితమైనాయి. సుజాత వెలువరించిన తెలంగాణా సంచిక (1951) పరిషత్తు సప్తమ వార్షికోత్సవ మహాసభల సంచిక (1952) అమూల్యమైనవి.

నిజాం హైదరాబాద్ రాష్ట్రంలో తెలుగుభాషా వికాసానికి ఎంతో కృషి సల్పిన ఆంధ్రసారస్వత పరిషత్తు స్థాపన దశ (1943) నుంచీ సభ్యులుగా చేరి ఆ సంస్థకు విశిష్ట సేవలు అందించారు శర్మగారు. ప్రచార కార్యకర్తగా, పరీక్షా కార్యదర్శిగా చక్కని పాఠ్యప్రణాళిక రూపొందించటమే కాక పొరుగు రాష్ట్రాలలో సైతం పరిషత్తు పరీక్షలు నిర్వహించారు. పరిషత్తు సప్తమ వార్షికోత్సవ మహాసభలు ఆలంపూరులో ఘనంగా నిర్వహించారు. 1950–57 మధ్య సహాయ కార్యదర్శిగా, 1958 నుండి 1983 వరకు ప్రధాన కార్యదర్శిగా, 1984 నుండి చివరి దశవరకూ ఉపాధ్యక్షులుగా కొనసాగారు.

ఆలంపూరు క్షేత్రోద్ధరణకు జీవితాన్నే అంకితం చేసిన మహానుభావులు శర్మగారు. ఆలంపూరులో ఉన్నతపాఠశాల స్థాపనకు, వేదపాఠశాల స్థాపనకు, మ్యూజియం ఏర్పాటుకు పాటుపడటమే కాకుండా గ్రామాభివృద్ధికి దోహదం చేసి రైతు బాంధవుడుగా ప్రజాసేవకుడుగా పేరు గడించారు. శ్రీశైలం ప్రాజెక్టు వల్ల ఆలంపూరు క్షేత్రం ముంపుకు గురికాకుండా, తుంగభద్ర తీరం పొడుగునా బలమైన కుడ్యనిర్మాణానికి (1983) ఆయన చేసిన ఉద్యమం చరిత్రలో నిలిచిపోతుంది.

తుంగభద్రా తీరంలో వెలసిన ఆలంపూరు క్షేత్రము పురాణ ప్రసిద్ధమైనది. దక్షిణకాశిగా శ్రీశైలక్షేత్ర పశ్చిమద్వారంగా వాసి గాంచింది. పరిశోధనా దక్షులైన శర్మగారు శాసనాలు చరిత్ర గ్రంథాలు పరిశీలించి ప్రామాణికమైన ఆలంపూరు చరిత్రను ఐదు గ్రంథాల రూపంలో లోకానికి చాటిచెప్పారు. ఆలంపూరు శిథిలములు (1946) ముద్రితమైన వారి మొదటి గ్రంథం. ఆయన ఆలంపూరు చరిత్రను 'మాన్యుమెంట్స్ ఆఫ్ ఆలంపూర్' పేరుతో సి. శంకరరావు ఆంగ్లంలోకిఅనువదించారంటే ఈ క్షేత్ర ప్రకాశనంలో గడియారంవారి ప్రత్యేకత ద్యోతకమవుతుంది. శక్తిపీఠమైన జోగులాంబ ప్రత్యేక ఆలయ నిర్మాణ సందర్భంలో 'జోగుళాంబా మహాశక్తి' అన్న లఘు గ్రంథంలో శాక్తేయాన్ని పరిచయం చేశారు.

ఆధ్యాత్మికవేత్త, భక్తితత్పరులు అయిన శర్మగారు పాలమూరు జిల్లాలోని పెక్కు క్షేత్రాల చరిత్రను గూడ వెలుగులోకి తెచ్చారు. బీచుపల్లి, సంగమేశ్వరం, మన్నెంకొండ, ఉమామహేశ్వరం, క్షేత్ర చరిత్రలు రచించారు. తుంగభద్రా పుష్కరాల సందర్భంలో (1996) వాటి ప్రశస్తిని వివరించారు. వేదానుసారమైన నిత్యకర్మానుస్థానం సరళమైన రీతిలో విశదీకరిస్తూ లఘుగ్రంథం వ్రాశారు. 'బ్రాహ్మణుడు చక్కబడితే తక్కిన సమాజం బాగవుతుంది' అన్నది ఆయన అభిప్రాయం. స్త్రీలు ఆచరించవలసిన 'పూజావిధులు'లో పంచగవ్యవిధి, తులసీ, గౌరీ, లక్ష్మీపూజా విధులు, సావిత్రి, గౌరీ వ్రతములను విశదీకరించారు.

చరిత్ర పరిశోధనపై గడియారం వారికి ఆసక్తి మెండు. పాశ్చాత్యులు వారి దృష్టికోణంతో వ్రాసిన చరిత్ర రచనా పద్ధతిని మార్చాలన్న ఉద్దేశ్యంతో రచించిన 'భారతదేశ చరిత్ర' పరిషత్తు పరీక్షా విద్యార్థులకు ప్రయోజనకరంగా రూపొందింది. దీనికి చరిత్ర పరిశోధకులు పుట్టపర్తి శ్రీనివాసాచార్యులు పీఠిక కూర్చారు. 14వ శతాబ్దిలో ముస్లిందాడికి ఆంధ్రదేశం గురికాగా దక్షిణాపథాన్ని సంరక్షించే సంకల్పంలో విజయనగర రాజ్యస్థాపనకు ప్రేరకులైన మాధవ విద్యారణ్య స్వామి చరిత్రను ఎంతోకాలం పరిశ్రమించి, పలు చారిత్రక సాక్ష్యాలను పరిశోధించి సమగ్రంగా వెలువరించారు. దీనిని శర్మగారి కన్నడ మిత్రులు రామచంద్రరావు గుమాస్తే కన్నడ భాషలోకి అనువదించారు. ఆలంపూరు సమీపంలోని లింగనవాయి గ్రామంలోని ఆశ్రమంలో సాధకుడుగా పేరుపొందిన నిత్యానందస్వామిని ఆధ్యాత్మిక గురువుగా పేర్కొన్నారు. శర్మగారు 30–11–1959న జీవసమాధి చెందిన స్వామివారికి సమాధి కట్టించి లింగప్రతిష్ఠ జరిపిన శర్మగారు భక్తుల కోరికపై వారి చరిత్రను వ్రాశారు.

శాసన పరిశోధనలో కూడ శర్మగారిది గణనీయమైన స్థానం. శాసనాలు చదువగలిగిన కొద్దిమంది విద్వాంసుల్లో ఆయన ఒకరు. వినయాదిత్యుని పల్లెపాడు తామ్రశాసనం, విక్రమాదిత్యుని ఆమిదేలపాటి శాసనం ఆయన శాసన భాషా పరిజ్ఞానానికి నిదర్శనాలు. ఆదిరాజు వీరభద్రరావు ప్రోత్సాహంతో జీర్ణావస్థలో ఉన్న 50 శాసన పాఠాలు సిద్ధంచేసి 35 ఆలంపూరు శాసనాలు చేర్చి 'తెలంగాణా శాసనములు' రెండవ భాగాన్ని కేంద్రప్రభుత్వ ఆర్థిక





సాయంతో ప్రకటించారు. ఆలంపూరులోని దేవాలయాల నిర్మాణ శిల్పంలోని వైవిధ్యాన్ని గమనించిన శర్మగారు దేవాలయ వాస్తుశాస్త్రాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేశారు. ప్రపంచ తెలుగు మహాసభల పక్షాన 1975లో ప్రకటితమైన మన వాస్తు సంపదలో తమ వాస్తు విజ్ఞానాన్ని వెల్లడించారు. అంతటితో ఆగకుండా గృహప్రాసాద వాస్తు విశేసాలతో కూడిన 'బారతీయ వాస్తు విజ్ఞానము' పేరుతో లఘుగ్రంథాన్ని ప్రచురించారు. దీనిని డా॥ దేవర కొండారెడ్డి కన్నడంలోకి అనువదించారు.

శర్మగారి గ్రంథాలు రెండు కన్నడంలోకి అనువదింపబడటయే కాకుండా, స్వయంగా కన్నడ భాషా నిష్ణాతులైన ఆయన కన్నడ భాషా రచనలను తెనిగించారు. కన్నడ కవిత్రయంలో ఒకడైన 'రన్న' కవి 'సాహసభీమసేన' విజయ కావ్యాన్ని బి.యం. శ్రీకంఠయ్య 'గదాయుద్ధ నాటకం'గా నాటకీకరించగా శర్మగారు దానిని ఆంధ్రీకరించారు. ఇది 1970లో కేంద్ర సాహిత్య అకాడమీనుండి ఉత్తమ అనువాద గ్రంథంగా రూ. 1116/-ల బహుమతి ఒబీపందింది. సాహిత్య అకాడమీ వారు ఎల్.ఎస్. శేషగిరిరావు సంకలనం చేసిన కన్నడ కథాసంపుటి (కన్నడ సణ్ణక కతెగళు)నరి కూడా తెనిగించారు (కన్నడ కథానికలు) ఇందులో 22 కథలున్నాయి.

గడియారం వార స్వతః భావుకుడైన కవి. 18 సంవత్సరాల వయసులోనే లక్షణబద్ధమైన కావ్యరచనను (చంద్రహాసోపాఖ్యానం) ప్రారంభించాడు. అయితే అది మధ్యలోనే ఆగిపోయి అముద్రితంగా ఉండిపోయింది. పరిషత్తు మహాసభలు, వార్షికోత్సవాలు మున్నగు వేదికలపై గంభీరవాణితో తమ పద్యాలు ఆలపించేవారు. 1943 నుంచి 1976 వరకు వివిధ సందర్భాలలో ఆయన రచించిన కవితా ఖండికలు సేకరించి షష్టిపూర్తి సందర్భంగా 1979లో 'పాంచజన్యం' పేరుతో 'జ్యోతిర్మయి' సాహిత్య సమితి పక్షాన ప్రచురించారు. జాతీయాభిమాన పూరితమైన ప్రబోధాత్మక కవితాసంపుటికి ఈ పేరు సార్థకంగా ఉంది. దేవులపల్లి రామానుజరావు, కేశవపంతుల నరసంహశాస్త్రి గారలు ఈ సంపుటికి పీఠికలు సంతరించారు. ఇందలి 21 ఖండికలలో దేశాన్ని గురించిన ప్రజలను గూర్చి కవికున్న ఆవేదన తొంగిచూస్తుంది. రైతుల పక్షాన గద్వాల రాజుకు చేసిన 'అభ్యర్థనము'లో అధికారుల దౌర్జన్యం, రైతుల దీనావస్థ చిత్రితమైంది. స్వాతంత్ర్యం తర్వాత ఆఃస్వర్థపరులుగా మారిన నేతల చిత్తవృత్తిని ఎండగడుతూ

"విత్తార్జనంబె జీవిత లక్ష్యముగ నెంచు
వంచకుల్ బహునీతి చుంచు లైరి
బడుగు జీవుల ప్రాణ వాయువుల్ పీల్చెడు
ముష్కరుల్ కారుణ్యమూర్తులైరి
అందరును గాంధి ఇఃసద్ధాంత మనెడు వారె
దేశభక్తి స్వరూపంబు దేవుడెరుగు
ఖాదిభండారములకు సంక్రాంతి వచ్చె
ఎన్నికల దివ్య మహిమంబు ఎన్న తరమె"

అంటూ వర్ణించారు.

"లేలెమ్ము కవిరాజ! లీలావిహార
శైలకుంజ లతాంత శయ్యపై నుండి" అంటూ
"ఖండభారత దురాగత విరాగములు
గుండెలు పగులగ ఘోషింపవేల" అని కవులను ఉద్బోధించారు.

శర్మగారి చివరి గ్రంథంగా పేర్కొనదగిన ఆయన ఆత్మకథ 'శతపత్రము' (2004) ఆదర్శవంతమైన జీవిత, వ్యక్తిత్వాలకు నిలువెత్తు దర్పణం. ఎనభై అయిదు సంవత్సరాల సుదీర్ఘ జీవనయాత్రలో ఆయన పొందిన అనుభవాలు, అనుభూతులు, ఎదుర్కొన్న కష్టనిష్ఠూరాలు, ఒడిదుడుకులు ఎంతో నిజాయితీగా ఇందులో ఆవిష్కృతమైనాయి. సమకాలీన రాజకీయ, సాంఘిక, సాంస్కృతిక పరిస్థితులు, ఉద్యమాలు, ఆనాటి కుటుంబ వ్యవస్థ, సంప్రదాయాలు, ఆచారాలు మౌలికమైన విశ్లేషణతో ఇందులో యథార్థంగా చిత్రితమైనాయి. ఈ స్వీయచరిత్ర భావితరాలకు కనువిప్పుగా, స్ఫూర్తిదాయకంగా నిలుస్తుంది.

ఈ గ్రంథ ప్రచురణకు రెండు సంవత్సరాల ముందే (2002 జనవరి) దివంగతురాలైన సతీమణి కమలమ్మ గారికి అంకితమిచ్చి తమ దాంపత్య బంధంలోని అనురాగాన్ని చాటుకొన్నారు శర్మగారు. జన్మతః సంస్కార హృదయలైన రామకృష్ణశర్మగారు బాలవితంతు పునర్వివాహాలను ప్రోత్సహిస్తూ తమ ఆధ్వర్యంలో జరిపించటమే

కాక స్వయంగా వింతువును వివాహమాడి సమాజానికి ఆదర్శప్రాయంగా నిలచారు. సాంగికంగా, ఆర్థికంగా, ఆరోగ్యపరంగా ఎన్నో కష్టాలను చవిజూచిన ఈ దంపతులకు కలిగిన 15 మంది సంతానంలో ఎనిమిది మంది మాత్రమే (ముగ్గురు కుమార్తెలు, ఐదుగురు కుమారులు) మిగిలారు.

బహుగ్రంథకర్తలైన గడియారం వారు విద్యార్థుల కుపయుక్తమైన పాఠ్యగ్రంథాలు కూడ రచించారు. భారతదేశ చరిత్రో పాటు నాటకలోణాలకు సంబంధించిన 'దశరూపకసారము'ను సుబోధకమైన శైలిలో సాహిత్య టవిద్యార్థుల కుపయుక్తంగా వ్రాశారు. పదవ తరగతి విద్యార్థుల కోసం విజ్ఞానవల్లరి, తెలుగుసిరి, ప్రపంచ రాజ్యాలు అన్న చిన్న పుస్తకాలు వెలువరించారు. చిన్న కథల పుస్తకం 'వీరగాథలు' బాలసాహిత్యంలో చేరుతుంది. ఆయన పరిష్కరణలో రాష్ట్ర సాహిత్య అకాడమీ ప్రచురించిన మంచన 'కేయూర బాహుచరిత్రము', కొరవి గోపరాజు సింహాసన ద్వాత్రింశిక కావ్యాలకు విమర్శనాత్మకమైన విపుల పీఠికలు సమకూర్చారు. సంస్కృత స్థలపురాణం 'శ్రీమదలంపుర క్షేత్రమాహాత్మ్యం' లోని దోషాలను అష్టావధాని తాటికొండ కృష్ణశర్మ సాయంతో పరిష్కరించి పీఠికతో ప్రచురించారు. వివిధ సంస్థల ఆధ్వర్యంలో శర్మగారుకావించిన సాహిత్యోపన్యాసాలు ఆయన పరిశోధనా ప్రతిబకు, నిశిత విమర్శనా దృష్టికి గీటురాళ్లు. ఎఱ్ఱాప్రెగడ, పాల్కురికి సోమన, కాణాదం పెద్దన మున్నగు కవులపై ఉపన్యాసాలు కొన్ని ప్రశస్తమైన ఉదాహరణలు. శర్మగారి పీఠికలు, ప్రసంగ వ్యాసాలు గ్రంథరూపంలో వెలువడటం సాహిత్యరంగానికి ప్రయోజనకరం.

తమ ప్రజ్ఞాపాటవాలకు గుర్తింపుగా రామకృష్ణ శర్మగారు వివిధ సంస్థలు, అకాడమీల నుండి సన్మానాలు, సత్కారాలు పొందారు. కేంద్రసాహిత్య అకాడమీ తెలుగు సలహా సంఘ సభ్యులుగా ఉండిన (1968–70) శర్మగారు రాష్ట్ర సాహిత్య అకాడమీ విశిష్ట సభ్యులుగా (1977) సన్మానితులైనారు. ప్రపంచ తెలుగు మహాసభల్లో (1975) సత్కారం పొందారు. తెలుగు విశ్వవిద్యాలయం నుండి ప్రతిభా పురస్కారం (1996), గౌరవ డాక్టరేట్ బిరుదు అందుకున్నారు. కవివరపు కామేశ్వరరావు ట్రస్టు, బూర్గుల ట్రస్టు, సురవరం ట్రస్టు, గాడిచర్ల ఫౌండేషన్, సనాతన ధర్మ చారిటబుల్ ట్రస్టు, కర్నూలు వివేకానంద పాఠశాల మున్నగు సంస్థలు నగదు పారితోషికాలతో ఘనంగా సత్కరించాయి. వార్ధక్యంలో స్వాతంత్ర్య సైనిక సన్మాన్ పెన్షన్ పొందిన రామకృష్ణశర్మగారు 88వ యేట 2009లో కీర్తిశేషులైనారు.

(పాలమూరు ఆధునిక యుగ కవుల చరిత్ర సౌజన్యంతో...)

❖ ❖ ❖

కృష్ణా పుష్కర దశకమ్

శతావధాని డా॥ జి.ఎం. రామశర్మ

శ్రీవిష్ణుసమే! రూపే ప్రభవిష్ణుగుణాధిపే!
పుష్కరాత్మపరిష్కారే కృష్ణాధుని! నమోస్తుతే ॥ 1

శ్రీమద్విజయవాటీశీ దుర్గాపాదాబ్జ షట్పది ।
పుష్కరాత్మపరిష్కారే కృష్ణాధుని! నమోస్తుతే ॥ 2

కృతమజ్జనతోపేత నమజ్జన హితంకరి ।
పుష్కరాత్మపరిష్కారే కృష్ణాధుని నమోస్తుతే ॥ 3

సముత్తుంగ తరంగాగ్రైః స్వస్తురంగీవ గామిని ।
పుష్కరాత్మపరిష్కారే కృష్ణాధుని నమోస్తుతే ॥ 4

జేగీయమాన చారిత్రే చిత్రచిత్ర గతిశ్రుతే ।
పుష్కరాత్మపరిష్కారే కృష్ణాధుని నమోస్తుతే ॥ 5

ఘోరనిస్సార సంసార జ్వాలావారణవాహిని ।
పుష్కరాత్మపరిష్కారే కృష్ణాధుని నమోస్తుతే ॥ 6

తాపత్రయాబ్ధి నిర్మూల చండోద్దండ సదాగతే ।
పుష్కరాత్మపరిష్కారే కృష్ణాధుని నమోస్తుతే ॥ 7

చిత్తరంగిణి! సంపూత శ్రితచిత్తాంతరంగిణి ।
పుష్కరాత్మపరిష్కారే కృష్ణాధుని నమోస్తుతే ॥ 8


బృహస్పతి సమావిష్టే భూరితృష్ణాచలాశనే ।
పుష్కరాత్మపరిష్కారే కృష్ణాధుని నమోస్తుతే ॥ 9

రాశీకృత దయాధారా దూరీకృత కుకల్మషే ।
పుష్కరాత్మపరిష్కారే కృష్ణాధుని నమోస్తుతే ॥ 10

❖ ❖ ❖

మరుమాముల వెంకటరమణశర్మ

వట్టికోట ఆళ్వారుస్వామి



తెలంగాణ ప్రజాసాహిత్యానికి పాదులు వేసి ప్రాణం పోసినవాడు వట్టికోట ఆళ్వారుస్వామి. రచయిత. సేవాశీలి. ఉద్యమకర్త. కమ్యూనిస్టునేత. ప్రచురణకర్త. పాత్రికేయుడు. ప్రచారకుడు ఆయన. భాషాసాహిత్యాల దగ్గర్నుంచి పౌరహక్కుల దాకా వట్టికోట అన్ని ఉద్యమాలల్లో పాలుపంచుకున్నాడు. తెలుగులో రాజకీయ నవలలకు ఆద్యుడు.

ఆళ్వారు స్వామి చదువు మధ్యలో ఆపేసి గ్రంథాలయోద్యమంలో కొనసాగాడు.దాశరధి పద్యాలు జైలు గోడల మీద రాసి దెబ్బలు తిన్నాడు.

"ఇస్లాం అంటే శాంతి. శాంతిని కోరి సత్యానికి పోటీపడే ఏమతమైనా నాకు సమ్మతమే ! కాని మీరు , మీ మతాన్ని శాంతికి ద్రోహం చేసేదిగా మార్చినారు "."కులాల పేర, మతాల పేర ప్రారంభమైన అడ్డుగోడలు క్రమంగా బలమైన అడ్డంకులుగా తయారైనాయి . దాంతో మనలో ఐక్యత నశించింది"

టల్ కార్మికుడిగా జీవితం ప్రారంభించిన ఆయన స్వయంగా చదువు నేర్చుకుని, రచయితై , ప్రచురణ కర్త అయ్యాడు.

1915 నవంబర్ 1 తేదీన నల్లగొండ జిల్లా నకిరేకల్ సమీపంలోని చెరువు మాదారంలో సింహాద్రమ్మ, రామచంద్రాచార్యులకు జన్మించాడు. తండ్రి చిన్ననాట చనిపోవడంతో సీతారామారావు అనే ఉపాధ్యాయుడికి వండిపెడుతూ విద్యాభ్యాసం, సారస్వతాభ్యాసం చేశాడు.

గ్రంథాలయోద్యమంతో మొదలైన ప్రేరణ ఆళ్వారుస్వామిని నిజాం వ్యతిరేకోద్యమం దాకా నడిపించింది. ప్రజల్లో కలిసి ఆయన పని చేసిన తీరు నిజాంకు కోపం తెప్పించింది. దానితో ఆయన జైలు పాలు అయ్యాడు. వంటపనిలో, ప్రూఫ్ రీడింగ్‌లో, హోటల్ సర్వర్‌గా పని చేస్తున్నప్పుడు ఆయన పొందిన అనుభవాలు ఆయన ప్రజల మనిషిగా నిలబడేట్టు చేశాయి. నిజాంను గడగడలాడించిన 'ఆంధ్రమహాసభ' నల్లగొండ జిల్లా అధ్యక్షుడిగా, కమ్యూనిస్టు పార్టీ నాయకుడుగా ప్రజాచైతన్యాన్ని కూడగట్టాడు.

వట్టికోట జైలు జీవితం జైలు లోపల పేరుతో కథల సంపుటిగా వెలువడింది.

తెలంగాణ ప్రజాజీవిత నేపథ్యంతో 1952లో ప్రజల మనిషి నవల రచించాడు.

అంతా ఏకమైతే (ప్రజాసాహితి, 1982-02-01)

ఆలు కూలి (కిన్నెర, 1953-12-01,

పత్రిక, 2006-02-01)

గాలి పటం (అభ్యుదయ, 1956-05-01)

కాఫిర్లు విశాలాంధ్ర, 2002-01-27

పతితుని హృదయం, సృజనరి, 1982-11-01, చూపు, 1997-09-01

పరిగె, ప్రజాసాహితి, 1985-02-01,

విశాలాంధ్ర, (1997-06-29

పరిసరాలు, స్రవంతి 1954-09-01

బదనిక, కిన్నెర, 1953-11-01

1940-45 మధ్యకాలంలోని రాజకీయ, సాంఘిక ప్రజా ఉద్యమాల చిత్రణతో గంగు నవల రచించిండు.

తెలంగాణ చైతన్యం కోసం 'దేశోద్ధారక గ్రంథమాల' స్థాపించి 35 పుస్తకాలు ప్రచురించాడు. తెలంగాణ విశేషాలను కూర్చి, 'తెలంగాణ' పేరుతో సంపుటాలు ప్రచురించిండు. ఇవేవీ ఇప్పుడు అందుబాటులో లేకుండా పోయాయి. ఆయన 1961 ఫిబ్రవరి 5న మరణించారు. ❖

డా.బి. మనోహరి


తెలంగాణ తొలి శాసన , చారిత్రక పరిశోధకులు

బి.ఎన్.శాస్త్రి

అచ్చమైన తెలంగాణ బిడ్డగా, తెలంగాణ మాండలికంలో మాట్లాడుతూ, తెలంగాణ అంటే ప్రత్యేకమైన అభిమానంతో ఇక్కడి చరిత్రను వెలుగులోకి తెస్తూ, నిరంతరం తెలంగాణ గురించి, ఇక్కడ ప్రాంతాల విశిష్టతను గూర్చి చెప్తూ నడయాడే తెలంగాణ చరిత్రగా గుర్తింపు పొందినవారు శ్రీ బి.ఎన్. శాస్త్రిగారు. తెలంగాణ జిల్లాల్లో మారుమూల గ్రామాల పేర్లు కూడా చెప్తూ బహుశః ఏ చరిత్ర పరిశోధకుడు కాని, రాజకీయ నాయకుడు కాని తిరగనన్ని గ్రామాలు తెలంగాణలో తిరిగి శాసనాలు సేకరించి, పరిశోధనలు నిర్వహించినారు. సొంతంగా 400 శాసనాలు సేకరించి ప్రచురించారు. ఇవన్నీ వీరు విశ్వవిద్యాలయంలో ఆచార్య పదవిలో ఉండి నిర్వహించలేదు. ఒక సామాన్య మానవుడిగా ఉంటూ పది విశ్వవిద్యాలయాల పనిని ఒక్కరే పూర్తిచేసారు.

ఒక శాసనం వెలికి తీయాలంటే ఎంత శ్రమ ఉంటుందో పరిశోధకులకు తెలుసు. సరిగ్గా మౌలిక వసతులు లేని కాలంలో ఎంతో శ్రమకోర్చి శాసనాలను వెలికి తీసి, వాటిని ఫోటోలుగా ప్రచురించి, భూతద్దం ద్వారా చదివి, అందులోని విషయాన్ని ఆకళింపు చేసుకొని చరిత్రలో ఆ శాసనాలకు ఉన్న ప్రాముఖ్యాన్ని, అవి ఏ రాజుకు సంబంధించిన శాసనాలో వివరణ ఇస్తూ, చరిత్రకు వాటిని అనుసంధానం చేస్తూ చరిత్రకే ఒక కొత్త శోభను చేకూర్చారు. ఇది మామూలు విషయం కాదు. ఇటువంటి అనితర సాధ్యమైన కార్యాన్ని ఒంటిచేతి మీదుగా చేసినారు.

పది సంవత్సరాలు టీచర్ ఉద్యోగం చేసిన తరువాత ఉన్నతవిద్య పట్ల ఆసక్తితో ఉస్మానియాలో ఎం.ఎ తెలుగు పూర్తిచేసి పరిశోధన వైపు దృష్టి మరల్చారు. వారి పరిశోధనాంశం "శాసనాల ద్వారా తెలుగు భాషా వికాసం" Development of Telugu Language through Inscriptions".ఈ అంశంపై అప్పటివరకు పరిశోధన జరగలేదు. పరిశోధనా అంశానికి సంబంధించి కొన్ని వేల శాసనాలను పరిశీలించారు. అందులో భాగంగానే వారు ఒక కొత్త అంశాన్ని కనుగొన్నారు.



తెలుగు సాహిత్య చరిత్రలో అప్పటివరకు నన్నయ ఆదికవిగా అందరూ ముక్తకంఠంతో అంగీరించినవారే. ఒక్క మానవల్లి రామకృష్ణకవిగారు తప్ప. శాస్త్రిగారు తన పరిశోధలో భాగంగా నన్నయకు పూర్వం నుండి ఉన్న శాసనాలను పరిశీలించారు. అప్పుడే వారికి కొన్ని శాసనాలు లభించాయి. వాటి ఆధారంగానే తెలుగు సాహిత్యంలో నన్నయ ఆదికవి కాడు నన్నెచోడుడు అని సిద్ధాంతీకరించారు. ఇదే విషయమై 1972 ఫిబ్రవరి భారతి మాసపత్రికలో "ఆదికవి నన్నెచోడుడు" అనే శీర్షికన 10పేజీల వ్యాసాన్ని రచించారు. ఇందులో అనేక శాసనాలను ఉటంకిస్తూ నన్నెచోడుడే ఆదికవి అని నిర్ధారించారు.

చివరగా ఈ వ్యాసంలో "ఇట్లు ఆంధ్రభాషలో తొలి కావ్యమును రచించిన ఆదికవి నన్నెచోడుడు. శివకవియైనందున మరుగుపడి, పదియవ శతాబ్దిలో ఆంధ్రమునందాది కావ్యము రచింప, ఇరువదియవ శతాబ్దిలో నా గ్రంథము వెలుగులోనికి రాగా ఆంధ్ర పండిత ప్రకాండులు, చారిత్రకులు, నన్నెచోడుని పండ్రెండవ శతాబ్దివాడుగా నిర్ణయించుట చూడగా కొన్ని కొన్ని దురభిమానములెంత శక్తివంతమైనవో ఊహింపవచ్చును" అని పూర్తిచేసారు.

శాస్త్రిగారు ఎవరు ఎటువంటి అభియోగాలు చేసినా నా పని నేను పూర్తిచేస్తాను, నేను చెప్పదల్చుకున్నది చెప్తాను అని స్థిరనిర్ణయంతో ఇంతటి సాహసోపేతమైన వాక్యాలను పల్కినారు. ఈ కారణంగా వారికి అందవలసిన పిహెచ్.డి. పట్టా కూడా రాలేదు. ఈ విషయాన్ని

మార్చి రాయవలసిందిగా విశ్వవిద్యాలయంలోని అధ్యాపకులు కోరగా శాస్త్రిగారు అందుకు అంగీకరించలేదు. చరిత్రను వక్రీకరించి చెప్తే వచ్చే డిగ్రీ నాకు అక్కర్లేదని వారు సిద్ధాంతవ్యాసాన్ని తిరిగి సమర్పించలేదు. ఆ కారణంగానే వారు "డాక్టరు కాని పరిశోధక శాస్త్రి"గా జనుల హృదయాల్లో, పరిశోధకుల్లో నిలిచిపోయారు. కాని వారివద్ద చాలామంది పరిశోధక విద్యార్థులు వచ్చి వారి సలహాలను తీసుకునేవారు.

ఆర్థికంగా వెనకబడిన తెలంగాణ ప్రాంతంలో జన్మించిన వీరు చిన్నతనం నుండి ప్రతి దశలోనూ కష్టాలను అనుభవించి, తాను అనుకున్న రంగంలో విజయం సాధించి చరిత్ర, శాసన పరిశోధనలో అందరికీ ఆదర్శప్రాయులుగా నిలిచారు. సరళ స్వభావం, విశాల హృదయం, దాన గుణం, పరిశోధనా పటిమ, నలుగురికి మంచి చేయాలనే తపన, దైవభక్తి, కష్టించి పనిచేయడం... ఇవన్నీ శాస్త్రిగారికి దేవుడు ఇచ్చిన ప్రత్యేక లక్షణాలు.

పరిశోధనలో అడుగు పెట్టిన తర్వాత సాహిత్యం నుండి దారి మళ్ళి చరిత్ర శాసన పరిశోధన వైపు అడుగులు పడ్డాయి. ఈ క్రమంలోనే వారికి దైవానుగ్రహం వల్ల రెండు కొత్త తామ్ర శాసనాలు లభించాయి. ఆ శాసనాలే శాస్త్రిగారి పరిశోధనా జీవితాన్ని, చరిత్రగతిని మలుపు తిప్పాయి. శాస్త్రిగారికి మిత్రుడైన రమా మనోహరరావుగారు తనవద్ద రెండు తామ్ర శాసనాలున్నాయని, వాటిని చదివి పరిష్కరించి, ప్రకటించవలసిందని శాస్త్రిగారికి ఇచ్చారు. శాస్త్రిగారు వాటిని పరిశీలించి, అవి విష్ణుకుండినుల కాలానికి చెందినవిగా గుర్తించారు. ఆ శాసనాలను 1965 జూన్, జులై నెలల్లో ప్రకటింపచేశారు. మొదటి శాసనం విష్ణుకుండిన గోవిందవర్మది కాగా రెండవది విష్ణుకుండిన విక్రమేంద్ర భట్టారక వర్మది. ఈ రెండు శాసనాలు యాదృచ్ఛికంగా శాస్త్రిగారి మాతామహుల ఊరైన ఇంద్రపాల నగరానికి చెందినవి. అవి ఇంద్రపాల నగర తామ్రశాసనాలుగానే చరిత్రో పిలువబడుతున్నాయి.

ఈ ఇంద్రపాలనగరం కృష్ణానదికి ఉపనదియైన ముచికుంద (మూసీ నది) పరీవాహక ప్రాంతంలో ఉంది. ఇంద్రపాల నగరం మొదట విష్ణుకుండినుల రాజధానిగా విరాజిల్లింది. ఇక్కడే విష్ణుకుండిన రాణి పరమ భట్టారికా మహాదేవి నిర్మించిన బౌద్ధ విహారం ఉంది. ఈ విహారానికి పెణ్కపర అనే గ్రామాన్ని దానం చేసినట్లు ఇక్కడ లభించిన శాసనాల వల్ల తెలుస్తుంది. చరిత్రలో అజ్ఞాతంగా ఉన్న చరిత్ర ఈ శాసనాల వల్ల వెలుగులోకి వచ్చింది. ఈ శాసనాలు కృష్ణ ఉపనది పరీవాహ ప్రాంతంలో వెలుగు చూశాయి.

ఈ శాసనాలను శాస్త్రిగారు భారతి పత్రికలో ప్రకటించగానే చారిత్రక లోకంలో విద్వాంసులు, శాసన పరిశోధకులు ఆశ్చర్యానికి గురైనారు. విష్ణుకుండినులు మొదట తెలంగాణ ప్రాంతంనుండి పాలించారని, వారు మొదట బౌద్ధమతానుయాయులని, తర్వాత వైష్ణవవాన్ని స్వీకరించారని తీర్మానించారు. ఈ విషయం ఆనాటి చారిత్రకులకు మింగుడు పడలేదు. తెలంగాణ ప్రాంతంనుండి ఇంత గొప్ప రాజ్యం ఉందా?, ఉన్నా తెలంగాణాలో శాసన పరిశోధకులకు అది సాధ్యం కాదు. ఇది శాస్త్రిగారు కల్పించి చెప్తున్నది. శాసనాలు కూడా వారి అమ్మమ్మ వారి ఊరికి దగ్గరలోనివే. శాస్త్రిగారే స్వయంగా రాగిరేగులపై వ్రాయించి చెప్తున్నారనే అభాండాలు కూడా వేసినారు.

ఈ విషయమై భారతిలో కొన్నినెలలు తర్జన భర్జనలు శాస్త్రిగారికి, ఇతర చారిత్రకులకు జరిగినాయి. ఈ సందర్భంలో భారతి పత్రిక సంపాదకులు శ్రీ శివలెంక శంభూప్రసాద్‌గారు శాస్త్రిగారికి అండగా నిల్చి ఎంతో ప్రోత్సహించారు. చివరకు ఇండియన్ ఆర్కియాలజీ చీఫ్ డా॥ జి.ఎస్.ఘాయ్ గారు హైదరాబాద్ వచ్చి శాస్త్రిగారి పరిశోధనను చూసి వారితో చర్చించి, శాస్త్రిగారు నిరూపించిన అంశాలు యథార్థమని నమ్మి, ఆంగ్లంలో వ్యాసాలు ప్రచురించారు. అప్పటికి కాని ఆంధ్రదేశంలోని చారిత్రకుల నోళ్ళకు, కలాలకు విశ్రాంతి లభించింది.

అప్పటినుండి చరిత్ర, శాసన పరిశోధనా రంగంలో వెనుదిరిగి చూడలేదు. తనకు లభించిన శాసన ఆధారాలతో చరిత్రను సత్యవంతంగా, నిజాయితీగా, ఎవరి సహాయ సహకారాలు లేకుండా శ్రమించి అనేక శాసన పరిశోధనా గ్రంథాలు, చారిత్రక గ్రంథాలు వెలువరించారు.

1. శాసనసంపుటి 1,2 భాగాలు, 2. త్రిపురాంతక దేవాలయ శాసనములు, 3. కందూరిచోడుల శాసనములు – చరిత్ర – సంస్కృతి, 4. బెజవాడ దుర్గామల్లీశ్వరాయ శాసనములు, 5. ముఖలింగ దేవాలయ చరిత్ర – శాసనములు, 6. చెఱకురెడ్డి వంశ చరిత్ర – శాసనములు, 7. గోలకొండ చరిత్ర – సంస్కృతి – శాసనములు, 8. రేచఱ్ఱ రెడ్డివంశ చరిత్ర – శాసనములు, 9. రేచర్ల పద్మనాయకులు, 10. కాయస్థ రాజులు, 11. వేములవాడ చరిత్ర – శాసనములు, 12. మల్యాల వంశ చరిత్ర– శాసనములు.

ఈ విధంగా 12 శాసన సంపుటులు ఒంటిచేత్తో వెలువరించిన శాస్త్రిగారు ఇంకా రెండు మూడు శాసన సంపుటాలను వెలువరించాలనే ప్రణాళికలో ఉండేవారు. అవి విరియాల వంశ శాసనాలు, నతవాడి వంశ శాసనాలు. అదేవిధంగా నృసింహ క్షేత్రాల్లో ఉన్న శాసనాలన్నిటినీ ఏకం చేసి ఒక ప్రత్యేక గ్రంథంగా ప్రచురించాలనుకున్నారు. దీనికి సంబంధించి శాసనాలను సేకరించి శాసన పాఠాలను తయారు చేసుకున్నారు. కాని వారి ఆరోగ్యం క్షీణించడంలో ఈ మూడు గ్రంథరూపం దాల్చలేదు.

శాస్త్రిగారు తమ పరిశోధనలో ఎక్కువగా తెలంగణా ప్రాంతానికి అధిక ప్రాధాన్యం ఇచ్చారు. కారణం ఇక్కడి చరిత్ర, సంస్కృతి ఎంతో విలక్షణమైనవి. శాసనాలు కూడా అధిక సంఖ్యలో ఉన్నాయి. కాని వాటిని పరిశీలించి పరిష్కరించింది తక్కువ. తెలంగాణా ప్రాంతంలో శాసన పరిశోధకులు లేరు అన్న అపప్రథను తొలగించడానికే శాస్త్రిగారు అధిక సంఖ్యలో శాసన సేకరణ చేసి పుస్తకరూపంలో ప్రచురించారు. వారు ప్రకటించిన శాసన సంపుటాలలో తెలంగాణ ప్రాంతాన్ని పాలిస్తూ స్వతంత్రులైన రాజన్యుల శాసనాలే అధికంగా ఉన్నాయి. తెలంగాణలోని చిన్న చిన్న సామంతరాజులు స్వతంత్రులై రాజ్యాలను స్థాపించినవారికి చిన్న రాజ్యాల రాజులను గూర్చి కూడా ప్రత్యేకంగా శాస్త్రిగారు పేర్కొన్నారు.

ప్రాంతీయ భేదం లేకుండా త్రిపురాంతకం, ముఖలింగం, బెజవాడ దుర్గామల్లీశ్వరాలయ శాసన సంపుటాలను కూడా ప్రచురించారు.

అదేవిధంగా ప్రభుత్వంవారు ప్రచురించిన జిల్లా గెజిటీర్ల లాగా తెలంగాణకు సంబంధించి మూడు జిల్లా సర్వస్వాలను ప్రచురించారు. కృష్ణా, గుంటూరు తదితర ఆంధ్రప్రాంత జిల్లాలకు సర్వస్వాలు అంతకు పూర్వమే వెలువడ్డాయి. తెలంగాణ ప్రాంతంలో అటువంటి సర్వస్వాలు ఉండాలనే కాంక్షతో మొదటగా స్వంత జిల్లా అయిన నల్లగొండ మండల సర్వస్వం ప్రచురించారు. ఆ తరువాత ఆదిలాబాదు, మహబూబ్‌నగర్ జిల్లా సర్వస్వాలను ప్రచురించారు. ఇవన్నీ వారి స్వంత ఖర్చుతో ముద్రించినవే. మహబూబ్‌నగర్ జిల్లా సర్వస్వం ఒక పెద్ద ఉద్గ్రంథం. దాదాపు రెండువేల పేజీలతో కూడిన సమగ్ర జిల్లా స్వరూపం అందులో మనకు కన్పిస్తుంది. ఆ సర్వస్వం మూసీ పత్రిక ద్వారా తొందరలోనే కొత్తరూపంలో వెలుగు చూడబోతుంది. ఇంకా వరంగల్‌జిల్లా సర్వస్వాన్ని రూపకల్పన చేసుకున్నారు. కాని అది కార్యరూపం దాల్చలేదు.

"భారతదేశ చరిత్ర" అనే బృహత్ప్రణాళికను నెత్తిన వేసుకుని 27 సంపుటాలుగా విభజన చేసుకుని అందులో 21 సంపుటాలు ఒక్కరే వెలుగులోకి తెచ్చారు. శాస్త్రిగారి కంటే పూర్వం భారతదేశ చరిత్రను ఉత్తర భారతీయులు, లేదా భారతీయ విద్యాభవన్ వంటి సంస్థలు మాత్రమే ప్రయత్నం చేశారు. వారు ఎక్కువగా ఉత్తరదేశ చరిత్రకు ఆంగ్లేయుల చారిత్రక గ్రంథాల ఆధారంగా చరిత్ర నిర్మాణం చేశారు. కాని శాస్త్రిగారు ఆ తప్పిదం చేయలేదు. దక్షిణభారతదేశ చరిత్ర ఎంతో గొప్పనైనదని, ఇక్కడ ఉన్న సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారాలు, చరిత్ర, దేవాలయాలు, వాటిలో ఉండే శాసనాలు చాలా విలువైనవని, కాబట్టి భారతదేశ చరిత్రలో ఈ ప్రాంతాలకు సముచిత స్థానం లభించాలని అనుకున్నారు.

ఆ వరుసలోనే వారు ఏ చరిత్రకారుడు చేయని యుగవిభజన చేసుకున్నారు. అందులో ప్రత్యేకంగా దక్షిణాపథాన్ని పరిపాలించిన చిన్న రాజ్యాలైన కాకతీయులు, విజయ నగర రాజులు, దక్కన్ సుల్తానులు అని దక్షిణాది చరిత్రకు ప్రాధాన్యాతనిచ్చారు.

శాసన, చరిత్ర పరిశోధనలో ఒక నూతన ఒరవడిని ప్రారంభించి, చారిత్రక ఆధారాలతో పాటు స్పష్టమైన చారిత్రకాధారాలను సంపాదించి, పరిశోధనా రంగంలో అగ్రగామిగా నిలిచారు. వీరు చేసినన్ని రచనలు, చేసిన పరిశోధనలు తెలంగాణా ప్రాంతంలో మరే పరిశోధకుడు చేయలేదని ఘంటాపథంగా చెప్పవచ్చు. సుమారు 50 పుస్తకాలు చరిత్ర, శాసన సంబంధమైనవి ఉన్నాయి. అదేవిధంగా పరిశోధనా రంగంలో అడుగిడక పూర్వం సాహిత్యంలో సృజనాత్మక ప్రక్రియలైన నవల, కథ, నాటిక, గేయనాటికలు వంటివి కూడా 20 వరకు రచించారు. ఇవే కాక భారతి, సుజాత, ఆంధ్రపత్రిక వంటి పత్రికల్లో, వివిధ సాహిత్య ప్రత్యేక సంచికల్లో వందల కొద్ది వ్యాసాలు రచించి కొత్తకోణంలో ఆలోచించి భావి పరిశోధకులకు మార్గదర్శకులుగా నిలిచారు.

చరిత్ర, శాసనాలు ఎంతటి అభిమాన విషయాల్లో సాహిత్యం అంటే కూడా అంతే గౌరవం. భారతి వంటి పత్రిక తెలంగాణ ప్రాంతం నుండి ఉండాలని అనుకుని భారతి పత్రికను ఆదర్శంగా తీసుకుని ఇక్కడి ప్రాంతానికి అద్దం పట్టే విధంగా 'మూసీ' అనే సాహిత్య, సాంస్కృతిక, చారిత్రక పత్రికను ప్రారంభించారు. భుక్తికోసం అనేక ప్రాంతాలు తిరుగుతూ అదే సమయంలో ప్రవృత్తియైన శాసన సేకరణ చేస్తూ, పత్రికను ఎంతో కష్టంగా నిర్వహించేవారు. ఎవరి సహాయ సహకారాలు ఆశించేవారు కాదు. 1980 – 86 వరకు పత్రికను నిరాఘాటంగా నడిపించారు. పరిశోధనవైపు దృష్టి సారించిన తర్వాత పత్రికా నిర్వహణ సాధ్యపడలేదు. మూసీ పత్రికకు ఆ పేరు పెట్టడానికి కూడా వారి ఉద్దేశం నల్లగొండ జిల్లాలో కృష్ణకు ఉపనది ఈ ముచికుంద. కాబట్టి కృష్ణమ్మ తల్లి ఏవిధంగా ఎటువంటి ఆటంకాలు లేకుండా ప్రవహిస్తుందో ఈ మూసీ కూడా ఆవిధంగా సాహిత్యలోకంలో ప్రవహించాలని ఆ పేరు నిర్ణయించుకున్నారు.

మూసీ తిరిగి 1997లో పత్రిక పునఃప్రారంభించబడింది. అప్పటినుండి నేటివరకు పత్రిక అనేక ఇబ్బందులను ఎదుర్కొంటూనే విశ్వవిద్యాలయాల్లో పరిశోధనాత్మక విలువలున్న పత్రికగా గుర్తింపు పొందింది. 'మూసీ పత్రిక సాహిత్య సేవ' అనే అంశంపై శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో పరిశోధన జరిగింది.

పరిశోధన, పత్రిక నిర్వహణ, వ్యాపారం శాస్త్రిగారి ఒక పార్శ్వాన్ని మనం చూస్తాం. మరో దిక్కు వారి జీవిత ఆశయం, కల హరిహర త్రిశక్తి దేవస్థానం రూపకల్పన. దీనికై వారు స్వగ్రామమైన వలిగొండలో మూసీ నదీ తీరంలో తొమ్మిది ఆలయాలకు శంకుస్థాపన చేసి నిర్మాణం

కొండపల్లి

విజయవాడకు 15 కి.మీటర్ల దూరంలో కొండపల్లి వుంది. కొండపల్లి ఖిల్లాగా ఇది ప్రసిద్ధి చెందింది. కొండపల్లి అనగానే మనకు కొండపల్లి బొమ్మలు హస్తకళలు మాత్రమే గుర్తుకొస్తాయి. కానీ, దీనికి చారిత్రక ప్రాధాన్యత కూడా వుంది. కొండవీటి రాజ్యాధిపతులలో పేరెన్నికగన్న ప్రోలయ వేమారెడ్డి కొండపల్లిలో క్రీ.శ. 1360 సం॥లో అభేద్యమైన దుర్గాన్ని నిర్మించి పరిపాలన సాగించారు. అనంతరం ఒరిస్సా గజపతులు, బహమనీ సుల్తానులు, కృష్ణదేవరాయలు, ఆ పిమ్మట ఆంగ్లేయులు ఈ దుర్గాన్ని పాలించారు. శ్రీకృష్ణదేవరాయలు ఈ దుర్గాన్ని స్వాధీనం చేసుకోవడానికి 6 నెలలపాటు యుద్ధం చేయవలసి వచ్చింది. అనేక రాజవంశీయుల చేతుల్లో భయంకర దాడులకు గురై ప్రస్తుతం నామమాత్రంగా ఈ దుర్గం నామమాత్రంగా వుంది. గోలకొండ ద్వారం, ఎర్రబురుజు, హనుమంతుని కొండ బురుజు మొదలైనవి ఇప్పటికీ బాగానే ఉన్నాయి. ఇప్పటికీ యాత్రికులు ఖిల్లా దర్శిస్తుంటారు.దీనిని ఒక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వం ప్రయత్నాలు ప్రయత్నాలు చేస్తోంది.

ఒక కృష్ణానదికేగాక దాని ఉపనదులైన తుంగభద్రా, భీమరథీ (మలాపహారిణి) అను ఈరెండునదులకు కూడా పుష్కరములు ఏర్పడుతాయి. గురువు వృశ్చికరాశిలో ఉన్నప్పుడు భీమరథికి, మకర రాశిలో ఉన్నప్పుడు తుంగభద్రకు పుష్కరములు వస్తాయి. ఆ సమయములందు ఈనదులలో స్నానం అత్యంత పుణ్యప్రదం. ఈరకంగా కృష్ణా, తుంగభద్రా, భీమరథి ఈ మూడు పుష్కరనదుల అపూర్వకలయిక ఇది.

❖ ❖ ❖

"ఎన్నోనదులను తనలో విలీనం చేసుకొన్న కృష్ణానది ఒక అపూర్వమైన జలరాశి. ప్రకృతి సౌందర్యంతో తులతూగే అందాలరాశి. మహాసౌందర్య వారాశి. జనులకు పుణ్య సంపదలనిచ్చే సౌభాగ్యరాశి. భక్తజనుల పాలిట పుణ్యరాశి."

ప్రారంభించినారు. ఎవరినీ ధనరూపంలో సహాయం అర్థించలేదు. తను రచించిన గ్రంథాలను అమ్మి వాటిద్వారా వచ్చిన ఆదాయంలో కొంత గృహనిర్వహణకు ఖర్చు చేసి మిగతా సొమ్ముతో ఆలయాల నిర్మాణం, దాన ధర్మాదులకు వెచ్చించేవారు. ఆ క్రమంలోనే దాదాపు యాభైశాతం దేవాలయాల నిర్మాణం జరిగింది. అనారోగ్య పరిస్థితుల కారణంగా, వారి మరణసమయానికి ఆ నిర్మాణం పూర్తికాలేదు.

వారి సంకల్పబలం ఎంతో గొప్పది. అదే నేడు ఆలయాల నిర్మాణ పూర్ణతకు ఉత్తేజాన్నిచ్చింది. వేదసంస్కృతి పరిషత్ ఆధ్వర్యంలో భారతదేశంలో ఎక్కడా లేనివిధంగా ఒకే పీఠంపై త్రిమాతలు – మహాకాళి, మహాలక్ష్మి, మహా సరస్వతి, వారి ఇష్టదైవమైన శివుడు (మరకత లింగం), శ్రీదేవి, భూదేవి సహిత కళ్యాణ వేంకటేశ్వరుడు, సిద్ధి,బుద్ధి సహిత వినాయకుడు, వల్లీ దేవసేనా సహిత సుబ్రహ్మణ్యస్వామి, పంచముఖ ఆంజనేయుడు, మేధా దక్షిణామూర్తి, లక్ష్మీ హయగ్రీవుడు, సూర్యభగవానుడు, మహామేరువు శ్రీచక్రం, నవగ్రహ మంటపముతో సర్వదేవతలకు నిలయంగా విద్యలకు నిలయంగా వలిగొండగ్రామంలో శ్రీవిద్యాపురంలో 'హరి హర త్రిశక్తి స్వరూప ఇష్టకామేశ్వరీ దేవస్థానంలో కొలువై ఉన్నారు. ఇది వారి కలలకు ప్రతిరూపం.

ఒక వ్యక్తి ఒక రంగంలో రాణించి అత్యున్నత స్థాయికి చేరుకుంటే జీవితంలో అతడు పరిపూర్ణవ్యక్తిగా కీర్తింపబడుతాడు. అదే పలురంగాల్లో ఎవరూ చేరలేని ఎత్తుకు ఎదిగితే ఒకరకంగా అతడిని ఋషిగానే పరిగణిస్తాము. అటువంటి ఋషితుల్యుడు శ్రీ బి.ఎన్. శాస్త్రిగారు. తాను అనుకున్న కార్యాన్ని చేసుకుపోవడమే తప్ప ఫలితాలకై ఆశించలేదు. ఏ ప్రభుత్వ, సంస్థల సహాయాన్ని అర్థించలేదు, ఏ అవార్డులను, సన్మానాలను ఆశించలేదు.

ఆంధ్రదేశంలో మల్లంపల్లి సోమశేఖరశర్మ, నెలటూరి వెంకట రమణయ్య, మారేమండ రామారావు, కొమర్రాజు వెంకట లక్ష్మణరావు వంటి చారిత్రకులతో సమానంగా తెలంగాణ ప్రాంతంలో ఇక్కడి చరిత్ర, చీకటి కోణాలను గురించి వేలాది శాసనాలను సేకరించి సాక్ష్యాధారాలను తీసుకువచ్చిన చారిత్రక భగీరథుడు శ్రీ బి.ఎన్. శాస్త్రిగారు.

అందుకే శాస్త్రిగారి అభిమానియైన శ్రీ గంజి సత్యనారాయణ గారు నాలుగు వాక్యాల్లో శాస్త్రిగారి నిలువెత్తు వ్యక్తిత్వాన్ని మనకు చూపించారు.

"శాస్త్రి నుడివితే
ప్రతి మాటా శాసనమౌతుంది
శాస్త్రి అడిగితే
రాయైనా తన చరిత్ర చెబుతుంది".

❖ ❖ ❖

పాలమూరు మహామండలంలో శ్రౌత విద్వాంసులు

- గంగాపురం హరిహరనాథ్

పాలమూరు మహామండలం ప్రాచీనకాలం నుండి వేదశాస్త్రాల అధ్యయనంలో, శ్రౌతస్మార్త కర్మకాండ నిర్వహణలో ఎంతో గణనీయమైన కృషి సల్పిన ఉద్ధండ పండితులెందరో జన్మభూమిగా ఉండినది. పందొమ్మిది, ఇరవై శతాబ్దులలో కూడ న్యాయ, వైశేషిక, వ్యాకరణాది దర్శనాల్లో, ఋగ్యజుఃసామవేదాల్లో నిష్ణాతులైన విద్వత్ప్రవరులు అనేకులుండేవారు. ముఖ్యంగా కొల్లాపురం, మహబూబ్‌నగర్, అచ్చంపేట, వనపర్తి, ఆత్మకూరు, నాగర్‌కర్నూలు, కల్వకుర్తి తాలూకాల్లో ఎందరో శాస్త్రకోవిదులుండేవారు. నాగర్‌కర్నూల్ రెవెన్యూ డివిజన్‌లో ఆలేరు, పొలుమూరు, మేడిపూరు, రఘుపతిపేట, తాడూరు, గగ్గలపల్లి మొదలైన గ్రామాల్లో ఉండిన శ్రౌతవిద్వాంసులు దక్షిణాపథానికే అలంకార ప్రాయంగా ఉండేవారు.


కేవలం వేదాధ్యయనంలోనే కాక వేదవిహిత కర్మానుష్ఠానంలో కూడ ఈ మహనీయులు ప్రశంసనీయమైన పాత్ర నిర్వహించినారు. అగ్నిష్టోమాది శ్రౌతయాగాల నిర్వహణకై అధ్వర్యుడు, హోత, ఉద్గాత, బ్రహ్మ మొదలైన షోడశ ఋత్విగ్వర్గం అవసరం. కనుక ఇచటి శ్రౌతతంత్ర కోవిదులు 16 మంది ఒక జట్టుగా ఏర్పడి, కర్నాటాంధ్ర మహారాష్ట్రాది ప్రాంతాలకు వెళ్ళి హోత్రం ఆధ్వర్యవం, ఔద్గాత్రం నిర్వహించి, అచట ఘనంగా భూరిదక్షిణలచే సత్కృతులై వచ్చిన సందర్భాలు అనేకం ఉన్నవి.

బాదామి చాళుక్యాది రాజవంశీయులు స్వయంగా అశ్వమేధ, వాజపేయాది యజ్ఞాలను అనుష్ఠించడమే కాక, వేదశాస్త్ర విద్యల వికాసానికై బహుళాగ్రహారాలు నెలొకల్పి భారతీయ జ్ఞానవిజ్ఞానాలను ప్రోది చేసినారు. సార్వభౌములు స్వయంగా సూర్యచంద్ర గ్రహణాది పర్వదినాల్లో విభిన్నప్రాంతాలకు వెళ్లి, అచటి పండిత ప్రవరులను ఆహ్వానించి, భూదానాదులచే సత్కరించేవారు.

బాదామి చాళుక్యసార్వభౌముడైన రెండవ పులకేశి (క్రీ.శ. 610-650) కార్తిక పూర్ణిమనాటి చంద్రగ్రహణ సందర్భంగా కృష్ణాతుంగభద్రా నదుల సంగమంలోగల సంగమేశ్వర స్వామి సన్నిధిలో సాంగవేద విదుడైన మావుగణస్వామికి 25 నివర్తనాల భూమిని (ఇప్పటి 125) ఎకరాలు ధారాదత్తం చేసి సంస్కృత తామ్ర శాసనాన్ని వేయించినాడు. దీనితో ఈ జిల్లా వేదపండితుల చరిత్ర ప్రారంభమౌతుంది.

మావుగణస్వామి 'సకలజన సంస్తూయమాన స్వచారిత్రోపచిత పుణ్యకర్ముడుగా, వేదవేదాంగేతిహాసవిదుడుగా, షట్కర్మ నిరతుడుగా, ఇందుపురేవు ఘటికాసామన్యుడైన మంత్రమాలరేవ స్వామి పుత్రుడుగా తుంబేయలూరు శాసనంలో శ్లాఘింపబడినాడు. ఇతని తండ్రి మంత్రహూతి రేవస్వామి గొప్ప విద్యాసంస్థయైన ఘటికాస్థానానికి కులపతిగా ఉండేవాడు. వీరు ఆపస్తంబసూత్రులు. ఆత్రేయసగోత్రులు.

సుదర్శనాచార్యుడు :



రెండవపులకేశి పుత్రుడైన రాజాధిరాజ పరమేశ్వరుడు మొదటి విక్రమాదిత్యుడు క్రీ.శ. 650లో కృష్ణాతీరంలోని మఱ్ఱూరున విడిసి శివమంత్రలదీక్షలో ఉండి, వంగూరివాటి విషయంలోని ఇపరుంకల్లు (నేటి దీపెనగండ్ల) గ్రామాన్ని సర్వకరపరిహారంగా లకులీశపాశుపత సిద్ధాంతవేదియైన సుదర్శనాచార్యునికి వైశాఖపూర్ణిమనాడు గురుదక్షిణగా సమర్పించినాడు. సుదర్శనాచార్యుడు కూడ రాజుకు శివమండలదీక్ష నడిపిన 27 మంది పాశుపతాచార్యులకు ఆ గ్రామాన్ని మరల పంచియిచ్చినాడు.

మాధవస్వామి :

చాళుక్య విక్రమాదిత్య చక్రవర్తి (క్రీ.శ. 682) పానుంగల్లు నగరంలో దండు విడిసి, వైశాఖపూర్ణిమనాడు వేదవేదాంగ పారగుడైన మాధవస్వామికి కృష్ణవేణానది దక్షిణతీరంలోగల పళియల గ్రామాన్ని ధారాదత్తం మొనర్చి సత్కరించినాడు.

భాస్కరరాయలు :

శాక్తతంత్రేతిహాసంలో భాస్కరరాయలపేరు సువర్ణాక్షరాలలో రాయదగింది. 17వ శతాబ్ది అంతంలో ఈ మహనీయుడు భాగ్యనగరంలో జన్మించినట్లు భాస్కరవిలాసకావ్యంవల్ల తెలుస్తుంది. ఇతడు నారాయణపేట సమీపంలోగల లోకాయవల్చి సంస్థానంలో

అష్టాదశ విద్యలలో నిపుణుడైన నృసింహయజ్వ వద్ద విద్య నభ్యసించినట్లు లలితాసహస్రనామ భాష్యమైన సౌభాగ్యభాస్కరంవల్ల విదితమవుతుంది. పూర్వమీమాంసాది శాస్త్రాల్లోను, శాక్తాగమాల్లోను అపారవైదుష్యాన్ని సంపాదించిన ఇతడు 'పదవాక్యప్రమాణ ధురీణుడు'. వరివస్యారహస్యం, నిత్యషోడశికార్ణవటీక సేతువు, మీమాంసావాద కుతూహలం వంటి అనేక ప్రామాణిక గ్రంథాలు ఇతని లేఖినినుండి వెలువడినవి.

అల్వాల శేషావధానులు : (క్రీ.శ. 1820 ప్రాంతం)

అవధానులవారు రఘుపతిపేట వాస్తవ్యులు. ఋగ్వేదంలో పద, క్రమాది ప్రకృతిత్రయం, జటామాలాది అష్టవికృతుల సమగ్రంగా తెలిసిన సలక్షణఘనపాఠులు. సాంగవేదవిదులైన వీరికి తెలుగు, దేవనాగరి లిపుల పరిచయం ఏమాత్రం లేకుండేది. లిఖితపాఠకుల అధమ పాఠకులన్న పాణినీయ శిక్షను దృష్టిలో వుంచుకొని కావచ్చు వారి గురువర్యుడు ఉత్తమ పాఠకునికి లిపిజ్ఞానం అణవశ్యకమని తలచియుంటాడు.

శేషావధానులవారు గురుముఖం నుండి వెలువడిన వేదపాఠాన్ని వినినంతనే అపారమైన ధారణాశక్తిచే సస్వరం హృదయంలో భద్రపరచుకొనేవారు. శ్రద్ధామేధాశక్తులు అతనికి ఊడిగం చేసినవి. వేదానికి శ్రుతియన్న పేరు వీరి విషయంలో సార్థకమైంది.

అవధానిగారు మేడిపూరులో గంగాపురం వేంకటేశమయ్య, పాపంభట్టుగారలు స్థాపించిన వేదపాఠశాలలో ఋగ్వేదాచార్యులుగా వుండేవారు. పాపంభట్టు పుత్రులు గంగాపురం నృసింహచయనులు, మొగిలిగిద్ద గొడవర్తి రామసోమయాజులు వంటి ప్రసిద్ధులెందరో వీరివద్ద వేదాధ్యయనం కావించినారు.

శేషావధానులవారు శ్రౌతవిద్యయందు కూడ గొప్ప వైదుష్యం కలవారు. తాడూరులో ఒకసారి ఒక మహాక్రతువు జరిగింది. ఈ ప్రాంతంలో ఏ యజ్ఞం జరిగినా త్రిసూత్రపారగులైన ఆలూరు రామసోమయాజులవారు లేకుండ నడిచేదికాదు. ఏ కారణంగానో ఆ యజ్ఞానికి ఆలూరి రామసోమయాజుల వారిని పిలువలేదు. యాగం ముగిసిన తర్వాత తెలిసి, తమకు దాని ఆహ్వానం అందకపోయినందుకు కినుక వహించి, ఆ యజ్ఞంలో హౌత్రం నిర్వహించిందెవరో యని జాడదీయపూనుకొన్నారు. అచట హౌత్రం చేసింది శేషావధానులని తెలిసి, వారిని పరీక్షించి, వారి యోగ్యతను బహిర్గతం చేయదలచి, తమ కుమారుని వెంటనిడుకొని రామసోమయాజుల వారు మేడిపూరుకు చేరుకొన్నారు. అచట శేషావధానులను కుశలప్రశ్నలడుగుతూ, మెల్లగా హౌత్రతంత్రాన్ని నిర్వహించే విధిని గూర్చి ప్రశ్నిస్తూ వాదంలోకి దింపినారు. నివురుగప్పిన నిప్పువలె వున్న అవధానుల వారి అపారశ్రౌత పరిజ్ఞానం అగ్నిమోత్రుని నుండి వెడలే ప్రకాశంవలె అప్పుడు ఒక్క వెలుగు వెలిగింది. దానికి వచ్చి పండితులు ఇద్దరూ ఆశ్చర్యపోయినారు. వెంటనే సంచిలో దాచి వుంచిన జోడుశాలువలను అవధానులవారికి కప్పి నమస్కారపూర్వకంగా సత్కరించినారు. అనుకోకుండ తమ ఇంట



జరిగిన ఈ అద్భుత సన్నివేశానికి పులకితులైన వేంకటేశమయ్యగారు త్రేతాగ్నులవలె దర్శనమిచ్చిన ఆ పండితత్రయాన్ని ఘనంగా సన్మానించి కృతార్థులైనారు.

గంగాపురం నృసింహచయనులు (1842-1924):

వీరు పాపంభట్టుగారి జ్యేష్ఠపుత్రులు. వీరు తమ తండ్రిచే స్థాపించబడిన వేదపాఠశాలలో ఋగ్వేదాన్ని, శ్రౌతవిద్యను అభ్యసించినారు. గొప్ప మేధావులు, చమత్కారచతురులు. ఋగ్వేద పారంగతులే కాక శ్రౌతవిద్యలోను ప్రవీణులు. వీరు స్వయంగా అగ్నిష్టోతమ అగ్నిచయనాది మహాక్రతువు లెన్నిటినో అనుష్ఠించిన కర్మఠులు. అనేక విద్యలలో ప్రవేశం కలవారు, వ్యవహారదక్షులు. వీరివలె పాలమూరు మండల చరిత్ర సమగ్రంగా తెలిసినవారు ఆనాడు మరొకరులేరు. నిత్యాగ్ని హౌత్రులు వీరు.

గంగాపురం జ్వాలానృసింహ దీక్షితులు (1887-1947):

దీక్షితులవారు పాపంభట్టుగారి తృతీయ పుత్రులు. క్షయ సం॥ పుష్య శుద్ధ ఏకాదశినాడు వీరు జన్మించినారు. శ్రౌతవిద్యలో, ధర్మపూర్ణమాసేష్టులను నిర్వహించడంలో, స్మార్తయాజ్ఞిక తంత్రంలో వీరు సమర్థులు. బహుధాన్య సం॥లో వీరు అగ్న్యాధాన క్రతువును అనుష్ఠించినారు. అగ్న్యాధాన క్రతువును ఆచరించినవారికే దీక్షితులు అనే సార్థకనామం. జీవితాంతం ప్రతినిత్యం త్రేతాగ్నులను అర్చించిన ఆగహితాగ్నులుగా చరితార్థులైనారు. వీరి ధర్మపత్ని రామకిష్టమ్మ హవిర్దేవి.

గంగాపురం నృసింహదీక్షితులు (1909-1968):

దీక్షితులవారు శా.శ. 1831, సౌమ్య సం॥ కార్తిక బహుళ ప్రతిపద (క్రీ.శ. 28.11.1908) నాడు రోహిణీ నక్షత్రంలో మధ్యాహ్నం 1.30 గం.లకు గంగాపురంలో మాతామహుల ఇంట జన్మించినారు. వీరి తలిదండ్రులు మేడిపూరు వాస్తవ్యులైన రామకిష్టమ్మ, జ్వాలా నృసింహ దీక్షితులు. దీక్షితుల వారికి గర్భాష్టమంలో ఉపనయనం జరిగింది.

పెదనాయనగారైన నృసింహచయనుల వద్ద, పొలుమూరు వాస్తవ్యులు మాణిక్యావధానులు, నృసింహావధానుల కడ, గౌరవరం నృసింహావధానుల కడ ఋగ్వేదాన్ని, హౌతృతంత్రాన్ని అధ్యయనం చేసినారు. గగ్గలపల్లిలో దుర్గి నృసింహ శ్రౌతి వద్ద అధ్వర్యుపరమైన

శ్రౌతవిద్యను యజుర్వేదాన్ని అధ్యయనం చేసినారు. దీక్షితులవారు శ్రౌతసిద్ధాంత కోవిదులేగాక శ్రౌతకర్మానుష్ఠానంలో అపారమైన భక్తిశ్రద్ధలు కలవారు. సప్తపాక సంస్థలు, సప్తహవిఃసంస్థలు అనుష్ఠించి, సప్తసోమ సంస్థలలో మొదటిదైన అగ్నిష్టోమాన్ని చేయుటకు సంకల్పించినారు. అయితే అందలి పశుబలి విధి వారి సంకల్పాన్ని వెనుకకు లాగింది. పశువిశసనం లేకుండ యాగవిధిని సంస్కరించి అందరి ఆమోదంతో ఆ యాగాన్ని చేయవలెనని వారి యత్నం. అందుకై అఖిలభారతం పర్యటించి, పీఠాధిపతులను, పండిత ప్రకాండులను కలిసి తమ వాదంలోని ఔచిత్యాన్ని తెలియజేసినారు. పూనాలోని మహామహోపాధ్యాయ దత్తోవామన్‌పోద్దార్ వంటి పండితులు వీరి వాదాన్ని బలపరిచినారు.

శ్రీశృంగేరి జగద్గురువులు అభినవ విద్యాతీర్థస్వామివారు శ్రీశంకర మఠస్థాపన సందర్భంగా హైదరాబాదుకు వచ్చినపుడు వారి ముందు దీక్షితులవారు పశురహితంగా అగ్నిష్టోమం చేయడానికి అభ్యర్థించినారు. దీనికి జగద్గురువులు స్పందిస్తూ, అహింస ఆమోదయోగ్యమే కాని శాస్త్రాన్ని సంస్కరించడం సాధ్యంకాదు. అగ్నిష్టోమ ఫలాన్ని సంపూర్ణంగా ఇవ్వగల పశువిశసనం లేని చాతుర్మాస్య యాగాన్ని అనుష్ఠించవలెనని స్వామివారు ఆదేశించినారు. శార్వరి వైశాఖ మాసంలో (1960), దీక్షితులవారు తమ స్వగ్రామంలో చాతుర్మాస్య యాగాన్ని ఆచరించినారు.

దీక్షితులవారు ప్రత్యక్ష పశురహితంగా శ్రౌతయాగ నిర్వహణ విషయమై ఉద్యమం నడిపినా, పీఠాధిపతుల మాటకే తలొగ్గవలసి వచ్చింది. ఇదంతా 55 ఏండ్ల క్రింద తీఇసంగతి. ఇపుడు కాలం మారింది. ఆలోచనల్లో క్రాంతి వచ్చింది. తర్వాత కేరళలోను, ఆంధ్రదేశంలోను, ఇంకా ఇతరత్ర పీఠాధిపతులకు చెప్పినామని కొందరు స్వతంత్రించి కొందరు ప్రత్యక్ష పశురహితంగా అగ్నిష్టోమాదులను నిర్వహిస్తున్నారు. దీక్షితులవారి వాదం ఇంతకాలానికి ఈ రూపంలో సఫలమైంది.

నృహరి దీక్షితులు (1916–1999) :

వీరు జావ్లఆ నృసింహ దీక్షితుల రెండవ కుమారులు. పింగళ సం॥ జ్యేష్ఠ శుద్ధ చతుర్దశి వీరు జన్మించిన దివసం. అన్నగారైన నృసింహ దీక్షితుల వద్ద ఋగ్వేదాన్ని యాజ్ఞికతంత్రాన్ని, వాజపేయాది యజ్ఞాల్లో హౌత్రాన్ని నిర్వహించే సామర్థ్యాన్ని సంపాదించినారు. ఋగ్యజుఃస్మార్త యాజ్ఞిక విద్యలలో విశేషప్రజ్ఞ కలవారై ఎదురులేని యాజ్ఞికులుగా కీర్తింపబడ్డారు. జ్యోతిఃశాస్త్ర, ధర్మశాస్త్రాలందు దేవతా ప్రతిష్ఠల నిర్వహణలో పరినిష్ఠిత జ్ఞానాన్ని సాధించినారు. స్వయంగా అగ్న్యాధానాన్ని అనుష్ఠించి శ్రౌతాగ్నుల బహుకాలం అర్చించినారు.

తాడూరు అన్నయసోమయాజులు (1850 ప్రాంతం) :

వీరు సప్తపాకసంస్థలు, సప్తహవి సంస్థలనే కాక సప్తసోమ సంస్థలను కూడ అనుష్ఠించిన యజ్ఞపరతంత్రులు. శ్రౌతాదివిద్యలందు చక్కని నైపుణ్యంకలవారు, పరమబ్రహ్మణ్యులు, నిరతాన్నదాతలు.

భోగలింగ చయనులు (1815 ప్రాంతం) :

చయనులవారు కూడా తాడూరువారే. వీరు శ్రౌతవిద్యయందు సమగ్ర వైదుష్యాన్ని సంపాదించి, చయనాంతం క్రతువుల ననుష్ఠించిన కర్మఠులు, గొప్ప మంత్ర శాస్త్రవేత్తలు, వీరు సన్న్యసించి రామానంద ఘనేంద్రయతీంద్రులుగా ప్రసిద్ధులైనారు. శతాధిక గ్రంథకర్తలైన కల్వకుర్తి నారాయణాధ్వరికి ఆధ్యాత్మిక గురువులు.

బుగ్గన్న, రామన్నలు :

తాడూరు వీరి నివాసం. సప్తస్వరబద్ధంగా సామగానం చేయడంలో, శ్రౌతయజ్ఞాల్లో ఔద్గాత్రం నిర్వహించడంలో వీరు నేర్పరులు.

దుర్గిబారయ దీక్షితులు (క్రీ.శ. 1830) :

వీరు కాశ్యపసగోత్రులు, గగ్గల పల్లివాస స్థానం. యజుర్వేద పారంగతులు; శ్రౌతవిద్యానిధులైన వీరు అగ్న్యాధానం చేసిన కర్మపరతంత్రులు. కాశీయాత్రకు వెళ్ళి, అచట సహస్ర బ్రాహ్మణ భోజనం చేయించినారు.

దుర్గి నరసింహశ్రౌతి (1860) :

వీరు బారయ దీక్షితుల పుత్రులు. తైత్తిరీయ సంహితను ఆమూలాగ్రం అధ్యయనం చేసినవారే కాక ఆపొండరీకం అధ్వర్యవం నిర్వహించిన శ్రౌతవిద్యాకోవిదులు. జ్యోతిశ్శాస్త్రంలో ప్రవీణులు.

దుర్గి లక్ష్మినారాయణగారు (1908) :

వీరు నరసింహశ్రౌతుల కుమారులు. యజుర్వేదము, అధ్వర్యుపరమైన శ్రౌతము వీరికి కంఠస్థం.

ఆలేరు యజ్ఞరామసోమయాజులు (1840) :

వీరు కృష్ణయజుర్వేదంలో, శ్రౌతతంత్రంలో, ధర్మశాస్త్రంలో అసాధారణమైన వైదుష్యం కలవారు. సోమయాగాన్ని అనుష్ఠించినవారు.

కఱ్ఱి నర్సిములుగారు :

వీరు యజుర్వేదాన్ని కూలంకషంగా అధ్యయనం చేసినవారేకాక వేణువుద్వారా వేదాన్ని వినిపించేవారు.

ఆలేటి పురుషోత్తమావధానులు :

కృష్ణయజుర్వేదంలో వీరు ఘనాంతస్వాధ్యాయపరులు, శ్రౌత విద్యావేత్తలు.

ఆలేరు సూర్యనారాయణావధాని (1900) :

వీరు ఆలేటివాస్తవ్యులు. కృష్ణయజుర్వేదాన్ని, బ్రాహ్మణాన్ని సమగ్రంగా అధ్యయనం చేసిన పరమనైష్ఠికులు. కావ్యాలంకార శాస్త్రాలను పఠించినవారు.

మణికొండ వెంకయ్య దీక్షితులు (1840 ప్రాంతం) :

మహబూబ్‌నగర్ తాలూకాలో మణికొండ వీరి నివాసస్థానం. సామవేదంలో అనితరసాధ్యమైన వైదుష్యం కలవారై పొండరీకాది క్రతువులలో ఔద్గాత్రం నిర్వహించి, సాటిలేని యశస్సు నార్జించినారు. వీరి వంశీయులగు రామచంద్రయ్యగారు ఔద్గాత్రంలో మంచి ప్రవేశం కలవారు.

సురబిరామ దీక్షితులు (1805 ప్రాంతం) :

దీక్షితులవారు రఘుపతిపేట నివాసులు, ఋక్‌శాఖీయులు,

ఆశ్వలాయనసూత్రులు. వీరికి స్వశాఖాభిమానం ఎక్కువ. ఋగ్వేది అధ్వర్యుడుగా ఉంటేనే అగ్న్యాధానం చేయగలనని ప్రతినపూనిరట! ఆ కాలంలో ఋగ్వేది అయినా ఆధ్వర్యవాన్ని అవలీలగా నడుపగలవారు ఆలూరి రామసోమయాజులు. వీరి ఆధ్వర్యంలో అగ్న్యాధానం చేసినవారు దీక్షితులవారు. ఈ ప్రాంతానికి సభాపతులు కూడ.

తాడూరు శేషదీక్షితులు (1840) :

దీక్షితులవారు యజుర్వేదాన్ని కూలంకషంగా అభ్యసించి, అధ్వర్యుతంత్రాన్ని స్వాయత్తం చేసుకొని, అగ్న్యాధానం మొదలు పొండరీకాంతం ఆధ్వర్యం నిర్వహించేవారు. మైసూరు మొ॥ నగరాల్లో జరిగిన యజ్ఞాల్లో అధ్వర్యులుగా ఉండి కీర్తి గడించినారు.

రేవల్లి వెంకన్నగారు (1840 ప్రాంతం) :

వీరు ఋగ్వేదంలో క్రమాంతస్వాధ్యాయపరులు. షాద్‌నగర్ తాలూకాలోని రేవల్లి వీరి నివాసం. అగ్నిష్టోమం మొదలు అశ్వమేధాంతం హౌత్రం నిర్వహించగల సమర్థులు.

కసబ శ్రీనివాసాచార్యులు (1770–1860) :

వీరు హందాసాచార్యుల పుత్రులు. యజుర్వేదంలో ఘనాంతస్వాధ్యాయపరులు. పన్నెండు పన్నాల శ్రౌతాన్ని నేర్చి, దానికి సంగ్రహార్థం రాసిన మహాయాజ్ఞికులు.

కసబ రాఘవాచార్యులు :

వీరు యజుర్వేదఘనపాఠులు.

కసబ వరదదీక్షితులు (1895) :

వీరి నివాసం బలుమూరు. దీక్షితులవారు గొప్ప శ్రౌత పండితులు. యజుర్వేదంలో గహనమైన పాండిత్యం సంపాదించినవారు. అగ్నిష్టోమాన్ని అనుష్ఠించిన కర్మఠులు.

శ్రీనివాస దీక్షితులు (1840):

మార్కాల వీరి నివాసం. వీరు వడహల సంప్రదాయ శ్రీవైథష్ణవులు, అగ్న్యాధానంచేసి, నిత్యాగ్నిహోత్రులుగా పేరుగాంచినవారు.

అంకూరి వేంకటాచార్యులు (1898) :

వీరు సుప్రసిద్ధ శ్రౌతవిద్వాంసులైన చిఆయక్కచార్యుల కుమారులు, యజుర్వేద సలక్షణ ఘనపాఠులు. వేదానికి విద్యారణ్య భాష్యానుసారం అర్థం చెప్పగల నేర్పరులు. ఆధ్వర్యవం నిర్వహించడంలో సిద్ధహస్తులని కీర్తింపబడ్డారు.

ఆలూరు రామసోమయాజులు (1805 ప్రాంతం) :

వీరు జడ్చర్ల సమీపంలోని ఆలూరు నివాసులు. ఆ కాలంలో దక్షిణభారతంలో మహాయాజ్ఞికులుగా వీరు ప్రసిద్ధులు. వీరు బుక్‌శాఖీయులయ్యు త్రిసూత్రాల్లో ఆరితేరినవారు. హౌత్రం, ఆధ్వర్యవం, ఔద్గాత్రం అనే మూడు తంత్రాలు సమగ్రంగా తెలిసినవారికి త్రిసూత్రజ్ఞులు అని పేరు. అగ్న్యాధానం మొదలు అశ్వమేధాంతం క్రతువుల నిర్వహణలో సవ్యసాచులైన సోమయాజులవారు దక్షిణాపథంలోని అన్ని దేశాల వారిచే యజ్ఞనిర్వహణార్థమై ఆహ్వానింపబడేవారు.

రాజేశ్వర హవిర్యాజి (1820 ప్రాంతం) :

తాడూరు మండలంలోని పొలుమూరు ఋగ్వేదాధ్యాతలకు నిలయం. వీరు ఋగ్వేదంలో క్రమాంత స్వాధ్యాయపరులు, హౌత్రంలో నిపుణులు, అగ్న్యాధానం చేసిన నిత్యాగ్నిహౌత్ర తత్పరులు.

మాణిక్యావధానులు (1850) :

వీరు హవిరాజగారి పుత్రులు. ఋగ్వేదంలో క్రమపాఠులు. దక్షిణదేశంలోని అన్ని ప్రాంతాలకు వెళ్ళి, హౌత్రం నిర్వహించేవారు. వీరి యోగ్యతకు మెచ్చి మహబూబ్ అలీపాదుషా వీరికి వీరి తండ్రికి ప్రతివర్షం గౌరవవేతనం ఇచ్చేవారు.

రామావధానులు (1855) :

వీరు కూడ రాజేశ్వర హవిర్యాజి పుత్రులు. ఋగ్వేదక్రమపాఠులు, గొప్ప హౌతలు. సీతారామావధానులు, వారి పుత్రులు నృసింహావధానులు క్రమపాఠులేకాక ఐతరేయ బ్రాహ్మణంలో, హౌత్రంలో దిట్టలు.

కేశవపంతుల నృసింహావధానులు (1844–1924) :

వీరు పద, క్రమయుత ఋగ్వేదపారగులు. శ్రౌతవిద్యా పారంగతులు. గొప్ప బ్రహ్మణ్యులు, గౌరవరం వీరి ఆవాసం.

వేముల రామచంద్రయాజులు (1825 ప్రాంతం) **:**

వీరు సప్తపాక సంస్థలు, సప్తహవిః సంస్థలు, సప్తసోమ సంస్థలను అనుష్ఠించినవారే కాక ఉత్తరక్రతువులైన పొడరీకాదులను కూడ చేసినవారు. దక్షిణాపథంలో వీరు చేసినన్ని యజ్ఞాలు మరెవ్వరు చేయని కారణంగా భూలోకమహేంద్రులు అన్న సార్థక బిరుదాన్ని పొందినారు.

కల్వకుర్తి నారాయణాధ్వరి (1840–1920) :

ఇంటిపేరు పల్లావారు. శేషమ్మ, లక్ష్మణశాస్త్రి వీరి మాతాపితలు. వీరు అగ్నిష్టోమాన్ని అనుష్ఠించినారు. రామోత్సవ రత్నాకరం, రామోపాసక పద్ధతి అన్న ప్రామాణిక గ్రంథాలు వీరి నుండి వెలువడినవి. శతాధిక గ్రంథకర్తలుగ కీర్తింపబడ్డారు. సంస్కృతాంధ్ర సంకీర్తనలను రచించినారు. అష్టావధానులు కూడ. తుదికి సన్న్యసించినారు.

మొకురాల రామదీక్షితులు (1900–1987) :

వీరిది షాద్‌నగర్ తాలూకాలోని అల్వాల. యజుర్వేదంలో క్రమాంతస్వాధ్యాయపరులు. శ్రౌతకర్మానుష్ఠానంలో అసాధారణ శ్రద్ధ కలవారు. అగ్న్యాధానం చేసి నిత్యాగ్నిహౌత్రతత్పరులుగా విరాజిల్లినారు. హైదరాబాద్ ఫీల్‌ఖానాలో వేదపాఠశాల నడిపినారు. అందులో ఎందరో వేదపండితులు సిద్ధమైనారు. రజాకార్ల కాలంలో పాఠశాల నడపడం కష్టమైనా, వెనుదిరుగక కట్టెలమండి పెట్టి, వచ్చిన కొలదిపైకంతో అధ్యాపకులకు వేతనం చెల్లించేవారు. ❖

ఈ వ్యాస రచయిత మొబైల్ నెం. 9347484200

ఆలంపూరు - సంగమేశ్వరం - సోమశిల క్షేత్రాలు

గడియారం రామకృష్ణశర్మ

ఆలంపూరు

ఆలంపూరు కృష్ణాతీరంలో లేకపోయినా దాని ఉపనది తుంగభద్రా తీరంలో ఉంది. ఇప్పుడు కృష్ణా, తుంగ భద్రా సంగమము ఆలంపూరుకు నాలుగు మైళ్ళ దూరంలో ఏర్పడింది. అందువల్ల ఈ క్షేత్రాన్ని పరిచయం చేయడమైంది.

ఈ క్షేత్రం చాలా ప్రాచీనమైంది. ఈ పరిసరాలలో చరిత్రకందని కాలపు సమాధులున్నాయి. మౌర్యులకాలం నుండి చరిత్ర ఉంది. 7-12 శతాబ్దాల మధ్య నిర్మించబడిన దేవాలయాలున్నాయి. 7-16 శతాబ్దాల నడుమ దక్షిణ దేశాన్ని పరిపాలించిన రాజవంశాల వారు వేయించిన శాసనాలున్నాయి. వైదిక షణ్మతాలకు చెందిన దేవ మూర్తులున్నాయి. తాంత్రికోపాసనల ప్రతీకలున్నాయి. ఈవిధంగా అనేక ధార్మిక వాస్తుశిల్ప విశేషాల ఆకారమైన ఆలంపూరును గురించి ఈ వ్యాసంలో తెలపబూనడం సాహసమే. అయినా యాత్రికుల కొరకై సంగ్రహ పరిచయం చేస్తున్నాను. ఆలంపూరు మహబూబ్‌నగర్ జిల్లాలో సికింద్రాబాద్- ద్రోణాచలం రైలుమార్గంలో ఉంది. కర్నూలుకు సమీపం, కర్నూలు నుండి బస్సు సౌకర్యం ఉంది. ఇది ఉత్తర వాహని తుంగభద్రా తీరంలో నెలకొనివుంది.

క్షేత్రమహిమ : ఇది పురాణ ప్రసిద్ధి పొందిన క్షేత్రం. స్కాందపురాణ శ్రీశైల ఖండంలో ఈ క్షేత్రం ప్రశంసించబడింది.

1. ఇక్కడి దైవం బ్రహ్మేశ్వరుడు. బ్రహ్మదేవుడు ఈ స్థలంలో తపస్సు చేసి ఇక్కడ రసలింగాన్ని ప్రతిష్ఠించి నాడు, అందువల్ల బ్రహ్మేశ్వరుడైనాడు.

2. దక్షిణకాశి - కాశీ క్షేత్రానికీ దీనికి చాలా పోలికలున్నాయి.

3. పరశురామక్షేత్రం - ఇక్కడ జమదగ్ని ఆశ్రమం ఉండేది. ఒకనాడు ఆ మహర్షి భార్య అయిన రేణుకాదేవి మీద కోపంతో ఆమె తల నరుకమని పరశురాముని ఆదేశించెను. అతడు వెంటనే తల్లి తల నరికెను. ప్రసన్నుడైన తండ్రిని తల్లిని బ్రతికింపగోరెను. ఆమె తల చండాలవాటికలో పడినందున వీలుకాలేదు. ఆ తల 'ఎల్లమ్మ'గాను, మొండెము 'భూదేవి'గాను జనులచే ఆరాధించబడునట్లు అనుగ్రహించెను. భూదేవి సంతాన హీనులచే పూజింపబడుతూ సంతానదాయిని అయి ఉంది.



4. భాస్కరక్షేత్రం - ఎక్కడ షణ్మతాలకు చెందిన దేవతలకు గుడులుంటాయో ఆ క్షేత్రాన్ని భాస్కర క్షేత్రం అంటారు. భారతదేశంలో ఇవి పది ఉన్నాయి. ఇదొకటి.

5. శ్రీశైల పశ్చిమద్వారం - శ్రీశైల క్షేత్రానికి నాలుగు దిక్కులలో నాలుగు ద్వారాలున్నాయి. తూర్పున 'త్రిపురాంతకము', దక్షిణాన 'సిద్ధవటం', పశ్చిమంలో 'ఆలంపూరు', ఉత్తరాన 'ఉమామహేశ్వరం' నాలుగు ద్వారాలుగా ఉన్నాయి.

6. మహాశక్తి పీఠం - అష్టాదశ శక్తిపీఠాలలో ఒకటైన శ్రీజోగుళాంబా పీఠం ఇక్కడ ఉంది.



స్థల చరిత్ర : ఈ ప్రాంతాన్ని మౌర్యులు, శాతవాహనులు, ఇక్ష్వాకులు పాలించినట్లు ఆధారాలున్నాయి. బాదామి చాళుక్యుల నుండి విజయనగర రాజుల వరకు వారివారి శాసనాలున్నాయి. రెండవ పులకేశి కంచి పల్లవులను జయించి అక్కడి శిల్పులను తెచ్చి ఇక్కడ నవబ్రహ్మేశ్వరాలయాల నిర్మాణం ప్రారంభించగా ఆ వంశీయులు ప్రథమ విక్రమాదిత్య, వినయాదిత్య, విజయాదిత్యులు పూర్తి చేసినారు. ఇక్కడ ద్రావిడ వాస్తురీతిలోని పల్లవ దేవాలయం నరసింహ వర్మ కాలంలో నిర్మించబడింది. తరువాత రాష్ట్రకూటులు ఏలినారు. ధారావర్షధ్రువ మహారాజు ఇక్కడి మహాద్వారాన్ని కట్టించినాడు. కల్యాణి చాళుక్యులు జగదేక మల్ల – త్రైలోక్యమల్ల, త్రిభువన మల్లమహారాజుల కాలంలో నదీతీరంలో ఘట్టాలు – తీర్థాలు నరసింహాలయ, సూర్యనారాయణాలయాలు కట్టించబడినాయి. కలచుర్యులు, కాకతీయులు కొంతకాలం పాలించిరి. విజయనగర రాజులు మొదటి దేవరాయలు ఇక్కడి దేవాలయాలను రక్షించెను. కృష్ణదేవరాయలు ఇక్కడికి వచ్చి ఆలయాలకు భూదానాలు చేసి, క్షేత్రరక్షణకు కోటను కట్టించెను. ఆ తరువాత ఆదిల్షాహీ – కుతబ్షాహీ – ఆసఫ్జాహీ నవాబులు ఏలినారు. 14వ శతాబ్దిలో బహమనీ సైన్యాలు ఆలయాలను పాడుచేసెను. అప్పుడు దేవరాయలు కాపాడినాడు. ఆ సమయంలో ఒక ముస్లిం ముఖ్యుడు ప్రజలచేత చంపబడగా అతని దర్గా వెలిసింది. దానికి ఉర్సు జరుపుతారు.

ముఖ్య దేవాలయాలు : ప్రధానాలయం బాల బ్రహ్మేశ్వరాలయం. ఈ స్వామికి శ్రావణ – కార్తీక – ధనుర్మాసాలలో విశేష పూజలు జరుగుతాయి. నిత్యపూజ, అఖండ దీపారాధన, నైవేద్యాలు మహాశివరాత్రికి బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. ఈ ఆలయంలోనే జోగుళాంబా దేవి ఉండేది. ఆమె ప్రత్యేకాలయం పాడైన తరువాత ఇక్కడ చిన్నగుడిలో పెట్టుకొని పూజించేవారు. ఇటీవల ప్రభుత్వం వారు 2 కోట్ల రూపాయల అంచనాతో అమ్మవారికి నూతనాలయం నిర్మించే పని ప్రారంభించినారు. పూర్వముండిన స్థలంలోనే అప్పుడున్నట్లే భవ్యదేవాలయ నిర్మాణం పూర్తయింది. త్వరలో శ్రీజోగుళాంబ ప్రతిష్ఠించబడుతుంది. అంతవరకు విగ్రహాన్ని కళాప్రకర్షణ చేసి ముందు హాలులో పెట్టి పూజిస్తున్నారు. అమ్మవారికి నిత్యపూజలు, శుక్రవారంనాడు విశేషపూజలు, శరన్నవరాత్రాలలో బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. ఈ ఆలయంలో ఒక మూల ఇక్కడి బ్రహ్మపరి విద్యాపీఠంలోని కులపతి ఆచార్యుల విగ్రహాలున్నాయి. తక్కిన కుమార, అర్క, వీర, విశ్వ, తారక, గరుడ, స్వర్గ, పద్మ, బ్రహ్మేశ్వరుల ఆలయాలు దర్శనీయమైనవి. అన్నీ శిల్పకళా విరాజితాలు. ఇటీవల బ్రహ్మేశ్వరాలయానికి దక్షిణ దిశలో వెంకటేశ్వరాలయం నిర్మించబడింది. రాష్ట్రకూటులు నిర్మించిన మహాద్వారంలో కంచి కామాక్షి ఏకామ్రేశ్వరులు పూజలందు కుంటున్నారు. ఊరిలో యోగానంద నరసింహాలయం, సూర్యనారాయణ స్వామి ఆలయం, ఊరికి కిలోమీటరు దూరంలో పాపనాశినీ తీర్థ ముంది. అక్కడ దేవాలయ సమూహముంది.



వాస్తుకళా విశేషాలు : భారతీయ వాస్తు శిల్పం వేదకాలం నుండే వ్యాప్తిలోకి వచ్చింది. మూర్తి శిల్పం గూడ ప్రాచీనమైంది. హరప్పా, మొహంజోదారోల త్రవ్వకాలలో మన వాస్తుమూర్తి శిల్ప మూర్తులు బయటపడినాయి. భారతదేశంలో జైన – బుద్ధ వాస్తు శిల్పరీతుల తరువాత 'కళింగ – గుప్త – బాదామీ చాళుక్య – పల్లవ – రాష్ట్రకూట – కల్యాణి చాళుక్య, హొయిసల, చోళ, కాకతీయ, విజయనగర వాస్తు శిల్పరీతులు పూర్ణవికాసం పొందినాయి. ఇక్కడి ఆలయాలు ప్రధానంగా బాదామి చాళుక్య వాస్తురీతికి చెందినట్టివి. రెండవ పులకేశి కంచిని జయించినప్పుడు అక్కడి శిల్పులను తెచ్చి వారిచేత నాగర, ద్రావిడ వాస్తురీతులను సమ్మేళనం చేయించి చాళుక్య వాస్తురీతిని రూపొందించినాడు. ఈ వాస్తురీతిలో మొదట బాదామి, పట్టదకల్లు, మహాకూటేశ్వరాలలో దేవాలయాలను కట్టించినాడు. అవి ప్రారంభదశను తెలుపుతాయి. ఆలంపూరు ఆలయంలో సంపూర్ణ వికాసం కనబడుతుంది.

ఈ మహాక్షేత్రాన్ని దర్శించడానికి దేశ విదేశ యాత్రికులు విశేషంగా వస్తుంటారు. ఇంకొక విశేషం ఏమిటంటే ప్రౌఢ సరస్వతి, గండ్రకోట కుమారస్వామి శాస్త్రిగారు నెల్లూరు నివాసులు ఇక్కడికి 19వ శతాబ్దిలో వచ్చి ఇక్కడ అన్నివర్ణాల యాత్రికులకు శాశ్వత అన్నదాన సత్రాన్ని స్థాపించి, సన్యసించి, ఇక్కడే సమాధి అయినారు. ప్రభుత్వం శ్రద్ధ వహిస్తే అభివృద్ధి చెందుతుంది.

సంగమేశ్వరం

ఆలంపూరికి 12 మైళ్ళ దూరంలో కృష్ణా – తుంగభద్రా సంగమం ఉండేది. దీన్ని చిన్న సంగం – షణ్ణదీ సంగం, కూడ వేలి సంగం అనేవాల్లు. ఇక్కడ కృష్ణలో అదివరకే వేణీ, మలప్రభా, ఘటప్రభ భీమానదులు కలిసి ఉన్నాయి. తుంగభద్రలో తుంగా – భద్రానదులు కలిసి ఉన్నాయి. అందువల్ల ఇది ఆరునదుల సంగమం అయింది. రెండు నదులూ కలిసేచోట బాదామీ చాళుక్య వాస్తురీతిలో కట్టబడిన సుందర దేవాలయమున్నది. లోపల సంగమేశ్వర లింగమూ, వీరభద్ర మూర్తి ఉన్నాయి. ఆలయం చుట్టూ గోడలమీద మనోహర శిల్ప మూర్తులు నిలిపినారు. ఆలయం చుట్టూ శిలాప్రాకారం ఉంది.

శ్రీశైలం ప్రాజెక్టు వల్ల ఈ ప్రదేశంతోపాటు ఏడు, ఎనిమిది మైళ్ళ వరకు గ్రామాలు మునిగి పోయినాయి. ఇప్పుడు కృష్ణా తుంగభద్రా నదుల సంగమం ఆలంపూరికి నాలుగు మైళ్ళ దూరంలో గొందిమళ్ళ గ్రామం దగ్గరికి వచ్చింది. ఆలయాన్ని ప్రాకారంతోపాటు ఆలంపూరుకు తరలించి యథాతథంగా పునర్నిర్మాణం చేసినారు. ఆ క్షేత్రం అంతరించింది.

పెద్ద సంగమేశ్వరం

ఈ క్షేత్రాన్ని సప్తనదీ సంగమం 'నివృత్తి సంగమం' అంటారు. ఇక్కడ ఆరునదులు కలిసిన కృష్ణలో భవనాశినీ నది కలుస్తున్నందున సప్తనదీ సంగమమైంది. పాపనివృత్తి చేసే క్షేత్రం కాబట్టి నివృత్తి సంగమమంటారు. ఆలయం రెండు నదులు కలిసేచోట ఉంది. ఇందలి లింగాన్ని గురించి స్థలపురాణంలో ఒక కథ ఉంది. పూర్వం ధర్మరాజు తమ్ములతో అరణ్యవాసం చేసినపుడు ఇక్కడికి వచ్చినాడు. స్థానికులు ఆయనను కలిసి ఈ సంగమం దగ్గర ఒక శివలింగాన్ని ప్రతిష్ఠించ గోరినారు. ఆయన అంగీకరించి తమ్ముడు భీముణ్ణి లింగాన్ని తెమ్మని కాశీకి పంపినాడు. ఋషులు సుముహూర్తం నిర్ణయించి కార్యకలాపం ప్రారంభించినారు. కాని భీముడు ఎన్నాళ్ళు గడచినా లింగాన్ని తేలేదు. ముహూర్తం సమీపించింది. ఋత్విక్కుల ఆదేశంలో వేప మొద్దును కోయించి సకాలంలో లింగంగా ప్రతిష్ఠచేసినాడు. తరువాత భీముడు పెద్దలింగాన్ని తెచ్చినాడు. ప్రతిష్ఠ జరిగిపోయింది. కోపంతో తాను తెచ్చిన లింగాన్ని నదిలోకి విసిరివేసినాడు. అది నది ఒడ్డున పడింది. ధర్మరాజు తమ్ముణ్ణి సమాధాన పరచి నీవు తెచ్చిన లింగం భీమలింగం అనే పేరుతో మొదటి పూజ అందుకుంటుంది. అని అక్కడనే సోపానాల దగ్గర వేదిక కట్టించి ఒరిగిపడిన భీమలింగాన్ని ప్రతిష్ఠించినాడు.





ఇప్పటికీ భక్తులు స్నానంచేసి భీమలింగాన్ని పూజించి తరువాత ఆలయంలో పూజలు చేస్తారు.

ఇక్కడి ప్రాచీనాలయం భగ్నమై పోగా రెండు, మూడు వందల ఏండ్ల కిందట ఏ శిల్పమూ లేకుండా సాధారణంగా గుడి కట్టినారు. ఈ ఆలయానికి పెద్ద ప్రాకారమూ తూర్పున మహాద్వారమూ, ఉత్తరాన నదిలోకి దిగే ద్వారమూ ఉన్నాయి. ఇది ప్రకృతి రమణీయ స్థలం. ఇక్కడ పంచేశ్వరాలయాలున్నాయి. కపిలేశ్వరం, సంగమేశ్వరం, సిద్ధేశ్వరం, సోమశిల, అగస్త్యేశ్వరం – అనే పేరుతో పూజింపబడుతుండేవి. ఊరిలో వేంగీచాళుక్యులు కట్టించిన రథాకృతి దేవాలయం. దాని దగ్గర భుజంగేశ్వరాలయం వాస్తుశిల్ప కళాశోభితమై ఉన్నాయి. ఈ ప్రాంతాలలో రాజరాజనరేంద్రుని కొడుకు కులోత్తుంగ చోళుని శాసనం లభించింది.

ఈ మహాక్షేత్రం గూడ శ్రీశైలం ప్రాజెక్టు మునుకలో ఉంది. ఇక్కడి కపిలేశ్వరం, సంగమేశ్వరం, సిద్ధేశ్వరం ఆలయాలు సాధారణంగా ఉన్నందున వీటిని తరలించక ఇక్కడనే ఉంచినారు. నది ఆవల ఉన్న సోమశిల, అగస్త్యేశ్వరాలయాలను వేరేచోటుకి తరలించి పునర్నిర్మాణం చేసినారు. కృష్ణానది ఆషాఢ, మార్గశిర మాసాల మధ్యకాలంలో పూర్ణ ప్రవాహంతో ఉంటుంది. ఆలయాలు మునిగిపోతాయి. మహాశివరాత్రి నాటికి సంగమేశ్వరాలయం బైటపడుతుంది. అప్పుడు భక్తులు విశేష సంఖ్యలో చేరి స్వామిని అర్చించుకుంటారు. ఆ సమయంలో కర్నూలు నుండి బస్సులు నడుస్తాయి.

సోమశిల

పంచేశ్వరాలయాలలో సోమశిల ఒకటి. దీన్ని సోమేశ్వరం అంటారు. కృష్ణాతీరంలో ఉంది. ఆలయం ప్రాచీనమైంది. శిల్పవిశేషాలు లేక సాధారణంగా ఉంది. ఇక్కడి విశేషమేమంటే ఒకేచోట గుంపుగా 13 చిన్న శివాలయాలు కట్టినారు. అవి కల్యాణి చాళుక్యులనాటివి. కాకతి ప్రతాపరుద్రుడు అన్నింటికీ కలిపి ఒకే విశాల మంటపం కట్టించినాడు. పూజాపునస్కారాలు లేవు. ఈ ఆలయ సమూహాన్ని కొల్లాపురానికి తరలించి పునర్నిర్మాణం చేసినారు. ప్రాజెక్టుల వలన ఎన్నో మహాక్షేత్రాలు అంతరించినాయి. మహబూబ్‌నగర్, కర్నూలు జిల్లాల్లో కృష్ణా, తుంగభద్రా తీరాలలో ఉండే 96 గ్రామాలు మునిగిపోయినాయి. సారవంతమైన వేల ఎకరాల నల్లరేగడి పంటపొలాలు నీళ్లపాలైనాయి. ఈ ప్రాజెక్టు వల్ల గ్రామాలు, భూములే కాకుండా మహాక్షేత్రాలు పోయినాయి. కొన్ని ప్రసిద్ధ క్షేత్రాల ఆలయాలను మాత్రం వేరేచోటికి తరలించి కట్టించడం జరిగింది.

(తితిదే 'కృష్ణవేణీ తరంగాల' సౌజన్యంతో)

❖ ❖ ❖

పవిత్ర కృష్ణవేణి - కలికల్మష నాశని

- పీసపాటి నాగేశ్వరరావు

శ్లో॥ మేషే గంగా వృషే రేవా మిథునే చ సరస్వతీ ।
కర్కటే యమునా ప్రోక్తా సింహే గోదావరీ స్మృతా ॥
కన్యాయాం కృష్ణవేణీ చ కావేరీ ఘటకే స్మృతా ।
వృశ్చికే తామ్రపర్ణీ చ చాపే పుష్కర వాహినీ ॥
మకరే తుంగభద్రా చ కుంభే సింధూనదీ స్మృతా ॥
మీనే ప్రణీతా చ నదీ గురోస్సంక్రమణే స్మృతా ।
పుష్కరాఖ్యో మునీనాం హి ప్రదేశోఽత్ర బుధైః స్మృతం॥

పై శ్లోకాల ననుసరించి దేవగురువు బృహస్పతి మేషంలో సంచరిస్తే గంగను, వృషభంలో రేవానదికి, మిథునంలో సరస్వతికి, కర్కాటకంలో యమునకు, సింహంలో గోదావరికి, కన్యలో కృష్ణకు, తులలో కావేరికి, వృశ్చికంలో తామ్రపర్ణికి, ధనస్సులో పుష్కరవాహినికి, మకరంలో తుంగభద్రకు, కుంభంలో సింధుకు, మీనంలో ప్రణీతానదికి పుష్కరాలు వస్తాయి. ఈ సంవత్సరం అనగా ది.11.08.2016 రాత్రి 9.28 ని.లకు గురువు కన్యారాశిలోకి ప్రవేశిస్తున్న కారణంగా కృష్ణానదికి పుష్కరములు వస్తున్నాయి. శ్రీదుర్ముఖి నామ సం॥ శ్రావణ శుక్ల అష్టమి, తత్కాల నవమి, గురువారం, అనూరాధ నక్షత్రం బ్రహ్మయోగం సమయంలో గురువు ఉత్తరఫల్గుణి 2వ పాదము, కన్యారాశిలో ప్రవేశించును. ఇది రాత్రికాల ప్రవేశం. ఈ పవిత్ర పుణ్య పుష్కరాల సందర్భంగా 'యథావిధి'గా ఆచరణలు చేయలేకున్నను 'యథాశక్తి'గా స్నాన, దాన, జపాదులనొనర్చి, తమతమ పితృదేవతలకు పిండప్రదానాలు, శ్రాద్ధకర్మల నొనర్చి పితృదేవతలకు అక్షయ పుణ్యలోక ఫలాలను, తమకు ఇహ, పర సౌఖ్యాలను, వంశవృద్ధులను, పితృదేవతల ఆశీస్సులను పొందగలరు. పుష్కర నదులలో ఆరవది కృష్ణానది. భారతదేశంలో అతి పెద్ద నదులలో కృష్ణానది రెండవది. భూమధ్య నదిగా పేరుగాంచింది కృష్ణానది.

కన్యారాశిగతే దీవే కృష్ణవేణీ నదీ తటే ।
స్నానం దానం తథా క్షీరం త్రికోటికులమర్ధరత ॥

దేవగురువు బృహస్పతి కన్యారాశిలో ప్రవేశించునపుడు కృష్ణాపుష్కరాలు సంభవిస్తాయి. ఈ పుష్కరకాలంలో ఎవరు పుణ్య కృష్ణనదీ స్నానం చేస్తారో, పితృదేవతలకు పిండప్రదానం చేస్తారో, ఎవరు క్షురకర్మ చేయించుకొంటారో వారు త్రికోటి కులాలను ఉద్ధరించిన వారవుతారని పై శ్లోక తాత్పర్యం.

కాశీలో మరణం, నర్మదా తీరాన తపస్సు, కురుక్షేత్రంలో దానం మోక్షాన్ని కలుగచేస్తాయని మన నమ్మకం. ఈ మూడింటి యొక్క దివ్య ఫలితం పుష్కర స్నానం చేస్తే ఒనగూరుతుంది అని శాస్త్రాలు ఘంటాపథంగా పేర్కొంటున్నాయి.



పవిత్ర కృష్ణానది నదులకు అక్కగా, తీర్థాలకు తల్లిగా, కలికల్మషాలను పటాపంచలు చేసేదిగా శాస్త్రం చెబుతుంది.

మాతరం సర్వ తీర్థానాం నదీనామగ్రజంత్వహమ్ ।
ప్రక్ష్యామి పూర్వవత్ కృష్ణం మన్మయాం జగతః స్థితః ॥
తీర్థానాం ప్రభావేణ కలికల్మష శత్రుణా ।
కృష్ణాయాశ్చాపి సాన్నిధ్యాత పాపం నైవభవిష్యతి ॥

కలియుగంలో మానవులు పాపములు పోగొట్టటంలో సమర్థమైన దానినిగా, తీర్థములన్నింటికి తల్లిగా, నదులకు అగ్రజగా (అక్కగా) జగత్తుల యొక్క రక్షణకై పరమాత్మచేత తన స్వరూపముగానే కృష్ణానది సృష్టింపబడింది. ఈ నదియొక్క తీర్థ ప్రభావము కలికల్మషాన్ని పోగొడుతుంది. కృష్ణానదీ తీరంలో నివసించేవారికి పాపస్పర్శ ఉండదు. జలస్వరూపిణి అయిన కృష్ణవేణి హరిహరాత్మకమైనదిగా ప్రసిద్ధమైంది. వాక్కులకు, మనస్సుకు అందని మహామహిమాన్వితమైనది కృష్ణానది. ఈ కృష్ణానదీ జలాన్ని పానం చేయటంవల్ల పైత్య, జాడ్యాలు తొలగుతాయి.

ఈ కృష్ణానదీ తీరంలో 60 తీర్థాలు ఉన్నట్లుగా శాస్త్రంలో తెలుపబడింది.

పన్నెండు రోజుల పుష్కరాల్లో చేసే దానాలు –

పుష్కలంగా లభించు ఎన్నో పుణ్యాలు –

1) మొదటిరోజు – బంగారు, వెండి, ధాన్య, భూదానములిచ్చు మానవుడు ఇహమున సర్వసౌఖ్యములను అనుభవించి, దేహాంతరాన సూర్యలోకం చేరును.

రెండో రోజు వస్త్ర, లవణ, రత్న, ధన–దానముల నిచ్చువాడు వసు, రుద్ర ఆదిత్య లోకములందు భోగములను అనుభవించి మరుజన్మలో సార్వభౌముడు కాగలడు.

మూడవ రోజున శాక, ఫలదానముల నిచ్చువాడు కుంభరాశ్యాధి దేవతాలోక సౌఖ్యముల ననుభవించి, ఇంద్రసముడగును.

నాల్గవ రోజున – ఘృత, క్షీర, మధు, తైలదానములను చేయువాడు దీర్ఘాయురోగ్యవంతుడై దేహాంతమున వైకుంఠలోకమును పొందును.

ఐదవరోజున – ధాన్య, శకట, మహిషి, వృషభదానములు చేసినవాడు ఇహమున సుఖభోగములను అనుభవించి అంత్యమున కైలాసలోక ప్రాప్తి పొందగలడు.

ఆరవ రోజు – అగరు, కస్తూరి, చందన దానములు చేసినవాడు సంపూర్ణ ఆరోగ్యవంతుడగును.

ఏడవరోజున – గృహ, పీఠ, శయ్య, ఆందోళికా దానములు చేసినవాడు ఆరోగ్యవంతుడై మరల జన్మలో సింహాసనాధీశు డగును.

ఎనిమిదవ రోజున – గంధం, దారు, పుష్పహోలికా దానము చేసినవారు ఇహలోకమున అష్టఐశ్వర్యములు అనుభవించి, స్వర్గమును చేరెదరు.

తొమ్మిదవ రోజున – అర్ఘ్య, వృద్ధ పిండదానములు చేసిన దాసీ, శయ్యాదానములు చేసినవారు సకల ఐశ్వర్యములు పొందగలరు.

పదవరోజు – మహాశాక్త, సాలగ్రామ, పుస్తక దానములు చేసినవారు అక్షయ పుణ్యలోకమును పొందెదరు.

పదకొండవ రోజున – గజ, తురగ, దానములు చేసిన ఇహసౌఖ్యములను అనుభవించి, వైకుంఠ సాయుజ్యమును పొందెదరు.

పన్నెండవ రోజున – తిలాదానము చేసిన సర్వాభీష్టములు నివారణయగును.

పుష్కరవిధికి ఆరంభం 11వ తేదీన 12వ తేదీన అను ధర్మమీమాంసకు... లౌకింగా 12.08.2016 లగాయతు 22.08.2016 వరకుయే అని గ్రహించవలెను. అయితే దీని మీద కూడా వితండవాదాలు చేసి మన ఆచార విదానాలను కించపరచుకోవటం కన్నా ఎవరి సిద్ధాంతం ప్రకారం వారు ఆచరించి, సత్ఫలములను పొందటం మంచిది. 11.08.2016 లగాయతు 22.08.2016 వరకూ అనేదానికి ప్రామాణికము.

తీర్థశ్రాద్ధాలకు 11.08.2016 మధ్యాహ్నమునుండియే పుణ్యకాలము. **అర్వాజ్ నిశీధాద్యది సంక్రమస్యాత్పూర్వాహ్ణ పుణ్యం పరతః....** అని నిర్ణయసింధువు తెలిపింది. అర్ధరాత్రి కంటే పూర్వము రవి సంక్రమణము అయినా, పూర్వదినమున అనగా ఈ రోజునే మధ్యాహ్నోత్పరమున పుణ్యకాలము అని భావము.

యాయాస్సన్నిహితాః నాద్యాః లాస్తాతాః పుణ్యతమాస్యతాః। అని శాతాతపవచనము. రాశి ప్రవేశ సమయము ఏ దినమున పుణ్యకాలము సమీపమునందుండునో ఆ దినమున పుణ్యకాలముగా గ్రహించవలెను.

'రాత్రీస్సంక్రమణే భానోః దానార్థం స్నానదానయోః' అని ఉంది. రాత్రి రవి సంక్రాంతి అయిన పూర్వదిన ఉత్తరార్ధము పుణ్యకాలము).

వృద్ధ వశిష్ట వచనము : రాత్రౌ సంక్రమణీ పుణ్యం దినార్ధ స్నానదానయోః। అర్ధరాత్రాదధస్తస్మిన్ మధ్యాహ్నస్య ఉపరిక్రియా ॥

గోభిల వాక్యము : 'రాత్రౌ సంక్రమితే భానో దివాకుర్యాత్ తత్రియామ్' అని అంటుంది. ఈ పైన పేర్కొనబడ్డ ఉద్గంధాది ప్రమాణ వాక్యాలచే ది.11.08.2016 లగాయతు ది. 22.08.2016 వరకు కృష్ణా పుష్కరాలుగా గ్రహించవచ్చును.

వాద, ప్రతివాదాలకు తావు లేకుండా వారు వారు అనుసరించే సిద్ధాంతాల ఆధారంగా జరుపుకొనవచ్చును. దేశ కాలమాన పరిస్థితులన అనుసరించి ప్రతిదీ చేయమన్నది శాస్త్రం. ఫలితం ఉండటం, ఫలితం లేకపోవటం అనేవి మాత్రం (ఫలం, నిష్ఫలం) ఉంటాయి. కాని 'కీడు' అన్న మాటకు ఆస్కారం లేదు. తమ సిద్ధాంతాలు గొప్పవి అని నిరూపించుకోవటానికి వాడే నీచమైన పదమే కీడు అన్నదని సర్వులూ గ్రహించుదురుకాక.

పుష్కరం అనే దానికి వివిదార్థాలు....

పుష్+కర = పుష్టికరం అంటే పోషణను ఇచ్చేది.

పుష్కర్ – పద్మం ఉన్న చెయ్యి.

తామరకొలను, పవిత్రజలం, పెద్ద కత్తి, హంస, నీలోత్పలం, ఆకాశం, కొలను అనే మొదలగు అర్థాలు కలవు.

శ్రీవిష్ణు సహస్రనామాల్లో .. 'పుష్కరాక్షః' అనే నామము మనకు కనిపిస్తుంది. పద్మంలాంటి కన్నులు కలవాడనే సామాన్యార్థం దీనికి ఉండగా అవతారార్థాలు అనేకం కలవు.

తిరుమలలో – శ్రీవరాహస్వామి ఆలయం వద్ద శ్రీస్వామి వారి పుష్కరిణి కలదు. బ్రహ్మోత్సవాల్లో ఈ పుష్కరిణిలో శ్రీస్వామివారి చక్రస్నానం అత్యంత వైభవోపేతంగా జరుగును. ఆ సమయంలో పుష్కరిణి స్నానం విశేష ఫలప్రదమని భక్తుల ప్రగాఢ విశ్వాసం. పురాణ గాథలు శ్రీస్వామివారి పుష్కరిణి ఎంతో విశిష్టమైన తీర్థంగా పేర్కొంటున్నాయి.

జ్యోతిశ్శాస్త్రంలో పుష్కర నవాంశ్ అని వింటూ ఉంటాం. దీనిలోగల గ్రహాలను అది శుద్ధిచేసి పోషణను ఇస్తున్నట్లు చెప్పబడింది. ఇది కూడా గురుగ్రహ సంచారాన్ని అనుసరించి వుంటుంది. ఈ పుష్కర నవాంశలోకి వచ్చే హానికలిగించే గ్రహాలు కూడా సౌమ్యంగా ఉంటాయని ఆర్యోక్తి. వివాహ సమయంలోనూ ఈ అంశాన్ని అనుసరించి బలమైన ముహూర్తాలు పెట్టటం గమనించవచ్చు. రాజస్థాన్‌లోని అజ్మీర్ సమీపంలో పుష్కర్ అన్న పుణ్యక్షేత్రం గురించి మనకు తెలుసు.

సర్వజీవులకు స్పర్శన, దర్శన, స్నాన, పాన మాత్రమున పంచమహాపాతక, ఉపపాతకములను పోగొట్టుటయే కాక, శారీరక, మానసిక, కఫ, వాత, పైత్య, శ్లేష్మాది ప్రారబ్ధ జన్మ వ్యాధులను సైతం నిర్మూలన మొనర్చి పాతకములను పోగొట్టుటయే కాక శారీరక, మానసిక, కఫవాత, పైత్య శ్లేష్మాది ప్రారబ్ధజన్మ వ్యాధులను సైతం నిర్మూలన మొనర్చి పితృముక్తి హేతువు అగును పుష్కర స్నానంవలన.

❖ ❖ ❖

కృష్ణదేవరాయలు - కృష్ణానదీ సంబంధాలు

- డా॥ సంగనభట్ల నరసయ్య

సాహితీ సమరాంగణ సార్వభౌముడు, ధర్మజ్ఞుడు, విజయనగర సామ్రాజ్యాధిపతి, సంగమ, సాళువ వంశముల పిదప, తెలుగు, కర్ణాటక సీమలనేలిన తుళువ నరస నాయకుని కుమారుడు శ్రీకృష్ణదేవరాయలకు కృష్ణానదితో గల విడదీయరాని ఆత్మీయతను స్థిరపరిచే సంఘటనలు మనోహర చారిత్రక ఘట్టాలుగా నిలిచినవి.

విజయనగర సామ్రాజ్య స్థాపనమే తురష్కాక్రాంతము కాకుండా దక్షిణ భారతమును నిలుపుటకై ఏర్పడిన చారిత్రక ఘట్టము. ఓరుగల్లు నుండి ఢిల్లీ సేనలకు బందీలై తాత్కాలికంగా మహమ్మదీయ మతపు రంగును ఒంటికి పులుముకొన్న హరిహర బుక్కసోదరులు తుంగభద్ర (కృష్ణ ఉపనది) నీటి కడుగుకొని, విద్యారణ్యుల ఆశీస్సులతో విద్యానగర నిర్మాణము గావించుకొన్నారు. దీనినిబట్టి శతాబ్దుల అవిచ్ఛిన్న రాచరికములో సంగమ, సాళువ వంశముల తరువాత తుళువాన్వయం గద్దెనెక్కింది. మొత్తం రాచరికంలో రాయలు అత్యుత్తముడైన ప్రభువు. హిందూ ధర్మాన్ని మనసా వాచా కర్మణా ఆచరించినవాడు. తిరుపతి వేంకటేశ్వరుని భక్తుడుగా, శివకేశవ స్వాములుకు, పుణ్యక్షేత్రములకు భూరివిరాళములు, గోపుర నిర్మాణములు, ఆలయ, తటాక నిర్మాణములు గావించినాడు. ఆ ప్రభుని ఛత్రఛాయలో జరిగిన ధార్మిక కార్యక్రమముల వివరములతో గూడిన శాసనములు ఐదు శతములంటే ఆ చక్రవర్తి పాలనలో హిందూ ధర్మమెంత ఉజ్వలంగా దక్షిణాపథమందు వెలిగిందో స్పష్టంగా తెలుస్తోంది.

రాయల సామ్రాజ్యపు చిరవాంఛలలో కటకమును వశం చేసికొని గజపతులను పాదాక్రాంతం చేయడం ఒకటి. సాళువ నరసింహుని మరణశాసనం మేరకు చిరశత్రువులైన కటకాధిపతులపై దండెత్తడానికి సమాయత్తుడైన రాయలు వారి ప్రధాన దుర్గాలలో కొండవీటిని పట్టుకొని, ఆ సందర్భంగా కృష్ణాతీరాన సంచరించినాడు. బెజవాడలో కొన్ని నాళ్లుండి కృష్ణానదిలో స్నానమాచరించి దుర్గమ్మను దర్శించుకొన్నాడు. ఇంతలో ఏకాదశి పుణ్యదివసం వచ్చింది. ఏకాదశి వ్రతాచరణలో భాగంగా ఉపవాస ముండి, దేవాలయంలో నిద్రించదలచినాడు. శ్రీకాకుళం కృష్ణాజిల్లాలోని ప్రాచీన గ్రామం. పుణ్యక్షేత్రం. శ్రీకాకుళాంధ్ర విష్ణువు స్థానిక దైవం. ఆ ఆలయంలో ఆగ్నేయ భాగానగల పదహారు స్తంభాల మంటపంలో రాత్రి నిద్రించినాడు.

కలలో మధుమదనుడు శ్రీకాకుళ విష్ణువు ప్రత్యక్షమైనాడు. ఆముక్తమాల్యదా రచనకై పురిగొల్పినాడు. శ్రీవేంకటేశ్వరస్వామికి అంకితం ఇవ్వాలన్న రాయల ఆశయాన్ని ఆశీర్వదించి, నేనైనా,



వేంకటేశ్వరుడైనా ఒక్కణ్ణే కదా అని బలాన్ని ఇచ్చినాడు. ఈవిధంగా కృష్ణ నీరు తాగిన ఆ ప్రభువుకు ఆముక్తమాల్య దావిర్భావ సంకల్పం సిద్ధించింది. ఇదంతా ఆముక్తమాల్యదలో వ్రాసి ఉంది.

కృష్ణానదికి శ్రీకృష్ణునితో నామసామ్యం ఉంది. కృష్ణ నల్లన. కన్నయ్య నల్లనే. స్వామి నీలమేఘశ్యాముడై కృష్ణాతీరంలోని పలుప్రాంతాల్లో చెన్నకేశవుడుగా, ఇతర నామాలతో పిలిస్తే పలికే దైవంగా నిలిచినాడు. రాయలపేరులో కృష్ణుడే ఉన్నది. అంతేకాదు రాయసింహాసనంపై కూర్చున్న నాలుగు రాజవంశాల నాలుగు వందల ఏండ్ల నలభైమంది రాజుల్లో కృష్ణనామధారి ఒక్క శ్రీకృష్ణదేవరాయలే. కృష్ణనామం రాయలవారికి ఇష్టం. తన ఇష్టాన్ని శ్రీకృష్ణజన్మాష్టమి (8 ఆగస్టు 1509) నాడే హంపీ విద్యానగర రక్షకుడైన విరూపాక్షుని దేవాలయంలో పట్టాభిషేకం చేసుకోవడంలో చూపినాడు. అంతేకాదు తనకు ఇష్టమైన జాంబవతీ పరిణయ నాటకాన్ని సంస్కృతంలో మనోహర రూపకంగా రాసినాడు. సత్యవధూ ప్రీణనం అనే సత్యభామకథ మరో సంస్కృత కావ్యం రాయల రచనగా మనకు తెలుసు. రాయలకు తాను కృష్ణుడనే భావన ఉండేది.

కృష్ణదేవరాయలు మరొకతూరి విజయవాడ, గుంటూరు ప్రాంతాలలో తిరుగాడినాడు. అది విజయేచ్ఛనే. కృష్ణతీరాన గుంటూరు సీమలో సైన్యం విడిదిచేసింది. తాను అమరేశ్వర స్వామిని దర్శించినాడు. ఆ పుణ్యదివసాన కృష్ణస్నానమాచరించి, శుచియై,

దైవదర్శనానంతరం నదీతీరాన్నే తులాపురుష దానం చేసినాడు. తాను త్రాసులో కూర్చుండి తన ఎత్తు (సమానమైన) బరువుగల బంగారం తూచి దానం చేయడం ఈ విధానం. ఈ విధానం ఉత్తర భారతంలో లేదు. విజయనగర చక్రవర్తుల సంప్రదాయమిది. సంగమ వంశీకుడు, కృష్ణరాయలకంటే ముందటి ప్రభువు. మొదటి దేవరాయలు కరీంనగర్ జిల్లాలో కాళేశ్వరానికి వచ్చి, ప్రాణహితా సంగమ గోదావరిలో స్నానించి కాళేశ్వరుని దర్శించి తులాపురుష దానం చేసి, శాసనం వేయించినాడు. శ్రీకృష్ణదేవరాయలు కూడా అదేవిధంగా కృష్ణ ఒడ్డున తులాపురుష దానం చేసి శాసనం వేసినాడు. ఈ శాసనంలో తాను జయించి సమీప దుర్గాలను తన విజయపరంపరలను పేర్కొన్నాడు.

ఇంత చేసిన శ్రీకృష్ణదేవరాయలవారిపై కృష్ణమ్మ కనికరించదా మరి! ఆ నదీమతల్లి, కల్పవల్లి రాయలపై తన ప్రేమను కురిపించింది. ఎలాగో చూద్దాం.

శ్రీకృష్ణదేవరాయలు కృష్ణానదీ తీరాన సేనలతో విడిసి ఉన్నాడు. బహమనీ సుల్తాన్ రాయలపై దండెత్తదలచి ఉత్తర తీరాన విడిసినాడు. రాత్రివేళ రాయల సైన్యం నిదురించి నపుడు పరిక్రమిస్తే విజయం సులువనే దుర్బుద్ధితో కృష్ణానది దాటడానికి నదిలోకి సైన్యం దిగడానికి ఆజ్ఞాపించి నాడు. చీకటి రాత్రి. ఈ అధర్మాన్ని సహించలేని కృష్ణమ్మ పరవళ్లు. నదికి హఠాత్తుగా వరదలు వచ్చాయి. తురక సైన్యంలో చాలాభాగం కొట్టుకుపోయింది. వార్త క్షణాలమీద అందిన రాయలు అప్రమత్తుడైనాడీ సంఘటనతో. విజయం సులువైంది. కృష్ణమ్మ దయతో ఈ విషయం చాలా మనోహరంగా నందితిమ్మన పద్యంగా మలచి చరిత్రలో నిలిపినాడు.

కం. నరసింహ కృష్ణరాయా!
దురమున నీపేరిటేరు తురకల ద్రుంచెన్
కరిరాజ వరదుడంచును
కరిఘటలటు నిన్ను జూచి గ్రక్కున దిరిగెన్.

నీ పేరుటేరు అనగా నీ పేరుగల కృష్ణానది. యుద్ధంలో నీకు బదులుగా తురకలను చంపిందన్నాడు. అలాగే రాయలు విష్ణువుగా భావించి గజేంద్రమోక్షణ ఘట్టంలో సాయపడటంవల్ల ఏనుగులు శత్రువులవే ఐనా నిన్ను జూచి వెనుకకు తిరిగాయని ఒక నిజాన్ని, ఒక విజయాన్ని కవిత్వీకరించి చెప్పానాడు. ఇది పూర్వదిగ్విజయయాత్ర సందర్భం లేదా కొండపల్లి ముట్టడి సమయం.

ఈవిధంగా కావ్యాలంకార మర్మజ్ఞేన, ధర్మజ్ఞేన ఇత్యాదిగా తిరుపతి శాసనంలో పేర్కొనబడ్డ ధర్మజ్ఞుడైన హైందవ ప్రభువు శ్రీకృష్ణదేవరాయలకు కృష్ణమ్మతో అమృతమయమైన సంబంధం స్థిరపడి చరిత్రలో నిలిచింది. ❖



కృష్ణమ్మ నీడలో ఎందరో కవులు

"ప్రాచీన కాలం నుండి మన సంప్రదాయ సాహిత్యంలో ఎన్నో మలుపులు, మజిలీలు కనిపిస్తాయి. నన్నయ నుండి చిన్నయ వరకు ఎందరెందరో మహాకవులు తెలుగు సాహిత్యాన్ని సృజించి పోషిస్తూ వచ్చారు. కవులు దేశ సంస్కృతిని, సంప్రదాయాన్ని కాపాడుతూ రచనలు చేశారు.

కృష్ణానది ప్రవహిస్తున్న జిల్లాల్లో ఆ నదీ పరీవాహక ప్రాంతాలలో వెలసిన గ్రామాల్లో, పట్టణాలలో ఎందరో ప్రసిద్ధ కవులు కనిపిస్తారు. సాధారణంగా ఈ కవుల రచనలు సంప్రదాయబద్ధంగా ఉన్నవే. రచనలన్నీ ఖండకావ్యాలు, శతకాలు. కృష్ణానది పరీవాహక ప్రాంతం సంపన్నమైనట్లే. ఆ కవుల రచనలు తెలుగు సాహిత్య చరిత్రలో ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. ఈ ప్రాంతంలో కవులేగాక ఎందరో రచయితలు, కళాకారులు ఉన్నారు. వివిధ వృత్తులలో వుంటూ కవిత్వం రాసిన వారున్నారు. ఈ వ్యాసంలో కేవలం కవులను, వారి కవితా రచనలను మాత్రమే పరిచయం చేయడం జరిగింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని మాకు లభించిన సమాచారం వరకు మాత్రమే మేము పరిచయం చేస్తున్నాము. ఇంకా వివరాలు లభించని ఎందరో పండితులు వుండవచ్చు."

తెలంగాణ

కాకునూరి అప్పకవి : 17వ శతాబ్దం. మహబూబ్‌నగర్ జిల్లాలోని 'కామెపల్లి' నివాసి. గొప్ప లాక్షణికుడు. వీరి రచనలు ఆంధ్రశబ్ద చింతామణి (అప్పకవీయం) ప్రసిద్ధ గ్రంతం. ఇంకా 'అనంతవ్రత కథ' ఇది కావ్యం. కవికల్పకం, లక్షణ గ్రంథం, శ్రీనగాధీశ శతకం, అంబికావాదం యక్షగానం, సాధ్వీజన ధర్మము, ఇవి కాక సంస్కృత గ్రంథాలలో ఆస్తంబ షట్కర్మ నిబంధనం, కాలబాలార్ణవ సంగ్రహం ముఖ్యమైనవి. ప్రస్తుతం అప్పకవీయం తప్ప మిగిలినవన్నీ అలభ్యం. వీరు అప్పకవిగా ప్రసిద్ధులు.

కాపునూరి తిమ్మకవి : 1500 ప్రాంతపు కవి. మహబూబ్‌నగర్ జిల్లా వేమావిళ్ళ గ్రామనివాసి. సంస్కృత గ్రంథం. కాలామృతమ్, ఈ గ్రంథంలో వాస్తుకు సంబంధించిన వివరాలు విశేషంగా కనిపిస్తున్నాయి. ఈ గ్రంథానికి కవితార్కిక సింహుడు వేదాంతాచార్యులు, తెలుగులో టీకా రాసినట్లు తెలుస్తుంది.

కామసముద్రం అప్పలాచార్యులు : 18వ శతాబ్ది ఉత్తరార్ధం వరకు జీవించిన కవి. మహబూబ్‌నగర్ జిల్లాలోని గద్వాల నివాసి. వీరి రచనలు ఆంధ్ర కృష్ణలీలా తరంగిణి. రామాయణంలోని కిష్కింధకాండ అనువాదం. ఇతని బిరుదు విద్వత్కవికుంజర. ఇతని తండ్రి కృష్ణమాచార్యులు గద్వాల సోమభూపాలోని ఆస్థానకవి. చతుర్విద కవితా విశారదుడు. సంస్కృత ప్రాకృతాంధాలలో శతాధిక గ్రంథాలు వ్రాసిన ప్రసిద్ధ కవి.

కొత్తపల్లి రామచంద్రాచార్యులు : 18వ శతాబ్దం గద్వాల ఆస్థానంలో కవి. వీరి బిరుదు విద్వత్ మహాకవి. యథాశ్లోక తాత్పర్య రామాయణంలోని అయోధ్యకాండను ఐదు ఆశ్వాసాలుగా అనువదించారు.

గార్గ్యపురం సుబ్బశాస్త్రి : 19వ శతాబ్దం గద్వాల ఆస్థానకవి. యథాశ్లోక రామాయణంలోని అరణ్యకాండను మూడాశ్వాసాలుగా అనువాదం చేశాడు. చాలామంది కవుల చేత యథాశ్లోక రామాయణ ప్రబంధాన్ని అన్ని కాండలను అనువాదం చేయించాడు.

చరిగొండ ధర్మన : 16వ శతాబ్దపు కవి. మహబూబ్‌నగర్ జిల్లా నివాసి. మాదమ్మ, తిమ్మనామాత్యుల పుత్రుడు. ఇతని ఏకైక రచన చిత్రభారతం. బిరుదు 'శతలేఖినీ సురత్రాణ' చిత్ర విచిత్రమైన కథలతో కూర్చిన కావ్యం చిత్రభారతం. చిలకమర్తి 'గయోపాఖ్యానా'నికి చిత్రభారతం మూలకథ.

చింతలపల్లి వీరరాఘవ కవి : 18వ శతాబ్దపు కవి. మహబూబ్‌నగర్ మండలంలోని గంగాపురం నివాసి. వెంకటార్యుని పుత్రుడు. 'మధురవాణి విలాసం' అసమగ్రం. శతకాలు అలభ్యం. శతావధానకర్త.

చింతపల్లి ఛాయావతి : 18వ శతాబ్దపు కవి. గద్వాల ప్రాంతంలోని బోరవెల్లి సంస్థానానికి చెందిన విద్వత్‌కవి. వీరి గురువు తిరుమల శ్రీనివాసాచార్యులు. తండ్రి గోపాలభట్టు. ఇతని బిరుదు 'నవఘంట సురత్రాణ'. శతావధానం చేసిన కవిగా ప్రసిద్ధుడు. ఆంధ్రాగీర్వాణ భాషలో దిట్ట. బోరవెల్లి సంస్థానపతి వెంకటపతిరెడ్డి ప్రోత్సాహంతో రచనలు చేశాడని తెలుస్తుంది.

చింతపల్లి సంజీవకవి : 18వ శతాబ్దానికి చెందిన కవి. బోరవెల్లి సంస్థ కవియైన ఛాయపతికి పినతండ్రి కుమారుడు. తండ్రి అప్పకవి. తల్లి గిరియమ్మ. రాజాస్థానాలలో విద్యాప్రదర్శన చేసి మెప్పించిన మంచికవి. చిన్నవీర రాఘవాచార్యులు రచించిన 'మధురవాణి విలాసం'లో ఇతని ప్రస్తావన ఉంది. వీరి రచనలు అలభ్యం.

చిన సోమ భూపాలుడు : 1762–1793 కాలంలో పాలించిన గద్వాల సంస్థాన ప్రభువు. తిరుమల రాయల పుత్రుడు పెద్ద సోమభూపాలుని పౌత్రుడు. పెద సోమభూపాలుని కాలంలో ప్రారంభించబడిన యథాశ్లోక తాత్పర్య రామాయణాన్ని తెలుగులోకి అనువాదాన్ని చాలామంది కవులు వీరికాలంలో పూర్తి చేశారు. వీరి ప్రోత్సాహంతో కొటికపూడి వీరరాఘవాచార్యులు యథాశ్లోక తాత్పర్య భారతంలోని ఉద్యోగ పర్వాన్ని అనువాదం చేశారు.

తిరుమల కృష్ణమాచార్యుడు : 18వ శతాబ్దం. గద్వాల ఆస్థానాన్ని పరిపాలించిన సోమభూపాలుని ఆస్థానకవి. అష్టభాషా కవితా దురంధరుడు. యథా శ్లోక తాత్పర్య రామాయణంలోని సుందరకాండను మూడాశ్వాసాలుగా అనువదించాడు.

ధర్మవరం రామకవి : గద్వాల సంస్థానంలోని చిన సోమభూపాలుని ఆస్థానకవి. 18వ శతాబ్దం ముకుంద విలాసం అనే కావ్యం వ్రాసినట్లు తెలుస్తుంది.

నంద్యాల అనంతాచార్యులు : 18వ శతాబ్దానికి చెందిన గద్వాల ఆస్థానానికి చెందిన కవి. తర్కశాస్త్ర పండితుడు, చిన్నతనంలోనే కాశీకి వెళ్ళి తరచూ పండితుల వద్ద విద్యాభ్యాసం చేసిన విద్వత్కవి. రచనలు అలభ్యం.

పూదూరి కృష్ణమామాత్యుడు : 16-17 శతాబ్దికి చెందిన కవి. గద్వాల సంస్థానానికి చెందిన పూదూరి గ్రామనివాసి. గద్వాల సంస్థానం ఆస్థానకవి. ఇతని ఏకైక గ్రంథం 'భగవద్గీతార్థదర్పణం'.

పెద్దసోమభూపాలుడు : 16-17 శతాబ్ది కాలానికి సంబంధించిన గద్వాల సంస్థానాన్ని పాలించిన రాజు. వీరి కృతులు 'రతిశాస్త్రం', 'అష్టపది'. ఇతడు గద్వాల కోటను 1698 - 1704 మధ్య కాలంలో నిర్మించినాడు. సర్వతోముఖ ప్రజ్ఞాపాటవాలు కలిగిన ప్రభువు. రతిశాస్త్రం మూడు ఆశ్వాసాల శృంగార ప్రబంధం. జయదేవుని అష్టపదిని సంస్కృతాంధ్ర భాషలలో ఛందోబద్ధంగా వ్యాఖ్యానించాడు.

బిజ్జల తిమ్మరాజు : 16వ శతాబ్దివాడు. ఇతని ఏకైక కృతి 'అనర్ఘ రాఘవం'. ఈయన కృష్ణానది పరిసరాలలో అలంపూరు, ప్రాకటూరి సీమలవాడు. అనర్ఘ రాఘవాన్ని ఐదు ఆశ్వాసాల ప్రబంధంగా అనువదించాడు. ప్రసన్న రాఘవాన్ని బొడ్డుచెర్ల తిమ్మకవి అనువదిస్తే, అనర్ఘరాఘవాన్ని తిమ్మరాజు అనువదించాడు. ఇందుకు కృష్ణకవి అనే విద్వాంసుడు సహాయం చేశారని ప్రతీతి.

బోరవెల్లి నరసింహం : 17వ శతాబ్దివాడు. గద్వాల సమీపంలో బోరవెల్లి గ్రామనివాసి. వీరి ఏకైక రచన 'సౌపర్ణాఖ్యానం' ఇది అలభ్యం.

బోరవెల్లి వెంకటరెడ్డి : 18వ శతాబ్దివాడు. బోరవెల్లి సంస్థానాధీశుడు. సాహిత్య పోషకుడు. బోరవెల్లి రాణి గిరియమ్మ దత్త పుత్రుడు. ఆమె తరువాత సంస్థానానికి అధికారియైనాడు. చింతలపల్లి ఛాయావతిచే రాఘవాభ్యుదయ ప్రబంధాన్ని రచింపజేశాడు.

బోరవెల్లి శేషాచారి : 18వ శతాబ్దం. గద్వాల సంస్థాన పండితులలో ఒక్కడు. యథాశ్లోక తాత్పర్య రామాయణంలోని యుద్ధకాండ పూర్వభాగం. నాలుగు ఆశ్వాసాలు అనువదించాడు.

ముష్టిపల్లి వేంకట భూపాలుడు : 18వ శతాబ్దం. గద్వాల సంస్థానంలోని రాజవోలు గ్రామనివాసి. గద్వాల రాజ కుటుంబానికి చెందినవాడు. రచనలు 'దివ్యదేశ మాహత్మ్యదీపిక' రాజవోలి వేంకటేశ్వర శతకం. రాజవోలి వేంకటేశ్వర సంగీత సాహిత్యాలలో అసమాన పాండిత్యం సంపాదించిన వాగ్గేయకారుడు. దివ్యదేశ మాహాత్మ్య దీపికలో ఇతని వంశవృక్షం కొంత ఉంది.

సురభి మాధవరాయలు : 17వ శతాబ్దం ప్రారంభంలోని వాడు. మహబూబ్‌నగర్ జిల్లా జటప్రోలు గ్రామం నివాసి. కవి, పండిత పోషకుడు జటప్రోలు సంస్థానాధీశ్వరులలో 19వ తరానికి చెందిన మల్లసాయుని మూడవ కుమారుడు. వీరి రచన చంద్రికా పరిణయం. కావ్యనాటకాలంకారాది శాస్త్రాదులందు నిష్ణాతుడు. ఎలకూచి బాలసరస్వతి వీరి ఆస్థానకవి. బాలసరస్వతి చేత భర్తృహరి సుభాషితాలను తెలుగులో అనువదింప జేసినాడు. దాని మల్లభూపాలునికి అంకితం చేయించినాడు. సింగపట్టణంలోని నరసింగ సాగరం అనే తటాకాన్ని నిర్మించినది ఇతడే. తరిగొప్పుల మల్లన వ్రాసిన 'చంద్రభాను చరిత్ర'ను సంస్కృతంలోకి అనువదించాడని విమర్శకుల అభిప్రాయం.

కన్నమడలక అనంతాచార్యులు : 19వ శతాబ్ది ఉత్తరార్ధం వరకు జీవించిన కవి. జన్మస్థలం గద్వాల. గద్వాల ఆస్థాన పండితుడు. న్యాయ, వేదాంత, వ్యాకరణ, మీమాంస, సాహిత్యాలలో నిష్ణాతుడు, రచనలు ఆంధ్రశబ్ద చింతామణి, మదన విజయబాణం, ఆచార్య వింశతి. ఈ రచనల్లో సంప్రదాయ రీతిని కొనసాగించినట్లు తెలుస్తుంది.

అహోబలాచార్యులు : 1902 జననం. జన్మస్థలం గద్వాల. తండ్రి వెంకటాచార్యులు. సూర్యసిద్ధాంతసారం, అభినవ తిథివల్లి, సంస్కృత గ్రంథాల్ని వ్రాసిన కవి. గద్వాల సంస్థాన పండితులు, జ్యోతిశ్శాస్త్రంలో ప్రవీణులు. తండ్రిగారి అనంతరం గద్వాల సంస్థానంలో ధర్మాధికారిగా ఉన్న వ్యక్తి. వీరి సూఐర్యసిద్ధాంత సారం జ్యోతిశ్శాస్త్రంలో ప్రామాణిక గ్రంథం.

హొసదుర్గం కృష్ణమాచార్యులు : జననం 1879. మహబూబ్‌నగర్ జిల్లాలోని వనపర్తి జన్మస్థలం. బిరుదులు, కవికుల తిలక కవిసార్వభౌమ. వీరు విద్వత్కవి. వనపర్తి సంస్థానంలో ధర్మాధికారిగా పనిచేశాడు. వీరి రచనలు రామేశ్వర విజయం, కళ్యాణ గీతామంజరి, శ్రీనివాస సుప్రభాతం, శ్రీకృష్ణ పంచరత్నమాల, అలంకార మణిహారం, ఉన్మత్తపాండవం, రఘునాథ విజయం, శ్రీనివాస విలాసం, శ్రీరామాయణ వైభవం. ఇవి తెలుగు గ్రంథాలు. మదనగోపాల మాహాత్మ్యం, సంస్కృత గ్రంథం. జటాప్రోలు సంస్థాన ప్రభువైన సురభి వెంకట జననాథరావు ఆస్థానంలో ఉన్నప్పుడు వారి ప్రేరణలో ఈ సంస్కృత గ్రంథాన్ని వ్రాసినట్లు తెలుస్తుంది.

శ్రీధర కృష్ణశాస్త్రి : మహబూబ్‌నగర్ జిల్లా మంచాల కట్టుగ్రామం. 19వ శతాబ్ది ఉత్తరార్ధం వరకు జీవించిన కవి. వీరి ఏకైక రచన శ్రీరామమందహాసం పద్యకావ్యం. ఈతడు విమర్శకుడు, కవి జటాప్రోలు సంస్థానంలో విశేష సత్కారాలందుకొన్న కవి.

వైద్యుల గురుమూర్తి శర్మ : మహబూబ్‌నగర్ జిల్లా ఆలేరు గ్రామం. 19వ శతాబ్దం పూర్వార్ధంలో జీవించినాడు. ఏకైక పద్యకావ్యం 'శివమహిమ్న స్తోత్రం' ఈయన గొప్ప విద్వత్కవి. అన్నగారైన రామచంద్రవర్మతో కలిసి రచనలు చేశాడు. మహ్నిస్తోత్రంలోని మూలశ్లోకం దానికింద అనువాద పద్యం చొప్పున 44 శ్లోకాలకు పద్యానువాదం చేశాడు.

చెలమచెర్ల రంగాచార్యులు : జననం 1944. గద్వాల సమీపంలోని రామగోపాలపేట వీరి నివాసం. రచనలు, అలంకార వసంతము, ఆంధ్రప్రతాపరుద్ర యశోభూషణం. అలంకార వసంతం, అలంకార శాస్త్రగ్రంథం. విద్యానాథుడు సంస్కృతంలో వ్రాసిన ప్రతాపరుద్ర యశోభూషణానికి అనువాదం, మూలానుసారంగా పద్యరూపంలో ఉంది. సురవరం ప్రతాపరెడ్డిగారి ప్రోత్సాహంతో ఇవి వ్రాసినట్లు తెలుస్తుంది.

తిరుమల రాయకవి : 19వ శతాబ్ద ఉత్తరార్ధంలోనివాడు. నివాసం గద్వాల సంస్థానం, ఏకైక రచన దండకం. ఇంకా కానాదము పెద్దనాధులు

రచించి యథాశ్లోక తాత్పర్య రామాయణాన్ని పరిష్కరించిన కవి. అనేక సంస్థానాల కెళ్లి దండకాలు చెప్పినది చారిత్రక సత్యం.

హారతి దీక్షాచార్యులు : 19వ శతాబ్ది ఉత్తరార్ధం. మహబూబ్‌నగర్ జిల్లా అమరచింత గ్రామనివాసి. ఆత్మకూరు సంస్థానంలో ఆస్థానపండితులు. భక్తివేదాంత సంబంధమైన గ్రంథాల నెక్కువగా రచించారు. రచనలు అలంకార మనిమాల, ఆచార్య వింశతి, శ్రీనివాస స్తుతి, శ్రీరామ కేశవస్తుతి, శ్రీరామ మంగళహారతి మొదలగునవి.

మాల్యాల దేవీప్రసాద్ : జననం 1901. మహబూబ్‌నగర్ జిల్లా శ్రీరంగాపురం. వాఙ్మయ పరిశోధక సరస కవిశేఖర బిరుదులు. రచనలు యాదవచంద్రిక, సంగమేశ్వర శతకం, భారతోదయం. ఇతడు సంఘ సంస్కర్త. ఉర్దూ, హిందీ భాషల్లో పండితుడు. సాహిత్య చరిత్రలో మంచి ఆసక్తి కలవాడు.

పురాణం నరసింహాచార్యులు : జననం 19వ శతాబ్ది ఉత్తరార్ధం. గద్వాల్ నివాసస్థలం. రచనలు జానకీ పరిణయం, శ్రీరామభూప చరితం, వీరు విద్వత్కవి. గద్వాల సంస్థానంలో ధర్మాధికారి. ఈ సంస్థానంలోనే వీరికి తిరుపతి వేంకటకవులకు హౌరాహౌరిగా సాహిత్య శాస్త్ర వాదాలు జరిగాయి.

సురవరం ప్రతాపరెడ్డి : వీరికాలం 1896 - 1953. మహబూబ్ నగర్ జిల్లా బోరవెల్లి నివాసి. వీరి రచనలు ఆంధ్రుల సాంఘిక చరిత్ర, రామాయణ విశేషాలు, భక్తతుకారాం, హైందవ ధర్మవీరుడు. రాజకీయ, సాహిత్య, సాంస్కృతిక రంగాలలో తెలంగాణను మేల్కొలిపిన వైతాళికుడు. బహుముఖ ప్రజ్ఞాశాలి. సంస్కృత, ఉర్దూ, ఇంగ్లీషు భాషలలో పండితుడు. ప్రాచీన కావ్యాలను ఎన్నో సేకరించి అచ్చు వేయించెను. గొప్పవిమర్శకుడు. నిస్వార్థ సేవా పరాయణుడు. ఆంధ్రమహాసభకు మొదటి అధ్యక్షుడు. గోలుకొండ పత్రికకు సుమారు 24 సం॥లు సంపాదకత్వం వహించాడు. ఇతని ఆంధ్రుల సాంఘిక చరిత్ర గ్రంథానికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు వచ్చింది.

బూర్గుల రామకృష్ణారావు : కాలం 1899-1967. మహబూబ్ నగర్ జిల్లా వడకల్ గ్రామనివాసి. రచనలు : కృష్ణశతకం, వెంకటేశ్వర సుప్రభాతం, కరుణలహరి, లక్ష్మీలహరి, శృంగేరి శారదా శతకం. ప్రముఖ రాజకీయవేత్త, కవి, రచయిత, విమర్శకుడు, ప్రాచీన సంస్కృతి పట్ల అభిమానం గలవాడు. జాతీయోద్యమంలో పాల్గొని పలుమార్లు జైలుకు వెళ్ళినాడు. నిజాం తెలంగాణా రాష్ట్ర ముఖ్యమంత్రిగా పనిచేశారు.

ముష్టిపల్లె రామభూపాలుడు : జననం 1844. మహబూబ్‌నగర్ జిల్లా గద్వాల సంస్థాన పాలకులు. స్వయంగా పండితులు, గ్రంథకర్త, కవి పోషకులు. పురాణం దీక్షాచార్యుల ప్రోత్సాహంతో ఛందుముఖరం అనే సంస్కృత గ్రంథం వ్రాశాడని ప్రతీతి.

వాజపేయయాజుల రామసుబ్బారాయుడు : 19వ శతాబ్దం ఉత్తరార్ధంవాడు. మహబూబ్‌నగర్ జిల్లా కొల్లాపురం (ఉరవకొండ దగ్గర) రచనలు : కాశీయాత్ర, సీతాకళ్యాణం, జానకీ పతిశతకం. జటాప్రోలు (కొల్లాపురం) కవి. దేశాటనం చేసి అనుభవం గడించిన పండితులు, శతాధిక గ్రంథకర్త. వీరి రచనలు 130 ఉన్నట్లు తెలుస్తుంది. కొల్లాపురం స్నేహలతా కవితా సంఘ వ్యవస్థాపకులు, అధ్యక్షులుగా ఉన్నారు.

ఉమ్మెత్తల వేంకటదాసు : 19వ శతాబ్ది ఉత్తరార్ధం వరకు జీవించిన కవి. మహబూబ్‌నగర్ జిల్లా పెద్ద ఉమ్మెత్త గ్రామ నివాసి. భక్తకవి, వాగ్గేయకారులు, రామన్‌చెర్ల కొండమీద వెలసిన శ్రీహరి నుద్దేశించి వేలకొలది కీర్తనలు వ్రాశారు. ముద్రితమైనవి వెయ్యికి పైగా కనిపిస్తున్నవి. మధ్య మధ్య నారాయణ అనే మకుటంతో వృత్తపద్యాలు కూడ కనిపిస్తున్నాయి.

దుంపల రామిరెడ్డి (1873-1965) : ఆలంపూరు తాలూకా ఉండవెల్లి నివాసులైన అమ్మమమ్మ చిన్ని హనుమంత రెడ్డిల కుమారుడు. సంస్కృతాంధ్ర ఉర్దూ ఫారసీ భాషా విద్వాంసుడు. షోడశ మహారాజులు, చమత్కార పద్య మంజరి, శ్రీరామాష్టాక్షరి, శివ పంచాక్షరి, నీతిశాస్త్రం (పద్య సంకలనం), సర్వ ధర్మ సార సంగ్రహం, రాజవంశావళి, సంఖ్యాపద వివరణం, చాటు పద్యాలు, హిందువుల పండుగలు వీరి రచనలు. ఈయన సాంవత్సరిక తిథి సందర్భంలో ఆప్తమిత్రులైన గడియారం రామకృష్ణశర్మగారు శ్రద్ధాంజలి సంచికను వెలువరించారు.

పెద మందడి (పూదత్తు) వెంకట కృష్ణ కవి (1880-1947): బిజినేపల్లి మండలం కానాపురం వాస్తవ్యుడైన పూదత్తు వెంకట కృష్ణకవి వనపర్తి సంస్థానంలోని పెద్దమందడికి ఇల్లరికం వెళ్లగా ఆ ఊరిపేరు అతని ఇంటిపేరుగా స్థిరపడింది. ఈయన రచనలు : శ్రీనిర్వచన భక్త విజయము, రెడ్డికుల నిర్ణయ చంద్రిక, కేశవ విలాసము, మారుతీ విలాసము, గద్వాల సంస్థాన చరిత్ర, పాలమూరు తిరుమలనాథ శతకము, వీరాయపల్లి చెన్నకేశవ శతకము.

చేపూరు పెద్ద లక్ష్మయ్య (1899-1965) : ఈయన అమరాబాద్ (అచ్చంపేట తాలూకా)కు చెందినవాడు. ఈయన రచనలు మనోబుద్ధిర్వివాదం, పరమపద సోపాన మార్గం, వేదార్ణవ నవనీతం, మూర్తిత్రయ శతకం, అచల తత్వాలు, అచలానందం, శ్రీసత్య నారాయణ వ్రత కథా సంకీర్తనం.

వాజపేయయాజుల రామసుబ్బ రాట్కవి (1895-1982): ఈయన కొల్లాపూర్‌కు చెందినవాడు. 1937లో స్నేహలతా కవితా సంఘ 51వ పుస్పంగా వెలువడిన 'యాగ సంరక్షణము' ప్రకటనలో ఐదు సంపుటాల పేర్లు గోచరిస్తాయి.

మాదిరాజు విశ్వనాథ రావు : (1896-1947) ఈయన వనపర్తి తాలూకా శాఖాపురంకు చెందినవాడు. కర్ణసుందరి (నాటిక), విక్రమాంక దేవచరితం ఈయన రచనలు.

తెలకపల్లి రామచంద్ర శాస్త్రి 1902-1989): కొల్లాపూర్ తాలూకా రాజాపురంకు చెందినవాడు. రచనలు: లలితా స్తవరుూరీ, శ్రీ హయగ్రీవ శతకం (1933), కవితా కాంతా స్వయంవరం, శారదాస్తుతి శతకం, ఉమామహేశ్వర సుప్రభాతం (1978), భూభ్రమణ వృత్తాంతం, భారతీ తారామాల, గురుపీఠ తత్వ దర్శనం, శ్రీమామిళ్ళపల్లీ నృసింహ సుప్రభాతం.

పెరవలి లింగయ్య శాస్త్రి (1910) : మహబూబ్‌నగర్ జిల్లా కొత్తకోట వాసి. ఈయన రచనలు ఆదర్శ భారతము. ఈయన సంస్కృతాంధ్ర పండితులు. దోనేపూడి నరసింహశాస్త్రి ఈయన గురువు. **కప్పగంతుల లక్ష్మణశాస్త్రి 1911-1981) :** ఈయన వనపర్తికి చెందినవాడు. ఆంధ్రవ్యాకరణ వివరణము, సంస్కృ త పాఠమాలా (2భా. 1953), మణి మంజూష (కథలు 1952) ఈయన రచనలు.

గడియారం రామకృష్ణ శర్మ (1919-2006) : ఈయన ఆలంపూరుకు చెందినవాడు. తల్లి వెంకటసుబ్బమ్మ, తండ్రి జ్వాలాపతి శాస్త్రి. ఆలంపూరు శిథిలములు, ఆలంపూరు క్షేత్రము, దక్షిణ వారణాశి, దక్షిణకాశి ఆలంపూరు,

బ్రహ్మేశ్వర క్షేత్ర మాహాత్మ్యం, జోగులాంబ మహాశక్తి, ఉమామహేశ్వర క్షేత్రం, బీచుపల్లి క్షేత్రం, తుంగభద్రా పుష్కరాలు, లఘునిత్య కర్మానుష్ఠానం, స్త్రీల పూజావిధులు, మన వాస్తు సంపద, భారతీయ వాస్తు విజ్ఞానము, భారతదేశ చరిత్ర, నిత్యానంద స్వామి చరిత్ర, శ్రీమాధవ విద్యారణ్య స్వామి చరిత్ర, దశరూపక సారము, వీరగాతలు, తెలుగు సిరి, ప్రపంచ రాజ్యములు, విజ్ఞాన వల్లరి, కన్నడ సాహిత్య చరిత్ర, కన్నడ సాహిత్య సౌరభం, పాంచజన్యము (1979), శతపత్రము (2004).

కేశవపంతుల నరసింహ శాస్త్రి (1919-1991) : ఈయన లంపూరు తాలూకా పల్లెపాడుకు చెందినవాడు. ప్రబంధ పాత్రలు, రత్నలక్ష్మీ శతకము, త్యాగధనులు, బాలబ్రహ్మేశ్వర సుప్రభాతం, సంస్థానాలు-సాహిత్యపోషణ, రఘువంశ వ్యాఖ్యానం ఈయన రచనలు.

ఉమ్మెత్తల యజ్ఞ రామయ్య (1921-1995) : ఈయన వనపర్తికి చెందినవాడు. ధర్మచక్రం, తాతయ్య కథలు, ఆశాలత, భరతుడు, ఝాన్సీరాణి వీరి రచనలు. కప్పగంతుల లక్ష్మణశాస్త్రి వీరి గురువు.

గొట్టిముక్కుల కృష్ణమూర్తి (1924) : కవి, కథకులు అయిన ఈయన గద్వాలకు చెందినవాడు. దైన్యాలోకము, నా గోడు వీరి రచనలు. గాడేపల్లి వీరరాఘవశాస్త్రి శిష్యుడు. కడుపు నిండింది, తన్నితే పరుపులో కథలు సుజాత పత్రిక (1950), పరిసరాలు సంపుటిలో అచ్చయినాయి. రవీంద్రుడు, టాల్‌స్టాయి కథానువాదాలు కూడా సుజాతలో ప్రచురితాలు.

బల్‌హరి సింహ ఠాకూర్ (1924) : కొల్లాపూర్ తాలూకా బెక్కెం నివాసి. బెక్కేశ్వర స్తవరాజము, బలహరి గీతామృతం, విచిత్ర ఆధ్యాత్మికం, శృంగార సాత్రాజితి, శృంగార బెక్కేశ్వరం, సంగమేశ్వర కల్యాణం, దుర్గ చరిత్ర, భగవద్గీత (హరికథ), హనుమద్వ్రతకథ, పంచాచార్య చరిత్ర, నిత్యానందులవారి జీవిత చరిత్ర, శ్రీసంగమేశ్వర స్థలపురాణం.

ఫోతేదార్ కేశవాచార్య (1933-2010) : ఈయన పెబ్బేరు మండలం శ్రీరంగాపురం వాస్తవ్యులు. శ్రీరంగనాథ శతకము, భద్రాద్రిరామ శతకము, వేములవాడ రాజరాజేశ్వర శతకము, రామలింగేశ్వర నక్షత్రమాల, సీతారామ తారావళి, షిరిడిసాయి చరితామృతం, వెంకయ్య స్వామి లీలామృతం, గేయకథలు, మాతృశ్రీ, అమరస్మృతులు, గణవీణ, రసప్రియ రామాయణం (6 భాగాలు).

కె. కమల (1940-2007) : ఈమె వనపర్తికి చెందినవారు. కాదంబరి కావ్య సుషమ, వ్యాస సూక్తము, శాంతిపర్వతంలోని సుభాషితాలు, ప్రాకృత పాఠమాలిక, వజ్జాలగ్గం (అనువాదం), ప్రాకృత సాహిత్యంలో ప్రాచీన భారతీయ జీవనం (ఆంగ్లం).

వీరే పాలమూరు జిల్లాలోని కృష్ణా తీరం అనేకమంది కవులు, పండితులకు జన్మనిచ్చింది. వారిలో మరికొందరు అనంతుని సీతారామ సిద్ధాంతి (వనపర్తి తాలూకా సింగంపల్లె జాగీర్దారు రమణమ్మ, జగ్గన్న పంతుల కుమారుడు); అప్పరుసు నరసింగరావు (గద్వాల), ఆచార్ల రాఘవాచార్యులు (వనపర్తి); ఓరుగంటి శివరామశాస్త్రి (కొల్లాపూర్ తాలూకా సింగపట్నం) ఓరుగంటి లక్ష్మీనారాయణ శాస్త్రి (కొల్లాపూర్ తాలూకా సింగపట్నం), కూడవెల్లి శ్రీనివాసరావు (ఆలంపూర్ తాలూకా కూడవెల్లి), కె. యామునాచార్యులు (గద్వాల నివాసి); కో.క. అణ్ణన్ సంపత్కుమారాచార్యులు (కొల్లాపురం); కోవూరు హనుమంతరావు (ఆలంపూర్ తాలూకా పుల్లూరు); గుడిమంచి సుబ్రహ్మణ్య శాస్త్రి (వనపర్తి తాలూకా శ్రీరంగాపురం); గొబ్బూరు సంజన్న (గద్వాల సంస్థానంలో తహసీల్దారుగా పనిచేసిన సంజన్న బీచుపల్లి, మల్దకల్ క్షేత్రాల అభివృద్ధికి కృషి సల్పారు. సంస్కృతాంధ్ర కన్నడ ఉర్దూ భాషల్లో పండితుడు); గొట్టిముక్కుల నీలకంఠ శర్మ; గొట్టిముక్కుల చంద్రమౌళీశ్వర శర్మ (ఆలంపూర్ తాలూకా మారా మునగాల); గొట్టిముక్కుల విశ్వనాథ శాస్త్రి (కొల్లాపూర్); చెరుకుపల్లి నరసింహ సిద్ధాంతి (కొల్లాపూర్ తాలూకా చుక్కాయపల్లె); చేపూరు జానకి రామాచార్యులు (పెంట్లవెల్లి); జాజాల రామకృష్ణయ్య, జాజాల వాసుదేవశర్మ (శ్రీరంగాపురం); ధర్మవరం మణి మణి హరిగోపాలసూరి (గద్వాల తాలూకా ధర్మవరం); నందవరీకం కృష్ణయ్య (వనపర్తి); నాగమాల నారాయణ దాసు (అమరచింత); నేతి రామకృష్ణ శాస్త్రి (పెంట్లవెల్లి); పత్రి పురుషోత్తమ శాస్త్రి (కొల్లాపూర్ మండలం బెక్కెం); పల్లా పాపశాస్త్రి, పల్లా అపయ్య శాస్త్రి (వనపర్తి); పురాణం మల్లయ్య (గద్వాల); పుల్లగుమ్మి శ్రీనివాసాచారి (గద్వాల); పెరుంబుదూరు వేంకట కృష్ణమాచార్యులు (గద్వాల);

పర్చూరి సింగన్న : 1450-1500. నల్గొండ జిల్లా ఏర్చూరు గ్రామం. వీరి రచనలు భాగవతం షష్ఠస్కంధం, కువలయాశ్వ చరిత్ర. ఇది అసమగ్రం. భాగవతం షష్ఠమస్కంధం తెలుగులోకి అనువాదం చేసిన కవి. సింగన్న తన భాగవతం శ్రీకృష్ణునికి అంకితమిచ్చాడు.

చిత్తూరు గంగాధర కవి : 1823 వరకు జీవించిన కవి. నల్లగొండ జిల్లా చర్లపల్లి గ్రామనివాసి. ప్రసిద్ధకవి. వీరి రచనలు కొలిపాక మాహాత్మ్యం, శృంగార భల్లాణ చరిత్రం, శృంగార సిరియాళ చరిత్రం, సుఖ సప్తతి వచనం.

పానుగోటి జగన్నాధరాయలు : 18వ శతాబ్ది తుది భాగంలోని వాడు. నల్గొండ జిల్లా పానుగోడు నివాసి. ఇతడు రాసిన ఏకైక కావ్యం 'కుముదవల్లీ విలాసం'

మరింగంటి చెన్న కృష్ణమాచార్యులు : 19వ శతాబ్దం. నల్గొండ జిల్లా కనగల్లు గ్రామనివాసి. వీరి ఏకైక రచన యాదగిరి నృసింహ శతకం.

మరింగంటి 'వేంకట' (ప్రథమ) నృసింహాచార్యులు : 1770 ప్రాంతంవాడు. నల్గొండ జిలల్లా కనగల్లు గ్రామ నివాసి. ఇతను మరింగంటి సింగరాచార్యులకు ఆరోతరం వాడు. కవి తాను 16 గ్రంథాలు వ్రాసినట్లు ఆశ్వాసాంత గద్యలో చెప్పుకున్నాడు. వీరి రచనలు 'జనకసుతాభ్యుదయ' శ్రీకృష్ణా శతానందీయం. జాంబవతీ కుమారశృంగార విలాసం. రామానుజాభ్యుదయం, గోదావధూటి పరిణయం, రతిమన్మధాభ్యుదయం, శ్రీకృష్ణ తులాభారం ద్విపదలో చెప్పడం తెలుగు సాహిత్యంలో అరుదైన విషయం.

మరింగంటి వేంకట (ద్వితీయ) నరసింహాచార్యులు : 1842 ప్రాంతానికి చెందిన కవి. నల్గొండ జిల్లా కనగల్లు గ్రామ నివాసి. సింగరాచార్యులకు ఎనిమిదో తరంవాడు. ఇతని కృతులు రెండు అముద్రితాలు. 1. తాలాంక నందినీ పరిణయం. 2. ఇందిరాల భాగవతము, దీనికి మరోపేరు గోదాపారిజాతము.

మరింగంటి వేంకట (తృతీయ) నరసింహాచార్యులు : 19వ శతాబ్దానికి చెందిన కవి. నల్గొండ జిల్లా కనగల్లు గ్రామనివాసి. వీరి పూర్వీకులైన మరింగంటి కవులు వ్రాసిన గ్రంథాలన్నింటిని పదిలపరచిన రంగాచార్యులకు

జనకుడు. వీరి రచన అనిరుద్ధ విలాసం. ఇది యక్షగానం.

మరింగంటి వేంకట రాఘవాచార్యులు : 19వ శతాబ్దం. నల్గొండ జిల్లా కనగల్లు నివాసి. వీరి రచనలు కేశవస్వామి శతకం, క్షమావింశతి.

మరింగంటి వేంకటాచార్యులు : 18వ శతాబ్దం. సంస్కృతాంధ్రాలలో దిట్ట. వీరి ఏకైక రచన 'మల్లాది చరిత్ర'. ఇది ద్విపద కావ్యం. ఇతడు నల్గొండ కనగల్లు గ్రామ నివాసి. ద్విపదలో వర్ణనాత్మకంగా రచన చేయడం అపూర్వ విషయం.

మరింగంటి సింగరాచార్యులు : 16వ శతాబ్ద ఉత్తరార్ధకవి. నల్గొండ జిల్లా ఏనకరాజు పల్లె గ్రామనివాసి. ఇతని బిరుదులు కవిసార్వభౌముడు, శతఘంటావధాని, రచనలు దాదాపు 19 వరకు ఉన్నాయి. అందులో ప్రసిద్ధి కలవి – రామకృష్ణ విజయం కావ్యం, నలయాదవ రాఘవ పాండవీయం, చతురర్థి కావ్యం, ఆంధ్రభాషాభూషణం, కృష్ణతులాభారం, ప్రేమాభిరామం. నాటకశాస్త్రం,, దశరథ రాజనందన చరిత్ర, రతిమన్మథాభ్యుదయం, రామాభ్యుదయం, వరదరాజస్తుతి, శ్రీరంగ శతకం లాంటివి చెప్పుకోదగ్గవి. ఇతని సమకాలికులు పెన్నెగంటి తెలగనార్యుడు.

ఉమ్మెత్తల కేశవరావు : జననం 1910. నల్గొండ జిల్లా పిల్లలమర్రి గ్రామనివాసి. జానకమ్మ, చక్రయ్య దంపతుల కుమారుడు. భూదానోద్యమం పద్యకావ్యం. రైతు సమస్య, రామనామచింతనం బూర్గుల రామకృష్ణారావు వంటి వచనకావ్యాలను వ్రాశాడు. జాతీయవాది. సాంఘిక సారస్వత రాజకీయ రంగాలలో విశేష కృషి సల్పినాడు. భూదానోద్యమం గ్రంథాలయ ఉద్యమాలలో ప్రధానపాత్ర వహించాడు.

కొట్రా మల్లికార్జున శర్మ : జననం : మే, 1941. వీరు పెద్దాపుర మండలానికి చెందినవారు. బి.ఎ. యల్‌యల్.బి. సంస్కృతం, హిందీ పరీక్షలు చదివారు. ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రంలో కార్యనిర్వహణాధికారిగా పనిచేశారు. స్వర్ణలత నవల, భావచిత్రాల కవితా సంపుటి, నాగరీకం కథాసంపుటి, శ్రీభ్రమరాంబా మల్లికార్జున వచనాలు ప్రచురించారు. ఇవిగాక ఆంధ్రజ్యోతి, ఆంధ్రభూమి మొదలైన పత్రికల్లో ఎన్నో వ్యాసాలు, కవితలు ప్రచురించారు. వీరు 'కౌశిక' అను కలం పేరుతో కూడా రచనాలు చేశారు.

పుల్లాభట్ల వెంకటేశ్వర్లు: జననం నవంబర్ 1924న నల్గొండ జిల్లా మేళ్ళచెర్వులో జన్మించారు. తల్లిదండ్రులు : సుందరమ్మ, కోటయ్య. ఎం.ఎ. సాహిత్యభూషణ్‌లో ఉత్తీర్ణులు. వీరు పుల్లాభట్ల కథలు, మూడు వాక్చిత్రాలు, గాడితప్పిన జీవితాలు, ఆదిరాజు వీరభద్రరాజు జీవితచరిత్ర, స్వాతంత్ర్యోద్యమ రథసారథులు, మహావిజ్ఞానవేత్తలు, బౌద్ధమహా క్షేత్రాలు, తెలుగు నవలా సాహిత్య వికాసం అన్న రచనలు వెలువరించారు. వీరు సంస్కృతాంధ్ర, ఆంగ్లభాషల్లో నిష్ణాతులు. మంచి వక్త. వీరు అనేక గ్రంథాలకు విమర్శలు కూడా వ్రాశారు. వీరికి 'సమీక్షా శిరోమణి', 'సాహిత్యాచార్య', 'మహోపాధ్యాయ' బిరుదులున్నాయి. వీరు 1946 నుండి 70 వరకు అధ్యాపకవృత్తిని నిర్వహించారు. వీరి రచనలు కొన్ని విశ్వవిద్యాలయాల్లో పాఠ్యగ్రంథాలుగా నిర్ణయించారు.

తుమురుగోటి సోమశేఖర కవి: వీరు క్రీ.శ.1887కి చెందినవారు. నల్గొండ జిల్లా దామరచర్ల మండలానికి చెందినవారు. వీరిది పూర్వం నుండి సాహితీ కుటుంబం. వీరు తృణావర్తుని కథ రచించారు. అముద్రితం. నేటికీ మిర్యాలగూడ ప్రాంతంలో ఈ వంశీకులు వున్నారు. వీరి రచనల్లోని కొన్ని పద్యాలను బట్టి ఈయన ప్రౌఢకవి, నిరాఘాట కవితాధురీణుడు అని ఊహింప వీలున్నది.

ఆంధ్రప్రదేశ్

అక్కెనపల్లి నృసింహ కవి : 18-19వ శతాబ్దపు కవి. కృష్ణా మండలంలోని యెల్లమంద స్వస్థలం. ఓఘవతీ పరిణయం, ఆదిలక్ష్మీ విలాసం, వల్లభాంబా పరిణయం, విద్వత్‌కవి జోగయామాత్యుని పుత్రుడు. అనేక సంస్థానాలు దర్శించాడు.

అనంతామాత్యుడు : 15వ శతాబ్దం పూర్వార్ధపు కవి. కృష్ణా మండలం పెనుమకూరు నివాసి. భోజరాజీయం, ఛందోదర్పణం, రసాభరణము. శ్రీనాథుడు, పెదకోమటి వేమారెడ్డికి సమకాలికుడు.

అనఘం కోదండయ్య : 17వ శతాబ్దపు కవి. గుంటూరు మండల నివాసి.రుక్మావతీ పరిణయం ఇతని రచన.

ఉన్నవ యోగానందుడు : క్రీ.శ. 1750 ప్రాంతపు కవి. గుంటూరు జిల్లా ఉన్నవ గ్రామం స్వస్థలం. రుక్మిణీ పరిణయం, రాజగోపాల శతకం ఇతని రచనలు.

కంచెర్ల అయ్యన్న : 16వ శతాబ్దపు కవి. కృష్ణామండలం స్వస్థలం. కాశీఖండం ద్విపదలో రచించాడు.

కర్లపాలెము సింగన : క్రీ.శ. 1760 ప్రాంతపు కవి. గుంటూరు జిల్లా బాపట్ల తాలూకా కర్లపాలెం నివాసి. నృసింహ శతకం వీరి రచన.

కలిదిండి భావనారాయణ : 16వ శతాబ్దపు కవి. కృష్ణా జిల్లా కైకలూరు తాలూకా కలిదిండి గ్రామనివాసి. విష్ణుపురాణం రచించాడు.

కానుకొలను అన్నమరాజు : క్రీ.శ. 1500 ప్రాంతబీపు కవి. అన్నమయ్య ఇతని నామాంతరం. అమరుక శతకం ఇతని రచన. జన్మస్థలం గురించి విమర్శకులలో అభిప్రాయ భేదాలున్నాయి.

కాసుల పురుషోత్తం : 18వ శతాబ్దపు కాలంవాడు. చల్లపల్లి సంస్థానంలోని పెదప్రోలు గ్రామ నివాసి. ఆంధ్రనాయక శతకం, హంసలదీవి శతకం, గోపాల శతకము మొదలైనవి ఇతని రచనలు.

నాదెండ్ల గోపమంత్రి : కొండవీటి స్వస్థలం. గయోపాఖ్యానం లేక కృష్ణార్జున సంవాదము ఇతని రచన.

కొటికలపూడి వీరరాఘవాచార్యులు : 17వ శతాబ్దపు ఉత్తర భాగంలో జీవించాడు. వినుకొండ స్వస్థలం. యథాశ్లోక తాత్పర్య భారతం, నవీనాంధ్ర ద్రోణ పర్వతము ఇతని రచనలు.

కోవెల రాఘవదాసు : క్రీ.శ.1800-1850 మధ్యకాలం వారు. మంగళగిరి స్వస్థలం. ప్రణయకలహ కలాపము ఇతని రచన.

క్షేత్రయ్య (మువ్వ వరదయ్య) : 17వ శతాబ్దపు కాలం వారు. కృష్ణా జిల్లా దివితాలూకా మొవ్వగ్రామం స్వస్థలం. పదాలు, కీర్తనలు ఇతని రచనలు.

గణపవరపు వేంకటకవి : 17వ శతాబ్దపు కాలంకవి. కృష్ణా జిల్లాలోని కామేపల్లి సీమలోని గణపవరం స్వస్థలం. విద్యావతీ దండకము, తారావళులు, శంగార మంజరి, ఆంధ్ర కౌముది, కల్పిత కల్పలత, సర్వలక్షణ శిరోమణి మొదలైన 33 గ్రంథాలు రచించాడు.

చెరుకూరి లక్ష్మీధరుడు: గుంటూరు మండల నివాసి. శృతిరంజని, భరతశాస్త్రం, స్వర్ణమంజరి, ప్రసన్న రాఘవము మొదలగు సంస్కృత గ్రంథాలు రచించాడు.

తిరుమల బుక్కపట్టణము (చిన) తాతాచార్యులు : 19వ శతాబ్దపు కవి. కృష్ణా మండలం పితాపురం అగ్రహార నివాసి. ఆంధ్ర విశ్వగుణాదర్శము ఇతని రచన.

తెనాలి రామభద్రకవి : 16వ శతాబ్దపు కాలపువాడు. గుంటూరు మండలం తెనాలి అగ్రహార నివాసి. ఇందుమతీ కల్యాణం ఇతని రచన.

దార్ల సుందరమ్మ : 1830 ప్రాంతం. చెర్లగుడిపాడు, గుంటూరు మండల నివాసి. భావలింగ శతకము ఈమె రచన.

దిట్టకవి రామచంద్రయ్య కవి : 1750 ప్రాంతం. కృష్ణాజిల్లా నందిగామ తాలూకా గొట్టిముక్కల ప్రాంతపు వాడు. రఘుకుల తిలక శతకము. మహిషాసుర మర్దినీ శతకము, రాజగోపాల శతకము, హేలావతీ దండకము మొదలగునవి ఇతని రచనలు.

దిట్టకవి రామయోగి : 1845. మచిలీపట్నం ప్రాంత నివాసి. రుక్మిణీ శతకము ఇతని రచన.

నాదెండ్ల గోపమంత్రి : 1485-1533 ప్రాంతం. గుంటూరు జిల్లా నాదెండ్ల స్వస్థలం. ప్రబోధ చంద్రోదయ వ్యాఖ్య (సంస్కృతం), కృష్ణార్జున సంవాదము (ద్విపద) ఇతని రచనలు.

పెద్దాడ నాగరాజామాత్యుడు : 1760-1825 ప్రాంతం మచిలీపట్నం స్వస్థలం. శకుంతలా పరిణయం ఇతని రచన.

పెనుమత్స బుచ్చిరాజు : 1800 ప్రాంతపువాడు. గుంటూరు మండలం, కర్లపాలెం స్వస్థలం. పరతత్త్వ ప్రకాశిక ఇతని రచన.

పోచిరాజు వీరన్న : 18వ శతాబ్దపువాడు. గుంటూరు జిల్లాలోని కొలకలూరు స్వస్థలం. కృష్ణార్జున సంవాదము, విభూతి మాహాత్మ్యం, మనువంశ పురాణం, ఆనందలహరి, సౌందర్యలహరి మొదలైనవి ఇతని రచనలు.

బప్పన కవి : 14వ శతాబ్దపు వాడు. కొండవీడు స్వస్థలం. ఆంధ్రప్రయోగ రత్నాకరము ఇతని రచన.

బొగ్గవరపు పెదపాపరాజు : 18వ శతాబ్దపు వాడు. గుంటూరు జిల్లా బొగ్గవరము స్వస్థలము. చాటుకవి. అనేక సంస్థానాలు దర్శించాడు.

మంగళగిరి ఆనందకవి : 18వ శతాబ్దపు కవి. కృష్ణామండలం స్వస్థలం. విజయనందన విలాసము, వేదాంత రసాయనము మొదలైనవి ఇతని రచనలు.

మంచన : 1182-1206. గుంటూరు మండలం చందవోలు నివాసి. కేయూర బాహు చరితము ఇతని రచన.

మల్లవరపు వాలేశ్వరుడు: 1580-1630. కృష్ణా జిల్లా గుడివాడ తాలూకా మల్లవరం స్వస్థలం. భల్లాణచరిత్ర ఇతని రచన.

మాడభూషి నరసింహాచార్యులు : 19వ శతాబ్దం పూర్వార్ధపు కవి. నూజీవీడు స్వస్థలం. వల్లవీ వల్లిపోల్లాసము, రుక్మిణీ కల్యాణము, నీలాపనిందా నివారణము ఇతని రచనలు.

మాదయ కవి : 1485-1508 ప్రాంతపు వాడు. కృష్ణా జిల్లా గుడివాడ ప్రాంతం. మైరావణ చరిత్ర, దేవేంద్ర విజయం ఇతని రచనలు.

మాదయగారి మల్లన (అయ్యంకి మల్లన) : 1480-1540 ప్రాంతం. కృష్ణా మండలం అయ్యంకి స్వస్థలం. రాజశేఖర చరిత్రము ఇతని రచన.

మామిడి సింగనామాత్యుడు : 14వ శతాబ్ది ఉత్తరార్ధపు కవి. కొండవీడు స్వస్థలం. సోమసిద్ధాంత వ్యాఖ్య ఇతని రచన.

ముక్తేవి పెరుమాళ్లయ్య : 18వ శతాబ్దపు కవి. చల్లపల్లి సంస్థానంలోని పెదముక్తేవి గ్రామం స్వస్థలం. హనుమంత శతకం ఇతని రచన.

ముక్తేవి సుందరరామదాస కవి : 18వ శతాబ్దపు కవి. పెదముక్తేవి గ్రామ నివాసి. రామాయణ సార సంగ్రహం ఇతని రచన.

ముమ్మడి మల్లన: 16వ శతాబ్దపు కవి. గుంటూరు మండలంలోని కప్పురావూరు గ్రామ నివాసి. తత్త్వ చంద్రోదయము, శ్రీరామస్తవరాజము ఇతని రచనలు.

ములుగు పాపయారాధ్యులు : 1778-1852 మధ్యకాలం. గుంటూరు మండలంలోని చింతలపల్లి గ్రామం స్వస్థలం. ఏకాదశి చంపూ, శంతనుచరిత్ర, దేవీభాగవతము, అహల్యా సంక్రందనీయము ఇతని రచనలు. అభినవ కాళిదాసు, పుంభావ సరస్వతి ఇతని బిరుదాలు.

రేటూరి భావనామాత్యుడు : 18వ వతాబ్దం. గుంటూరు మండలం బాపట్ల తాలూకా రేటూరి గ్రామ నివాసి. కామేశ్వరి చరిత్రము ఇతని రచన.

లింగకవి : 17వ శతాబ్దం. వేదాద్రిపురం స్వస్థలం. శతముఖ రామాయణం ఇతని రచన.

వణుకూరి గురువరాజు : 16వ శతాబ్దం. కృష్ణా జిల్లాలోని వణుకూరు స్వస్థలం. శమంతకమణి చరిత్ర ఇతని రచన.

వామన భట్టబాణుడు : 1402-1420. కొండవీడు నివాసి. శృంగార భూషణ బాణము, ఉషా పరిణయం, పార్వతీ కల్యాణం, హంససందేశం, శబ్ద చంద్రిక మొదలగునవి ఇతని రచనలు.

వారణాసి ధర్మసూరి: 15వ శతాబ్దం. గుంటూరు మండలంలోని కఠివరం స్వస్థలం. కృష్ణా స్తుతి, సూర్యశతకం, బాలభాగవతము, హంససందేశము, కంసవధ మొదలగునవి ఇతని రచనలు.

వెలగపూడి వెంకన్న : 16వ శతాబ్దం. గుంటూరు మండల నివాసి. శ్రీకృష్ణ కర్ణామృతం ఇతని రచన.

వెల్లంకి తాతంభట్టు: 15వ శతాబ్దం ఉత్తరార్ధం. కృష్ణా మండల నివాసి. చంధోదర్పణం, కవిచింతామణి, మొదలగునవి ఇతని రచనలు.

వేమానారాధ్యుల సంగమేశ్వరారాధ్యుడు : 18వ శతాబ్దం. కృష్ణా మండల నివాసి. అహల్యా సంక్రందన విలాపము ఇతని రచన.

శేషము చెన్నుభట్టారకుడు : 1690 ప్రాంతం. గుంటూరు మండల నివాసి. అభిమన్యు కల్యాణం (ద్విపద) రచన.

శేషము రంగాచార్యుడు : 18వ శతాబ్దపు పూర్వార్ధం గుంటూరు మండలం స్వస్థలం. భావనారాయణ విలాసము, రతిమన్మథ విలాసము. శివకేశవ పారిజాతము ఇతని రచనలు.

శ్రీగిరి విరూపాక్షుడు : 17వ శతాబ్దం పూర్వార్ధం. శ్రీకాళహస్తి లింగ శతకము ఇతని రచన.

సిద్ధేంద్రయోగి : 1672-1685. కృష్ణా మండలం కూచిపూడి నివాసి. భామాకలాపము. గొల్లకలాపము ఇతని రచనలు.

సిరిప్రగడ ధర్మనామాత్యుడు : 17వ శతాబ్దం. కృష్ణా మండలం ఇందుర్తి సీమ స్వస్థలం. నలచరిత్రము రచన.

సుసర్ల బ్రహ్మన్న శాస్త్రి : కృష్ణా మండలం పెదకళ్ళేపల్లి నివాసి. సంస్కృతాంధ్ర పండితుడు. అనేక శ్లోకాలు రచించారు.

కందాదై అప్పకొండాచార్యుడు : కృష్ణాతీర ప్రాంత నివాసి. అరవైకి పైగా రచనలు ఉన్నట్లు తెలుస్తుంది. అన్ని సంస్కృత భాషా గ్రంథాలే. మానసోల్లాసవ్యాఖ్య (మనుస్మృతి),సిద్ధాంత సారము, తత్త్వనిర్ణయము, తత్త్వామృతము, విశిష్టాద్వైత నిర్ణయము, తత్త్వనిష్కర్ష సజ్జనామృతము, రస్యత్రయ సారార్థము, మాఘభంగము మొదలగునవి.

గట్టు శేషకవి : కర్నూలు మండల నివాసి. 18వ శతాబ్దం వీరార్యుని పుత్రుడు. కుచేలోపాఖ్యానం వ్రాసిన గట్టు ప్రభువు. ఇతడు ఒక్కరేనని విమర్శకుల భావన. కాలం విషయంలో భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. 'సత్యభామా విజయము' ఇతని ద్విపదకావ్యం.

తాడేపల్లి పానకాలరాయ కవి : కృష్ణానదీ తీరంలోని తాడేపల్లి గ్రామం. వీరి రచనలు. 'సకల వైద్యశాస్త్రార్థ సంగ్రహం' ఇది అసమగ్రం. చిత్తబోధవకతం. మానసబోధ శతకం, రామశతకం, రుక్మిణీ పతి శతకం, లక్ష్మీశతకం, మంగళాద్రి నరసింహ శతకం, ఇతడు వైద్యవిద్యలోనే కాకుండ రాజనీతిలో కూడ కోవిదుడు.

పింగళి సూరన : క్రీ.శ. 16వ శతాబ్దపు కవి. కర్నూలు మండల నివాసి. 'ఆంధ్రభోజ' శ్రీకృష్ణదేవరాయల అష్టదిగ్గజాలలోని వాడని ప్రతీతి. వీరి రచనల్లో 'రాఘవ పాండవీయం' ద్వర్థికావ్యం. 'కళాపూర్ణోదయం' అపూర్వ కల్పిత ప్రబంధం. ప్రభావతీ ప్రద్యుమ్నము, ప్రౌఢప్రబంధం. అలభ్య గ్రంథాలు, గరుడ పురాణం, గిరిజాకల్యాణం, రాఘవ పాండవీయాన్ని పంపా విరూపాక్షదేవికి, కళాపూర్ణోదయాన్ని నంద్యాల కృష్ణమరాజుకు, ప్రభావతీ ప్రద్యుమ్నాన్ని తన తండ్రియైన అమరార్యునకు అంకితమిచ్చాడు.

భారతుల పేరయ్యశాస్త్రి : 19వ శతాబ్దానికి చెందినవాడు. కర్నూలు మండలం అన్న సముద్రం గ్రామనివాసి. ఇతడు వ్రాసిన గ్రంథం 'బాలా త్రిపురసుందరీ స్తోత్రం'. పొగాకుమీద, దూపాటి సీమ మీద ఇతడు చెప్పిన చాటు పద్యాలు ప్రసిద్ధమైనవి. ఆ రోజుల్లో చాటుపద్యకవిగా సుప్రసిద్ధుడు.

తరిగొప్పుల మల్లన : 1580-1620 ప్రాంతంలో జీవించాడు. కర్నూలు జిల్లా నందికొట్కూరు తాలూకాలోని తరికొప్పుల గ్రామవాసి. ఇతని రచన చంద్రభాను చరిత్ర. ఇతని బిరుదు గండభేరుండ కవి. వెంకటపతిరాయల కొలువులో వ్రాయసగాడు. ఆశు, విస్తర, చిత్ర, మధుర కవితల దిట్ట.

వీరబ్రహ్మ యోగి : 17వ శతాబ్దం పూర్వార్ధంలో జీవించిన కవి. కడప జిల్లా కంది మల్లాయపల్లె గ్రామం. విజయనగర సామ్రాజ్య పతనానంతరం దేశం మహమ్మదీయ పాదాక్రాంతం అయినపుడు ఆంధ్రదేశంలో అవతరించిన సిద్ధపురుషులలో ప్రముఖుడు. ఉపనిషత్తులకు నూతన భాష్యకర్తగా హిందూ మహమ్మదీయ మతసామరస్యానికి నవసమాజ నిర్మాణానికి రాచబాట వేసిన కాలజ్ఞాని. కొండగుహలలో కాలజ్ఞానం వ్రాసి, తన మహిమల్ని అచ్చమ్మ, వెంకటరెడ్డి దంపతుల వద్ద ప్రదర్శించాడు. కడప, కర్నూలు, సిద్ధవటం నవాబుల దగ్గరకు వెళ్ళి మతసామరస్య బోధచేసి, మహిమల్ని ప్రదర్శించి వారిని శిష్యులుగా చేర్చుకున్నాడు. సిద్ధయ్య అనే దూదేకుల బాలుని శిష్యునిగా చేర్చుకొని ఉపనిషత్తులను, యోగతత్త్వ మార్గాలను ఉపదేశించాడు. దూదేకుల వానికి ఉపనిషత్ బోధచేయడం పుష్పగిరి అగ్రహారికులకు, శంకర పీఠాధిపతులకు సహింపరానిదైంది. బ్రహ్మయోగి మతం అద్వైత వేదాంత మార్గం అని చెప్పవచ్చు. చివరిదశలో వీరు జీవసమాధి అయినారు.

వెణుతుర్ల ఒడ్డెయ్య : 16వ వతాబ్దం. కర్నూలు జిల్లా వెణుతుర్ల గ్రామనివాసి. రచనలు 'శృంగార రసాలవాలం'. తీఇది అలంకారశాస్త్రం. 'బాలగోపాల విలాసం' ఇది ప్రబంధం. వెంగనార్యుని పౌత్రుడు. మంగళగిరి పుత్రుడు, గురువు దేశికాచార్యులు, నామాంతరం వడ్డికవి. ఇతడు 'అను ఏమ బ్రహ్మవ ఇద్యావిహరుడు', ఆంధ్రగీర్వాణ భాషలలో పండితుడు.

ఎలకూచి బాలసరస్వతి : 17వ శతాబ్దివాడు. ఈతని నామాంతరం ఎలకూచి వేంకట కృష్ణయ్య, నివాసం పాకనాడు. బిరుదులు 'మహామహోపాధ్యాయ భట్టార్యక బాలసరస్వతి' వీరి రచనలు. బాలసరస్వతీయం (ఆంధ్రశబ్దానికి టీకా) భర్తృహరి త్రిశతికి అనువాదం. యాదవ రాఘవ పాండవీయం త్ర్యర్థికావ్యం. చంద్రికా పరిణయం, వామన పురాణం, భ్రమరగీతి ప్రబంధం. కార్తికేయాభ్యుదయం. అసాధారణ శేముషీ మహిమ కలవాడు. ప్రౌఢంగా హృదయంగమంగ కవిత చెప్పినవాడు. బాల్యంలోనే పాండిత్యం చూపటంవల్ల బాలసరస్వతి అని పేరు వచ్చినదట. అదే వ్యవహారంగా తెలుగు సాహిత్యం గుర్తించినది.

అన్నమరాజశర్మ : జననం 1902. కర్నూలు జిల్లా గార్గేయపురం. రచనలు కవి విపంచి, కవిజీవితం, మీరాబాయ్, స్వతంత్రసౌరభం, మల్లెపువ్వు లాంటి ఖండకావ్య ప్రక్రియలకు ఆద్యుడు. కాల్పనికోద్యమ ప్రభావంతో రచనలు చేసిన కవి. భాషలోను, భావంలోను కొత్తదనాన్ని చూపిన కవి. వీరి ఖండికల్లో ప్రకృతి చిత్రణ ప్రణయం ఎక్కువ చోటుచేసుకుంది. కొన్ని గేయాలలో సంప్రదాయ రీతుల ప్రభావం కనిపిస్తుంది. ఎక్కువ గేయాలు ఖండగతిలోను, మిశ్రగతిలోను ఉన్నాయి. మర్మకవిత్వానికి ఆధునిక యుగంలో ఆద్యుడిగా చెప్పవచ్చును.

చిన్న వెంకటరెడ్డి : జననం 1910. కర్నూలు జిల్లా జంగంగుంట నివాసి. రచనలు, రామలింగేశ్వర శతకం. పంచఫణితాళ వృక్షములు, విద్వత్కవి, భక్తివైరాగ్య ప్రధానంగా రచనలు చేశాడు. రామలింగేశ్వర మకుటంతో కాకర్ల రామలింగేశ్వరునిపై రామలింగేశ్వర శతకం చెప్పినాడు. ఇది అనుప్రాసలతో నిండి ఉంది.

జోస్యము జనరసశాస్త్రి : కర్నూలు జిల్లా పాణ్యం గ్రామం. 1911లో జననం. రచనలు, వీరాంజనేయ విలాసం పసిడిపంట, కన్నీటిచుక్కలు, కన్నతల్లి, దేవిమాహాత్మ్యం వంటి పద్యకావ్యాల్ని, ఉన్నమాట వంటి శతకాన్ని వ్రాసిన కవి. ప్రకృతిని ఆరాధించిన కవి. 'కృతిపతి' కావ్యం కృష్ణదేవరాయల నాటి గువ్వల చెన్నుని కథ ఆధారంగా వ్రాయబడింది.

పుల్లాపంతుల రామచంద్రయ్య : జననం 1900. కర్నూలులో జన్మించాడు. భక్తివేదాంతాలను ప్రచారం చేసిన కవి. క్షేత్ర మాహాత్మ్యం తెలిపే గ్రంథాలు మూడు. శ్రీబుగ్గరామేశ్వర మాహాత్మ్యం, బ్రహ్మగుండేశ్వర మాహాత్మ్యం, శ్రీద్వారకా మాహాత్మ్యం.

గాదిచెర్ల హరిసర్వోత్తమరావు: 1883-1960. రచనలు - నీతిధర్మము, మూడు రత్నములు. ప్రచ్ఛన్న పాండవము. శ్రీరామచరిత్ర బిరుదు. ఆంధ్ర తిలక్. ప్రముఖ దేశభక్తుడు. బహుభాషావేత్త, సంస్కర్త, స్వాతంత్ర్య సమరయోధులు, జాతీయోద్యమం ప్రచారం కోసం వెలసిన స్వరాజ్య పత్రిక, విజ్ఞానచంద్రిక గ్రంథ మండలికి కార్యదర్శిగా పనిచేశారు. విజ్ఞాన సర్వస్వం ప్రచురణలో భాగస్వాములు. భాగవతంలో పోతన వ్రాసిన రామచరిత్రకు 'శ్రీరామచరిత్ర' అనే పేరుతో చక్కని వ్యాఖ్యానం వ్రాసి తల్లిగారికి అంకితం ఇచ్చిన ధన్యజీవి. కర్నూలు జిల్లా వాసి.

- డా॥ శ్రీరంగాచార్య

(నల్లగొండ జిల్లా కవులు - పండితులు గ్రంథము నుండి)

- ఎస్వీ రామారావు

(పాలమూరు ఆధునిక యుగ కవుల చరిత్ర నుండి)

డా॥ కోసూరి దామోదరనాయుడు

- శ్రీమతి సుసర్ల లలితాకుమారి

తితిదే 'కృష్ణవేణీ తరంగాల' నుండి

చారిత్రక – ఆధునికతల కలబోత...

- దామోదర ప్రసాద్ పతకమూరు,
సీనియర్ జర్నలిస్ట్

అమరావతికి మళ్ళీ పూర్వవైభవం

ప్రాచీన ఆంధ్ర సంస్కృతి, శిల్పకళా వైభవానికి నెలవులు ప్రసిద్ధ బౌద్ధక్షేత్రాలైన అమరావతి, నాగార్జున కొండలు. 2వేల సంవత్సరాల క్రితం మలి శాతవాహనులతో బాటు ఇక్ష్వాకులు, పల్లవులు, తూర్పు చాళుక్యులు, తెలుగు చోళులు, కోటరాజులు ఎన్నో రాజవంశాలు అమరావతి కేంద్రంగా పాలించి ఆంధ్రవైభవాన్ని విశ్వవ్యాప్తం చేశాయి. అమరావతి శాతవాహనుల కాలంనాటి అద్భుత నగరం. బౌద్ధ, జైన, శైవమతాలకు నిలయం. ఆంధ్రులకు గర్వకారణం. ఇనుపయుగంలోనే ఇక్కడ జనావాసాలున్నట్లు, నాగజాతి నిలయంగా వున్నట్లు చరిత్రకారుల అభిప్రాయం. మహోన్నత సింధునాగరికత నిర్మాతలైన నాగజాతివారే పరాయి దండయాత్రల వల్ల ఉత్తరాదినుండి వచ్చి ఇక్కడ స్థిరపడ్డారని ప్రతీతి. వేదాల్లో వీరిని ఫణిజాతిగా అభివర్ణించారు. అందుకే ఈ ప్రాంతం నాగభూమిగా వాసికెక్కింది. ఆంధ్రుల సర్వతోముఖాభివృద్ధిలో నాగజాతి పాత్ర అద్వితీయం. ఇన్ని వేల సంవత్సరాలలో ఆంధ్రుల సంస్కృతి, శిల్పకళా వైభవాన్ని చాటిచెప్పే ఎన్నో శిల్పాలు, కట్టడాలు ధ్వంసంకాగా, వాటి ప్రాధాన్యత గుర్తించిన ఆంగ్లేయులు తవ్వకాలు జరిపి కొన్ని శిల్పకళా ఖండాలు మద్రాసు మ్యూజియంలో భద్రపరచారు. మరికొన్నింటిని లండన్ మ్యూజియంకు తరలించుకుపోయారు. మిగిలినవాటితో అమరావతి మ్యూజియంను 'ఆంధ్ర కళా ప్రశస్తి' కేంద్రంగా నిలిపారు. అవగాహన లేక ఎన్నో శిల్పకళాఖండాలు, చారిత్రక వారసత్వ సంపద మట్టిలో కలిశాయి. ఎన్నో ధ్వంసమైనాయి. పోయినవి పోగా మిగిలిన వాటిని చూసినపుడు ఆంధ్రుల గత వైభవమెంత ఘనమో, సంస్కృతి, శిల్పకళా సంపద ఎంత సమున్నతమో ఊహించుకుని, భావించుకుని, మదిలో



నిలుపుకుంటే ఆంధ్రుల హృదయాలు హర్షపులకితమవుతాయి. సమున్నత వారసత్వ సంపదకు వారసులమనే కించిత్ గర్వమూ కలుగకమానదు. విశ్వవ్యాప్తంగా వున్న 15 కోట్ల తెలుగువారికది కీర్తికిరీటమే. రాజకీయ కారణాల వల్ల తెలుగువారు భౌగోళికంగా వేరువేరుగా వున్నా ఇవి ఉమ్మడి సంస్కృతికి ప్రతీకలే. శేషాంధ్రప్రదేశ్‌కు కొత్త రాజధాని నగరాన్ని, తరతరాలకు గుర్తుండిపోయేలా, తెలుగు సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిర్మించుకునే బృహత్తర ప్రయత్నం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తలపెట్టిన వేళ, భారత ప్రభుత్వ సహాయ సహకారాలతో ఈ మహత్తర యజ్ఞం విజయవంతం కావాలి. ఈ కృషిలో ప్రతి తెలుగువాడూ నిమగ్నమై తమవంతు సహకారమందిస్తే అవరోధాలు అధిగమించి 5 కోట్ల ఆంధ్రులకు 'కొత్త వెలుగులు అందించి మార్గదర్శనం చేసి ముందుకు నడిపించే మహోజ్జ్వల రాజధానిగా అమరావతి అవతరించగలదనే విశ్వాసం ఎందరిలోనో వుంది. ఈ పూర్వ రంగంలో చరిత్ర పునరావలోకనం చేసుకుందాం.

అమరావతి శాతవాహనుల కాలంనాటి అద్భుత నగరం. బౌద్ధ, జైన, శైవమతాలకు నిలయం. ఆంధ్రులకు గర్వకారణం. ఇనుపయుగంలోనే ఇక్కడ జనావాసాలున్నట్లు, నాగజాతి నిలయంగా వున్నట్లు చరిత్రకారుల అభిప్రాయం. మహోన్నత సింధునాగరికత నిర్మాతలైన నాగజాతివారే పరాయి దండయాత్రల వల్ల ఉత్తరాదినుండి వచ్చి ఇక్కడ స్థిరపడ్డారని ప్రతీతి. వేదాల్లో వీరిని ఫణిజాతిగా అభివర్ణించారు. అందుకే ఈ ప్రాంతం నాగభూమిగా వాసికెక్కింది. ఆంధ్రుల సర్వతోముఖాభివృద్ధిలో నాగజాతి పాత్ర అద్వితీయం. ఇన్ని వేల సంవత్సరాలలో ఆంధ్రుల సంస్కృతి, శిల్పకళా వైభవాన్ని చాటిచెప్పే ఎన్నో శిల్పాలు, కట్టడాలు ధ్వంసంకాగా, వాటి ప్రాధాన్యత గుర్తించిన ఆంగ్లేయులు తవ్వకాలు జరిపి కొన్ని శిల్పకళా ఖండాలు మద్రాసు మ్యూజియంలో భద్రపరచారు. మరికొన్నింటిని లండన్ మ్యూజియంకు తరలించుకుపోయారు.

ఆంధ్రదేశం మౌర్య, శాతవాహన, ఇక్ష్వాకుల యుగాలలో ప్రసిద్ధ బౌద్ధమత కేంద్రం. అందుకే ఎన్నో బౌద్ధక్షేత్రాలు వర్ధిల్లాయి. శైవ, జైన, వైష్ణవ మతాలూ విస్తరించెనో, ఆంధ్రదేశ శిల్పకళకు, శిల్పసంపదకు బౌద్ధమతమే ప్రధాన కారణం. ఆంధ్రదేశం బౌద్ధశిల్పాలు, చైత్యాలు, విహారాలు, త్రిరత్నాల ఘోషతో మారుమ్రోగడమే గాక ఆగ్నేయాసియా తదితర దేశాలకూ విస్తరించింది. తవ్వకాలలో 120కి పైగా బౌద్ధక్షేత్రాలు బయల్పడ్డాయి. ఇవి ఆనాటి పెద్ద నగరాలు, వాణిజ్య కేంద్రాలకు దగ్గరలో, నదీతీరాల్లో వెలిశాయి. బుద్ధఘోషుడు తన 'చుళ్ళవర్గ'లో సూచించిన రీతిలో తపోసాధనకు, మతప్రచారానికి, దేశాటనకు వీలుగా నగరాలకు సమీపంలో రద్దీలేని ప్రశాంత ప్రాంతాలలోనే నిర్మించారు. మహాయాన బౌద్ధానికి ఆంధ్రదేశమే పుట్టిల్లు అయి ఎన్నో బుద్ధ చైత్యాలు, విగ్రహాలు వెలిశాయి. అమరావతి ఆనాడు ప్రసిద్ధ బౌద్ధక్షేత్రంగా విద్య, సాంస్కృతిక నిలయంగా వర్ధిల్లింది. అందుకే మహాకవి రాయప్రోలు "అమరావతీ పట్టణాన బౌద్ధులు విశ్వవిద్యాలయాలు స్థాపించునాడు... ఆంధ్ర సంతతికే మహితాభిమాన దివ్యదీక్షా సుఖస్ఫూర్తి తీవరెంచె" నని కీర్తించారు. అట్టి అమరావతీ ప్రాంగణాన "ఒకనాడు శాక్యమునికి జయధ్వనులిచ్చి... కరుణాసుధావృష్టి కురిసినాడు" అని తెనుగులెంక తుమ్మల సీతారామమూర్తి గానము చేశారు. అట్టి అమరావతి బౌద్ధశిల్ప కాణాచి.


అమరావతీ స్తూపం ప్రపంచ ప్రఖ్యాతి గాంచింది. ఆగ్నేయాసియా దేశాలలో నిర్మించిన బౌద్ధస్తూపాలకిది మార్గదర్శి. భారతదేశంలోనే ఇంత పెద్ద స్తూపంలేదని ప్రతీతి. బౌద్ధయుగంలో అమరావతి శిల్పకళ 'ఆంధ్రశైలి'గా ఖ్యాతి నందింది. అమరావతి శిల్పాలతోనే ఆంధ్రదేశంలో శిల్పకళ ఆరంభమైందని భావిస్తారు. అక్కడ లభించిన అతి ప్రాచీన ప్రాకృత శాసనంలో 'దమ్మేకడ' అని వుంది. అది ధనకటక, ధాన్యకటకం, ధరణికోట అని రూపాంతరం చెందిందని అంటారు. అంతేగాక గౌతమబుద్ధుడు స్వయంగా ఆంధ్రదేశాన్ని దర్శించి, అక్కడ మంత్రశక్తులను ధారణ చేశాడని బౌద్ధసాహిత్యం, సుత్తనిపాతం గ్రంథంలో రాశారంటారు. ధారణలు నిక్షిప్తం చేసినందున 'ధారణ కటకం' అనే పేరొచ్చినట్లు మరో అభిప్రాయం. కటక అంటే వాకిలి అని అర్థం. ఆ తర్వాత మలిశాతవాహనులు అక్కడ కోట కట్టినందున ధరణికోటగా మారిందని ప్రతీతి. క్రీ.పూ. 5వ శతాబ్దంలోనే బౌద్ధమతాన్ని స్వీకరించిన వారు నాగులు. క్రీ.పూ. 5వ శతాబ్దంలో మహాదేవ భిక్షువు నాగజాతివారికి బౌద్ధదీక్ష ఇచ్చారు. ఆయన మార్గదర్శనంలోనే నాగులు అక్కడ తొలి బౌద్ధస్తూపాన్ని నిర్మించారు. (క్రీ.పూ. 4వ శతాబ్దం) అప్పటినుండి ధరణికోట (అమరావతి) గొప్ప బౌద్ధక్షేత్రంగా అభివృద్ధి చెందింది. అశోకుడు ధరణికోట బౌద్ధస్తూపాన్ని పునర్నిర్మాణం చేసి బుద్ధుని ధాతువుని అక్కడ నిక్షిప్తం చేసినందున అది బౌద్ధులకు పరమపవిత్ర పుణ్యక్షేత్రమైంది. బుద్ధుడు స్వయంగా ధరణికోట (అమరావతి)ను సందర్శించి చైత్ర పూర్ణిమ రోజున కాలచక్రతంత్రాన్ని నేర్పించాడని తాను నమ్ముతున్నట్లు టిబెట్ బౌద్ధమత గురువు దలైలామా ప్రకటించి, అమరావతి నగర ప్రశస్తిని లోకానికి చాటారు. శాతవాహన



పులోమావి క్రీ.శ. 1వ శతాబ్దంలో ప్రతిష్టానం నుండి తన రాజధానిని ధరణికోటకు మార్చగా, ఆ ప్రాంతం రాజవైభవాన్ని అనుభవించింది. యజ్ఞశ్రీ కాలంలో ఆచార్య నాగార్జునుడు బౌద్ధస్థూపానికి ప్రాకారం నిర్మించినప్పటినుండి అక్కడి బౌద్ధస్థూపం ప్రపంచ ప్రఖ్యాతి గాంచింది.

మిగతా స్థూపాలకు అమరావతి బౌద్ధ స్థూపానికి తేడా వుంది. అమరావతి స్థూపానికి నాలుగు వైపుల ఉపవేదికలను నిర్మించి, వాటిపై ఆయన స్తంభాలను నిలబెట్టారు. ఇవి బుద్ధుని జీవిత సంఘటనలకు చిహ్నాలు. ఈ ప్రత్యేకతవల్ల దక్షిణాదిలోనే గాకుండా ఆగ్నేయాసియా దేశాలలో (జావా, బోర్నియా, ఇండోనేషియా) ఎక్కడ స్థూపం నిర్మించినా 'అమరావతి' స్థూపరీతిలోనే నిర్మించారు. 'ధాన్యకటకం (అమరావతి)లో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన విశ్వవిద్యాలయం నిర్మించారు. 7-8 శతాబ్దం వరకు కొనసాగిన ఆ విశ్వవిద్యాలయానికి వృత్తిశ్రేణులు, వ్యాపారులు, సామాన్యులు, రైతులు, రాజులు, విరాళాలు, దానాలిచ్చి తోడ్పడ్డారు. చైనా యాత్రికుడు హుయన్‌త్సాంగ్ 7వ శతాబ్దంలో ఈ బౌద్ధ విశ్వవిద్యాలయంలో 'అభిదమ్మ పీటక' అనే పవిత్ర బౌద్ధగ్రంథాన్ని అధ్యయనం చేసినట్లు తన 'సీయుకె' పుస్తకంలో రాశాడు. హుయన్‌త్సాంగ్ కూడా 'తెనకచక' అనే రాశాడు. అంటే 'ధనకటక' అని అర్థం. ఈ విశ్వవిద్యాలయం స్ఫూర్తితో ఆ నమూనాలో టిబెట్‌లోని లాసా నగరంలో యూనివర్సిటీని నిర్మించారు.

కాగా ధనకటక, ధరణికోట, ధాన్యకటకాల పేరు 10వ శతాబ్దం నుండి 'అమరపురి'గా శాసనాలలో కన్పిస్తోంది. తూర్పు చాళుక్యరాజు 2వ అమ్మరాజు (945-970) తన తాటకొండ శాసనంలో 'అమరావతీశ్వర' అని సంబోధించాడు. ఇది అమరావతికి తొలిరూపం కావచ్చు. ధనకటక శైవక్షేత్రం కూడా. మహాశివుని పుత్రుడైన కుమారస్వామి లోకకంటకుడైన దనుజుడు తారకాసురుని వధించినపుడు, ఆయన నోటిలోని శివలింగం రెండు ముక్కలై 5 చోట్ల పడి పంచారామాలుగా ప్రసిద్ధి చెందాయని పురాణగాథ. అందులో ప్రముఖమైన అమరేశ్వరాన్ని పరమపవిత్రంగా భావిస్తారు. దేవేంద్రుడు, ఇతర దేవతలు, అమరేశ్వరుడిని అర్చించారని ప్రతీతి. మౌర్యసామ్రాజ్య పతనానంతరం ఆంధ్రశాతవాహనులు ఈ ప్రాంతాన్ని పాలించాడు. పవిత్ర కృష్ణానదీ తీరాన వుండటం, శ్రీమహాలింగ మూర్తిని కశ్యప, అత్రి, గౌతమ, కౌశిక, భరద్వాజ, వశిష్ట, జమదగ్ని వంటి సప్తర్షులు అర్చించారనే విశ్వాసంవల్ల 'అమరేశ్వరం' పవిత్ర శైవ పుణ్యక్షేత్రంగా వాసికెక్కింది అందుకే అమరావతిగా పేరొచ్చింది. చింతపల్లి జమీందారు రాజావాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు ఈ ప్రాంతాన్ని పాలించాడు. అక్కడ వైజయంతి అనే రాజమహల్ నిర్మించుకుని అమరావతి అనే పేరు పెట్టారు. అమరావతి దేవేంద్రుని రాజధాని. ఇంద్రభవనాన్ని 'వైజయంతి' అంటారు. దేవేంద్ర వైభవం రాజ్యపాలన చేసిన వెంకటాద్రినాయుడు తన రాజధానికి అమరావతి





అని పేరు పెట్టారంటారు. అమరావతికి ధనకటక, దన్నకడ అని కూడా పేర్లున్నాయి. ధాన్యకటకాన్ని దీపాలదిన్నె, దీపాలదిబ్బ, దీపాలకొండ అనీ అంటారు.

గుంటూరు పట్టణానికి 25 కి.మీ. దూరంలో కృష్ణానది ఒడ్డున వున్న అమరావతిలో ఆంధ్రులకు ప్రపంచ ప్రఖ్యాతిని తెచ్చిన బౌద్ధమహాస్థూప శిథిలాలున్నాయి. అమరావతి స్థూపాన్ని 1797లో కల్నల్ కాలిన్ మెకంజీ అనే ఆంగ్లేయాధికారి కనుగొన్నారు. ఆయన అక్కడ సర్వే చేయగా శిల్పాలంకృత రాతిఫలకాలు లభించాయి.

అమరావతిలో 1877లో రాబర్ట్‌సూయల్, 1881లో జేమ్స్‌బర్గన్, 1888–1909ల మధ్య అలెగ్జాండర్, రేలు తవ్వకాలు జరిపారు. 1958లో డా॥ ఆర్.సుబ్రహ్మణ్యం, డాక్టర్ కె. కృష్ణమూర్తి పరిశోధనలు చేసి చారిత్రక అంశాలను వెలుగులోకి తెచ్చారు. అక్కడ లభించిన అనేక శిల్పకళా ఖండాలను లండన్, మద్రాసు మ్యూజియంలో భద్రపరచారు. కల్నల్ మెకంజీ అక్కడికి వెళ్ళే నాటికే చారిత్రకంగా జరగాల్సిన నష్టం జరిగిపోయింది. మహోన్నత వారసత్వ సంపద విలువ తెలియక, ఆంధ్రుల వైభవాన్ని దశదిశలా చాటిన శిల్పకళా ఖండాలను, స్థూపాన్ని అక్కడి పాలకుడు, పగులగొట్టి ఆ రాళ్ళు, ఇటుకలతో తమ ప్రహరీ నిర్మించుకున్నారు. ఇలాంటిచోట్ల గుప్తనిధులు, లంకెబిందెలుంటాయనే దురాశతో, అజ్ఞానంతో అక్కడివారు మిగతా కట్టడాలను తవ్వి నాశనం చేశారు. ఆలస్యంగా అక్కడికి వెళ్ళి పరిశోధనలు చేసిన నిపుణులు శిథిలాలనుండి చరిత్రను గ్రహించారు. శిథిలాలలో ఒక ఫలకం వైష్ణవ నమూనా చిత్రమూ లభించి కొంత ఊరట కలిగించింది.

అపురూప శిల్పాలు

విహారాలు, చైత్యాలు, స్థూపాల నిర్మాణాన్ని వాస్తువు అంటారు. ఆ నిర్మాణాలలో ప్రతిష్ఠించే విగ్రహాలను శిల్పాలంటారు. ఆ నిర్మాణాల మీద చిత్రించే వర్ణరేఖా చిత్రాలను చిత్రకళ అంటారు. బౌద్ధులు ఈ 3 రకాల కళలను అభివృద్ధి చేశారు. బౌద్ధుల వాస్తువులు, శిల్పాలు, చిత్రకళ కూడా తొలుత 'పుబ్బశైలి'గా పేరుగాంచిన అమరావతిలోనే ఆరంభమైనాయి. తెల్లని సున్నపురాతిమీద లేతరంగుకు పచ్చ నగిషీలు చిత్రించారు. అవి అమరావతి చిత్రకళ. ఆవిధంగా అమరావతి ఆంధ్రదేశపు తొలి వాస్తు శిల్ప, చిత్రకళలకు నిలయమైంది. అమరావతిలో మహాస్థూపం వద్ద వున్న నల్లని రాతికమ్మీమీద ఉబ్బెత్తుగా 'త్రిరత్న' చిత్రించి వుంది. అక్కడే స్థూపం రేఖాచిత్రం, వర్ణ చైత్యం వున్నాయి. క్రీ.పూ. 3వ శతాబ్దానికి చెందిన లేఖనం అక్కడ లభించింది. వాటిని మొదట బౌద్ధశిల్పాలుగా భావించారు. అక్కడ క్రీ.పూ. 2వ శతాబ్దానికి చెందిన యక్షప్రతిమలు సున్నపురాయి మీద కన్పించాయి. ఈ సున్నపురాయి ఫలకాలు ప్రస్తుతం అమరావతి మ్యూజియంలో వున్నాయి. అమరావతిలో దొరికిన ఒక సమాధి ఫలకంపై బుద్ధదేవుని జీవిత దృశ్యాలున్నాయి. వైశాలిలో బుద్ధుని బస, ఆ తర్వాత జరిగిన కొన్ని సంఘటనలు, కుశి నగరంలో బుద్ధుని మహాపరినిర్వాణం పొందిన దృశ్యం అందులో వుంది. దానిపై ఆనాటి

లేఖనాలు, అదే ఫలకం రెండోవైపు శ్రావస్తిలో బుద్ధవిహారాలు చిత్రించి వున్నాయి. ఆ చిత్రాలు అనాథపిండకుడు యువరాజునుండి జేతవనం కొనే దృశ్యం ఉంది. అదే ఫలకంపై 'దమ్మేకడ వందనమేగోష్టి' అని లిఖించి వుంది. ఈ లేఖనం అమరావతిలో బౌద్ధులు వందనాగోష్టిగా ఏర్పడ్డారని తెలుపుతోంది. అమరావతిలో 1,2 శతాబ్దాలకు చెందిన అనేక శిల్పాలు, ఫలకాలు లభించాయి. వాటిపై బుద్ధగయలో అలంకరించిన బోధివృక్షం లాంటి భారీవృక్షం, మహాభినిష్క్రమణం చిత్రించి వున్నాయి. అమరావతి చిత్రాలు కోణాకృతిలో రేఖాకృతిలో చిత్రించారు. అందుకే తుమ్మల సీతారామమూర్తి చౌదరి 'భగవదన్వేషణార్థమై పాటుపడిన, యుత్తమ తపస్వివై, కళాయోగివైన నీకు రుణపడి రసలుబ్దలోకమెల్ల, నాంధ్రశిల్పీ! చిరంజీవివయ్య నీవు' అని కీర్తించారు. శిల్పచిత్ర కళాజగత్తుకు నీరాజనాలర్పించడం సముచితం.

సాంఘిక వ్యవస్థ - వృత్తులు

శాతవాహనుల కాలంలో అక్కడ కులవ్యవస్థ లేదు. సమాజం వృత్తివర్గాలుగా వుండేది. వ్యవసాయదార్లు ప్రధానవర్గం, రైతులను 'హాలికులు' అనేవారు. కృష్ణానదీ తీరాన వున్నందున వారు అక్కడ వ్యవసాయాన్ని ఎంతో అభివృద్ధి చేశారు. అక్కడి నేలలు సారవంతమైనవి. అన్నిపంటలు పండించారు. వరి, జొన్నలు, సజ్జలు, పెసలు, మినుములు, కందులు, ఆముదాలు ప్రధానపంటలు. చెరకు, కొబ్బరి, తమలపాకు తోటలుండేవి. అందువల్ల పంటలతో దేశం సిరిసంపదలతో తులతూగేది. నీటిపారుదల సౌకర్యముండేది. ఓదకయంత్రం (కపిలతోలడం) అనే సాధనంతో నది, వాగులు, వంకలనుండి నీటిని ఎత్తిపోసి పొలాలను సాగుచేశారు. నిమ్మ, నారింజ, జామ, సీతాఫలం పండించారు.

అక్కడ ఎన్నో వృత్తుల పనివారుండేవారు. ప్రధానంగా సేద్యానికి అవసరమైన నాగలి తదితర కొయ్యపరికరాలు తయారుచేసేవారు. ఆనాటి శిల్పాలలో బల్లలు, కుర్చీలవంటివే కన్పిస్తాయి. ఆభరణాల తయారీ పరిశ్రమ వర్ధిల్లింది. బంగారు, వెండిలోహాలతో అద్భుతమైన, ఆకర్షణీయమైన నగలు తయారుచేసేవారు. అతి ముఖ్యమైంది వస్త్రపరిశ్రమ. ఈ ప్రాంతంలో పత్తి బాగా పండినందున వస్త్రపరిశ్రమ బాగా అభివృద్ధి చెందింది. ఇక్కడ తయారైన బట్టలను ఆగ్నేయాసియా దేశాలకు, ఇటలీకి ఎగుమతి చేశారు. రోమ్ నగరంతో వాణిజ్య సంబంధాలు ఇతోధికంగా జరిగింది. ఆర్థిక వ్యవస్థ పురోభివృద్ధి చెందింది. శాతవాహనుల కాలంలో ఆ తర్వాత కూడా వజ్రపరిశ్రమ వుండేది. పక్కనే వున్న కోళ్ళూరు, పరిటాలలో వజ్రాలు దొరికేవి. రాగి, ఇత్తడి సామాన్లు బాగా తయారయ్యేవి.

శాతవాహనుల కాలంలో స్త్రీలు సంపూర్ణ స్వేచ్ఛ ననుభవించారు. శాతవాహన రాజులు తమ తల్లుల పేర్లను తమ పేర్లకు జోడించుకున్నారు. గౌతమీపుత్ర శాతకర్ణి, మాదరీపుత్ర వీరపురుషదత్త వసిష్ఠ పుత్రపులుమావిల పేర్లే అందుకు నిదర్శనం. ఆ కాలంలో మహిళలందరూ దాదాపు బౌద్ధులే. స్థూపాలకు విరాళాలు, దానాలిచ్చి తమ పేరిట శాసనాలు రాయించారు.

మత పరిస్థితులు

బౌద్ధం ఉచ్ఛదశలో వుండేది. అదే కాలంలో హిందూమతం కూడా సమాంతరంగా అభివృద్ధి చెందింది. అమరావతి (ధరణికోట) పక్కనే వున్న వడ్డమాను ప్రసిద్ధ జైన క్షేత్రం. శాతవాహనులకాలంలో హీనయానం, మహాయానం, వజ్రయానం వంటి 3 బౌద్ధశాఖలూ కొనసాగాయి. అక్కడి తవ్వకాల్లో 3 శాఖల శిల్పాలూ లభించాయి. పల్లవులు హిందూ లేదా బ్రాహ్మణ మతాన్ని ప్రోత్సహించినందున బౌద్ధప్రాభవం క్రమంగా క్షీణిస్తూ వచ్చింది. చాళుక్యుల కాలం నాటికి బౌద్ధం దాదాపు కనుమరుగైంది. జైన, బౌద్ధ క్షేత్రాలను హిందూ ఆలయాలుగా మార్చే క్రమం కొనసాగింది. బౌద్ధ, జైన సాహిత్యాన్ని ధ్వంసం చేశారనే ఆరోపణలూ వున్నాయి.

చాళుక్యుల కాలంలోనే బౌద్ధస్థూపాన్ని 'అమరేశ్వర (శివ) ఆలయంగా మార్చారని అంటారు. చాళుక్య భీముడు అమరేశ్వరాలయాన్ని నిర్మించారు. దానికి 'అమరారామం' అని పేరొచ్చింది. పవిత్ర కృష్ణానదీ తీరాన నెలవై వున్నందునను, 15 అడుగుల నిడివితో తెల్లపాలరాతి శివలింగం, పరమశివుని ప్రణవేశ్వర, అగస్త్యేశ్వర, కోసలేశ్వర, సోమేశ్వర, మరియు పార్థివేశ్వర వంటి ఐదు రూపాల్లో ఆరాధించడంవల్ల శ్రీమహాలింగమూర్తి మాహాత్మ్యం, స్థలమాహాత్మ్యం ప్రజలపై ప్రభావం చూపి భక్తిశ్రద్ధలను పెంచాయి. అందుకే అమరేశ్వరాన్ని శివభక్తులు 'పరమపవిత్రం'గా భావిస్తారు. అమరేశ్వరాలయానికి నాలుగువైపుల ద్రవిడ శైలిలో నిర్మించిన గోపురాలు జనాన్ని ఆకట్టుకుంటూనే వున్నాయి. మాఘ బ।। దశమి రోజున వచ్చే మహాశివరాత్రి సందర్భంగా నవరాత్రి మరియు కళ్యాణోత్సవాలు వైభవంగా జరుగుతాయి.



భారతదేశంలో మత, సాంఘిక విప్లవం తెచ్చిన గౌతమబుద్ధుని బోధనలు విశ్వవ్యాప్తమైనాయి. ఆగ్నేయాసియా దేశాలు, చైనా, టిబెట్‌లలో బౌద్ధమతం బహుళ ప్రచారం, మన్నన పొందింది. బుద్ధునికి 'జ్ఞానోదయమైన తర్వాత ఆయన స్వయంగా ధరణికోట/ధాన్యకటకానికి వచ్చి, చైత్ర మహాపూర్ణిమ నాడు స్వయంగా ప్రవచనం చేసి, 'కాలచక్ర' ఉత్సవాన్ని నిర్వహించాడని తారానాథుడనే బౌద్ధ భిక్షువు రాశారు. అందువల్ల ధరణికోట / అమరావతి క్రీ.పూ. 500 సంవత్సరం నుండి నేటి వరకూ, బౌద్ధులకు పరమపవిత్ర పుణ్యస్థలిగా వుంది. అమరావతి/ధరణికోట 9వ శతాబ్దంలోనే శైవక్షేత్రంగా మారినా, పక్కనే బుద్ధుని, శ్రీమహావిష్ణువు దశావతార రూపంగా పూజించిన ఆధారాలున్నాయి. బుద్ధుని ఆలయం 14వ శతాబ్దం వరకు అమరావతిని పాలించిన కోట వంశస్తుల శాసనాలు తెలుపుతున్నాయి.

ఇక్ష్వాకుల కాలం (3వ శతాబ్దం) నుండి ధరణికోట / అమరావతి ప్రాంతాన్ని కర్మ లేదా కమ్మరాష్ట్రంగా వ్యవహరిస్తున్నారు. వీరపురుషదత్తును జగ్గయ్యపేట శాసనంలో ఈ ప్రాంతాన్ని 'కమ్మకరట్టి'గా పేర్కొన్నారు. చాళుక్యుల కాలంనుండి ఈ అమరావతి ప్రాంతానికి కమ్మనాడని పేరొచ్చింది. కమ్మనాడు పదం 15వ శతాబ్దం వరకు అనేక శాసనాలలో లిఖితమై వుంది. కాకతీయ మహారాణి రుద్రమదేవి అమరావతి సమీపంలోని 'మందడం' లోని 'గోళక్కి' శైవమతానికి భూములు దానం చేసింది. మల్కాపురంలో రుద్రమదేవి శాసనముంది. కోట వంశస్తుల పాలన ముగిశాక, అమరావతి ప్రాముఖ్యత కోల్పోయినా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు కాలంలో కొంత వైభవాన్ని సంతరించుకుంది. ఎన్నో విలువైన శిల్పాలు, బౌద్ధస్థూపాలు ధ్వంసమైనా చారిత్రక ప్రాభవం వుంది. 2500 సంవత్సరాల ప్రాచీన చరిత్రగల అమరావతి ప్రాంతం ఆధునిక సొబగులు, వాస్తు శైలులతోబాటు – వారసత్వ సంపదతో 'నవ్యాంధ్ర' నూతన రాజధానిగా విశ్వవిఖ్యాతి నందగలదని ఆశిద్దాం...

❖ ❖ ❖

పుష్కర సమయములో చేయవలసిన దానములు-వాటి ఫలితములు

నారదా ! పుష్కర సమయమున సంకల్ప పూర్వకంగా స్నాన మాచరించి **మొదటి రోజున** వెండి, లోహములతో పుష్కర ప్రతిమను, ధాన్యమును దానము చేసినచో కుబేర సమానమైన మహారాజ యోగము కలుగుతుంది.

రెండవ రోజున వస్త్రములు, లవణము, గోవులు, రత్నములు,దానము చేసినట్లయితే ఇంద్రభోగము, వసులోకము ప్రాప్తిస్తుంది.

మూడవ రోజున బెల్లము, కూరలు, పండ్లు, గుర్రములు దానం చేస్తే శుక్రునితో సమానమైన భోగమును, అశ్వినీ లోకమును, ఇంద్ర లోకమును, గంధర్వ లోకమును పొందే ఫలము కలుగుతుంది.

నాల్గవ రోజున పాలు, నేయి, నూనే, తేనె, దానం చేసిన దీర్ఘాయుష్యము, లక్ష్మీ సంపదలు కలిగి పుణ్యలోకము సిదిస్తుంది.

ఐదవ దినమున ధాన్యమును, శకటము, ఎద్దు, దున్న, నాగలి దానము చేయాలి. దీని వలన అష్టైశ్వర్యము, ఆరోగ్యము లభించి రుద్రునితో సమానుడగును.

ఆరవ రోజున ఔషధములు, కర్పూరము, కస్తూరి, మంచి గంధము, దానమివ్వాలి. ఈ దానము వలన చంద్రలోక నివాస యోగ్యమైన ఫలితం కలుగుతుంది.

ఏడవ దినమున గృహమును, పీఠము, శయ్య, పల్లకిని దానము చేయడం వలన చిరకాల సుఖమును. రాజయోగము ప్రాప్తించగలవు.

ఎనిమిదో రోజున పూలమాలలను, గంధపు చెక్కను, అల్లమును దానమివ్వాలి. దీనివలన గౌరవము కలిగి, ఇంద్రలోక ప్రాప్తి కలిగి దైవత్వము పొందుతారు.

తొమ్మిదవ నాడు పితృశ్రాద్ధములు, పిండప్రదానములు ఈరోజు ఆచరించడం శ్రేష్ఠం. దీనివల్ల పితృదేవతలు సంతోషిస్తారు. అదే విధంగా దాసీ దానమును, కన్యాదానమును, కంబళి దానాన్ని ఇవ్వటంవలన సంతాన వంతుడగుటయే గాక, సూర్యలోకాన్ని కూడా పొందుతారు.

పదవ దినమున ముత్యాలహారములను, పూలమాలలను, వెండి ప్రతిమలను దానమివడంవల్ల సమస్త భూమండలాన్ని దానంచేసిన ఫలాన్ని పొందుతారు.

పదకొండవ రోజున పుస్తకములు, తాంబూలము, సాలగ్రామములు, యజ్ఞోపవీతములను దానము చేయడం వలన పన్నెండు సంవత్సరముల నుండి చేసిన మహాపాతకములనుండి విముక్తుడై, స్వర్గలోకాన్ని పొందుదురు. ఈ రోజున ఏవస్తువు లభిస్తే దానిని దానంచేయడం వలన సమస్తదానములు చేసిన ఫలితం లభిస్తుంది.

చివరి రోజైన పన్నెండవ దినమున షోడశ మహాదానములు చేసి, బ్రాహ్మణ సమారాధన చేసినచో అనంతకోటి

నా పేరు కృష్ణవేణి

- డా॥ జంధ్యాల జయకృష్ణ బాపూజీ
తితిదే 'కృష్ణవేణీ తరంగాల' నుండి

నేను కృష్ణవేణిని, నా పుట్టినిల్లు మహారాష్ట్ర, మెట్టినిల్లు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్.

నీల వర్ణాన్ని కృష్ణవర్ణం అని కూడా అంటారు. "కృష్ణ" అంటే ఆకర్షించేది అని మరొక అర్థం. ఆ పేరుతో ఒక అవతార పురుషుడు, ఒక సాధ్వీమణి, ఒక జీవనది ఉన్నాయి. ఆ అవతార పురుషుడే శ్రీకృష్ణుడు. ఆ సాధ్వీమణి ద్రౌపది, ఆ జీవనదే నేను. నీలవర్ణపు నీటితో నిండి ఉంటాను కనుక, అందరినీ ఆకర్షిస్తూ ఉంటాను కనుక నాకు "కృష్ణవేణి" అన్న పేరు వచ్చింది. "వేణి" అంటే "నది" అన్నమాట..

పడమటి కనుమలలో సహ్యపర్వత పంక్తులలో మహాబలేశ్వరంలో జన్మించిన నేను మొత్తం నాలుగు రాష్ట్రాలలో ముచ్చటగా ప్రవహించాను. మహారాష్ట్రంలో 306 కిలోమీటర్లు ప్రయాణించి కర్ణాటకలో కాలుపెట్టాను. ఆ రాష్ట్రంలో 482 కిలోమీటర్లు పరుగులెత్తి తెలంగాణలోకి ప్రవేశించాను. అక్కడినుండి ఆంధ్రప్రదేశ్‌లోకి అడుగిడతాను.

కృష్ణాతరంగ పంక్తిన్ ద్రొక్కి త్రుళ్ళింత
నాంధ్ర నౌకలు నాట్యమాడు నాడు
అని నవ్యకవితా యుగకర్త రాయప్రోలు సుబ్బారావూ,

కృష్ణాతరంగ నిర్ణిద్రగానము తోడ
శిల్పమ్ము తొలిపూజ సేయునాడు
అక్షరజ్ఞాన మెరుగదో ఆంధ్రజాతి!
విమల కృష్ణానదీ సైకతములయందు
కోకిలపుపాట పిచ్చుకగూండ్లు కట్టి
నేర్చుకొన్నది పూర్ణిమా నిశలయందు

- అని కవిసమ్రాట్ విశ్వననాథ సత్యనారాయణా,

కదలిరావే కృష్ణవేణీ!
కదలిరావే నిత్యకల్యాణీ!
కదలిరా కదలిరా కడుపు చల్లని తల్లి!
జలజలా పొంగుతూ కిలకిలా నవ్వుతూ

- అని కరుణశ్రీ జంధ్యాల పాపయ్యశాస్త్రి - కవితాపూర్ణ కుంభాలతో ఆదరంగా అభిమానంగా నన్ను ఆహ్వానించారు వెంటనే -

గలగలా గోదారి కదలి పోతుంటేను
బిరబిరా కృష్ణమ్మ పరుగులిడుతుంటేను
బంగారు పంటలే పండుతాయి
మురిపాల ముత్యాలు దొరలుతాయి.

అని శంకరంబాడి సుందరాచార్య.

కృష్ణా తరంగాల సారంగనాదాలు
కృష్ణలీలాతరంగినీ దివ్య గీతాలు.

- అని వేంటూరి సుందరరామమూర్తి - నాకు స్వాగత గీతాలు ఆలపించారు.

తెలంగాణలో నేను మహబూబ్‌నగర్, నల్గొండ జిల్లా, ఆంధ్రప్రదేశ్‌లో కర్నూల్, గుంటూరు, కృష్ణా జిల్లాలు సందర్శించాను. ఇంతకుముందు నేను ప్రవహించిన రెండు రాష్ట్రాలకంటే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌మీద ఎందుకో నాకు మమకారం అధికం. అందువల్లనే ఆ రాష్ట్రాలలో కన్న మిన్నగా 612 కిలోమీటర్ల దూరం ఈ తెలుగు రాష్ట్రాల్లో ప్రయాణించాను. చివరకు నా పేరుతో వర్ధిల్లుతున్న కృష్ణాజిల్లాలో హంసలదీవి వద్ద చేతులెత్తి నిలచిన బంగాళాఖాత సాగరుడిలో ఒదిగిపోయాను. ఇంతకీ నా గమనమార్గం అంతా 1400 కిలోమీటర్లు అన్నమాట.

నాకు ఎంతోమంది చెల్లెళ్లు ఉన్నారు. వాళ్లు పన్నెండు మంది. ఎవరో తెలుసా? దిండి, మూసి, పాలేరు, మునేరు, తుంగభద్ర, కోయినా, వరుణ, పంచగంగ, దూద్‌గంగ, ఘటప్రభ, మలప్రభ, భీమ - అనేవి వాళ్ల పేర్లు. తమాషాగా ఉన్నాయి కదూ! మా అక్కయ్య పేరు గోదావరి.

నా తీరప్రాంతాలలో శాతవాహనులు, ఇక్ష్వాకులు, విష్ణుకుండినులు, కాకతీయులు వంటి పెద్ద పెద్ద రాజవంశాల వారు రాజ్యాలు పరిపాలించారు. ఎన్నెన్నో గ్రామాలూ, పట్టణాలూ, నగరాలూ, దేవాలయాలూ, వనాలు, ఉద్యాన వనాలూ నాకు అటూ ఇటూ వెలిశాయి. నామీద ఆనకట్టలు, డ్యాములు, ప్రాజెక్టులు, రైలు వంతెనలు, రోడ్డు వంతెనలు నిర్మించారు. లక్షల కొలది ఎకరాలకు సాగునీరూ, కోట్ల ప్రజలకు తాగునీరూ అందించాను.

స్వతంత్ర భారతానికి ప్రథమ ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ఆదునిక దేవాలయాలుగా అభివర్ణించిన బహుళార్థ సాధక ప్రాజెక్టులు నాపైన కోసీ, ఆలమట్టి, శ్రీశైలం, నాగార్జునకొండ, విజయవాడ ప్రదేశాలలో నిర్మితమైనాయి. అవి "శ్రమ ఏవ జయతే" అన్న సువర్ణసూక్తికి సుందరమైన ఉదాహరణలుగా నిలిచి మీకు నిరంతరం కన్నుల పండుగ కావిస్తాయి.

ఇదిగో! ఇది వీరశైవ మతప్రవక్త అయిన బసవేశ్వరుడి ఆలయం. ఉన్నతమైన గోపుర ప్రాకారాలు తిలకించారా! ఆయనను "కూడల సంగమదేవా!" అని అవధులు లేని భక్త్యావేశంతో కన్నడ శివకవులు కీర్తించారు.

అదిగో! అది ఆలంపురం. ఇది నవబ్రహ్మాలయాలు. తొమ్మిది శివలింగాలతో విలసిల్లే ఈ దేవాలయ సముదాయం నవవిధ భక్తులను స్ఫురింపజేస్తున్నది. ఆ ప్రక్కన ఎడంగా కనిపించేవి పాపనాశి ఆలయాలు.

ఇది కూడవల్లి. ఆ సమున్నతమైన గాలిగోపురం సంగమేశ్వర స్వామిది.

"శ్రీశైల శిఖరం దృష్ట్వా పునర్జన్మ న విద్యతే" అని ప్రసిద్ధి పొందిన శ్రీశైల క్షేత్రం ఆ కనపడేదే.

శిఖరదర్శనమ్ము చేత ముక్తినిచ్చు శ్రీగిరిపై
మల్లికార్జునుండ వైన భ్రమరాంబా మనోనాథ!

అని కొనియాడబడిన పరమేశ్వరుడి నివాసం ఇది. ఇక్కడ నేను లోయలో ప్రవహించటం చేత నాకు "పాతాళగంగ" అనే పేరు వచ్చింది.

ఇది తెలుగుగంగ ప్రాజెక్టు, చెన్నపట్టణ ప్రజలకు దప్పిక తీర్చటం కోసం ఈ కనపడే సుదీర్ఘమైన కాలువను తవ్వారు. దీనివల్ల రాయలసీమ జిల్లాలు, నెల్లూరు జిల్లా కూడా లాభాన్ని పొందుతాయి.

అవిగో వీనులవిందుగా వినిపిస్తున్న బుద్ధభగవానుడి త్రిశరణాలు! "బుద్ధం శరణం గచ్ఛామి – ధర్మం శరణం గచ్ఛామి – సంఘం శరణం గచ్ఛామి" అని ఆచార్య నాగార్జునుడి అడుగు జాడలలో శిష్యులు నడుస్తున్నారు. ఇక్కడి బౌద్ధ విశ్వవిద్యాలయంలో దేశదేశాల విద్యార్థులకు విద్యాబోధ, విజ్ఞాన బోధ చేయబడినాయి. ప్రపంచంలోనే పెద్దదైన ఈ ఆనకట్టను గమనించారా! మన ఇంజనీర్ల మేధావైభవం గుర్తించారా! చూడండి – అది జవహర్ కాలువ. ఇది లాల్‌బహదూర్ కాలువ. సాటిలేని మేటి ప్రధానుల పేర్లతో పిలువబడే ఈ కాలువలు నా జీవజలాన్ని ప్రజల ప్రాణాలు నిలపటం కోసం, ఆంధ్రభూమిని అన్నపూర్ణగా చేయటంకోసం మోసుకొని పోతునన్నాయి.

అదిగో! ఆ ఘంటారావం ఆలకించారా! అవి అమరావతిలోని అమరేశ్వరుడి ఆలయ ఘంటారావం, మందమందంగా మధుర మధురంగా వినవస్తున్నది. బాలచాముండికా సహితుడైన స్వామిని సందర్శించండి. ఆ ప్రక్కనే ఉన్న బౌద్ధ స్తూపాన్ని అవలోకించారుగా!

ఇది ఇంద్రకీలాద్రి. శంకరుని రాణి కనకదుర్గాభవాని కొలువుదీరిన పుణ్యాద్రి. ఈ పర్వతం మీదనే పాండవ మధ్యముడైన అర్జునుడు పరమేశ్వరుణ్ణి మెప్పించి పాశుపతాస్త్రాన్ని అందుకొని విజయశ్రీ విరాజితుడైనాడు. "ఆంధ్రకేసరి" టంగుటూరి ప్రకాశం పంతులు పేరుమీద నిర్మింపబడిన "ప్రకాశం బారేజి" పరికించండి. అవిగో! అవి రెండూ కొత్తగానెలకొల్పిన రైలు వంతెనలు. వాటికి అవతల కనపడే విశాలమైన "కనకదుర్గమ్మ వారధి"ని కనుగొన్నారా! అది కూడా ఇటీవలనే నిర్మింపబడిన రోడ్డు వంతెన. ఈ విజయవాడ నగరం నుండి ఏలూరు కాలువ, బందరు కాలువ తవ్వారు.

ఆ కనపడేదే దివిసీమ. అదే వేణుగోపాలస్వామి ఆలయం. హృదయాలను సమ్మోహపరచే వేణుగానం ఆలకించి పులకించండి. మహారాష్ట్ర మంచిగంధాన్నీ, కన్నడ కస్తూరినీ, తెలుగువారి తేనెనీ, నాలో కలుపుకొని తెచ్చాను.

వేదాద్రి నరసింహుడు చరణాలు కడిగి, అమరేశ్వరుణ్ణి అభిషేకించి, కనకదుర్గాదేవిని అలంకరించి, శ్రీకాకుళ ఆంధ్ర మహావిష్ణువును ఆరాధించి, హంసలదీవి వేణుగోపాల దేవుడి దివ్య మురళీస్వరాలలో తేలియాడి సానురాగంతో, సాదరంతో సాగరుణ్ణి చేరుకున్నాను.

ఇప్పుడు పరమపావనమైన పుష్కర సమయం వచ్చేసింది. దేవగురుడు బృహస్పతి కన్యారాశిలో ప్రవేశించాడు. పన్నెండు సంవత్సరాలకు ఒక్కసారి వచ్చే ఈ పవిత్ర సన్నివేశంలో ఆబాలగోపాలం పాలుపంచుకొంటున్నారు. రండి! నాలోని కెరటాలలో జలకాలాడి తాపాలనూ, పాపాలనూ పోగొట్టుకోండి. పునీతులు కండి. ఆనందాన్నీ, ఆత్మతృప్తినీ అందుకోండి. ❖

కృష్ణాతీరం సాంస్కృతిక పునరుజ్జీవనం

- దామోదర ప్రసాద్ పతకమూరు, సీనియర్ జర్నలిస్ట్

నేలను అమ్మగా తలచే మనం భాషనూ అమ్మగా భావిస్తాము. భాష, నాగరికతను, సాహిత్యం, సంస్కృతి సౌందర్యాల సంస్కారాన్ని గుబాళిస్తుంది. ఈ క్రమంలోనే మన తెలుగు మహాకవులు, రచయితలు తెలుగు భాషకు, చరిత్ర – సంస్కృతులకు తమ రచనలలో నీరాజనాలర్పించారు. తెలుగు ఘనతను కీర్తించారు. శంకరంబాడి సుందరాచారి 'మా తెలుగు తల్లికి మల్లెపూదండ – మా కన్నతల్లికి మంగళారతుల'ని కీర్తిస్తూ గలగలా గోదారి కదలిపోతుంటేను, బిరబిరా కృష్ణమ్మ పరుగులిడుతుంటేను – బంగారు పంటలే పండుతాయీ, మురిపేల ముత్యాలు దొర్లుతాయి' అని అక్షరసత్యం చెప్పారు. ఆంధ్రను 'అన్నపూర్ణ'గా నిలిపేదీ, రైతన్నకు దన్నుగా నిలిచేదీ కృష్ణా–గోదావరి నదులే. ఆంధ్రుల చరిత్రను, సంస్కృతి, శౌర్య, పరాక్రమాలను, అభ్యుదయ, సమతా దృక్పథాన్ని, దీక్షాదక్షతలను కీర్తిస్తూ మహాకవులు రాయప్రోలు, విశ్వనాథ, శ్రీశ్రీ, దాశరథి, పుట్టపర్తి, తుమ్మల సీతారామమూర్తి, సినారె, ఆరుద్ర, కరుణశ్రీ, వేములపల్లి శ్రీకృష్ణ, దేవులపల్లి, కృష్ణశాస్త్రి, కొండూరి వీరరాఘవాచార్యులు, కొసరాజు వంటివారు మన ఘనతను చాటారు.

తెలుగు కవిత్వము చెప్పందలచిన కవి యర్థమునకు
దగియుండెడు మాటలు గొని వళలుం, బ్రాసంబులు
నిలుపగ యొగిలి బులిమి పుచ్చుట చదరే

అని తిక్కన అనగా

జనని సంస్కృతంబు సకల భాషలకును దేశభాషలందు తెలుగు లెస్స అని కవి సార్వభౌముడు శ్రీనాథుడు

తెలుగదేలయన్న దేశంబు
దెలుగేను తెలుగు వల్లభుండ
దెలుగొకండ, ఎల్లనృపులు
గొలువ నెరుగవే బాసాడి, దేశభాషలందు తెలుగు లెస్స

అని సాహితీ, సమరాంగణ, సార్వభౌముడు శ్రీకృష్ణదేవ రాయలు తెలుగు ఘనతను కీర్తించారు. మహాకవి శ్రీశ్రీ


అదెవో తెలుగుతల్లి – అందాల నిండుజాబిలి
ఆనందాలకల్పవల్లి – అదే నీ తెలుగుతల్లి
పదవోయ్ తెలుగువాడా – అదే నీ తెలుగుమేడ
సంకెళ్ళు లేని – సంతోష చంద్రశాల అని శ్లాఘించారు.

కొసరాజు రాఘవయ్యచౌదరి,


తెలుగుదేశమేనాది – తెలుగుబిడ్డను నేను
తెలుగు పేరు వింటేనే మురిసిపోతాను – తెలుగు భాషంటే మైమరిచిపోతాను

నన్నయభట్టిక్కడే పుట్టినాడు. తిక్కన కవి ఘంటమిచట పట్టినాడు. పోతన్నలు, శ్రీనాథులు, రామరాజభూషణులు తెలుగుభాషకే వన్నెలు దిద్దినారూ.

తెలుగుజాతి నాలుకలపై నిలిచినారు
ఆటవెలదులను ముద్దులమూటగట్టిలేమన్న


విశ్వనాథ


శ్రీశ్రీ



దేవులపల్లి కృష్ణశాస్త్రి



దాశరథి


భావికాలగతుల తెలియబల్కెను వీరబ్రహ్మం
కర్ణాటక గానానికి కళదెచ్చెను త్యాగరాజు
ఇంతటి విజ్ఞానఘనులెవరున్నారు
వెదకి చూచినా గానీ కానరారు...
అంటూ మహాకవులకు నీరాజనాలర్పించారు.
బహుజన్మకృత పుణ్యపరిపాకమున జేసి
ఆంధ్రుడై ధాత్రిలో అవతరించు
బహుజన్మకృత పుణ్యపరిపాకమునజేసి
ఆంధ్రభాష మాటలాడుచుండు
బహుజన్మకృత పుణ్యపరిపాకమున జేసి
ఆంధ్రత్వమన నిద్దియన యెరుంగు
బహుజన్మకృత పుణ్యపరిపాకమున జేసి
ఆంధ్రీ మహామూర్తి నైక్యమొందు.... అంటూ
మహాకవి విశ్వనాథ తాను ఆంధ్రుడైనందుకు గర్వించారు.
అమరావతీపట్టణమున బౌద్ధులు
విశ్వవిద్యాలయములు స్థాపించునాడు
విద్యానగర రాజవీధుల గవితకు
పెళ్ళిపందిళ్ళు కప్పించునాడు
పొట్నూరివద్ద నాంధ్రసామ్రాజ్య
దిగ్విజయస్తంభమెత్తించునాడు
ఆంధ్రసంతతికే మహితాభిమాన
దివ్యదీక్షా సుఖస్ఫూర్తితీవరించె
నా మహావేశ మర్దించి యాంధ్రులార
చల్లుజంధ్రలోకమున నక్షతలు నేడు
అంటూ మహాకవి రాయప్రోలు ఆంధ్రపౌరుషాన్ని రగిలించారు.

ఒకనాడు శాక్యమునికి జయధ్వనులిచ్చి
కరుణసుధావృష్టి కురిసినాడు
ఒకనాడు శంకరాచార్యునికి కండయై నిలిచి
జ్ఞాన చంద్రిక వెద జల్లినాడు
ఒకనాడు రామానుజోపదేశము మెచ్చి
భక్తిప్రపత్తులు పంచినాడు
పాలిచ్చి జోలపాడు తల్లుల పుణ్యవేది
కల్ గలవు కృష్ణాదినదులు
కలవు బూదికి జీవమిచ్చునోషధుల్
క్నవసేయుగిరులు తూర్పు కనుమలు
రారాజుల కిరీటమ్ములెక్కి నిక్కిన వజ్రములగన్న గనులు కలవు.
కలదు నౌకా ప్రయాణసౌకర్యమునకు
జాలినట్టిది గంభీరసాగరంబు
ఎల్లసంపదలకు బుట్టి నిల్లనగ
దేజరిల్లినాడు మా తెలుగువాడు
అకలంక శౌర్యమూర్తి శివాజీకి రాజ్యతంత్రంబు నాంధ్రుడే దానమిచ్చె
కర్ణాటక కవితావికాస నిర్మాతలై ప్రధితికెక్కిరి పూజ్యపాదముఖులు
ఆంధ్రరాజ్యస్థాపనాచార్యుడై తెల్గువేలుపై నాడాంధ్రవిష్ణువిభుడు
రణకళానిధి సుశర్మను జంపి మగధోర్వీశాసించె శ్రీముఖ చక్రవర్తి
జొత్త రాహులనెల్ల నదలించె హాలుండు
నిజజయ స్తంభముల్ నిఖిల దిక్కుల బాతె
గౌతమీపుత్రుడు శాతకర్ణి
క్షాత్రవులగెల్చి మాళవధాత్రికెల్లనాథుడయ్యెను వాసిష్టినందనుండు
పాతవడినట్టి యాంధ్రభూపతులకథలు
చదువుమొకసారి కండలు కదలియాడ


ఆరుద్ర


'కరుణశ్రీ' జంధ్యాల


వేదుల సత్యనారాయణ


డా. సినారె

ఖండ ఖండాంతర ఖ్యాతుడౌ నిద్ధుండు
నాగార్జునుడు నీనందనుండు
కైవల్య కళ్యాణ ఘంటాపథముగన్న
యోగివేమన్న నీ యొడిలి గులికెనని –
తెనుగులెంక గౌతమబుద్ధుడు నడయాడిన అమరావతి, నాగార్జునుడు
వసించిన శ్రీపర్వత పుణ్యభూమి, విదేశీ వ్యాపారానికి సుదీర్ఘ తీరం, శాతవాహనరాజుల శౌర్యం, వేమన్న వేదం, కృష్ణా వంటి పుణ్యనదులు, ఓషధులిచ్చే గిరులు, సంపద్వంతమైన ఆంధ్ర నాడును గుర్తుచేశారు.

హాలుడు ప్రాకృతగాథా లోలుడ నీ బిడ్డడు
శక, యవన, పహ్లవరిపుల చక్కాడిన యోధాగ్రణి
యజ్ఞశ్రీ శాతకర్ణి – అతడు నీ వీరసుముడు
పొలాలనిచ్చి వేలకొద్ది హలాలనిచ్చి తెలుగునేల
సస్యశ్యామల చేసిన శాంతమూల మహారాజు
తన ధార్మిక వర్తనమున దైవము మెప్పించి
కనకవర్షమునే కురియించినవాడు విష్ణుకుండినపతి
హర్షచక్రవర్తి గర్వమణచినట్టి సత్యాశ్రయపులకేసి
మహాపాలుడు – తెలుగుతల్లి కన్న కొడుకు

అని ఉత్పల సత్యనారాయణాచార్యులు తెలుగు వీరులను స్మరించారు.

నాగార్జునుండు, దిఙ్నాగుండు విప్లవ
బౌద్ధశంఖంబెత్తి పర్యటించిననాడు
పెద్ద పీటెక్కింది తెలుగమ్మా
పేర్‌మోర్‌మోగింది మా అమ్మ – అని

పులవర్తి శరభాచార్య హర్ష పులకితుడైనాడు.

యుద్ధముల వెన్నుదీయని యోధులకును
చేతికెముక లేకిచ్చెడి దాతలకును
శిలకుప్రాణమ్ము వోసెడి శిల్పులకును
జననియై వన్నె కెక్కి నా తెనుగుతల్లి

పంటపొలములకు – పాడిపశువులకును
జీవనదులకు – పర్వతశ్రేణులకును
దివ్యక్షేత్రములకు – పుణ్యతీర్థములకు
ఉనికి పట్టయి వెలసి – నా తెలుగు తల్లి

తెనుగు శిల్పుల హస్త కౌశలమిచట
గుళ్ళకీ, గోపురాలకీ, గుహలతోడ
కాలిడినతావు చిత్రాలశాలగాగ
ననుపరవశుని జేయు నా తెనుగుతల్లి

తెలుగు నేలపై తిరుగాడు నపుడు
తెలుగుమాట నోట బలికినపుడు
తెలుగువారి కథలు తలపోసినపుడు
పొంగిపోదు గర్వమున నేను


తీరి బంగారు పండెడు తెలుగునేల
తేట నీటితో ప్రవహించు తెలుగు నదులు
తెలుగువాసిని ప్రకటించు తెలుగుగిరులు
తలచుకొన్నంత నా మేను పులకరించు అంటూ

కవివేదుల సత్యనారాయణశాస్త్రి తెలుగు ప్రతిభను చాటినారు.

ఆరు రుతువుల భూరిసంభారమెల్ల
పేర్చి నాగేటి కర్రున పెళ్ళగించి
నేల బంగరుపంట పండించి మెరసి
సునిశిత ప్రతిభాశాలి తెనుగుబిడ్డ అని


కొసరాజు


వేములపల్లి శ్రీకృష్ణ


తుమ్మల సీతారామమూర్తి

నాయని సుబ్బారావు కొనియాడారు.

తెలుగు పతాకం ఎగురని దిశయే లేదు
తెలుగు దివ్వె వెలుగనట్టి నిశయే లేదు
నాగార్జునాచార్య నవబోధనలలోన
నరుల నాగరికతయె నాట్యమాడెనులే
నందికొండ శిల్పాలకు నతులొనరించాలి
సుందరమగు రామప్పకు వందే అనాలి
నన్నయ పద్యమ్మొక్కటి నాల్కమీద ఉన్నచాలు
అన్ని విద్యలొకసారే ఆకటించినట్లేను
తిక్కన పద్యమ్మొక్కటి చక్కగ చదివిన చాలు
తెలుగుజాతి నుడికారము తెలిసికొన్న యట్లు
పోతన పద్యమ్మొకటి ప్రతిగ చదివినచాలును
అమృతమునే రుచిచూచిన ఆనందము కలుగును
విశ్వదాభిరాముడైన వేమన ఆటవెలదిలో
విశ్వమెల్ల ఇమిడిపోయి, వేదాంతం విరియును
త్యాగరాజకీర్తనలో తాదాత్మ్యం పొందితే
సంగీతం హృదయంలో జడివానై కురియును

అంటూ దాశరథి తెలుగు ఘనతను కీర్తించారు.

ఏ విశిష్ట ముహూర్తము నందిచట
బౌద్ధచైత్యమునకంకురార్పణ సలిపినారో
మూడు పూవులారు కాయలై ముమ్మరించె
శిల్పమును, ధర్మము అను జేయి చేయి కలిపి
భువన సంతారకములైన బుద్ధదేవు
మహిత మంగళ సత్యధర్మంబులిచట
పాదుకొని దిగ్విదిక్కుల ప్రజలకమృత
దివ్యసందేశ సుఖము లందించుగాత – అని

కొండూరి వీరరాఘవాచార్యులు ఆకాంక్షించారు.

జయ మహాంధ్ర జనయిత్రీ
జయప్రియాంధ్ర జనయిత్రీ
నీ పూర్వచరిత స్మరియించీ
నీ భావిఘనత దరిశించీ
ఇటు మంజీర అటు వంశధార
ఎలుగెత్తి నిన్ను కీర్తించు
కబరీకాశ కదంటుములూగి

శబరీ పెన్నలు నర్తించు
మరిమరి కృష్ణా గోదావరి
ఝరులు తలలూపి హర్షించు
శ్రీవిశాల మానవతా సమతా
సాధనమే మామనోరథం
భావిలోకకళ్యాణ సుస్థిర స్థాపనమే
మాదన్నదశపథం

అని దేవులపల్లి కృష్ణశాస్త్రి హర్షించారు.

తేనెకన్న మధురంరా తెలుగు
తెలుగుగడ్డ పోతుగడ్డ ఎంత పచ్చన
మా తెలుగు గుండెలో స్నేహ మెంత వెచ్చన
మన పొలాల శాంతిపులుగు ఎంత తెల్లన
మన తరతరాల కథపాడు – గుండెఝల్లన
తేనెలొలుకు తేటతెనుగు వీనులరవళించునపుడు
మారు మోగినట్లుండు వేణు వీణానిస్వనములు

అంటూ ఆరుద్ర ఆనందం వ్యక్తం చేశారు.

అందచందాలు చిందాడు బౌద్ధస్తూప శిల్పలక్ష్మీ స్మితలయందు
శాతవాహన మహాచక్రవర్తుల ఆంధ్రజాతీయకేతనాంచలములందు
ఖండఖండాంతరాగత మహాయాన బౌద్ధాచార్య వాక్ప్రవాహములయందు
కంచుఘంటల ఘణఘణలయందు
విశ్వవిద్యాలయాంగణ వేదులందు
బౌద్ధవౌదిక మత కరస్పర్శమందు
"మూడుపూవువారు కాయలై" ముద్దులాడె
దిగ్‌దిగంతాల అమరావతీ ప్రశస్తి

అంటూ అమరావతీ క్షేత్ర ప్రాముఖ్యాన్ని ఉగ్గడించారు కరుణశ్రీ

భగవదన్వేషణార్థమై పాటుపడిన – యుత్తమ తపస్వివై కళామోహివైన రుణపడి రసలుబ్ధలోకమెల్ల నాంధ్రశిల్పీ చిరంజీవివయ్య నీవు – అంటూ తుమ్మల తెలుగు శిల్పులకు నివాళులర్పించారు.

❖ ❖ ❖

కొండపల్లి బొమ్మల కళాప్రాభవం

దారు శిల్పమునందు విధాత లెవరు?
బొమ్మలకు ప్రాణము పోయు బమ్మలెవరు
సృష్టి తిలకించి ప్రతి సృష్టి చేయు నెవరు
వారెపో కొండపల్లి కళాకారులనగ.

పరవళ్ళు తొక్కుతున్న కృష్ణానదీ తీర ప్రాంతా ప్రకృతి సౌందర్యముతో విరాజిల్లుతూ ఉంటుంది. ఈ ప్రాంతం ఎందరో సాహితీ వేత్తలకు, కళాకారులకు కాణాచి. మహాకవి క్షేత్రయ్య, విశ్వనాథ, పింగళి వెంకయ్య, సిద్ధేంద్రయోగి, ఘంటసాల, ఎన్.టి.ఆర్, అక్కినేని, పట్టాభిసీతారామయ్య, వెంపటి చినసత్యం..... ఇలా ఎందరో మహానుభావులు ఇక్కడి వారే. కృష్ణాతీరమనగానే మొదట గుర్తుకొచ్చేది విజయవాడ పట్టణం. ఈ పట్టణానికి 16 కి.మీ దూరంలో ఉన్నది ప్రపంచ ప్రఖ్యాత కొండపల్లి బొమ్మల కేంద్రమైన కొండపల్లి గ్రామం. నిజానికి ఈ ప్రాంతమే కాదు, ఆసేతు హిమాచల పర్యంతం వివిధ రాష్ట్రాలు కుటీర పరిశ్రమలకు హస్త కళలకు పేరొందినవే. అందులో ఆంధ్రదేశం ప్రముఖంగా పేర్కొన దగినది. విశాఖ, నక్కపల్లి, ఏటికొప్పాక, పాలకొల్లు, నరసాపురం, ఏలూరు, కొండపల్లి, బందరు, తిరుపతి, కాళహస్తి, వరంగల్, నిర్మల్, కరీంనగర్ .... ఇలా ఏ ప్రాంతం చూసినా ఏదో ఒక హస్తకళకు నిలయమై ప్రఖ్యాతి చెందింది. ఈ కళలన్నీ ఏ పాఠశాలలోనో, శిల్పాచార్యుని వద్దనో నేర్చుకొనకనే, పితృ-పుత్ర క్రమంలో వారసత్వ సంపదగా కొనసాగుతున్నవే అంటే ఆశ్చర్యం కలుగుతుంది.

ఈ కళలలో దేని అందం దానిదే. దేని ప్రతేకత దానిదే. తయారు చెయ్యటంలో దేని శైలి దానిదే. ఇట్టి హస్త కళలను



కులవృత్తిగా స్వీకరించి కొనసాగిస్తున్న వారిలో కొండపల్లి శిల్పులు పేర్కొనదగిన వారు. ఆంధ్ర దారుశిల్ప సంప్రదాయములలో మకుటాయమైనది కొండపల్లి శిల్ప కళ!

ఈ బొమ్మలు ఒక అంగుళం పరిమాణం మొదలు మూడు-నాలుగు అడుగుల వరకు తయారు చేస్తారు. ఒక అంగుళం





సైజులో దశావతారపు బొమ్మలు చెక్కుతారంటే వీరి కళాకౌశలము ఎట్టిదో ఊహించవచ్చును. వీరు చేసే బొమ్మలలో గ్రామీణ జీవనంలో కానవచ్చే కమ్మరి, కుమ్మరి, వడ్రంగి, తాడిచెట్టు పై కల్లు గీయుట, వంటి గ్రామీణ వృత్తుల వారు, నెమలి, చిలుక, ఏనుగ, దూడకు పాలిస్తున్న ఆవు, పాలు పితుకుతున్న స్త్రీ, ధాన్యపు బస్తాలతో నిండిన ఎడ్లబండి, వధూవరులు కూర్చున్న పల్లకి ఊరేగింపు, వివిధ ఫలములు, పశుపక్ష్యాదుల బొమ్మలు కానవస్తాయి. ఇవిగాక శ్రీరామ పట్టాభిషేకం,దశావతారములు, రథముపై కృష్ణార్జునులు, హనుమ, గణపతి, వంటి పురాణ పాత్రలు వీరి శిల్పాకృతులకు పాత్రమై అలరారు తున్నాయి. మొత్తము మీద దశావతారముల సెట్టు, ఏనుగ అంబారి చాలా ప్రసిద్ధి పొందినవి. ఇట్టి బొమ్మలు తయారు చేయుటకు ఎంతో ఉన్నత స్థాయి ప్రకృతి పరిశీలనము, దేహభంగిమల అవగాహన, పరిసరముల పరిశీలన అవసరము. దీనికి శిల్పుల సృజనాత్మకత తోడై అద్భుత కళాకృతులు రూపుదిద్దుకుంటాయి. ఇవన్నీ మనసుకి ఆనందం, యింటికి అందం కలిగించే రమణీయార్థ ప్రతిపాదక కళాకృతులే!

ఎలా చేస్తారు?: ఈ బొమ్మలు చెయ్యటానికి స్థానికంగాను, పరిసర అడవులలోను దొరికే పొణిక కర్రను వాడతారు. దీని వృక్షశాస్త్ర నామధేయం గ్లోటియా రాటిస్ ఫార్మిస్ ఇది తేలికగా, జిగి తో కూడి చెక్కటానికి అనువుగా ఉంటుంది. చెక్కేటప్పుడు చెక్కలో తేమ ఉండరాదు. అందుకని ఒక అడుగు ఎత్తున్న మట్టి తొట్టి అడుగున నిప్పులుపోసి, పైన ఇనుప జల్లెడ పెట్టి దానిపై ఈ చెక్కలను ఉంచి చెక్కటం కొనసాగిస్తారు. మొండెము చేతులు కాళ్ళు మున్నగు భాగాలు విడిగా చేసి సన్నని మేకులు కొట్టి అతికి ప్రాధమిక రూపం (స్కెలిటెన్) చేస్తారు. ఈ విడి భాగాలను అతకటంలో వచ్చే ఖాళీలు, ఎత్తుపల్లాలు పూరించి కావలసిన ఆకృతి, వంపులు రావటానికి ముక్కుతో పూతపెడతారు. చింతగింజలు చితక కొట్టి ఉడికించి అంబలిలాగ చేసి అందులో గోనెపీచు, రంపపు పొట్టు కలిపి చిక్కని ముద్దగా చేసినదే మక్కు. మక్కు పూత ఆరిన తర్వాత 2 లేక 3 సార్లు సుద్ద పూత పెడతారు. ఇది నీటిలో సుద్దపొడి, తుమ్మజిగురు కలిపి తయారు చేసిన ఎమల్షన్ వంటిది. ఈ సుద్ద పూత పూర్తిగా ఎండిన తర్వాత ఉపరితలం నున్నగా, తదుపరి రంగులు వేయటానికి వీలుగా అవటానికి ఆకురాయి, బీరకాయ పీచు వంటి వాటితో తోముతారు. తెల్లని ఉపరితలం మీద వేసిన రంగులు స్ఫుటంగా కాంతివంతంగా కనిపిస్తా యి. ఇంకో విశేష మేమంటే వీరు వాడేరంగులు సహజసిద్ధంగా దొరికే ఇంగిలీకం (ఎరుపు రంగుకి) జంగాలీపచ్చ, నీలిమందు, పసుపు వంటి పదార్థాలతో స్వయంగా తయారు చేసుకునే వారు. అలాగే ఉడుత వెంట్రుకలు మేక వెంట్రుకలతో కుంచెలు (బ్రష్ లు) కూడా స్వయంగా చేసుకున్నవే వాడెవారు. ఈ పద్ధతులు ఒకనాటివి. ఇప్పుడు ఫెవికాల్, వార్నీషు, ఎనామెల్ ఇతర సింథటిక్ రంగులు ఉపయోగిస్తున్నారు.

ఎవరీ శిల్పులు?: వీరిని ఆర్యక్షత్రియులు అంటారు. దారు శిల్పకల్పనలోను, చిత్రరచనలోను ఒక విశిష్ట స్థానాన్ని కైవశం చేసుకొన్నవారు ఆర్యక్షత్రియులు. కొన్ని కొన్ని ప్రాంతాలలో చిత్తారి, నఖాషీ, ముచ్చివారు, రాచవారు అని కూడా పిలుస్తారు. దారు శిల్ప కళ అనాదిగా వీరి కులవృత్తి. ఒకప్పుడు ఆంధ్ర దేశంలోని దేవాలయాల్లోనే గాక దక్షిణభారతం లో అనేక ప్రసిద్ధ దేవాలయాల్లో వీరు చేసిన వాహనాలు దారుశిల్పాలు ఉండేవి. ప్రపంచ ప్రఖ్యాత కొండపల్లి బొమ్మలు, నిర్మల్ బొమ్మలు తయారు చేస్తున్నదీ ఈ వంశీకులే. బ్రహ్మాండ పురాణంలోని వర్ణవైభవ ఖండంలో ఉన్న మౌక్తికోపాఖ్యానం వీరి చరిత్ర తెలుపుతుంది. ఈ శాఖవారి ప్రసక్తి కొక్కొండ వెంకటరత్నం పంతులుగారు

రచించిన బిల్వేశ్వరీయం అనే ప్రబంధంలో కూడా ఉంది. వీరిలో అధిక సంఖ్యాకులు శైవులు. ఆరాధ్య సంప్రదాయాన్ని అనుసరించే లింగధారులు. కొద్దిమంది వైష్ణవ సంప్రదాయానుసారులు కూడా ఉన్నారు. జానుమండలుడు అనే రాక్షసుని సంహరించటానికి ముక్తఋషి అనే క్షత్రియ వీరుణ్ణి సృజించాడట శివుడు. ఈ ముక్తఋషియే ఈ వంశ మూలపురుషుడు. ఈయన సంతతి వారు మౌక్తికులని వ్యవహారం లోకి వచ్చి, మౌక్తికులు తెలుగులో ముత్యంవారు గా మారి, కాలక్రమంలో ఉచ్ఛారణ లోపంతో ముచ్చి వారుగా స్థిరపడి నట్లు ఊహించ వచ్చు. ఆంగ్లేయ పాలనాకాలంలో ఎడ్గార్ థర్ స్టన్ అనే ఆయన రాసిన Castes and tribes of South India అన్న గ్రంథంలోను, తంజావూరు మాన్యువల్స్‌లోను, వీరు 16వ శతాబ్దంలో విజయనగర సామ్రాజ్య నాయక ప్రతినిధులతో తెలుగు దేశం నుండి వలస వచ్చిన చిత్రకారులు. తెలుగుభాష మాట్లాడుతారు. యజ్ఞోపవీతము ధరిస్తారు అని పేర్కొనబడింది. 18వ శతాబ్దం నాటి కాంచీపుర తామ్రశాసనంలోను, కొన్ని జిల్లా మాన్యువల్స్ లోను వీరి గురించి ఈ విధంగానే ఉన్నట్లు చెపుతారు. ఆంధ్రదేశం లోని మహారాజులు ఇట్టికళలను ఆదరించి ప్రోత్సహిస్తారని తెలిసి 17వ శతాబ్దంలో రాజస్థాన్ నుండి వలసవచ్చిన వారని ఒక కథనం ప్రచారంలో ఉందిగాని ఆధారాలు కనపడవు.

ఇట్టి అపురూప కళారీతులు అనాదరణకు గురి అయి చరమావస్థకు చేరుకుటూ ఉండటం ఒక విషాదం. కళా విహీనమైన చైనా బొమ్మలు, నిర్జీవమైన మమ్మీల వంటి బార్బీ బొమ్మలతో పిల్లలు ఆడుకోవలసి రావటం, గృహాలంకరణ చేసుకోవటం నేటి దుస్థితి. అయినా చీకటిలో చిరుదీపంలా లేపాక్షి, ప్రభుత్వసంస్థలు, లాంకో వంటి ప్రభుత్వేతర సంస్థలు(ఎన్.జి.ఓలు) సహకార మందిస్తున్నాయి. అంతేకాక ఈ పనివారు కాలాను గుణంగా కొత్తకొత్త ఆకృతులు చేస్తున్నారు. ప్రపంచీకరణ, మార్కెట్ శక్తుల ప్రాబల్యం లో కూడా ఈ సంప్రదాయక కళ నిలదొక్కుకుని మనుగడ సాగించటం ముదావహం.





2007లో A.P. Technology Development Centre, lanco Institute of general Humanitariyan Trust (LIGHT)) లాంటి సంస్థల కృషివల్ల కొండపల్లి బొమ్మలకు Geographical Indicator (G.I) Certification లభించింది. ఒక నిర్దిష్ట భౌగోళిక ప్రాంతంలోనే తయారు కాబడుట, సంప్రదాయ పద్ధతులు అనుసరించటం ఈ గుర్తింపు రావటానికి అవసరం. తరతరాలుగా సంప్రదాయ వృత్తిని అవలంబించిన కుటుంబాల వారు చేసిన బొమ్మలే కొండపల్లి బొమ్మలుగా పిలవటానికి అర్హత గలవి అన్నమాట. ఒక పేటెంట్ లాంటిదన్నమాట ఈ సర్టిఫికేషన్.

వీటిని కేవలం వ్యాపార వస్తువులుగా చూడటం తగదు. ఆనంద లోకాలకు తీసుకుపోయే వినోద విజ్ఞాన కళా రూపాలు కొండపల్లి బొమ్మలు.

అడవిలో పుట్టి పెరిగిన జడమియైన
పొణికి వృక్షంబు చేసిన పున్నె మేమొ
వన్నెచిన్నెల బొమ్మల కన్ను లలర
విశ్వరూపంబు దాల్చి తా వెలయుచుండె.

(ఇందలి పద్యాలు ఘట్ట కృష్ణమూర్తి గారివి)

- ప్రసాదవర్మ కామబుషి

కృష్ణా తీరంలో మువ్వల సవ్వడి - కూచిపూడి

- ఆరవేటి వెంకటసుబ్బయ్య

కూచిపూడి (నృత్యము)

కూచిపూడి నృత్యము, ఆంధ్ర ప్రదేశ్‌కు చెందిన ఒక భారతీయ నాట్యం. ఇది కృష్ణా జిల్లాలో దివి తాలూకాకు చెందిన కూచిపూడి గ్రామములో ఆవిర్భవించినది. క్రీ పూ 2వ శతాబ్దంలో ఆంధ్ర చారిత్రాత్మక నగరమైన శ్రీకాకుళం కు సుమారు 450 కిలోమీటరుల దూరంలో బంగాళాఖాతము పై ఉన్న ఈ ప్రాంతము లోని బ్రాహ్మణులు ఈ శాస్త్రీయ నృత్యాన్ని అభ్యసించటంతో దీనికి ఈ పేరు వచ్చినది. ఇది దక్షిణ భారతదేశం అంతటా పేరుగాంచినది.

3000 ఏళ్ళ క్రితం భరత ముని ఈ నాట్యానికి సంబంధించిన వివిధ అంశాలని వివరించాడు. ఒక పద్యం ద్వారా అప్పట్లో నాలుగు విధములైన నృత్యం ఉన్నట్లు గోచరిస్తూ ఉన్నది. వీటిలో దక్షిణ భారతానికి చెందిన దక్షిణ్య కూచిపూడికి పూర్వ విధానమని తెలుస్తున్నది. క్రీ.పూ. 2 వ శతాబ్దంలో శాతవాహనులు ఈ కళకు గొప్ప ఆరాధకులుగా ప్రసిద్ధి గాంచారు. దశాబ్దాలుగా ఈ నాట్య ప్రదర్శనలు వైష్ణవారాధనకే అంకితమైనాయి. అందుకే ఈ రూపాన్ని భాగవత మేళ నాటకం అంటారు. అప్పట్లో అత్యంత పవిత్ర దేవాలయమైన ఆంధ్ర విష్ణు దేవాలయం ఆవరణలో లభ్యమైన శాసనాల ప్రకారం దాదాపుగా మూడు వందల మంది దేవదాసీలు రాజమర్యాదలు అందుకునేవారు. ఇక్కడ లభ్యమైన శిల్పాలు కూడా ఆ నృత్య కళాకారిణుల దైవపూజగా భావించే అపురూప భంగిమలను దాచిపెట్టినట్లు కనిపిస్తాయి. చాలాకాలం వరకు కూచిపూడి నృత్యం దేవాలయాలలో ప్రదర్శింపబడేది. సాంప్రదాయం ప్రకారం, పూర్వం బ్రాహ్మణ కులానికి చెందిన మగవారే కూచిపూడి నృత్యాన్ని చేసేవారు. అందుకే వీరిని కూచిపూడి భాగవతులు అంటారు. 15 వ శతాబ్దంలో సిద్ధేంద్ర యోగి, కూచిపూడి నాట్యంలో ఆడవారు నాట్యం చేయడానికి అనుగుణంగా, కొన్ని మార్పులు చేసి, దానిని పరిపుష్టం గావించాడు. అతని అనుచరులైన బ్రాహ్మణులు కూచిపూడి లో స్థిరపడి ఈ నాట్యాన్ని అభ్యసించటం తో ఆ ఊరి పేరే ఈ నాట్యానికి సిద్ధించినది. వేదాంతం లక్ష్మీనారాయణ శాస్త్రి, చింతా కృష్ణమూర్తి, తాడేపల్లి పేరయ్య వంటి కూచిపూడి నృత్య కళాకారులు దీనిని విస్తరించి, సంస్కరించారు. ఇది భరతుని 'నాట్య శాస్త్రాన్ని' అనుసరిస్తుంది.

1500 నాటికే కూచిపూడి భాగవతులు దక్షిణ భారతదేశంలో సుప్రఖ్యాతులైనట్టు మాచుపల్లి కైఫీయతులో ప్రస్తావించిన కొన్ని విషయాల వల్ల తెలుస్తోంది. 1506-09 విజయనగర చక్రవర్తిగా



పరిపాలించిన వీరనరసింహరాయలు ఎదుట కూచిపూడి భాగవతులు ప్రదర్శన చేస్తూ, సంబెట గురవరాజు అనే సామంతుడు తన పాలనలోని స్త్రీల పట్ల ధనసంపాదన కోసం చేస్తున్న అసభ్యమైన ఘోరాలు ప్రదర్శనలిచ్చారని, దానిలోని వాస్తవాన్ని పరిశీలించి రాయలు సామంతుణ్ణి ఓడించి పట్టి మరణశిక్ష విధించి వధించారని కైఫీయత్తు తెలుపుతోంది. కూచిపూడి నృత్యప్రదర్శన గణేశ స్తుతి, సరస్వతీ స్తుతి, లక్ష్మీస్తుతి, పరాశక్తి స్తోత్రాలతో మొదలవుతుంది. ఆ పై ఒక్కొక్క పాత్ర వేదికను అలంకరించి ధారవు (ఒక చిన్న సంగీత మరియు నాట్య రూపం) తో స్వీయపరిచయం చేసుకొంటారు. దీని తర్వాత కథ మొదలౌతుంది. ప్రక్కన ఒక గాయకుడు, కర్ణాటక సంగీతశైలిలో కీర్తనలను పాడతాడు. దీనినే నట్టువాంగం అంటారు. ఇందులోమృదంగం, వయొలిన్, వేణువు మరియు తంబూరా వంటి వాద్యపరికరాలను ఉపయోగిస్తారు.

చురుగ్గా లయబద్ధంగా కదిలే పాదాలు, శిల్పసదృశమైన దేహభంగిమలు, హస్తాలు, కళ్ళతో చేసే కదలికలు, ముఖంలో చూపించే భావాలు, ముఖాభినయంతో కూచిపూడి నృత్య కళాకారులు సాత్వికాభినయం, భావాభినయం చేయడంలో ఉద్దండులు. నృత్యకారులు ధరించే ఆభరణాలు తేలికగా ఉండే బూరుగు అనబడు చెక్కతో చేస్తారు.

కూచిపూడి భరత నాట్యానికి దగ్గరగా ఉంటుంది. ఒకే పాత్ర గల నృత్యాల గాత్రాలలో జాతిస్వరం మరియు తిల్లానా లు ఉంటాయి. అదేనృత్యం అయితే భక్తుడు దైవంలో ఐక్యమయ్యే కాంక్షను తెలియజేసే సాహిత్యం ఉంటుంది. శైలిలో భరతనాట్యంతో పోల్చినపుడు గల భేదాలతో బాటు కూచిపూడి కి ప్రత్యేక నాట్యరీతులు ఉన్నాయి.

- కృష్ణుని భార్య, సత్యభామ ను అనుకరిస్తూ చేసే నాట్యం, భామాకలాపం.
- ఒక ఇత్తడి పళ్ళెంపై పాదాల నుంచి, రెండు చేతుల్లోనూ వెలిగించిన దీపాలని ఉంచి, శిరసు పై నీరు నింపిన ఒక పాత్రనుంచి నాట్యం చేయడాన్ని తరంగం అంటారు.

అనాది కాలం నుండి కూచిపూడి నృత్యశైలి ప్రామాణిక గ్రంథాలైన అభినయ దర్పణ మరియు నందికేశ్వర భరతర్ణవ ల పై ఆధారితం. ఈ శైలిని నట్టువ మాల మరియు నాట్య మాలగా విభజించారు.

భరత నాట్యానికి పునాది అయిన నట్టువ మాల రెండు రకాలు.

- **పూజా నృత్యం:** గుడిలో బలిపీఠం పై ప్రదర్శించేది
- **కాళికా నృత్యం:** కళ్యాణ మండపంలో ప్రదర్శించేది.

నాట్య మాల

కూచిపూడి కి పునాది అయిన నాట్య మాల పురుష సమూహం చేసే నృత్య రూపకం. ఇందులో స్త్రీ పాత్రలు కూడా పురుషులే అభినయిస్తారు. ఇది మూడు రకాలు

- **సాంప్రదాయిక నృత్యం:** దేవతలకై ఉద్దేశింపబడ్డది
- **కాళికా నృత్యం:** మేధావులకై ఉద్దేశింపబడ్డది
- **సాధారణ నృత్యం:** భాగవతం అను రకం

భరతనాట్యంతో భేదాలు

పై రెంటికీ ఉన్న భేదం అభినయంలోనే. సొగసైన, లాస్యానికి ప్రాముఖ్యత అధికంగా గల కూచిపూడిలో వాక్యార్థ అభినయం ఉండగా, ప్రతి పదం ముద్ర ద్వారానే అభినయంచటానికి అధిక ప్రాముఖ్యత గల భరత నాట్యంలో పదార్థ అభినయం ఉంటుంది. కొన్ని కదలికలే కాక వాచిక అభినయ (పదాలు/సంభాషణలు) కూడా కూచిపూడికే ప్రత్యేకం.

కదలికలు, సంగీతం

తరంగానికి చేసే గాత్రాన్ని కృష్ణ భగవానుని జీవిత ఘట్టాలని క్రోడీకరించే కృష్ణ లీలా తరంగిణి అంటారు.

భామాకలాపంలో గర్విష్టి సత్యభామ, కృష్ణ భగవానుని పాత్రలుంటాయి. సత్యభామ పాత్ర ప్రేమలోని వివిధ పార్శ్వాలని అభినయిస్తుంది. కృష్ణుడికి దూరమైన సమయంలో విరహవేదనని అనుభవిస్తూ, తాము కలసి ఉన్నప్పుడు ఎంత సంతోషంగా ఉన్నామో గుర్తు తెచ్చుకొంటూ అతని గూర్చి కాంక్షిస్తుంది. కృష్ణునికి రాయబారం పంపటంతో ఇద్దరూ కలసి కథని సుఖాంతం చేస్తారు.

కృష్ణ శబ్దం లో ఒక గోపిక కృష్ణుణ్ని కలవటానికి ఆహ్వానిస్తుంది. ఈ పాత్రలో ఒక స్త్రీ పురుషుణ్ణి ముగ్ధుణ్ణి చేసే ప్రయత్నంలోని హావభావాలని ప్రదర్శించే ఆస్కారం కలదు.

అంతర్జాతీయ కూచిపూడి నాట్య సమ్మేళనం

తెలంగాణా , ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వాల సహాయ సహకారాలతో డిసెంబరు 2014, 26 నుండి మూడు రోజులపాటు సిలికానాంధ్ర ఆధ్వర్యంలో హైదరాబాద్ గచ్చిబౌలి జీఎంసీ బాలయోగి స్టేడియంలో 4వ అంతర్జాతీయ కూచిపూడి నాట్య సమ్మేళనం 6327 మంది కూచిపూడి కళాకారులు తో జరిగినది. అపురూప కళ విశ్వ వేదికలమీద ఎన్నో చారిత్రాత్మక ఘట్టాలను నమోదు చేసింది ... ఈ ప్రదర్శన గిన్నిస్ ప్రపంచ రికార్డులో చేర్చబడింది అంతరించి పోతున్న మన కళ ను నేటి తరానికి సగర్వంగా పరిచయం చేసే బృహర్తర యజ్ఞం చేస్తుంది నాట్యం సమ్మేళనం చూసేందుకు వేలాది సందర్శకులు తరలివచ్చారుహైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో మూడు రోజులుగా జరిగిన నాలుగో అంతర్జాతీయ కూచిపూడి నాట్య సమ్మేళనం 28-12-2014 న ముగిసింది. కళాకారుల మువ్వల సవ్వడి ప్రేక్షకుల్ని మంత్ర ముగ్ధుల్ని చేసింది. ముఖ్యంగా శివపార్వతి నాట్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

ప్రముఖ కూచిపూడి నాట్యకళాకారులు

వెంపటి చినసత్యం, భరణి శంకర్, నాట్యాచార్య షేక్ ఖలీల్ గారు (గుంటూరు), అనురాగ్ దేబ్ (కలకత్తా), దేవాశిష్ ప్రధాన్ (కలకత్తా), జయరామ రావు, వనశ్రీ రావు, శ్రీనివాస రావు, వేదాంతం లక్ష్మీనారాయణ, ఉమా రామారావు, తాడేపల్లి పేరయ్య, చింతా కృష్ణమూర్తి, కోరద నర్సింగరావు, సీ ఆర్ ఆచార్యులు, మృణాళినీ సారాభాయి, బాలకొండల రావు, కృష్ణ భారతి, పసుమర్తి వేణుగోపాల కృష్ణ శర్మ, స్వాగత్ కూచిపూడి, సూర్య నారాయణ శర్మ, యశోదా ఠాకూర్, విజయ్ పాల్ పథ్లోతు, వంశీకృష్ణ శర్మ, మాళవికా రాంప్రసాద్, ఇందిరా శ్రీ రాం దీక్షిత్, సి.ఆర్. ఆచార్యులు, డాక్టర్ నటరాజ రామకృష్ణ, శోభా నాయుడు, వేదాంతం వెంకట నాగచలపతి, గురు జయరామారావు, వేదాంతం వనశ్రీ రావు, వేదాంతం సత్యనారాయణ శర్మ, ఘంటా సరళ కుమారి, యామినీ కృష్ణమూర్తి, స్వప్నసుందరి, రాధారెడ్డి, రాజారెడ్డి, మంజు భార్గవి, వెంపటి రవి, శశికళ పినుమర్తి కమలా రెడ్డి, కమల అయ్యలరాజు, సంధ్యశ్రీ ఆత్మకూరి, శారద జమ్మి, అనురాధ నెహ్రూ, హిమబిందు చల్లా, యామిని సారిపల్లి, లలిత సింధూరి మొదలగువారు.

❖ ❖ ❖

శాసనాలలో, సాహిత్యంలో కృష్ణానది...

- డా॥ గల్లా చలపతి

తితిదే 'కృష్ణవేణీ తరంగాల' నుండి

అవతారేషు శ్రేష్ఠం కథయతి బుధః కృష్ణమపి చ,
తదాఖ్యా పాంచాలీ ప్రథయతి పురంధ్రీషు సతతం,
తదాఖ్యాకో వ్యాసః ఋషివర ఇతి ఖ్యాతి మగమత్,
తథైవ త్వం కృష్ణే! సకల తటినీషు ప్రభవసి.

కృష్ణ అంటే నలుపని, ప్రకరణార్థాన్ని బట్టి శ్రేష్ఠమని అర్థం. కృష్ణుడు, పాంచాలి, వ్యాసుడు నల్లనివారు. ఈ ముప్పురూ ఎంత ప్రసిద్ధులో చెప్పనవసరంలేదు. అలాగే కృష్ణానది నదులన్నిటిలో తలమానికమని చెప్పడానికి ఆ పేరే చాలు. ఈ నదికి 'కృష్ణవేణి' అనే ప్రసిద్ధి ఉంది. మహారాష్ట్రలోని సహ్యాద్రి ఉత్తర శిఖరమైన బ్రహ్మగిరిలో పుట్టిన కృష్ణ గుట్టలు మిట్టలు, అడవులు, కొండలను అతిక్రమిస్తూ సుదీర్ఘంగా ప్రవహించి వేదగిరిలో 'వేణిని' తనలో కలుపుకొని కృష్ణవేణిగా మారి కృష్ణాజిల్లా హంసలదీవి దగ్గర సాగరసంమం చేస్తుంది. తన పరీవాహక ప్రాంతాలను బంగారు పండే పంట పొలాలుగా మార్చిన ఈ నదీమతల్లికి మహారాష్ట్ర, కర్నాటక, తెలంగాణ, ఆంధ్ర జాతుల సంస్కృతిని పునీతం చేసిన చరిత్ర ఉంది. కృష్ణవేణి చక్కని కనులు గలదిగా, శ్యామల దేహముగలదిగా, శంఖచక్రాది విష్ణుచిహ్నములు గలదిగా, చతుర్బాహువులు పీతాంబరము కలదిగా, ప్రసన్నరూపము గలదిగా స్కంధపురాణం అభివర్ణించింది. కలియుగారంభంలో నిష్ఠాగరిష్ఠుడైన సహ్యాముని తపస్సుకు మెచ్చి శ్రీకృష్ణుడా మునిని సహ్యాద్రిగా అవతరించమన్నాడు. తన అంశ అయిన కృష్ణ ఆ మునిమేనుపై సదా ప్రవహిస్తుందని వరమిచ్చాడు. ముని అందుకంగీకరించి సహ్యాద్రి అయినాడు. శ్రీకృష్ణుడు కృష్ణానదిగా ఆ ముని మేనుపై ప్రవహిస్తూనే ఉన్నాడు. కలియుగ కల్మషాలను కడిగి పారవేయడానికి కృష్ణ ఈ రకంగా అవతరించింది. కృష్ణ జన్మకు సంబంధించిన పురాణ కథనాలివి.

నది సాగితేనే మానవజీవితం సాగుతుంది. మానవ సంస్కృతి నదీ మూలాలలోనే వికసించింది. జలమే ప్రాణం కాబట్టి మానవ జీవితంలో నదులకింత ప్రాధాన్యం. నదులను దేవతామ తల్లులుగా ఆరాధిస్తున్నందుకే కృష్ణ అందంగా, గంభీరంగా ప్రవహించే జల స్రోతస్విని. ప్రాచీనుల నుండి ఆధునికుల వరకు ఎందరో కృష్ణవేణి సోయగాలను తమ కావ్యాలలో గానం చేశారు. ప్రాచీన కాలంనుండి ఎన్నో శాసనాలలో కృష్ణవేణి అనేక పేర్లతో కనిపిస్తున్నది. బౌద్ధ నాగరికత కృష్ణకిరువైపులా వికసించినట్లు చరిత్ర ఎన్నో సాక్ష్యాలను చూపిస్తున్నది. బౌద్ధ స్తూపాలలో తలమానికమైన అమరావతి స్తూపం కృష్ణ ఒడ్డుననే నిర్మింపబడి ఉంది. శాతవాహనుల నుండి ఆంధ్రను పాలించిన రాజవంశాలన్నింటికీ కృష్ణతో అనుబంధముంది. ఇక్ష్వాకువంశపు రాజులు కృష్ణానదీ సైకతాలపై నడిచినవారే. ఆ వంశపు రాణి రుద్రధర భట్టారిక పారాణి గుర్తులు కృష్ణా సైకతాలమీద ఇప్పటికీ కనిపిస్తాయని అడవి బాపిరాజు 'అడవి శాంతిశ్రీ' నవలలో భావుకత్వాన్ని ప్రదర్శించారు.

శాసనాలు : జాతక కథలలో కృష్ణకు 'కణ్ణజెన్న' అని పేరుంది. శంఖపాల జాతకం కణ్ణజెన్న ప్రాంతమే నాగలోకమని చెపుతున్నది. ప్రాచీన కాలంలో కృష్ణా ఉత్తర తట ప్రాంతానికి నాగభూమి అని పేరున్నట్లు ప్రాచీనాంధ్ర సంస్కృతిని పరిశీలిస్తే తెలుస్తుంది. ప్రాకృతంలో కృష్ణానదికి కణ్ణబెణ్ణ, కరబేడా, కన్హవణ్ణా అనే పేర్లున్నాయి. మొట్టమొదటిసారిగా కృష్ణానది క్రీ.పూ. ఒకటవ శతాబ్దానికి చెందిన ఒక ప్రాకృత శాసనంలో కనిపిస్తున్నది. కళింగరాజు ఖారవేలుని జీవిత దశలను వివరించే హథీగుంఫా శాసనంలో 'దుతియేచవసే కణ్హబేణాం గతాయచ సేనాయ వితాసితి అసికనగరం' అనే వాక్యంలో ఈ నది 'కన్హబేణా' అనే పేరుతో కనిపిస్తున్నది. ఆ రాజు రెండవ పరిపాలనా సంవత్సరంలో కృష్ణవేణీనదీ తటంపైగల ఋషిక నగరం సమీపంలో సేనను మోహరించాడని పై ప్రాకృత వాక్యానికి

తాత్పర్యం. క్రీ.శ. ఒకటవ శతాబ్దానికి చెందిన నాసిక్ గుహా శాసనాలలోని ఒక శాసనంలో నహపానుని అల్లుడైన ఉషవదాత అనే రాజు బ్రాహ్మణులకు చేసిన అనేక దానవివరాలున్నాయి. దానాలు చేసిన సందర్భంలో ఈ రాజు బాటసారులను ఉచితంగా నదులు దాటించడానికి అనేక పడవలను ఏర్పాటు చేయించాడు. ఇబా, పారాదా, దమణి, తాపి, కరబెణా, దాహనుకా నదులను దాటడానికి ఈ పడవలు ఉద్దేశింపబడినట్లు శాసన కథనం. ఈ నదుల ఇరు గట్లమీద ప్రయాణీకుల సౌకర్యార్థం శిబిరాలు గూడా నిర్మింపబడినాయి. కరబెణా కృష్ణానదేనని వెంటనే అర్థమవుతుంది. ఇక ఆ పట్టికలోని మిగిలిన నదుల సంగతి సరిగా తెలియదు.

మధ్యయుగ ఆంధ్రచరిత్రలో కృష్ణానదికి ఎంతో ప్రాధాన్యం ఏర్పడినట్లు శాసనాలు నిరూపిస్తున్నాయి. విరాట్పురుషుడైన శ్రీకృష్ణునిలో సమస్త విశ్వమూ ఉన్నట్లు ఆ మహాపురుషుని పేరుతో ఏర్పడిన ఈ నదిలో సమస్త పుణ్యనదులు సంగమించినట్లు ఆస్తికుల విశ్వాసం. కృష్ణానదిలో స్నానం పరమపుణ్య ప్రదమని భావించేవాళ్లు ఈ నది స్నానఘట్టాల దగ్గర అనేకరకాల పూజలు నిర్వహిస్తారు. ఈ పూజలలో ఆబ్దిక క్రియలు ముఖ్యమైనవి. దేశసరిహద్దులను గుర్తించడానికి కృష్ణవేణీ నదీ తీర దక్షిణ ప్రాంతం, ఉత్తరప్రాంతం అని పేర్కొనడం అనేక తెలుగు శాసనాలలో కనిపిస్తుంది. క్రీ.శ. 1129 నాటి ఒక శాసనంలోని 'కృష్ణవేణ్ణా నదీతీర దక్షిణ షట్సహస్ర విషయాధీశ్వర' అనే విషయం, క్రీ.శ. 1131 నాటి మరొక శాసనంలో 'క్రిష్ణవెణ్ణా నదీతీర దక్షిణ షట్సహస్ర విషయాధీశ్వర' అనే విషయం దీన్ని నిరూపించే అంశాలు. దాతలు దానం చేసే సందర్భాలలో నదీ తీరానికి వచ్చి దానంచేస్తే అనంతమైన పుణ్యం దక్కుతుందని నమ్మేవారు. కృష్ణానదీ తీరంలో దానం చేసిన సందర్భాలెన్నో మధ్యయుగ శాసనాలలలో లిఖించబడి కనిపిస్తున్నాయి. 'శ్రీకృష్ణవేణీ నదీతీర మందు... హవిబల్యర్చన సంపూర్ణ్యర్థముగాను ఆచంద్రార్క స్థాయిగాను ధారాపూర్వక మగునట్టుగా....' దానం చేసిన విషయం ఒక శాసనంలో ఉంది. ఈ శాసనంలో 'ధారాపూర్వక అన్న విషయం గమనింపదగిన విశేషం. దాత కృష్ణానదిలోని నీటిని దోసిటితో దానగ్రహీత చేతులలో పోస్తూ దానం చేయడాన్ని ఈ మాట తెలుపుతుంది. క్రీ.శ. 1258 నాటి నాదెండ్ల గోవర్ధన స్వామి దేవాలయ స్తంభం మీద చెక్కబడిన ఒక శాసనంలో అప్సరాంగనలు కృష్ణవేణీ నీటిలో క్రీడించిన విషయం ఈ శ్లోకంలో చెప్పబడింది.

యద్వార వధ్వః పయసాం విహారే కుర్వంతి పీనస్తన కుంకుమేన
భువస్సింధూర పరాగయోగాం సీమంత రేఖామివ కృష్ణే వేణ్ణం

సాధారణంగా శాసనాల ప్రారంభంలో దేవతాస్తుతులు కనిపిస్తాయి. శాసనం వేయించేవాళ్ల భక్తిప్రపత్తులను బట్టి వాళ్లకిష్టమైన దేవతల స్తోత్రాలు కనిపించడం సహజం. శాసనాల చివర శాపోక్తులు ఉంటాయి. శాసనోద్దేశాన్ని చెడగొట్టినవాడు గంగానది ఒడ్డున గోవును వధించిన పాపం పొందుతాడని, కన్నకొడుకును వధించిన పాపాన పోతాడని ఇత్యాది మాటలు శాసనాల రక్షణకోసం పొందుపరచినవి. ఇలాంటి సందర్భాలలో నదీస్తుతులు కనిపిస్తున్నాయి. పైన చూపిన శ్లోకంలాంటి శ్లోకాలు

నది సాగితేనే మానవజీవితం సాగుతుంది. మానవ సంస్కృతి నదీ మూలాలలోనే వికసించింది. జలమే ప్రాణం కాబట్టి మానవ జీవితంలో నదులకింత ప్రాధాన్యం. నదులను దేవతామ తల్లులుగా ఆరాధిస్తున్నందుకే కృష్ణ అందంగా, గంభీరంగా ప్రవహించే జల స్రోతస్విని. ప్రాచీనుల నుండి ఆధునికుల వరకు ఎందరో కృష్ణవేణి సోయగాలను తమ కావ్యాలలో గానం చేశారు. ప్రాచీన కాలంనుండి ఎన్నో శాసనాలలో కృష్ణవేణి అనేక పేర్లతో కనిపిస్తున్నది. బౌద్ధ నాగరికత కృష్ణకిరువైపులా వికసించినట్లు చరిత్ర ఎన్నో సాక్ష్యాలను చూపిస్తున్నది. బౌద్ధ స్తూపాలలో తలమానికమైన అమరావతి స్తూపం కృష్ణ ఒడ్డుననే నిర్మింపబడి ఉంది. శాతవాహనుల నుండి ఆంధ్రను పాలించిన రాజవంశాలన్నింటికీ కృష్ణతో అనుబంధముంది. ఇక్ష్వాకువంశపు రాజులు కృష్ణానదీ సైకతాలపై నడిచినవారే.

కృష్ణానది గొప్పతనాన్ని వివరిస్తూ ఎన్నో శాసనాలలలో కనిపిస్తాయి.

కృష్ణకు తెలుగులో 'పేరేఱు' అని, కన్నడంలో 'పేర్దొఱె' అని, తమిళంలో 'పేరాఱు' అని పేర్లున్నట్లు ప్రాచీన శాసనాలవల్ల తెలుస్తుంది. ఈ మూడు మాటలకు ఒకటే అర్థం. అఱు, తెఱె, ఏరు సమానార్థకాలు. ఏఱంటే నదీ ప్రవాహం. పేరేఱు అంటే పెద్ద ఏఱని, నదీ ప్రవాహమని అర్థం. క్రీ.శ. 1061 నాటి ఒక శాసనంలో 'స్వస్తిశ్రీ సర్వలోకాశ్రయ శ్రీవిష్ణువర్ధన మహారాజులు... శకవర్షంబులు 983 నేటి ప్లవ సంవత్సరంబున బేరేటి దక్షిణంబున యాఱువేల వెలనంటి... గ్రహారంబు' అని ఉంది. ఇందులో కనిపించే పేరేఱు కృష్ణానదే. వెలనాడు కృష్ణానదీ దక్షిణ తీరానగల ప్రసిద్ధమైన నాడులలో ఒకటి కాబట్టి పేరేఱు కృష్ణానదేనని చెప్పడానికి వీలుంది.

సాహిత్యం : కృష్ణానదిని ఒక నదిగా గుర్తించిన సాహిత్య గ్రంథాలెన్నో ఉన్నాయి. నదులలో పవిత్రమైన నదిగా, మహత్తుగలదిగా, స్వర్గవాసాన్ని కలిగించే నదిగా కృష్ణానది సాహిత్యంలో కనిపిస్తుంది. స్కంధపురాణంలో కృష్ణానది ఒక అందమైన స్త్రీమూర్తిగా చిత్రింపబడింది. నది శబ్దం స్త్రీ లింగం కాబట్టి మనదేశంలో ప్రవహించే నదులన్నీ సాహిత్య గ్రంథాలలో అద్భుతమైన స్త్రీమూర్తులుగా వర్ణింపబడినాయి. నదీ ప్రవాహం గమనశీలం కలది కాబట్టి, చలత్వం నదులకు సహజగుణం కాబట్టి నదీమూర్తుల అవయవ సౌందర్యంలో ప్రవాహపు వంపులు సొంపులు సౌందర్య స్ఫోరకంగా కనిపిస్తాయి. నదులను నాయికలుగా వర్ణించిన కవులున్నారు. భారత ఆదిపర్వంలో గంగానది అందమైన స్త్రీగా చిత్రింపబడి శంతనమహారాజును ఆకర్షించిన కథ ఉంది. భట్టుమూర్తి వసుచరిత్రలో శుక్తిమతీనదిని మహాసౌందర్యవతియైన స్త్రీగా వర్ణించాడు. పరిశీలిస్తే ఇలాంటి ఉదాహరణలు ఎన్నో దొరుకుతాయి.

మత్స్య, వామన పురాణాలలో కృష్ణ అగ్నిదేవుని భార్యలలో ఒకతెగా చిత్రింపబడి ఉంది. కృష్ణ, వేణి వేర్వేరు నదులుగా చెప్పిన కవులున్నారు. రాజశేఖరుని కావ్యమీమాంసలో దక్షిణభారత నదుల పట్టిక కనిపిస్తుంది. ఈ పట్టికలో గోదావరి, కావేరి, భీమరథి, వేణా, కృష్ణవేణా, వంజుల, తుంగభద్ర, తామ్రపర్ణి, ఉత్పలావతి నదులు పేర్కొనబడినాయి. కృష్ణవేణి, వేణీనదులు వేర్వేరని రాజశేఖరుని అభిప్రాయమైనా వేణీనది కలిసిన తరువాతనే కృష్ణవేణి అయినట్లు భావించడానికి అనేక ఆధారాలున్నాయి. భారతం అరణ్యపర్వంలోని పుణ్యతీర్థాల ప్రసక్తి సందర్భంలో "తొల్లి క్రతుండు మూడు క్రతువుల సేయుట జేసి పవిత్రంబయిన కృష్ణవేణి యందు దేవహ్రదంబాడిన సర్వపాప వినాశంబగును" అని చెప్పబడింది. భీష్మపర్వంలో కనిపించే నదుల పట్టిక ఇది – "గంగయు, దుంగభద్రయు, వేత్రవతియు, గృష్ణవేణియు, బెన్నయు, యమునయు, శరావతియు, గావేరియు, నర్మదయు, బాహుదయు, సరయువును, శతద్రువును, వితస్తయు, విపాశయు, తామ్రపర్ణియు ననుమహానదులు". మనదేశంలో ప్రవహించే ప్రధాన నదుల పట్టికలో కృష్ణవేణి కనిపిస్తున్నది.

పద్మపురాణ ఉత్తరఖండంలో కృష్ణానది జన్మఘట్టముంది. దీనిని పిశుపాటి చిదంబర శాస్త్రిగారు తెనిగించారు. దీనికి సంబంధించిన చిన్న కథ ఇది – చాక్షుష మన్వంతరంలో బ్రహ్మ సహ్యగిరి శిఖరంపై యజ్ఞం చేయ సంకల్పించి దేవతలందరినీ ఆహ్వానించాడు. ఆయనకు స్వరరామి, గాయత్రి ఇద్దరు భార్యలు. ముహూర్త సమయానికి సర్వరామి రాలేదు. బ్రహ్మ రెండవ భార్యయైన గాయత్రితో యజ్ఞాన్ని నిర్వహించాడు. అయిపోయిన తరువాత స్వరరామి వచ్చింది. విపరీతమైన కోపంతో అక్కడున్న వాళ్లనందరిని నిమగ్నులు (నదులు) గమ్మని శపించింది. ఈ హఠాత్పరిణామానికి ఆశ్చర్యపడినా కోపం రావడంతో గాయత్రి స్వరరామికి కూడా అలాంటి శాపమే ఇచ్చింది. మేమంతా నదులమైతే ముల్లోకాలు లుప్తమైపోతాయి. కాబట్టి శాపాన్ని ఉపసంహరించమని దేవతలు కోరారు. యజ్ఞారంభంలో వినాయక పూజ చేయక పోవడంవల్ల అలా జరిగిందని, శాపాన్ని మళ్లించే శక్తి తనకు లేదని స్వర చెప్పింది. మీరు మీమీ అంశాలతో నదులు గమ్మని సూచించింది. ఆమె గాయత్రితో కలసి గంగగా అవతరించింది. తరువాత తమతమ అంశలతో విష్ణువు కృష్ణానదీత్వాన్ని, ఈశ్వరుడు వేణ్యానదీత్వాన్ని, బ్రహ్మ కకుద్మతీ నదీత్వాన్ని, తక్కిన దేవతలందరూ వివిధ నదీరూపాలను పొంది సహ్యాద్రి నుండి పూర్వ వాహినులుగా ప్రవహించారు. ఆ నిర్జరుల పత్నులు పశ్చిమ వాహినులుగా ప్రవహించారు. ఈ కథ ద్వారా

మనకు కృష్ణవేణీ నది హరిహరుల అంశలతో కూడిన పవిత్రనదిగా అర్థమవుతుంది.

కృష్ణానది కాపేరు ఎలా ఏర్పడిందో చెప్పడానికి భట్టుమూర్తి విరచిత వసుచరిత్రలో ఒక చమత్కార పూర్వకమైన విషయముంది. వసుచరిత్రను అంకితం తీసుకొన్న తిరుమల రాయల తమ్ముడు రఘునాథరాయలు తురుష్కసైన్యాన్ని రూపుమాపాడు. వాళ్ల భార్యలు దుఃఖించి కన్నీళ్లు కార్చారు. కాటుక కలసిన వాళ్ల కన్నీళ్లు ప్రవాహమై కృష్ణలో కలియడం వల్ల ఆ నది నీరు నల్లగా మారి కృష్ణకు ఆ పేరేర్పడిందట. ఈ విషయాన్ని వివరించే పద్యమిది–

"యాదోరాశి గభీరమూర్తి రఘునాథాధీశుడుద్దండ బా
హా దర్పాంధ సపాద మల్మిక నిజామానీకముల్ ద్రుంప జ
న్యా దూరస్థితి బారు కృష్ణకును గృష్ణాంకంబు నాడబ్బె బి
బ్బీ దీవన్నయనాబ్జ కజ్జల జలాభీల ప్రవాహంబునన్"

ఆధునిక కవులు కృష్ణానదిని అనేక రాజవంశాల పరిపాలనను గమనించిన నదిగా, తెలుగు సంస్కృతిని తనలో కలుపుకొని తరతరాల సాంస్కృతిక వారసత్వాన్ని తన నీటి ద్వారా ప్రజల కందించే పుణ్య స్రోతస్సుగా కీర్తించారు. జాతీయోద్యమ కవులు మనదేశ ఔన్నత్యాన్ని వర్ణించే సందర్భంలో జాతి ప్రాణాన్ని నిలిపే నదీమతల్లులను ఎంతగానో శ్లాఘించారు. ఇలాంటి పుణ్యనదీ నదాలు గల పుడమి అస్వతంత్రమై అరాచక స్థితికి ఆలవాలం కావడం దుర్భరమని దేశమాతను కాపాడుకోవలసిన బాధ్యతను గుర్తు చేశారు. ఈ సందర్భంలో కృష్ణానదికి సంబంధించిన కొన్ని విషయాలను క్లుప్తంగా చూద్దాం. ఖండకావ్య కవులెందరో కృష్ణానదిని కవితావస్తువుగా గ్రహించారు. 'ఆంధ్రపౌరుషం' అనే ఖండికలో విశ్వనాథ సత్యనారాయణగారు కృష్ణానది నిలా ప్రస్తుతించారు.

కృష్ణాంతరంగ నిర్నిద్రగానముతోడ
శిల్పమ్ము తొలి పూజ సేయునాడు
అక్షరజ్ఞాన మెఱుగదో ఆంధ్రజాతి
విమల కృష్ణానదీ సైకతములయందు
కోకిలపు పాట పిచ్చుక గూండ్లు కట్టి
నేర్చుకొన్నది పూర్ణిమా నిశలయందు.

కృష్ణాతీరంలో ఉంటున్న గ్రామీణుల జీవన శైలిని వివరించే కథలు కూడా వచ్చాయి. శంకరమంచి పార్థసారథి గారి అమరావతి కథలు, (ఇవి హింది భాషలో బుల్లితెర మీదకు సైతం ఎక్కాయి) పోలవరపు కోటీశ్వర రావుగారి కాకళయ్య కథలు, కృష్ణాతరంగాలు వాటిలో కొన్ని.

పాలవరపు కోటీశ్వరరావుగారు 1994లో 'కృష్ణవేణి' అనే పేరుతో ఒక గేయకావ్యం రాశారు. ఆయన కృష్ణాతీర ప్రాంతవాసి. ఈ నది మీద ఆయన కెంత మక్కువో చెప్పలేం.

జలబిందువై, రమ్యకరుణాంగివైరివై
జీవవాహినియై, మహారాష్ట్ర కర్ణాట ఆంధ్రప్రజల
ఆరాధ్యదేవతగా రూపొందింది కృష్ణవేణి
అనేక జాతుల మతాల తెగల జీవద్వాహిని కృష్ణవేణి
సంస్కృతి ప్రవాహమై, సర్వజనామోదమై
సకల సంపద్విలసితమై కన్నతల్లిగా నిలచింది కృష్ణవేణి
కమనీయచరితలను రూపొందించింది కృష్ణవేణి.

అంటూ ముగిసింది. పడమటి కనుమలలో సహ్యాద్రిలో జన్మించి సాగరసంగమం చేసే వరకూ కృష్ణానది పునీతం చేసిన ప్రాంతాల కథలు, చరిత్ర, కళలు – ఈ కావ్యంలో రసవత్తరంగా వర్ణింపబడినాయి. కృష్ణవేణి ప్రవాహంలో తెలుగు సిరులు కలసి ఉన్నాయి. అందుకే ఆ నది ప్రవహించిన ప్రాంతాలలో ప్రజల జీవితం నెమ్మదిగా ఉంది. తెలుగు సొగసులు విరబోసుకొని ప్రవహించే కృష్ణ స్వరూపాన్ని కవిగారిలా దర్శించారు.

నొసట కుంకుమ రాగరంజితంబొనరించె
తొగరు కుచ్చెళ్లు పారాణి జీరాడె
కలికి కాటుక కనుల తెలుగు సిరులే మెరిసె
అల్లనల్లన కృష్ణ ఆంధ్రలో నడచె.

ఎందరో కవులకు, కథకులకు, గాయకులకు, శిల్పులకు కృష్ణవేణి ఎన్నో రకాలుగా ప్రేరణనిచ్చింది. తన తీరాలలోని దేవాలయాల ద్వారా ఆధ్యాత్మికసంపదను పంచింది. కర్షకుల కడగండ్లను తొలగించింది. రైతుల పాలిట వరంగా, భూమాత కంఠంలో సరంగా, సకల నదులలో శ్రేయస్కరంగా, తెలుగు సంస్కృతిని గానం చేస్తూ ప్రవహించే ఈ నదీ లలామ ఔన్నత్యాన్ని అంచనా వేయలేం. అమృత తుల్యమైన జలంతో ఎప్పటికీ ప్రవహించే ఈ జీవనది కళాకారుల కెందరికో స్ఫూర్తి ప్రదాత. ❖

కృష్ణవేణి కులుకులు... పెండిలేరు తళుకులు

- డా॥ పైడిపాల

తితిదే 'కృష్ణవేణీ తరంగాల' నుండి

"కృష్ణా గోదావరులు తెలుగింటి కోడళ్లు. అన్నిటా సౌమ్యం వున్న అక్కచెల్లెళ్లు. పుష్కరాలు కూడా గోదావరికి, కృష్ణకు వరుసగా రావడం వీటి అనుబంధానికి చిహ్నం. వేటూరి రాసిన చలనచిత్ర గీతాలలో రెండు మూడు సందర్భాలలో ఈ రెండు నదులు విడదీయరాని జంటగానే భావించారు."

'మహాబలేశ్వర్'లో పుట్టి నాలుగు రాష్ట్రాలను తన పుణ్యజలాలతో పునీతం చేసిన, కృష్ణానది పేరు చెప్పగానే గుర్తొచ్చేది తెలుగుతేజం, వెనువెంటనే విజయవాడ, కృష్ణమ్మ తన నడిచినంత మేర భూదేవిని ఆకుపచ్చని చీరతో అలంకరించిన అన్నపూర్ణమ్మ తన ఒడ్డున కొండెక్కి కూర్చున్న కనకదుర్గ దర్శనార్థం వచ్చే భక్తజన శ్రేణికి పవిత్ర స్నానాలను సమకూరుస్తున్న రమ పావని. శ్రీశైల మల్లికార్జునుని పాతాళగంగ రూపంలో అభిషేకిస్తున్న ముక్తిదాయిని. నాగార్జునుని బౌద్ధమత బోధనలతో పరవశించి తన జన్మ తరించడానికి నాగార్జున సాగరంగా అవతరించిన కర్షక వరప్రదాయిని.

ఇలా బహుధా తెలుగు నేలకు సేవలందించిన కృష్ణవేణి తరంగిణి తన పీయూష ధారలతో సాహిత్య సాంస్కృతిక కళాక్షేత్రాలను కూడా సుసంపన్నం చేసింది. రాయప్రోలు సుబ్బారావు, బసవరాజు అప్పారావు, కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ వంటి భావకువులు తమ కవితా సుమాలతో కృష్ణమ్మ నర్చించారు.

కృష్ణా తరంగ నిర్ణిద్ర గానముతోడ
శిల్పమ్ము తొలిపూజ సేయునాడు – విశ్వనాథ

కృష్ణాతరంగ పంక్తిన్ ద్రొక్కి త్రుళ్ళింత
నాంధ్ర నౌకలు నాట్యమాడు నాడు – రాయప్రోలు

– వంటి పంక్తులు కృష్ణవేణికి, ఆంధ్ర పౌరుషానికి వుండే అవినాభావ సంబంధానికి అద్దం పడతాయి. మల్లాది రామకృష్ణ శాస్త్రి కలం నుంచి కృష్ణా తీరం' నవల జాలువారితే శంకరమంచి 'అమరావతి కథలు' కృష్ణాతీరాన్ని ప్రతిబింబింప చేశాయి. డా॥ సి. నారాయణరెడ్డి ఇక్ష్వాకుల పాలనలో పరిఢవిల్లిన నాగార్జున కొండ పరిసరాల్లోని బౌద్ధ వాతావరణం భూమికగా కృష్ణవేణీ నదీ నేపథ్యంలో 'నాగార్జున సాగరం' అనే గేయ కావ్యాన్ని రచిస్తే వేటూరి సుందరరామమూర్తి ఈ నదీ నేపథ్యంలో తన చలనచిత్ర రంగ ప్రవేశానికి కారణమైన 'సిరికా కొలను చిన్నది' అనే సంగీత రూపకాన్ని రాశారు. ఆ రూపకంలో వేటూరి కృష్ణవేణీ తరంగిణిని ఈవిధంగా అభివర్ణించారు.

జాణగా జనియించి మాధవ కథా గాన
వీణగా రవళించి నిదురించే అలివేణి
కలలన్నీ అలలైన సిరికా కొలను రాణి
గల గల మని నేడు సాగిన కృష్ణవేణి

ఇలా ఎందరో కవులకూ, కళాకారులకూ స్ఫూర్తి నిచ్చిన కృష్ణవేణి 1950 తరువాత చలనచిత్ర సీమలో కూడా ప్రవహించడం ప్రారంభించింది. అప్పటికే ఎన్.టి. రామారావు, అక్కినేని నాగేశ్వరరావు, కొంగర జగ్గయ్య వంటి హీరోలకు, ప్రముఖ నిర్మాతలకు, ఎన్నో పంపిణి సంస్థలకు కొలువైన కృష్ణాతీరం ఆంధ్రదేశంలో చలనచిత్ర పరిశ్రమకు ఆటపట్టయింది. ఆ దశలో తెలుగు చలనచిత్ర గీతాలలో తెలుగుతల్లి ప్రశంస వచ్చిన అన్ని సందర్భాలలోను కృష్ణా, గోదావరి మొదలైన నదుల ప్రసక్తి తప్పనిసరయింది.

కృష్ణా గోదావరులు తెలుగింటి కోడళ్లు. అన్నిటా సామ్యం వున్న అక్కచెల్లెళ్లు. పుష్కరాలు కూడా గోదావరికి, కృష్ణకు వరుసగా రావడం వీటి అనుబంధానికి చిహ్నం. వేటూరి రాసిన చలనచిత్ర గీతాలలో రెండు మూడు సందర్భాలలో ఈ రెండు నదులు విడదీయరాని జంటగానే భావించారు.

ముందుగా యాభయ్యవ దశకంలో సినిమాల్లోని దేశభక్తి గీతాలలో నదుల ప్రాశస్త్యంలో భాగంగా కృష్ణా తరంగాలను పరిశీలిద్దాం.

'పల్లెటూరు' (1952) చిత్రంలో వేములపల్లి శ్రీకృష్ణ రచన 'చెయ్యెత్తి జైకొట్టు తెలుగోడ'ను వినియోగించుకొన్నారు. నిజానికి ఇది సినిమా కోసం రాసిన పాట కాదు. పుచ్చలపల్లి సుందరయ్య కమ్యూనిస్టు పార్టీ తరఫున నిర్వహించినర దేశభక్తి గీతాల పోటీలో ద్వితీయ బహుమతిని పొంది ప్రాచుర్యాన్నందుకొంది.

కల్లోల గౌతమి, వెల్లువల కృష్ణమ్మ
తుంగభద్ర తల్లి పొంగి పొరలిన చాలు!

అనే పంక్తుల్లో కృష్ణమ్మ ఉరవడి కనిపిస్తుంది. ఇలా తెలుగు నేలలో నదులు సిరులు పండించి దానిని బంగారు భూమిగా మార్చాయనే భావనతో రాసిన ఆదశాబ్దంలోని తెలుగు సినిమా పాటలకు ఈ క్రింది ఉదాహరణలను పేర్కొనవచ్చు.

'కన్యాదానం' (1954) చిత్రం కోసం కొసరాజు రాసిన 'ఓరోరి తెలుగువాడ, ఒయ్యారి తెలుగువాడ!' అనే నృత్య రూపకంలో---

'తుంగభద్ర కృష్ణవేణి పొంగులెత్తు గోదావరి
ముంగిట్లో తిరుగుచుండె, బంగారు పండు చుండె'.

"పెళ్లినాటి ప్రమాణాలు" (1958) చిత్రం కోసం పింగళి నాగేంద్రరావు రచించిన --

శ్రీమంతురాలివవై ఎలువొందు మాతా
మమ్ము దీవించుమా మా ఆంధ్రమాతా
కృష్ణ గోదావరీ హంద్రి నాగావళీ
తుంగభద్ర పెన్న నదుల పుణ్యమున.

ఈ ఒరవడికి సంబంధించిన మరో ప్రసిద్ధ గీతం ఎన్నో సినిమాలలో వినియోగించుకొన్న శంకరంబాడి సుందరాచారి తెలుగుతల్లి మెడలో వేసిన మల్లెపూల మాల.

మా తెలుగుతల్లికి మల్లె పూదండ
మా కన్న తల్లికి మంగళారతులు
గల గలా గోదారి కదిలి పోతుంటేను
బిర బిరా కృష్ణమ్మ పరుగులిడుతుంటేను

బంగారు పంటలే పండుతాయి
మురిపాల ముత్యాలు దొరలుతాయి.

ఈ పాటలో నదుల ప్రశంస ఆంధ్రదేశంలో అతి ప్రధానమైన కృష్ణా గోదావరులకే పరిమితం కావడం గమనార్హం.

వేటూరి పాటల తేటులు

కృష్ణాతీరంలోని 'పెద కళ్లేపల్లి'లో పుట్టిన వేటూరికి తన ఊరన్నా, కృష్ణానది నీరన్నా అవధిలేని అభిమానం. ఆయన ఆ నదీ జలాల మాధుర్యాన్ని తనివితీరా ఆస్వాదించి ఆ తేనెల ఊటలను తన పాటలలో రంగరించారు. దీనికి నిదర్శనం 'శంకరాభరణం' (1980)లోని 'రాగం తానం పల్లవి...' పాటలోని ---

కృష్ణా తరంగాల సారంగ రాగాలు
కృష్ణలీలా తరంగిణీ భక్తి గీతాలు
సస్య కేదారాల స్వరస గాంధారాలు
సరస హృదయ క్షేత్ర విమల గాంధర్వాలు.

– అనే విమల గాంధర్వ స్వరాలే! వేటూరికి కృష్ణతో పాటు గోదావరి అన్న అమితమైన మమకారం. అందుకే రెంటికీ! సమ ప్రాధాన్యమిస్తూ, అవిభక్తంగా భావిస్తూ అనేక గీతాలు రాశారు.

నా వాలు జడ కృష్ణ వేణి
నా పూల జడ వెన్నెల గోదారి. – అమెరికా అల్లుడు

గోదారి నీ పయ్యెద
కృష్ణమ్మ నీ వాల్జెడ – సరిగమలు

ఎందరు ఏడ్చిన ఏడుపులో కృష్ణాగోదావరి
ఎందరి ఆరని కన్నీళ్లో అంతులేని కడలి

– మరో సీత కథ

ఇలా జమిలిగా గాక విడిగా వేటూరి కృష్ణవేణి అందచందాలను వర్ణించిన సందర్భాలూ వున్నాయి. 'సత్యం' సంగీత నిర్వహణలో 'దశ తిరిగింది' చిత్రం కోసం రాసిన పాటలోని ఈ పంక్తుల్ని గమనించండి.

అందాల నా కృష్ణవేణి, శృంగార రసరాజధాని

వేటూరి 'గంగోత్రి'లో కృష్ణానదిని దేవతగా భావిస్తూ 'జీవన వాహిని' పాటలో ఇలా రాశారు.

కృష్ణమ్మకు చెప్పమ్మ కష్టం కలిగించవద్దని
యమునకు చెప్పమ్మ సాయమునకు వెనుకాడ వద్దని

సి.నా.రె. సినీ 'హనీ' గీతాలు

తెలంగాణలో పుట్టి కృష్ణవేణీ తీరంలో జరిగిన కథను 'నాగార్జున సాగరం' కావ్యంగా మలిచిన (ర)స హృదయులు

డా॥ సి. నారాయణరెడ్డి. ఆయన దృష్టిలో నది అంటేనే ఒక గతి, కమనీయ శ్రుతి, రమణీయ జతి. నది పేరు చెపితే అంతగా పరవశించే కవి గనుకనే -- 'విచిత్ర కుటుంబం' (1969) చిత్రంలో కథానాయిక అయిన రష్యారమణికి కథానాయకుడు ఆంధ్రదేశ పురావైభవాన్ని చూపడానికి తెలుగునాట ప్రవహించే జీవనదుల్లో జలకాలాడించే ఆమె – సన్నివేశాన్ని ప్రతిపాదించి తదనుగుణంగా–

ఆడవే జలకమ్ము లాడవే
కలహంసలాగ జలకన్యలాగ....

అనే అద్భుతమైన గేయాన్ని సమకూర్చారు.

ఆ పాట రెండో చరణంలో నాగార్జున కొండ (నంది కొండ) ఒడిలో జాలువారే కృష్ణవేణిని వర్ణించారు.

నాగార్జునుని బోధనలు ఫలించినచోట
బౌద్ధమత వృక్షమ్ము పల్లవించిన చోట
కృష్ణవేణీ తరంగిణి జాలిగుండెయే
సాగరమ్మైరూపు సవరించుకొను నీట
ఆడవే – జలకమ్ము లాడవే.

పై చరణంలో బౌద్ధమత వైభవానికి సాక్షీభూతమైన కృష్ణానది ప్రాచీన వైభవాన్నే గాక, నీరు లేక ఎండిపోతున్న పరిసరాలనుచూసి జాలిగుండె సాగర రూపంలో జాలువారిందని ఆ నది అంతరంగానికి చెందిన ఆర్ద్రతను కూడా కవి స్పృశించారు.

ఇక గోపీకృష్ణా మూవీస్ వారి కృష్ణవేణి (1974) చిత్రం కోసం సి.నా.రె. రాసిన --

కృష్ణవేణీ, తెలుగింటి విరిబోణీ
కృష్ణవేణీ, నా ఇంటి అలివేణి!

– అనే గీతం కృష్ణానది ప్రవహించినంత కాలం తెలుగునాట వినిపిస్తూనే ఉంటుంది.

ఈ చిత్రంలో కథానాయిక పేరు కృష్ణవేణి. వివాహానంతరం నాయికా నాయకులు శ్రీగిరి లోయల నుంచి హంసలదీవి వరకు కృష్ణాతీరంలో విహరిస్తూ ఆలపించే భావ బంధురమైన గీతం ఇది. దీనిలో ఆమె నదీపరమైన అందాలను చూస్తుంటే అతడు నాయకా పరమైన లావణ్యాలను చూడ్డం విశేషం.

ఆమె. **శ్రీగిరిలోయల సాగే జాడల**
విద్యుల్లతలు కోటి వికసింపజేసేవు
అతను– **లావణ్యలతవై నను చేరు వేళ**
శతకోటి చంద్రికలు వెలిగించు కృష్ణవేణీ
ఆమె– **నాగార్జునగిరి కౌగిటి ఆగి**
బీళ్లను బంగారు చేలుగా మార్చేవు
ఆంధ్రావనికే అన్నపూర్ణవై
కరువుల బాపేవు, బ్రతుకులు నిలిపేవు
అతను – **నా జీవనదివై ఎదలోన ఒదిగే**
పచ్చని వలపులు పండించు కృష్ణవేణి
ఆమె– **అమరావతి గుడి అడుగుల నడయాడి**
రాళ్లను అందాల రమణులుగ తీర్చేవు
అతను– **ఏ శిల్పరమణులు ఏ దివ్య లలనలు**
నోచని అందాలు దాచిన కృష్ణవేణీ.

ఇలా రమ్యంగా సాగిన ఈ యుగళ గీతంలో ఆమె స్వరంలో నదీమతల్లి స్వరూప స్వభావాలను కవి ఆవిష్కరించారు.

చిత్ర ప్రారంభంలో కృష్ణవేణీ ప్రశంసతో సి.నా.రె. ఒక శ్లోకాన్ని కూడా రచించారు.

హే జననీ కృష్ణవేణీ! భ్రాజిత తరంగ రాణీ
పంచపాతక హారిణీ! పరమ మంగళకారిణీ
దక్షిణే దివ్యవాహినీ – అక్షీణ భాగ్యప్రదాయినీ
శ్రీశైల మల్లికార్జున దివ్యచరణ సంసేవినీ
కనకదుర్గా భవ్య కరుణా కటాక్ష సంవర్ధినీ
కృష్ణవేణీ! కృష్ణవేణీ! మమప్రసీద! మమప్రసీద!

సి.నా.రె. 'సిసింద్రీ చిట్టిబాబు' (1971) చిత్రంలో ఉపాధ్యాయుడు బాలబాలికలను తెలుగు నేలలోని వివిధ చారిత్రక ప్రదేశాలను చూపించిన ఘట్టాన్ని --

బాలలారా రండి – భావి పౌరులారా రండి!
తర తరాల తెలుగునేల తీరూ తెన్నూ చూడండి!

అనే పాటగా మలుస్తూ, అందులో నాగార్జున సాగరాన్ని, అమరావతిని ఈవిధంగా వర్ణించారు.

కృష్ణవేణి తన గుండె పెంచుకొని
నిలిచెను సాగరమై నాగార్జున సాగరమై
అదే అదే అమరావతి – ఆ అమరావతిలో శిలలైనా

వినిపించును సరిగమలు – పులకించును హృదయాలు

పై పంక్తుల్లో నాగార్జున సాగరానికి చెందిన వర్ణన ఆ తర్వాత 'కృష్ణవేణి'లో కూడా పునరావృతమైంది.

ఆత్రేయనూ ఆకట్టుకొన్న అలివేణి

కృష్ణానది పేరు చెప్పగానే గుర్తొచ్చే మరో ప్రసిద్ధ గీతం 'బంగారు బొమ్మలు' (1977) చిత్రంకోసం ఆచార్య ఆత్రేయ కలం అందించిన –

నేనీ దరినీ నువ్వా దరినీ
కృష్ణమ్మ కలిపింది ఇద్దరినీ
మనమంటే తనకెంతో ముద్దని
కృష్ణమ్మ కలిపింది ఇద్దరినీ....

–అనే యుగళగీతం. ఇదే పాట ఈ పల్లవితోనే చిత్రం చివరిలో తిరిగి వినిపిస్తుంది. చరణాలు మారతాయి. ఎందుకంటే కలిసి నడవాల్సిన రెండు పడవలూ కసాయి గుండెల లోకం సృష్టించిన కలిమిలేముల సమరంలో అప్పటికి విడిపోతాయి. ఆత్రేయ బాణీలో సాగిన ఈ పాటను జగపతి ఆర్ట్స్‌వారు అంత అందంగానూ కృష్ణానదిపై చిత్రీకరించారు.

ఆత్రేయ అగ్గిరాముడు (1954)లోని--

'జై ఆంధ్ర జననీ విశాలాంధ్ర ధరణీ' అనే పాటలోను, దొరబాబు (1974) లోనని--

'చంద్రగిరి చంద్రమ్మా – సందెవేళ కొస్తానమ్మా' అనే పాటలోను నదుల జాబితాలో 'కృష్ణను' తలచారు.

వందే పార్వతీ పరమేశ్వరౌ

కృష్ణా పరిసర ప్రాంతాలలో చిత్రీకరించిన అనేక చిత్రాలలో బెజవాడ కనకదుర్గకు చెందిన స్తోత్ర గీతాలున్నాయి.

ముగ్గురమ్మలగన్న ముద్దుల మాయమ్మ
కరుణించు మమ్మేలు కనకదుర్గమ్మ
మధుర మీనాక్షమ్మ, కంచి కామాక్షమ్మ

– అనురాగ దేవత

బెజవాడ కొండెక్కి కూచున్న తల్లోయ్

– నా మొగుడు నాకే సొంతం

మహా కనక దుర్గ, విజయ కనకదుర్గ
పరాశక్తి లలితా శివానంద చరితా
శివశంకరి, శుభంకరి, పూర్ణ చంద్ర కళాధరి...

– దేవుళ్లు (జొన్నవిత్తుల)

వంటి పాటలు పై కోవకు ఉదాహరణలు.

అటు అమరావతిలోను ఇటు శ్రీశైలంలోనూ కృష్ణా తరంగిణీ నిర్నిద్ర గానాలతో పులకించేదీ, కృష్ణా శైలినీ శూలూషీలాస్యాలను తిలకించేదీ – ఆ శివయ్యే! 'అమరావతి'లో అమరా రామలింగేశ్వరుని దేవాలయ నేపథ్యంలో 'దేవాలయం' చిత్రంలో అధిక శాతాన్ని చిత్రీకరింపగా, శ్రీశైల మల్లికార్జున స్వామిని స్తుతిస్తూ ఎన్నో చిత్రాలలో పాటలను రాయించారు.

శ్రీశైల మల్లన్న శిరసొంచేనా
చేనంత గంగమ్మ వాన – దేవులపల్లి

'ఉండమ్మా – బొట్టు పెడతా'

శ్రీశైల మల్లయ్యా – దైవమే నీవయ్యా
శ్రీభ్రమరాంబతో వెలసిన జంగమయ్యా

కొసరాజు 'కృష్ణవేణి'

వంటివి మల్లికార్జునుని అర్చించిన మల్లికలే!

కృష్ణా తీరం లలితకళలకు కొలువు. అది విహారాలకూ వినోదాలకే కాదు – సంచలనాలకూ నెలవు. అవలోకించగలిగే నయనాలకు, ఆస్వాదించగలిగే హృదయాలకు అక్కడి ప్రకృతి ఒక రమణీయ కృతి. ఆ ప్రకృతి సౌందర్యానికి పరవశించిన ఎందరో చలనచిత్ర దర్శకులు, ననిర్మాతలు తమ చిత్రాలను కృష్ణా పరిసర ప్రాంతాలలో చిత్రీకరించారు. అటువంటి చిత్రాలకు ఉదాహరణలుగా 'దేవుడు చేసిన మనుషులు' 'అనురాగ దేవత', 'అప్పుల అప్పారావు', 'ఆనందభైరవి', 'బాబాయ్ హోటల్', 'స్టూడెంట్ నెం. 1', 'దేవుళ్లు', 'లక్ష్మీనరసింహా' వంటి ఎన్నో చిత్రాలను ఉటంకించవచ్చు. 'లాఠీ', 'చైతన్యరథం' వంటి విప్లవాత్మక చిత్రాలు, రాష్ట్ర రాజకీయాల్లో మార్పుకు సంకేతాలిచ్చిన 'ఎన్టీఆర్' 'కృష్ణ' కథా నాయకులుగా వచ్చిన 'ఈనాడు', 'నాదేశం', చిత్రాలు విజయవాడ నగరంలోని వివిధ ప్రాంతాలలో చిత్రీకరించినరవే. చెన్నై, హైదరాబాద్‌ల తర్వాత – శతదినోత్సవాలకు, విజయోత్సవాలకు కూడా చిత్ర పరిశ్రమ విజయవాడను ఎంచుకుంటోంది. కృష్ణాతీరం ఒక రమణీయ మణిహారం. ఎన్ని వెండితెర నౌకలు విహరించినా తనివితీరని అక్కడి ప్రకృతి సంపద అపారం. కృష్ణవేణి తెలుగు వెలుగులు మూర్తీభవించిన అలివేణి, తన తళుకులతో వెండితెరను వెలిగిస్తున్న సినీ రాజధానికి మహారాణి! ❖

కృష్ణమ్మకు సాగబులు - బెజవాడ గుళ్ళు

- ధారా సుబ్రహ్మణ్యం

ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లాలో విజయవాడ మహానగరం ఎంతో ప్రాధాన్యతను సంతరించుకొంది. జిల్లాకు ప్రధాన కేంద్రం కానప్పటికీ, భౌగోళిక పరిస్థితులు మరియు ప్రముఖ రైల్వేకూడలి కారణంగా కేవలం ఆంధ్రప్రదేశ్‌లోనే కాక భారతదేశంలోనే ప్రఖ్యాతమైన వ్యాపారకేంద్రంగాను, పవిత్ర కృష్ణా నదీతీరాన వెలయటం మూలాన పవిత్ర తీర్థక్షేత్రంగాను ఈ విజయవాడ పట్టణం ఖ్యాతి గడించింది. దీనికి బెజవాడ, విజయవాటిక, విజయపురి అనే ప్రసిద్ధమైన పేర్లుకూడా ఉన్నాయి.

చరిత్రపరంగా చూస్తే ఆంధ్ర సంస్కృతికి విజయవాడ ప్రధాన కేంద్రంగా తెలియుచున్నది. ఒకప్పుడు ఈ పట్టణాన్ని కళ్యాణి చాళుక్యులు పరిపాలించారు. ప్రసిద్ధుడైన చైనాయాత్రికుడు "హ్యూన్‌త్సాంగ్" క్రీ.శ. 639లో బౌద్ధమతం పరమోచ్ఛదశలో ఉన్న రోజులలో ఈ ప్రాంతాన్ని సందర్శించాడు.

ప్రతిరోజూ అనేక ప్రాంతాలనుండి ప్రజలు తమ నిత్యావసరాలకోసం ఈ మహానగరానికి విచ్చేస్తుంటారు. అంతేకాదు పవిత్ర పుణ్య నదీమతల్లి అయిన కృష్ణవేణీ తీరంలో వెలసిన ఈ పట్టణం నిరంతరం జనప్రవాహంతో కూడి ఉంటుంది. అడుగడుగున గుడి ఉంది అన్నట్లుగా ఈ మహానగరం అనేక ఆలయాలతో నిండివుండి నిత్యమూ భక్తజనులతో కళకళలాడుతూ వుంటుంది. ప్రస్తుతం నగరంలో సుమారుగా అరవై ప్రముఖ దేవాలయాలు ఉన్నాయి. వీటిలో కొన్ని ఆంధ్రప్రదేశ్ దేవాదాయశాఖ పర్యవేక్షణలోనూ, మరికొన్ని స్థానికులైన ప్రముఖ వ్యక్తుల ఆధ్వర్యంలో వున్నవి. ఈ ఆలయాలలో ఆయా దేవతలకు పూజలు, సేవలు, నైవేద్యాలు, జరగడమే కాక, ధార్మిక గోష్ఠులు, సంగీత, నృత్య, గోష్ఠులు, హరికథలు, భజనలు, ఊరేగింపులు వంటి ధర్మప్రచార కార్యక్రమాల ద్వారా ప్రజలలో ఆధ్యాత్మిక చైతన్యం పెంపొందింప బడుతుంది. వీటితోపాటుగా ఇంచుమించుగా అన్ని ఆలయాలలో భక్తులకు అన్నదానం ఒక పవిత్రకార్యంగా నిర్వహింపబడుతూ అన్నదాన కార్యం యొక్క గొప్పదనాన్ని చాటడంలో విజయవాడ ఒక విశిష్ట స్థానాన్ని పొందిందనడంలో అతిశయోక్తి ఏమాత్రం లేదు. బెజవాడ నగరంలో నెలకొని వున్న ఆలయాలలో కొన్ని స్వయం వ్యక్తక్షేత్రాలు, మరికొన్ని ఋషి ప్రతిష్ఠితాలు, ఇంకొన్ని మానవ ప్రతిష్ఠితాలు. వీటిలో కొన్ని పురాణ ప్రసిద్ధాలైనవి వుండటమే కాక, చారిత్రక ప్రాధాన్యాన్ని కూడా సంతరించుకొన్నవి. భక్తజనుల తితిదే 'కృష్ణవేణీ తరంగాల' నుండి కోరిన కోర్కెలు తీరుస్తున్నఈ ఆలయాలు ఆధ్యాత్మిక జగత్తులో విజయవాడ నగరానికి విశేష స్థానాన్ని సంపాదించి పెట్టాయి. శ్రీ వినాయకుడు, కనకదుర్గ, శివుడు, విష్ణువు, సత్యనారాయణ స్వామి, కోదండరామస్వామి, ఆంజనేయ స్వామి, సాయిబాబా, అయ్యప్ప, లక్ష్మీనరసింహస్వామి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, మహాకాళి, మహాసరస్వతి, మహాలక్ష్మి మొదలగు దేవతల ఆలయాలు వివిధ ప్రాంతాలలో నిర్మించబడినాయి.

శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి ఆలయం

ఇంద్రకీలాద్రి పర్వతంపై స్వయంభువుగా వెలసిన శ్రీ కనకదుర్గ అమ్మవారు పురాణప్రసిద్ధినే కాక, ఐతిహాసిక ప్రాముఖ్యతను సంతరించుకొని, శాంతమూర్తియై భక్తుల కోర్కెలను నెరవేర్చుచున్నది. భక్తుల సౌకర్యార్థం దేవస్థానం అనేక కార్యక్రమాలు చేపట్టింది. 1946లో ధర్మకర్తల మండలివారిచే దాతల సహకారంతో దుర్గగుడిమెట్ల మార్గం నిర్మించబడింది. ఈ మెట్ల మార్గాన్ని, మెట్లని భక్తులు ఎంతో పవిత్రంగా భావిస్తారు. మెట్లపూజ చేసుకుంటూ భక్తులు కొండపైకి చేరి అమ్మవారిని, స్వామివారిని దర్శించుకుంటారు. బాగా శిథిలమైన మెట్లని ఈ మధ్యనే దేవస్థానంవారు గ్రానైట్ రాళ్ళతో పూర్తిగా పునర్నిర్మించారు. రైల్వేస్టేషన్, బస్టాండ్ మరియు పట్టణములోని వివిధ ప్రాంతాలనుండి కొండమీదకు బస్సులను నడుపుచున్నారు. చీర, రవిక, పసుపు, కుంకుమ, గాజులు కానుకలుగా, మొక్కుబడులుగా



సమర్పించుకుంటూ భక్తులు అమ్మవారి అనుగ్రహానికి పాత్రులగుచున్నారు. ఇటీవల కాలంలో ప్రారంభించబడిన "భవానీదీక్ష" అత్యంత ప్రాచుర్యం పొంది, భక్తులను సన్మార్గంలో నడిపించుచున్నది. దేవీ నవరాత్రులలో ప్రతిరోజూ అమ్మవారికి విశేష అలంకరణలు వుంటాయి. చివరిరోజున పోలీసుశాఖవారిచే ఆయుధపూజ వైభవంగా మరియు కృష్ణానదిలో శ్రీకనకదుర్గ అమ్మవారి హంస వాహనంపై నౌకా విహారం నయనానందకరంగా వుంటుంది.

శ్రీ విజయేశ్వరస్వామి ఆలయం

ఇంద్రకీలాద్రిపై శ్రీ కనకదుర్గాదేవి ఆలయానికి దిగువన ఉన్న పురాతన ఆలయం. 1962లో ఈ ఆలయాన్ని జీర్ణోద్ధరణ గావించి త్రిపీఠ, ధ్వజస్తంభం, ముఖమండపం మొదలగునవి నిర్మించారు.

శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వారి దేవస్థానం (పాతశివాలయం)

పురాతన చరిత్ర కలిగిన ఈ దేవాలయం పాతబస్తీలో ఉన్నది. ఈ దేవాలయంలో శ్రీస్వామివారిని ద్వాపరయుగంలో యుధిష్ఠిరుని (ధర్మరాజు)చే ప్రతిష్ఠింపబడినదిగా చెప్పబడుచున్నది. 10వ శతాబ్దంలో చాళుక్య చక్రవర్తి శ్రీ త్రిభువన మల్ల చక్రవర్తి ఆఈ ఆలయాన్ని నిర్మించినట్లుగా చరిత్ర తెలుపుచున్నశ్రీని. శ్రీస్వామివారిని దర్శించి, సేవించినచో సర్వపాపాలు పోయి శుభాలు కలుగుతాయని ప్రసిద్ధి. ఈ దేవాలయంలోపలి భాగమందు శ్రీ వీరాంజనేయస్వామి, శ్రీ వీరభద్రస్వామి, శ్రీ విఘ్నేశ్వరస్వామి, శ్రీ కోటేశ్వరస్వామివారి దేవాలయాలు కూడ నిర్మించబడినవి.

శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం

పాతబస్తీలోని బ్రాహ్మణవీధిలోనున్న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం భక్తులను అలరిస్తున్నది. శాసనాల ఆధారంగా దాదాపు ఎనిమిది వందల సంవత్సరాల పూర్వం శ్రీ స్వామివారి ప్రతిష్ఠ జరిగినట్లు తెలియుచున్నది. ఈ ఆలయంలో పాంచరాత్ర ఆగమశాస్త్రం ప్రకారంగా పూజాదులు నిర్వహింపబడుచున్నవి. అహోబిల పీఠాధిపతి వారు ఈ ఆలయాన్ని తరచుగా సందర్శిస్తూ ఉంటారు.

శ్రీ త్రిశక్తి పీఠము

ఆర్.టి.సి. బస్టాండు దగ్గర కృష్ణలంకలోని కాళీనగర్‌లో ఈ ఆలయం ఉంది. శ్రీ మహాకాళి, శ్రీమహాలక్ష్మి, శ్రీ మహాసరస్వతి స్వరూపిణుల నిలయం. ఇక్కడి దేవతామూర్తులకు పూజలు, కైంకర్యాలు జరుగుచున్నవి. పండుగలు, పర్వదినాలలో ఈ క్షేత్రం భక్తుల సందడితో కోలాహలంగా వుంటుంది.

శ్రీకోదండరామ శ్రీ దాసాంజనేయ స్వామివార్ల దేవస్థానం

పూర్ణానందం పేటలో రైల్వేస్టేషను (తూర్పు)కు దగ్గరలో ఈ దేవాలయం వుంది. 1967వ సం॥లో శ్రీదాసాంజనేయ స్వామివారి ప్రతిష్ఠ చేయబడింది. పిదప 1981లో శ్రీసీతాలక్ష్మణ సమేత కోదండరామస్వామివార్ల ప్రతిష్ఠ జరిగింది. తరువాత 1983లో శ్రీబాలసుబ్రహ్మణ్యస్వామి, నవగ్రహ ప్రతిష్ఠ జరిగింది. 1988లో శ్రీ వేంకటేశ్వరస్వామివారి ప్రతిష్ఠ జరిగింది. తదుపరి మూడు సంవత్సరాలకు రాజగోపుర నిర్మాణం, శ్రీపద్మావతీ అమ్మవారి ప్రతిష్ఠ జరిగింది.

ఈ ఆలయం పంచాయయతన ఆలయం, వైఖానస, పాంచరాత్ర, శైవాగమములతో ప్రధాన ఆచార్యులు శ్రీ రాఘవ (శ్రీనివాసన్)గారి పర్యవేక్షణలో పూజా కార్యక్రమాలు నిర్వహింపబడుచున్నవి. ప్రతినెలా శ్రవణా నక్షత్రం రోజు ఉదయం అభిషేకం, సాయంత్రం కల్యాణోత్సవం శ్రీవేంకటేశ్వరస్వామి, పద్మావతీ అమ్మవార్లకు జరుపబడుచున్నవి. ఈవిధంగానే మిగతా దేవతలకు వారి వారి జన్మనక్షత్రాలకు, పర్వదినాలలో శాస్త్రోక్తంగా పూజలు చేయబడుచున్నవి.

శివరామకృష్ణ క్షేత్రం

సత్యనారాయనపురం రైల్వేస్టేషన్ సమీపంలో వున్న ఈ క్షేత్రంలో శ్రీవేంకటేశ్వరస్వామి, శ్రీఆంజనేయస్వామి, శివాలయం, నవగ్రహ మండపం వున్నాయి. ఇక్కడ ధార్మిక కార్యక్రమాలు నిత్యం భక్తజనరంజకంగా జరుగుతుంటాయి.

శ్రీదాసాంజనేయస్వామి ఆలయం

మాచవరంలో ప్రసిద్ధి చెందిన శ్రీ ఆంజనేయస్వామి స్వయంబువు.



మహిమాన్వితుడు. దేవాదాయ ధర్మాదాయ శాఖ పర్యవేక్షణలో ఈ ఆలయం నిర్వహించబడుచున్నది. భక్తజనులకు అభయవరప్రదాత. దీనికి సమీపంలో శ్రీసత్యనారాయణస్వామి ఆలయం వున్నది.

శ్రీవేంకటేశ్వర స్వామివారి ఆలయం

లబ్బీపేటలోని ఈ ఆలయం శ్రీకంచికామకోటి పీఠంవారి ఆధ్వర్యంలో నడుపబడుచున్నది. ఇక్కడ స్వామి మహిమ గలవాడు. శరణాగత భక్తజన పాలకుడు. వైఖానస సంప్రదాయం ప్రకారం ఇక్కడ పూజలు నిర్వహించబడుచున్నవి.

శ్రీ మరకత రాజరాజేశ్వరి ఆలయం

పటమటలోని శ్రీగణపతి సచ్చిదానందస్వామివారి ఆశ్రమంలో వెలసిన శ్రీరాజరాజేశ్వరీ ఆలయం. అమ్మవారు మరకతశిలలో విరాజిల్లి దేదీప్యమ ఆనంగా శోభిల్లుచున్నారు. మరకతం శ్యామవర్ణంలో వుంటుంది. అమ్మవారి రంగు కూడా అదే. అందుకనే భక్తకాళిదాసు అమ్మవారిని 'మరకతశ్యామా' అని స్తోత్రం చేస్తాడు. మరకతశిలకు మహిమ చాలా ఉంది. ఈ రాజరాజేశ్వరీదేవి భక్తుల సర్వాభీష్టాలను నెరవేరుస్తుంది.

ఇతర ఆలయాలు

పాతబస్తీలోని శ్రీవసంత మల్లికార్జునస్వామి ఆలయం ప్రాచీనమైనది. కొత్త గుళ్లుగా వ్యవహరించబడే శ్రీకోదండరామస్వామి, శ్రీనగరేశ్వరస్వామి, కొత్తపేటలో శ్రీవేణుగోపాలస్వామి, శ్రీ పాండురంగస్వామి, మహాలక్ష్మి, శ్రీపంచముఖ ఆంజనేయస్వామి ఆలయాలు ప్రసిద్ధి చెందినవి. గంగానమ్మఅమ్మవారి ఆలయం, కొండపైన శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, శ్రీదర్భేశ్వరస్వామి ఆలయాలు వున్నవి. గవర్నరుపేటలో కౌతావారి శివాలయం, దేవల్రాజుగారు కట్టించిన రామాలయం ఉన్నాయి. కృష్ణలంకలో రామాలయం, శివాలయం గలవు. హనుమాన్ పేటలో శంకరమఠం సమీపంలో శివాలయం ఉన్నది. ఏలూరు రోడ్డులో రామమందిరం వద్ద రామాలయం గలదు. గాంధీనగర్‌లో సత్యనారాయణస్వామి ఆలయం, సత్యనారాయణపురంలో శివాలయం, దుర్గాపురంలో శివాలయం, రామాలయం వున్నవి.

అన్ని దేవాలయాలలో భక్తులు అత్యంత భక్తిప్రపత్తులతో పూజాదులు నిర్వహిస్తున్నారు. అనేకమంది దాతలు, ఉదారవదాన్యులు ఈ ఆలయాల నిర్మాణాలకు, అభివృద్ధికి, పూజాది కార్యక్రమాలకు భూరివిరాళాలు అందించారు. ఇదిగాక ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దేవాదాయ ధర్మాదాయశాఖవారి అధీనంలోని ఆలయాలకు కార్యనిర్వహణాధికారులను నియమించి, పర్యవేక్షిస్తున్నది.

సమాజంలో శాంతిని నెలకొల్పడంలో దేవాలయాలు అత్యంత ప్రాధాన్యాన్ని పొందాయి. అంతేకాదు అన్ని వర్గాల ప్రజలు తమ తమ సంప్రదాయాల ననుసరించి దేవాలయాల్లో పూజా కార్యక్రమాల్లో పాల్గొనే వీలుంటుంది. మంచి నడవడిక, క్రమశిక్షణను పొంది తమ తమ జీవితాలను తీర్చిదిద్దుకొనే అవకాశం కలుగుతుంది. భక్తులు కూడ ఆలయాలు, క్షేత్రాలు సందర్శించినపుడు హిందూ సంప్రదాయ ప్రకారం పవిత్రతను కాపాడుకొనుటకు కొన్ని నియమాలను తప్పక పాటించవలసి వుంటుంది.

అందువలన ఇటువంటి పవిత్ర కార్యక్రమాలలో పాల్గొనేటప్పుడు భక్తులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. సమాజశ్రేయస్సు, లోకశాంతి కొరకు స్వార్థబుద్ధి, వ్యాపారాత్మక ధోరణిని విడనాడి, భగవంతుని శరణువేడి, ఆయన అనుగ్రహంతో సర్వాభీష్టాలు నెరవేర్చుకొనగలరు. అట్లు గానిచో మానవుని జీవితం అశాంతికి నిలయమవుతుంది. తద్వారా సంఘంలో అలజడులు, విపరీత ధోరణులు నెలకొంటాయి. ఇవి మానవ, సమాజాభ్యుదయానికి శ్రేయస్కరం కావు.

కనుక మానవులందరూ సానుకూలతతో మెలగి, వివిధ సంప్రదాయాలను సమన్వయపరచుకొని, తమతమ ఆరాధ్యదేవతల అనుగ్రహంతో ఎల్లప్పుడూ సుఖశాంతులు పొందుదురుగాక. ❖



పుణ్యప్రదం పుష్కరకాలం

- ఎ.వి. వరదదేశికులు

భారతదేశం వేదభూమి, ధర్మభూమి మరియు కర్మభూమి. ప్రపంచంలో ఉన్న అన్ని దేశాలలో 'ఏకత్వంలో భిన్నత్వం – భిన్నత్వంలో ఏకత్వం' అనే ప్రకృష్ట సూత్రాధారంగా హైందవ తేజంతో విలసిల్లుచున్న దేశమిది. ఇలాంటి దేశంలో ఒక్కసారి పుట్టినా చాలు. జన్మ ధన్యమని తలచే స్థాయిలో పరిఢవిల్లుచున్న దేశం మనది.

'జన్మానాం నరజన్మ దుర్లభం' – జన్మలలో నరజన్మ పొందడం చాలా కష్టమని పెద్దలు చెబుతుంటారు. ఎన్నో జన్మల అదృష్టం వలన వేల జన్మలలో నొకసారి మానవజన్మ లభిస్తుందని పురాణాలు చెబుతున్నాయి. ధర్మనిష్ఠతో, సత్యనిష్ఠతో సకల దేవతారాధనలను సశాస్త్రీయంగా ఆచరిస్తూ ఋషుల వాక్కులను మహాపురుషుల వాక్కులను తు.చ. తప్పక పాటిస్తూ భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను ఆచరిస్తూ ప్రపంచ ప్రజలకు నాగరికతా దిక్సూచిగా నిలుస్తున్న భారతదేశ యశో విభవం బహు శ్లాఘనీయము. ఇలాంటి సంస్కృతీ సంప్రదాయాలను తరువాతి తరాలకు అందజేయవలసిన బాధ్యత మనందరి భుజస్కంధాలపై యున్నది.

తరతరాలనుండి వారసత్వంగా ధార్మిక జీవనం చేస్తూ వస్తున్న మనకు ప్రతీ పన్నెండు సంవత్సరాలకొకసారి వచ్చేస్తున్న కృష్ణా పుష్కరాలు యీసారి గూడా పునరుత్తేజితులను చేస్తుంది. భారతీయ మహర్షులు జలశక్తిని (పంచభూతాలలో నొకటి, ప్రపంచాన్ని శాసిస్తున్న శక్తులలో నొకటి) గుర్తించి ఒక్కొక్క సమయములో ఒక్కొక్క స్థలములో వాటి విశేషాలను తెలిసికొని మానవులు అవలంబించవలసిన యోగ్య జీవన విధానాలను, భారతీయ సంస్కృతీ సంప్రదాయాలనూ, విధులనూ ప్రబోధించారు. ధర్మాచరణము వలన మిగతా సమయాల్లో సిద్ధించే ప్రయోజనము కన్నా విశిష్ట సమయాలలో మిక్కిలి ప్రయోజనాలు కలుగుతాయి. మనం చేసే స్నానం, దానం, దేవతార్చన మొలైన నిత్యకర్మలు పుష్కరాల వంటి పర్వకాలాలలో వందల రెట్ల ఫలితాన్నివ్వగలుగుతాయి.

జలమునకు పుష్కరములని పేరున్నది. "పోషయతీతి" – పోషించేది పుష్కరమని యర్థము. పుష్కరమునకున్న నానార్థాలలో ప్రస్తుతమునకు పన్నెండు సంవత్సరాల కాలమనియు మరియు పవిత్రమైనదనియు అర్థములు వ్యాప్తిలో నున్నవని గ్రహించవలయును. ఈ విజ్ఞానానికొక ఆసక్తికరమైన కథను మన పూర్వీకులైన పెద్దలు చెప్పడం జరిగింది.

పూర్వము తుందిలుడనే ధర్మనిష్ఠుడైన మహర్షి యుండేవాడు. అతడు పరమేశ్వరుని గూర్చి కఠిన తపస్సు చేసి ఆ పరమేశ్వరుని ప్రసన్నుని చేసికొని మెప్పించి శాశ్వతంగా పరమేశ్వరునిలోనే తాను నివసించేటట్లు వరం పొందాడు. పరమేశ్వరుడు తన అష్టమూర్తులలో ఒకటైన జలరూపములో తుందిలుడు నివసించేటట్లు శాశ్వతస్థానమనుగ్రహించాడు. మూడున్నర కోట్ల పుణ్యతీర్థాలకు ఆదికారణుడగు జలసామ్రాజ్యానికి సార్వభౌముడు గాను కూడా ఆతుందిలుడు పుష్కరుడా వరాలు పొందాడు. కాలగమనంలో చతుర్ముఖ బ్రహ్మకు జగత్సృష్టి చేయుట కొరకు జలమవసరమైనది. పరమేశ్వరుని గూర్చి తపస్సు చేసి పుష్కరుడు తన కమండలములో నివాసముండేటట్లు వరాన్ని పొందాడు బ్రహ్మ. ఆ తరువాత బృహస్పతికి ప్రాణులను బ్రతికించే ధర్మానుష్ఠానము నాచరించుటకు జలమవసరమై బ్రహ్మను గూర్చి తపస్సు చేసి ప్రసన్నుని చేసికొని జీవనాధారుడైన పుష్కరుని తన అధీనంలో నుంచవలసిందిగా ప్రార్థించాడు. విధాతను విడిచి వెళ్ళడానికి పుష్కరుడు ససేమిరా యిష్టపడక బ్రహ్మను కూడా తనతో ఉండాలని కోరగా బ్రహ్మ ఉభయతారకంగా ఒక ఒప్పందాన్ని కుదిర్చాడు. దాని ప్రకారము గ్రహస్వరూపుడైన బృహస్పతి ఒక రాశిలో ప్రవేశించినపుడు మొదటి పన్నెండు రోజులు (వీటినే ఆది పుష్కరాలు అంటారు); చివరి పన్నెండు రోజులు (వీటినే అంత్యపుష్కరాలు అంటారు; మరియు మిగతా రోజులలో (వీటినే మధ్యపుష్కరాలు అంటారు) మధ్యాహ్నము వేళ నాలుగు ఘడియలు మాత్రమే పుష్కరుడు బృహస్పతి అధీనంలో ఉండి ఆ సమయంలో సకల దేవగణాలతో బ్రహ్మ పుష్కరుణ్ణి అనుసరించాలన్నది ఒప్పంద సారాంశము. బృహస్పతి మేషాది



రాశులలో ఒక్కొక్క రాశిలో ఒక సంవత్సర కాలం పాటుంటాడు. ఈ ఒప్పందం ప్రకారం పుష్కరకాలాల్లో మూడున్నర కోట్ల పుణ్యతీర్థములు పుష్కరుడు బ్రహ్మ మొదలైన దేవతలందరితో ఆయా నదులలో బృహస్పతితో కలిసి నివసించుటచేత ఆయా నదులలో ఆయా సమయాలలో చెప్పలేనంత ప్రభావముంటుంది. అందుకే అప్పుడాచరించిన స్నాన తర్పణాది కర్మలన్నింటికీ మనకెంతో పుణ్యం లభిస్తుంది.

శ్లో॥ మేషే గంగా వృషే రేవా మిథునే చ సరస్వతీ ।
కర్కటే యమునా ప్రోక్తా సింహే గోదావరీ స్మృతా ॥
కన్యాయాం కృష్ణవేణీ చ కావేరీ ఘటకే స్మృతా ।
వృశ్చికే తామ్రపర్ణీ చ చాపే పుష్కర వాహినీ ॥
మకరే తుంగభద్రా చ కుంభే సింధూనదీ స్మృతా ॥
మీనే ప్రణీతా చ నదీ గురోస్సంక్రమణే స్మృతా ।
పుష్కరాఖ్యో మునీనాం హి ప్రదేశోఽత్ర బుధైః స్మృతం॥

అనే శ్లోకముల ప్రమాణం ప్రకారం బృహస్పతి పుష్కరునితో కలిసి మేషరాశిని ప్రవేశించినపుడు గంగానదికి పుష్కరాలు; వృషభరాశిలో నర్మదానదికి; మిథునరాశిలో సరస్వతీ నదికి; కర్కాటక రాశిలో యమునానదికి; సింహరాశిలో గోదావరీ నదికి; కన్యారాశిలో కృష్ణానదికి; తులారాశిలో కావేరీ నదికి, వృశ్చిక రాశిలో భీమరథీ నదికి; ధనూరాశిలో వాహినీ నదికి (బ్రహ్మపుత్ర); మకర రాశిలో తుంగభద్రా నదికి; కుంభరాశిలో సింధూనదికి; మీనరాశిలో ప్రణీతానదికి పుష్కరాలు సంభవిస్తాయి. ఈ నదులలో పుష్కర పర్వము సంక్రమణానుసారము ఒక సంవత్సర కాలముంటుంది. పై నదులకు ప్రతి పన్నెండు సంవత్సరాలకొకసారి పుష్కరాలు సంభవిస్తాయి.

ఈ సంవత్సరము శ్రీదుర్ముఖి శ్రావణ శుద్ధ అష్టమీలు గురువారం తేది: 11.08.2016 రోజున రా.గం. 9.28 ని.లకు బృహస్పతి కన్యారాశి సంక్రమణము కారణంగా సార్ధత్రికోటి సహిత కృష్ణానదీ పుష్కర పర్వప్రవేశమున కృష్ణా పుష్కరాలు ప్రారంభమగును. (11.08.2016న బృహస్పతి కన్యారాశిలో రాత్రి కాలమందు ప్రవేశిస్తుండడంతో తేది: 12.08.2016 శుక్రవారము అరుణోదయ వేళనుండి పుణ్యపుష్కర స్నానాదులు ప్రారంభమగునని గమనించ గలరు)



బ్రహ్మ పురాణము ననుసరించి నదులు, దైవ, ఆర్ష, మానవ మరియు ఆసుర భేదంచేనాలుగు రకాలుగా చెబుతారు. త్రిమూర్తులచేత ప్రవర్తింప జేయబడేవి మొదటి రకానికి చెందుతాయి. అలా మొదటి తరగతికి చెందిన గంగా, గోదావరీ, మొదలగు నదులతో కృష్ణవేణీ నది గూడా పరిగణించబడినది. ఇంతటి ప్రభావము గలిగిన కృష్ణవేణీ పుష్కర స్నానమాచరించుట వలన ఎంత పుణ్యములభిస్తుందో చెప్పనక్కరలేదు. ఈ పుష్కరాల సమయంలో కృష్ణానదిలో స్నానాదులు అందరూ ఆచరించి తరించిపోవచ్చు.

కృష్ణానది భారతదేశంలోని మహారాష్ట్ర రాష్ట్రంలో సహ్యాద్రి పర్వతములలో ప్రభవించి వేదగిరి వద్ద వేణీయనబడే ఉపనదితో కలిసి కృష్ణవేణీ నదిగా యినుమడించిన ప్రాశస్త్యంతో పరమ పవిత్ర నదీమతల్లిగా ముందుకు సాగుతూ మహారాష్ట్ర, కర్ణాటక మరియు ఉభయ తెలుగు రాష్ట్రాలలో ఉరవళ్ళ పరవళ్ళతో ప్రవహిస్తూ సుమారు 800 మైళ్ళ సుదీర్ఘ యాత్రలో అనేక ఉపనదులను (వేణి, కకుద్మతి (కొయ్నా), సావిత్రి, గాయత్రి, వర్ల, పంచగంగ, భీమ, తుంగ, భద్ర, మూసీ మొదలైనవి) తనలో కలుపుకొని చివరకు బంగాళాఖాతంలో కలుస్తుంది. అత్యంత కోలాహలంగా ప్రవహించే యీ నదీతీరంలో అనేక ప్రసిద్ధ దేవాలయాలు పుణ్యక్షేత్రాలు (శ్రీశైలం, నాగార్జునకొండ, విజయవాడ, అమరావతి మొదలైనవి) విలసిల్లుతున్నవి.

పుష్కర సమయంలో ప్రాతఃకాల స్నానము ఉత్తమమైందని, మధ్యాహ్న స్నానం మధ్యమమని మరియు అపరాహ్ణ స్నానము అధమమైందని శాస్త్రాలు చెబుతున్నాయి. అవకాశమున్న వారు పుష్కర విధులాచరించడానికి ముందు రోజు రెండు పూటలో ఒక్కపూట ఉపవాసం చేసి మరుసటి రోజు శిరోముండనం చేయించుకొని స్నాన, దాన, శ్రాద్ధ, తర్పణాదులను ఆచరించడము ఉత్తమమని మహనీయులు తెలిపినారు.

మానవుడు పుడుతూనే దేవ–ఋషి – పితృ ఋణములను మూడు ఋణాలతో పుడతాడు. ఈ మూడు ఋణాలను ఒక్కొక్క పర్వకాలంలో తానాచరిస్తున్న కొన్ని కొన్ని కర్మల ద్వారా ఒక్కొక్క ఋణం తీరిపోయి ఋణవిముక్తుడగుచున్నాడు. అతడు ఋణవిముక్తుడగుచున్న కొలది



అతడి ఆత్మ మోక్షం పొందడానికి అర్హతను సంపాదిస్తుంది. అందుకే ప్రతి మానవుడు పర్వకాలాలను చక్కగా ఉపయోగించుకోవాలని ఋషుల వాక్కులుగా శాస్త్రాలు ఉపదేశిస్తున్నాయి. పుష్కర సమయాల్లో దేవతలు, ఋషులు, పితరులు వస్తారన్న ప్రమాణ వాక్యమున్నది. కావున పుష్కర కాలములో పైతృక కర్మలను అనుష్ఠించి పితృణమును తీర్చుకోవాలన్నది ప్రశస్తమైన ఋషివాక్కు. ఈ తీర్థ శ్రాద్ధ పుణ్యవిధికి తల్లిదండ్రులు లేనివారే అర్హులు. మిగతావారు స్నాన అర్హ్యాదులొనరించవలయును. తీర్థశ్రాద్ధమును పుష్కరాల తొలి పన్నెండు రోజులలో తొమ్మిదవ రోజు జరుపుకోవడం మంచిది. అలా వీలుకాకపోతే పితృదేవతల మృత తిథినాడు లేక పన్నెండు రోజులలో ఏదో ఒకరోజు తీర్థశ్రాద్ధము నాచరించవచ్చు. ఈ శ్రాద్ధకర్మ పితరుల ప్రేతత్వ విముక్తికి పుణ్యలోక ప్రాప్తికి మాత్రమే కాకుండా బ్రతికియున్న సంతతికి ప్రత్యవాయము లేకుండా చేయడానికి, వంశం వర్ధిల్లడానికి, మంచిని కలుగజేయడానికి సాధనమవుతుంది. పుష్కరకాలంలో చేయబడే యీ తీర్థశ్రాద్ధంలో మాతృవర్గ పితృవర్గాలకే కాకుండా, మాతామమి మాతామహ వర్గత్రయానికి, భ్రాతృ-పితృవ్యభగినీ - భావుక - శ్వశుర - స్యాలక, గురు-రిక్థి మొదలగు వారికి మరణించిన తన సంబంధులదరికీ పిండప్రదానం చేయాలి. అంతేగాక తనకుపకారం చేసినవారు, మిత్రులు, ఆశ్రితులు, సేవకులు, అనేక కారణాల వలన దుర్మరణం చెందినవారు, మరణానంతరం అంత్యకర్మ లోపించినవారు, దారాపుత్రులు లేనివారు, కర్మభ్రష్టులు, జాతిభ్రష్టులు, బ్రహ్మ హత్యాది మహాపాపాలు చేసినవారు ఎవరైనా వుంటే వారందరికి సద్గతులు కలుగడానికి ధర్మపిండ ప్రదానము నాచరించవచ్చు. వీటివలన ఆచరించినవారికి పితృదేవతల ఆశీస్సులు లభించి తన కుటుంబము సుఖశాంతులతో జీవించే అవకాశం లభిస్తుంది.

జీవపితరులు (తల్లిదండ్రులున్నవారు), భార్య గర్భవతిగా నున్నటువంటివారు, పుత్ర/పుత్రికా వివాహము చేసి మూడు మాసముల గడువనటువంటివారు తీర్థవిధిని నిర్వహించరాదు. అట్టివారు అంత్యపుష్కరాలలో తీర్థవిధిని నిర్వహించుకొనవచ్చు. పుష్కరాల వంటి పర్వదినములో పుష్కర తీర్థవిధులను వంశాచారమును బట్టి నిర్వహించుకొనవలయును. అన్నశ్రాద్ధము చేయుట మంచిది. దానిని చేయు సావకాశము లేనపుడు ఆమశ్రాద్ధము అదియును వీలుగానిచో హిరణ్య శ్రాద్ధము (వరిపిండి/గోధుమపిండితో నల్లనువ్వులు బెల్లము కలిపి) ఆచరణ యామ్యములు, శ్రాద్ధకర్మల సప్త గోత్రముల వారినుద్ధరించునని పెద్దలు చెబుతారు.

దశదానాలు : గో, భూ, తిల, సువర్ణ, ఆజ్య, వస్త్ర, ధాన్య, గుడ, రజిత లవణములు.

షోడశదానాలు : సువర్ణ, రజత, నవరత్న, సరస్వతి, తిల, కన్యా, గజ, అశ్వ, శయ్య, వస్త్ర, భూ, ధాన్య, శకట, ఛత్ర, గృహ, గృహోపకరణాలు.

మొట్టమొదట నదిలో దిగునపుడు :

శ్లో॥ పిప్పలాదాత్సముత్పన్నే। కృష్ణే లోక భయంకరి ।
మృత్తికాం తే మయాదత్తాం । ఆహారార్థం ప్రకల్పయ॥

అనే మంత్రాన్ని పఠిస్తూ రేగుపండంత మృత్తికను నదిలో మూడుమార్లు వేయవలయును.

పుష్కర స్నానము చేయునపుడు పఠించవలసినవి :

శ్లో॥ కన్యాగతే దేవగురౌ । పితౄణాం తారణాయ చ ।
సర్వపాప విముక్త్యర్థం । తీర్థస్నానం కరోమ్యహం ॥

శ్లో॥ తీర్థరాజ నమస్తుభ్యం । సర్వలోకైక పావన ।
త్వయి స్నానం కరోమ్యద్య । భవబంధ విముక్తయే ॥

ఆచమనము సంకల్పాదులొనరించిన తరువాత సకల దేవతలకు ప్రత్యేకముగ అర్ఘ్యప్రదానములు సమర్పించవలయును. పితృదేవతలకు తర్పణాలు మరియు పిండప్రదానాదులు శాస్త్రోక్తముగా కార్యక్రమమును జరిపించ వలయును. తరువాత యథావక్తి దానధర్మము లొసంగవలయును. సమీప దేవాలయములను సందర్శించి పునీతులు గావలయునని పెద్దలు స్వానుభవములతో చెప్పిన మాటలు సకలజనులకు శిరోధార్యములు గావలయును.

❖ ❖ ❖

పుష్కర ముగింపు సంబరం

పరమశివుని జటాజూటంనుండి ఉద్భవించి భక్తులపాలిట పుణ్యవాహినియై ప్రవహిస్తు, భక్తులకు కల్పవల్లిగా, తీరవాసులకు జీవనదిగా నిలుస్తున్నది గోదావరి. ఈ నది దక్షిణభారతదేశంలోనే పెద్ద నది. మహారాష్ట్రలోని త్ర్యమ్బకేశ్వరం దగ్గరలోగల బ్రహ్మగిరి పర్వత సానువులపై జన్మించి 1465 కి.మీ మేర ప్రవహించి అనేక పుణ్యక్షేత్రాలను దాటుతు లక్షల ఎకరాల భూములను సస్యశ్యామలంచేస్తు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రముఖ నారసింహ పుణ్యక్షేత్రం అంతర్వేది వద్ద సముద్రంలో సంగమిస్తుంది.

పుష్కరాలు-విశిష్టత

ఎప్పుడూ ఎడతెగక పారే నదులున్నచోట నివసించమని మనపెద్దలు చెప్పినమాట! అందుకే మన ప్రాచీన నాగరికత అంతా నదులచుట్టు ఏర్పడింది. మన మహర్షులు, పూర్వీకులు నదులచుట్టు నివాసాన్ని ఏర్పరచుకొని జీవించారు. జీవనదులు భగవంతుడు మనకు ప్రసాదించిన ప్రకృతి సంపద. మన సంప్రదాయాలన్నీ నదులతో పెనవేసుకున్నవే! ఈనదుల వలనే మనకు కావలసిన ఆహార ధాన్యాలు లభిస్తున్నాయి. అందుకు మనం తెలియజేసే కృతజ్ఞతాభావ సమర్పణే "పుష్కరం".

గోదావరి నది-పుష్కరాలు

ప్రధానమైన 12నదులకు బృహస్పతి గమనాన్ని అనుసరించి పుష్కరాలు ఏర్పడుతాయి. ఆవిధంగా బృహస్పతి సింహరాశిలో ఉన్నప్పుడు గోదావరి నదికి పుష్కరం ఏర్పడుతుంది. అందులో భాగంగా గత మన్మధనామ సంవత్సరం అధిక ఆషాఢ బహుళ త్రయోదశీ తేది: 14-07-2015 మంగళవారంనాడు గోదావరి పుష్కరాలు ప్రారంభమయ్యాయి. మొదటి 12రోజులు దేశవ్యాప్తంగా అనేకప్రాంతాలనుండి రెండు తెలుగురాష్ట్రాలలోని ఆయా పుష్కరఘాట్లకు విచ్చేసి పుణ్యస్నానాలు ఆచరించి పులకించిపోయారు. స్నానాలు, పిండప్రదానాలు ఆచరించి పితృఋణాన్ని తీర్చుకున్నారు.

గోదావరికి ప్రత్యేకం-అంత్యపుష్కరం

పుష్కరాలు ఏర్పడే 12నదులలో ఏనదికి లేని ప్రత్యేకత కేవలం గోదావరినదికి మాత్రమే ఉన్నది. అది అంత్యపుష్కరం. అంటే బృహస్పతి ఏడాదిపాటున్న సింహరాశినుండి బయలుదేరే చివరి పన్నెండురోజులను అంత్యపుష్కరాలు అని అంటారు. గత సంవత్సరం పుష్కరాలు అధిక ఆషాఢమాసంలో ప్రారంభమయ్యాయి. దాని తర్వాత నిజఆషాఢం. ప్రాచీన జ్యోతిషవిజ్ఞానాన్ని అనుసరించి కాలగణనలో ఏర్పడే హెచ్చుతగ్గుదలలను సరిచేయడానికి ఏర్పడినదే ఈ అధికమాస నియమం. ఈవిధంగా రెండుసంవత్సరాలకొకసారి అధికమాసం వస్తుంది. కొన్ని సందర్భాలకు నిజమాసం, అధికమాసం కలిపి ఒకే నెలగా లెక్కిస్తారు. అందుచేత ఈసారి ఆంగ్లకాలమానం ప్రకారం గోదావరి పుష్కరం 13నెలలపాటు జరిగింది.

కృష్ణానదికి దుర్ముఖనామ సంవత్సర శ్రావణ శుద్ధ అష్టమి తేది 11-08-2016 గురువారం రోజున రాత్రి 9గం.28ని.లకు కన్యారాశిలో గురువు ప్రవేశిస్తుండటంతో పుష్కరాలు ప్రారంభం కానున్నాయి. దానికి 12ముందునుండి అనగా ఆషాఢ బహుళ ద్వాదశి తేది 31-07-2016 ఆదివారంనుండి గోదావరికి అంత్యపుష్కరాలు ప్రారంభం అవుతాయి. ఈ చివరి పన్నెండురోజులలో స్నాన,దాన, పిండప్రదానాదులు యథావిధిగా ఆచరించి ఫలితాన్ని పొందవచ్చు. కేవలం ఈ నదికి మాత్రమే అంత్యపుష్కరాలు ఆచరిస్తారు. ఈ గోదావరికి ఆదిపుష్కరాల ప్రభావమెంత ఉన్నదో అంత్యపుష్కరాల ప్రభావంకూడా అంతే ఉన్నది. ఈ రెండు సమయాలలో స్నాన, దాన, శ్రాద్ధాదులను ఆచరించిన వారికి అనంతమైన ఫలితం కలుగుతుంది. ఇంతవరకు ఈ కార్యక్రమాలను ఆచరించనివారికి ఇదే చివరి సువర్ణావకాశం.

కృష్ణా పుష్కర స్నాన ప్రారంభం

దుర్ముఖి శ్రావణ శుద్ధ అష్టమి తేది11-08-2016 గురువారం రోజున రాత్రి 9గం.ల 28ని.లనుండి బృహస్పతి సింహరాశిలో ప్రవేశిస్తున్నందున కృష్ణాపుష్కరాలు ప్రారంభం కాబోతున్నప్పటికి, రాత్రి సమయంలో నదీస్నానం నిషిద్ధమని ధర్మశాస్త్రాదులలో చెప్పబడినందున మరుసటిరోజు అనగా తేది 12-08-2016 శుక్రవారం నాడు పుష్కరస్నానాలు లాంఛనంగా ప్రారంభం కానున్నాయి. ఈనదికి అంత్యపుష్కరాలు ఉండవు.

భక్తజనుల సేవలో ప్రభుత్వం

ఏడాదిక్రితం రెండు తెలుగు రాష్ట్రాలలోను పుష్కరాలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. 12 రోజులపాటు జరిగిన పుష్కరసంరంభం జనజాతరను తలపించింది. 'నేల ఈనిందా' అనే స్థాయిలో వచ్చిన భక్తకోటి సంభ్రమాశ్చర్యాలతో పుణ్యస్నానాలను ఆచరించింది. తెలంగాణలోని నిజామాబాద్ జిల్లా కందకుర్తి మొదలు ఆంధ్రరాష్ట్రంలోని అంతర్వేది వరకు వివిధ రాష్ట్రాలు, జిల్లాలనుంచి చిన్న,పెద్ద అనే తేడాలేకుండా కోట్లాదిమంది అనేక చోట్ల పుష్కరస్నానాన్ని ఆచరించి పులకించారు. ముఖ్యమంత్రులు మొదలుకొని మంత్రులు, ఉన్నతాధికారులు, వివిధరాష్ట్రాలనుంచి వచ్చిన వి.ఐ.పి.లు ఒకవైపు, మరోవైపు పీఠాధిపతులు, ఆధ్యాత్మికవేత్తలు ఇలా ఎందరో స్నానాలు ఆచరించారు. గత సంవత్సరం గోదావరి పుష్కరాల నిర్వహణ తీరు ప్రజల ప్రశంసలను పొందింది. అదేవిధంగా రాబోయే కృష్ణాపుష్కరాలకు కూడా ప్రభుత్వ యంత్రాంగమంతా సక్రమంగా, సమర్థంగా విధులను నిర్వహించి కోట్లాది హిందువుల మనోభావాలను గౌరవించి ప్రజామోదాన్ని పొందాలని కోరుకుందాం.

- అప్పాల శ్యామప్రణీత్ శర్మ అవధాని, వేదపండితులు

వెలిగిపోవుచున్నదానా! అమృతమయమధురనీరు ధారగలదానా అఖండ అవిచ్ఛిన్న అక్షయరసనిధానమా వేణీనదీ సన్నిధానమా తల్లీ కృష్ణవేణమ్మా! నీకు జయము.

అవాక్యాశ్యాం వాయ్యామమరభువిసాంగ్ల్యంగురుపురే తనుగ్రామే జోరే బసవపురరైకారణకుష ।
అలంపుర్యాం శ్రీపర్వత విజయవాట్యోఃఖగవరే సుధాధారే కృష్ణే జయజనని వేణ్యక్షయరసే! ॥ 8

దక్షిణకాశియని ప్రసిద్ధిచెందిన వాయీ నగరమునందు దేవతాపురముగా (ఆంధ్రప్రదేశమున క్రొత్త రాజధాని దేవపురి సంస్కృతభాషాపురిగా మరల నిర్మింపబడుచున్న) ప్రసిద్ధి నొందుచున్న అమరావతి నగరమునందు ఔదుంబర క్షేత్రముగా సంగమేశ్వర క్షేత్రముగా పంచగంగా క్షేత్రముగా ప్రసిద్ధమైన సాంగ్లీ నగరమునందు శ్రీదత్తాత్రేయ స్వామి వారి అవతారముగా ప్రసిద్ధి చెందిన నరసింహ సరస్వతి స్వామివారి స్థానమైన తాన్ గ్రామమునందు నరసోబావాడీ నగరమునందు – బసవేశ్వరస్వామి గురుస్థానమైన హరిపురమున కూడల సంగమేశ్వర గురుస్థానమైన బాగల్‌కోడ్ గ్రామమునందు శ్రీదత్తాత్రేయ ప్రథమావతార శ్రీపాదశ్రీవల్లభులకు ప్రియమైన గురుపురము (కురవపురము) నందును, గురు నాగార్జునునికి ప్రియస్థానమైన నాగార్జునసాగరము నందును గురుబసవేశ్వరునికి ప్రియస్థానమైన బసవసాగరము నందును బుద్ధగురుస్థానమైన కాలచక్రోత్సవ స్థానమైన అమరావతి యందును, మరల దత్తగురు స్థానముగా కీర్తింపబడుచున్న తనుగ్రామము (తాన్‌గాఁవ్) నందును, తనకు జన్మస్థానమైన మహాబలేశ్వరపురమునందును 'జోర్' అను గ్రామమునందును బసవేశ్వరుని స్థానమైన బసవపురమునందును (బసవసాగర గ్రామమునందును) మహాధన సంపన్నమైన రాజప్రియమైన శ్రీకృష్ణదేవరాయల కిష్టమైన రాయచూరు (రై) పట్టణమునందును అన్ని ఉపకరణములకు గ్రామకరణము పని చేయువారికి మంచిపనులు చేయుటకు వస్త్రములు నేయుటకు కారణమైనవారికి ఆదికారణమైన ప్రకృతిమాతకు అన్నిటికి ఆధారమైన అధికరణపురము కరణవోలు కారణవోలు కర–నూలు మొదలగు పేర్లు గల కర్నూలు పట్టణమునందును ఈ నగరములు గల ఊళ్ళుగల భూములయందును జోగులాంబా (18 పీఠములలో ఒక శక్తిపీఠాధిష్ఠాత్రీ మాతకు నెలవైన బాలబ్రహ్మేశ్వర స్వామికి స్థానమైన అలంపురీ (అలంపురం) క్షేత్ర పట్టణమునందును, శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామివారి క్షేత్రమైన అరణ్యస్థానమైన (నల్లమలయైన) శ్రీశైలక్షేత్రమునను ఇంద్రకీలాద్రిగా ప్రసిద్ధమై చోళచాళుక్యులకు స్థానమై పాండవావాసమై శ్రీకనకదుర్గామల్లేశ్వర స్వామిధామమై భాసిల్లు విజయవాటికా క్షేత్రమున (విజయవాడలో) చివర సముద్ర సంగమ క్షేత్రస్థానమైన హంసలకు (ఖగములకు) స్థానమైన పరమహంసలకు యోగులకు వరమైన హంసలదీవి యందును ఈ విశిష్టనగరములయందు ప్రేమతో సంచరించుదానా! తల్లీ! సుధాధారా! అక్షయరసప్రవాహ కృష్ణవేణమ్మా! నీవు సర్వోత్కర్షముగా భాసిల్లుము నీవు జయింపుము నీకు జయము.

చతుర్వింశత్యాత్మప్రియలగునదీ సంగమహితే సుబన్ధేకాదశ్యా కలివిహితయా వారితరసే ।
త్రయస్త్రింశత్పేతుప్రతత జనయాత్రే(ఒ)త్రిపథగే సుధాధారే కృష్ణే జయజనని వేణ్యక్షయధుని ॥ 9

తల్లీ! 1.వేణ్యా (వెన్నా–పెన్నా) 2.వరణా (వరమా), 3.కాయనీ (కాత్యాయనీ/కోయనా) 4. మలప్రభా 5. ఘటప్రభా 6. భామా 7. పావనీ (పావనా/పావ్నా) 8. కమండలు (కుమండలా) 9. ఘటీ (ఘోడ్) 10. ఇన్ద్రాణీ (ఇంద్రాయణీ 11. కుండలినీ (కుండలీ) 12. మానా 13. భోగవతీ 14. తుంగభద్రా 15. ముచుకుందా (మూసీ) 16. భూరి (భోర్) 17. చాన్ద్రాయణీ (చంద్రాణీ–చాందనీ) 18. కామినీ 19. మూలా 20. ముక్తా (మాతా/ముత్తా) 21. నీరా 22. మాలాముఖీ (మూలమూతా) 23. భీమా 24. సేనా (సీన) అను ఇరువది నాలుగు ఉపనదులతో కూడినదానా! 1. ధోమ్ 2. బాలకవాడీ 3. ఆలమాటి 4. బసవసాగర్ 5. నాగార్జునసాగర్ 7. జూరాల 8. నారాయణపురం 9. ప్రకాశం 10. పులిచింతల 11. అమరావతి అను పేర్లతో కట్టగూడని పదకొండు ఆనకట్టలతో కలిప్రభావముచేత కట్టబడినదానవై ఆగిపోయిన ఆపబడిన నీరుగల దానవై జీవనదీత్వమును కోలుపోవుచున్నదానా! (అమ్మా! నీ ప్రవాహము ఆగకుండా సాగితే సముద్రమును చేరిన నీ నీరు వర్షాకాలములో అన్నిచోట్ల సమానముగా వర్షమును కురిపించునుకదా! నీటికొఅత లేకుండా ఉండుటకు నీకు ఆనకట్టలు కట్టకుండా ఉన్నోచోట్ల అవసరమైనన్నిపెద్ద చిన్న చెఱువులను ప్రభుత్వమువారు త్రవ్వించుకొనవచ్చు కదా! నీ ప్రవాహమును ఆపకూడదు కదా! ఆపి నీకు జీవనదీత్వము లేకుండా చేయకూడదు కదా! మలప్రవాహములను కర్మాగారముల చెడు నీటిని మురికికాలువలను నీలో కలుపకూడదు కదా! నీ నుంచి వచ్చే చిన్న పెద్ద కాలువలను మేము కలుషితము చేయకూడదు కదా! ఇదంతా కలిప్రభావమువల్ల కలుగుచున్నది. నదులకు ఆనకట్టలు కట్టవద్దని నదులు భగవంతుని విశ్వశరీరమున నాడులని నదులను అనుసంధానము చేయవద్దని మా ప్రజలకు ప్రభుత్వము వారికి సద్బుద్ధిని కలిగించు తల్లీ! అట్లే నీకు ముప్పది మూడు చోట్ల సేతువులను వారధులను నిర్మించి జనులకు యాత్రా సౌకర్యము చేయుచున్నారు ప్రభుత్వమువారు. అది తప్పుకాదమ్మా! ఆవిధముగా యాత్రలను చేయు జనులకు సుఖము నిచ్చుదానా! స్వర్గ, మర్త్య పాతాళములను చేరు గంగవే అయిన అత్రిమార్గమున 'గురువులకు కూడా గురువైన మార్గమున సంచరించు ఓ తల్లీ! అమృతరససారము వంటి, సారము గలదానా! ఓ కృష్ణవేణమ్మా! నీవు, అక్షయ ప్రవాహము కలదానవై బిరబిరా కృష్ణమ్మ పరుగులిడుతుంటే అని పాడిన కవుల పాటలకు అనుగునంగా, తరంగములతో వేగముగా ప్రవహించుచు మాకు ఆనంద తాండవమును ప్రసాదించి సర్వోత్కర్షముగా ప్రకాశించుము. నీకు జయము.

స్వధారారాధారాధితలలితకృష్ణానుభవదే స్వధీరాధాధారా కలిత నిజకృష్ణాత్మవిభవే ।
స్వధాస్వాహాధారాయజన తను కృష్ణార్పణవిధే సుధాసారే కృష్ణే జయజనని వేణ్యక్షయధుని ॥ 10

అమ్మా! నీ ప్రవాహమే ఒక రాధ అయితే ఆ ప్రవాహధారా రాధచే ఆరాధింపబడిన అందమైన నీ పూర్ణ కృష్ణ కృష్ణాస్వరూపమే నేనను అనుభవమును నీవు మాత్రమే కాక మాకుకూడా ఇయ్యి తల్లీ! మా అందఱి బుద్ధి అనే రాధ చెరిగిపోని సంతతధారగా కూడిన నీ స్వరూప కృష్ణాత్మ వైభవమును మాకు కలిగింప జేయుము తల్లీ! స్వధాకారము (పితృదేవతలకు అర్పించేటప్పుడుపయోగించే శబ్దము) స్వాహాకారము (దేవతలకు అర్పించేటప్పుడుపయోగించే శబ్దము) ఈ రెండు క్రియలను ధారగా ఆగకుండా నిర్వహించే నీ ఒడ్డున చేసే దేవపితృయజ్ఞములు శరీరముగా కలిగిన శ్రీకృష్ణునకు పరమాత్మకు అర్పించే విధిస్వరూపమైన ఓ తల్లీ! సుధాసార స్వరూపిణీ ఎడతెఱపిలేని ప్రవాహముగల ఓ కృష్ణవేణమ్మా! నీవు సర్వోత్కర్షముగా ప్రకాశించుము.

శ్రుతీనామన్తేష్వాగమగహన సద్వేదగిరిషు ప్రభాచ్ఛాస్త్రారణ్యేష్వనుభవద సద్దర్శనపథే ।
పురాణగ్రామేషు ప్రచరసి సుకావ్యాత్మనగరే సుధాసారే కృష్ణే జయజనని వేణ్యక్షయధుని ॥ 11

వేదాంతశాస్త్రము అనే నిగూఢమైన చివరి అంచులలోను లంకలలోను ఆగమములు అనే వెళ్ళరానిచోట్ల యందును వేదములనే కొండల యందును బాగా భాసించే శాస్త్రములనే అరణ్యముల యందును, చక్కని స్వపరానుభవమునుప్రసాదించే యథార్థమును ప్రకటించే తత్త్వమును నిరూపించే వివిధ దర్శనములయందును, పురాణములనే ప్రాచీనసంప్రదాయము గల గ్రామములయందును దృశ్యశ్రవ్య కావ్యములనే నగరములయందును నీవు సంచరించుచున్నావు, ఈవిధముగా సంస్కృతభాషాసాహిత్య వాఙ్మయ స్వరూపిణివైన ఓ తల్లీ! అమృతసారము వంటి సదర్థములు గలదానా! అక్షయముగా ఆగకుండా వచ్చే శబ్దప్రవాహ స్వరూపిణీ! తల్లీ! కృష్ణవేణమ్మా! నీవు సర్వోత్కర్షముగా ప్రవహించుము విరాజిల్లుము. ప్రకాశించుము.

పిపాసాయాఃశాన్త్యై క్షుధపహృతయే పుణ్యకృతయే సుయజ్ఞాయ క్షేమప్రభవవిధయే యోగధృతయే ।
జగత్కల్యాణాయ ప్రవహసి హి సస్యాభివృతయే సుధాసారే కృష్ణే జయజనని వేణ్యక్షయధుని ॥ 12

అమ్మా! మా దప్పికను (జిజ్ఞాసు) తొలగించడానికి మా ఆకలి (ఆశను) పోగొట్టడానికి మా పుణ్యకర్మల నిర్వహణకు మేము ఫలాభిసంధి లేకుండా యాజ్ఞముగా విధులను నిర్వహించడానికి మా క్షేమానికి కారణమైన శాస్త్రోక్త అనువంశిక పితృకృత కర్మలను చేసి బ్రతకడానికి యోగశక్తితో కలిగే ధైర్యానికి జగత్కల్యాణానికి మా పంటల (జీవనముల) రక్షణకై మా బ్రతుకు పండుటకై నీవు ప్రవహిస్తున్నావు. అమ్మా! అమృతసారము వంటి మధురజలములను వర్షించు తెఱపిలేని ప్రవాహము గల ఓ తల్లీ! కృష్ణవేణమ్మా! నీవు సర్వోత్కర్షముగా ప్రకాశించు నీకు జయము!

ఫలశ్రుతిః

కృష్ణానద్యా ఇదం స్తోత్రం ప్రభాకర కృతం ముదా ।
సాయంప్రాతః పఠేద్యస్తు పుష్కరేషు సుధీఃస హి ॥

కృష్ణానది ఈ స్తోత్రమును (ప్రభాకర విరచితమును) ఉదయం సాయంకాలం (పుష్కరాలలో) ఆ నీళ్ళల్లో ఉండి పఠించువారు పండితులగుదురు.

❖ ❖ ❖

Telangana Tourism

Visit for all reasons & all seasons



Jogulamba Temple- The Fifth of the 18 Shakti Peethas





Sri K. Chandrasekhar Rao
Hon'ble Chief Minister of Telangana



Sri Azmeera Chandulal
Hon'ble Minister for Tourism, Culture and Tribal Welfare



Sri Pervaram Ramulu
Hon'ble Chairman of TSTDC

Jogulamba, Mother, who grants Yoga siddhi is the principal deity of the temple at Alampur, in Mahabubnagar district of Telangana. The Jogulamba temple was reconstructed at the same place where it stood. The temple was rebuilt in the same way it was described in the `Rasaratnakaram' of Nityanatha Sidha of 12th century AD.

The temple is located on the banks of river Tungabhadra. In fact, two major rivers, viz; Krishna and Tungabhadra converge at Alampur. The temple architecture is of Badami Chalukya form.

Alampur is located about 190 kms from Hyderabad, 25 kms from Kurnool and 90 kms from the district headquarters at Mahabubnagar.

Haritha Hotel, Alampur



TSTDC operating special package tours for Krishna Purshkaram

www.telanganatourism.gov.in
TOLL FREE : 1800-425-46464

Follow Us on: